# సంస్కృతనాటకపంచరత్నాలు


రచన

**డా॥ రామవరపు శరత్‌బాబు**

ఎం.ఏ., పిహెచ్.డి. (సంస్కృతం) ఎం.ఏ. (తెలుగు) ఎం.ఏ, (ఫిలాసఫీ) డి.టి.ఏ.


**అభిజ్ఞానశాకుంతలం - కాళిదాసమహాకవి**

**ఉత్తరరామచరితం - భవభూతిమహాకవి**

**మృచ్ఛకటికం - శూద్రకమహాకవి**

**ముద్రారాక్షసం - విశాఖదత్తమహాకవి**

**వేణీసంహారం - భట్టనారాయణమహాకవి**


**ప్రచురణ**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2018**

# SAMSKRUTA NATAKA PANCHA RATNALU

**by**
**Dr. Ramavarapu Sarat Babu**

T.T.D. Religious Publications Series No. 1278
@ All Rights Reserved

First Edition : 2018

Copies : 500

Price :

Published by :
**Sri ANIL KUMAR SINGHAL,** I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devastanams,
Tirupati - 517 501

**D.T.P.**
Publications Division,
T.T.D, Tirupati

Printed at
**Tirumala Tirupati Devastanam's Press**
Tirupati - 517 501

## ముందుమాట

'కావ్యేషు నాటకం రమ్యమ్' సాహిత్యజగత్తులో దృశ్యకావ్యం మనోహరం. దృశ్యం ప్రత్యక్షం కావడంచేత రసానుభూతి సులభంగావడంవల్ల సర్వజనాదరణీయం అయింది. దృశ్యకావ్యం అంటే నేడు నాటకం అని వ్యవహారరూఢం అయింది.

సంస్కృతభాషలో రచింపబడిన నాటకాలలో ప్రధానం అనదగినవీ, ప్రసిద్ధమైనవీ, అయిన రత్నాలవంటి ఐదు నాటకాలు తీసుకుని తెలుగువారికి సామాన్యులకు కూడా అందుబాటులోకి తెచ్చే సంకల్పంతో ఈ 'సంస్కృత నాటక పంచరత్నాలు' తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తున్నది. వీటిని డాక్టర్ రామవరపు శరత్‌బాబుగారు వ్యావహారికభాషలో తెలుగు చేశారు.

ఈ పంచరత్నాలలో మొదటిది కాళిదాసు కూర్చిన అభిజ్ఞానశాకుంతలం. 'నాటకేషు శకుంతలా' అని నాటకాల్లో ప్రథమగణ్యం. ఇది పలు ప్రపంచభాషల్లో అనూదితమై ప్రపంచం అంతటా ప్రదర్శింపబడి, ఆదరణీయమై, జగత్ ప్రసిద్ధ మయింది.

రెండవది భవభూతి రచించిన ఉత్తరరామచరితం. కరుణరసప్రధానమైన ఈనాటకం రసహృదయుల ప్రశంసలు పొందింది. శ్రీమద్వాల్మీకి రామాయణం ఉత్తరకాండ ఇతివృత్తం దీనికి మూలం. శ్రీరామపట్టాభిషేకానంతరకథ ఈ నాటకంతో ప్రజలదృష్టికి వచ్చింది.

మూడవ నాటకం శూద్రకమహాకవి స్వతంత్రంగా కల్పించిన సామాజికేతివృత్తంతో రచించిన మృచ్ఛకటికం ఇందులో పాత్రలు, స్వభావాలు, లోకానికి సన్నిహితమై చమత్కారసుందరమైంది.

నాల్గవ నాటకరత్నం, విశాఖదత్తుడు రచించిన 'ముద్రారాక్షసం'. ఇందులో ఇతివృత్తం చారిత్రకం. రాజకీయచతురులతో మంత్రివర్యుల మంత్రాంగ నిపుణతలతో చదువరుల బుద్ధికి పదునుపెడుతుంది.

ఆ తరువాతి నాటకం వేణీసంహారం. కాళిదాసు శాకుంతలం లాగా, ఇదికూడ ప్రసిద్ధమైన భారతేతిహాసంనుండి ఇతివృత్తాన్ని స్వీకరించింది.

పండితులకు మాత్రమేకాక సామాన్య ప్రజలకుకూడా సులువుగా సన్నిహితంగా, పాత్రోచితమైన వ్యావహారికభాషలో కూర్చిన ఈ తెలుగు 'సంస్కృతనాటక పంచరత్నాలు' ఆంధ్రుల అభిమానానికి పాత్రం కాగలదు.

*సదా శ్రీవారి సేవలో...*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.



'మహామహోపాధ్యాయ'
**డా|| శివానంద మూర్తి**
డి.లిట్ (గీతం.వి.వి.) డి.లిట్
(పొ.శ్రీ. తెలుగు వి.వి.)
పీఠాధిపతి, శ్రీ శైవ మహాపీఠమ్,



"ఆనందవనం"
భీమునిపట్నము
విశాఖజిల్లా - 531 163
ఫోన్ : 08933 229505
తేది : 15-04-2015

**'పంచకావ్య పరీమళం' ' సంస్కృత నాటక పంచరత్నాలు', తెలుగు గ్రంథములపై సమాదర వాక్యములు**

డా|| రామవరపు శరత్‌బాబు మనదేశంలో ఉన్న ఉభయభాషా ప్రవీణులైన కవి పండితులలో అగ్రగణ్యులైన వారిలో ఆయన ఒకరు. డిగ్రీలు సమృద్ధిగా తీసుకుని ఇంకా సమృద్ధిగా పరిఉలన చేసి ఆధ్యాపక వృత్తిలో చిరకాలం గడిపి అత్యుత్తమ సంస్కృత సాహిత్యంలోంచి రామాయణ, భారత, భాగవతములను, పంచకావ్యము లను, ఇంకా ఐదు అత్యుత్తమ సంస్క ృత నాటకములను అనువదించి తెలుగువారికం దించిన విశిష్ట పండితుడు. లోకోపకారకమైన వీరి కృషి అత్యంత శ్లాఘనీయమైనది. కుమారసంభవం వంటి కావ్యాలని అనువదించేటప్పుడు ఎన్నో మూల శ్లోకాలను ఎత్తిచూపి, వ్యాఖ్యానించుచూ చదువరులకు గుర్తు చేయవలసిన ఉత్తమ విషయములను తాను చూపుతూ చేసిన వీరి ఉత్తమ రచనలు తెలుగువారికి అపు రూపమైన బహుమానములు. ఈ రచనలన్నీ కూడా ఉత్తమ శ్రేణికి చెందినవై సంస్క ృత మూలమును యథాతథంగా తెలుగు చదువరులకు స్పష్టతా, స్వచ్ఛతా, సరళతతో కూడిన ప్రసాదములై ఉన్నవి.

అంతేకాక వీరికున్న తెలుగుభాషాభిమానం గొప్పది. మరుగునపడిపోతున్న అక్షర స్వరూపములు చే జే వంటి సాంప్రదాయ తెలుగు అక్షరములను ఎట్లు వాడ వలెనో మనకు చూపించిన తెలుగు అక్షరభాషాసాహిత్యాభిమాని ఈ శరత్‌బాబు గారు. వీరి కృషి తెలుగువారికి మహోపకారి, ఇంకా అనేక గ్రంథాలలో గొప్ప భాషా సేవ చేసిన ఈ పండితుని తెలుగు పెద్దలు కృతజ్ఞతతో మన్నించి, గౌరవించ వలెనని నా ఆకాంక్ష. పరమశివుడు వారికి ఆయురారోగ్యములను బహుళముగా ప్రసాదించుగాక.

**(శివానందమూర్తి)**



**డా॥ చాట్ల శ్రీరాములు**
'సంగీతనాటక అకాడమీ'
'టాగూర్ పురస్కార' గ్రహీత,
ఉపాధ్యక్షులు, 'రసరంజని'

## సంస్కృత నాటక పంచరత్నాలు
## తెలుగు రచన : డా॥ రామవరపు శరద్బాబు

# ముందుమాట

మా 'రసంజని' నాటకశిక్షణ శిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆనాటి సాంస్కృతిక సంచాలకులు డా॥ రాళ్ళబండి కవితా ప్రసాద్‌గారు "మీ విద్యార్థుల చేత కనీసం ఓ పది తెలుగు, సంస్కృత నాటకాలు చదివించండి" అన్నారు. అప్పటికే సంస్కృత నాటక పంచరత్నాలను తెలుగుచేస్తున్న గురుమిత్రులు డా॥ రామవరపు శరద్బాబు స్ఫురణకు వచ్చారు. ఇప్పటికి 45 సం॥ల పూర్వం బ్రిటిష్ డ్రామాలీగ్ వారు నడుపుతున్న ఒక నటశిక్షణ కోర్సులో పాల్గొనడానికి వచ్చే విద్యార్థుల్ని కనీసం ఒక వంద ఇంగ్లీషు నాటకాల్ని క్షుణ్ణంగా చదివి ఆకళింపు చేసుకుని రమ్మని ఆదేశం. అంటే నాటక రచనల్ని చదివి అర్థం చేసుకుంటేగాని ఆ అడ్వాన్స్‌డ్ కోర్సులో పాల్గొన్న విద్యార్థులకు ఆ పాఠాలు సులభగ్రాహ్యం కావని. ఆ విషయం గుర్తొచ్చింది. ఈ సంస్కృ త నాటక పంచరత్నాలు తెలుగు రచన పూర్తయిన వెంటనే శరద్బాబుగారు నన్నూ, అభినయ అధ్యాపకుడు దీక్షిత్‌నీ ఇబ్రహీంపట్నంలోని ఒక అతిథిగృహంలో ప్రశాంత వాతావరణంలో కూర్చోబెట్టి ఆయనే స్వయంగా చదివి వినిపించారు.

తెలుగు సంస్కృత భాషల్లో పండితులే కాక తెలుగులో నాటక రచనలో ఆరితేరినవారు శరత్‌బాబుగారు. 1976వ సం॥లో నాకు మిత్రులై అప్పట్నుంచి నన్నూ ఒక విద్యార్థిగా పరిగణించి నాటకంలోని సాహిత్యపు విలువల్ని, నాటకం విలువల్నీ విడమర్చి చెప్పినవారు. తెలుగు, సంస్కృత భాషల్లో సాధికారికంగా మాట్లాడ గలిగినవారు. 1982లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక ఎకాడెమీ నిర్వహించిన ఒక రూరల్ థియేటర్ వర్క్‌షాపుకి 42 రోజులపాటు నాకు సహదర్శకులుగా వ్యవహరించినవారు. విశాఖపట్నం ఆకాశవాణికి అనేక



నాటకాలువ్రాసి ప్రసారం చేసి సంస్కృత నాటకాన్ని ఉత్తరాంధ్ర ప్రాంతంలో శ్రోతలకు తెలియచెప్పినవారు. ఈ సంస్కృత నాటక పంచరత్నాలకు నాకు ముందుమాట వ్రాసే అవకాశం కల్గించిన ఆప్తులు. రామాయణ, భారత, భాగవతాల్ని ఒకేబిగిని ఒక సంవత్సరం కాలంలో తెనిగించి డా॥ కె.వి. రమణాచారిగారి సహకారంతో పేరెన్నిక గన్న వావిళ్ళ రామశాస్త్రులు అండ్ సన్స్ చేత ప్రచురింపచేసినవారు.

సంస్కృతంలోని పంచకావ్యాల్ని తెలుగులో ఈనాడు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ సంస్థ ప్రచురిస్తున్నదంటే అది నాలాంటివారికే కాదు యావదాంధ్ర దేశానికీ గర్వకారణం. ఈ ఉద్గ్రంథంలోని సంస్కృత నాటక పంచరత్నాల్ని పాఠకులకు పరిచయం చేయ ప్రయత్నిస్తాను. ఈ నాటకాలపై వందల కొద్దీ వ్యాఖ్యానాలు వచ్చినయ్. నేనురాసేది ఈ నాటకాలకు కేవలం ముందు మాట మాత్రమే. (శరత్‌బాబుగారి రచనల్ని దృష్టిలో ఉంచుకుని)

ఇందులో మొదటి నాటకం కాళిదాస విరచిత అభిజ్ఞాన శాకున్తలమ్. కాళిదాసు కాలనిర్ణయం క్రీ.పూ.8వ శతాబ్దం నుండి క్రీ.శ. 11వ శతాబ్దం వరకూ ఎప్పుడైనా అయివుండవచ్చు. చంద్రగుప్తుని ఆస్థానంలో కాళిదాసు ఉన్నాడన్న వాదం కూడా ఒకటున్నది. అతని జన్మస్థలం కూడా అంతే వివాదాంశం. వంగదేశస్థుడనే వారూలేక పోలేదు. ఈ వివాదం లోకి వెళ్ళకుండా మనం ముందుకు వెడితే ఈ నాటకం అనేక భారతీయ భాషల్లోకి అనువదింపబడింది. ఇంగ్లీషులో లెక్కలేనన్ని అనువాదాలు వచ్చాయి. 1791వ సంవత్సరంలో జర్మన్‌భాషలో వచ్చింది. దీన్ని చదివిన జర్మన్ పండితుడు గెథే (G–ethe) ఆనందం పట్టలేక చిన్న పిల్లవాడిలా ఎగిరి గంతులువేశాట్ట. ఈ నాటకం జర్మన్ భాషలోకే కాక ఫ్రెంచ్, ఇటాలియన్, రష్యన్ ఆదిగాగల భాషల్లోకి కూడా అనువదించబడడంలో ఈ నాటక పాశస్త్యం అర్థమవుతుంది. ఒక మూలకథ ఆధారంగా ఒక నాటకం అల్లడంలో కాళిదాసు మేధావి. ఇలాంటి మేధావుల స్ఫూర్తితోటే ఎ.కె. రామానుజం కథల్ని గిరిష్‌కర్నాడ్ కన్నడంలో గొప్ప నాటకాలుగా మలిచాడు. మహాభారతంలోని ఒక కథని ఆధారంగా తీసుకుని ఇంతటి రమణీయ ప్రేమ కావ్యాన్ని నాటకంగా మలచడంలో కాళిదాసు గొప్పతనం అర్థమవుతుంది. ఇంతటి ప్రాశస్త్యాన్ని సంతరించుకున్న నాటకం భారతీయ భాషల్లోనే కాదు ఇతర

భాషల్లో కూడా లేదేమో! టార్గెట్ ఆడియన్స్‌ని దృష్టిలో ఉంచుకుని ఇంతటి గొప్పనాటకాన్ని వ్రాయడం ఒక్క కాళిదాసుకే చెల్లింది, అందుకనే ఇంగ్లాండు, జర్మనీవంటి దేశాల్లో అనేకసార్లు దిగ్విజయంగా ప్రదర్శించబడింది.

ఇంతటి శృంగార ప్రధానమైన నాటకం 'శాకున్తలమ్' అయితే భవభూతి 'ఉత్తర రామచరితమ్' కరుణ రసప్రధానంగా ఆవిష్కరించబడింది. ప్రాచీనులచే ఉన్నత పీఠాన్ని దక్కించుకున్నవాడు భవభూతి. ఇతడు క్రీ.శ. 680-750కి చెందినవాడు. కాళిదాసులా శివాభిమాని అయినా అతణ్ణి శ్రీరాముని చరిత్ర ఆకర్షించింది. రామాయణ కథ అంటే మహాప్రీతి. 'కెథార్సిస్' అంటే మానవుడిలోని ఉద్వేగక్షాళనకు ఉపయుక్త నాటకం ఇది. ఒక నాటకం మనిషి మేధను కలవరపరచడమే కాదు. మనస్సుని ద్రవీభూతం చేయగలిగినదై ఉండాలి. అతి సామాన్యుని కూడా తనలో ఐక్యం చేసుకోగలిగిన నాటకం ఇది. మనిషి మేధనేకాదు మనస్సుని కూడా తనతోపాటు పరుగులెత్తించే నాటకం ఉత్తరరామ చరితమ్.

మూడవనాటకం శూద్రకమహాకవి విరచిత మృచ్ఛకటికమ్. దీనిలోని ఇతివృత్తం కల్పితేతివృత్తం. పురాణాదులను స్ఫూర్తిగా తీసుకుని వ్రాసినది కాదు. సంస్కృతంలో ఇలాంటి వాస్తవిక చిత్రణగల రచనలు బహు తక్కువ. ఈ నాటకంలోని పాత్రలు నిజ జీవితంలో మనకి ఎదురుపడే పాత్రల్లా కనిపిస్తాయి. "మీరు నాటకాలు వ్రాయడం లేదెందుకని'' నాగురుమిత్రులు కీ.శే. డి.వి.నరసరాజుగారిని అడిగితే "నేను మేడల్లో మిద్దెల్లో ఉంటూ కార్లలో తిరుగుతూ సామాన్య మానవుడితో కరచాలనం చేయడం మానవేసినందువల్ల" అని అన్నారు. ఆ సామాన్యులందరూ ఈ నాటకంలో మనకు తారసపడతారు. విటులు, జూదగాళ్ళు, దొంగలు, అవతలవాణ్ణి మాయచేసి అబద్ధాలాడే వాళ్ళూ కోకొల్లలు. చేష్టానుకరణంతో కాక శబ్ద ప్రయోగంలో వెటకారాన్నీ వ్యంగాన్ని సృష్టించి ప్రేక్షకులను మెప్పిస్తారు. ఇంత విరివిగా ప్రదర్శింపబడ్డ మరొక సంస్కృత నాటకం లేదనటం ఏ మాత్రం అతిశయోక్తికాదు. ప్రేక్షకుడు తననితాను గుర్తించడానికి కావలసినన్ని పాత్రలున్నాయి ఇందులో. ఈతరం మహాకవి గురజాడ ఆ తరం మహారాజు శూద్రకుడ్ని (క్రీ.శ. 670-725) స్ఫూర్తిగా తీసుకుని అలాంటి ప్రాతలను తన నాటకాల్లో ప్రవేశపెట్టాడనడం నేను చేసే సాహసమేమో? ఈ



మృచ్ఛకటికాన్ని ప్రచురణకు ముందే మా 'రసరంజని' లో నటశిక్షణ పొందిన విద్యార్థులు హైదరాబాద్‌లో 3 ప్రదర్శనలు ఇచ్చారు. ఈ నాటకాల ఇతి వృత్తాలు చర్చించడం ఈ పరిచయవాక్యాల పరిధిలో లేదుగనుక ఆ విషయం నేను స్పృశించడం లేదు.

నాలుగవ నాటకానికి వస్తే ఇది విశాఖదత్తుని ప్రసిద్ధ నాటకం ముద్రారాక్షసం. ఒకే ఒక్క నాటకంతో అంతతికీర్తి ప్రతిష్ఠలు సాధించాడంటే ఇది నిజమైన నాటకం కనుక. వీర రస ప్రధానమైన నాటకం. ఇది సంఘటనా ప్రధానమైన నాటకంగా భావించవచ్చు. ఊహా ప్రతిభ గల రచయిత కాకపోవచ్చునేమోగాని నాటకకళలో సిద్ధహస్తుడిగా నిరూపింపబడినవాడు విశాఖదత్తుడు. ఒక గంభీరమైన రాజకీయ ఇతి వృత్తాన్ని తీసుకుని దాన్ని దృశ్య కావ్యంగా మలచడం ఆనాడు ఒక్క విశాఖదత్తుడికే సాధ్యమైంది. అతనికి ఏడెనిమిది శతాబ్దాల తదుపరి వచ్చిన షేక్స్పియర్ నాటకాల్లో ఈ కుట్రలు, కుహనాలు, రాజకీయ ఎత్తుగడలూ పుష్కలంగా కనిపిస్తాయి. అంటే వేర్వేరు కాలాల్లో గొప్ప రచయితలు ఏకరీతిలో ఆలోచించారేమో. "గ్రేట్ మెన్ థింక్ ఎలైక్" అన్న ఆర్యోక్తి ఇక్కడ సరిగ్గా సరిపడుతుంది. ఈ పంచరత్నాలలో మొదటిది శృంగార ప్రధానం, రెండవది కరుణ రస ప్రధానం, మూడవది జీవితాన్ని సమగ్రంగా చూపే జీవనాటకం, నాల్గవది వీరరస ప్రధానమైన నాటకం. ఇంతటి వైవిధ్యం గల నాటకాలు తెలుగు పాఠకులకు, ప్రేక్షకులకూ అందించిన శరత్‌బాబుగారు ధన్యులు.

ఇక చివరి నాటకానికి వద్దాం వేణీసంహారమ్. ఇది భట్టనారాయణ మహాకవి విరచితం. ఇది వీరరసంతో కూడిన గంభీర నాటకం శైలి వాచ్యార్థ ప్రధానమైంది. సంస్కృత నాటకాల్లో సాధారణంగా 'నెరేషన్' ఎక్కువగా ఉంటుంది. Visual కి అందడానికి కావలసిన dramatic element ఉండదు. రెండుమూడేళ్ళ క్రితం కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి పరిమి నరసింహంగారితో మాటల సందర్భంలోఈ విషయం ముచ్చటిస్తే టెక్నాలజీ ఇంత డెవలప్ అయ్యాక ఒక వెర్బల్ స్పీచ్‌ని దృశ్యంగా మలచుకోగల సామర్థ్యాన్ని సంతరించుకున్న మీలాంటి వారికిదేం అసాధ్యంకాదన్నారు నిజమే. ఆ బాధ్యత ప్రయోక్త మీద ఉంది. దాన్ని సులభ గ్రాహ్యంగా తన తెలుగుసేత ద్వారా ప్రయోక్త కందించి ప్రయోక్తకి పని తగ్గించారు శరత్‌బాబుగారు. అందుకు వారిని అభినందించాలి.

పాఠశాలల్లో కళాశాలల్లో ప్రయోగానికనువైన లిటరరీ వేల్యూస్ డ్రమెటిక్ వేల్యూస్ ఈనాటి నాటకాల్లో మృగ్యం అన్నవారికి ఈ యాంథోలజీ కనువిప్పు. పాఠ్యాంశంగా మాత్రమే పనికొచ్చి నాటకీయ విలువలు లేవనుకున్న వారు ఈ నాటకాలు చదవాలి. ఇలాంటి పంచరత్నాల్ని పాఠ్యాంశంగా ఎన్నుకోవడంలో మన భాషా, సంస్కృతులకు ఎనలేని సేవచేసిన వాళ్ళవుతారు విజ్ఞులు.

ఇంతటి సరళ వ్యావహారికంలో తెలుగు చేసి పదిమందికీ అందుబాటులోకి తెచ్చిన సాహితీనాటక మిత్రులు శరత్‌బాబుగారిని అభినందిస్తూ

సెలవ్



వినాయకచవితి 2015, హైదరాబాద్



## నామాట

ప్రపంచంలో వివిధ దేశాల్లో నాటకావిర్భావం గుఱించి విదేశీయులు వ్రాసిన సిద్ధాంతాలే పరమ ప్రమాణాలుగా నేటి 'మేధావివర్గం' ఏకపక్షంగా నిర్ణయించి అనుసరిస్తోంది. కాని ఆ సిద్ధాంతాలను సహేతుకంగా అధ్యయనం చేసే ప్రయత్నం చేయటంలేదు. ఏదేశ చరిత్రనైనా అధ్యయనం చేసేటప్పుడు ఆ దేశంలోని గ్రంథ సముదాయం మాన్యుల అభిప్రాయాలను ప్రమాణంగా స్వీకరించి పరిశోధించి నిర్ణయానికి రావటం సముచితంకాని, ఆ దేశంతో సంబంధంలేని వేరెవరి ఊహాగానాలనో పరిగణనలోకి తీసుకోవటం న్యాయం కాదుకదా! గ్రీకునాటకమే ప్రపంచనాటకావిర్భవానికి 'నాంది' అని విదేశీయ విద్వాంసులు నిర్ణయించారు. మన గ్రంథాల సాక్ష్యాలనేవీ చూడకుండానే 'మహావిద్వాంసులు', 'డూడూబసవన్నా' అన్నట్లు వారి వాదానికి కొమ్ముకాసేరే కాని వాస్తవ విశ్లేషణకు పూనుకోకపోవటం ఎంతో శోచనీయం.

నిజానికి కృతత్రేతాయుగ సంధికాలంలో మానవులు అధర్మమార్గాన్ననుసరించేటంలో ప్రీతులైన తరుణంలో మహర్షివర్గం దేవేంద్రుని నాయకత్వంలో బ్రహ్మను సందర్శించి ప్రజలను స్వధర్మనిరతులను చేయగలిగే ప్రీతి, వ్యుత్పత్తులతో కూడిన క్రీడను ప్రసాదించుమని ప్రార్థించింది. "క్రీడనీయకమిచ్ఛామో దృశ్యం శ్రవ్యంచ యద్భవేత్" (భరతనాట్యశాస్త్రం 1–1) బ్రహ్మ క్షణకాలం సమాధిగ్రస్థుడై నాలుగువేదాల్నీ స్మరించి, ఋగ్వేదం నుంచి పాఠ్యాన్ని, యజుర్వేదం నుంచి అభినయాన్ని, సామవేదం నుంచి సంగీతాన్ని, అథర్వ వేదం నుంచి రసాన్నీ గ్రహించి చతుర్వేదసారభూతమైన పంచమవేదంగా నాట్యవేదాన్ని సృష్టించి ఇచ్చాడనే కథనం భరతముని ప్రణీతమైన నాట్యశాస్త్రంలో స్పష్టంగా ఉంది. యజ్ఞంతో తుల్యమైన ఆ నాట్యాన్ని (నాటకాన్ని) ప్రయోగించేటానికి దేవత లనర్హులని దేవేంద్రుడు సూచించేటంతో బ్రహ్మ దాన్ని భరతమునికి ప్రసాదించాడు. భరతముని తన నూఱుగురు పుత్రుల (శిష్యుల)తోనాటక ప్రదర్శనను ప్రయోగించి అందఱి మెప్పునూ పొందేడు. దీనివల్ల తేలిందేమిటి?

భారతదేశంలో నాటకం ఆవిర్భవించింది కృతత్రేతాయుగ సంధికాలంలో. అంటే ఇప్పటికి కలియుగంలో ఇంతవఱకు జేరిగిన కాలం 5117 సం॥రాలు, ద్వాపరయుగ ప్రమాణం 8,64,000 వేల సం॥లు, త్రేతాయుగం 12,96,000సం॥లు కలిపితే 21,65,117 సంవత్సరాల క్రితమే భారతదేశంలో నాటకం ఆవిర్భవించిందని ఘంటాపథంగా చెప్పవచ్చు. వాల్మీకి కృత శ్రీమద్రామాయణంలో బాలకాండలో శ్రీరాముడు జన్మించేటానికి ముందే అంటే దశరథ మహారాజు పాలించేటప్పుడు కేవలం స్త్రీలే నిర్వహించే నాటక సంస్థలు అయోధ్యానగరం చుట్టూఉండేవని ఉంది.

"వధూనాటక సంఘైశ్చ సంయుక్తాం సర్వతః పురీమ్" (5-12)

అంటే శ్రీరాముడు నేటికి అధమపక్షం 10 లక్షల సంవత్సరాల నాటివాడు. శ్రీకృష్ణుడు ద్వాపరాంతం నాటివాడైనట్లు శ్రీరాముడు త్రేతాంతం నాటివాడు కాదు. శ్రీరాముని తరువాత మఱికొందఱు రాజులు త్రేతాయుగంలో పాలించారు కనుక సుమారుగా లెక్కవేసికొన్నా లక్షా 36వేల సంవత్సరాలు శ్రీరాముని అనంతరకాలంలో ఉన్నా ద్వాపరయుగ వ్యవధి 8 లక్షల 64 వేల సంవత్సరాలకు లక్షా 36 వేల సంవత్సరాలు కలిపితే సుమారుగా 10 లక్షల సంవత్సరాలు. కేవలం స్త్రీలే నాటక సమాజాన్ని నిర్వహించేటానికి నాటక కళ ఎంతగా అభివృద్ధి చెంది ఉండాలి? వేదాల్లో నాటక బీజనిక్షేపణ గూర్చి క్రీ.పూ. 5వేల సంవత్సరాలు నాటి వైయాకరణులు పాణిని పతంజలుల గ్రంథాలు సుస్పష్టం చేసేయి. మఱి, మన వేదాల్నీ, శాస్త్రకారుల్నీ, మన వాల్మీకి మహర్షివ్రాతలనీ, మన భరతమునినీ కాదని, ఈ దేశంలో నాటకావిర్భావం గుఱించి ఈ దేశంతో సంబంధంలేని విదేఉయులెవరో వ్రాసిన అసంబద్ధ, అప్రాచ్యపు వ్రాతల్ని పట్టుకొని "తాన తందనాన" అంటూ వంతపలికే 'మేధావి వర్గా'న్నేమనాలి?

అయితే ఈ వాదాన్ని విశ్వసించేటంలో పూర్వనాటకాలు మనకు లభించేక పోవటం ఒక బలీయమైన కారణం కావచ్చు. ఎందుచేతనంటే సంస్కృత నాటకాల్లో కాళిదాసు, ఆయనకు పూర్వుడైన భాసుడు వ్రాసిన నాటకాలు



నేడు లభిస్తున్న గ్రీకు నాటకాల కంటె అర్వాచీనమైనవే. నాటకాలు లభించేనంత మాత్రాన అవి లేనేలేవనటం న్యాయంకాదుకదా!

మన సంస్కృత నాటకాలు మనదేశంలోనే కాక విదేశాల్లో సైతం ఎంతో ప్రఖ్యాతినొంది ప్రదర్శితమైనాయి కూడ. ఒక్క ఆంగ్లంలోనే కాక అనేక విదేశ భాషల్లో కూడ అనువాదితమైనాయన్న విషయం విద్వజ్జన విదితమే. అయితే నేడు భారతదేశంలోను, తత్రాపి తెలుగునాట సంస్కృత నాటకాలు కాని, కనీసం వాటి అనువాదాలు కాని ప్రదర్శనకు ప్రచురంగా నోచుకోక పోవటంవల్ల అసంఖ్యాకమైన సంస్కృతనాటకాల నుండి 'రత్నా'లనదగిన వాటిని ఐదింటిని ఎంపిక చేసి రంగస్థలకృతులుగా రూపొందిస్తే బాగుంటుందనిపించింది. అయితే ఈ నాటకాలకు విశేషమైన వ్యాఖ్యానాలు ఉద్దండులెందఱో పూర్వం సంతరించారు. ఏ సంస్కృత మహానాటకం తీసికొన్నా యథాతథంగా ప్రదర్శించాలంటే కనీసం 5,6 గంటలు పడుతుంది. అర్వాచీనమైన ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం వంటి తెలుగు నాటకాల విషయంలోనూ ఈ విషయం స్పష్టమైందే. అంతటి సుదీర్ఘమైన నాటకాలను ప్రదర్శించేటమూ కష్టమే, చూడగలగటమూ కష్టమే. అందువల్ల ఇంచుమించు రెండు, రెండున్నర గంటలవ్యవధిలో ప్రదర్శనానుకూలంగా వీటిని సంక్షిప్తీకరించేవలసిన అగత్యం ఏర్పడింది.

మన సంస్కృత నాటక వైభవం సామాన్యునికి సైతం అవగాహనా పరిధిలోనికి తీసికొనిరావాలనే ఆశయంతో వీటిలో వాడుకభాషనే ఉపయోగించాను. సంస్కృత నాటకాల్లో సైతం మహాకవులంతా వివిధ ప్రాకృతాలు వాడిన కారణంగా, ఆ స్ఫూర్తితో పాత్రోచితమైన భిన్న భిన్న ప్రాంతీయ నుడికారాలతో సంభాషణలను రూపొందించేటం జేరిగింది. ఈ ప్రక్రియమాన్యుల, సామాన్యుల ఆదరణభాజనమౌతుందని నా ఆకాంక్ష.

వీటిలో 'మృచ్ఛకటిక' నాటకాన్ని హైదరాబాద్ రసరంజని సంస్థ 1915 ఫిబ్రవరి 20,21 తేదీల్లో త్యాగరాజగానసభలో వరుసగా రెండు ప్రదర్శనలు, మార్చి 27 ప్రపంచనాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతిలో

మఱొక ప్రదర్శన చేసేరు. ఆ సంస్థ పాలకవర్గానికీ, దర్శక నటీనట సాంకేతిక వర్గానికి, వారికి స్ఫూర్తినివ్వటమేకాక 'ముందుమాట'ను ఇచ్చిన అభినవ భరతాచార్య, స్వర్గీయ చాట్ల శ్రీరాములుగారికి నా మనః పూర్వక శ్రద్ధాంజలి.

ఈ సంస్కృత నాటక పంచరత్నాలపై తమ అమూల్యమైన అభిప్రాయాన్నం దించిన పూజ్యశ్రీ శివానందమూర్తిగారికి నా వినమ్ర శ్రద్ధాంజలి.

భవదీయుడు
**రామవరపు శరత్‌బాబు**
24-7-2017

ప్రశాంతిసదన్, జి 1
46-18-8, మండావారి పేట, దొండపర్తి
విశాఖపట్నం - 530 016
ఫోన్ : 0891 - 2758129
సెల్ : 9885961329
email : saratprabha @rediffmail.c–m

# విషయసూచిక

| | | |
|---|---|---|
| **సమాదర వాక్యములు...** | **సద్గురు కందుకూరి శివానందమూర్తి** | |
| **ముందుమాట.....** | **డా॥ చాట్ల శ్రీరాములు** | |
| **నామాట ......** | | |
| **అభిజ్ఞాన శాకుంతలం** | **- కాళిదాసమహాకవి....** | **1-70** |
| **ఉత్తర రామచరితం** | **- భవభూతిమహాకవి....** | **71-124** |
| **మృచ్ఛకటికం** | **- శూద్రకమహాకవి....** | **125-234** |
| **ముద్రారాక్షసం** | **- విశాఖదత్తమహాకవి..** | **235-314** |
| **వేణీసంహారం** | **- భట్టనారాయణమహాకవి.** | **315-392** |

# అభిజ్ఞానశాకుంతలం

సంస్కృతమూలం : **కాళిదాసమహాకవి**

రంగస్థలకృతి : **డాక్టర్ రామవరపు శరత్‌బాబు**

# ఇందలి పాత్రలు

## పురుషులు

1. సారథి (సూతుడు)
2. దుష్యంతుడు
3. శిష్యుడు (ఒకకంఠం)
4. ఒక పురుష కంఠం (కణ్వశిష్యుడు)
5. విదూషకుడు
6. దౌవారికుడు (ప్రతీహారి)
7. సేనాపతి
8. కరభకుడు
9. దుర్వాసుడు (నేపథ్య కంఠం)
10. ఋషి కుమారుడు (1)
11. ఋషి కుమారుడు (2)
12. కణ్వ మహర్షి (కాశ్యపుడు)
13. శార్ఙ్గరవుడు (కణ్వశిష్యుడు)
14. కంచుకి
15. రాజపురోహితుడు
16. శారద్వతుడు (కణ్వ శిష్యుడు)
17. రక్షక భటుడు 1
18. రక్షక భటుడు 2
19. మత్స్యకారుడు
20. స్యాలుడు
21. మాతలి (ఇంద్రసారథి)
22. భరతుడు (బాలుడు, ఐదేళ్ళు)
23. మారీచ మహర్షి
24. గాలవుడు (మారీచ మహర్షి ఆశ్రమ వాసి)

## స్త్రీలు

1. శకుంతల
2. అనసూయ
3. ప్రియంవద
4. గౌతమి
5. ఆశ్రమ స్త్రీ (1)
6. ఆశ్రమ స్త్రీ (2)
7. ఆశ్రమ స్త్రీ (3)
8. వేత్రవతి (ప్రతీహారి)
9. సానుమతి
10. అంతఃపుర స్త్రీ (1)
11. అంతఃపుర స్త్రీ (2)
12. చతురిక
13. యవన స్త్రీ
14. మారీచ మహర్షిఆశ్రమ స్త్రీ
15. అదితి (మారీచమహర్షి పత్ని)



# అభిజ్ఞానశాకుంతలం

## ప్రయోక్త

సహృదయ ప్రేక్షక మండలికి సాధువాదాలు.... ఒక్క సంస్కృతంలోనే కాక ప్రపంచ భాషల్లోనే ప్రఖ్యాతిగాంచిన నాటకం మహాకవి కాళిదాస విరచిత అభిజ్ఞాన శాకుంతలం... అనేక దేశవిదేశ భాషల్లో అనువాదానికే కాక ప్రదర్శనకు సైతం నోచుకొన్న నాటకం ఇది. భారతీయ నాటకప్రయోజనాన్ని భరతమహర్షి చూడదగిందీ, వినదగిందిగా అభివర్ణించాడు. అంటే వినోదంతో పాటు హితోపదేశం కూడా నాటకంలో ఉండాలని అర్థం. ఇతివృత్తం, నాయకుడు, రసం అనేవి మూడూ భారతీయ నాటకాల్లో ప్రధానమైన అంశాలు. ఈ ఇతివృత్తం ప్రఖ్యాతమైనదైనప్పుడు అందరికీ ప్రీతిపాత్ర మౌతుంది. అంటే పౌరాణిక, జానపద, చారిత్రక కథాంశమన్నమాట. నేటి అభిజ్ఞానశాకుంతలానికి మూలం మహాభారతకథ. నాయకుడు అందరికీ ఆదర్శప్రాయుడు కావాలనే సూత్రాన్ని దృష్టిలో పెట్టుకొని కాళిదాసమహాకవి మహాభారతంలో వ్యాసమహర్షి చెప్పిన కథలో మార్పుచేశాడు. సత్యనిష్ఠుడైన దుష్యంత మహారాజు తాను గాంధర్వ విధితో వివాహం చేసుకొన్న శకుంతలను నిండుసభలో నువ్వెవరో నాకు తెలియదు పొమ్మని తిరస్కరిస్తే భారతేతిహాసంలో ఆకాశవాణి శకుంతల ఆతని భార్య అనీ స్వీకరించమనీ పలుకుతుంది. అపుడు దుష్యంతుడు నిజమే కాని సభాసదు లేమనుకొంటారోనని కాదన్నానని ఆమెను స్వీకరిస్తాడు. అది నాయకుని శీలానికి మచ్చేగా తలచి కాళిదాసు మొదట తపోవనంలో దుష్యంతుడామెకొక ఉంగరాన్ని ఇవ్వటం కల్పిస్తాడు. ఆ ఉంగరం త్రోవలో ఆమె వ్రేలినుంచి నదిలో జారిపోవటంతో శకుంతల నిజాన్ని నిరూపించుకోలేక పోవటం, తరువాత కొంతకాలానికి ఒక బోయవానికి చేప కడుపులో అది దొరకటం, దాన్ని వాడు అమ్మబోతే అది రాజముద్రిక కనుక రక్షకభటులువాణ్ణి పట్టుకొని రాజు సముఖానికి తీసికొని రావటం, ఆ ముద్రికను చూడటంతోనే రాజుకు శకుంతల జ్ఞప్తికి రావటం వంటివన్నీ కాళిదాస మహాకవి

చేసిన అపూర్వకల్పనలు. అభిజ్ఞానమంటే గుర్తు. అంగుళీయకం గుర్తుతో నాయకుడు నాయిక శకుంతలను జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు కనుక దీనికి అభిజ్ఞానశాకుంతలం అని కవి పేరుపెట్టాడు. అంతటి సత్యనిష్ఠునికి మఱపు రావటానికి దుర్వాసమహర్షి శాపం మఱో అద్భుతమైన కల్పన. ఈ సంస్కృత నాటకాన్ని చేదివి గెథే అనే జర్మన్ కవి పరమానందంతో వీధిలో నాట్యం చేశాడని చెబుతారు. ప్రధానరసం శృంగారమే అయినా నవరసభరితమైన ఈ నాటకాన్ని చూచి ఆనందించి, ఆశీర్వదించేండి.



## మొదటిఅంకం

(ధనుర్బాణాలు పట్టుకొని రథంపై దుష్యంతుడు, సారథి రంగస్థల ప్రవేశం)

సారథి (సూతుడు) : చిరంజీవీ!.. విల్లెక్కుపెట్టి ఆ లేడిపైనే దృష్టిని నిలిపిన నిన్ను చూస్తుంటే పూర్వం మృగాన్ని వెంటనంటి పరుగిడిన పినాకపాణి పరమశివుణ్ణే చూస్తున్నట్టుంది సుమా!

దుష్యంతుడు : లేడిని వేటాడటంలో చాలాదూరం వచ్చేశాం!.. ఆ లేడి చూడెంత సొగసుగా ఉందో!.. నా బాణం ఎక్కడ తన వీపుకు తగులుతుందోననే భయంతో వెనుక భాగాన్ని ముందు భాగంలో జొనుపుకుంటూ పరుగిడుతుంటే అంతకుముందు మేసిన గడ్డిపరకలు నేలపై జారి అది వెళ్ళిన త్రోవను మనకు చూపుతున్నాయి కదూ!... భయంతో నాలుగు కాళ్ళనూ ఒక్కసారే పైకి లేపి పరుగిడుతుంటే ఆకాశంలోనే ఎక్కువగానూ, భూమ్మీద తక్కువగానూ నడుస్తున్నట్లుంది!.. అరెఁ! అప్పుడే కనుమఱుగైపోయిందే!...

సారథి : భూమి ఎత్తుపల్లాలుగా ఉండటంతో నీకెక్కడ కుదుపు కలుగుతుందోనని నేనే రథవేగాన్ని తగ్గించాను. ఇదిగో ఇక్కడ నేల బాగానే ఉంది. కనుక రథవేగాన్ని పెంచుతాను. ఇక ఆ లేడి నిన్ను తప్పించుకు పోలేదు... (రథం వేగంగా వెడుతున్న ఎఫెక్ట్)

దుష్యం : సారథీ!... ఇదిగో చూడు... లేడిని వధిస్తున్నా (బాణాన్ని సంధిస్తాడు)

– నేపథ్యంలో –

ఒక కంఠం : రాజా!... ఇది ఆశ్రమ మృగం.. చంపొద్దు.. చంపొద్దు.. చంపొద్దు...

సారథి : అరె! ఈ మునికుమారులెవరు?

దుష్యం : రథాన్నాపు... (ఇరువురు తాపసులు, వైఖానసుడు ప్రవేశిస్తారు)

వైఖానసుడు : పూలగుత్తిపై నిప్పులు చేల్లినట్లు ఈ లేడిపై బాణాన్ని విడువకు...మీవంటి మహారాజుల పరాక్రమం సాధుజన రక్షణకే కాని నిర్దోషుల్ని శిక్షించేటానికి కాదుగా!

దుష్యం : ఇదిగో ఇప్పుడే బాణాన్ని ఉపసంహరిస్తున్నా...

వైఖాన : నువ్వు చేసినపని పురువంశప్రతిష్ఠానుగుణంగా ఉంది. నీవంటి ఉత్తమగుణోపేతుడూ, చక్రవర్తీ కాగల పుత్రుని పొందుదువుగాక!...

దుష్యం : (నమస్కరిస్తూ) మీ ఆశీస్సుకు కృతజ్ఞుణ్ణి....

వైఖా : ఈ మాలినీ నదీ తీరంలో ఆ కనిపించేదే కణ్వమహర్షి ఆశ్రమం... మీకంత అవసరమైన పనిలేక పోతే అక్కడి కొకసారి రాగలిగితే మునుల యాగాలను చూసినట్లూ అవుతుంది, మీ పాలన ఎంత దూర ప్రదేశాన్ని కూడా ఎలా రక్షిస్తోందో తెలిసికొన్నట్లూ అవుతుంది...

దుష్యం : కులపతి కణ్వమునీంద్రు లాశ్రమంలో ఉన్నారా?

వైఖా : తమ కుమార్తె శకుంతలకు అతిథి సత్కారవిధిని నిర్వహించమని చెప్పి...

దుష్యం : చెప్పి?

వైఖా : ఆమె గ్రహస్థితి అనుకూలంగా లేనందువల్ల ఆ వైపరీత్యాన్ని శమింపజేయటానికి సోమతీర్థం వెళ్ళేరు.

దుష్యం : సరే... ఆమెను దర్శిస్తాను.. కణ్వమహర్షిపై మా భక్తిని ఆమే మహర్షికి తెలుపుతుంది.

వైఖా : సరే, మతి మాకు సెలవా? (శిష్యులతో నిష్క్రమిస్తాడు)



దుష్యం : సారథీ! రథాన్ని పోనీ.... పుణ్యాశ్రమదర్శనంతో పవిత్రుణ్ణౌతాను.

సారథి : చిత్తం!....

దుష్యం : ఆc!... మనవల్ల ఆశ్రమ వాస ప్రశాంతతకి భంగం కలుగ కూడదు... రథాన్ని ఇక్కడే నిలుపు... తపోవనాన్ని సామాన్య దుస్తులతోనే ప్రవేశించాలి... ఇదిగో ఈ ధనుస్సు, ఆభరణాలూ జాగ్రత్తచేసి, నే వచ్చేలోపుగా ఈ రథాశ్వాల శ్రమను పోగొట్టు!...

సారథి : చిత్తం. (నిష్క్రమిస్తాడు)

దుష్య : ప్రశాంతమైన ఆశ్రమంలో అడుగుపెడుతుంటేనే నా కుడిభుజం అదురుతోందేవిcటి? ఇక్కడ దీనికి ఫలితమేముంటుంది? అయినా రాబోయే ఫలానికి అన్నిచోట్లూ తగినవే...

శకుంతల : -నేపథ్యంలో- ఇటురండే!... (చిన్న కడవలతో నీరు తీసికొని శకుంతల, సఖులు ప్రియంవద, అనసూయలు (ప్రవేశిస్తారు)

దుష్యం : ఋషికన్యల్లా ఉన్నారు. అంతఃపురాల్లో దుర్లభమైన అపురూప సౌందర్యం వీరిలో ఎంతగా శోభిస్తోంది!. ఈ చెట్టు నీడనే ఉండి చూస్తాను...

అనసూయ: సఖీ! శకుంతలా!... ఈ చెట్లకి నీరు పోసి పెంచేబాధ్యత నీకప్పగించినందువల్ల తండ్రి కాశ్యపునికి నీ మీద కంటే ఈ ఆశ్రమవృక్షాలపైనే ఎక్కువ ప్రేమ అనుకొంటాను...

శకుంతల : తండ్రిఆజ్ఞే కాదు... నాకూ ఈ ఆశ్రమవృక్షాలంటే వల్లమాలిన అనురాగం అనసూయా..

దుష్యం : ఏవిcటీ? ఈమె కణ్వమహర్షి పుత్రికా? సహజ సౌందర్యంతో ఉన్న ఈమెకు కణ్వమహర్షి ఇటువంటి

మోటుపనులప్పగించేటం నాకేమీ భావ్యంగా అనిపించేటం లేదు. కానీ, ఈ చెట్లచాటునుండే ఆమె సౌందర్యాన్ని నిర్భయంగా తిలకిస్తాను.. ఇంతటి అందాల రాశికి నార చీరకూడా అందంగానే ఉంది. నాచుతోఉన్న పద్మం, మచ్చతో ఉన్న చంద్రుడూ మనోజ్ఞంగానే ఉంటారుకదా!... సహజంగా అందం ఉన్నప్పుడు అలంకారాలెందుకు?

శకుంతల : అదిగో చూశావా? ఆ కేసర వృక్షం చిగురాకులనే వ్రేళ్ళతో నన్ను రమ్మని పిలుస్తున్నట్లుంది కదూ!... దగ్గఱకు వెడతాను. (చెట్టు దగ్గఱకు వెడుతుంది)

ప్రియంవద : నువ్వు దగ్గఱకు వెళ్ళటంతోటే ఆ చెట్టు లతాసనాథమైనట్లు మఱింత అందంగా ఉంది...

శకుంతల : అందుకే నిన్ను ప్రియంవదన్నారు...

దుష్యం : ప్రియంవద చెప్పింది కేవలం ప్రియమేకాదు, సత్యం కూడా... ఆహా! ఏమీ శకుంతల సౌందర్యం! చిగురుటాకుల్లా ఎఱ్ఱని పెదవులు, మృదువైన చేతులు, పుష్పసదృశమై స్పృహణీయమైన యౌవనం!...

ప్రియంవద : అనసూయా!... మనశకుంతల గున్నమామిడిచెట్టు నల్లుకొన్న లతకు 'వనజ్యోత్స్న' అని పేరుపెట్టుకొని అంత మక్కువగా ఎందుకు చూస్తోందంటావు?

అన : నాకేం తోచేటం లేదు... నువ్వే చెప్పు...

ప్రియంవద : 'వనజ్యోత్స్న' తనకు తగిన గున్నమామిడి చెట్టుని వరునిగా పొందినట్లే తానూ తనకు తగిన వరుని ఎప్పుడు పొందగలనా అని!

శకుంతల : (అసూయగా) అది నీలోని కోరిక (చెట్లపై నీరు పోస్తుంది)

దుష్యం : (తనలో) ఈ కోర్కె ఈమెకు దుర్లభమైంది కదా! ఈమె కణ్వమహామునికి అన్యవర్ణస్త్రీ వల్ల జన్మించింది కాదుకదా!



ఇందులో సందేహమెందుకు? నామనస్సు ఈమెపట్ల అనురక్తమైంది. కనుక ఈమె నిస్సంశయంగా క్షత్రియుడు వివాహమాడదగిందే అయి ఉండాలి... సందేహాస్పదమైన విషయాల్లో సత్పురుషులకు అంతఃకరణ ప్రవృత్తే ప్రమాణం... అయినా ఆమెను గూర్చి నిర్ధారించుకొంటాను...

శకుంతల : ఈ తుమ్మెద నవమాలికలతను విడిచి నా చుట్టూ తిరుగుతోందేవిఁటే?

దుష్యం : (అసూయగా) ఓ తుమ్మెదా!... ఆమె భయం భయంగా నిన్ను చూస్తుంటే నువ్వు హాయిగా ఆమె స్పర్శనమభ విస్తున్నావు. నీ మృదు మధుర ఝుంకారాలతో ఏదో రహస్యం చెప్పే వాడిలా ఆమె చెవి చుట్టూ తిరుగు తున్నావు... మేమేమో ఇంకా ఆమె వృత్తాంతాన్ని తెలుసుకోవటానికే తాపత్రయ పడుతుంటే నువ్వేమో రతిసర్వస్వమైన ఆమె అధరామృతాన్నే ఆస్వాదిస్తున్నావు. ధన్యుడివి...

శకుంతల : నన్నీ తుమ్మెద బారినుండి రక్షించేండే!...

అన, ప్రియ : (నవ్వుతూ) రక్షించేటానికి మేమేపాటివారమమ్మా! తపోవనాన్ని రక్షించేవలసినవాడు రాజే కదా! కనుక దుష్యంతుని పిలు!...

దుష్యం : (తనలో) వీరికంట పడటానికి నాకిదే మంచి అవకాశం!... (పైకి) ఎవరక్కడ? (సగంలో ఆపి) నేను రాజనే విషయం తెలిసిపోతుందేమో?! సరే... ఇలా చేస్తాను...

శకుంతల : ఈ దుష్టుడు నేనెటువెడితే అటే వస్తున్నాడే!...

దుష్యం : (వేగంగా వెళ్ళి) దుష్టశిక్షకుడైన ఈ దుష్యంత మహారాజు పాలనలో తాపసకన్యల బాధించేవాడెవడురా? (అంతా కంగారుపడతారు)

అన : అయ్యా!... ఇక్కడ జెరగకూడనిదేమీ జెరగలేదు... (శకుంతలను చూపించి) మాప్రియసఖి తుమ్మెదకి భయపడిందంతే!...

దుష్యం : (శకుంతలవైపు తిరిగి) మీ తపస్సు బాగా జెరుగుతోందా? (శకుంతల భయంతో మాట్లాడదు)

అన : మీవంటి అతిథుల రాకతో మేం కృతార్థులమైనాం... ఆర్యులకు స్వాగతం... సఖీ! శకుంతలా!... పర్ణశాలకు వెళ్ళి అర్ఘ్యాన్ని తీసుకురా.. (కలశాన్ని ఇస్తూ) పాద్యం స్వీకరించేండి)

దుష్యం : మీ మాటలే మాకాతిథ్యాన్నిచ్చాయి...

ప్రియం : అయితే ఈ సప్తపర్ణివేదికపై కొంచెం విశ్రమించేండి...

దుష్య : మీరూ కూర్చోండి... (అంతా కూర్చుంటారు)

శకుంతల : (తనలో) ఈయన్ని చూసినదగ్గర్నుంచి ఎందుకో ఆశ్రమ విరుద్ధమైన భావాలు కలుగుతున్నాయి...

దుష్యం : మీ వయోరూపాలకు తగ్గట్లే ఉంది మీ సౌహార్దం కూడా!...

ప్రియం : (జనాంతికంగా) అనసూయా!... మధుర గంభీరమైన రూపంతో చేక్కగా మాట్లాడుతూ రాజులా కనిపించే ఇతడెవరై ఉంటాడే?

అనసూయ : ఈయనెవరో తెలిసికోవాలని నాకూ అనిపిస్తోంది... అతణ్ణే అడుగుదాం!... అయ్యా!... తమరెవరో, ఇక్కడకు వచ్చిన పనేమిటో తెలిసికోవచ్చా?

దుష్యం : మహారాజాజ్ఞతో తపస్వుల కేఆటంకాలూ లేకుండా చూడటానికి వచ్చిన ధర్మాధికారిని... (శకుంతల సిగ్గుపడు తుంది)

ప్రియం,అన : (శకుంతలా, దుష్యంతులను చూసి, జనాంతికంగా) ఇప్పుడు పితృపాదులిక్కడ ఉంటే?...



శకుంతల : (రోషంగా) ఉంటే ఏమౌతుందే?

ఇద్దఱూ : అహఁ!... ఉంటే, ఈ అతిథికి తన జీవిత సర్వస్వాన్నిచ్చి, కృతార్థుణ్ణి చేసి ఉండేవారు!...

శకుంతల : మీరు మనసులో ఏదో పెట్టుకొని ఇంకేదో మాట్లాడు తున్నారు... పొండిక్కడినుంచి... నేను మీ మాటలేవీఁ వినను...

దుష్యం : మేము మీ సఖిని గూర్చి అడగాలనుకొంటున్నాం!...

ఇద్దఱూ : మీరు అడగటమే మాకో సత్కారం!...

దుష్యం : కణ్వమహర్షి శాశ్వత బ్రహ్మచర్య నిష్ఠులని ప్రసిద్ధికదా!... మఱి, మీ సఖి వారి పుత్రికెలా అయిందని!...

అన : మహా ప్రభావోపేతుడైన కౌశికుడనే రాజర్షి ఉండేవాడు...

దుష్యం : అవును... మేమూ విన్నాం వారిని గుఱించి... ఆఁ!... తరువాత?

అన : మా సఖి ఆ కౌశిక ఋషి సంతానం. ఆయన ఈమెను విడిచిన తరువాత కాశ్యపు లీమెను పెంచి పెంపుడు తండ్రి అయినారు.

దుష్యం : విడిచిపెట్టారంటే నాకుత్కంఠ జనిస్తోంది... వివరంగా తెలుసుకోవాలను కొంటున్నాం...

అన : అయితే వినండి... పూర్వమాముని మహోగ్రతపం ఆచరిస్తుంటే ఏదో అనుమానంతో దేవతలు మేనక అనే అప్సరసను ఆయన తపోభంగానికై పంపారు.

దుష్యం : ఎవరైనా తపస్సుచేస్తున్నారంటే దేవతల కనుమానం రావటం అలవాటేగా!... ఊఁ!.. ఆ తరువాత?...

అన : ఆ తర్వాత ఒకానొక వసంత కాలంలో ఉన్మాదం రేకెత్తించే ఆమె రూపాన్ని చూసి... (సిగ్గుతో విరమిస్తుంది)

దుష్యం : ఆ తర్వాత తెలుస్తూనే ఉంది... అయితే ఈమె అప్సరసకి జన్మించిందన్నమాట!...

అన : అవును!...

దుష్యం : కాకపోతే ఇంతటి మహాసౌందర్యరాశి మానవులకెలా జన్మిస్తుంది?.. మహాతేజస్సు భువిలో ఉదయించేదుకదా!.. (శకుంతల సిగ్గుతో తల వంచుకొంటుంది)

ప్రియం : (నవ్వుతూ శకుంతలా దుష్యంతుల్ని చూసి) తమరేదో చెప్పాలనుకొంటున్నట్లుంది?...

శకుం : (చెలికత్తెను వ్రేలితో బెదిరిస్తుంది)

దుష్యం : అహఁ!..సచ్చరిత్ర వినాలని ఒక విషయం అడగాలని ఉంది...

ప్రియం : దానికంత ఆలోచనెందుకు?... తపస్వినులను ఏదైనా నిస్సంకోచంగా అడగవచ్చు కదా!...

దుష్యం : ఈమె ఈ ఆశ్రమంలో వివాహం వఱకే ఉంటుందా? లేక శాశ్వతంగా తపశ్చర్య దీక్షపూని ఉంటుందా? అని!...

ప్రియం : పూజ్యులు కణ్వమహర్షి తగిన వ్యక్తి లభిస్తే ఈమెకు వివాహ మంగళం జరిపించేలనే సంకల్పంతోనే ఉన్నారు!...

దుష్యం : (తనలో) నేను నిప్పనుకొని దేన్ని తాకకూడదనుకొన్నానో అదిప్పుడు తాకదగిన రత్నమే అయింది...

శకుంతల : (రోషంగా) అనసూయా! నేవెళ్ళిపోతున్నా!...

అన : ఎందుకు?

శకుంతల : ఈ ప్రియంవద అసంబద్ధ ప్రలాపాల్ని ఆర్య గౌతమికి చెప్పటానికి!

అన : శకుంతలా!.. అతిథిని గౌరవించేకుండా వెళ్ళటం న్యాయం కాదు కదా!



ప్రియం : నువ్విప్పుడు వెళ్ళటం కుదరదు...

శకుంతల : (కనుబొమలు ముడిచి) ఏం?... ఎందుకని?

ప్రియం : రెండు చెట్లకు నీరుపోసే అప్పు పడ్డావు... ముందు నా అప్పు తీర్చి మఱీ కదులు...

దుష్యం : అమ్మా!... చెట్లకు నీరుపోసి ఈమె ఇప్పటికే అలిసి పోయినట్లుంది... చూడూ!, చేతులెఱ్ఱవారాయి. దీర్ఘంగా నిట్టూరుస్తోంది... ఇదిగో ఈ ఉంగరంతో నేనామె అప్పు తీర్చేస్తున్నా! (ఇద్దఱూ ఆ ఉంగరంమీద అక్షరాల్ని చూసి ఒకరి నొకరు చూసుకొంటారు) మీరేమీ అనుకోకండి.. ఇది నాకు రాజుగారిచ్చింది...

ప్రియం : అందుకే ఇది మీ దగ్గఱే ఉండాలి... మీ మాటలతోనే ఈమె అప్పు తీరిపోయింది... శకుంతలా!.. ఇక నువ్వెళ్ళవచ్చు...

శకుంతల : (తనలో) నేవెళ్ళగలిగితేగా! (పైకి) నన్ను వెళ్ళమనటానికి కాని, వద్దనటానికి కానీ అసలు నువ్వెవతివే?

– నేపథ్యంలో –

ఒక కంఠం : ఆశ్రమవాసులారా!... తపోవన ప్రాణి రక్షణకై సిద్ధంగా ఉండండి!... వేటకై వచ్చిన దుష్యంత మహారాజు లీఆశ్రమానికి చేరారు!.. ఆఁ!.. ఆఁ!.. జాగ్రత్త!... రాజుగారి రథాన్ని చూసి బెదిరిన ఒక అడవి ఏనుగు ధర్మారణ్యం ప్రవేశిస్తోంది!...

దుష్యం : (తనలో) ఛీ!... ఛీ!... నన్ను వెతుకుతూ సైనికు లీతపోవనాన్ని చుట్టుముట్టినట్లున్నారు!..

అన : అయ్యా!.. ఈ వనగజ వృత్తాంతంతో కంగారుగా ఉంది. అనుజ్ఞనిస్తే మా పర్ణశాలకు పోతాం!

దుష్యం : వెళ్ళిరండి... మీ ఆశ్రమానికి ఏ హానీ లేకుండా చూస్తాం!

సఖులు : మిమ్మల్ని సత్కరించేలేక పోయినందుకు మన్నించండి... తిరిగి దర్శన మిమ్మని కోరటానికి సిగ్గుగా ఉంది!...

దుష్యం : ఆc!.. ఆc!.. ఎంతమాట!... మీ దర్శనమే నాకొక సత్కారం!

(శకుంతల, అనసూయ, ప్రియంవదలు మెల్లగా నిష్క్రమిస్తారు)

దుష్యం : రాజధానికి వెళ్ళాలని లేదు... అనుచరులను ఆశ్రమం దగ్గఱే విడిది చేయించి వస్తాను.. శకుంతల నుండి మనస్సు మళ్ళించేటం నా తరం కావటం లేదు... (నిష్క్రమిస్తాడు)

★★★



## రెండవ అంకం

విదూషకుడు : (ప్రవేశించి) రాజుకీ వేట వ్యసనంతో నాకు చేచ్చే చావొచ్చి పడింది. అదిగో లేడి, ఇదిగో పంది, అదుగో పెద్దపులి అంటూ పరుగెత్తుతూ మండుటెండలో చెట్టునీడ కూడా కరువైన అరణ్యాల్లో పడి తిరగాల్సి వస్తోంది. ఆయన గుఱ్ఱం వెనకాలే పరిగెత్తటంతో కీళ్ళు జారిపోయి రాత్రిళ్ళు మంచి నిద్రకి కూడా మొహం వాచినట్లైంది. తెల్లారకుండానే వేటకుక్కల్ని వెంటేసుకొని తొత్తుకొడుకులు ఆ వేటగాళ్ళ రొదతో అప్పుడే పడుతున్నట్టున్న ఆ కాస్త నిద్రకూడా హరీ అంటోంది... అంతటితో సరి పోయిందా అంటే లేదే!... గోరుచుట్టుమీద రోకటి పోటన్నట్లు నా దురదృష్టం కొద్దీ నేను దగ్గఱ లేనప్పుడు శకుంతల అనే తాపసకన్యను చూసి మోజుపడ్డాట్ట! ఇప్పుడు రాజధానికి తిరిగి వెళ్ళాలనే ఊసే ఎత్తటం లేదు. ఆ విషయం ఆలోచిస్తుంటేనే భళ్ళున తెల్లారింది. ఇప్పుడింకేం దారి? సరే... మిత్రుణ్ణి చూసొస్తాను... (రెండడుగులు వేసి) అడుగో చేత్తో విల్లు పట్టుకొని పూల మాలలు ధరించిన యవన స్త్రీ పరివేష్టితుడై మిత్రుడిటురానే వస్తున్నాడు. సంధి బంధాలు జారి బాధపడుతున్నట్లు నిల్చునే ఉంటాను... ఇలా అయినా కొంత విశ్రాంతి చిక్కుతుంది...

దుష్యం : (తనలో) ప్రేమికుడంతా తనకనుకూలంగానే అన్వయించు కొంటాడు. ఆమె ఎటో చూస్తున్నా అదంతా తనమీద ప్రేమే అనీ పిఱుదుల భారంతో మెల్లగా నడిచినా తన్ను చాలాసేపు చూడాలనే అలా నడుస్తోందనీ అనిపిస్తోంది... నామీద ప్రేమతోనే సఖులతో రోషంగా మాట్లాడినట్లనిపించింది... కాముకుడు ప్రేయసి చేష్టలన్నీ తనకనుకూలంగానే భావిస్తాడుకదా!...

విదూ : వయస్యా!... నాకు కాళ్ళూ చేతులాడటంలేదు... అందువల్ల "విజయీభవ" అని మాటమాత్రంగానే దీవిస్తున్నా!...

దుష్యం : (నవ్వుతూ) ఉన్నట్టుండి నీ కాళ్ళూ చేతులెందుకాడటం లేదయ్యా?

విదూ : ఎందుకా?... స్వయంగా కళ్ళలో పొడిచి కన్నీళ్ళెందుకొస్తున్నాయని అడిగినట్టుంది.

దుష్యం : నువ్వు చెప్పేదేవిఁటో నాకేం అర్థం కావటంలేదు...

విదూ : ఇదంతా నీ వల్లనేగా?...

దుష్యం : నా వల్లా? ... నేనేం చేశాను?...

విదూ : నువ్వు రాచకార్యాలు వదిలి ఈ అడవులుపట్టి వేటకై తిరగటంతో నేను నీవెంట తిరగటంతో నా కీళ్ళు ఊడిపోతున్నాయి. ఇవాళ ఒక దినమైనా నాకు విశ్రాంతి నివ్వు!

దుష్యం : (తనలో) నాకూ శకుంతల మీదే మనస్సు లగ్నం కావటం వల్ల వేటాడదామని లేదు... మిత్రుడూ దానికి తగ్గట్టే అర్థిస్తున్నాడు... (ఆలోచిస్తుంటాడు)

విదూ : నువ్వింకేదో ఆలోచనలో పడినట్లుంది. నాదంతా అరణ్యరోదనేనా?...

దుష్యం : ఏంలేదు... మిత్రుని మాట కాదనకూడదని ఇవాళ వేట మానుకొన్నాను...

విదూ : చిరంజీవ!... చిరంజీవ!... (వెళ్ళబోతాడు)

దుష్యం : వయస్యా!... ఆగు... కొంచెం మాట్లాడాలి...

విదూ : ఆనతివ్వు!...

దుష్యం : నువ్వు విశ్రాంతి తీసికొన్న తర్వాత కష్టంకాని ఒక చిన్నపనిలో నీ సహాయం కావాలి.

విదూ : లడ్డూలను తినిపెట్టటంలోనా?



దుష్యం : (నవ్వి) చెబుతాగా!... ఎవరక్కడ?...

దౌవారికుడు : ప్రభూ!.. ఆనతివ్వండి...

దుష్యం : రైవతకా!.. సేనాపతిని పిలుచుకురా!...

దౌవారికుడు : (నిష్క్రమించి సేనాపతితో ప్రవేశించి) ప్రభువులు తమకేదో ఆదేశించేలను కొంటున్నారు... సమీపించేండి...

సేనాపతి : మహారాజులకు జయం!...తమరింకా ఇక్కడే ఉన్నారు?...

దుష్యం : ఆఁ!... ఏంలేదు, వేటమీద మాకుండే ఉత్సాహాన్నంతా ఈ మాధవ్యుడు నీరు కార్చేశాడు...

సేనా : (విదూషకునితో జనాతికంగా) సఖా!... నువ్వు నీమాట మీదే ఉండు...నేను ప్రభువు కనుకూలంగా మాట్లాడతా!... (పైకి) ఈ మూఢుని మాటలకేం ప్రభూ!... వేటని మించిన వినోదం ఎక్కడాలేదు!...

విదూ : మహారాజు హాయిగా ఉన్నారు... నీకు వేటమీద మోజుంటే పోయి ఏ ఎలుగుబంటి నోట్లోనో పడు...

దుష్యం : ఇవాల్టికి ఆశ్రమంలోనే ఉంటాం... మృగాలన్నీ నేటికి స్వేచ్ఛగా సంచరించేనీ...

సేనా : చిత్తం!...

దుష్యం : తపోవన ప్రశాంతతకు భంగం కలుగకుండా సైనికులను ఆశ్రమానికి దూరంగా ఉంచు... చూడు! తపోధనుల్లో దుష్టుల్ని దహింపజేసే శక్తి గూఢంగా ఉంటుంది... పైకి వారు ప్రశాంతులుగా కనిపించినా వారికి కష్టం కలిగిస్తే తమ తేజస్సుని ప్రకటిస్తారు... కనుక జాగ్రత్త!...

సేనా : చిత్తం ప్రభూ!... (నిష్క్రమిస్తాడు)

విదూ : ఇక్కడ ఒక ఈగ కూడా లేదు...ఈ వృక్షచ్ఛాయలో కూర్చుందాం... ఊఁ... ఇక చెప్పండి...

దుష్యం : చూడాల్సింది చూడకపోవటంతో నీ కళ్ళు సాఫల్యం పొందలేదు...

విదూ : అదేవిఁటి? మీరు నా ఎదురుగానే ఉన్నారు కదా!...

దుష్యం : నే మాట్లాడేది శకుంతలను గుఱించి!...

విదూ : వయస్య!... ఇవాల్టికి నీకొక తాపసకన్య కూడా గొప్పగా కనిపిస్తోందా?...

దుష్యం : పరిహరింపదగిన వాటిపై పురువంశ ప్రభువుల మనస్సు ప్రసరించేదు కదా?...

విదూ : అయితే మఱి ఇదేవిఁటి?

దుష్యం : శకుంతల... మేనకా విశ్వామిత్రులకు జన్మించింది... వాళ్ళిద్దఱూ విడిచిపెట్టటంవల్ల కణ్వమహర్షికి లభించింది!..

విదూ : (నవ్వి) వయస్యా!... మహామహా సౌందర్యవతులైన స్త్రీ రత్నాల్నే తిరస్కరించే నువ్వీనాడు ఒక తాపసకన్యపై మనసు పోగొట్టుకోవటం ఎలా ఉందంటే?...ముద్ద ఖర్జూరాన్ని తిని తిని మొుహం మొుత్తినవాడికి చింతపండుపై కోర్కెపుట్టినట్లుంది!...

దుష్యం : నువ్వామెను చూడకపోవటంవల్ల అలా మాట్లాడుతున్నావు!.

విదూ : నీ అంతటివాణ్ణే అలరించిందంటే ఆమె అందమైందే అయి ఉండాలి...

దుష్యం : బ్రహ్మ ప్రత్యేక సృష్టి ఆమె... ఆమె అనాఘ్రాతపుష్పం, గోటి తాకిడిలేని చివురాకు... రంధ్రంలేని రత్నం... ఎవరూ చేవిచూడని నూతన మధువు... ఆమె సౌందర్యం అఖండమైన పుణ్యఫలం... దాన్ని అనుభవించే భోక్తగా విధి ఎవరికి వ్రాసిపెట్టాడో తెలియదు...

విదూ : అందుకే ఆమె ఏ జేడదారి చేతుల్లోనో పడకుండా త్వరగా రక్షించుకో...



దుష్యం : ఆమె అస్వతంత్రురాలు... తండ్రి సమీపంలో లేరు...

విదూ : ఇంతకీ నిన్ను గుఱించి ఆమె ఏమనుకొంటోందో?

దుష్యం : తాపసకన్యలు అమాయకులు కదా!... అయినా ఆమె నాపై ప్రేమను ప్రకటించేనూ లేదు, అలా అని దాచేనూలేదు...

విదూ : లేకపోతే నిన్ను చూట్టంతోనే ఒళ్ళో వచ్చి వాలిపోతుందను కున్నావా?

దుష్యం : సఖులతో కలిసి వెళ్ళేటప్పుడు సిగ్గుచూపినా నాపట్ల అనురక్తేనని తోస్తోంది. ఎందుకంటే కొద్దిగా ముందుకు వెళ్ళి నిష్కారణంగానే కాల్లో దర్భముల్లు గుచ్చుకుందని ఆగిపోయింది... చెట్టుకొమ్మకి కొంగు తగలకపోయినా దానిని తీసుకొంటున్నట్లు నటిస్తూ వెనుదిరిగింది...

విదూ : అయితే ఇంకేం మఱి? ఈ తపోవనాన్ని ఉద్యానవనంగా మార్చేశావన్నమాట!...

దుష్యం : నేనిక్కడున్నట్లు కొందఱు తపస్వులకు తెలిసిపోయింది... కనుక ఏ వంకతో తిరిగి ఆశ్రమంలో ప్రవేశిస్తే బాగుంటుందో ఆలోచించు...

విదూ : వంకంటూ ఎందుకు? నువ్వు రాజువేగా!...

దుష్యం : అయితే?

విదూ : వారు పండించిన పంటలో ఆఱవ వంతు పన్నుగా కట్టం డని!...

దుష్యం : ఇతరులవల్ల రాజుకు చెందే ఫలం క్షీణించేది... ఈ తపస్వులు మనకిచ్చే ఆఱవవంతు మాత్రం అక్షయమైన ఫలం...

దౌవారి : (ప్రవేశించి) మహారాజా జయం! జయం! ఇద్దఱు తాపసులు తమ దర్శనాన్ని కోరుతున్నారు ప్రభూ!...

దుష్యం : వెంటనే ప్రవేశపెట్టు!...

దౌవారి : చిత్తం...(వెళ్ళి ఆ ఇద్దటితో తిరిగి ప్రవేశిస్తాడు)

ఇద్దఱు : మహారాజా!... స్వస్తి...

దుష్యం : ఇరువురికీ నా ప్రణామాలు... (ఇరువురూ ఫలాలిస్తారు. తీసికొని) ఆజ్ఞాపించేండి!...

ఒకడు : భగవత్స్వరూపులు కణ్వమహర్షి ఆశ్రమంలో లేకపోవటం వల్ల మేమాచరించే యజ్ఞాదులకు రాక్షసులు విఘ్నం కలుగజేస్తున్నారు... కనుక మీరు కొన్నాళ్ళు ఇక్కడ ఉండి ఆశ్రమానికి రక్షణ కల్పించేవలసిందిగా మనవి...

దుష్యం : మహాప్రసాదం...

విదూ : ఇది నీకనుకూలమైన మనవేగా!...

దుష్యం : రైవతకా! విల్లమ్ములతో రథాన్ని సిద్ధం చేయమని చెప్పు!...

దౌవా : చిత్తం!...

ఇద్దఱు : పురువంశీయులు ఆపన్నుల కభయప్రదాతలై, యజ్ఞరక్షణకు బద్ధకంకణులు కావటం అనూచానంగా వస్తున్న ఆచారమే...

దుష్యం : మీరు ముందు నడవండి... నేనూ మీవెంటే వస్తాను...

ఇద్దరూ : జయీభవ!... (నిష్క్రమిస్తారు)

దుష్యం : వయస్యా!... నీకు శకుంతలను చూడాలనిపించేటం లేదూ?...

విదూ : ఇంతవఱకా కోరిక వరదలా ఉండేది... ఇప్పుడు రాక్షసుల మాట వినటంతో ఒక్కచుక్కైనా మిగల్లేదు...

దుష్యం : భయపడకు... నువ్వు నా ప్రక్కనే ఉంటావు కదా!...



దౌవా : మహారాజా! జయం!...జయం!... రథం సిద్ధంగా ఉంది... కరభకుడనే దూత తమ మాతృమూర్తి ఆజ్ఞను తెచ్చి వేచి ఉన్నాడు.

రాజు : మా అమ్మగారి ఆదేశమా!...

దౌహి : అవును ప్రభూ!...

రాజు : వెంటనే ప్రవేశపెట్టు... (దౌవారికుడు వెళ్ళి దూతతో ప్రవేశిస్తాడు)

కరభకుడు : మహారాజులకు జయం!... జయం!... నేటికి నాల్గవదినం రాజమాత ఉపవాసదీక్ష పూర్తై పారణచేస్తారట!... ఆనాటికి తమరు రాజధాని చేరాలని ఆమె ఆజ్ఞ!...

దుష్యం : ఇటు తపస్వుల కార్యం, అటు మాతృదేవి ఆజ్ఞ... రెండూ జేవదాటరానివే!... ఇప్పుడేవిఁటి కర్తవ్యం?...

విదూ : త్రిశంకువు వలె అంతరిక్షంలోనే ఉండిపో!...

దుష్యం : పరిహాసాలు చాల్లే!... నిజంగానే సందిగ్ధావస్థలో ఉన్నాను... (ఆలోచించి) ఆఁ!... వయస్యా!... మా అమ్మగారు నిన్ను తన పుత్రునిగానే సంభావిస్తున్నారు కదా!... కనుక నువ్వు రాజధానికి వెళ్ళి నేనిలా తపస్వుల కార్యంలో నిమగ్నమై ఉన్నానని చెప్పి నాబదులుగా పుత్రకార్యాన్ని అనుష్ఠించు...

విదూ : నేను రాక్షసులకు భయపడిపోతున్నానుకోవు కదా!...

దుష్యం : మహాబ్రాహ్మణా!..నీగుఱించి నేనలా ఎందుకనుకొంటాను?

విదూ : అయితే రాజుగారి తమ్ముడు వెళ్ళినట్లు సమస్త లాంఛనాలతో వెడతాను...

దుష్యం : ఆశ్రమ ప్రశాంతతకు భంగం కాని విధంగా నా సహచరులంతా నీతోనే వస్తారు...

విదూ : అయితే నేనిప్పుడు యువరాజునైనానన్నమాట!...

దుష్యం : (తనలో) ఈ బ్రహ్మచారసలే చపలుడు... పొరపాటున నాప్రేమ సంగతి అంతఃపురంలో ఎక్కడ ఊదుతాడో!... (విదూషకుని చేయిపట్టుకొని పైకి) వయస్యా!... కణ్వమహర్షిపై భక్తితోనే నేనీ ఆశ్రమంలో ఉంటున్నా!... శకుంతలపై నా ప్రేమ నిజం కాదు సుమా!... చూడు, మనమెక్కడ? ప్రేమవాసనైనా లేక లేళ్ళతో పెరిగే ఆ ఆశ్రమ వనితలెక్కడ? ఊరికే పరిహాసానికన్న మాటలు పరమార్థంగా భావించేకు సుమా!...

విదూ : అలాగే!... (అంతా నిష్క్రమిస్తారు)

★★★



## మూడవ అంకం

దుష్యం : శకుంతల తపస్వి కుమార్తె, పరాధీనురాలనీ తెలిసినా ఆమె నుంచి నా హృదయం మళ్ళించుకోలేకపోతున్నా... యజ్ఞపరిసమాప్తితో సదస్యుల అనుమతి తీసికొని బయలుదేరేను... బాగా అలిసిపోయిన నాకు విశ్రాంతి కావాలి... (నిట్టూర్చి) ప్రియురాలి సందర్శనాన్ని మించిన విశ్రాంతి ఎక్కడుంటుంది?... ఆహా!... ఎంత చేక్కని గాలి!... ఈ లతామంటపం ఎంతో హాయిగా ఉంది.... బహుశః శకుంతల ఇక్కడే ఉండి ఉండవచ్చు... (చూచి) నాకళ్ళిప్పటికి చరితార్థమైనాయి. శకుంతల సఖీ జనంతో ఏదో మాట్లాడుతోంది... ఇక్కడే ప్రచ్ఛన్నంగా ఉండి వింటాను.

అన : సఖీ!... శకుంతలా!.. ఈ తామరాకుల గాలి నీకు సుఖంగా ఉందా?

శకుం : ఏవిఁటీ!... మీరు తామరాకులతో విసురుతున్నారా?...

(అనసూయా ప్రియంవదలు విషాదంతో ఒకరిముఖం ఒకరు చూచుకొంటారు)

దుష్యం : శకుంతల అస్వస్థురాలిగా కనిపిస్తోంది...

ప్రియం : అనసూయా!... ఆ రాజర్షిని చూసిం దగ్గర్నుంచీ శకుంతల అన్యమనస్కంగా ఉంటోంది... ఈమె పరితాపానికి అతడే కారణమనుకొంటాను...

అన : నా అనుమానం కూడా అదే!...

ప్రియం : శకుంతలా!... నిన్నొకటి అడగాలనుకొంటున్నాం!...

శకుం : ఏవిఁటే?...

అన : మనమధ్య రహస్యాలంటూ ఏమీ లేవుగా!... ఇతిహాసాల్లో, కథల్లో ప్రణయదశ ఎలా ఉంటుందో అటువంటిది నీలో

మాకు కనిపిస్తోంది... నీ ఈ అస్వస్థతకు కారణం ఏవిటో చెప్పు!...

దుష్యం : (తనలో) అనసూయకూడా నాలాగే ఆలోచించింది!...

ప్రియం : అనసూయ బాగా చెప్పింది... దినదినం ఎంతగా చిక్కిపోతున్నావో తెలుసా? విషయం ఏవిటో దాపరికం లేకుండా మాకైనా చెప్పవే?...

శకుం : మీతోకాకపోతే ఇంకెవరితో చెప్పుకుంటానే?!...

అన : కష్టం, సుఖం అయినవాళ్ళతో చెప్పుకుంటే కాస్త ఊఱట!... చెప్పవే!...

దుష్యం : ఆమె మాటలు వినాలని నా చెవులు ఆరాటంతో ఆగలేక పోతున్నాయి.

శకుం : (సిగ్గుతో) తపోవన రక్షకుడైన రాజర్షి పై అభిలాషతో నేనిలా అయిపోయాను...

దుష్యం : (సంతోషంతో) వినవలసింది విన్నాను...

శకుం : కనుక దయతో నాకా రాజర్షి దర్శనం కలిగేలా చూడండి.... లేకపోతే ఇక నాకు నీళ్ళు ఒదులుకోండి...

దుష్యం : నిస్సంశయమైన మాట!...

ప్రియం : అనసూయా!... శకుంతల ప్రేమ ఉద్దోలమైంది... ఈమెకు ప్రేమాస్పదుడైనవాడు పౌరవవంశతిలకుడు కనుక అభినందించేదగిందే!...

అన : మనసఖి ఇష్టసిద్ధికిప్పుడు రహస్యంగా ఉపాయం ఆలోచించాలి....

ప్రియం : ఆ రాజర్షి సైతం ఈమెపై తన అభిలాషను సూచించాడు... (ఆలోచించి) సఖీ!... అతనికో ప్రేమలేఖ వ్రాయి... దాన్ని పువ్వుల్లో పెట్టి దేవతా ప్రసాదం అనే వంకతో ఆయనకిస్తాను...



అన : నీ ఆలోచన నాకు నచ్చింది..శకుంతలా!.. నువ్వేమంటావ్?

శకుం : మీ ఆనతి మీఱగలనా?...

ప్రియం : అయితే నువ్వేమనుకొంటున్నావో చక్కని పదాల్లో ఎలాకూర్చాలో ఆలోచించు...

శకుం : అలాగే కానీ, నా లేఖను ఆయన తిరస్కరిస్తాడేమోనని నా హృదయం వణికిపోతోంది...

దుష్యం : (తనలో) నిన్ను కలవాలని నాలో ఉత్సాహం ఉరకలు వేస్తుంటే నువ్వు నేను తిరస్కరిస్తానేమోనని భయ పడుతున్నావు... ఎవరైనా సంపదల నభిలషిస్తే వారికి ప్రాప్తించేవచ్చు లేదా ప్రాప్తించేకపోవచ్చు... కానీ సంపదలే కోరుకొంటే దొరకని వాడెవడుంటాడు?....

శకుం : నన్ను ప్రేమలేఖ వ్రాయుమని మీరాదేశించారు... కానీ వ్రాతపరికరాలేవే!...

ప్రియం : మృదువుగా ఉన్న ఈ తామరాకుమీద నీగోటితో అక్షరాలు కూర్చు....

శకుం : (వ్రాసి) చూడండే.. ఇదెలా ఉందో?...

ప్రియం : చేదవ్వే!...

శకుం : దయారహితుడా!... నీమనసు నాకు తెలియదు... రాత్రింబగళ్లు నీ వియోగవ్యథ నన్ను తపింపజేస్తోంది... నా సర్వాంగాలూ నీపట్ల గాఢవాంఛతో ఉన్నాయి.

దుష్యం : (వేగంగా సమీపించి) సుందరీ!... మదనుడు నీకు తాపాన్నే కలుగజేస్తుంటే... నన్నుమాత్రం దహించేస్తున్నాడు...

సఖులు : త్వరితంగా ఫలించిన కోర్కెకు స్వాగతం!...

దుష్యం : (లేవబోయిన శకుంతలను వారిస్తూ) ఆఁ!... ఆఁ!... లేవకు...

అన : తమరూ ఈ శిలాఫలకంపై కూర్చోండి.... (దుష్యంతుడు కూర్చుంటాడు, శకుంతల సిగ్గుతో నిల్చుని ఉంటుంది)

ప్రియం : వయస్యా! మీ పరస్పరానురాగం కనిపిస్తూనే ఉంది... అయినా ఒక్క విషయం...

దుష్యం : తప్పకుండా చెప్పండి....

ప్రియం : మా సఖికి ఈ స్థితి మీవల్ల కలిగింది కనుక ఈమె జీవితానికి ఆధారభూతులై ఉండటం మీ బాధ్యత!

దుష్యం : ధన్యుణ్ణి!

శకుం : (ప్రియంవదను చూసి) ఇప్పటికే అంతఃపుర జన వియోగంతో ఉన్న రాజర్షిని ఇంకా ఇక్కడ నిలుపటం భావ్యం కాదేమో!

దుష్యం : ఇతర చింతలు లేక నీపట్లే ఆసక్తమైన నామనస్సును నీమాటలతో ఇంకా బాధపెట్టకు!...

అన : అయ్యా!.. ప్రభువులు బహుభార్యాసక్తులని వింటుంటాం... అందువల్ల మా సఖి బంధువుల సానుభూతికి పాత్రురాలు కాకుండా మీరు చూచుకోవాలి...

దుష్యం : వట్టిమాటలెందుకు? మాకెందఱో భార్యలున్నా మావంశప్రతిష్ఠకు మూలకారకులిద్దఱే... సముద్ర పర్యంతమైన భూమి, మీ ప్రియసఖి శకుంతల....

ఇద్దఱూ : చాలా సంతోషం...

ప్రియం : అనసూయా!... ఈ లేడిపిల్ల తల్లిని వెతుక్కుంటూ తిరుగుతున్నట్లుంది!... దీన్ని తల్లివద్దకు తీసుకెడదాం... రావే!... (ఇద్దఱూ బయలుదేరుతారు)

శకుం : మీరిద్దఱూ వెళ్ళిపోతే నాకు తోడెవరే!...

ఇద్దఱూ : (నవ్వుతూ) సర్వభూతలరక్షకుడే నీవద్ద ఉన్నాడు కదా! (నిష్క్రమిస్తారు)



శకుం : అయ్యో!.... వెళ్ళిపోయారు!...

దుష్యం : చింతించేకు.... నిన్నారాధిస్తున్న నేను నీ చెంతే ఉన్నాగా!... ఈ తామరాకులతో విసరనా?... నీపాదాల్ని నాఒళ్ళో పెట్టుకొని ఒత్తనా?...

శకుం : అయ్యో!... మాన్యులైన మీరు నాకు సేవలు చేయటమా?... (లేచి వెళ్ళబోతుంది)

దుష్యం : సుందరీ!... ఎండ ఇంకా తగ్గలేదు... సుకుమారివైన నువ్విప్పుడు వెళ్ళటం ఎందుకు?

(ఆమెను వెనక్కి లాగుతాడు)

శకుం : మన్నించేండి మహారాజా!... ప్రేమ వివశనైనా స్వతంత్రు రాల్నికాను...

దుష్యం : పితృపాదులేమంటారోనని భయపడకు... ఆయన నిన్ను దోషిగా ఎంచేరనే నా విశ్వాసం... చూడు!... రాజర్షికన్యలు గాంధర్వవివాహం చేసికోగా తండ్రులు అభినందించారని కూడా వింటూ ఉంటాం....

శకుం : ఆర్యా!... నన్ను వదలండి... సఖులు వస్తారేమో!...

దుష్యం : వదులుతాలే!...

శకుం : ఎప్పుడు?

దుష్యం : అదిగో ఆ తుమ్మెద నవవికసిత కుసుమంలో మధువు నాస్వాదిస్తున్నట్లు నీ అధరసుధల్ని అందుకొని... (శకుంతల ముఖాన్ని పైకెత్తుతాడు – శకుంతల వారిస్తుంది)

**– నేపథ్యంలో –**

("అమ్మా! ఇటు... ఇటు...") అనే మాటలు..

శకుం : (కంగారుగా) అమ్మో!... నా ఆరోగ్యం కనుక్కోవటానికి ఆర్య గౌతమి ఇటే వస్తోంది.... కనుక అందాకా మీరా

చెట్ల వెనుక దాక్కోండి... (దుష్యంతుడు చెట్లవెనక్కి వెడతాడు. తాపసి ఇద్దఱు సఖులతో ప్రవేశిస్తుంది)

గౌతమి : అమ్మా!.. శకుంతలా!... ఇప్పుడు నీ ఒంట్లో ఎలా ఉంది?...

శకుం : కాస్త నయం!...

గౌతమి : ఇదిగో ఈ మంత్రజలంతో నీకు పూర్తిగా తగ్గిపోతుంది. (నెత్తిన నీళ్ళు చల్లుతుంది) సాయంత్రమైంది... ఇక పర్ణశాలకు వెడదాం రా!...

శకుం : (తనలో) మనసా!... నీ మనోరథం సిద్ధించినా భయం నిన్నింకా వీడలేదు... ప్రియుని మళ్ళీ కలుసుకొనే శుభఘడియలెప్పుడో (పైకి) నా సంతాపాన్ని పోగొట్టిన లతావలయమా! తిరిగి నీ సమాగమానికై త్వరలోనే వస్తాను (దిగులుగా వెడుతుంది)

దుష్యం : (శకుంతలను కలిసిన ప్రదేశం చేరి నిట్టూరుస్తూ) హుఁ!... మనోరథానికి విఘ్నం కలిగింది.... ఇప్పుడేం చెయ్యను... కాస్సేపు ఆమె స్పర్శతో పవిత్రమైన ఈ తిన్నెపైనే కూర్చుంటాను.

**– నేపథ్యంలో–**

ఒక కంఠం : రాజా!... సాయంత్రం వేళ యజ్ఞం జరుగుతూ ఉంటే విఘ్నకారులైన రాక్షసుల నీడలు గోచరిస్తున్నాయి...

దుష్యం : ఇదుగో వస్తున్నా!... (నిష్క్రమిస్తాడు)

★ ★ ★



## నాల్గవఅంకం

(అనసూయా ప్రియంవదలు పూలు కోస్తుంటారు)

– నేపథ్యంలో – నేను!... నేను వచ్చాను...

అన : ఎవరో అతిథులు వచ్చినట్లుంది...

ప్రియం : ఆశ్రమంలో శకుంతల ఉందిగా!...

అన : కానీ ఉంది అన్యమనస్కంగా కదా!...

ప్రియం : సర్లే... ఈ కోసిన పూలు చాల్లే (బయలుదేరుతుంది)

– నేపథ్యంలో – (క్రోధంతో)

ఆః!... అతిథులంటే అంత నిర్లక్ష్యమా!... అన్యమనస్కవై తపోనిధి అయిన నన్నే గుర్తించేక ఎవరి గుఱించి ఆలోచిస్తున్నావో వాడు మత్తులో ఉన్నవాడు తన మాటను తానే మఱచినట్లుగా మఱచిపోవుగాక...! నువ్వెంత గుర్తుచేసినా గుర్తించేకుండుగాక!...

అన : అయ్యో!... అయ్యో!... నేననుకున్నంతా అయింది!.... పరధ్యానంగా ఉన్న శకుంతల ఎవరో పూజ్యునిపట్ల అపరాధం చేసినట్లుంది!.. (అటుచూసి) ఎవరో కాదు!... మహాకోపిష్ఠి దుర్వాసమహర్షి! అలా శపించి ఎంత వేగంగా వచ్చాడో అంతవేగంతోనే వెనుతిరిగి పోతున్నాడు... నువ్వెళ్ళి ఆయన కాళ్ళపై పడి వెనక్కి తీసుకురా!... ఈలోగా అర్ఘ్యాన్ని తీసికొని నీ అడుగుల్లోనే నేనూ వస్తా!...

ప్రియం : అలాగే! (నిష్క్రమిస్తుంది)

అన : అయ్యో!... తొందరలో చేతిలో పూలబుట్ట జారిపడిందే! (పూలనేరుతున్నట్లభినయిస్తుంది)

ప్రియం : (తిరిగివచ్చి) సహజంగా వక్రబుద్ధి ఎవరిమాట వింటాడు?... అయినా కాస్త దయ తలిచాడు...

అన : అతని కాకాస్త దయే ఎంతో గొప్ప!... ఏమైందో చెప్పు...

ప్రియం : నేనెంత ప్రార్థించినా పట్టించుకోకపోతే చివరికిలా అన్నాను...

అన : ఏవఁన్నావ్?

ప్రియం : భగవన్!... శకుంతలకు తమపై ఉన్న పూర్వభక్తిని తలచి మీ కూతురువంటి దాని ఈ ఒక్క అపరాధాన్నీ క్షమించేండని...

అన : అంటే ఏవఁన్నాడాయన?...

ప్రియం : అప్పుడాయన "నామాటకి తిరుగులేదు, కానీ గుర్తుగా ఇచ్చిన ఏ ఆభరణాన్నైనా అతడు చూస్తే శాపం తొలగి పోతుంద"ంటూ మాటతోనే మాయమైనాడు...

అన : హమ్మయ్య!... ఇప్పటికి కాస్త ఊఱట!... మహారాజు రాజధానికి వెడుతూ తన పేరు చెక్కిన ఉంగరాన్ని శకుంతల వ్రేలికి తొడిగేడు... కనుక శాపావసానం ఆమె చేతుల్లోనే ఉంది...

ప్రియం : రా!... పూజ పూర్తిచేద్దాం... అదిగోచూడూ! శకుంతలను చూస్తుంటే జాలి, దుఃఖం పొంగుకొస్తోంది!... ముఖాన్ని అరచేత్తో పెట్టుకొని ఎలా బొమ్మ కట్టుకుపోయినట్లుందో!... భర్తపై ధ్యాసతో తనను తానే మఱచిపోతే అతిథిని పట్టించుకోకపోవటంలో ఆశ్చర్యమేముంది?

అన : ప్రియంవదా!... ఒక్కమాట!... ఈ సంగతి మనలోనే ఉండాలి సుమా!... సుకుమారి అయిన దానికి తెలిస్తే బెంబేలెత్తి పోతుంది....

ప్రియం : అది నువ్వు వేఱే చెప్పాలా?...(నిష్క్రమిస్తారు)

శిష్యుడు : (ప్రవేశించి) సోమతీర్థం నుంచి తిరిగి వచ్చిన గురుపాదులు రాత్రి ఇంకెంతుందో చూసి రమ్మన్నారు... (రెండడుగులు వేసి) అరె!... తెల్లారిపోయిందే!... హోమానికి వేళయింది... గురువుగారికి తెలిపి వస్తాను... (నిష్క్రమిస్తాడు)



అన : (ప్రవేశించి) అంతటి రాజర్షి శకుంతల కింతటి అన్యాయం చేస్తాడని కల్లోకూడా అనుకోలేదు... అనుకొంటేమాత్రం నే చెయ్యగలిగిందేముంది?... అంత తియ్యగా మాట్లాడి ఇన్నాళ్ళైనా ఇంతవఱకు కనీసం లేఖనైనా పంపడా?... సోమతీర్థం నుంచి తిరిగివచ్చిన కణ్వమహర్షికి శకుంతలను దుష్యంతుడు గాంధర్వ వివాహం చేసికొన్నట్లు, ఆమె గర్భవతి అయిన సంగతి మహర్షికి ఎలా చెప్పటం?... ఏం చేయాలో పాలుపోవటం లేదు...

ప్రియం : (ప్రవేశించి సంతోషంగా) అనసూయా!... తొందరగారా!... శకుంతలను అత్తవారింటికి పంపటానికి ఏర్పాట్లు చేయాలి...

అన : అదేవిఁటి?...

ప్రియం : రాత్రి సుఖంగా నిద్రపట్టిందా అని అడగటానికి ప్రొద్దున్నే శకుంతలదగ్గఱకు వెళ్ళేను... అప్పుడు...

అన : అప్పుడు?...

ప్రియం : సిగ్గుతో తల వంచుకొన్న శకుంతలను అక్కున చేర్చుకొన్న కణ్వమునీంద్రులు...

అన : ఏవఁన్నారు?

ప్రియం : అమ్మా!... పొగవల్ల కళ్ళు కనిపించేకపోయినా అదృష్టంకొద్దీ ఆహుతి అగ్నిలోనే పడ్డట్లు, మంచి శిష్యునికి అర్పించిన విద్యలా జరిగింది – నాకు సంతోషాన్నే కలిగించింది. నీ భర్త రాజర్షి దుష్యంతునివద్దకు నిన్నీనాడే పంపుతాను...

అన : ఈ విషయం ఆయనకెలా తెలిసిందో!...

ప్రియం : అగ్నిహోత్ర గృహంలో ప్రవేశించిన మహర్షికి ఆకాశవాణి వినిపించిందట!...

అన : (కౌగిలించుకొని) ఎంత సంతోషకరమైన వార్త!.. అయినా ఇవాళే శకుంతల మనల్ని విడిచివెడుతోందంటే ఎంత దిగులుగా ఉందో తెలుసా?

ప్రియం : చెలీ!... మన దిగుల్ని మనం ఎలాగో సర్దుకోవచ్చు... శకుంతలనైనా సుఖపడనీవే!...

అన : ఈ పూలమాలని తీసికెళ్ళి దానికివ్వు... నేను గోరోచనం, తీర్థమృత్తిక, గరిక వంటి పూజాద్రవ్యాలు తీసికొనివస్తాను...

– నేపథ్యంలో –

గౌతమీ!... శకుంతలను దిగబెట్టి రావటానికి శార్ఙ్గరవ శారద్వతుల్ని పిలు...

ప్రియం : అనసూయా!... త్వరగా కానీ... హస్తినాపురానికి వెళ్ళటానికి ఋషులు పిలుస్తున్నారు....

అన : రావే... బయలుదేరుదాం...

ప్రియం : అభ్యంగస్నానం చేసి, అక్షతలను పట్టుకొని శకుంతల అక్కడుంది..ఋషులు స్వస్తి వచనాలతో అభినందిస్తున్నారు... త్వరగా వెడదాం రా!

ఒక స్త్రీ : అమ్మా!... 'మహాదేవి' బిరుదాన్ని పొందు...

ఇంకో స్త్రీ : వీరమాతవై శోభించేమ్మా!...

వేఱొక స్త్రీ : నీ భర్త అపూర్వ గౌరవాభిమానాల్ని పొందమ్మా! (ముగ్గురి నిష్క్రమణ)

ప్రియం, అన : మేమిద్దఱం నిన్నలంకరించేటానికి వచ్చాం... సిద్ధంగా ఉన్నావుగా...!

శకుం : (కన్నీటితో) ఇక ముందు మీరు నన్నలంకరించే భాగ్యానికి నోచుకోను కదా!...

ఇద్దఱు : సఖీ!... ఈ శుభసమయంలో కంటతడి పెట్టకూడదమ్మా!...



ప్రియం : అనర్ఘాభరణాల కర్హమైన నిన్ను సాధారణంగా అలంకరిస్తున్నాం...

ఋషికుమారులు : (ప్రవేశించి) ఇవిగో ఆభరణాలు!..వీటితో అలంకరించేండి...

గౌతమి : నాయనా!... ఇవెక్కడివి?...

ఋషికుమారుడు1 : కణ్వమహర్షి ప్రభావం!...

గౌతమి : తపశ్శక్తితో సృష్టించారా?

ఋషి కు 2 : కాదు... శకుంతలకోసం వనస్పతులనుంచి పూలను తీసికొని రమ్మని ఆ మహాత్ముడు మమ్మల్ని ఆదేశించారు. ఆ తరువాత...

గౌతమి : తరువాత?...

ఋషికు 1 : ఆ తరువాత ఒక వృక్షం తెల్లని పట్టుచీరను, ఇంకొకటి కాళ్ళకలంకరించే లాక్షారసాన్నీ, వనదేవత లీ ఆభరణాల్నీ ప్రసాదించారు...

ప్రియం : ఇవన్నీ రేపు నువ్వక్కడ భర్తవద్ద అనుభవించేబోయే భోగాలకు శుభసూచకాలు... (శకుంతల సిగ్గుపడుతుంది)

అన : ఆశ్రమవాసులమైన మాకీఆభరణాల్ని ఎలా అలంకరిం చాలో తెలియదు. అయినా చిత్రాల్లో చూచినట్లు వీటిని నీకలంకరిస్తాం....

శకుంతల : మీ నైపుణ్యం నేనెఱుగనా?...

కాశ్యపుడు (కణ్వుడు) : (ప్రవేశించి) శకుంతల అత్తవారింటికి వెడుతోందనే ఊహే నన్ను ఉత్కంఠాపూరితుణ్ణి చేస్తోంది... కంఠం రుద్ధమైంది. చూపు మసకబారింది... సర్వసంగపరిత్యాగి నైన నాకే ఇలా ఉంటే గృహస్థులకిటువంటి సమయాల్లో ఇంకెంత దిగులుగా ఉంటుందో కదా!... (ముందుకు నడుస్తాడు)

గౌతమి : అమ్మా!... తండ్రిగారు కణ్వమహర్షి ఆనందబాష్పాలతో నిన్ను సాగనంపటానికిటే వస్తున్నట్లుంది... (శకుంతల కణ్వునికి పాదాభివందనం చేస్తుంది)

కణ్వ : అమ్మా!... యయాతికి శర్మిష్ఠలా నీ భర్తకు ప్రేమాస్పదురాలివి కా... చక్రవర్తికాగల కుమారుణ్ణి పొందు...

గౌతమి : భగవన్!... ఇవి వరాలేకానీ ఆశీస్సులు కావు...

కణ్వ : తల్లీ!... శకుంతలా!... ఇలారా!.. ఈ త్రేతాగ్నులకు ప్రదక్షిణించి నమస్కరించు... ఈ అగ్నిహోత్రుడే నీకు రక్ష.. (అందఱూ ప్రదక్షిణ చేసి నమస్కరిస్తారు) ఇక బయలుదేరు... ఆc!... శార్ఙ్గరవ శారద్వతులేరీ!

ఇద్దఱు : భగవన్!... ఇక్కడే ఉన్నాం!...

కణ్వ : మీ సోదరికి మార్గోపదేష్టలు కండి...

శార్ఙ్గరవుడు : అమ్మా!... ఇటు... ఇటు... (శకుంతల మెల్లగా నడుస్తుంది)

కణ్వ : ఓ ఆశ్రమ వృక్షాల్లారా!... ఎవతె మీకు నీరు పోయకుండా తాను నీరు త్రాగేదికాదో, అలంకరణపై ప్రీతిఉన్నా మీకు బాధ కలుగుతుందని మీ చిగురాకుల్ని కోసేదికాదో, మీకు పూలు పూసినప్పుడు తానెంతగా ఆనందించేదో ఆ శకుంతలిప్పుడత్తవారింటికి బయలుదేరుతోంది... అనుమతించేండి... (కోకిల కూత) మధురమైన ఆ కోకిలారావమే శకుంతలకు అనుమతి!...

గౌతమి : అమ్మా!... ఈ వనదేవతలకు నమస్కరించు!...

శకుంత : (నమస్కరించి జనాంతికంగా) సఖీ!.. ప్రియంవదా!... ఆర్యపుత్రుని చూడాలనే ఆకాంక్ష అధికంగానే ఉన్నా ఆశ్రమాన్ని వదిలిపోవటానికి అడుగు పడటంలేదే!... సఖులారా!... నేనెంతో ప్రేమతో పెంచిన ఈ వనజ్యోత్స్నను మీ చేతుల్లో పెడుతున్నానే!...



ఇద్దఱు : మరి మమ్మల్నెవరి చేతిలో పెడుతున్నావ్? (దుఃఖిస్తారు)

కణ్వ : ప్రియంవదా, అనసూయా! శకుంతలను ఓదార్చవలసింది పోయి మీరే దుఃఖిస్తే ఎలాగమ్మా?...

శార్ఙ్గ : గురువర్యా! ఆప్తులైనవారిని జలాశయం వఱకే అనుసరించి వెళ్ళాలంటారు కదా!... ఇదిగో సరస్తీరాన్ని చేరాం... కనుక మీరు చెప్పదగింది చెప్పి వెనక్కి మరలటం భావ్యమను కొంటాను...

కణ్వుడు : (తనలో) మాన్యుడైన దుష్యంతునికి పంపదగిన సందేశం? శార్ఙ్గరవా! శకుంతలను ముందుంచుకొని దుష్యంతునికి నా మాటగా చెప్పు...

శార్ఙ్గ : ఆదేశించండి గురువర్యా!...

కణ్వుడు : తపస్వులమైన మమ్మల్నీ మీ వంశగౌరవాన్నీ సంభావించు... బంధుజన ప్రమేయం లేకుండా శకుంతలతో నువ్వు నెఱపిన స్నేహాన్ని భావించు... నీ భార్యల్లో ఒక భార్యగా ఈమెకు గౌరవస్థానాన్ని కల్పించు... అంతకు మించిన భాగ్యం అమె అదృష్టం...కన్యాబంధువులమైన మేం చెప్పదగిందికాదు...

శార్ఙ్గ : చిత్తం గురువర్యా!

కణ్వు : అమ్మా!... ఇప్పుడు నీకు చెప్పవలసింది కొంచెం ఉంది. ఎంత అరణ్యవాసులమైనా మేమూ లోకజ్ఞులమే...

శార్ఙ్గరవ : ధీమంతులకు తెలియనిదేముంటుంది?

కణ్వుడు : నువ్వు నీ భర్త ఇంటికి చేరిన తర్వాత పెద్దలను సేవించు, సవతులపట్ల స్నేహాన్ని పాటించు... ఒకవేళ ఎప్పుడైనా భర్త నిన్ను కోపించినా రోషంతో అతనికి వ్యతిరిక్తంగా నడుచుకోకేం!.. పరిజనం పట్ల సమానభావంతో వ్యవహరించు... భాగ్యవశంవల్ల గర్విష్ఠివి కాకు... ఈ ప్రవర్తన కలవారు ఉత్తమ గృహిణులనదగి ఉంటారు. అలా

కాని నాడు అయినవారి ఆత్మక్షోభకు కారకులౌతారు... ఏమంటావు గౌతమీ!...

గౌతమి : అత్తవారింటికి పంపే పెళ్ళి కూతురికి ఎవరైనా చెప్పవలసిందిదే... శకుంతలా!... నాన్నగారి మాటలను బాగా జ్ఞాపకం ఉంచుకో...

కణ్వ : అమ్మా! నీ సఖులను కౌగిలించుకో...

శకుం : తండ్రీ! ప్రియంవదా, అనసూయలు ఇక్కడే ఉంటారా?.. నాతో రారా?..

కణ్వ : వీళ్ళు నీతో రాకూడదమ్మా!.. .వీరిని కూడ ఒక అయ్య చేతిలో పెట్టాలిగా... నీతో గౌతమి వస్తుంది...

శకుంతల : ఇంతవఱకు మీ అందఱితో ఉండి ఇకముందు ఒక్కతెనీ ఆ కొత్తచోట ఎలా ఉంటాను? (దుఃఖిస్తుంది)

కణ్వ : ఎందుకంత బేలతనం?.. కులీనుడైన నీ భర్తకు సహధర్మచారిణివై అతనికి ప్రశంసా పాత్రురాలవై గృహకృత్యాలతో క్షణం తీరికలేక త్వరలోనే సత్పుత్రుని పొందటంతో మా వియోగ దుఃఖం నిన్నంతగా బాధించేదు... (శకుంతల తండ్రికి పాదాభివందనం చేస్తుంది)

కణ్వ : మనోవాంఛాఫలసిద్ధిరస్తు... (శకుంతల ఇద్దఱు సఖుల్నీ కౌగిలించుకొంటుంది అనసూయా ప్రియంవదలు కూడా శకుంతలను కౌగిలించుకొంటారు).

అన : సఖీ!... ఒకవేళ ఆ రాజర్షి నిన్ను గుర్తించేటంలో జాప్యం జేరిగితే ఆయనపేరు చెక్కిన ఉంగరాన్ని చూపించు!...

శకుంతల : ఈ అనుమానంతో నాకు వణుకు పుట్టుకొస్తోంది...

ప్రియం : భయపడకు... అతిస్నేహంవల్ల అనుమానాలెక్కువౌతాయి!...

శార్ఙ : పొద్దెక్కిపోతోంది... తొందరగా బయలుదేరాలి!..



శకుంతల : మళ్ళీ ఈ తపోవనాన్ని ఎప్పుడు చూస్తాను?

కణ్వ : చతుస్సముద్ర ముద్రిత ధరాతలాన్ని దుష్యంతుడు చిరకాలం పాలించి అప్రతిరథుడైన నీ కుమారునికి పట్టంకట్టి నీ భర్తతో ప్రశాంత జీవితం గడపటానికీ ఆశ్రమానికి వస్తావు...

గౌతమి : అమ్మా!... ముహూర్తం దాటిపోతోంది... తండ్రిగారిని మరలించు... లేకపోతే నీమీద వాత్సల్యంతో ఆయన ఎంతసేపైనా మాట్లాడుతూనే ఉంటారు... స్వామీ!.. మీరిక ఉండండి!...

శకుంతల : తండ్రీ!... వెళ్ళిరానా మఱి!...

కణ్వ : శుభం!.. శివా స్తే పంథాన స్సన్తు...

సఖులు : అయ్యో!... శకుంతల కనుమరుగై పోయింది!...

కణ్వ : మీ సఖి వెళ్ళక తప్పదుకదా!... మనస్సు చిక్కబట్టుకొని నన్ననుసరించేండి...

సఖులు : శకుంతల లేకుండా శూన్యంగా కనిపిస్తున్న ఈ ఆశ్రమాన్నెలా ప్రవేశించేలి?

కణ్వ : కన్య, ధనం – ఈ రెండూ పరులవే!... ఈమె నీనాడు పతివద్దకు పంపటంతో మనస్సెంత ప్రశాంతత నొందింది!... దాచిపెట్టిన సొమ్ము యజమానికప్పగించినంత హాయిగా ఉంది!...

★ ★ ★

## ఐదవఅంకం

= నేపథ్యంలో సన్నగా సితార్ వాద్య సంగీతం =

దుష్యం : రాత్రి హంసపదిక పాడిన గీతమే నన్ను వెంటాడుతోంది. ఇప్పుడు ప్రియా విరహం లేకపోయినా చెప్పలేని ఏదో ఉత్కంఠ నా మనస్సునంతా ఆవరించింది... ఎందుకీ స్థితి కలుగుతోందో తెలియటం లేదు...

సుందర దృశ్యాల్ని చూసినా మధుర శబ్దాలువిన్నా సుఖంగా ఉన్నవారు కూడా ఇదమిత్థంగా నిర్ణయించేలేని ఆరాటం పొందుతూ ఉంటారు... గాఢమైన పూర్వజన్మ స్మృతులేవో మనఃఫలకంపై తారాడుతూ ఉంటాయి.

కంచుకి : దేవరకు జయం... హిమవత్పర్వత అరణ్యవాసులైన తాపసులు కణ్వ మునీంద్రుని సందేశంతో స్త్రీలతో వచ్చి మీ దర్శనాన్ని కోరుతున్నారు ప్రభూ!...

దుష్యం : వారిని విధ్యుక్తంగా సత్కరించి, కూడా తీసికొనిరమ్మని ఉపాధ్యాయులు సోమరాతునికి నామాటగా చెప్పు...

కంచుకి : చిత్తం.... (నిష్క్రమిస్తాడు)

దుష్యం : (లేచి) ఎవరక్కడ?

ప్రతీ : చిత్తం ప్రభూ!...

దుష్యం : అగ్నిహోత్రగృహానికి దారిచూపు....

ప్రతీ : రండి ప్రభూ!... ఇటు... ఇటు...

దుష్యం : అనుకొన్నకోర్కెలు సిద్ధిస్తే అందఱికీ ఆనందమేకాని రాజులకు మాత్రం కాదు... రాజ్యం ప్రాప్తించిన తరువాత దాని రక్షణ అంతకంటె కష్టమైంది... రాజ్యం చేత్తోపట్టుకొన్న గొడుగుకఱ్ఱలా ఆట్టే శ్రమను కలిగించేకపోయినా శాంతిని ప్రసాదించేది కాదు...



(కంచుకి శార్ఙ్గరవ, శారద్వత, గౌతమీ, శకుంతలలకు మార్గం చూపుతూ)

కంచుకి : ఆర్యులారా!... ఇటు... ఇటు...

శకుంత : నా కుడికన్నదురుతోంది!... ఏమౌతుందో ఏవిఁటో?!...

గౌతమి : అమంగళం ప్రతిహతమౌగాక!... నీ భర్త, కులదేవతలు నీకు శుభాన్ని చేకూర్తురుగాక!...

పురోహి : తపస్వులారా! ప్రభువులరుగో! మీ కోసమే నిరీక్షిస్తున్నారు... ప్రభూ!... వీరు తమ గురుపాదుల సందేశాన్ని తీసికొని వచ్చారు...

దుష్యం : నేను సావధానుణ్ణై ఉన్నాను.

ఋషులు (శార్ఙ్గరవ శారద్వతులు) : రాజా! స్వస్తి...

దుష్యం : పూజ్యులకభివాదాలు.. మీ తపశ్చర్యలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయికదా!...

ఋషులు : సదా నీ రక్షణలో ఉన్న మాకు విఘ్నాలెలా ఉంటాయి? సూర్యుడు ప్రకాశిస్తూ ఉంటే చీకట్లెలా వస్తాయి ప్రభూ!...

దుష్యం : భగవాన్ కాశ్యపులు కుశలులేకదా!...

శార్ఙ : సిద్ధులకు కుశలం స్వాధీనంగానే ఉంటుంది. వారు మీ కుశలమడిగి, మీతో చెప్పమన్నారు...

దుష్యం : పూజ్యుల ఆదేశం ఏవిఁటి?

శార్ఙ : నేను ఆశ్రమంలో లేనప్పుడు నాకుమార్తె, నీవు పరస్పర అంగీకారంతో వివాహం చేసికొన్నారని తెలిసి సంతోషించాను... ఎందుకంటే నువ్వు వరులలో అగ్రేసరుడవు... శకుంతల కూడా రూపొందిన పుణ్యరాశి...

ఇన్నాళ్ళకి బ్రహ్మ పొంతనలేనివారిని కూరుస్తాడనే నిందను పోగొట్టుకొన్నాడు... అందువల్ల గర్భవతి అయిన ఈమెను సహధర్మచారిణిగా స్వీకరించు,అని...

దుష్యం : ఏమంటున్నారు మీరు?!

శకుం : (తనలో) ఈయన మాటలు నిప్పుకణాల్లా ఉన్నాయి!...

శార్ఙ్గ : ఏమంటున్నారంటారేమిటి?... వివాహమైన స్త్రీ పతివ్రత అయినా, బంధువుల వద్ద ఉంటే లోకం తేలిగ్గా చూస్తుంది.. కనుక వివాహిత భర్తకు ఇష్టం ఉన్నా లేకపోయినా అతనివద్దే ఉండాలనుకుంటారు...

దుష్యం : ఏవిఁటీ!... నేనీమెను ఇంతకుముందు వివాహ మాడానా?...

శకుంతల : (తనలో) హతవిధీ!...

శార్ఙ్గ : రాజా!... మీ మాటలు ధర్మ వైముఖ్యంతోనా మమ్మలవమానించేటానికా?...

దుష్యం : ఏవిఁటా అసంబద్ధపు ప్రశ్నలు?...

శార్ఙ్గ : ఐశ్వర్యమదమత్తుల కిటువంటి వికారాలు మామూలే...

దుష్యం : ఏవిఁటంతటి నింద?...

గౌతమి : అమ్మా!... శకుంతలా!... నీ మేలిముసుగు కొద్దిగా తొలగిస్తా, సిగ్గు పడకు... అప్పుడు నీభర్త నిన్ను గుర్తుపట్టొచ్చు... (ముసుగు తొలగిస్తుంది)

దుష్యం : (తనలో) ఇంత అపురూప సౌందర్యవతి నా ఎదురుగా ఉంటే ఈమెను నేను స్వీకరించానా లేదా అని నిర్ణయించుకోలేకపోతున్నాను... ధర్మభీతితో నేనీమెను పరిగ్రహించేనూ లేను, చూస్తూచూస్తూ జారవిడుచుకోనూ లేను...



శార్ఙ్గ : ఏవిఁటా మౌనం?

దుష్యం : తపోధనా!... ఎంత ఆలోచించినా ఈమెను స్వీకరించినట్లే స్ఫురించేటం లేదు... గర్భవతి అయిన ఈమెకు నేనే భర్తనని ఎలా అంగీకరిస్తాను?...

శకుంతల : (తనలో) వివాహమే ఆయనకు సందేహాస్పదమైనప్పుడిక నా ఆశలన్నీ అడియాసలేగా!...

శార్ఙ్గ : చాలు చాలు... మీరు స్వీకరించిన ఈమెను మీ భార్యగా సమ్మతించిన కాశ్యపమునిని అనాలి.. తన ధనాన్నపహరించిన దొంగను ఆ ధనం స్వీకరించుమని ప్రాధేయపడ్డట్లుంది మునీంద్రుని చర్య...

శారద్వతుడు : శార్ఙ్గరవా!...ఇక ఆగు...అమ్మా!..శకుంతలా!... మేం చెప్పవలసింది చెప్పాం... ప్రభువు ధోరణి చూస్తున్నావుగా!... ఇక ఆయనకి సమాధానం చెప్పవలసింది నువ్వే!..

శకుంతల : (తనలో) ఆనాటి ప్రణయం నేడీ స్థితికి చేరినతర్వాత ఇంక ఏం చెప్పి ఏం ప్రయోజనం? (పైకి) ఆర్యపు... (సగంలోనే ఆపి) పాణిగ్రహణమే కాదంటున్నప్పుడిలా పిలువ కూడదు!... రాజేంద్రా!.. పూర్వం నువ్వు ఆశ్రమానికి వచ్చి అభం శుభం తెలియని నన్ను ఎన్నో ప్రమాణాలతో వంచించి ఇప్పుడిలా తిరస్కరించేటం న్యాయం కాదు...

దుష్యం : (చెవులు మూసికొని) శాంతం పాపం!... శాంతం పాపం!... మా వంశ ప్రతిష్ఠను మంటకలపాలని ఎందు కనుకొంటున్నావ్?...

శకుంతల : మీకింకా నేను పరస్త్రీననే అనుమానమే ఉంటే మీరిచ్చిన అభిజ్ఞానంతోనే ఆ అనుమానం తీరుస్తాను... ఇదిగో మీ పేరు చెక్కిన ఉంగరం!... (వ్రేలిని తాకి ఉంగరం లేకపోవటం చూచి) అయ్యో!... దైవమా!.. నా వ్రేలికి

ఉన్న ఉంగరం ఏదీ?... (దుఃఖంతో గౌతమివంక చూస్తుంది)

గౌతమి : శక్రావతారక్షేత్రంలో శచీతీర్థంలో స్నాతవై నమస్కరించినప్పుడు నీ వ్రేలినుండి జారిపోయి ఉంటుందనుకొంటా!...

దుష్యం : (నవ్వుతూ) స్త్రీలు సమయోచితంగా మాట్లాడటంలో ప్రగల్భలని ఇందుకే అంటారు!...

శకుంతల : ఇది విధివైపరీత్యం!... సరే మీకింకో సంగతి చెబుతా!...

దుష్యం : (అనాదరంగా) ఇంకేం వినాలి?... ఊఁ సరే... చెప్పు!...

శకుంతల : ఆనాడు మనం నవమాలికా మంటపంలో మీచేతిలో తామరాకు పాత్రలో నీళ్ళున్నాయికదా!...

దుష్యం : ఓ!... వింటున్నా...

శకుంతల : అప్పుడు నా పెంపుడు లేడిపిల్ల అక్కడికొచ్చింది.. దానికి మీరు నీళ్ళందిస్తే అది త్రాగలేదు... ఆ తర్వాత ఆ దొప్పను నేను తీసికొంటే నా దగ్గఱకొచ్చి నీళ్ళు త్రాగింది... "ఎవరికైనా తమజాతి వారంటేనే నమ్మకం, మేమిద్దఱం అరణ్యవాసులమేకదా అని మమ్మల్ని పరిహసించారు... గుర్తులేదా?...

దుష్యం : ఇటువంటి తియ్యనిమాటలు ఇంద్రియలోలుర్ని మురిపించి ఆకర్షిస్తాయి...

గౌతమి : మహాభాగా!... మీరిలా అనటం భావ్యంకాదు... పవిత్ర కణ్వాశ్రమంలో పెరిగిన ఈమెకు వంచన అంటే ఏమిటో తెలియదు...

దుష్యం : తాపసీ!... ఎటువంటిశిక్షణా లేని కోకిలలు కూడా తమ సంతానానికి రెక్కలు వచ్చి ఎగరగలిగేంత వఱకు



కాకిగూళ్ళలోనే పెంచుతున్నాయి. ఏ వివేకంలేని పక్షుల్లోనే అటువంటి సామర్థ్యం ఉన్నప్పుడు ఇక మానవ స్త్రీలకు మోసం చేయటంలో శిక్షణ ఎందుకు?

శకుంతల : (కోపంతో) దుష్టుడా!... తానెంతో జగమంత అనుకొనే రకం నువ్వు... ధర్మం ముసుగులో ఉన్న నీ నిజస్వరూపం ప్రపంచానికి ఎప్పుడు తెలుస్తుందో...

దుష్యం : (తనలో) ఈమె కోపం నన్ననుమానాస్పదుణ్ణిచేస్తూ వంచన ఏమీ లేనట్టే కనబడుతోంది... (పైకి) అమ్మా!... ఈ దుష్యంతుని స్వభావం లోకంలో ప్రసిద్ధమైంది... అయినా ఎంత దీర్ఘంగా ఆలోచించినా వివాహవృత్తాంతం అసలు ఊహకే అందటం లేదు...

శకుంతల : నన్ను స్వైరిణిగా భావిస్తున్నావు... పెదవులపై తేనె, హృదయంలో హాలాహలం ఉన్న నీ బారిన పడ్డాను...

శార్ఙ : అందుకే రహస్యంగా ఏర్పఱచుకొనే స్నేహాలెంతో ఆలోచించి చేయాలి. అంతరం తెలియని వారితో చేసే స్నేహం శత్రువై బాధిస్తుంది!... చేసుకొన్నవారికి చేసుకొన్నంత మహదేవ!... (రాజుతో) చేసిన పాపం ఊరికే పోదు....

దుష్యం : ఋషిపుత్రా!... ఆమె మాటల్నే నమ్మి నన్ను నిందించేటం తగదు...

శార్ఙ : పుట్టిందగ్గఱనుంచీ వంచనంటేనే ఏమిటో ఎఱుగని వారిమాటలు మీకు అసత్యాలుగాను, స్వార్థంకోసం ముఖప్రీతిగా మాట్లాడేవారి మాటలు పరమ ప్రమాణాలుగానూ కనిపిస్తాయి...

దుష్యం : ఓసత్యవాదీ!... కాసేపు మీరు చెప్పిందే నిజమనుకొందాం... ఈమెను మోసపుచ్చటం వల్ల మాకేం ప్రయోజనం?...

శార్ఙ్గ : అధోగతి!...

దుష్యం : పౌరవులు అధోగతిని కోరుతారంటే ఎవరూ విశ్వసించేరు...

శార్ఙ్గ : రాజా!... ఎందుకీ వృథా వాగ్వాదం?...మా గురుపాదుల ఆనతిని మేం నెరవేర్చాం... ఈమె నీ భార్య... స్వీకరిస్తావో, త్యజిస్తావో నీ ఇష్టం... గౌతమీ... పదండి పోదాం...

శకుంతల : పుట్టెడు దుఃఖంతో ఉన్న నన్ను మీరూ విడిచి వెళ్ళిపోతున్నారా?..

శార్ఙ్గ : శకుంతలా!... ఒకవేళ రాజుచెప్పిందే నిజమైతే నీతి తప్పిన నీతో కణ్వులకేం పని?... లేదా నువ్వు సత్పథగామినివైతే నీ భర్త ఇంట్లో దాస్యమైనా నీకు వరమే!... కనుక నువ్విక్కడే ఉండు... మేము బయలుదేరుతున్నాం...

దుష్యం : పురోహితవర్యా!... నేను మూర్ఖుణ్ణా... లేక ఈమె అబద్ధమాడుతోందా? ఎటూ తేల్చుకోలేకపోతున్నా... ఆమె చెప్పేదే నిజమైతే నేను భార్యని వదలిపెట్టిన పాపాన్ని మూటకట్టుకొన్నవాణ్ణౌతాను... అది అబద్ధమైతే పరస్త్రీని పరిగ్రహించిన పాపాత్ముణ్ణౌతాను... ఈ విషయంలో కర్తవ్యం మీరే ఉపదేశించాలి....

పురోహితుడు : (ఆలోచించి) ఒక విధంగా చేస్తే బాగుంటుందేమో ప్రభూ!...

దుష్యం : ఆనతివ్వండి....

పురో : పూర్వం తపోధనులు చక్రవర్తి కాగల పుత్రుని పొందుమని మిమ్మాశీర్వదించారు కదా!.. కణ్వ మునీంద్రునికి దౌహిత్రుడు కాబోయే ఆ పిల్లవాడు చక్రవర్తి లక్షణ సముపేతుడైతే మీరామెనభినందించి అంతఃపుర ప్రవేశం



చేయించేవచ్చు...లేదా ఆమెను తండ్రివద్దకు పంపవచ్చు....ప్రసవ పర్యంతం ఆమె నా గృహంలో ఉంటుంది..

దుష్యం : చక్కని ఆలోచన... అలాగే చేద్దాం....

శకుంతల : (దుఃఖంతో) తల్లీ! వసుంధరా!... నువ్వు నాకు మార్గాన్ని కల్పించు... (పురోహితునితో తపస్వి జనంతో నిష్క్రమిస్తుంది)

– నేపథ్యంలో –

ఒక కంఠం : ఆశ్చర్యం!... ఆశ్చర్యం!....

దుష్యం : అదేమై ఉంటుంది?...

పురో : (ప్రవేశించి) ప్రభూ!... మహాద్భుతం జరిగింది... కణ్వ మునీంద్రుని శిష్యులు వెళ్ళిపోవటంతోనే ఆమె తన దురదృష్టానికి చేతులు పైకెత్తి రోదించే సాగింది....

దుష్యం : ఆఁ!.. ఆ తరువాత?...

పురో : ఆకాశంలోంచి ఒక జ్యోతి ఆవిర్భవించి ఆమెను అప్సరస్తీర్థం వైపు తీసికొనిపోతూ అంతర్ధానమైంది!... (అంతా ఆశ్చర్యపోతారు)

దుష్యం : ఆమెను ఇంతకుముందే మేం తిరస్కరించాం... ఇక ఆ విషయం ఆలోచించేటం అనవసరం... ఇక మీరు వెళ్ళి విశ్రాంతి తీసుకోండి...

పురో : విజయీ భవ! (నిష్క్రమిస్తాడు)

దుష్యం : వేత్రవతీ!... బాగా అలసటగా ఉంది... శయనాగారానికి త్రోవచూపు...

వేత్రవతి, ప్రతి : ప్రభూ!... ఇటు.. ఇటు...

దుష్యం : నేనెంతో కఠినంగా తిరస్కరించిన ఆ కణ్వమునీంద్రుని దుహితను స్వీకరించినట్లు అసలు గుర్తురావటంలేదు...

కానీ నా హృదయావేదన మాకు సంబంధం ఉందేమో ననిపిస్తోంది...

(చేతులు వెనక్కి విఱిచి కట్టిన వ్యక్తితో ఇద్దఱు రక్షక భటులతో నగరపాలకుడు శ్యాలుడు ప్రవేశిస్తారు)

రక్షకభటులు : (వ్యక్తిని కొడుతూ) చెప్పరా! చెప్పు! దొంగ నా కొడకా!... మణులతో పేరుచెక్కిన ఆ ఉంగరం నీకెక్కడిదిరా!... చెప్పు!...

పురుషుడు (మత్స్యకారుడు) : దయ సూపండయ్యా!... నేనసువంటోణ్ణికాదు... దొంగను కానయ్యా!...

రక్షక (1) : దొంగవు కాకపోతే పవిత్రమైన బ్రాహ్మడివని రాజుగారు నీకా ఉంగరాన్ని దానమిచ్చారంటావా? అసలు నువ్వెవడివి?...

పురుష : సెక్రావతార తీరదం అంటారు – అక్కడుండే జాలరోణ్ణి బావఁయ్యా!

రక్షక (2) : నీ జాతేవిటని అడిగావఁట్రా?....

శ్యాలుడు : వాణ్ణి చెప్పనీయండ్రా!... మధ్యలో ఆపకండి!...

రక్షకులు : అలాగే బాబూ!

శ్యాలుడు : చెప్పరా! నువ్వు చెప్పు!...

పురుష : సేపలు పట్టుకొంటూ బతికేటోణ్ణి బావఁయ్యా! అట్టనే నేను, నా ఆలుబిడ్డలూ బతుకుతున్నాం....

శ్యాలుడు : ఓహో!... నీ జీవిక ఎంత విశుద్ధమైందిరా!

పురుష : తాతలనాటి నుంచొచ్చే పని ఏదైనా ఇడిసి పెట్టనేం కదా బావూఁ!... ఒకనాడు నే పట్టిన ఎఱ్ఱసేపను కోశాను... దాని పొట్టలో ఈ ఉంగరం దొరికినాది... దీన్ని నేనంగట్లో అమ్మసూపితే మీరు నన్ను పట్టుకొన్రు... మీరు నన్ను సంపినా, ఇడిసిపెట్టినా సత్తె పెమాణికంగా ఈ ఉంగరం నాకు దొరికిందిట్టనే...



శ్యాలుడు : జానుకా!.. వీడి వాలకం, చేపలకంపూ చూస్తుంటే వీడు చేపలు పట్టేవాడిగానే తోస్తోంది... అయితే ఉంగరం దొరికిన తీరే చిత్రంగా ఉంది... ఏమైనా రాజు గారి పేరు చెక్కి ఉన్న ఉంగరం కనుక రాజాస్థానానికే తీసికెళ్ళటం మంచిది....

ఇద్దఱూ : నడవరా!...

శ్యాలుడు : వీణ్ణిగోపురద్వారం వద్దే ఉంచి జాగ్రత్తగా చూస్తూ ఉండండి.. ప్రభువుకీసంగతి చెప్పి శాసనాన్ని తీసుకువస్తాను.. (నిష్క్రమిస్తాడు)

రక్షక(1) : వీణ్ణి చేంపటానికి ముందు పూలతో చుట్టాలికదా!... అందుకోసం నా చేతులు రెపరెపలాడుతున్నాయి...

పురుష : అన్యాయంగా నన్ను సంపేత్తారా బావూఁ?...

రక్షక (2) : (చూచి) అడుగో మన బాబుగారు వస్తున్నారు.. ఒరే దొంగనాయాలా!.. ఇక నువ్వు కాకులకీ, గద్దలకీ బలైపోతావు....

శ్యాలుడు : (ప్రవేశించి) సూచకా!... ఈ జాలరిని విడిచిపెట్టు... ఉంగరం దొరికిన తీరు నిజమేఁ!...

రక్షక (1) : అలాగే బావూఁ!...

రక్షక (2) : వీడు యమలోకానికి వెళ్ళి తిరిగొచ్చిండు!... (కట్లు విప్పుతాడు)

పురుష : (శ్యాలునికి నమస్కరించి) దండాలు బావఁయ్యా!... ఈ బతుకు నీదే దొరా!...

శ్యాలుడు : ఈ ఉంగరం ధరను ప్రభువులు నీకు పారితోషికంగా పంపారు... (డబ్బిస్తాడు)

పురుష : (తీసికొని) అయ్యా!... మీ దయ మడిసిపోలేను....

సూచిక : రాజానుగ్రహాన్నిపొందినవాడంటే వీడే....

రక్షక (2) : కొఅత వేసిన వాణ్ణి శూలం మీదనుంచి దింపి గజారోహణం చేయించినట్లుంది...

రక్షక (1) : ఈ ఉంగరం రాజుకెంత ఇష్టమైందో ఈ పారితోషికమే చెబుతోంది...

శ్యాలుడు : ఈ ఉంగరం చూట్టంతోనే ఎప్పుడూ ఎంతో గంభీరంగా ఉండే ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగేయి... కనుక దీంతో ఆయనకిష్టులెవరో గుర్తొచ్చి ఉండాలనుకున్నా!...

రక్షక (2) : ఒరేయ్!.. జాలరీ!... (అసూయగా) ఒక్కసారిగా ఇంత ధనం రావటానికి నువ్వు నక్కని తొక్కి వచ్చావురా!...

పురుష : ఇందులో సంగోరు మీ పువ్వులకై ఉంచుకోండి బావూ!...

శ్యాలుడు : ఇవాల్టినుండి నువ్వు నాకు మాగొప్ప నేస్తానివిరా!... దీన్ని కల్లుసాక్ష్యంగా నిలుపుకొందాం..రా!...

పురుష : సిత్తం బావూ! (అంతా నిష్క్రమిస్తారు)

★★★



## ఆఱవఅంకం

సానుమతి : శకుంతల మేనకకుమార్తె కావటంవల్ల ఆమె అంటే నాకు వల్లమాలిన ఆప్యాయత... మేనక "సానుమతీ! నువ్వెళ్ళి దుష్యంత మహారాజెలా ఉన్నాడో చూసిరావే" అని నన్నాదేశించింది... ఇదిగో రాజధాని హస్తినాపురంలో ఉద్యానవనం... నా తిరస్కరణీ విద్యతో ఇక్కడ వారికెవ్వరికీ కనిపించకుండా విషయాన్ని తెలుసుకొంటాను.. (ఇద్దఱు స్త్రీలు ప్రవేశిస్తారు)

ఒక స్త్రీ : (మామిడి మొగ్గను కోసి ఆకాశంలో విసిరి) మదనదేవా! ఈ పూజను గ్రహించి విరహిణీ జనుల ననుగ్రహించు...

కంచుకి : (కోపంతో వెనుక తెరను నెట్టుకొంటూ వచ్చి) ఎవరమ్మా మీరు? దుష్యంత మహారాజు వసంతోత్సవాన్ని నిషేధిస్తే మీరు మామిడి మొగ్గలను కోస్తున్నారేవిఁటి?

స్త్రీ (1) : క్షమించేండి... ఆ విషయం మాకు తెలియదు...

కంచుకి : ఊఁ!... సరే... మళ్ళీ ఆ పనిచెయ్యకండి....

స్త్రీ (2) : అయ్యా!... ప్రభువులు ప్రసిద్ధమైన వసంతోత్సవాన్ని ఎందుకు నిషేధించారో తెలుసుకోవచ్చా?...

సానుమతి : పండుగలు చేసుకోవటం ప్రజలకి చాలా ఇష్టమైన పనికదా!... రాజులూ వాటిని ప్రోత్సహించేటమే కాక సామాన్యులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొంటూ ఉంటారు... మఱి ఈ వసంతోత్సవ నిషేధానికేదో బలీయమైన కారణమే ఉండి ఉండాలి...

కంచుకి : ఇందులో రహస్యమేముంది? ప్రభువులు శకుంతలా మహాదేవిని తిరస్కరించేటం వల్ల వారికి కలిగిన నింద నీ చెవిన పడలేదా?

స్త్రీ (1) : నగరాధికారి జాలరి దగ్గఱనుంచి ఉంగరాన్ని గ్రహించి ప్రభువుకు సమర్పించినంత వఱకు విన్నాము...

కంచుకి : అయితే ఇంకేం?.. మిగిలింది కొంచెమే!... దాన్ని చూడటంతో మహారాజుకు తాను రహస్యంగా శకుంతలను వివాహమాడిన విషయం గుర్తొచ్చి ఆమె పట్ల తాను ప్రదర్శించిన వైఖరికి పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నారు...

స్త్రీ (2) : అయ్యో పాపం!...

కంచుకి : మహారాజప్పటినుంచి మన మనుష్యుల్లో లేరు... సభకే రావటం లేదు... నిద్రలేక పరుపుమీద దొర్లుతూ కన్ను మూయకుండానే రాత్రంతా గడిపేస్తున్నారు... అంతఃపుర స్త్రీలతోకూడా ఎంతో ముక్తసరిగా మాట్లాడుతున్నారు... ఒకర్ని ఇంకొకరి పేరుతో పిలిచి, తన తప్పిదాన్ని గుర్తించి సిగ్గుపడిపోతున్నారు...

సాను : ఎంతో సంతోషం!...

కంచుకి : అందువల్ల వసంతోత్సవం నిషేధించారు...

స్త్రీ లిద్దఱూ : బాగుంది... బాగుంది...

– నేపథ్యంలో –

ఒక కంఠం : మహారాజా!... ఇటు... ఇటు...

కంచుకి : అరుగో!... మహారాజిటే వస్తున్నారు... మీ పనులు మీరు చూసుకోండి...

స్త్రీలిద్దఱూ : అలాగే! (నిష్క్రమిస్తారు)

(సాధారణ దుస్తులతో దుష్యంత, విదూషకులు ప్రవేశం)

సానుమతి : (మహారాజు దుస్తుల్నీ, దీనమైన ముఖాన్నీ చూసి) తనను కాదన్నందుకు దుష్యంతునికై శకుంతలపరితాపం న్యాయమే!...



దుష్యం : అతిలోకసుందరి ఆ శకుంతల తనను గుర్తించేటానికి ఎంతగా ప్రయత్నించినా నా మనస్సప్పుడు మొద్దు బారి పోయి గుర్తురాలేదు.. అభిజ్ఞానంతో మేల్కొన్న నా హృదయం ఇప్పుడామెకోసం ఎంతో పరితపించి పోతోంది...

విదూ : ఈయనకీ శకుంతలా వ్యాధి మళ్ళీ తిరగబెట్టినట్లుంది... దీనికి చికిత్స ఏవిఁటో ఏమీ పాలుపోవటం లేదు...

దుష్యం : వయస్యా!... మూలిగే నక్కమీద తాటిపండు పడిందన్న సామెతగా శకుంతల గుర్తొచ్చి అసలే మనోవ్యధనొందిన నాపై మన్మథుడు బాణాల్ని ప్రసరిస్తున్నాడు...

విదూ : ఒక్కక్షణం ఉండు... వాడెక్కడున్నాడో చూపించు... వాణ్ణి ఈ కఱ్ఱతో చితక బాదుతాను...

దుష్యం : (నవ్వుతూ) నీ బ్రహ్మవర్చస్సు నాకు తెలియందా!... ఈ ప్రమదావనంలో ఎక్కడ కూర్చుని ఆమె స్మృతుల్తో ఆనందిస్తాను?...

విదూష : మాధవీ మంటపంలో ఉంటాననీ, మీరు గీసిన శకుంతల చిత్రపటాన్ని అక్కడికి తీసుకురమ్మనీ చతురిక నాజ్ఞాపించారుకదా!...

దుష్యం : బాగా గుర్తుచేశావ్!... మాధవీ మంటపానికి దారిచూపు...

విదూ : ఇటు... ఇటు... (రాజు నడుస్తూ ఉంటే సానుమతి అతణ్ణనుసరిస్తుంది)

సాను : ఈ లతా సమీపంలో ఉండి ఆమె భర్త వ్రాసిన శకుంతల చిత్రపటాన్ని చూసి రాజు పొందిన వియోగ దుఃఖాన్నామెకు తెలుపుతాను...

దుష్యం : వయస్యా!... శకుంతలను మొదటిసారిగా చూచిం దగ్గఱ నుంచీ జరిగిన సన్నివేశాలన్నీ నా మనోనేత్రంపై నర్తిస్తు

న్నాయి... ఆమెను నేను తిరస్కరించినప్పుడు నువ్వు నా ప్రక్కన లేవు!... అవునూ!... ఆశ్రమం నుంచి తిరిగొచ్చాక నువ్వొక్కసారైనా ఆమె పేరైనా ఎత్తలేదేం? నాలాగే నువ్వూ మఱచిపోయావా?

విదూ : లేదు... కానీ అక్కడనుంచి రాజధానికి పంపేటప్పుడు నాతో "సఖా! అదంతా పరిహాసంకోసం అన్నాను పరమార్థంగా తీసికోకు సుమా!" అని చెప్పావుగా!... నాదసలే మట్టిబుఱ్ఱకదా!... అదే నిజమనుకొన్నాను... ఇంతకీ విధి బలీయం!...

దుష్యం : నన్ను రక్షించు వయస్యా!...

విదూ : నీవంటివాడిలా దుఃఖించేకూడదు!... సజ్జనులెప్పుడూ దుఃఖభాగులు కారు... ఎంతటి ఝంఝూమారుతమైనా కొండని కదల్చలేదు కదా!...

దుష్యం : నేను శకుంతలని తిరస్కరించినప్పుడు తనవారితోనే ఆమె తండ్రి ఆశ్రమానికి వెళ్ళాలనుకొంటే ముని శిష్యుడు వద్దని తీవ్రంగా వారించాడు... అప్పుడామె కన్నీటితో క్రూరుణ్ణైన నన్ను ఒక్క చూపు చూసింది... ఆ చూపు విషం పూసిన బాణపు ములుకులా నన్నిప్పటికీ వెంటాడుతూనే ఉంది...

సాను : ఇతని పశ్చాత్తాపం నాకెంతో ప్రమోదాన్నిస్తోంది...

విదూ : ఆకాశచారులెవరో ఆమెను అపహరించుకొని పోయారనుకొంటాను...

దుష్యం : పతినే దేవతగా పరిగణించే ఆ పడతిపై పరుడెవ్వడు చేయి వేయటానికి సాహసిస్తాడు?... మేనక ఆమె కన్నతల్లి అని విన్నాను... ఆమె చెలికత్తెలెవరో శకుంతలను తీసికొని వెళ్ళి ఉంటారని నా అనుమానం...



విదూ : అయితే తప్పకుండా నీకామెతో పునస్సమాగమం కలుగుతుంది...

దుష్యం : ఎలా?

విదూ : భర్తృవియోగదుఃఖిత అయిన దుహితను కన్నవారు కలకాలం తమవద్ద ఉంచుకొని చూడలేరు..

దుష్యం : వయస్యా!... అసలు నాకీ మతిమఱపెలా వచ్చిందోయ్?!.. ఇదంతా కలా? నిజమా? మాయా? మతిభ్రమణమా? లేక నా పూర్వ పుణ్యఫల సమాప్తా?

విదూ : ఆ మాటనకు... అనూహ్యంగా శకుంతలా సమాగమం కలుగుతుందనటానికి, అనుకోకుండా ఈ ఉంగరం దొరికి శకుంతలా స్మృతిని కలిగించేటమే నిదర్శనం...

దుష్యం : అయ్యో!.. ఉంగరమా!... నువ్వూ, నేనూ ఒకలాంటి వాళ్ళమే... శకుంతలా స్పర్శ ఇద్దఱికీ స్వల్పకాలమే...

విదూ : ఈ ఉంగరం నువ్వామెకెప్పుడిచ్చావ్?

సాను : నామనసులో ఉన్నదే ఇతడూ అడిగేడు...

దుష్యం : ఆశ్రమంనుంచి రాజధానికి బయలుదేరుతున్న నన్ను చూసి శకుంతల కన్నీరు పెట్టుకొని పునర్దర్శనమెప్పుడని అడిగింది....

విదూ : తరువాత?...

దుష్యం : అప్పుడు నాపేరు చెక్కిన ఈ ఉంగరాన్ని ఆమె వ్రేలికి పెడుతూ "ఈ ఉంగరంపై ఎన్ని అక్షరాలున్నాయో అన్నిదినాల్లో నిన్ను నా అంతఃపురానికి తీసికొనివెళ్ళ టానికి నా పరిజనం వస్తా"రని చెప్పాను... కానీ అది మాటగానే మిగిలిపోయింది...

సాను : అవధి అందంగానే ఉన్నా విధి వక్రించింది...

విదూ : మఱి–ఆ ఉంగరం చేప కడుపులోకి ఎలా వెళ్ళినట్లు?

దుష్యం : శచీతీర్థంలో నమస్కరిస్తున్న ఆమె వ్రేలినుంచి జారి గంగాప్రవాహంలో పడిపోయింది.... ఓసి ఉంగరమా!. మనోహరమైన కోమలమైన నా శకుంతల వ్రేలిని వదలి నీటిలో మునిగినందుకు నిన్నెన్నన్నా పాపం లేదు...

విదూ : (తనలో) ప్రభువింక పిచ్చిధోరణిలో పడుతున్నాడు!.. (పైకి) అయ్యో!...నన్నాకలి తినేస్తోంది...

దుష్యం : నిష్కారణంగా నిన్ను నిందించి పంపించినందుకు పరితపించి పోతున్నాను... ప్రియా!... ఒకసారి కనిపించి నన్ను కనికరింపవా?...

చతురిక : (వేగంగా తెరను లాగుతూ ప్రవేశించి) ఇదిగో మహారాణి చిత్రం!...

విదూ : వయస్యా!... చిత్రం బాగుంది!... ఎంత చెక్కగా చిత్రించావ్!...

సాను : ఆహా!... ఈ రాజర్షి చిత్రలేఖన నైపుణ్యం ఎంత అద్భుతమైంది!... శకుంతల నా ఎదుట నిలిచినట్లే ఉంది!...

దుష్యం : ఆమె సౌందర్యంలో కొంతే చిత్రంలో వచ్చింది... కొన్ని మార్చి మళ్ళీ చిత్రించాలి...

సాను : ఎంతటి పశ్చాత్తాపం!... ఎంతటి నిగర్వం!...

విదూ : ఇంకా చిత్రించాల్సిందేముంది?... గడ్డాలతో ఉన్న ఋషులనా?

దుష్యం : తుమ్మెదను చిత్రించాలి... మాటిమాటికీ ఆనాడా తుమ్మెద నా ప్రేయసి శకుంతల ముఖం చుట్టూ తిరిగి ఆమెను స్పృశిస్తుంటే ఆమెను రక్షించేటానికే ఆమె ముందుకు



వెళ్ళాను... ఆ తుమ్మెదను చిత్రించాలి... (ఆవేశంతో) తుమ్మెదా... మళ్ళీ నా ప్రియురాలి అధరాన్నాశిస్తే నిన్ను దండిస్తాను జాగ్రత్త!

విదూ : (నవ్వుకొని తనలో) ఇతనికి పిచ్చిపట్టింది... ఇతనివల్ల నాకూ పిచ్చెత్తేట్లుంది.. (పైకి) వయస్యా!... ఇది చిత్రపటం!...

దుష్యం : ఏవిఁటీ?... ఇది చిత్రమా?

సాను : ఇది చిత్రపటమనే విషయాన్ని నేనే మఱచిపోయాను కదా!... ఎప్పుడూ శకుంతలా ధ్యాసతో ఆమెనే ధ్యానిస్తున్న ఈ రాజుని గూర్చి ఇక చెప్పేదేముంది?

దుష్యం : వయస్యా!... అంతులేని ఈ దుఃఖాన్ని భరించేలేక పోతున్నా... ప్రియురాల్ని కలలో చూద్దామనుకొన్నా నిత్యజాగరణతో అదీ అసాధ్యమే అయిపోతోంది... చిత్రంలో చూద్దామన్నా ఆమె స్మరణతో కన్నీళ్ళు ఉబికి అదీ సాధ్యం కావటం లేదు...

ప్రతీహారి : (ప్రవేశించి) ప్రభువులకు జయం!... జయం!.. అమాత్యులు మీకీ లేఖను పంపారు...

దుష్యం : (అందుకొని, చూచి) ఏవిఁటీ! సముద్ర వ్యాపారి ధనమిత్రుడు నావ ప్రమాదంలో మరణించాడా?... అతనికి సంతానం లేనందువల్ల అతని ధనమంతా రాజుకే చెందుతుందని అమాత్యుడు వ్రాశాడు... (విషాదంతో) సంతానం లేనందువల్ల ఎంత అనర్థమో చూచావా వేత్రవతీ!... ఊఁ!... (ఆలోచించి) ఆ వ్యాపారి అమితమైన సంపన్నుడు కనుక భార్యలు కూడా ఎక్కువమందే ఉండి ఉంటారు... కనుక అతని భార్యల్లో ఎవరైనా గర్భవతిగా ఉందేమో తెలిసికోవాలి!...

ప్రతీ : ప్రభూ! అతని భార్యల్లో సాకేత శ్రేష్ఠి కుమార్తెకు ఈమధ్య పుంసవనం జరిపినట్లు విన్నాను.

దుష్యం : అయితే ఇంకేం?... పుట్టబోయే ఆ శిశువే అతని ఆస్తికి వారసుడౌతాడని అమాత్యులకు మామాటగా చెప్పు!...

ప్రతీ : చిత్తం... (నిష్క్రమిస్తుంది)

దుష్యం : ఇదిగో... ఇలారా!...

ప్రతీ : చిత్తం... ప్రభూ!.. ఆజ్ఞాపించేండి ...

దుష్యం : సంతానం ఉందా లేదా అనే మీమాంస ఎందుకు? ప్రజలు ఇష్టబంధు వియోగాన్ని పొందినప్పుడు పాపరహితమైన అన్ని విషయాల్లోనూ దుష్యంతుడే ఆ బంధువౌతాడని ప్రకటించుమని చెప్పు!

ప్రతీ : చిత్తం ప్రభూ!... (వెళ్ళి తిరిగివచ్చి) ప్రభువుల శాసనం సకాలవర్షం వలె ఉందని అమాత్యు లభినందించారు...

దుష్యం : (దీర్ఘంగా నిట్టూర్చి) సంతతి లేకపోవటంతో వారి తదనంతరం వారి సంపద పరుల పాలైపోతుంది కదా!... నా తరువాత పురువంశ సంపద కూడా అంతే కదా!

ప్రతీ : అమంగళం ప్రతిహతమౌగాక!

దుష్యం : గుమ్మంలోకి వచ్చిన సిరికి మోకాలడ్డుపెట్టిన నన్ను నేనే నిందించుకోవాలి!

సాను : నా సఖి శకుంతలని మనస్సులో పెట్టుకొనే తన్ను తాను నిందించుకొంటున్నాడు... ఈ సంగతి శకుంతలకు చెప్పి ఆమె నానందపఱుస్తాను...(ఆకాశంలోకి ఎగిరిపోయినట్లు ఎఫెక్ట్)

విదూ : రక్షించేండి!... రక్షించేండి!...

దుష్యం : ఈ గొంతు మిత్రుడు మాఢవ్యునిదిలా ఉందే!... ఎవరక్కడ?



ప్రతీ : (కంగారుగా వచ్చి) రక్షించేండి... మీ ప్రియ వయస్యుడు మాఢవ్యుని గొంతు పట్టుకొని ఎవరో చేంపబోతున్నాడు...

దుష్యం : ఎవడువాడు?

ప్రతీ : ప్రభూ!... ఏదో అదృశ్యరూపం!... మాఢవ్యుణ్ణి మేఘ ప్రతిచ్ఛంద భవనంలో ఉంచినట్లుంది.

– నేపథ్యంలో –

విదూ : వయస్యా!... అయ్యో!... అయ్యో!....

దుష్యంత : మిత్రమా!... భయపడకు... భయపడకు...

విదూ : భయపడకుండా ఎలా?... వీడెవడో నన్ను చెఱుకు గడలా విఱిచేస్తున్నాడు!

దుష్యం : నా ధనుర్బాణాలేవీ?

యవనస్త్రీ : ప్రభూ!... స్వీకరించేండి (ఇస్తుంది)

– నేపథ్యంలో – ఒక కంఠం (మాతలి)

మాతలి : కొత్త నెత్తురు తాగాలనుకొని మెలికలు తిరిగిపోతున్న పశువులా ఉన్న నిన్ను చేంపేస్తున్నాను... ఆర్తరక్షకుడైన దుష్యంతుడే నీకు శరణం!...

దుష్యం : (రోషంతో) ఏమీ!... నన్నే ఆజ్ఞాపిస్తున్నాడా!... ఓరీ రాక్షసాధమా!... ఆగు... ఆగు... ఇక నువ్వుండవు... వేత్రవతీ! దారిచూపు...

వేత్ర : ప్రభూ!... ఇటు... ఇటు..

దుష్యం : ఏవింటీ!... ఇక్కడెవరూ లేరే!...

– నేపథ్యంలో –

విదూ : అయ్యో!... నాకు మీరు కనబడుతున్నారు... నేను మీకు కనబడటం లేదు. అయ్యో! పిల్లికి చిక్కిన ఎలుకలా అయిపోయింది నా బతుకు...

దుష్యం : ఓరీ!.. తిరస్కరిణీ విద్యాగర్వితుడా!... ఇదిగో అస్త్రం... సంధిస్తున్నా నిలు నిలు... ఈ నా అస్త్రం నిన్ను వధించి ఈ బ్రాహ్మణ్ణి రక్షిస్తుంది...

(మాతలి, విదూషకుడు ప్రవేశిస్తారు)

మాతలి : మహారాజా!... రాక్షసవధకు దేవేంద్రుడు నీ సాయం అర్థిస్తున్నాడు...

దుష్యం : దేవేంద్రుని సారథి మాతలి!... స్వాగతం!..

విదూ : నన్నెవడు చేంపబూను కొన్నాడో వానికి స్వాగతం పలకుతున్నాడు నా రాజు!

మాతలి : (నవ్వుతూ) చిరంజీవీ! దేవేంద్రుడు నన్ను నీవద్దకు పంపిన కారణం...

దుష్యం : చెప్పండి....

మాతలి : దుర్జయనామంతో కాలనేమి సంతానమైన ఒక రాక్షసగణం ఉంది...

దుష్యం : అవును... పూర్వం ఎప్పుడో నారదుని వల్ల విన్నాను.

మాతలి : వారిని యుద్ధభూమిలో నువ్వే వధించేగలవని దేవేంద్రుడను కొంటున్నాడు. కనుక నువ్వు ధనుర్బాణాలను చేతపట్టి ఈ ఇంద్ర రథాన్ని అధిరోహించి నాతో రావాలి.

దుష్యం : దేవేంద్రుడు నన్నిలా ఆహ్వానించేటం అనుగ్రహవిశేషం. అది సరే కానీ మాధవ్యుని పట్ల నువ్విలా ప్రవర్తించావేమిటి?

మాతలి : నీకు కోపం తెప్పించాలనే ఇలా చేశాను.... ఎందుకంటే కట్టెల్ని కదిపినప్పుడేకదా అగ్ని జ్వలించేది!...పాముని కదిలిస్తేనే అది కోపంతో పడగ విప్పుతుంది... అలాగే ఎవడైనా కలతనొంది క్షోభించినప్పుడే అతనిలో పౌరుషం ఉప్పొంగిపోతుంది....



మాతలి : నువ్వేదో మనస్సంతాపంతోనే దుఃఖితుడవైనట్లు నాకు తోచింది... అందుకని!

దుష్యం : (జనాంతికంగా) వయస్యా!... దేవేంద్రుని ఆజ్ఞ అనుల్లంఘనీయ మైందికదా!... ఈ విషయం అమాత్యునికి చెప్పి రాజ్యాన్ని నేను తిరిగి వచ్చేదాకా జాగ్రత్తగా రక్షించేవలసిందిగా నా మాటగా చెప్పు....

విదూ : అలాగే!... (నిష్క్రమిస్తాడు)

మాతలి : చిరంజీవీ!... ఇటు... ఇటు...

(రాజు రథాన్నధిరోహించినట్లభినయిస్తాడు)

★★★

## ఏడవఅంకం

– రథారూఢులైన దుష్యంతుడు, మాతలి–

దుష్యం : మాతలీ!... దేవేంద్రుని ఆజ్ఞను నెరవేర్చినా ఆయన నాకు చేసిన అఖండ సత్కారంతో నేనాయనకు తగినట్లుగా ఉపకరించే లేదేమోననిపిస్తోంది...

మాతలి : (నవ్వుతూ) మీ ఇద్దఱి భావనలూ బాగా సంవదిస్తున్నాయి... ఇంద్రుని ఆనతి పూర్తిగా నిర్వహించి, చేసింది తక్కువేమో నని నువ్వనుకొంటుంటే, నువ్వు చేసిన మహోపకారానికి తగినసత్కారం చేయలేకపోయానని ఆయననుకొంటున్నాడు.

దుష్యం : నియమించిన పనిలో సేవకులు సఫలులైనారంటే దానికి యజమానులు వారిపైన చూపిన గౌరవమే కారణ మౌతుంది... చూడు!... సూర్యభగవానుడు దయతో అనూరుణ్ణి తనరథంపై కూర్చోబెట్టకపోతే అనూరుడు చీకట్లని తొలగిం చేగలిగిఉండేవాడేనా?...

మాతలి : నీమాట నీ వినయానికి తగ్గట్టే ఉంది...

దుష్యం : మనం స్వర్గానికి వచ్చేటప్పుడు రాక్షస వధావిషయకమైన ప్రణాళికనాలోచించేటంతో స్వర్గమార్గాన్ని సరిగా గమనించేలేక పోయాను...ఇప్పుడు తీరిగ్గా చూడవచ్చు... ఇప్పుడు మనమున్నది ఏ వాయుమార్గం?

మాతలి : దీన్ని పరివహ వాయుమార్గం అంటారు.... వియద్గంగని ఈ వాయుమార్గమే వహిస్తూ ఉంటుంది. సప్తర్షులు, నవగ్రహాలు, జ్యోతిస్సులు ఇక్కడే వ్యాపించి ఉంటాయి. ఇదే... వామనావతారంలో హరి తన రెండవ పాదాన్ని ఉంచేటంవల్ల పవిత్రమైంది... ఇది దాటిం తర్వాత క్షణకాలంలో భూతలాన్ని చేరుతాం...



దుష్యం : బంగారు కాంతులీనే ఈ పర్వతం పేరేమిటి?

మాతలి : ఇది కింపురుషులు నివసించే హేమకూటం... తపస్వులకు కొంగుబంగారం... మహాసిద్ధిక్షేత్రం... సురాసురులకు గురువు, స్వాయంభువమనువుమనుమడూ, మరీచి పుత్రుడూ అయిన మారీచ మహర్షి ఆశ్రమం ఇక్కడే ఉంది....

దుష్యం : భగవంతుడైన మారీచి మహర్షికి ప్రదక్షిణ ప్రణామాల నర్పించి వెడదామనుకుంటున్నాను...

మాతలి : చేక్కని ఆలోచన!... అదిగో... ఆ కనిపించేదే మారీచాశ్రమం... పద...

దుష్యం : ఆహా!... మందార వృక్షాలతో నిండిన ఈ ఆశ్రమం ఎంత మనోహరంగా ఉంది!... అమృత సరస్సులలో మునకలేసినంత ఆనందంగా ఉంది....

మాతలి : భగవాన్ మారీచమహర్షి ఏం చేస్తున్నారు శాకల్యా?.. ఆఁ...ఏవంటున్నావ్? మహర్షుల పత్నులతో కలిసిఉన్న దాక్షాయణికి ఆమెకోర్కెపై పతివ్రతాధర్మాన్ని ఉపన్యసిస్తున్నారనా?

దుష్యం : అయితే వారిదర్శనానికి ప్రతీక్షిద్దాం!

మాతలి : చిరంజీవీ!... అందాకా ఈ అశోకవృక్షచ్ఛాయలో విశ్రమించు... నేను గురువులకు నీరాకను తెలిపే అవకాశానికై నిరీక్షిస్తుంటాను..

– నేపథ్యంలో –

ఒక స్త్రీ కంఠం : నాయనా!... వద్దు... ఏవిఁటా చిలిపితనం?

దుష్యం : తాపస స్త్రీలు వారిస్తున్న ఈ బాలుడెవరో చాలా ముద్దుగా ఉన్నాడే!... సింహపు పిల్ల పాలుత్రాగుతుంటే దానిజూలు

పట్టి దాన్నించి తానాడుకోవటానికి ఆ సింహప్పిల్లను లాగుతున్నాడు...

బాలుడు : ఏయ్ సింహడింభకా!... నోరుతెరు!... నీ పళ్ళని లెక్క పెట్టాలి!...

తాపస స్త్రీ (1) : ఏం పనులివి? నీ ఆగడాలు రానురాను మితిమీరి పోతున్నాయి... నీకు "సర్వదమను" దని ఋషులు పెట్టినపేరు సార్థకమైందిలే...

దుష్యం : ఈ పిల్లాణ్ణి చూస్తే కన్న కొడుకును చూసినట్లు నా మనస్సు ఉప్పొంగుతోంది!... నాకు పిల్లలు లేకపోవటం వల్లనేమో!...

తాపస స్త్రీ (2) : నాయనా!... సర్వదమనా!... నువ్వా సింహప్పిల్లని విడిచిపెట్టక పోతే తల్లిసింహం నీపైకి దూకుతుంది!...

బాలుడు : (నవ్వుతూ) అమ్మో!... భయమేస్తోందే!...

తాపస స్త్రీ (1) : నాన్నా!... ఆ సింహప్పిల్లను విడిచిపెట్టు... నువ్వాడు కోవటానికి ఇంకోబొమ్మ తెచ్చిస్తా...

బాలుడు : అయితే ముందాబొమ్మ ఇవ్వు... (చేతిని చాస్తాడు) అందాకా ఈ సింహప్పిల్లతోనే ఆడుకుంటాను.

దుష్యం : (ఆశ్చర్యంగా చూసి) అరే!... ఈ పిల్లాడి చేతిలో చక్రవర్తి లక్షణాలు కనిపిస్తున్నాయే!...

తాపస స్త్రీ (2) : సువ్రతా!... మాటల్తో వీడి ఆగడాలను మాన్చలేం... పర్ణశాలలో నెమలి బొమ్మొంది... తీసుకురా... అదిస్తేకాని ఆ సింహప్పిల్లని వదిలేట్టులేడు...

తాపస స్త్రీ (1) : అలాగే... (నిష్క్రమిస్తుంది)

దుష్యం : వీణ్ణి చూస్తుంటే నాకెందుకో ఆత్మీయానుభూతి కలుగుతోంది... బాబూ!.. ఆశ్రమ మృగాల్తో స్నేహం



చేయాలికానీ పీడించే కూడదు... అది ఋషికుమార ధర్మం కాదు...

తాపస స్త్రీ (1) : ఆర్యా!... ఇతడు ఋషికుమారుడు కాదు...

దుష్యం : ఇతని చేష్టలే ఆ విషయాన్ని తెలుపుతున్నాయి...

తాపస స్త్రీ (2) : ఆర్యా!.. ఈ చిరంజీవి పట్టినపట్టుతో ఆ సింహప్పిల్ల బాధకు లోనైంది... మేం ఎవరమూ ఇతనిపట్టునించి దాన్ని విడిపించలేం... దయతో మీరు...

దుష్యం : నాయనా!.. పాపం ఆ సింహప్పిల్లకు నొప్పుడుతోంది... వదులుబాబూ!... (తన చేత్తో పిల్లవాణ్ణీ సింహప్పిల్లనీ వేఱుచేసి, – తనలో– ఎవరి పుత్రుడో – ఇతని స్పర్శతో నాకే ఆనందం కలుగుతోంటే.. ఇతని తండ్రి ఆనందం ఇంకెంత గొప్పగా ఉంటుందో?...

తాపసి : ఆశ్చర్యం!... ఆశ్చర్యం!...

దుష్యం : ఏవిఁటీ ఆశ్చర్యం?

తాపసి : మీ రూపురేఖలితనిలో అచ్చుగుద్దినట్లగుపిస్తున్నాయి... కనుక మీఇద్దఱికి ఏదో దగ్గఱ సంబంధం ఉండి ఉండాలని పిస్తోంది... పైగా మీపట్ల విధేయుడుగా కూడా ఉన్నాడు...

దుష్యం : ఈతడు ఋషికుమారుడు కాకపోతే ఏ వంశీయుడు?

తాపసి : పురువంశీయుడు....

దుష్యం : (తనలో) ఏవిఁటీ? మా ఇరువురి వంశం ఒకటేనా?!... కానీ మానవులెవరూ ఈ ప్రదేశానికి రాలేరే!...

తాపసి : నిజమే... కానీ ఇతనితల్లికి అప్సరస్త్రీలతో సంబంధం ఉన్నందువల్ల ఈ చిరంజీవిని మారీచాశ్రమంలో ప్రసవించింది...

దుష్యం : (తనలో) ఏదో ఆశ చిగిరిస్తోంది... (పైకి) ఆ పూజనీయ ఏ రాజర్షిపత్ని?...

తాపసి : సహధర్మచారిణిని విడిచిపెట్టిన అతనిపేరెందుకులెండి తలచుకోవటం?...

దుష్యం : (తనలో) ఈ మాటలు నాకే తగులుతున్నాయ్... పిల్లవాణ్ణి తల్లిగూర్చి అడగనా? – కానీ పరదారవృత్తాంత సేకరణ అన్యాయం కదా!...

తాపస స్త్రీ (1) : సర్వదమనా!... ఈ శకుంతలా లావణ్యాన్ని చూడు....

బాలుడు : మా అమ్మ ఎక్కడ?...

తాపసులిద్దఱూ : వీడికి తల్లంటే ప్రాణం కదా! నామసాదృశ్యం చేతవాళ్ళమ్మేమోనని భ్రాంతిపడ్డాడు...

తాపస స్త్రీ (2): నాయనా! ఈ మట్టినెమిలి బొమ్మెంత బాగుందో చూడమన్నాను...

దుష్యం : (తనలో) ఈ పిల్లవాని తల్లిపేరు శకుంతలా?.. ఒకేపేరున్న వారు చాలామంది ఉంటారు... ఎండమావిలా నాకు దుఃఖోత్పాదకమౌతోందీ ప్రస్తావన...

బాలుడు : నాకు మంచి నెమిలిబొమ్మ దొరికింది... (బొమ్మను తీసికొంటాడు)

తాపస స్త్రీ (1) : (ఉద్వేగంగా) అమ్మో!... ఈ పిల్లవానిచేతినుండే రక్షరేఖేదీ?...

దుష్యం : ఆఁ!... ఆఁ!... కంగారుపడకండి... ఇతడు సింహప్పిల్లతో పెనుగులాడేటప్పుడు చేతినుంచి జారి క్రిందపడింది... (తీయబోతాడు)

ఇద్దఱు : ఆఁ!...ఆఁ!.. తీయకండి...అయ్యో!... తీసికొన్నారే?...

దుష్యం : తియ్యొద్దన్నారెందుకు?



తాపస స్త్రీ (1) : ఇది అపరాజిత అనే ఓషధి!... ఇతనికి జాతకర్మ సందర్భంలో మారీచమహర్షి ఇతని చేతికి కట్టారు... పిల్లవాడు, అతని తల్లితండ్రులు తప్ప నేలమీద పడ్డప్పుడు దీన్నెవరూ ముట్టుకోకూడదు...

దుష్యం : ఒకవేళ ముట్టుకుంటే?...

తాపస స్త్రీ (2) : అది వెంటనే మహాసర్పమై తాకిన వారిని కాటేస్తుంది....

దుష్యం : అటువంటిది మీరెప్పుడైనా ప్రత్యక్షంగా చూశారా?...

ఇద్దఱు : చాలాసార్లు...

దుష్యం : (సంతోషంతో) ఇదేవిఁటి?... నాకోర్కె సంపూర్ణంగా నెరవేరినా ఇంకేదో ఆలోచిస్తున్నానేమిటి? (బాలుణ్ణి కౌగిలించుకొంటాడు)

తాపస స్త్రీ (2) : సువ్రతా! రావే!... నియమపాలనలో ఉన్న శకుంతలకీ సంగతి చెబుదాం...

బాలుడు : నన్ను విడవండి... మా అమ్మ దగ్గఱకు వెళ్ళాలి...

దుష్యం : ఇద్దఱం కలిసే వెళ్ళి ఆమెను సంతోషపెడదాం...

బాలుడు : మా తండ్రి దుష్యంత మహారాజులుకదా!.. మఱి మీరెవరు?

దుష్యం : (చిఱునవ్వుతో) ఈ ప్రశ్నే ఇతడు నా కుమారు డనే నమ్మకాన్ని పుట్టిస్తోంది... (ఏకవేణితో శకుంతల ప్రవేశిస్తుంది)

శకుంతల : ఇక్కడ జేరిగిన సన్నివేశం విన్నాకూడా నాకు ఆశ కలగటం లేదు... ఒకవేళ సానుమతి అన్నట్లు ఆపట్టుకొంది ఆర్యపుత్రులైనా కావచ్చు...

దుష్యం : ఆఁ!... శకుంతల!... మలినవస్త్రాలతో వ్రతానుష్ఠానంతో చిక్కిపోయి ఏకవేణిని ధరించి, తాను పవిత్రురాలైనా

దయావిరహితుణ్ణైన నాకోసం దీర్ఘవిరహవ్రతాన్ని పూని ఉంది....

శకుంతల : ఈయన ఆర్యపుత్రునిలా లేరే!... ఎవరై ఉంటారు?

బాలుడు : అమ్మా!... ఈయనెవరో నన్ను కుమారా! అని పిలుస్తూ కౌగిలించుకొంటున్నాడే...

దుష్యం : ప్రియా!... గ్రహణం విడిచిన తర్వాత చంద్రుడు రోహిణిని కలిసినట్లు మఱపు తొలిగిన తర్వాత నా అదృష్టం కొద్దీ నీముందున్నాను...

శకుంతల : ఆర్యపుత్రులకు జయం!...

బాలుడు : అమ్మా!... ఎవరే ఈయన?

శకుంతల : నాయనా!... నీ భాగ్యదేవతనడుగు...

దుష్యం : అంధుడు తనపై పడ్డ పూలమాలను పామనుకొని తోసివేసినట్లు చెప్పరాని మఱుపు నన్నావేశించి నిన్నానాడు తృణీకరించాను... (శకుంతల పాదాలపై పడతాడు).

శకుంతల : ఆర్యపుత్రా!... లేవండి... ఆనాటి మీ ప్రవర్తనకు నాపూర్వ జన్మదుష్కృతమే కారణమై ఉంటుంది... ఇప్పుడు మీకు నేనెలా గుర్తొచ్చాను?... (దుష్యంతుడు శకుంతల కన్నీటిని తుడుస్తాడు... అతని చేతి ఉంగరాన్ని చూసి) ఆర్యపుత్రా!... ఈఅంగులీయకం ఆనాడు మీరు నావ్రేలికి తొడిగిందే కదా!...

దుష్యం : అవునదే దేవీ!... దీనివల్లే మనని విడదీసిన ఆ మఱపు తొలగిపోయింది...

శకుంతల : ఇది ఆనాడు లేకపోవటం వల్లే ఇంత జేరిగింది!...

దుష్యం : ఇప్పుడు దీన్ని నువ్వలంకరించుకో...



శకుంతల : ఎందుకో నాకింకా విశ్వాసం కుదరటంలేదు కనుక మీరే దీన్ని ధరింపజేయండి...

మాతలి : అదృష్టం బాగుండి దారాపుత్రుల్ని కలిసి చిరంజీవి సంతోషంగా ఉన్నాడు..

దుష్యం : సహృదయులైన మీతో రావటంవల్లే ఈ శుభఫలితం!... ఈ సంగతి దేవేంద్రునికి తెలియదు కదా!...

మాతలి : (నవ్వి) ఈశ్వరునికి తెలియనిదంటూ ఏముంటుంది?.. చిరంజీవీ... మారీచ మహర్షిని దర్శిద్దువుగాని రా!...

దుష్యం : శకుంతలా! చిరంజీవిని పట్టుకో... ముగ్గురం కలిసే మహర్షిని దర్శిద్దాం... (ముందుకు వెళ్ళి) మునిదంపతులకు ప్రణామాలు...

మారీచ : నాయనా!... చిరకాలం భువిని పాలించు...

అదితి : అప్రతిరథుడవై వర్ధిల్లు...

శకుంతల : పుత్రసహితనైన నా పాదాభివందనం స్వీకరించేండి...

మారీచ : అమ్మా!... నీభర్త దేవేంద్రతుల్యుడు... కుమారుడు జయంతునికి సాటి. నీవు పౌలోమివంటిదానవై సకల శుభాలూ పొందు...

అదితి : అమ్మా!... భర్త గౌరవాన్ని పొందు... నీ పుత్రుడు దీర్ఘాయువై ఉభయ వంశాలకీ కీర్తిప్రతిష్ఠలు తీసికొని వస్తాడు....

దుష్యం : భగవాన్!... మీ కృపావిశేషం అపూర్వమైంది... లోకంలో ఎక్కడైనా పూవుముందు ఫలం తరువాత, మేఘం ముందు, వర్షం తరువాత రావటం చూస్తూ ఉంటాం...కాని దీనికి వ్యతిరిక్తంగా శుభఫలాన్ని ముందుగా సిద్ధింపజేసి, తరువాతనే దానికి కారణమైన మీ దివ్యదర్శనాన్ని ప్రసాదించారు.

మాతలి : అది విధాతల అనుగ్రహ విశేషం!

దుష్యం : భగవాన్!... ఈ శకుంతలను నేను గాంధర్వ విధిని వివాహం చేసికొని, తరువాత కొంత కాలానికి బంధుజనుల్తో వచ్చిన ఈమెను మతిమఱపుతో తిరస్కరించి, ఈమెపట్ల మహాపరాధం చేశాను... ఆ తరువాత ఉంగరం చూడటంతో నేను వివాహమాడిన వృత్తాంతం అంతా కళ్ళకు కట్టినట్లైంది... ఆలోచిస్తే ఇప్పటికీ నాకెంతో ఆశ్చర్యం కలుగుతుంది... అంతటి మైమఱపెలా వచ్చిందా అని!.. ఇదెలా ఉందంటే – ప్రత్యక్షంగా ఏనుగును చూసి ఏనుగు కాదనుకొని, అది వెళ్ళిపోయిన తరువాత ఏనుగేమోనని సందేహించి నేలపై దాని అడుగుజాడల్ని చూసి ఏనుగేనని నిశ్చయించు కొన్నవాడి మనోవికారంలా ఉంది.

మారీచ : నాయనా! నువ్వేదో అపచారం చేశాననే న్యూనతను భజించేకు... దానికో బలవత్తరకారణం ఉంది...

దుష్యం : బలవత్తర కారణమా మహర్షీ!

మారీచ : ఔను... నీ తిరస్కారంతో మేనక ఈ శకుంతలను తీసికొని దాక్షాయణివద్దకు వచ్చినప్పుడే నేను ధ్యానంలో విషయాన్ని గ్రహించాను. దుర్వాసమహర్షి శాపంవల్లే నువ్వామెను నిరాకరించావనీ, అభిజ్ఞానదర్శనంతో ఆశాపం తీఱిపోతుందనీ అర్థమైపోయింది.

దుష్యం : హమ్మయ్య!... అపనిందనుంచి ఇప్పటికి విముక్తుణ్ణై నాను...

శకుంతల : (తనలో) నా అదృష్టవశంవల్ల ఆర్యపుత్రులు నన్ను నిష్కారణంగా త్యజించేలేదు... అందుకే కాబోలు నాచెలికత్తెలిద్దఱూ ఆర్యపుత్రుని ఉంగరం చూపించమని నన్నానాడు హెచ్చరించారు...



మారీచ : అమ్మా! శకుంతలా!... విషయం తెలిసింది కదా!... ఇక నీభర్తపై కోపించేకేం!... అద్దంమీద ధూళిపేరుకొంటే మన ముఖం సరిగా కనిపించేదు... తుడిచేస్తే విశుద్ధంగా భాసిస్తుంది...

దుష్యం : మా వంశ ప్రతిష్ఠ మీ దయా విశేషంతోనే వర్ధిల్లాలి!...

మారీచ : ఈ నీకుమారుడు భవిష్యత్తులో చక్రవర్తి అవుతాడు... సప్తద్వీప వసుంధరను ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతాడు. లోకాలన్నిటినీ భరించేటంవల్ల భరతుడనే పేరుతో ప్రసిద్ధుడౌతాడు...

అదితి : భగవాన్! శకుంతలకు కలిగిన శుభపరిణామాన్ని మీ ఆశీస్సులతో కణ్వమునీంద్రులకు తెలుపండి...

శకుంతల : (తనలో) నా మనస్సులో అనుకొంటోందే భగవతి చెప్పింది...

మారీచ : పూజ్యుడైన కణ్వమునీంద్రునికిది తన తపఃప్రభావంతో తెలియక పోతే కదా!...

దుష్యం : అందుకే ఆ మహర్షి నాపై కుపితులు కాలేదు...

మారీచ : అయినా ఈ వార్త ఆయనకు పంపవలసిందే!...గాలవా! నువ్వు వియత్పథంలో వెళ్ళి ఆ మునీంద్రుని కిక్కడ జేరిగిందంతా నివేదించు...

గాలవ : చిత్తం గురువర్యా!...

మారీచ : నాయనా! దుష్యంతా! ఇక నువ్వు దారాపుత్రులతో నీ మిత్రం దేవేంద్రుని రథం అధిరోహించి నీ రాజధానికి బయలుదేరు...

దుష్యం : మీ ఆజ్ఞ!...

మారీచ : ఇంద్రుడు మంచి వర్షాలతో భువిని సస్యశ్యామలం చేయుగాక! నువ్వూ యజ్ఞాదులు నిర్వహించి, ఇంద్రుని ప్రీతుని చెయ్యి... ఇలా మీ ఉభయులూ ఒకరినొకరు సంతుష్టిపఱచుకొంటూ ఉభయలోకాలకూ కళ్యాణకారకులౌదురు గాక!...

దుష్యం : భగవన్!... మీ ఆజ్ఞను యథాశక్తి అనుష్ఠిస్తాను...

మారీచ : ఇంకా నేను నీకు చేయదగిన ప్రియమేముందో చెప్పు!...

దుష్యం : ఇంతకుమించి మీరనుగ్రహించేదలిస్తే ప్రభువులు ప్రజాహిత కార్యాల్లోనే నిమగ్నులౌదురుగాక!... విద్వాంసులు పూజితులౌదురుగాక!... నీలలోహితుడు నాకు పునర్జన్మ లేకుండా చేయుగాక!...

– శుభం –

# ఉత్తరరామచరితం

సంస్కృతమూలం : **భవభూతి**

రంగస్థలకృతి : **డాక్టర్ రామవరపు శరత్‌బాబు**

## ఇందలి పాత్రలు

### పురుషులు

1. శ్రీరాముడు
2. కంచుకి
3. అష్టావక్రముని
4. లక్ష్మణుడు
5. ప్రతీహారి
6. దుర్ముఖుడు
7. శంబూకుడు
8. జనకుడు
9. పరిచారకుడు
10. లవుడు
11. వటువు
12. ఒకడు
13. పురుషకంఠం (నేపథ్యంలో)
14. చంద్రకేతువు
15. సుమంత్రుడు
16. కుశుడు
17. సూత్రధారుడు
18. వాల్మీకి

### స్త్రీలు

1. సీత
2. వాసంతి
3. ఆత్రేయి
4. ఆకాశవాణి (స్త్రీ కంఠం)
5. తమస
6. మురళ
7. అరుంధతి
8. కౌసల్య
9. సీత పాత్రధారిణి
10. గంగ
11. పృథ్వి



# ఉత్తరరామచరితం

## ప్రయోక్త :

ప్రేక్షక మహాశయులకు నమోవాకాలు... పాశ్చాత్య నాటకాల కంటె భిన్నంగా భారతీయనాటకాల్లో నవరసాలు దర్శన మిస్తాయి. అయితే నాటకంలో ఒకటి ప్రధానరసమైతే మిగిలినవి సందర్భానుసారంగా అక్కడక్కడ కనిపిస్తూ వినోదాన్నిస్తాయి... సాధారణంగా శృంగార వీర కరుణ రసాలు సంస్కృతనాటకాల్లో ప్రధాన రసాలే అయినా హాస్యరస ప్రధానమైనవీ లేకపోలేదు. పాశ్చాత్యనాటకాల్లో విషాదాంత నాటకాలు ఒక ప్రధానమైన వర్గంకాగా సంస్కృత నాటకాల్లో భాసమహాకవి కృత ఊరుభంగం తప్ప విషాదాంత నాటకం పొడే ఎక్కడా కనిపించేదు. “మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని” అనే శాస్త్రనిర్దేశం కారణంగా సంస్కృతనాటకాలేవీ విషాదాంతాలు కావు. అయితే కరుణరసం మాత్రం నాటకాల్లో ఆ ఆ సన్నివేశాలకనుగుణంగా సమృద్ధిగా కనిపిస్తూనే ఉంటుంది. పైగా ‘ఏకో రసః కరుణ ఏవ’ అంటే కరుణ ఒక్కటే రసమనీ, మిగతా రసాలన్నీ, సముద్రంలోని అగాధాన్నుంచే ఉద్భవించాయని చెప్పిన ఘనత ఈ ఉత్తరరామచరిత రచయిత భవభూతికే చెందుతుంది. కాళిదాస మహాకవికి దీటైన ఈ భవభూతి ఉత్తరరామచరితకు అనువాదాలున్నా నేటి కాలానికి అనుగుణంగా వాడుకభాషలో నాటక ప్రదర్శనా ప్రతిని రామవరపు శరత్‌బాబు సంతరించారు. దీన్ని మీ ముందు ప్రదర్శించేటానికి మేం సిద్ధమైనాం.

కథాంశం భారతీయులందరికీ తెలిసిందే కనుక ప్రసిద్ధేతివృత్తం. శ్రీరాముడు జనాపవాదభీతితో గర్భిణి అయిన సీతను అడవుల్లో విడువటం, శంబూకవధ వృత్తాంతం, వాల్మీకి ఆశ్రమంలో సీతాదేవి లవకుశుల్ని కనటం, శ్రీరామచంద్రుడు అశ్వమేధయాగం తలపెట్టి అశ్వాన్ని విడిస్తే దాన్ని వారు పట్టుకోవటం అందరికీ తెలిసిందే. అరుంధతీదేవితో కలిసి జనకమహారాజు వాల్మీకి ఆశ్రమానికి రావటం, వాల్మీకి విరచిత రామాయణ నాటకాన్నే రామలక్ష్మణులు, సకల దేవతల సమక్షంలో ప్రదర్శించేటం, సీతారాముల పునస్సమాగమం భవభూతి మహాకవి కల్పనలు. ప్రదర్శకులు తమ నాటక వైశిష్ట్యాన్ని తామే ప్రశంసించుకోగూడదు కదా! మేమెంతో కష్టనిష్ఠురాలకోర్చి దీన్ని ప్రదర్శిస్తున్నా కాళిదాసు చెప్పినట్లు రసజ్ఞశేఖరులైన మీవంటి వారిఆమోదమే మావంటి వారికృషికి యోగ్యతాపత్రం. చిత్తగించేండి...

## మొదటిఅంకం

శ్రీరామ : దేవీ!... బెంగపడకు... మీ పితృపాదులు జనక మహారాజుగారు మాత్రం మనల్ని వదలి చాలాకాలం ఉండలేరుకదా!...

సీత : ఆర్యపుత్రా!... ఆ విషయం నాకూ తెలిసిందే అయినా ఇంతకాలం మనతో ఉండి ఇప్పుడు వెళ్ళిపోవటంతో ఏవిఁటో దిగులుగా ఉంటోంది..

రామ : సంసారబంధం అటువంటిది కాబట్టే మనీషులు వైరాగ్యం తో వనాల్లో విశ్రమిస్తారు...

కంచుకి : (ప్రవేశించి) రామభ... (తత్తరపాటుతో...) మహారాజా!...

రామ : (నవ్వుతూ) ఈ మధ్యన నేను రాజైనంతమాత్రాన "మహారాజా!" అని పిలువనక్కర్లేదు... నీ అలవాటు ప్రకారం "రామభద్రా" అనే పిలవవచ్చు...

కంచుకి : తమ దర్శనార్థం ఋష్యశృంగాశ్రమాన్నుంచి అష్టావక్ర మహర్షి వచ్చి వేచి ఉన్నారు...

సీత : అయితే లోపలికిరాక ఇంకా ఆలస్యమెందుకు?

రామ : శీఘ్రమే ప్రవేశపెట్టు... (కంచుకి నిష్క్రమిస్తాడు)

అష్టా : మీ ఉభయులకూ స్వస్తి...

రామ : అభివాదయే... కూర్చోండి...

సీత : నమో నమః... ఇంటల్లునితో మా అత్తగార్లు కుశలమా?...

రామ : భగవాన్ ఋష్యశృంగులు నిర్విఘ్నంగా సోమపీథు లౌతున్నారు కదా!...

సీత : ఎప్పుడైనా మమ్మల్ని తలచుకొంటూ ఉంటారా?

అష్టా : ఎందుకు తలచుకోరమ్మా?... భూదేవిసుతవై, బ్రహ్మకల్పుడైన జనకమహారాజుని తండ్రిగా పొంది,



ఇక్ష్వాకు వంశజులూ, మాకు శిష్యులూ అయిన దశరథ మహారాజు కోడలివైన నీవు అచిరకాలంలోనే వీరమాతవు కాగలవని భగవాన్ వసిష్ఠులు తమ ఆశీర్వాదం అందించమన్నారమ్మా!...

రామ : వారికి మాపై ఉన్న అవ్యాజానురాగం అటువంటిది... సత్పురుషుల మాటలు అర్థాన్ననుసరించి ఉంటే ఋషుల మాటల్ని అనుసరించి అర్థం పరుగెత్తుతూ వస్తుంది...

అష్టా : సీతాదేవి గర్భవతి కనుక ఆమెకోర్కెలు తక్షణం తీర్చవలసిందని పూజ్య అరుంధతీదేవి, ముగ్గురు మాతలు, శాంతాదేవి మీతో మరీ మరీ చెప్పమన్నారు...

రామ : వారాదేశించినట్లింతకాలం జేరుపుతూనే ఉన్నాను...

అష్టా : అమ్మా! ఋష్యశృంగులవారు తమ ఒళ్ళో పిల్లాడాడు కొంటుంటే చూడాలని ఉందని చెబుతూ "దీర్ఘాయుష్మతివి కమ్మ" అని దీవన లందిస్తున్నారమ్మా!...

రామ : (నవ్వుతూ) తథాస్తు... భగవద్వసిష్ఠులు మాతో ఏమైనా చెప్పమన్నారా?

అష్టా : అల్లుడు ఋష్యశృంగుని యాజ్ఞకారణంగా తామక్కడ ఉండిపోవలసివచ్చిందని, తమరు రాజ్యభారాన్ని క్రొత్తగా చేపట్టారు కనుక ప్రజానురంజనమే ప్రధానకర్తవ్యంగా పరిపాలించేటం కీర్తిదాయకమని చెప్పమన్నారు.

రామ : వారి ఆదేశం మాకు శిరోధార్యం... ప్రజారాధనలో స్నేహం, దయ, సౌఖ్యాలనేకాక జానకిని విడవటానికి కూడా వెనుదీయను...

సీత : కనుకనే మీరు రఘువంశ ధురంధరులైనారు...

రామ : ఎవరూ అక్కడ?... అష్టావక్రమహర్షీ! మీరు విశ్రమించేండి...

అష్టా : (కొంచెం ముందుకువెళ్ళి చూసి) మన లక్ష్మణుడు వచ్చాడు (నిష్క్రమిస్తాడు)

లక్ష్మణ : అగ్రజా!... జయం!... జయం!... నా ఆదేశాన్ననుసరించి ఆస్థానచిత్రకారుడు మీజీవితఘట్టాల్ని చిత్రించి పంపాడు.... చూడండి...

రామ : మీ వదినగారిని తనవారు వెళ్ళిపోయారనే విచారం నుంచి దూరంచేయటానికి మంచి ఉపాయం ఆలోచించావు... చిత్రాలు ఏ ఘట్టం వఱకూ చిత్రించాడు?...

లక్ష్మణ : వదినగారు అగ్నితో పవిత్రురాలైనంత వఱకు!...

రామ : అయ్యో..... తీర్థజలాల్నీ, అగ్నిహోత్రునీ పరిశుద్ధపఱచేవేవీ లేనట్లే ఆజన్మశుద్ధురాలైన ఈమెను పవిత్రీకరించేదేముంటుంది?... దేవీ!... నాపై కినుకపూనకు... నాకీనింద జన్మాంతం ఉండేదే!...

సీత : ఇప్పుడదంతా ఎందుకుకాని, చిత్రపటాలు చూద్దాం రండి...

లక్ష్మణ : ఇవిగో చిత్రపటాలు... చూడండి...

సీత : ఎంతబాగున్నాయీ చిత్రాలు!... ఈ చిత్రంలో ఆర్యపుత్రుల్ని స్తుతిస్తున్నట్లుగా ఆపైనున్నవేమిటి?...

లక్ష్మణ : అవి అద్భుతమైన జృంభకాస్త్రాలు... ఇవి కృశాశ్వమహర్షి విశ్వామిత్రులకిస్తే గురుపాదులు విశ్వామిత్ర బ్రహ్మర్షి తాటక వధానంతరం అన్నగారికి ప్రసాదించారు...

రామ : పూర్వం బ్రహ్మాదులు వెయ్యేళ్ళకుపైగా ఘోరతపస్సాచరించినప్పుడు వారి తపఃఫలంగా ఈ దివ్యాస్త్రాలు వారికి దర్శనమిచ్చాయి. దేవీ!... ఆ దివ్యాస్త్రాలకు నమస్కరించు...

సీత : నమోనమః...

రామ : ఈ మహాస్త్రాలు నీ సంతానానికి సహజంగానే లభిస్తాయి...



సీత : తమ అనుగ్రహం!...

లక్ష్మణ : ఇదిగో ఈ చిత్రం మిథిలావృత్తాంతాన్ని విశదీకరించేది!...

సీత : శివధనుర్భంగం చేసి నిల్చున్న ఆర్యపుత్రుల్ని మా తండ్రి ఆశ్చర్యంగా చూస్తున్నారు...

లక్ష్మణ : ఇది చూడండి... తమ వంశపురోహితులైన గౌతముని పుత్రులు శతానందునితో కలిసి జనకమహారాజు వసిష్ఠాది గురుజనుల్ని పూజిస్తున్న దృశ్యం...

రామ : ఎంత మనోహరంగా ఉందీ చిత్రం!... విశ్వామిత్రుల ఆధ్వర్యవంలో రఘుజనకవంశాలు వియ్యమందటం ఎంతటి విస్మయకరసన్నివేశం!...

సీత : ఇది మీ నలుగురన్నదమ్ములూ వివాహదీక్షతో నిలుచున్న చిత్రం... నాకిప్పుడక్కడున్నట్లే ఉంది...

రామ : అవును... ఆనాటి మధురోహాలన్నీ ముంచుకొస్తున్నాయి!...

లక్ష్మణ : ఇదిగో – ఇందులో వదినెగారిక్కడ, చిన్నవదినెగారు, మాండవి, ఆ ప్రక్క సౌభాగ్యవతి శ్రుతకీర్తి!..

సీత : మాండవికీ, శ్రుతకీర్తికీ మధ్యలో చేక్కదనాల చుక్క ఇంకో అమ్మాయుండెవరు?

లక్ష్మణ : (సిగ్గుతో తనలో) ఊర్మిళ గుఱించి అడుగుతోంది!... ఈవిడ దృష్టి మరలుస్తాను... (పైకి) ఇదిగో ఇది చూడవలసిన చిత్రం! భగవానులు భార్గవరాములు...

సీత : అమ్మో!... ఆయన్ని చూస్తే భయమేస్తోంది...

రామ : మహర్షీ... నమోస్తు తే...

లక్ష్మణ : మా అన్నగా రాయన్ని...

రామ : (చెప్పనీయకుండా) ఇంకా చాలా చిత్రాలున్నాయిగా లక్ష్మణా!... వాటిని చూపించు...

సీత : ఆర్యపుత్రా!... ఈ వినయమే మిమ్మల్ని మహోన్నతుల్ని చేసింది...

లక్ష్మణ : ఆఁ!.... అయోధ్యకు వచ్చేశాం!...

రామ : (కన్నీటితో) పితృపాదులు జీవించి ఉన్న దినాలవి... వివాహవేడుకలన్నీ వారిని సంతోషంలో ముంచెత్తేవి... ఆ దినాలు వెళ్ళిపోయాయి... మళ్ళీరావు...

లక్ష్మణ : ఇదిగో ఇది మంథర...

రామ : (ఇంకొక చిత్రాన్ని చూపిస్తూ) శృంగిబేరపురంలో గుహుని స్నేహం మనకానందాన్ని చేకూర్చింది... అక్కడ ఇంగుదీ వృక్షం చూడు...

లక్ష్మణ : (నవ్వుతూ తనలో) అన్నగారు కైకమ్మ సన్నివేశాన్ని దాటేస్తున్నారు...

సీత : ఈ చెట్ల పాలతోనేకదా మీరు జేడలు ధరించింది?...

లక్ష్మణ : పూర్వం ఇక్ష్వాకు రాజులు వార్ధక్యంలో అరణ్యవాసం చేస్తే అది మా అన్నగారికి బాల్యంలోనే అబ్బింది..

సీత : ఇదిగో భగవతి భాగీరథి!...

రామ : ఓ భాగీరథీమాతా!... నమస్సు... మా పూర్వుడు భగీరథుని కఠోరతపఃఫలంగా ప్రభవించి, ఆ మహనీయుని తాతముత్తాతలు స్వర్గధామాన్ని చేర్చింది నీ పవిత్రస్పర్శే కదా!...

లక్ష్మణ : ఇదిగో... జనస్థానంలో ప్రస్రవణపర్వతం!...

రామ : అప్పటి సన్నివేశాలు గుర్తున్నాయా సీతా!... మనిద్దఱం ఏకశయ్యాగతులమై పరస్పర పరీరంభసౌఖ్యా న్ననుభవిస్తూ ముచ్చేటలాడుకొంటూఉంటే మనల్ని చూస్తూ మందమందంగా రాత్రే నడిచిపోయింది...



లక్ష్మణ : పంచవటిలో శూర్పణఖ ఇదిగో!...

సీత : అయ్యో!... ఆ తరువాత మీ దర్శనం లేకపోయిందిగా!... ఈ జనస్థానంలోని సంఘటన ఇప్పుడు జరుగుతున్నట్లే తోస్తోంది!...

లక్ష్మణ : రాక్షసులు బంగారులేడి మిషతో వదినెగారిని మీకు దూరం చేసినపుడు మీరు పొందిన దుఃఖానికి రాళ్ళుకూడా కరిగిపోయాయి...

సీత : అయ్యో!... నావలన ఆర్యపుత్రులకెంత ఆర్తి! (రామునికి కళ్ళల్లో నీరు చిమ్ముతుంది)

లక్ష్మణ : అన్నా! ఇదేవింటి?...

రామ : అప్పుడు సతీవిరహాన్ని శత్రువులపై కోపం భగభగ మండుతుంటే ఓర్చుకొన్నాను! ఇప్పుడానాటి విరహం దుఃఖాన్ని కలిగిస్తోంది...

సీత : ఆనాటి మీ ఎడబాటు ఈ చిత్రదర్శనంతో ఇప్పుడు కలుగుతున్నట్లనిపించి దుఃఖం పొంగుకొస్తోంది...

లక్ష్మణ : (తనలో) వీరిదృష్టి మరల్చాలి... ఇటుచూడండి!... పితృసముడైన జటాయువు..

సీత : తండ్రీ! జటాయూ!... మామీద నీ పుత్రవాత్సల్యానికి హద్దులేదు!...

రామ : సీతాపహరణ వృత్తాంతాన్ని నాకు తెలియజెప్పింది నీవేగా పక్షిరాజా!...

లక్ష్మణ : ఇదిగో ఇది మతంగాశ్రమం, శబరి, పంపాసరస్సు... ఇడిగో మహానుభావుడైన మారుతి!...

సీత : మీ వార్తతో ఆనాడు నా ప్రాణాల్ని నిలిపిన మహాత్ముడు!...

రామ : అంజనాదేవికి ఆనందవర్ధనుడైన ఈ మహామహుడు మన పనులన్నీ చేక్కబెట్టి విశ్వశ్రేయస్సును చేకూర్చాడు...

లక్ష్మణ : ఇంకా ఎన్నో చిత్రాలున్నాయి... కాని వదినెగా రలసి పోయి నట్లున్నారు కనుక మఱొకదినం వాటిని వీక్షించేవచ్చు...

సీత : ఈ చిత్రాల్ని చూసిన తర్వాత నాకో కోర్కె జనిస్తోంది... చెప్పనా?...

రామ : అవశ్యం!...

సీత : ఈ తపోవనాల్లో విహరిస్తూ శిశిరస్నానాలు చేయాలని ఉంది!...

రామ : అదెంత భాగ్యం!... లక్ష్మణా!... మన తల్లులిప్పుడే కదా గర్భిణి అయిన జానకి కోరిన కోర్కెలన్నీ తీర్చాలని ఆదేశం పంపారు!...

లక్ష్మణ : అవును...

రామ : మీ వదినె ప్రస్థానానికి త్రోవలో కుదుపులకు ఓర్చుకొనే రథాన్ని సిద్ధంచెయ్యి ...

సీత : మీరూ నాతో రావాలి!...

రామ : ఆమాట వేఱుగా చెప్పాలా?...

లక్ష్మణ : నేను రథాన్ని సిద్ధం చేస్తాను... (నిష్క్రమిస్తాడు)

రామ : ఈ గవాక్షం వద్ద కాస్సేపు విశ్రమిద్దామా?...

సీత : అలసటతో నాకు నిద్రముంచుకొస్తోంది...

రామ : అయితే నా చేతిని దిండుగా చేసికొని నా ఒడిలో శయనించు... ఆహా!... నీ చేతి స్పర్శతో సర్వేంద్రియాలూ ఆనందంతో ఉద్విగ్నత నొందుతున్నాయి... ఒక అలౌకిక మైన అనిర్వచనీయానందం అనుభూతమౌతోంది... ఇది



నిద్రో, మత్తో, మోహమో, విషమో, సుఖమో, దుఃఖమో ఇదమిత్థంగా తెలియటం లేదు...

సీత : నాపై మీకున్న ప్రేమ అటువంటిది... ఇందులో ఆశ్చర్య మేముంది?...

రామ : ఈనాగృహలక్ష్మిరూపే నాచూపులకు అమృతోపమానం.. ఈమెస్పర్శే గంధపుపూత, తనచేతులు నా కంఠాన్నాశ్లేషిస్తే ముత్యాలదండగా శోభిస్తున్నాయి... ఈమె విరహం క్షణమైనా సహించే లేకపోతున్నా!...

ప్రతీహారి : ప్రభూ!... తమ ఆంతరంగిక పరిచారకుడు దుర్ముఖు డొచ్చాడు!...

రామ : (తనలో) మా పౌరుల మనోభావాల్ని తెలుసుకొనిరమ్మని పంపించాను కదా!... (పైకి) లోపలకు రమ్మను...

దుర్ము : (తనలో) మహారాణి సీతాదేవిని గుఱించిన ఈ దుర్వార్తను ప్రభువుల కెలా నివేదించేను!... ఈ పనికి నన్ను నియ మించేటం నా దురదృష్టం!...

సీత : (కలవరింతగా) ఆర్యపుత్రా!.... ఎక్కడికెళ్ళారు?...

రామ : చిత్రాల్లో చూచిన నావిరహాన్నే భావిస్తూ నిద్రించి ఉంటుంది... కలలో అదే రావటంవల్ల ఈ కలవరింత!... (ప్రేమతో సీతశరీరాన్ని నిమురుతూ) దాంపత్యమంటే సుఖదుఃఖాది సర్వావస్థల్లోనూ అద్వైత భావనే కదా! హృద యానికి విశ్రాంతిని కల్గిస్తూ వార్ధక్యంలోకూడా ప్రేమని పెంచేదిదే. కనుకనే ఇది అందఱికీ సేవ్యమాన మౌతోంది..

దుర్ము : (ప్రవేశించి) దేవరకు జయం!...

రామ : రా!... నువ్వు తెచ్చిన సమాచారం ఏవిఁటో చెప్పు!...

దుర్ము : తమరు దశరథమహారాజుల వారినే మఱపిస్తున్నారంటూ ప్రజలంతా ముక్తకంఠంతో మిమ్మల్ని కీర్తిస్తున్నారు ప్రభూ!...

రామ : ఈ స్తోత్రపాఠాలకేంగాని, మాలో దోషాల్ని ఎవరైనా చూపిస్తుంటే చెప్పు... సరిదిద్దుకొంటాం!...

(దుర్ముఖుడు కన్నీటితో రాముని చెవిలో ఏదో చెబుతాడు) ఎంతటి పిడుగువంటి వార్త!... (స్పృహ కోల్పోతాడు)

దుర్ము : దేవా!... ఓర్చుకోండి...

రామ : అంతటి అద్భుతమైన అగ్నిపరీక్ష పొంది విశుద్ధురాలైనా దైవదుర్విపాకంతో వైదేహి కీనింద పిచ్చికుక్క కాటు విషంలా వ్యాపిస్తోందే!... ఊఁ!... దురదృష్టవంతుణ్ణి నేనేం చెయ్యాలి?... ప్రజారంజనమే ప్రథమకర్తవ్యం!... అదే వసిష్ఠులవారి ఆదేశం కూడా!... తండ్రిగారు కూడ మాటమీద నిలబడటంకోసమే నన్నూ ప్రాణాల్నీ వదిలేరు కదా!... ఇక్ష్వాకువంశపూర్వరాజన్యు లీవంశాన్ని పవిత్రతమం చేసి నా కప్పగిస్తే ఈ నింద నన్నెంత చరిత్ర హీనుణ్ణి చేసింది!... అయ్యో! జగత్తునే పవిత్రం చేసే నీకీ అపవాదేవిఁటి సీతా!... దుర్ముఖా!... నువ్వు లక్ష్మణుని వద్దకు వెళ్ళి ఈ రాజాజ్ఞ నందజెయ్యి... (చెవిలో ఏదో చెబుతాడు).

దుర్ము : అగ్నిశుద్ధ అయిన జగత్పావనిని, రఘువంశవారసుని కన బోతున్న నిండుగర్భిణిని దుర్మార్గ పౌరజనాపవాదంతో ఈ స్థితికి గుఱి చేయటం న్యాయమా ప్రభూ!...

రామ : పౌరజానపదులు దుర్మార్గులెలా అవుతారు? ఆనాడక్కడ లంకలో జరిగిన అగ్నిపరీక్ష ఇక్కడివారికెలా తెలుస్తుంది?... వెళ్ళు...



దుర్ము : (దుఃఖంతో) అయ్యో!... తల్లీ!... (నిష్క్రమిస్తాడు)

రామ : ఎంతటి క్రూర కర్మకొడిగట్టవలసి వచ్చింది!... నా స్పర్శతోనే మహాపాపాలంటుతాయి!.. ప్రాణేశ్వరిని తాకి ఆమెను అపవిత్రను చెయ్యను!... (తన చేతి క్రిందున్న సీత తలను దిండుపై ఉంచి) దుఃఖాన్ననుభవిం చేటానికే బ్రహ్మ నాకు ప్రాణాలు పోశాడు!.. అమ్మా అరుంధతీ!... భగవత్స్వరూపులైన వసిష్ఠ విశ్వామిత్రులారా!... అగ్నిహోత్రా!... పితృసముద్రైన జనకమహారాజా!.. తల్లులారా!... తండ్రీ!.. సుగ్రీవ హనుమంత విభీషణులారా!... నావల్ల నేటికి మీకు తలవంపులు కలిగాయి!... మీ పేర్లు ఉచ్చరించేటానికి కూడా మహాపాపినైన నాకర్హత లేదు... నా ఈ పాపానికి నిష్కృతి లేదు... ఇంటికి దీపమైన ఇల్లాలిని, నిండు గర్భిణిని చేతులారా వన్యమృగాలపాలు చేస్తున్నాను!... (తన శిరస్సును సీతపాదాలపై ఉంచి) దేవీ!... నీ పాదస్పర్శ ఈ శిరసుకు ఇక ఉండదు కదా! (దుఃఖిస్తాడు)

– నేపథ్యంలో – రక్షించేండి! రక్షించేండి! అనే కేకలు=

యమునా తీరంలో ఉగ్రతపస్సాచరిస్తున్న ఋషులు లవణాసురుని బాధలకు గుఱి అవుతున్నారు!...

రామ : ఇంకా రాక్షసభయం తీఱలేదా?! కుంభీనసుని కొడుకైన వీణ్ణి సంహరించేటానికి శత్రుఘ్నుని పంపుతాను... (రెండడుగులు వేసి వెనక్కు వచ్చి) అయ్యో!... ప్రాణేశ్వరీ!... తల్లీ! భూదేవీ!... నీ కూతురు జానకిని నువ్వే కాపాడాలమ్మా!... (నిష్క్రమిస్తాడు)

సీత : (లేచి) అయ్యో!... ఎంతటి దుస్స్వప్నం!...

దుర్ము : అమ్మా! రథం సిద్ధమైందని లక్ష్మణకుమారులు మనవి చేయమన్నారు...

సీత : నా ఆలస్యమేముంది?... పద...

దుర్ము : అమ్మా! ఇటు... ఇటు...

సీత : తపోధనులకు, ఆర్యపుత్రులకు, గురుజనానికీ నమస్కృతులు! వెళ్ళొస్తాను...

★★★



## రెండవఅంకం

వాసంతి : తపస్విని ఆత్రేయికి స్వాగతం!...

ఆత్రేయి : నువ్వీ వనదేవత వాసంతివి కదూ!

వాసంతి : అవును... మీరెక్కణ్ణుంచి వస్తున్నారు? మీ ప్రయాణం ఎందాకో తెలుసుకోవచ్చా?

ఆత్రేయి : వాల్మీకి మహర్షులవారి ఆశ్రమం నుంచి, అక్కడ అధ్యయనానికి విఘ్నాలేర్పడటంతో అగస్త్యమహర్షి ఆశ్రమానికి బయలుదేరాను...

వాసంతి : వాల్మీకిమహర్షుల ఆశ్రమంలోఅధ్యయనానికి విఘ్నాలా?...

ఆత్రేయి : ఎవరో ఒకదేవత కుశలవు లనేఇద్దఱు ప్రభావోపేతులైన పసివారిని ఆయనకప్పగించింది...

వాసంతి : పసివారు ప్రభావోపేతులా?...

ఆత్రేయి : అప్పుడే తల్లిపాలు వదిలిన వారిలా ఉన్నారు. వారికి పుట్టుకతోనే జృంభకాస్త్రాలు అధీనమైనాయట!...

వాసంతి : ఎంత చిత్రం!...

ఆత్రేయి : వారిరువురికి కాలోచితమైన వైదిక సంస్కారాలన్నీ వాల్మీకి మహర్షే చేసి మూడు వేదాల్నీ వారిచే అధ్యయనం చేయించారు... ఏక సంథాగ్రాహులైన ఆ అపూర్వ ప్రజ్ఞానిధులతో సమానంగా నేనెక్కడ అధ్యయనం చేయగలను?... తరువాత ఆ మహర్షికి బ్రహ్మ దివ్యదృష్టినిచ్చి శ్రీరామ కథను కావ్యంగా చేయుమని ఆనతిచ్చాడట!... ఆ కావ్య రచన కూడ పూర్తిచేశారు... నాకు అగస్త్యాశ్రమం త్రోవ చెప్పవూ?...

వాసంతి : ఇదిగో, ఇలా వెడితే ముందు పంచవటి, అక్కడి నుంచి గోదావరీ తీరం మీదుగా సాగితే అగస్త్యాశ్రమం వస్తుంది...

ఆత్రేయి : పంచవటి, గోదావరి అనగానే జానకి గుర్తొస్తోంది... పాపం జానకి!...

వాసంతి : ఏం అలా అంటున్నారు?... ఏమైంది జానకికి!...

ఆత్రే : ఆ మహాసాధ్విపై లేనిపోని అపవాదులొచ్చాయి...

వాసంతి : ఏవిఁటవి? (ఆత్రేయి వాసంతిచెవిలో చెబుతుంది) అయ్యో!... ఎంతటి పిడుగుపాటువంటినింద!... (స్పృహ కోల్పోతుంది)

ఆత్రేయి : తెప్పటిల్లమ్మా!... తెప్పటిల్లు...

వాసంతి : సీతా మహాసాధ్విని అడవిలో లక్ష్మణుడు విడిచిపోయిన తర్వాత ఆమె విషయాలేవీఁ తెలియలేదా?

ఆత్రేయి : లేదు...

వాసంతి : పూజ్యులైన అరుంధతీవసిష్ఠులు ఇంట్లోనే ఉంటుంటే అత్తగార్లు ముగ్గురూ బ్రతికుండగానే సీతామహాసాధ్వికి ఇంతటి దుఃస్థితి ఎలాకలిగింది?

ఆత్రేయి : వాళ్ళెవరూ ఆ సమయంలో అక్కడ లేరు...

వాసంతి : మఱి?

ఆత్రేయి : అల్లుడు ఋష్యశృంగునియజ్ఞం చూడటానికి వెళ్ళారు... పన్నెండేళ్ళ దీర్ఘ సత్రయాగం పూర్తయి సన్మానితులై వీరంతా తిరిగి వస్తుంటే ఈ దుర్వార్త తెలిసింది. అరుంధతీదేవి సీతలేని అయోధ్యలో తానడుగుపెట్టనంటే వసిష్ఠ మహర్షి అత్తలూకూడా అలాగేనని అందఱూ వాల్మీకి మహర్షి ఆశ్రమానికి వెళ్ళారు...

వాసంతి : రామచంద్రు దంతటివా డెంత అకార్యానికి తలపడ్డాడు!... ఇంతకీ ఆయనిప్పుడేం చేస్తున్నట్లు?



ఆత్రేయి : అశ్వమేధయాగాన్ని సంకల్పించాట్ట!

వాసంతి : అయితే మళ్ళీ పెళ్ళికూడా చేసుకొన్నాడా?

ఆత్రేయి : లేదు... లేదు...

వాసంతి : మఱి ధర్మపత్ని లేకుండా యజ్ఞాన్నెలా చేస్తాడు?...

ఆత్రేయి : సీత సువర్ణ ప్రతిమతో...

వాసంతి : అయ్యో!... ఒక్కొక్కసారి వజ్రంకంటే కఠినంగాను, మఱొకప్పుడు పువ్వుకంటే మృదువుగానూ ఉండే మహాత్ముల చిత్తవృత్తిని తెలిసికోవటం ఎవరి తరం?

ఆత్రేయి : ఒకనాడొక విప్రుడు తన కుమారుడు మృత్యువాత పడ్డాడని రాజాస్థానసింహద్వారం వద్ద విలపించే సాగాడు... ధర్మస్వరూపుడైన రామభద్రుడు తన పాలనలో లోపం లేకపోతే ఇటువంటి అకాలమరణాలు ప్రాప్తిం చేవని తన లోపం గుఱించి ఆలోచిస్తుంటే...

– ఫ్లాష్ బ్యాక్ –

ఆకాశవాణి : రాజా!... శంబూకుడనే వృషలుడు తన వర్ణాశ్రమ ధర్మాన్నతిక్రమించి తపస్సాచరిస్తున్నాడు... అతణ్ణి వధిస్తే విప్రసుతుడు పునర్జీవితుడౌతాడు.

(ఫ్లాష్‌బ్యాక్ ముగిసింది)

ఆత్రేయి : ఆ ఆకాశవాణి ఆదేశాన్ననుసరించి శ్రీరాముడు ఖడ్గాన్ని ధరించి పుష్పక విమానాన్నెక్కి శంబూకునన్వేషించే సాగాడు...

వాసంతి : ఆ తాపసుడు అధోముఖుడై కార్చిచ్చునుంచి వచ్చిన ధూమాన్ని ఆహారంగా తీసికొని ఈ జనస్థానం లోనే తపస్సు చేస్తున్నాడు... కనుక శ్రీరాముడు ఈ వనాన్ని త్వరలోనే దర్శిస్తాడన్నమాట!...

ఆత్రేయి : అయితే మఱి నే వెళ్ళిరానా?...

వాసంతి : మంచిది... (ఇద్దఱూ నిష్క్రమిస్తారు)

రామ : (తనలో) నిర్దయుణ్ణై మునిని సంహరించేవలసి వస్తోంది... పోనీ విప్రబాలుడు బ్రతుకుతాడేమో!

శంబూక : మహారాజా!... ధన్యోస్మి... దయతో నువ్వు నన్ను వధించే టంతో నాకు దివ్యరూపం, దివ్యశక్తులూ లభించాయి... అక్కడ విప్రసుతుడు పునర్జీవితుడైనాడు...

రామ : తపస్సులో నువ్వార్జించుకొన్న సద్గతులను పొందు...

శంబూక : నాకిది మీ అనుగ్రహంతో కలిగిందేకాని తపఃఫలం కాదు.. అయినా నాతపఃఫలమే కావచ్చు... నేను తపస్సు చేయకపోతే సాక్షాత్పరమేశ్వరుడవైన నువ్వు నన్ను వెతుక్కొంటూ వందయోజనాలు ప్రయాణించి వస్తావా?... ఎక్కడి అయోధ్య?... ఎక్కడి దండకారణ్యం?...

రామ : ఏవిఁటీ ఇది దండకారణ్యమా!... ఆఁ!.. అవునవును.. గుర్తొస్తోంది....

శంబూ : ఇది దండకారణ్యమే ప్రభూ!... ఇదివఱకు మీరిక్కడేకదా ఖరదూషణాది పద్నాలుగువేలమంది రాక్షసుల్ని సంహరించింది!... అందువల్లనేకదా పిఱికి పందలమైన మాబోటి జానపదులం కూడ నిర్భయంగా తిరగ్గల్గుతున్నాం....

రామ : దండకారణ్యంలోనూ జనస్థానమా ఇది...

శంబూ : చిత్తం!... ఇది ఖరదూషణాదులు నివసించిన జనస్థానమే!...

రామ : ఆనాటి జ్ఞాపకాలన్నీ మనసులో మెదులుతున్నాయి!... (తనలో) సీతా!... మనం ఆనాడు కలిసి తిరిగిన ప్రదేశాలు!... నాపై నీ ప్రేమ ఎంత దివ్యమైంది!... ప్రియజనం ఏమీ చేయకపోయినా ఎదురుగా ఉన్నంత మాత్రంతో దుఃఖాలన్నీ పోయి సుఖం కలుగుతుంది... ప్రియజనాన్ని మించిన ధనం ఏముంటుంది?... (కన్నీరు ఆపుకొంటూ పైకి) నీ స్వర్గమార్గం శుభాన్ని చేకూర్చు గాక!...



శంబూ : అగస్త్యమహర్షుల దర్శనం చేసి వారికి ప్రణతులర్పించి స్వర్గాన్ని చేరుతాను... (నిష్క్రమిస్తాడు)

రామ : (తనలో) ఆనాడు సీతతో విహరించిన ప్రస్రవణ పర్వత సానువులివిగో... ఈ పర్వత శిఖరం మీదే జటాయువు ఉంటూ ఉండేవాడు... ఇదిగో పంచవటి... ఈ వనదేవత వాసంతి నా ప్రాణేశ్వరి మైథిలికి ప్రాణసఖి... ప్రాణేశ్వరి సీతను చేజేతులా వదలిన పాతకుణ్ణి నేను...

శంబూ : దేవరకు జయం!... తమరిక్కడున్నారని చెప్పటంతో అగస్త్యాది మహర్షులంతా మీ రాకను నిరీక్షిస్తున్నారు... తమను చూసి వెళ్ళి అశ్వమేధాన్ని నిర్వర్తించేవలసిందిగా మునీంద్రుల అభ్యర్థన...

రామ : అగస్త్యమునీంద్రుల దర్శనానికై బయలు దేరుతాను.

★★★

## మూడవఅంకం

దండకారణ్యం

తమస : చెలీ!... మురళా!... ఏవిటంత కంగారుగా వస్తున్నావు?...

మురళ : తమసా!... నీకు తెలుసుకదా!... భార్యావియోగదుఃఖంతో శ్రీరామచంద్ర ప్రభువు చిక్కి శల్యావశిష్టుడైనాడు... ఆయన ఇప్పుడు పంచవటిలో ఉన్నాట్ట!... పూర్వస్మృతులు ముప్పిరిగొని ఆయన ఏ ప్రమాదానికి లోనౌతాడో!... జాగ్రత్తగా ఉండాలి...

తమస : మన మేం చేయగలం? అయినా ఆయనకు సంజీవని సన్నిహితంగానే ఉంది...

మురళ : అదేవిటి?...

తమస : నిండు గర్భిణిని ఆనాడు లక్ష్మణుడు వాల్మీకి ఆశ్రమానికి దగ్గఱగా వదలి వెళ్ళిన తర్వాత దుర్భరమైన ప్రసవ వేదనను భరించేలేక సీతాదేవి గంగలో దూకింది... అప్పుడామెకు ఇద్దఱు కొడుకులు పుట్టారు...

మురళ : (సంతోషంగా) కవలలా?...

తమస : అవును... అపుడాసీతామహాసాధ్విని భూదేవి, భాగీరథి రక్షించి రసాతలానికి తీసికొని వెళ్ళారు... ఆ పిల్లలు తల్లి పాలు వదిలిన వెంటనే భాగీరథి స్వయంగా తీసికొనివెళ్లి వాల్మీకి మహర్షికి అప్పగించింది!...

మురళ : నిష్కల్మషులైన సీతారాముల బిడ్డలను కాపాడటానికి పృథ్వీభాగీరథులంతటివారే పూనుకోవలసివచ్చింది...

తమస : సరయూనదివల్ల రామచంద్రుడు శంబూకవధార్థం జనస్థానానికి వస్తున్నాడనే వార్త విన్న భాగీరథీదేవి సీతాదేవితో గోదావరిని దర్శించేటానికి వస్తోంది...



మురళ : భాగీరథి ఆలోచన ఎంతో ప్రశస్తమైంది... రామునికి మనస్స్వాస్థ్యం చేకూర్చటానికి ఈ స్థితిలో సీత మాత్రం ఏం చేయగలదు?

తమస : అదేవిటో నాకు తెలియదుకాని కుశలవులకు నేటితో పన్నేండేళ్ళు పూర్తి కావటంతో, పన్నెండు ముళ్ళతో తోరణానికి పూజలు సలిపి వారిచేత ధరింపజేయాలట!... స్వయంగా పూలుకోసి, వంశ మూలపురుషుడైన సూర్య భగవానుని పూజించేలట!... గంగాదేవి ప్రభావంతో సీతాదేవిని భువిపై మానవులేకాక, వనదేవతలు కూడా చూడలేరట!... నన్ను కూడా వెళ్ళి సీతాదేవికి సహాయంగా ఉండమని గంగాదేవి ఆనతిచ్చింది... (ఇద్దఱూ నిష్క్రమిస్తారు)

సీత : (పూలుకోస్తూ ప్రవేశం)

– నేపథ్యంలో –

రాముని స్వరం : పుష్పక విమానమా!... ఇక్కడ ఆగు...

సీత : తమసా!... అదిగో నా నాథుని కంఠస్వరం!...

తమస : కావచ్చు... రాజవిధి నిర్వహణకు రాముడు దండకారణ్యానికి వచ్చాడని తెలిసింది!...

సీత : నావియోగదుఃఖంలో కూడ వారు రాజధర్మాన్ని నిర్వహించేటం నా పూర్వపుణ్యం...

– నేపథ్యంలో –

రాముడు : సీతతో గడిపిన ఆనాటి జ్ఞాపకాలన్నీ మనోవీథిలో ముసురుకొంటున్నాయి...అయ్యో!... వైదేహీ!... (స్పృహ కోల్పోతాడు)

సీత : నాథుడు మూర్ఛితుడైనాడు... తమసా!... ఆయన్నెలాగైనా రక్షించేలి...

తమస : అది నీ చేతుల్లోనే ఉందమ్మా!... మృదువైన నీ హస్త స్పర్శ తోనే నీ నాథుడు తేఱుకుంటాడు.

(నేలపై పడి ఉన్న రాముని సీత తనచేతులతో నిమురుతుంది)

సీత : (సంతోషంగా) నాథుడు తేరుకొంటున్నట్లున్నారు...

రామ : ఏవిఁటీ వింత!... చుట్టూ ఎవరూ లేరు!... అమృతం కురిపించినట్లై ఒంట్లో జవసత్వాలు చేకూరుతున్నాయి!... ఏదో అనుభూతమైన స్పర్శలా ఉంది!... సీత స్పర్శే ఇది!... మఱెక్కడా కనిపించేదే?...

సీత : తమసా!... ఇక వెడదాం రా!... నేనాయన కంటపడితే నా మీద కోపగిస్తారేమో!...

తమస : ఎందుకంత భయం? భాగీరథీ వర ప్రభావంతో నీకంతా కనిపిస్తారు కానీ నువ్వెవరికీ కనిపించేవు!.... నువ్వు నిర్భయంగా సంచరించేవచ్చు...

రామ : ప్రియసఖీ!... జానకీ!... నా ప్రాణం జానకీ!...

సీత : (దుఃఖం, కోపం కలిసి) ప్రాణేశ్వరా! మీరు చేసిన పనికీ, చెబుతున్న మాటలకూ ఏమైనా పొంతన ఉందా?

రామ : అయ్యో!... సీత ఎక్కడా లేదే?!... దేవీ!... పోయే ప్రాణాల్ని నిలిపింది నిశ్చయంగా నీ స్పర్శే!... ఉన్నట్లే ఉండి ఎక్కడికి వెళ్ళిపోయావు సీతా!... సీతా!...

సీత : ఆయన మాటలు నా ప్రాణానికి తేనె జల్లుల్లా ఉన్నాయి.

రామ : అయినా నా పిచ్చి కాకపోతే సీత ఇప్పుడిక్కడెందుకుంటుంది? అంతాభ్రాంతి!... ఆఁ!... ఎవరూ?... వాసంతి!... వాసంతీ!...

వాసంతి : రఘువీరా!... జయం! జయం!... లక్ష్మణకుమారులకు క్షేమమే కదా!



రామ : ఆఁ!... క్షేమమే!...

వాసంతి : దేవరా! (దుఃఖంతో) అకారణంగా మీసహధర్మచారిణిని విడిచిపెట్టేంత కఠినహృదయులెలా అయ్యారు ?...

(స్పృహకోల్పోతుంది)

రామ : వాసంతీ!... తెప్పఱిల్లు... తెప్పఱిల్లు...

వాసంతి : (తేఱుకొని) ఈ చేయరాని పనిని ఎలా చేయగలిగారు ప్రభూ!...

రామ : ప్రజలకిష్టం లేకపోయింది...

వాసంతి : ఎందుకని?...

రామ : అది వారికే తెలియాలి!...

వాసంతి : కీర్తికాంక్షతో క్రూరంగా ఆమెను అడవిలో వదలి ఎంత అప్రతిష్ఠపాలైనారో తెలుసా?... అక్కడావిడకు ముప్పు వాటిల్లితే మీ ప్రాణానికి హాయిగా ఉంటుందా?...

సీత : నా ప్రస్తావనతో ఆయనకు మఱింత దుఃఖం కలిగించేటం ఏం న్యాయం వాసంతీ?...

తమస : మీకు కలిగిన కష్టానికి ఆమె దుఃఖమే కారణం!...

రామ : (దుఃఖంతో) జానకీ! ఎక్కడున్నావు?...

సీత : అయ్యో... నాప్రాణనాథుడు నాకోసం ఎంతగా విలపిస్తున్నారు?...

తమస : విలపించేనీ... ఈ విధంగానైనా ఆయన దుఃఖం కొంత తగ్గుతుంది...

రామ : నా ధర్మపత్ని ఆనాడు నా ఇంట్లో ఉండటం పౌరజానపదులకు ఇష్టం లేకపోయింది... అందుకే ఆమెను అడవులపాలు చేసేశాను... తరువాత ఆమె వియోగం మదిలో బడబానలంవలె దహించేస్తున్నా తమాయించుకొని

రాచేకార్యాలకు భంగం కలుగజేయలేదు... పూర్వం ఆమెతో తిరిగిన ఈ ప్రదేశం చేరేసరికి ఆమె స్మృతులు నన్ను వివశుణ్ణి చేస్తున్నాయి...

వాసంతి : గత జలసేతుబంధనంవల్ల ప్రయోజనమేముంది? ధైర్యం వహించేండి...

రామ : ధైర్యం! హుఁ!... ఈపన్నెండేళ్ళూ మొండిబ్రతుకు బ్రతికిందాధైర్యంతోనేగా!... జానకీ!... ఆనాడీ వేదికపైనేకదా! నాఒడిలో చేరి గోదావరిఅలలను చూసి ఆనందించావు!... అహో!... ఆ దృశ్యం కళ్ళముందాడుతూ ఉంది... అయ్యో!... నువ్విప్పుడు లేవు కదా!.. (స్పృహ కోల్పోతాడు)

సీత : లోకకళ్యాణార్థం ఆవిర్భవించిన నా ప్రాణ నాయకునికి నావల్ల ఎంతటి దుఃఖం! (స్పృహ కోల్పోతుంది)

వాసంతి : తేఱుకోండి ప్రభూ!... తేఱుకోండి!...

తమస : సీతా!... సేదతీరు!... ఇప్పుడు నీ కరస్పర్శే రామునికి రక్షణ!... లే!... (సీత లేచి శ్రీరాముని గుండెనీ, లలాటాన్ని నిమురుతుంది)

వాసంతి : హమ్మయ్య!... రామచంద్ర ప్రభువు తేఱుకొన్నారు...

రామ : వాసంతీ!... ఇవాళ నాపుణ్యం పుచ్చి జానకే తిరిగి వచ్చింది...

వాసంతి : అవేం మాటలు ప్రభూ?... జానకెక్కడ?

రామ : చూడు!... చూడు!... నా ఎదురుగానే ఉంది... పూర్వం మా పెళ్ళిలో కంకణం ధరించిన ఆ మైథిలి చెయ్యే హాయిగా మంచు కురిసినంత చల్లగా నన్ను తాకింది!... ఆనందపారవశ్యంతో తలమున్కలై పోతున్నా!



వాసంతి : ఇదేం పాపం!... ప్రభువులు ఉన్మత్తులైపోతున్నారు...

సీత : (తొట్రుపాటుతో చేయి విదిల్చుకొని వెళ్ళిపోతుంది...)

రామ : అయ్యో!... వైదేహి ఇక్కడ లేదుగా!... మమతను ముద్ద కట్టిన మైథిలీ!... నన్నిలా వేదనపాలు చేసి పోవటం ఏవైనా బాగుందా?... కరుణించు...

సీత : ఆర్యపుత్రా!... మీ మాటలు విడ్డూరంగా ఉన్నాయి... నాకీ స్థితి కల్పించిందెవరు?

వాసంతి : ప్రభూ!... నిబ్బరంగా ఉండండి... అసలు సీత ఇప్పుడిక్కడికెలా వస్తుందనుకొన్నారు?...

రామ : (తనలో) అయితే సీత నిజంగా ఇక్కడకు రాలేదన్న మాట!... వస్తే తన ప్రియసఖి వాసంతికైనా కనిపించేదా?... కనుక నేనిప్పుడు పొందిన అనుభూతి స్వప్నమై ఉండాలి. అయితే నేను నిద్రపోతున్నానా?... హుఁ!... రామునికి నిద్ర కూడానా?... నా బాధకి భగవంతుడే జాలిపడి ఆమె సౌందర్యరూపాన్ని నాముందు నిలిపి నన్ను మోహింపజేస్తున్నాడేమో?...

సీత : నాథుని ఈ దుఃస్థితిలో చూస్తూ కూడా ఏమీ చేయలేని నా ప్రాణాలింకా పోవేం? (దుఃఖిస్తుంది)

రామ : వాసంతీ!... నేనిక్కడుండటంవల్ల మీకూ మనస్తాపమే... నేనిక బయలుదేరుతాను...

సీత : (తమసను పట్టుకొని) తమసా!... ఆర్యపుత్రులు వెళ్ళిపోతారటమ్మా!...

తమస : దిగులుపడకు... చిరంజీవులు కుశలవులకు పన్నెండవ ఏట జరపాల్సిన వేడుకలకు మనిద్దఱం కూడ భాగీరథి సన్నిధికి వెళ్ళాలి...

సీత : తమసా!... తమసా!... ఆర్యపుత్రుల్ని నన్నింకోసారి చూసుకోనియ్యవూ?...

రామ : అయినా అశ్వమేధక్రతువులో నాసహధర్మచారిణి ఉందిగా!...

సీత : (ఒక్కసారిగా నిర్విణ్ణయై) (తనలో) ఆమె ఎవరో?

వాసంతి : (ఆక్షేపంగా) ఓ!... తిరిగి వివాహమాడారా?...

రామ : లేదు... లేదు... సీత బంగారు ప్రతిమ!... దురదృష్ట వంతుణ్ణేం చేయగలను? సీతాప్రతిమను చూసుకుని సంతోషిస్తూ నా దుఃఖాన్ని దిగమ్రింగుకోవాలి!...

సీత : (నిట్టూర్చి కన్నీటితో) ఆర్యపుత్రా!... నాపై మీ ప్రేమ ఎంత స్థిరమైంది!... నన్ను విడిచిపెట్టారనే హృదయశల్యాన్ని పెకిలించివేశారు!...

వాసంతి : మనం ఇలా కలుసుకోవటంవల్ల మీ దుఃఖం మఱింత ఎక్కువైందేమో?... అయినా కర్తవ్యనిర్వహణ తప్పదుకదా!...

సీత : ఆర్యపుత్రుని అన్యాపదేశంగా వెళ్ళిరమ్మంటూ వాసంతి కూడ నాకు ప్రతికూలురాలౌతోంది...

తమస : అమ్మా! మనమూ వెడదాం...రా!...

సీత : అయ్యో!... వెళ్ళాలా?...

తమస : వెళ్ళక తప్పదు కదమ్మా!... పదమ్మా!...

సీత : (బాధగా) ఎంతో పుణ్యం చేసుకొన్నవారికి కాని కలుగని ఆర్యపుత్రుని పాదపద్మాలకివే నా సాష్టాంగప్రణామాలు (స్పృహ కోల్పోతుంది)

తమస : అమ్మా!... ఊరుకో!... ఊరుకో!... అహో!... దైవలీల!.. సముద్రంలో అలలు, బుడగలు, తుంపురులగా కనబడు



తున్నా నీరు ఒక్కటే అయినట్లు సందర్భాన్ని బట్టి భిన్న భిన్న రసాలుగా కనబడుతున్నా అసలున్నది కరుణరసం ఒక్కటే...

రామ : ఓ పుష్పక విమానరాజమా!... ఇటు... ఇటు...

తమస, వాసంతి : పృథివీగంగాదిదేవతలు, వేదాలు, ఇక్ష్వాకువంశ మూలపురుషుడు సవిత, అరుంధతీ ద్వితీయుడైన వసిష్ఠుడు, వాల్మీకి ఈ సీతారాములకు శ్రేయస్సులు కలుగజేయాలని ప్రార్థిద్దాం...

★ ★ ★

## నాల్గవఅంకం

వాల్మీకిఆశ్రమం

జనకుడు : బ్రహ్మణ్యులైన మహర్షులతో వేదాంత చర్చలు చేసి జీవన్ముక్తుణ్ణని అందరి ప్రశంసలూ అందుకొన్నా, మమతానురాగాలు వీడినా నేడెంత విషాదానికి లోనౌతున్నాను!... నా కూతురు సీతకు వాటిల్లిన దురవస్థ నన్నతలాకుతలం చేసేస్తోంది. ఇన్నేళ్ళు తపస్సు చేసినా మనశ్శాంతి లేదు... నా తల్లీ! సీతమ్మా!... పవిత్ర యజ్ఞభూమిలో జన్మించిన నీకే ఎటువంటి స్థితి దాపురించింది?... నీకీ స్థితి కల్గిందని నోరెత్తి చెప్పుకోవటానిక్కూడా సిగ్గుగా ఉందే!... నాలుక పెగల్దే!... అమ్మా!... వసుంధరాదేవీ!... నీదెంతటి దృఢమైన మనస్సు? నాబిడ్డ కాదు, నీ బిడ్డ సీతాదేవిమాహాత్మ్యం నీకు, అగ్నిహోత్రునికి, అరుంధతీ వసిష్ఠులకు, గంగకు, ఇక్ష్వాకుకులపతి సూర్యభగవానునికీ తెలియనిదా?... అంతటిమహాతల్లిని దారుణంగా భర్త త్యజిస్తే ఎలా సహించేగలిగేవమ్మా?...

నేపథ్యంలో : అమ్మా!... ఇటు... ఇటు...

జనకుడు : శిష్యుడెవరో దారిచూపుతుంటే దివ్యతపస్విని అరుంధతీ దేవి కాబోలు ఇటే వస్తున్నట్లుంది!... (లేచి) అరెc! అమెకాదు... ఎవరీమె?... ఓc... నా ప్రియసఖుడు దశరథ ధర్మపత్ని కౌసల్య కదూ!... ఇదేవిcటి?... కొంచెంగా కూడా గుర్తుపట్టటానికి వీల్లేనంతగా మారిపోయింది!... ఒకప్పుడు ఈమెని చూసినప్పుడు నాకెంతో సంతోషంగా ఉండేది!... కూతురు దురవస్థకు వేగిపోతున్న నాకు ఈనాడీమె దర్శనం



పుండుపై కారం చేల్లినట్లుంది!... అహో!... విధి వైపరీత్యం!...

(అరుంధతి, కౌసల్య, పరిచారకుడు ప్రవేశిస్తారు)

అరుంధతి : కౌసల్యా!... నామాట వినుతల్లీ!... మీ కులగురువులు బ్రహ్మర్షి వసిష్ఠులే మనం స్వయంగా వెళ్ళి జనకమహా రాజుని దర్శిం చేవలసిందని ఆజ్ఞాపించారు...

పరిచారకుడు : అమ్మా!... బాధను లోలోనే అణచుకోండి... బ్రహ్మర్షి వర్యుల ఆజ్ఞ అనుల్లంఘనీయమని మనవి...

కౌసల్య : దుఃఖం పొంగుకొస్తోంది... ఇంతటి చేటుకాలం దాపురించాక ఏ మొహం పెట్టుకుని ఆయన్ని చూడగలను?...

అరుంధతి : నిజమే... ఇష్టుల ఎడబాటుతో కలిగిన దుఃఖం బంధువు లొచ్చినప్పుడు పెగిలి, గుండె బద్దలై, వెయ్యి కాలువలై ప్రవహిస్తుంది...

కౌసల్య : కొడుకు రాముని పట్టాభిషేకం నాడు చూశాను... మళ్ళీ ఈనాడీ స్థితిలో!... నాటికి నేటికీ ఎంత తేడా?...

జనకుడు : భగవతీ!... అరుంధతీ!... ప్రణామాలు...

అరుంధతి : సూర్యభగవానుడు రజోగుణపరమైన పరబ్రహ్మ నీకు ప్రతిభను, పవిత్రతను ప్రసాదించుగాక!...

జనకుడు : (వ్యంగ్యంగా-కోపం ధ్వనించేటట్లు) కంచుకీ!... రాజ మాతకు కుశలమా?...

పరి : (తనలో) ఎంత నిష్ఠూరంగా మాట్లాడుతున్నారు?... (పైకి) రాజర్షివర్యా!... శ్రీరాముని చూడక చాలానాళ్ళై దుఃఖిస్తున్న ఈమెకు మీ కోపం మరింత దుఃఖాన్ని కలుగ జేస్తోంది... శ్రీరామభద్రునిగ్రహచారం చాలక, భగవంతుడాయన పట్ల

లేకపోవటంవల్ల, పౌరు లల్పబుద్ధితో అంతటి అగ్ని పరిశుద్ధను పెక్కుమాటలన్నారు... కనుకనే రామభద్రు డంతటిదారుణకృత్యానికి ఒడిగట్టవలసి వచ్చింది!...

జనకుడు : (కోపంతో) ఆపు!... అగ్నిరా నాకూతుర్ని పవిత్రీకరించేది?...

అరుంధతి : అవును... 'సీత' అనే రెండక్షరాలే చాలు పవిత్రతకు!... అమ్మా!... చిన్నదానివైనా, స్త్రీవైనా లోకపూజితురాలైనావు... గుణవంతులకు పూజార్హతను కల్పించేవి వారి గుణాలే కానీ వయస్సు, లింగం కాదు కదా!...

కౌసల్య : నాలోని బాధ ప్రజ్జ్వరిల్లుతోంది (స్పృహ కోల్పోతుంది)

జనకుడు : ఏమైంది? ఎందుకిలా?...

అరుంధతి : రాజర్షీ!... ఇంకేంఉంది?.. మీ మిత్రురాలు కౌసల్యకు మిత్రులైన మిమ్మల్ని చూట్టంతోనే దశరథమహారాజు, ఆనాటి సౌఖ్యం, సౌందర్యఖని అయిన జానకమ్మ, ఆ మంచి దినాలు జ్ఞప్తికి వచ్చి ఇదమిత్థమని చెప్పలేని దుఃఖం ముంచుకొచ్చింది. స్త్రీల చిత్తం కుసుమపేశలం కదా!...

జనకుడు : అయ్యో!... నా ప్రియసఖుడు దశరథుని ధర్మపత్నిని చూడక చూడక ఇన్నేళ్ళకు చూడగల్గినా సంతోషంతో ఉండగా చూళ్ళేకపోయాను!...పాపం ఆనాటి కౌసల్య నేడిట్లా అయిపోయింది!... అయ్యో!... ప్రియసఖీ!... (కమండలువు లోంచి నీళ్ళు తీసుకొని ముఖంపై చేల్లుతాడు).

కౌసల్య : (తేఱుకొని) అమ్మా!... జానకీ!... ఏవైంపోయావు?... ఎక్కడున్నావు?... మీమామగారు నిన్ను కోడలిగా పొందినందుకెంత గర్వించేవారు?...



పరిచారకుడు : అవు నామహాప్రభువుకు కొడుకుల్లో రామభద్రులంటే ఎంతప్రేమో సీతమ్మగారంటే అంతకంటె ఎక్కువ!... సీతమ్మగారిని శాంతమ్మగారిలాగే చూసుకొనేవారు...

కౌసల్య : అమ్మా!... జానకీ!... గుండెల్లో గునపాలు గుచ్చినట్లుంది నీ వియోగం!... నిర్భాగ్యురాలిని... నా ప్రాణాలైనా పోతే నాకీ బాధ ఉండేది కాదు!... ఏంచెయ్యను?

అరుంధతి : ఊరుకో... ఊరుకో... పదిమందిలో ఏడవకూడదు... ఋష్యశృంగాశ్రమంలో వసిష్ఠులు భవిష్యత్తులో శుభం చేకూరుతుందని చెప్పారు కదా!... ఆయన చెప్పినవన్నీ జేరుగుతూనే ఉన్నాయికదా!...

కౌసల్య : ఏం జేరగటమో?!... నా ఆశలన్నీ నానాటికీ అడుగంటిపోతున్నాయి!...

అరుంధతి : అయితే ఆయన ముఖప్రీతికి అసత్యం పలికారనుకొంటున్నావా?... పిచ్చితల్లీ!... అంతా శుభమే అవుతుంది!... కొంచెం ఉగ్గబట్టుకో!...

(నేపథ్యంలో కలకలం)

జనకుడు : వటువులకు ఇవాళ ఆటవిడుపు... ఆ కోలాహలం అనుకుంటాను!...

కౌసల్య : అవును!... వాళ్ళలో ఆ మధ్యలోఉన్న కుఱ్ఱవాడెవరో ఎంత ముద్దొస్తున్నాడు! మన రామచంద్రుని పోలికల్లేవూ?...

అరుంధతి : (అవతలికి తిరిగి తనలో) అప్పుడు భాగీరథి చెప్పిన రహస్యమిదేకాబోలు!... అయినా కుశలవుల్లో వీడెవరో తెలియటం లేదు...

జనకుడు : రాఘవుడే బాలుడై వచ్చినట్లుంది!...

పరిచార : ఇతడు క్షత్రియవటువై ఉంటా డనుకొంటాను!...

జనకుడు : భగవతీ!... ఈ కుఱ్ఱవాడెవరో, ఎక్కడివాడో మీరూహించే గలరా?

అరుంధతి : మనమంతా కలిసి ఇప్పుడేకదా ఇక్కడికొచ్చాం!... నాకు మాత్రమేం తెలుస్తుంది?

జనకుడు : కంచుకీ! ఈ పిల్లవాడెవరో తెలిసికోవాలని ఉంది... నువ్వెళ్ళి వాల్మీకి మహర్షుల వారినీ విషయం అడిగి, ఎవరో వయోవృద్ధులు మీ దర్శనార్థం వచ్చారని చెప్పు!...

పరిచార : చిత్తం!...

జనకుడు : అయస్కాంతం ఇనుము నాకర్షించినట్లు వీడు నన్నాకర్షిస్తున్నాడు...

లవుడు : ప్రవేశించి (తనలో) వీరెవరో తెలియదు... శాస్త్రోక్తంగానే వీరి కభివాదం తెలుపుతాను (పైకి) లవకుమారః అహం భో అభివాదయే...

అరుంధతి : ఆయుష్మాన్ భవ!

కౌసల్య : చిరంజీవ!... చిరంజీవ!... ఇటు రా నాయనా!... (ఒళ్ళో కూర్చోబెట్టుకొని) రాజర్షివర్యా!... ఇతని మొహంలో కోడలు సీత పోలికలు కనబడటంలా?

జనకుడు : చాలా పోలికలున్నాయి...

కౌసల్య : నాయనా!... మీతల్లితండ్రులెవరు?...

లవ : లేరు... నాకెవరూ లేరు!... వాల్మీకి మహర్షులే నాకన్నీ... నాకు తెలిసిందిదే...

(నేపథ్యంలో) : సైనికులారా!... మీరిక్కడ దిగి మునీశ్వరులకెటువంటి ఆటంకం కలిగించేవద్దని చంద్రకేతు ప్రభువుల ఆజ్ఞ!...

అరుంధతి : అశ్వమేధీయాశ్వాన్ని రక్షిస్తూ చంద్రకేతువు వచ్చినట్లుంది!...



కౌసల్య : నేడెంతటి సుదినం!... మానాయన లక్ష్మణుని కుమారుడింతటి వాడైనందుకు మహానందంగా ఉంది!...

లవ : అయ్యా!... ఈచంద్రకేతు వెవరండీ?...

జనకుడు : దశరథమహారాజు పుత్రులు రామలక్ష్మణు లన్న పేరెప్పుడైనా విన్నావా?...

లవ : తెలియకేం?... రామాయణ కథానాయకులు!...

జనకుడు : ఆ లక్ష్మణుని కొడుకే చంద్రకేతువు!...

లవ : ఊర్మిళాదేవి కొడుకు, రాజర్షి మిథిలాధిపతి దౌహిత్రుడు!...

అరుంధతి : ఇతనికి రామాయణకథాంశాలు బాగా తెలుసునల్లే ఉందే!...

జనకుడు : అయితే ఆ దశరథపుత్రుల్లో ఎవరెవరికి భార్యలెవరో, వారి సంతానం ఎవరో చెప్పు చూద్దాం!...

లవ : లేదు... లేదు.. మేమింకా అంతవఱకు చేదువలేదు.. మేమేకాదు, ఇంకెవరూకూడా చేదువలేదు...

జనకుడు : కవీశ్వరు లాభాగాన్ని రచించేలేదంటావా?...

లవ : రచించారు కానీ, మాకింకా చెప్పలేదు... అందులోదే ఒక భాగాన్ని నాటకరూపంలో వ్రాసి, ఆ ప్రతిని, భరత మహర్షికి పంపారట!...

జనకుడు : ఆయన కెందుకూ?...

లవ : భరతమహర్షి దానిని అప్సరసలతో అభినయింపజేస్తారని!...

జనకుడు : ఈ విషయం మాకెంతో ఆసక్తిని కల్గిస్తోంది!...

లవ : వాల్మీకి ఋషిపుంగవులకూ అదంటే ఎంతో ఇష్టం!... ఆ గ్రంథాన్ని కొందఱు శిష్యులతో భరతమహర్షికి పంపుతూ

మా సోదరుని కూడా పంపేరు!... మా సోదరుడు ధనుర్ధారి అయి రక్షణార్థం వారితో వెళ్ళాడు...

కౌసల్య : నాయనా, నీకు సోదరుడు కూడా ఉన్నాడా?...

లవ : అవును... నాకు అన్న, కుశుడు...

కౌశల్య : అయితే నీకంటె పెద్దవాడన్నమాట!

లవ : అవును... ప్రసవ సమయంలో శిశువు భూపతనమయ్యేంత కాలం నాకంటే పెద్ద!...

జనకుడు : ఓ!... అలా అయితే మీరు కవలపిల్లలన్నమాట!

లవ : అవును... (అరుంధతితో) అమ్మా!... వీరెవరు?

అరుంధతి : ఈమె కౌసల్య, ఆయన జనకమహారాజు!...

జనకుడు : దుర్మార్గులైన ప్రజలెంతటికి తెగించారు! రాజైన రాముడు కూడ ఎంత తొందరపడ్డాడు?... తలచుకొన్నకొద్దీ హృదయం దహించుకుపోతోంది... శాపంతోనో, శరంతోనో కాని ఈ క్రోధాగ్ని చల్లారేట్లు లేదు...

కౌసల్య : (భయంగా) భగవతీ! అరుంధతీ!...రక్షించు... రక్షించు... రాజర్షిని శాంతపఱచు!...

అరుంధతి : అవమాన ప్రతీకారానికి ఋషులకీ రెండే శరణ్యాలు. కానీ రాజర్షీ!... రాముడు నీకు పుత్రతుల్యుడు, ప్రజలు అజ్ఞానులు, కనుక మీకృపకు అర్హులు...

జనకుడు : అవును... నాకీ ఆగ్రహం తగదు...

ఒక వటువు : లవకుమారా!... మనఆశ్రమంలోకి ఒకఅశ్వం వచ్చింది.... రా!రా! మనం జంతు విశేషం అని విన్నామే కాని ఎప్పుడూ చూడలేదుగా?...

లవ : అయితే అది అశ్వమని నీకెలా తెలుసు?



వటువు : పశుశాస్త్రంలోనూ, యుద్ధశాస్త్రంలో కూడా వర్ణించినట్లే ఉంది, కనుక దాన్ని అశ్వంగా పోల్చుకొన్నాను...

లవ : ఎలా ఉందేమిటి?

వటువు : తినబోతూ రుచి అడిగినట్లు దాన్ని నేను వర్ణించేటం దేనికి? నువ్వే చూద్దువుగానిరా! (లాగుతాడు)

లవ : అయ్యా!... చూస్తున్నారుగా!... వీళ్ళు నన్ను నిలువ నీయటం లేదు... వెళ్ళొస్తా!... (నిష్క్రమిస్తాడు)

కంచుకి : (ప్రవేశించి) వాల్మీకిమునిపుంగవులు ఆవిషయం సమయం వచ్చినప్పుడు మీకే తెలుస్తుందని చెప్పమన్నారు...

జనకుడు : భగవతీ అరుంధతీ!... సఖీ! కౌసల్యా!... మనమే స్వయంగా వెళ్లి వాల్మీకి మహర్షులవారిని దర్శించేటం మంచిదని తోస్తోంది... (నిష్క్రమిస్తారు)

వటువు : (లవునితో) అదిగో!... చూశావుగా అది అశ్వమేకదూ?...

లవుడు : అవును...ఇది కేవలం అశ్వమేకాదు...అశ్వమేధీయాశ్వం...

వటువు : అది నీకెలా తెలుసు?

లవ : మూర్ఖా!... అశ్వమేధకాండలో చదివింది అప్పుడే మఱచి పోయావా?... ఈ అశ్వానికి రక్షణగా సేన!... వారి రక్షణ లోనే ఈ గుఱ్ఱం మేయటానికి వెడుతోంది!... నామాట నమ్మకపోతే వెళ్ళి వాళ్ళనే అడిగిరా!...

వటువు : వాళ్ళు వెనుక నడుస్తూ ఉంటే ఈ గుఱ్ఱం దేశాటనం చేస్తున్నట్లుందెందుకు?

లవ : (ఆలోచించి) అవున్రా!... గుర్తొచ్చింది!... అశ్వమేధమంటే ప్రపంచాన్నంతా జయించిన మహారాజు చేయవలసిన యజ్ఞం!...

(నేపథ్యంలో) : ఈ అశ్వం, ఈ ధ్వజం, ఈ శూరజనం, ఈరేడులోకాలకీ ప్రభువైన రావణవైరివి!...

లవ : ఏవిఁటీ ఔద్ధత్యం?! ఈభూమండలం అంతా నిఃక్షత్రియ మైన ట్లనుకొంటున్నాడు!

(నేపథ్యంలో) : క్షత్రియులెంతమందున్నా మారాజుముందేపాటివారురా?

లవ : ఛీ!... మూర్ఖా!... ఎందుకా ప్రగల్భాలు?...మీ రాజు వీరు డైతే కావచ్చు... కానీ అంతటి స్వోత్కర్ష పనికి రాదు... సరే... మాటలెందుకుకాని, ఎత్తిన ఆ బావుటాని ఇప్పుడే కూలదోస్తాను... ఒరేయ్!... సహాధ్యాయులూ!... అడ్డమైన వాళ్ళని రాళ్ళతో రువ్వి మన ఆశ్రమానికి ఈ గుఱ్ఱాన్ని తోలుకుపొండిరా!...ఇది మనలేళ్ళతో కలిసే మేస్తుంది!...

ఒకడు : (కోపంతో) ఏవిఁటా నోటిదురుసుతనం?... మాసేన మహావీరసమన్వితం... ఆయుధపాణులైన సైనికులు ఎదిరించిన వాళ్ళు బాలురైనా సహించేరు!... సేనాపతి అయిన చంద్రకేతువు ఎప్పుడూ బాణాన్నెక్కుపెట్టే ఉంచుతాడు!... ఇక్కడకెప్పుడూ రాలేదు కనుక ఇక్కడి వింతలేవో చూస్తూ ఉండి ఉంటాడు!... ఏ క్షణంలోనైనా ఇక్కడకు రావచ్చు... కనుక ఈలోగానే ఎక్కడైనా దాక్కొని నీ ప్రాణాల్ని దక్కించుకో!...

వటువు : ఈ గుఱ్ఱంతో మనకేం పని? ఆశ్రమాన్నుంచి అప్పుడే చాలా దూరం వచ్చాం...మెఱిసే అస్త్రశస్త్రాలు వారి వద్ద ఉన్నాయి. మన త్రోవన మనం పోదాం రా!...

లవ : ఏవిఁటీ... వారి అస్త్రశస్త్రాలు మెఱుస్తున్నాయా... చూడు! వాటికేగతి పట్టిస్తానో!...

(నారిని సంధిస్తాడు)

★★★



## ఐదవఅంకం

నేపథ్యంలో : సైనికవరులారా!... వెనుదీయకండి... మన యుద్ధ ఘోషలు విని సుమంత్రుని సారథిగా చేసికొని చంద్రకేతువే మనకు సహాయంగా వస్తున్నాడు... (రథమెక్కి ధనుస్సును ధరించి చంద్రకేతువు ప్రవేశం)

చంద్ర : సుమంత్రా!... చూడండి!... మునికుమారుడు లవుడొక్కడే తనను చుట్టుముట్టిన సైన్యాల్ని పటాపంచలు చేయటం ఆశ్చర్యంగా ఉంది!... కించిత్కోపంతో కొంచెం ఎఱ్ఱబడ్డ ముఖంతో శరవృష్టి కురిపిస్తున్న ఈ పంచశిఖలు కల బాల వీరుడెవడో!

సుమంత్ర : ఈ బాలుడెవరో కాని ఆనాడు విశ్వామిత్రుని యజ్ఞరక్షణకు వెళ్ళిన రఘురామునే తలపిస్తున్నాడు...

చంద్ర : కాని ఇతడొక్కణ్ణే ఇంతమంది రథికులు, ధానుష్కులు ఎదుర్కోవటం చూస్తే నాకే సిగ్గేస్తోంది...

సుమంత్ర : ఇంతమంది కలిసే వీణ్ణేమీ చేయలేకపోతున్నారంటే ఇక విడివిడిగా ఎదుర్కొని ఏం చేయగలరు?

చంద్రకేతు : త్వరత్వరగా రథాన్ని పోనీయండి... ఈబాలునివిజృంభణ బీభత్సంగా ఉంది... ఇతని అల్లెత్రాటి ధ్వని మన సైనికుల దుందుభుల ధ్వనిని మించిపోతోంది... లెక్కకు మించి మన వీరుల తలలు తెగి నేల పడుతున్నాయి... ఎటుచూసినా మన సేనలతని ధాటికాగలేక వెనక్కి తిరుగుతున్నాయి...

సుమంత్ర : చంద్రకేతూ!... అదుగో ఆ బాలవీరుడు మనకి కూతవేటు దూరంలోకి వచ్చాడు.

చంద్ర : లవకుమారా!... ఈ సేనలతో నీకు పోరెందుకు? బలశాలివైతే నామీదకు రా!...

లవ : (ప్రవేశించి) సాధు, రాకుమారా! సాధు... నువ్వు నిజంగా ఇక్ష్వాకువంశీయుడవే కనుక నీ మీదకే వస్తున్నాను... (నేపథ్యంలో కలకలం, కోపంతో) ఏవిటిది?... ఒకసారి నాచేతిలో ఓడి ఇతనితో ద్వంద్వయుద్ధం చేయకుండా నన్నడ్డుకొంటారా?...పొండిరా దుర్మార్గులారా!... పొండి...

చంద్ర : మహాద్భుతమైన నీ యుద్ధంతో మెప్పించి నాకు మిత్రునివైనావు... కనుక నా పరిజనం నీ పరిజనమే... నీ సేనలతో నీకెందుకు పోరు?... నేనున్నాను... రా!...

లవ : సూర్యవంశానికి చెందిన ఈ రాకుమారుని మాటలు ప్రీతికొలుపుతూనే కఠినంగా ఉన్నాయి!... ద్వంద్వ యుద్ధంతోనే ఇతణ్ణి గౌరవించాలి!...

(నేపథ్యంలో తిరిగి కలకలం – క్రోధోద్రేకాలతో)

ఛీ!.. ఛీ!.. ఈ దుర్మార్గులు నన్నీ వీరునితో యుద్ధం చేయ నీయకుండా అడ్డుకొంటున్నారు...

చంద్ర : ఓ సామంతులారా!... ఒక్క బాలుణ్ణి ఎదుర్కోవటంలోనే మీ ప్రతిభ మంట కలిసింది!... మళ్ళీ అతణ్ణెందుకు చుట్టు ముట్టటం?...

లవ : అబ్బో!... జాలి కురిపిస్తున్నట్లుంది... వీరి పని చెబుతా (ధ్యానస్థితుడౌతాడు)

సుమంత్ర : ఏమాశ్చర్యం?... హఠాత్తుగా మన సైనికుల ఆర్భాటం మటుమాయమైంది!...

లవ : ఇక ప్రగల్భాలు పలుకుతున్న ఇతని పనేవిఁటో చూడాలి!...

సుమంత్ర : రాకుమారా!... ఈలవకుమారుడు మనసైన్యంపై నిశ్చయంగా జృంభకాస్త్రాన్నే ప్రయోగించి ఉంటాడు!...

చంద్ర : అందులో ఆవంతైనా అనుమానం లేదు... చూడండి, మన సేనలన్నీ బొమ్మకట్టుకుపోయాయి...



సుమంత్ర : ఇతనికీ జృంభకాస్త్రం ఎలా లభించిందో!...

చంద్ర : వాల్మీకిమునిపుంగవు లనుగ్రహించిఉంటారు!...

సుమం : కాదు కాదు... ఆయన కీఅస్త్రాలతో పనేముంది? జృంభకాస్త్రా లెక్కడ? ఆయనెక్కడ?ఇవి మొదట కృశాశ్వుడు సృజించినవి. అవి అక్కడనుంచి విశ్వామిత్రునికి, విశ్వామిత్రుని నుంచి మీపెదనాయన రామచంద్రప్రభువులకీ సంక్రమించాయి...

చంద్ర : దానికేం?... ఇంకెవరైనా ఋషులు తమ తపశ్శక్తితో సృజించేవచ్చు కదా!...

సుమం : అదుగో లవుడు సమీపిస్తున్నాడు... ఏమఱకు సుమా!...

చంద్ర, లవ : ఇదేవిఁటి ఇతణ్ణి చూస్తుంటే ఏదో చెప్పలేని మమతాను బంధం ముప్పిరిగొంటోంది!... ఇది పూర్వజన్మ బంధమా?... ఒకవేళ దూరమైన బంధుత్వమా?

సుమం : ఇది లోకంలో ఉందే!... ఒక్కొక్కణ్ణి చూస్తే నిష్కారణంగానే ప్రేమ పుట్టుకొస్తుంది!... మిత్రబంధం ఎన్నివేల ఏళ్ళైనా కొనసాగుతూనే ఉంటుందంటారు!...

చంద్ర, లవ : ఇతణ్ణి చూస్తుంటే కౌగిలించుకోవాలనిపిస్తోంది... సాన పెట్టిన మణిలాగా ప్రకాశిస్తున్న ఇతనిమీనిపై సాయకాల్నెలా వదలగలను?...

చంద్ర : సుమంత్రా!... నేను రథం దిగుతాను...

సుమం : ఎందుకు?

చంద్ర : ఇతడెందుకో నాకు పూజ్యుడుగా కనిపిస్తున్నాడు!... పైగా రథికుడు పాదచారితో పోరుసల్పటం యుద్ధనీతి కాదు కదా!... సుమంత్రా!... ఏవిఁటా ఆలోచన!...

సుమం : అబ్బే!... ఏంలేదు... నువ్వనుకున్నదే ధర్మం... రఘువీరుల నైజం కూడ!...

లవుడు : రథం మీదే నువ్వు చేక్కగా ఉన్నావు... రథం దిగకు!...

చంద్ర : అయితే నువ్వుకూడా ఇంకో రథం ఎక్కాలిగా!...

లవ : ఆర్యా!... రాకుమారుని తిరిగి రథం పైకి తీసికోండి...

సుమం : అయితే నువ్వుకూడా చంద్రకేతువు మాట మన్నించాలిగా!...

లవ : నాకభ్యంతరం లేదు కానీ మేం అరణ్యవాసులం కనుక రథమెక్కటం ఎప్పుడూ అభ్యసించేలేదు...

సుమం : అబ్బా!... ఎంత సంగనాచివి?... తెలియకేం? స్నేహాన్నీ దర్పాన్నీ రెండూ సమపాళ్లలో చూపగల నేర్పరివే?... రామచంద్రప్రభువే నిన్ను చూస్తే ఆయన హృదయం కరిగి కాలువలు కడుతుంది...

లవ : అయ్యా!... మీరు చెబుతున్న ప్రభువు సత్పురుషుడంటారు నిజమేనా? మేం ఆశ్రమవాసులం, ఇటువంటి యజ్ఞం పేరైనా తలచేం, ఆయన గుణవంతుడైతే గౌరవించేవచ్చు, కానీ ఈ హయరక్షకులన్నమాటలు క్షత్రియవీరులకు పొడుచుకొచ్చేట్లుండి వారిని గెలిచేసేట్లుంటే కోపగించాను.. అంతే!...

చంద్ర : (నవ్వుతూ) పెద్దవారి ప్రతాపాన్ని విని సహించేలేక కోప్పడ్డావా?...

లవ : నాకు వచ్చింది కోపమో కాదో కూడ చెప్పలేను కాని ఒకమాట చెప్పు, రాముడు శమదమాది షట్కసంపత్తి కలవాడనీ, దర్పాలు పలికేవాడు కాడనీ విన్నాను... పైగా ఆయన ప్రజలుకూడ గర్విష్ఠులుకారంటారు... అవునా?...

చంద్ర : అవును...

లవ : అయితే సైనికుల ఈ మాటలేవింటి? ఋషులు సైతం గర్వితుని ఉన్మత్తుడు, రాక్షసుడూ అంటారు... అన్ని విరోధాలకూ గర్వమే మూలమంటారు... మధురవాక్కుని ప్రశంసిస్తారు... సత్యవాక్కు సర్వశుభాలకూ మూల మంటారు!... అది కామధేనువులా కోర్కెల్నితీర్చి, పాపాల్ని తొలగించి, అలక్ష్మిని నశింపజేసి కీర్తిని చేకూరుస్తుందంటారు...



సుమంత్ర : వాల్మీకిశిష్యుడైన ఈకుమారుడు ఋషిసంస్కారం ఉట్టిపడేట్లు మాట్లాడుతున్నాడు కదూ!...

లవ : అది సరేకాని చంద్రకేతూ!... ఇందాకేవంన్నావ్? "పెద్దల ప్రతాపాన్ని సహించేలేక కోప్పడ్డావా"! అయినా, ఒక్క మాట... క్షత్రియధర్మం ఎవరో ఒక్కనిలోనే ఉండాలని వ్రాసిపెట్టుందా ఎక్కడైనా?...

సుమంత్ర : సాక్షాద్భగవంతుడైన శ్రీరామచంద్రుని నువ్వెఱుగవు... తెలిస్తే నువ్విలా మాట్లాడవు... ఇక ఈ ప్రసంగాన్నిక్కడితో ఆపితే మంచిది...

చంద్ర : సైనికుల్ని వధించానని సంతోషిస్తే సంతోషించేవచ్చుకాని జమదగ్నిసుతుని జయించినవానినలా అనటం నీకు శ్రేయస్కరం కాదు!...

లవ : (నవ్వుతూ) ఓహో!... ఆయన జమదగ్నిసుతుని జయించినవాడా?... అందువల్ల ఒరిగిందేవింటో?! బ్రాహ్మణులకు మాటల్లో, క్షత్రియులకు భుజాల్లో బలం ఉంటుంది అంటారు... ఒక బ్రాహ్మణ్ణి జయించిన క్షత్రియుణ్ణింతగా పొగడవలసిన అవసరం ఏముంది?

చంద్ర : నిన్నకాక మొన్న పుట్టిన ఈ వీరునికి భార్గవులు భగవాను లనే విషయం తెలియదు... ఇక ఇక్ష్వాకువీరులు సప్త భువనాలకీ అభయప్రదాతలన్న విషయం అసలే తెలియదు...

లవ : చాలు చాలు... రఘువీరుల చరిత్ర, మహిమలు ఎవరికి తెలియనివి? కాని, ఒకమాట!... వారు పెద్దలు కనుక వారిని విమర్శిస్తే సహించేలేరు. ఒక స్త్రీ తాటకను చేంపటం, యుద్ధంలో ఖరుని చేంపటానికి మూడడుగులు వెనక్కి వేయటం, వాలివధలో వారిసత్యంలోనినేర్పు ప్రసిద్ధ మైనవే...

చంద్ర : సరే!... పెద్దలమీద ఎంతటి నిందలు వేయటానికైనా వెనుకాడని నీమర్యాద తెలుస్తూనే ఉంది!... ఇక నీ వాచాలత కట్టిపెట్టు!...

లవ : (తనలో) నామీదనే కాబోలు భ్రుకుటి సంధిస్తున్నాడు!...

సుమం : క్రోధాన్వితులైన ఈ ఇద్దఱి ముఖాలూ ఎంత సుందరంగా ఉన్నాయి!

లవ, చంద్ర : ఇక యుద్ధానికి తగిన ప్రదేశాన్ని వెదకుదాం రా!...

★★★



## ఆఱవఅంకం

యుద్ధభూమి

చంద్రకేతు... ఆగ్నేయాస్త్రం – వారుణాస్త్రం (లవుడు)
చంద్రకేతు – వాయవ్యాస్త్రం

– ఎఫెక్ట్స్ –

రామ : (పుష్పకవిమానం దిగుతూ) చంద్రకేతూ!... రా!...

చంద్ర : (రాముని పాదాలకు నమస్కరిస్తాడు రాముడు చంద్రకేతును కౌగిలించుకొంటాడు)

రామ : నీకు కుశలమేకదా! చంద్రకేతూ!...

చంద్ర : ఈ ప్రియమిత్రుడు లవుడుండగా నా కుశలానికేం లోటు?... నాయనగారూ!... ఇతడు వీరాగ్రేసరుడుకాని సామాన్యుడు కాడు... మీకు నాకంటె కూడ ప్రేమాస్పదుడు...

రామ : ఇతని రూపం ఎంత మనోహరంగా ఉంది!...చంద్రకేతుని మాటల్ని బట్టి ఆకార సదృశమైన ప్రజ్ఞ కూడ కలవాడే ననిపిస్తోంది... అస్త్రవేదం, క్షాత్రధర్మం, సద్గుణ పౌరుషాలు, సత్యం ఇతనిలో మూర్తీభవించినట్లున్నాయి!...

లవ : ఈ మహానుభావుని దర్శనమే అమందానందానుభూతిని కలిగిస్తోంది... మానవాకృతిని ధరించిన మధుసూదనునిలా కనిపిస్తున్నాడు...

రామ : తెప్పపాటులో నాసంతాపమంతా పోయి మనస్సు వాత్సల్య పూరితమైంది!...

లవ : చంద్రకేతూ!... వీరెవరు?

చంద్ర : వయస్యా!... మా తండ్రిగారు!...

లవ : నీకు తండ్రైతే నాకూ తండ్రే!... తండ్రి వరుసవారు నీకు నలుగురున్నారన్నావు కదా!... వాళ్ళలో ఈయనెవరని?

చంద్ర : తండ్రులందఱిలో వీరగ్రజులు!...

లవ : ఏవిఁటీ!... రఘురాములా?... ఈ దివ్యపురుషుని దర్శనంతో నా జన్మ ధన్యమైంది... నాయనగారూ!... పూజ్య వాల్మీకి శిష్యుడైన ఈ లవుని ప్రణామాలు...

రామ : దీర్ఘాయుష్మాన్ భవ!... (కౌగిలించుకొని) ఆహా!... ఎంతటి స్పర్శసుఖం!...

లవ : (తనలో) ఈమహాత్మునికి నాపై అవ్యాజానురాగం కలిగింది... అయ్యో! ఇంతటి మహానుభావునితో వైరం తెచ్చుకొని అపారసేనను మట్టుపెట్టాను... (పైకి) క్షంతవ్యోఽహం...

రామ : క్షమించేవలసినంత తప్పేం చేశావు లవకుమారా?...

చంద్ర : పితృదేవా! మీ సేనాపతులు చేసిన మీ ప్రతాపోత్కర్ష విని సహించేక వారిపై తన అఖండ పరాక్రమాన్ని చూపాడు...

రామ : క్షత్రియునికదే అలంకారం కదా!...

చంద్ర : తండ్రీ!... నా ఈ మిత్రుని క్రోధావేశం, ప్రతాపం కనీవినీ ఎఱుగనివి!... అన్ని దిక్కుల్లో వ్యాపించిన మనసేనలన్నీ ఇతడు ప్రయోగించిన జృంభకాస్త్రంతో స్తంభించి పోయాయి!...

రామ : లవకుమారా!... నీ అస్త్రాన్ని ఉపసంహరించు... చంద్రకేతూ!... అస్త్ర ప్రభావంతో ఏమీచేయలేక సిగ్గుపడుతున్న సేనాపతుల్ని పరామర్శించిరా!...

లవ : మీఆజ్ఞ శిరోధార్యం!... (ధ్యానస్థితుడై) నాఅస్త్రం ఉపశమించింది...

రామ : ఈ అస్త్రాలు ప్రయోగోపసంహారాల్లో మంత్రాన్విత మైనవికదా!... ఇవి నీకు గురుపరంపరానుగతంగా లభించాయా?...



లవ : మా ఉభయులకూ అవి సహజంగానే ప్రాప్తించాయి...

రామ : ఉభయుల కంటున్నావు?

లవ : మేము అన్నదమ్ము లిద్దఱం కవలలం కనుక...

రామ : అయితే ఆ రెండవవాడేడీ? (నేపథ్యంలో లవా! లవా! అని పిలుపు)

లవ : అడుగో... మాటలోనే నన్ను వెతుక్కొంటూవస్తున్నాడు మా అన్న కుశుడు.. అన్నగారికి జయం! జయం!...

కుశుడు : తమ్ముడూ!... ఏవిఁటి యుద్ధం యుద్ధం అంటున్నారు?...

లవ : దానికేం గాని ముందు ఈ పెద్దలపట్ల వినయం చూపు...

కుశ : ఎందుకు?

లవ : వీరు రఘురాములు... మనపట్ల అపారవాత్సల్యం చూపటమేకాక ఇప్పుడే నిన్ను చూడాలన్నారు కూడ!

కుశ : రామాయణ కథానాయకులైన దివ్యపురుషులు రఘు రాములకు వాల్మీకిమహర్షిశిష్యుడు కుశుని అభివాదాలు...

రామ : దీర్ఘాయుష్మాన్ భవ!... (కౌగిలించుకొని తనలో) ఇదేవిఁటి? కొడుకును కౌగిలించుకొన్న అనుభూతి! వీరిలో మా వంశీయుల పోలికలు కనిపిస్తున్నాయేవిఁటి? అంతేకాదు జానకి పోలికలు కూడా కొట్టొచ్చినట్లున్నాయి!.. ఇది శ్రీమద్వాల్మీకిమహర్షి తపోవనం కదా!... ఆనాడు లక్ష్మణుడు సీతనిక్కడేకదా ఒంటరిగా విడిచి వచ్చింది... జృంభకాస్త్రాలు వాటంతటవే వీరికి లభించాయని చెబుతున్నారు... గతంలో పూర్ణగర్భిణి అయిన సీత ఉదరం నిమురుతూ కవలపిల్లలు కలుగుతారని చెప్పి వారికి జృంభకాస్త్రాలు పుట్టుకతోనే సంక్రమిస్తాయని వరం ఇచ్చాను కదా!... ఇలా ఆలోచిస్తూంటే వీరు సీతకు కలిగిన

నా సంతానమేమోననిపిస్తోంది... (కన్నీరు తుడుచుకొంటూ) ఈ విషయం సమగ్రంగా విచారించి విషయం తెలిసికోవాలి...

లవ : తండ్రీ!... ధీరోదాత్తులైన మీకు కన్నీరెందుకు?

కుశ : తమ్ముడూ!... సీతను వీడిన రామునికి ప్రపంచంలో సుఖం ఎలా ఉంటుంది? రామాయణమే తెలియనివానిలా ఏవిఁటా ప్రశ్న?

రామ : నన్నుచూచి చివరకు కుఱ్ఱవాళ్ళుకూడా జాలిపడే స్థితికి దిగజారాను...

(నేపథ్యంలో) : ఇక్కడ లవుడు యుద్ధం చేస్తున్నాడని ఎవరుచెప్పారో కాని వాల్మీకి, వసిష్ఠులు, జనకుడు, అరుంధతి, వృద్ధరాణులు, హృదయాలు కొట్టుకొంటూ ఉంటే ఇటువైపే నడచి వస్తున్నారు...

రామ : గురుదంపతులు అరుంధతీ వసిష్ఠులిక్కడికెలా వచ్చారు? మా తల్లులు, జనక మహీపతి కూడానా?... అయ్యో!.. ఎంతటి నిర్భాగ్యుణ్ణి!... జనకమహీపాలుడుకూడా వచ్చాడంటుంటే గుండెల్లో పిడుగుపడ్డట్లైంది!...

(నేపథ్యంలో) : అయ్యో!... పాపం!... చిక్కిపోయిన అల్లుని చూసిన జనకమహారాజు మూర్ఛిల్లి తేఱుకొన్నాడు... తల్లులు నిశ్చేష్టలైనారు!...

రామ : అయ్యో!... మాతృమూర్తులారా!... జనకమహారాజా!... జనకరఘు–ఉభయ వంశాలకూ అశేషకీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన సీతను విడిచిన ఈ రాముడు మీ దయకు అర్హుడు కాదు...

కుశ, లవులు : నాయనా!... ఇటు...ఇటు...

★★★



## ఏడవఅంకం

లక్ష్మణుడు : (ప్రవేశించి) శ్రీవాల్మీకి ఋషిపుంగవులు వారి నిజ తపఃప్రభావంతో సకలదేవాసురులను, స్థావర జంగమాత్మకమైన అఖిల జగజ్జాలాన్నీ ఇక్కడకు చేరేట్లు చేశారు... ఆ మహర్షి వ్రాసిన నాట్యప్రబంధాన్ని అప్సర స్త్రీలచేత ప్రదర్శింపజేస్తారీతరుణంలో... వారి ఆహ్వానా న్నందుకొన్న రామచంద్రప్రభువు ఇక్కడ రంగభూమిని, ప్రేక్షకులకూ తగిన ఏర్పాట్లు చూడమని నన్నాజ్ఞాపించారు... ఏర్పాట్లన్నీ పూర్తిచేశాను... అరుగో అన్నగారు కూడా వస్తున్నారు...

రాముడు : లక్ష్మణా!... ఏర్పాట్లన్నీ సక్రమంగా పూర్తైనాయి కదా!...

లక్ష్మణ : చిత్తం...

రామ : ప్రేక్షకులంతా వారికి నిర్దేశించిన ఆసనాల్లో ఆసీనులైనారా?...

లక్ష్మణ : అంతా సుఖోపవిష్టులైనారగ్రజా!...

రామ : కుశలవకుమారులకు కూడ చంద్రకేతువు సరసన ఉచితాసనాలమర్చు...

లక్ష్మణ : వారిపట్ల మీకున్న ప్రేమాతిశయాన్ని తలచి మీరు చెప్పినట్టే ముందే అమర్చాను... ఇదిగో ఈ పీఠం తమకు... దయతో ఆసీనులుకండి... సూత్రధారీ!... ఇక రూపకాన్నారంభించేండి...

సూత్రధారి : సుహృదయులైన సామాజికులకు స్వాగతం!... భగవద్వాల్మీకులవారు తమ దివ్యదృష్టితో చూసిన ఇతివృత్తం ఆధారంగా కరుణాద్భుతరసనిర్భరంగా వ్రాసిన ఒక రూపకాన్ని మీ ఎదుట ప్రదర్శించేవలసిందిగా

నన్నాజ్ఞాపించారు... కనుక ప్రసన్న మనస్కులై తిలకించే ప్రార్థన...

రామ : సాక్షాద్భగవత్స్వరూపులైన వాల్మీకి మహర్షులకు అసత్యం అనేది అంటదు కనుక ఇది సత్యమని భావిస్తున్నాను...

– నేపథ్యంలో– (సీతపాత్ర) హా!... ప్రాణేశ్వరా!...

నాయనా! లక్ష్మణకుమారా!. నిర్భాగ్యురాలినైన నన్నీ నట్టడివిలో విడిచి వెళ్ళావు... గర్భవేదనను తట్టుకోలేక పోతున్నా... కనుక ఈ గంగానదిలో శరీరాన్ని విడుస్తాను..

లక్ష్మణ : (తనలో) ఇంతకంటె దారుణం ఈ సృష్టిలో మరొక టుండబోదు!

సూత్ర : రాకుమారి, అయోధ్యపట్టపురాణి ప్రసవవేదనను భరించలేక గంగానదిలో జీవితాన్ని త్యజించేటానికి పూనుకొంది! (నిష్క్రమిస్తాడు)

రామ : లక్ష్మణా!.. కాపాడు.. కాపాడు...

లక్ష్మణ : అగ్రజా!... ఇది నాటకమండీ!... వట్టి నాటకం!..

రామ : హా! దేవీ!... నావల్ల కదా నీకిన్ని కష్టాలు!...

చూస్తున్నా!.. వజ్రకఠోరమైన నా హృదయం దేన్నైనా చూస్తుంది, వింటుంది.. (గంగ, పృథ్వి చెరి ఒక కుఱ్ఱవాణ్ణి చేంకలో పెట్టుకొని సీతతో ప్రవేశిస్తారు) లక్ష్మణా!.. అంధకారంలో మునిగిపోతున్నా... నన్ను పట్టుకో...

భాగీరథి : అమ్మా!... సీతా!... ఓర్చుకో... నీ నోములు పండి...

పృథ్వి : ఇనకులాన్ని ధరించే కవలకుమారుల్ని గంగాజలంలో కన్నావు...



సీత : ఎంత అదృష్టవంతురాల్ని!... ఇద్దఱు కొడుకుల్ని కన్నాను... అయ్యో!.. ఆర్యపుత్రా!.. (మూర్ఛిల్లుతుంది)

లక్ష్మణ : (కాళ్ళపై పడి నమస్కరించి) అగ్రజా!.. మనపుణ్యం పండింది... రఘువంశం నేటికి చరితార్థమైంది... అన్నగారి ముఖం సంతోషంతో నిండినా కన్నీరు అలముకొంది... (విసురుతాడు)

పృథ్వి : అమ్మా!... సీతా!... తెప్పఱిల్లు... తెప్పఱిల్లు...

సీత : అమ్మా!... మీరెవరు?... ఈమె ఎవరు?...

పృథ్వి : ఈమె నీ మెట్టినింటి ఇలవేల్పు భాగీరథీదేవి...

సీత : నమో నమః...

భాగీ : పుణ్యచరితవైన నీకు పునఃపునః పుణ్యఫలం చేకూరు గాక!...

లక్ష్మణ : భాగీరథీదేవికి మాపై ఎంతటి అనుగ్రహం!...

భాగీ : ఈమె నీ మాతృదేవి పృథ్వీమాత!...

సీత : అమ్మా!... నీ కూతురి దీనదశ!...

పృథ్వి : ఇలారా అమ్మా (కౌగిలించుకొని మూర్ఛిల్లుతుంది)

లక్ష్మణ : (సంతోషంతో) మావదినెగారికి గంగాపృథ్వీదేవతల అనుగ్రహం చేకూరింది...

రామ : చూస్తూ చూస్తూ ఉంటే కరుణరసం ఎక్కువౌతోంది... సర్వప్రాణులకీ మోహం అనివార్యమైంది... ఇది అంతః కరణలో అప్రతిహతంగా నిలుస్తుంది...

భాగీ : భూతధాత్రీ! నిగ్రహించుకో... వైదేహీ!... నిగ్రహించుకో!...

పృథ్వి : భాగీరథీ!... ఓర్పుకు నిలయమైన నేనే సీతను కన్ననాటి నుంచే దానికెంతో దూరమైనాను!... వివాహవేళ తోరం కట్టినప్పుడు నా అల్లుని కీదురూహ కలుగుతుందని కల్లో నైనా అనుకోలేదు... నన్ను, జనకుని, అగ్నిహోత్రుని, సీత సపర్యల్ని, చివరకు సంతతినైనా తలుచుకోలేదు...

సీత : ఆర్యపుత్రునినామాన్ని తలచుకోవటం ఎంత సంతోష దాయకం!...

పృథ్వీ : చాలు చాల్లే!... ఆర్యపుత్రుడెవడు?

సీత : అమ్మా! (కన్నీరు కారుస్తుంది)

రామ : అమ్మా!... భూమాతా!... నేనటువంటి దుష్టుణ్ణే...

భాగీ : భగవతీ!... వసుంధరా!... అన్నీ తెలిసినదానివి. నువ్వా అల్లునిపై ఇంత కినుక పూనటం న్యాయమేనా?...లంకలో సీత అగ్నిపూత అయిన ట్లయోధ్యపురవాసులకు తెలియదు కదా!... ప్రజారంజనమే పరమకర్తవ్యంగా భావించే రాము డంతకంటె ఏంచేస్తాడు చెప్పు?...

సీత : అమ్మా!...ఇకనేనుభరించేలేను...నన్ను నీలో కలుపుకో!...

రామ : ఎంత కష్టం!... ఇంతకంటె ఘోరమైన కోరిక మఱొక టుంటుందా?..

భాగీ : అమంగళం కీర్తించేకు... నువ్వు వెయ్యేళ్ళు వర్ధిల్లాలి!...

సీత : ఈ పిల్లల పెంపకం నావల్లేమౌతుంది? అనాథను...

భాగీ : అలా అంటావెందుకు?...నువ్వనాథవుకావు... సనాథవే..

సీత : నావంటి అదృష్టహీన సనాథ కూడానా?...



గంగ : సర్వజగత్తులకు శుభాలు చేకూర్చే నీకు ఆత్మనింద పనికిరాదు!...

పృథ్వి : మైథిలీ!... మాకు కూడ నీవల్లనే పవిత్రత చేకూరింది...

లక్ష్మణ : విన్నారా అగ్రజా?...

రామ : లోకమంతా వినవలసిందిది.. (నేపథ్యంలో కలకలం)

పృథ్వి : ఏమిటాకలకలం? ఏమీ తెలియకుండా ఉంది...

గంగ : నాకు తెలిసింది... జృంభకాస్త్రాలవాణి అది.

(నేపథ్యంలో) : సీతాదేవీ!... నమస్సులు... చిత్రాల్ని చూచే సందర్భంలో రాముని మాటల్ని విన్నమేము నీ పుత్రులనాశ్రయించాం... తల్లీ! నీకు వందనాలు...

గంగ : రాముని చేపట్టిన మహాస్త్రాల్లారా!... మీకు శతసహస్ర వందనాలు...

పృథ్వి : మీ స్మరణ శిశువులకు శుభాలను చేకూర్చుగాక!

రామ : కరుణరసం అధికమై నాలో అద్భుతాలు మేళవించి ఒక అవ్యక్తానందానుభూతికి లోనౌతున్నాను...

గంగ : అమ్మా సీతమ్మా!... రామచంద్ర కల్పులైన ఇద్దఱు కుమారులు నీకు కలిగారు...

పృథ్వి : సంతోషించేవమ్మా!

సీత : నా పుత్రులకు క్షత్రియోచితమైన జాతకర్మాదిసంస్కారాల నెవరు చేస్తారు?

గంగ : దిగులుపడకు... వాళ్ళు తల్లిపాలు వదలటంతోనే మేమే వాల్మీకి మహర్షి సన్నిధికి చేరుస్తాం!...

పృథ్వి : ఆమహనీయుడే వీరికి అవసరమైనవన్నీ సమకూరుస్తాడు...

రామ : గంగాపృథ్వుల ఆలోచన ఎంత ప్రశస్తమైంది?...

లక్ష్మణ : అగ్రజా!.. కుశలవులు కూడ వాల్మీకి పెంపకంలోనే కదా పెరిగింది... వీరే వారు కాదు కదా?...

రామ : నామనస్సు సంధిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది...

పృథ్వీ : అమ్మా!... రా!... రసాతలాన్ని కూడ పవిత్రం చేద్దువుగాని...

రామ : అవనిజా!... మఱో లోకానికి వెళ్ళిపోతున్నావా?...

సీత : తల్లీ!.. వద్దు... వద్దు... నన్ను నీలో కలిపేసుకో...

రామ : దీనికి తల్లేమంటుందో?...

పృథ్వి : నీ పిల్లలు పాలు వదిలే దాకా ఓపికపట్టు... ఆ తర్వాత నీ ఇష్టప్రకారమే చేద్దువుగానిలే...

గంగ : మంచిమాట!... సరేనా? (సీత, గంగ, పృథ్వి నిష్క్రమిస్తారు)

రామ : అయ్యో!...నా సీత లోకాంతరవాసి అయిందా? (స్పృహ కోల్పోతాడు)

లక్ష్మణ : వాల్మీకి మునివర్యా!... కాపాడండి... కాపాడండి... ఇదేనా మీ నాటక పరమార్థం?...

(నేపథ్యంలో) : సంగీతాన్నాపండి... ఓ స్థావరజంగమాత్మక భూతాల్లారా!... సర్వప్రాణధారులారా?... వాల్మీకిఋషివర్యులు మీపై అనుగ్రహంతో ఒకదివ్యదర్శనాన్ని చూపించమని ఆజ్ఞాపించారు... చూడండి!...



లక్ష్మణ : ఓహో!... ఎంత వింతదృశ్యం!... దేవతలాకాశా న్నతిగమిస్తూంటే ఆకాశం అంతా ఆకాశగంగాతరంగాల్లో తేలిఆడుతోంది!... అరె!... గంగ ఒకప్రక్క, పృథ్వి మఱొకవైపునా, నిలిచి ఉంటే, మిగతా దేవతలంతా స్తుతిస్తూ ఉంటే వదినగారుపైకి వస్తున్నారు...

(నేపథ్యంలో) : త్రిజగత్పూజ్యా!... అరుంధతీ!... పృథ్విని, గంగను, త్రిజగద్వంద్య సీతామహాసాధ్విని తీసికొని వెళ్ళమ్మా!...

లక్ష్మణ : అగ్రజా!... అగ్రజా!... మనపంట పండింది!... అరె!... అన్నగారికి శ్వాస ఆడటం లేదు!... (సీతను తీసికొని అరుంధతి ప్రవేశం!...)

అరుంధతి : సీతా!... మా చిరంజీవి నీ స్పర్శతోనే తేఱుకోవాలి.. (సీత రామునిశరీరం అంతా నిమురుతుంది)

రామ : ఆహా!... నేడెంత సుదినం! నా సీత ఇక్కడికెలా రాగలిగింది!...అరుంధతి, నా తల్లులు, వసిష్ఠులు, ఋష్యశృంగులు, అంతా కూడటంవల్ల కన్నుల పండువుగా ఉంది!...

అరుం : రామభద్రా!... నీ సహధర్మచారిణి జానకిని స్వీకరించి, అశ్వమేధం చేసి, జగద్రక్షకుడవు కా!... వాల్మీకి మునిపుంగవా!... సీతారాముల ముద్దుబిడ్డలు కుశలవులను తీసికొనిరండి!...

వాల్మీకి : నాయనలారా!... మీ పితరులకు నమస్కరించేండి!... ఈయన మీతండ్రి రఘురాముడు ఈమె మీతల్లి సీతాసాధ్వి, మీపినతండ్రి లక్ష్మణుడిడుగో, ఆయన మీ మాతామహులు జనకమహారాజు!

కుశలవులు : నేటికి పితరుల దర్శనమై మేము ధన్యత నొందాం!...

సీత : వాల్మీకి ముని పుంగవా!.. మీపాద పద్మాలకు ప్రణామాలు!.
(నేపథ్యంలో కలకలం)

వాల్మీకి : ఇదుగో!... మధురేశ్వరుడు శత్రుఘ్నుడు లవణాసురుని నిర్మూలించి వస్తున్నాడు...

లక్ష్మణ : శుభాలు వెనువెంటనే కలుగుతుంటాయంటే ఇదే కాబోలు!...

సీత : ఎంతటి మహాదృష్టం!.. ఇదంతా వాల్మీకి మహర్షి చేలువ...

వాల్మీకి : శుభం భూయాత్!

★★★

# మృచ్ఛకటికం

సంస్కృతమూలం : **శూద్రకమహాకవి**

రంగస్థలకృతి : **డాక్టర్ రామవరపు శరత్‌బాబు**

# ఇందలి పాత్రలు

## పురుషులు

1. ప్రయోక్త
2. చారుదత్తుడు
3. మైత్రేయుడు(ఆత్రేయుడు)
4. విటుడు (శకారుని పరివారంలో)
5. శకారుడు
6. చేటుడు
7. సంవాహకుడు (బౌద్ధభిక్షువు)
8. మాధురకుడు
9. సభికుడు
10. దుర్దురకుడు
11. కర్ణపూరకుడు
12. శర్విలకుడు
13. స్థావరకుడు (శకారుని బండివాడు)
14. కుంభీలకుడు
15. రోహసేనుడు (చారుదత్తుని కొడుకు, 5 ఏళ్ళు)
16. వర్ధమానకుడు (చారుదత్తుని బండివాడు)
17. ఆర్యకుడు
18. చందనకుడు
19. వీరకుడు
20. న్యాయాధికారి (అధికారి)
21. కాయస్థుడు (శ్రేష్ఠికాయస్థుడు)
22. శోధనకుడు
23. చాటింపువాడు
24. చండాలుడు(1)
25. చండాలుడు (2)
26. విటుడు (వసంతసేన పరివారంలో)

## స్త్రీలు

1. రదనిక
2. వసంతసేన
3. చెలి. (చేటి)
4. మదనిక
5. ధూతాదేవి (చారుదత్తుని భార్య)
6. వసంతసేన తల్లి



# మృచ్ఛకటికం

## ప్రయోక్త

సహృదయ శేఖరుల కభివాదాలు... సంస్కృతంలో ఏకైక సాంఘిక నాటకంగా ప్రసిద్ధినొందిన శూద్రక విరచిత మృచ్ఛకటిక నాటకాన్ని చూడాలనే ఉత్కంఠతో మీమీ పనుల్ని సర్దుకొని వచ్చిన ప్రేక్షక శ్రేష్ఠులకు ప్రణామాలు...మేమెంతో వ్యయ ప్రయాసలకోర్చి, దీన్ని ప్రదర్శించేటానికి సన్నద్ధులమై ఉన్నాం. ఈ నాటకం పేరు మృచ్ఛకటికమ్. సంస్కృతంలో మృత్తంటే మట్టి అనీ, శకటం అంటే బండి అనీ అర్ధం. అంటే 'మట్టిబండి' అని అర్ధం. అయితే ప్రయాణాదుల కుపయోగించే పెద్దబండికాక పిల్లలాడుకొనే చిన్నబండి. కాళిదాసుకు పూర్వుడైన భాసకవి 'దరిద్రచారుదత్తమ్' అనే నాటకాన్ని ఆధారంగా చేసుకొని దీన్ని వ్రాసిన మహాకవి శూద్రకుడు. ఆయన మహారాజు, ఋగ్వేద, సామవేదాల్లో దిట్ట... గణిత గజ శాస్త్రాల్లోనూ నిష్ణాతుడు... సంగీత నాట్యాల్లోనూ నిపుణుడు. తన కుమారునికి పట్టం కట్టి అశ్వమేధయాగాన్నా చరించి నిండు నూతేళ్ళపై పదిరోజులు జీవించి తనంత తానుగా అగ్ని హోత్రునిలో ప్రవేశించి, తనువు చాలించాడని చెబుతారు. ఇక ఈ నాటకేతివృత్త విషయానికి వస్తే అవంతి దేశానికి రాజధాని అయిన ఉజ్జయినీ నగరంలో వ్యాపార వృత్తిని చేపట్టిన విప్రుడు చారుదత్తుడు. అందగాడు, యువకుడు, తన ధనాన్ని దానధర్మాలకు వినియోగించి దరిద్రుడైన ఉదాత్తుడు. ఆ ఊళ్ళోనే వసంత ఋతువు శోభవంటి శోభతో ఉన్న వసంతసేన కేవలం గుణపక్షపాతియై అతణ్ణి ప్రేమిస్తుంది... వారిద్దటి కథే ఈ నాటకం. కాళిదాసుకు పూర్వికుడైన భాసమహాకవి తన పదమూడు నాటకాల్లో అసంపూర్ణంగా విడిచిన 'దరిద్రచారుదత్తం' అనే నాటకం దీనికి మాతృక. తినబోతున్న వారికి రుచి చెప్పినట్లు ఇంకా ఎక్కువగా చెప్పటం ఎందుకు?... చూడండి...

## మొదటిఅంకం

మైత్రేయుడు : (చేత్తో ఒక శాలువా పట్టుకొని ప్రవేశిస్తాడు) వేఱొక వైపునుంచి గింజేలను చేల్లుతూ చారుదత్తుని ప్రవేశం. అతనితో రదనిక కూడా గింజేలున్న పళ్ళాన్ని పట్టుకొని ప్రవేశిస్తుంది)

చారుదత్తుడు : (ఆకాశం వైపు చూచి నిట్టూరుస్తూ) హుఁ!... ఒకప్పుడు నేను చేల్లే మంచి గింజల్ని రకరకాల పక్షులు వచ్చి తినేవి... నేడో! ఈ నూకల్ని తినటానికి పక్షులేవీ రావటం లేదు. గడ్డి, గాదంలో పడే ఈ నూకల్ని కీటకాలు సగం సగం కొరుకుతున్నట్లున్నాయి...

మైత్రేయుడు : ఆర్య చారుదత్తా!... స్వస్తి...

చారు : ఓ!... మైత్రేయా! స్వాగతం... రా..రా.. కూర్చో!.. చేతిలో అదేవిఁటి?...

మైత్రే : నీ చిరకాల మిత్రుడు చూర్ణవృద్ధుడు జాజిపూల వాసన వెదజల్లే ఈ ఉత్తరీయాన్ని నీకు కానుకగా పంపాడు.. ఏదో ఆలోచిస్తున్నావేవిఁటి?...

చారు : ఏం లేదు మిత్రమా!... కష్టాలుపడ్డ తర్వాత సుఖం లభిస్తే బాగుంటుంది... అలా కాకుండా ముందు సుఖాలనుభవించి ఆ తర్వాత దరిద్రం దాపురిస్తే ... వాడిక జీవచ్ఛవమే ననుకో...

మైత్రే : మరణం, దరిద్రం – ఈ రెంటిలో ఏది మేలంటావ్?

చారు : నన్నడిగితే దారిద్ర్యం కంటే మరణమే మేలంటాను... ఎందుకంటావా? మరణవేదన ఒక్కక్షణంతో తీరిపోతుంది... దారిద్ర్యం బ్రతికినన్నాళ్ళూ అనుక్షణం ఆవేదనకు గుఱిచేస్తుంది...



మైత్రే : దిగులుపడకు చారుదత్తా!.. ఒకప్పటి నీ అఖండవైభవాన్ని ఆర్తుల కందించి నేడు శుక్లపక్షంపాడ్యమి చంద్రునిలా మిగిలిపోయినా నీ తేజస్సుకేలోపం లేదు.. చేద్దన్నం వంటి సంపద గూర్చి నీకెందు కింతటి సంతాపం?

చారు : సంపదల గూర్చికాదయ్యా నా సంతాపం... ఆనాడు నా ఇంటికి తఱచు వచ్చే మిత్రబాంధవు లీనాడు నా లేమిని చూచి మొహం తప్పిస్తున్నారు... అందుకూ నాబాధ... ఈ దారిద్ర్యం కంటె, అతిథిపూజకు దూరమౌతున్నానన్న బాధే నన్ను దహించేస్తోంది... మైత్రేయా... అంతేకాదు... దారిద్ర్యంతో మనిషి సిగ్గుపడతాడు... సిగ్గుతో సామర్థ్యం క్షీణిస్తుంది... సామర్థ్యం కోల్పోయిన నాడు అవమానాల పాలౌతాడు... అవమానంతో నిర్వేదానికి లోనౌతాడు... నిర్వేదం దుఃఖానికి దారి తీస్తుంది... దుఃఖభాగునికి వివేకం లోపిస్తుంది... వివేకహీనుడు వినాశం పొందుతాడు... కనుక సర్వాపదలకూ దారిద్ర్యమే మూలం.

మైత్రే : దారిద్ర్యం గుఱించి దిగులుపడకుండా ఉంటే పోలా?

చారు : దిగులుకాదు మైత్రేయా!... దారిద్ర్యాన్ని మించిన అవమానమంటూ లేదు.. దరిద్రుణ్ణి చూస్తే మిత్రుల కేవగింపు... శత్రుత్వాన్ని పెంచేదీ, నిష్కారణంగా అయినవారికీ, కానివారికీ ద్వేషాన్ని పెంచేదీ ఈ దారిద్ర్యమే... ఇల్లాలు సైతం అవమానిం చేటానికి వెనుకాడదు... అడవులకు పారిపోదామనిపిస్తుంది... ఇది శరీరాన్ని దహించదు, కానీ హృదయాన్ని తపింపజేస్తుంది... ఊఁ... సరేకాని, ముందు నువ్వు చతుష్పథంలో దేవతలకు బల్యన్నం వేసిరా!

మైత్రే : వెయ్యను!

చారు : అదేం మైత్రేయా!... బ్రాహ్మీ, మాహేంద్రి, వైష్ణవి, ఐంద్ర్యాది అష్టమాతృకల కీనాలుగుమార్గాలకూడలిలో అన్నం వేసి రావటం గృహస్థు నిత్యానుష్ఠానంలో భాగమే కదా!

మైత్రే : భాగమో, భోగమో–నేనాదేవతలకి బల్యన్నం వెయ్యను కాక వెయ్యను!

చారు : ఎందుకనయ్యా?

మైత్రే : ఎందుకా? నువ్వు నిత్యం పూజిస్తున్నా ఎప్పుడైనా వారు నీపట్ల ప్రసన్నులయ్యారా? ఇంకెందుకూ వారిని పూజించేటం?

చారు : దేవతాపూజ గృహస్థు ఆచరించేవలసిన నిత్యకర్మ. కర్మ చేస్తే వచ్చే పుణ్యం మాటెలా ఉన్నా చేయకపోతే మాత్రం పాపం రాకమానదు!

మైత్రే : పాపమో, పుణ్యమో.. నేమాత్రం పోనుబాబూ! ఈపని నింకెవరికైనా అప్పజెప్పు... పైగా నాకేమో కంటివ్యాధి... అద్దంలోలా అన్నీ విపరీతంగా కనిపిస్తాయి. రా చేబాటలో అది మతీ ప్రమాదం కదా!... అదీకాక...

చారు : కాక?

మైత్రే : నగరం నడిబొడ్డున వేశ్యలు, విటులు, చేటులు, రాజ పురుషులూ తిరుగుతుంటారు కదా!

చారు : తిరిగితే నీకేమయ్యా?

మైత్రే : తిరిగితే నీకేమని అంత తేలిగ్గా తీసిపారేస్తావేవింటి? అమ్మో!... ఇంకేమైనా ఉందా?.. నేను వారికంటపడితే చేంపేస్తారు... నీకేం నువ్వు హాయిగా ఇంట్లో కూర్చుని ఉంటావు. అక్కడ నాగతేం కాను?



చారు : సరేకానీ... నేను సాయంసంధ్యానుష్ఠానాలు తీర్చుకోవాలి... (తెరలో) నిలు.. వసంతసేనా!.. నిలు నిలు...

(విటుడు, శకారుడు, చేటుడూ వెంబడిస్తున్న వసంతసేన ప్రవేశం)

విటుడు : వసంతసేనా!.. ఆగాగు...

శకారుడు : ఆగు వసంతసేనా! ఆగు... ఎందుకాభయం? ... భయంతో నీ సౌందర్యం ఎంత తగ్గిపోయిందో తెలుసా?... బోయవాడు వెంటాడుతున్న ఆడలేడిలా ఆ పరుగేవింటి? ఆగాగు... ఇంతలో నీ ప్రాణాలేవీ పోవులే... సుందరీ! నిప్పుల్లో పడ్డ మాంసం ముక్కలా నీకోసం నా హృదయం మన్మథాగ్నిలో పడి ఎంతమాడిపోతోందో తెలుసా?

చేటుడు : అక్కా!... ఆగమ్మా!.. నారాజు శకారుడు అడవి కోడిపుంజులా నీకోసం పడుతూ లేస్తూ పరుగు పరుగున వస్తున్నాడు...

శకా : ఈ చేటుడు చెప్పింది నిజేం వసంతసేనా!... నాలో అనంగుణ్ణి, మదనుని, మన్మథుణ్ణీ రెచ్చగొట్టి రాత్రిళ్ళు నిద్రలేకుండా చేస్తున్నావు!.. నువ్వెక్కడికి పాటిపోతావ్? రావణుని కెదురుపడ్డ కుంతీదేవిలా నువ్వు నానుంచి తప్పించుకోలేవు!... వేగంలో వాయుదేవుని మించిన వాణ్ణి...

విటుడు : వసంతసేనా!.. భయపడకు... పాటిపోకు...

శకా : రాముడికి భయపడి పారిపోతున్న ద్రౌపదిలా ఏవిఁటాపరుగు?...

చేటు : వసంతసేనా!... ఈ శకారుడు రాజుగారి బామ్మర్ది... ఇతణ్ణి సంతోషపెడ్తే నీకెన్నెన్ని మత్స్యమాంసాలు దొరుకుతాయో తెలుసా?

విటు : వసంతసేనా!... అనర్ఘమైన మణిమేఖల ధరించి చేక్కగా అలంకరించుకొని నగరాధిదేవతలా శోభిస్తూ కూడా భయంతో ఆ పరుగెందుకు?

శకా : మేం నీకోసం పడిచస్తుంటే నువ్వేమో కుక్కలు తరుముతూ ఉంటే పరుగెత్తే ఆడనక్కలా పరుగిడుతూ నాహృదయాన్ని తొడిమతోసహా దోచుకుపోతున్నావు...

వసంత : (భయంతో) పల్లవకా!... పల్లవకా!... పరభృతికా!... పరభృతికా!...

శకా : (భయంతో) బావా!... ఎవర్నో పిలుస్తోంది?

విటుడు : భయపడకు... భయపడకు...

వసంత : మాధవీ!... మాధవీ!...

విటు : (నవ్వుతూ) పరిజనాన్ని పిలుస్తోంది.

శకార : బావా!.. ఆడవాళ్ళని పిలుస్తోందంటావా?

విటు : కాక?

శకార : ఆడవాళ్ళనైతే వందమందినైనా చేంపగలను.. నేను శూరుణ్ణి...

వసంత : (తనలో) అయ్యో!... పరిజనం కూడా భయంతో పాఱిపోయారా?... ఇక నన్ను నేనే రక్షించుకోవాలి...

శకార : పిలు పిలు... నాబారినుంచి నిన్ను కాపాడటానికి ఎవడొస్తాడో చూస్తాను... వసంతసేనా!... చూడు, భీముడొచ్చినా, పరశురాముడే వచ్చినా వందమంది కుంతి కొడుకులొచ్చినా, రావణాసురుడే వచ్చినా నానుంచి నిన్నెవరూ రక్షించే లేరు! ఇదిగో దుశ్శాసనుణ్ణైపోయి నీ జుట్టు పట్టుకొంటున్నా!

వసంత : అయ్యా!... నేనబలను కదా!...



శకార : అందుకే ఇంతవఱకూ బతికిపోయావు!

వసంత : మీకు నా నగలేమైనా కావాలా?...

విటుడు : ఛీ!ఛీ!... నగలెందుకు?

వసంత : అయితే నన్నెందుకడ్డుకొంటున్నారు?...

శకార : చూడు, నేను మనుష్యరూపంలో వచ్చిన వాసుదేవుణ్ణి.. కనుక, నన్ను కామించు...

వసంత : (కోపంతో) అసందర్భంగా మాట్లాడకు... అడ్డుతొలగు...

విటుడు : వసంతసేనా!... నువ్వు వేశ్యవు... వేశ్యవాటికలకు మా లాంటివాళ్ళే ఆధారం! నువ్వు త్రోవలో మొలిచిన తీగ వంటి దానవు... కనుక ఎవడైనా నీమీద చెయ్యి వెయ్యొచ్చు.. డబ్బులిచ్చి కొనుక్కొనే అంగడి వస్తువు వంటిది నీశరీరం!... నీకిష్టమున్నా లేకపోయినా అందర్నీ సంతోషపెట్టటమే నీధర్మం... అంతే కాదు.. నువ్వో దిగుడుబావి లాంటి దానివి... అందులో దిగి ఎవరైనా స్నానం చెయ్యొచ్చు.. నువ్వో నావ వంటి దానివి... ఎవరైనా ఎక్కవచ్చు... నువ్వు అందర్నీ ప్రేమించాలి.

వసంత : ప్రేమనేది గుణాలవల్ల కలగాలి కాని, దౌర్జన్యంతో కాదు...

శకార : బావా!... ఈగర్భదాసి ఆవేళ మన్మథాలయంలో ఆ దరిద్ర చారుదత్తుణ్ణి చూసిం దగ్గర్నుంచి వాడిపైనే మోజుపెంచుకొని నేనంటే అస్సలు లెక్కచేయటం లేదు.. ఆదరిద్రుడి ఇల్లిదిగో ఈఎడం వైపునే ఉంది. ఈలోగా ఇది మన చెయ్యి జారిపోకుండా చూడాలి!...

విటుడు : (తనలో) ఈ మూర్ఖుడు దాచే వలసిన విషయాన్నే బయటపెడుతున్నాడు... ఏవిఁటీ! ఈమె చారుదత్తుణ్ణి వరించిందా?... అవును మఱి... రత్నం రత్నంతో కలిస్తేనే

అందం!... (పైకి) ఏవిఁటీ!... చారుదత్తుని ఇల్లు ఈ ఎడం వైపున ఉన్నదే?

శకార : అవును.. ఈ ఎడం వైపు ఉన్నదే వాడిల్లు...

వసంత : (తనలో) ఆశ్చర్యం! ఈ దుర్మార్గుడివల్ల నాకుపకారమే కలిగింది... నాకపకారం చేయబోయినా ప్రియుని ఇల్లు చూపి పుణ్యం కట్టుకొన్నాడు.

శకార : (ఆదుర్దాగా) బావా!... వసంతసేన ఈ చీకట్లో అప్పుడే మాయమైంది.

విటు : ఈ అంధకారంలో నాకేమీ కనిపించేటం లేదు...

శకార : బావా!.. వసంతసేనను వెతుకుతున్నావా?

విటు : కన్ను పొడుచుకొన్నా కనిపించేని ఈ చీకట్లో ఎలా వెతకటం?

శకార : ఏవంటున్నావ్?.. చీకట్లో ఎలా వెతకటమనా?

విటు : అవును... అయినా కాలి అందెల చేప్పుడో, చేతి గాజుల సవ్వడో, ఆమె ఒంటికి రాసుకొన్న సుగంధ పరిమళమో, పూలవాసనబట్టో వెతకాలి.

శకార : ముక్కుతో పూలవాసన వింటున్నాను... నగల చేప్పుడు మాత్రం కంటికి కనిపించేటంలేదు..

విటు : ఈ సందెచీకట్లో మబ్బుల్లో మాయమైన మెఱపుతీగలా కంటికి కనిపించేటంలేదు. కానీ కాలి అందెల చేప్పుడు, పూలవాసన నీ జాడ తెలుపుతోంది.. నామాట వినిపించిందా వసంతసేనా?

వసంత : (తనలో) వినిపించింది... తెలిసింది... (పూలు, నగలు తీసివేసినట్లు నటిస్తూ, చేత్తో తడుముతూ) ఓహో!... ఇది గోడలా ఉంది. ఈ ప్రక్కన ద్వారం మూసి ఉన్నట్లుంది.



చారు : మిత్రమా! మైత్రేయా!... నా జపం పూర్తయింది... ఇప్పుడైనా మాతృదేవతలకు బల్యన్నం తీసికొనివెళ్ళు...

మైత్రేయ : వెళ్ళనుకాక వెళ్ళను!

చారు : నాపేదరికంవల్లే కదా ఆప్తమిత్రుడూ మాటని లెక్కపెట్టంది... ఎవడో చేసిన నేరం కూడా లేమిని ఆసరాగా తీసికొని పేదవాడి మీదే రుద్దుతారు!... లేమి పంచ మహాపాతకాల్లో కాక ఆఱో మహాపాపం!

మైత్రే : (సిగ్గుపడుతూ) మిత్రమా!... నేవెళ్ళకతప్పదంటే రదనికను నాకుతోడుగా పంపు..

చారు : రదనికా!...మైత్రేయునితో తోడుగా వెళ్ళమ్మా!...

రద : అలాగేనండి...

మైత్రే : అమ్మా!... రదనికా!.. నువ్వు బల్యన్నం, దీపం తీసికొనిరా! నేను తలుపు తెఱుస్తా...

వసంత : నాకోసమే తలుపు తెఱుచుకొన్నట్లుంది.. ఇంట్లోకి ప్రవేశించాలి... అయ్యో! దీపం వెలుగుతోందే... ఇప్పుడెలా? (చీరచెంగుతో దీపాన్నార్పి లోపలికి ప్రవేశిస్తుంది)

చారు : మైత్రేయా!... ఏవైఁంది?...

మైత్రే : తలుపు తెఱవటంతో గాలి రివ్వున వీచి దీపాన్నార్పేసింది... రదనికా! నువ్వు మెల్లగా ముందుకు నడు... నేను దీపాన్ని మళ్ళీ వెలిగించుకు వస్తాను...

శకార : బావా! వసంతసేనను వెదకనా?

విటుడు : ఆఁ! వెతుకు... వెతుకు... (దొరకదనే అర్థంలో)

శకార : (విటుని పట్టుకొని) బావా! వసంతసేనను పట్టుకొన్నా!...

విటుడు : నేనురా మూర్ఖా!...

శకార : అయితే నువ్వు పక్కనుండు.. మళ్ళీ వెతుకుతా... బావా!... పట్టుకొన్నా!

చేటుడు : నేను మహారాజా! చేటుణ్ణి... ఇందాక విటుణ్ణి, ఇప్పుడు నన్నూ పట్టుకున్నారు!

శకార : ఇటు బావ విటుడు, అటు చేటుడు... బావ, చేటుడు, చేటుడు, బావ!. బావ-చేటుడు, చేటుడూ బావ! ఏవిఁటో ఈ గందరగోళం... ఇప్పుడు మీ ఇద్దఱూ ఇటుప్రక్క ఉండండి... ఆc! (రదనిక జుట్టుపట్టుకొని) ఆc! ఇప్పుడు చిక్కింది వసంతసేన... చీకట్లో పారిపోతోంటే పూలవాసనతో పోల్చుకొని అల్లప్పుడు ద్రౌపది జుట్టు ఒడిసిపట్టుకొన్న చాణక్యునివలె ఇప్పుడు నేను వసంతసేనను పట్టుకొన్నా!...ఏయ్! వసంతసేనా!... (వికటంగా నవ్వి) ఇప్పుడు నీకొప్పు పట్టుకొని ఈడుస్తా... పిలు నీకు రక్షకుడెవడో... శంభుడో, శంకరుడో, ఈశ్వరుడో, శివుడో వీళ్ళలో ఎవర్నైనాసరే!... ఎవణ్ణి పిలుస్తావో పిలు...

రదనిక : అయ్యా! మాన్యులైన మీరు చేయబూనేపనేమిటి?... ఇది భావ్యమా?

విటుడు : అరెc!... ఈ గొంతు వసంతసేనది కాదు!

శకార : ఆc!..ఆc! అదేంకాదు... ఆ జాణ గొంతుమార్చి మాట్లాడుతోంది...

మైత్రే : యూపస్తంభాన్నెక్కబోయే మేకగుండెలాగ ఈ దీపం గుండె కొట్టుకొంటోంది... రదనికా!

శకార : (కంగారుగా) బావా!... ఏదో మొగగొంతు!.. మనుష్యుడు... మనుష్యుడు...

మైత్రే : ఏవిఁటిది?... ఆర్య చారుదత్తుని ఇంట్లోకి ఆయన అనుమతిలేకుండానే వస్తున్నారు.. ఇదేమీ బాగా లేదు...



రద : మైత్రేయా! వీళ్ళు నన్నెలా అవమానిస్తున్నారో చూడు!

మైత్రే : ఇది నీకవమానం కాదు.. మాకూ అవమానం...

రద : నిజమే... ఇది మిమ్మవమానించినట్లే!...

మైత్రే : ఇది బలాత్కారమా?

రద : కాక మరేవిఁటి?

మైత్రే : నిజవేc!

రద : నిజం...

మైత్రే : (కోపంతో చేతికఱ్ఱనెత్తి) ఎవడ్రావాడు? ఈ కఱ్ఱతో బుఱ్ఱ చితక్కొడతా! ఆర్య చారుదత్తుని పరిజనాన్ని పరాభవించేటానికి ఎంత సాహసం?

విటు : విప్రవర్యా! క్షమించు, క్షమించు...

మైత్రే : (విటునిచూసి) తప్పుచేసింది వీడుకాదు... (శకారునిచూసి) ఆc! వీడూ దోషి.. ఒరేయ్!... రాజుగారి బామ్మర్దీ!... దుర్మార్గుడా!... ఉజ్జయినీనగర ప్రతిష్ఠకే కారకుడైన ఆర్య చారుదత్తుడంటే అంత చులకనా? దురదృష్టవశాత్తూ ప్రస్తుతానికి పేదవాడైనంత మాత్రాన ఆయన పరిజనంమీదా నీ ప్రతాపం?

విటుడు : విప్రోత్తమా! క్షమించు.. క్షమించు.. ఒకర్నిచూసి ఇంకొకరని పొరబాటుపడినందువల్ల జరిగిందికాని, పొగరుబోత్తనంతో కాదు... చూడు, మాపై మోజుపడిన ముదిత కోసం మేం వెతుకుతున్నాం!...

మైత్రేయ : ఏవిఁటీ!... మీమీద మోజుపడిందీ రదనికా?

విటుడు : ఎంతమాట?... ఈమెకాదు... మేం వెతుకుతున్న వనిత తప్పించుకొని పోయింది.. ఈ చీకట్లో ఆమే ఈమె అని పట్టుకోవటంవల్ల జరిగిందీ అనర్థం... కావాలని చేసింది

కాదు... క్షంతవ్యులం... (ఖడ్గాన్ని ప్రక్కనుంచి కాళ్ళమీద పడతాడు)

మైత్రేయ : లే...లే... జరిగింది తెలియక నిన్నేమేమో అన్నాను... క్షమించు...

విటుడు : కాదు... నేనే క్షంతవ్యుణ్ణి... అయితే ఒక మాటకు నువ్వొప్పుకుంటే కానీ నీకాళ్ళు వదలను..

మైత్రేయ : అదేవింటోచెప్పు!...

విటుడు : ఈ జరిగింది ఆర్య చారుదత్తునితో చెప్పనంటేకాని నీ పాదాలపైనుంచి లేవను!

మైత్రేయ : చెప్పన్లే!... లే...

విటుడు : విప్రవరా! ... నీ స్నేహాన్ని శిరసా వహిస్తున్నాను... మాకు శస్త్రాలెన్నో ఉన్నా ఆర్య చారుదత్తుని మహోత్కృష్ట గుణసంపదతో నిర్జితులమైనాం...

శకార : (అసూయతో) బావా! ఈ దుష్ట బ్రహ్మచారి కాళ్ళమీదపడి దండం పెడుతున్నావెందుకు?

విటుడు : భయపడి!

శకా : ఎవడికి భయపడి?

విటు : చారుదత్తుని గుణసంపదకు!

శకార : ఎవడింట్లో చొరబడితే తినటానిక్కూడా ఏమీ దొరకదో ఆ దరిద్రచారుదత్తుడి గుణాలకా?

విటుడు : అలా అనకు... ఆ మహాత్ముడు తన సంపదనంతా మావంటి యాచకులకివ్వటం వల్ల ఇవాళ వేసవి కాలంలో చెరువులా ఎండిపోయాడు.

శకార : ఎవడీగర్భదాసికొడుకు?... శూరుడైన పాండవుడా?... రాధకొడుకు శ్వేతకేతువా? ఇంద్రుడికొడుకు



రావణాసురుడా?... కుంతీదేవికి రాముడివల్ల పుట్టిన అశ్వత్థామా?... యమునికొడుకు జటాయువా?...

విటు : మూర్ఖా!... ఆర్యచారుదత్తుడంటే దీనుల పాలిట కల్పవృక్షం... ఎంతో వినమ్రుడు, సత్పురుషులకు ఆత్మీయుడు, పండితులకు ఆదర్శప్రాయుడు, చేక్కని నడవడికి గీటురాయి... ఇంకెన్నో గుణాలకు నిధి అయిన ఈ చారుదత్తు డొకడే నిజంగా జీవిస్తున్నాడనాలి... మిగతావాళ్ళంతా జీవిస్తున్నారనుకుంటే వాళ్ళు ఊపిరితో ఉన్నారు కనుక జీవిస్తున్నారనుకోవాలి... కనుక ఇక పోదాం పద...

శకార : వసంతసేనని విడిచిపెట్టే?

విటు : వసంతసేన పాటిపోయింది కదా!...

శకార : వసంతసేన లేకుండా నేను రాను...

విటు : కట్టుకొయ్యతో ఏనుగు, పగ్గాలతో గుఱ్ఱం లాగే, స్త్రీని హృదయంతోనే పొందాలి... నీకాహృదయమంటూ లేదు కనుక వసంతసేన నీకు దక్కదు.. కనుక పద...

శకార : నువ్వెడితే వెళ్ళు... నేను మాత్రం రాను...

విటు : అయితే నేవెడుతున్నా... (వెళ్ళిపోతాడు)

శకార : ఏయ్! దుష్టబ్రహ్మచారీ!.. చారుదత్తునితో నామాటగా చెప్పు...

మైత్రే : ఏవంని?

శకార : మదన దేవాలయంలో నిన్ను చూసినప్పటినుంచీ వసంతసేన నీపై మోజుపెంచుకొంది, ఆమెను మేం వాంఛిస్తున్నాం, నేనామెను తరుముతూ వస్తుంటే నీ ఇంట్లో ప్రవేశించింది. కనుక మర్యాదగా నీ అంతట నువ్వామెను

తీసుకొనివచ్చి నాచేతిలో పెట్టావా సరే! న్యాయస్థానానికి పోకుండా మనిద్దఱిమధ్య మైత్రి వర్ధిల్లుతుంది... లేదనుకో, నీతో నాకు మరణాంతం విరోధం తప్పదని చెప్పు... (మైత్రేయుడు వెళ్ళబోతాడు) ఆగు.. ఈపని వెంటనే జేరగాలి.. లేకపోతే నేను చెడ్డవాణ్ణైపోతాను సుమా! జాగ్రత్త!.. ఏం చెబుతావా?...

మైత్రే : ఆఁ! అలాగే చెబుతాను!...

శకార : చేటా! బావ నిజంగానే వెళ్ళిపోయాడంటావా?...

చేటు : చిత్తం!...

శకార : అయితే మనమూ వెంటనే వెళ్ళిపోదాం!...

చేటు : అయితే ఇదిగో ఖడ్గాన్నందుకోండి!...

శకార : దాన్ని నీవద్దనే ఉంచుదూ!...

చేటు : అయ్యా! ఈ ఖడ్గం మీది, దీన్ని మీరే ధరించాలి.

శకార : (శకారుడు కత్తిని తలక్రిందులుగా పట్టుకొని, ఒరలో పెట్టటం చేతకాక భుజాన పెట్టుకొంటాడు. ఇద్దఱూ నిష్క్రమిస్తారు.)

మైత్రేయ : అమ్మా!.. రదనికా!.. నీకు జేరిగిన అవమానాన్ని చారుదత్తునికి చెప్పవద్దు సుమా!.. అసలే తన దీనస్థితికి విచారిస్తున్న ఆ మహాత్మునికీ విషయం కూడా తెలిస్తే ఆయన విచారం రెట్టింపౌతుంది...

రద : నాపేరే రదనిక అంటే నోరువిప్పని దని అర్థం కదా! అలాగేలే...

మైత్రేయ : సరే అయితే... నువ్వూ చెప్పకు, నేనూ చెప్పను!...

చారు : రదనికా! రోహసేనుడు సాయంత్రం చేలికి తట్టుకోలేడు... ఈ శాలువా కప్పి లోపలికి తీసికొని వెళ్ళు!...



వసంత : (తనలో) చారుదత్తుడు నన్ను రదనిక అనుకొంటున్నాడు. (శాలువా అందుకొని వాసనచూసి) ఓహో!.. జాజిపూల సువాసనతో ఈశాలువా చారుదత్తుని మొక్కవోని యౌవనాన్ని స్మరింప చేస్తోంది... (తనను గుర్తించకుండా రోహసేనునికి శాలువా కప్పుతుంది)

చారు : ఇదిగో రదనికా!... రోహసేనుణ్ణి లోపలికి తీసికెళ్ళి పడుకో పెట్టు!...

వసంత : (తనలో) నీఅంతఃపురంలోకి ప్రవేశించేఅదృష్టం నాకెక్కడిది?

చారు : మాట్లాడవేం రదనికా!... దురదృష్టం కొద్దీ సంపదలు తఱిగిపోతే మిత్రులే శత్రువులౌతారు... అనురక్తులే విరక్తులౌతారు...

(మైత్రేయుడు, రదనిక ప్రవేశిస్తారు)

మైత్రే : మిత్రమా!... చారుదత్తా... రదనికను పిలుస్తున్నట్టున్నావ్... ఇదిగో రదనిక...

చారు : ఈమే రదనికా!... మఱి, ఈవిడెవరు? అయ్యో!.. తెలియక నా శాలువాతో ఈమెను అవమానించాను..

వసంత : (తనలో) అవమానించేటం కాదు.. అనుగ్రహించారు...

చారు : శరన్మేఘం ఆవరించిన చంద్రలేఖలా ప్రకాశిస్తోంది... అయినా పరకళత్రప్రశంస భావ్యం కాదు!

మైత్రే : ఈమె పరస్త్రీ అనుకోకు... ఆనాడు కామదేవుని కోవెలలో నిన్ను చూచిన నాటినుండి నీపైనే అనురక్తై ఉంది...

చారు : ఆఁ!... ఈమె వసంతసేనా!.. గతవైభవం కల నాపట్ల కలిగిన ఈమె ప్రేమ అస్థానపతితమైంది. నాప్రేమకూడా పేదవాని కోపంవలె పెదవిదాటకూడదు...

మైత్రే : మిత్రమా!... మన రాజుగారి బావమఅది శకారుడు నీకోమాట చెప్పమన్నాడు..

చారు : ఏవిఁటది?

మైత్రే : మేం బలాత్కారంగా వెన్నంటిన ఈ వసంతసేన నీ ఇంట్లో ప్రవేశించింది, కనుక ఈమెను స్వయంగా నాకప్పగిస్తే మనిద్దఱిమధ్య మైత్రి వర్ధిల్లుతుంది... లేదనుకో మనకు ఆమరణాంతం శత్రుత్వమే అని.

చారు : ఎంతటి మూర్ఖుడీ శకారుడు!.. వసంతసేనా!.. నువ్వని తెలియక పరిచారికని ఆజ్ఞాపించినట్లు ఆజ్ఞాపించాను... ఈ తెలియకచేసిన తప్పుకు మన్నించమని శిరసువంచి వేడుకొంటున్నాను.

వసంత : మీఅనుమతి లేకుండా మీఇంట్లో ప్రవేశించేటం నా తప్పిదం.. నేనే క్షంతవ్యురాల్ని...

చారు : సరే. తప్పెవరిదైతేనేం? మన మైత్రిని స్థిరంగా కొనసాగిద్దాం...

వసంత : (తనలో) మైత్రిని కొనసాగిద్దామని ఎంత మధురంగా అన్నాడు!... అయినా ఈ స్థితిలో ఇక్కడ ఈయనతో గడపటం తగదు... ఊఁ... (పైకి) మీ అనుగ్రహానికి నేను నిజెంగా పాత్రురాలినే అయితే నేనలంకరించుకొన్న ఈ నగను మీ ఇంట భద్రపఱచవలసిందిగా నా అభ్యర్ధన. దీనికోసమే ఆ పాపిష్ఠివాళ్ళు నన్ను వెంటాడారు.

చారు : నగలు దాచేటానికి ఈ ఇల్లు అంత గట్టిది కాదు వసంతసేనా!..

వసంత : వస్తువు దాచేటానికి ముఖ్యమైంది వ్యక్తులమీద నమ్మకం కానీ ఇంటి గట్టితనం కాదు...

చారు : మైత్రేయ!.. ఆ నగను తీసుకో...



వసంత : కృతజ్ఞురాల్ని (మైత్రేయునికి నగతీసి ఇస్తుంది)

మైత్రేయ : అమ్మా!.. మీకు సకల శుభాలు చేకూరుగాక!...

చారు : ఛీ!... మూర్ఖుడా!... ఇది దాచిపెట్టమని ఇచ్చిన సొమ్ము...

మైత్రేయ : (చారుదత్తునికే వినిపించేట్టు) అయితే దొంగలు దీన్ని దోచుకుపోదురుగాక!

చారు : త్వరలోనే...

మైత్రే : ఇది మనదౌతుందా?...

చారు : తిరిగి ఆమెకు ఇచ్చేద్దాం!...

వసంత : ఆర్యా! ఈ మాన్యుని తోడుగా పంపితే నేనింటికి వెడతాను...

చారు : మైత్రేయ!.. ఆమెను వాళ్ళింట దింపిరా...

మైత్రే : హంసగమనం కల ఈమెను నీవనుసరిస్తే రాజహంసలా శోభిస్తావు.. నేనా, బ్రాహ్మణ్ణి... భద్రతనీయగల వీరుణ్ణి కాను!

చారు : (నవ్వి) సరే నేనే తోడుగా వెడతా! నువ్వూరా... రాజమార్గంలో వెళ్ళటానికి వీలుగా దివిటీలు వెలిగించాలి... వర్ధమానకా! కాగడాలు వెలిగించు...

వర్ధ : (మైత్రేయునితో జనాంతికం) దీపాలు వెలిగించేటానికి నూనెక్కడిది?

మైత్రే : (జనాంతికంగా చారుదత్తునితో) దీపికలకు నూనె లేదు...

చారు : ఆఁ! అయినా ఇప్పుడు దీపికలతో పనిలేదు... చంద్రోదయమైంది కనుక చంద్రుడే రాజమార్గానికి పెద్దదీపం. (ప్రేమగా) వసంతసేనా! మీ ఇంటికి వచ్చేశాం.. లోపలికెళ్ళు. (వసంతసేన ప్రేమగా చూస్తూ నిష్క్రమణ) మిత్రమా!... వసంతసేన లోపలికి వెళ్ళింది.. మనమూ

ఇంటికి వెడదాం పద... చూడు! అప్పుడే జనసంచారం తగ్గిపోయింది. కావలివాళ్ళక్కడక్కడా కనిపిస్తున్నారు... సమస్తమైన దోషాలకూ రాత్రి అనువైంది కదా!... ఇదిగో వసంతసేన ఇచ్చిన ఈ సువర్ణభాండాన్ని పగలు వర్ధమానకుడు, రాత్రిళ్ళు నువ్వూ అప్రమత్తులై రక్షించాలిసుమా!

మైత్రే : అలాగే...

★★★



## రెండవఅంకం

వసంతసేనఇల్లు

(వసంతసేన, మదనిక కూర్చుని ఉంటారు)

చెలి : అమ్మగారూ! పెద్దమ్మగారు మిమ్మల్ని స్నానంచేసి పూజచేయమన్నారు!

వసంత : ఇవాళ నాకంత ఓపికలేదు... ఇంటి పురోహితునిచేతే పూజచేయించమన్నానని అమ్మగారికి చెప్పు!...

చెలి : అలాగేనమ్మా!... (నిష్క్రమిస్తుంది)

మదనిక : ఇవాళ నువ్వేవిఁటీ అదోలా ఉన్నావ్?

వసంత : ఇప్పుడు నేను నీకెలా కన్పిస్తున్నానే?

మద : నీహృదయాన్ని దోచుకొన్న ఎవరిగుఱించో ఆలోచిస్తున్నట్లుంది...

వసంత : బాగానే గ్రహించావే!...

మద : ఆ అదృష్టవంతుడెవరా అని! మహారాజా! లేక అతనికిష్టుడా? నువ్వు సేవించేబోయేదెవరిని?

వసంత : ఆ మహాభాగునితో ఆనందిద్దామనుకొంటున్నాను కానీ సేవించాలనుకోవటం లేదు...

మద : మహావిద్వాంసుడైన విప్రుని వరించావా?...

వసంత : విప్రులు నాకు ఆరాధనీయులు!...

మద : వ్యాపారంలో అఖండ సంపదలనార్జించిన వైశ్యయువకుడా నీమదిలో ఉంది?

వసంత : వ్యాపారికి ధనం మీదున్న ప్రీతి ఇక దేని మీదా ఉండదు... ప్రియురాల్ని సైతం విడిచి వ్యాపారాలకి విదేశాలకు వెళ్ళిపోతాడు... అందువల్ల ప్రేయసికి మిగిలేది దుఃఖమే!

మద : రాజుకాదు, రాజుకిష్టుడూ కాదు, బ్రాహ్మడు కాదు, వణిజుడూ కాదు, అయితే నీ వలపుకు పాత్రుడైన వాడెవరని?

వసంత : ఆవేళ నువ్వునాతో మదనాలయానికి వచ్చావు కదే!...

మద : ఆ!.. వచ్చాను!...

వసంత : మతి, ఏవీఁ తెలియనట్లు నన్నడుగుతావేం?...

మద : ఆ!.. తెలిసింది... తెలిసింది... నువ్వు శరణు వేడి పాదాభివందనం చేశావూ?

వసంత : ఆ! అతని పేరేవిఁటో చెప్పు!...

మద : ఆయన వైశ్యవాడలో ఉంటూ ఉంటాడు కదా!

వసంత : అతడెక్కడుంటాడని నేనడగలేదే, నేనడిగింది ఆయనపేరు...

మద : ఆయన లబ్ధప్రతిష్ఠుడైన ఆర్యచారుదత్తుడు...

వసంత : సరిగ్గా గుర్తించావ్!...

మద : ఆయనిప్పుడు నిరుపేద అని వింటున్నాం!...

వసంత : వేశ్య నిరుపేదని వరించినప్పుడు లోకులాడిపోసుకోరు కదా!

మద : నువ్వు నిజంగా అతణ్ణి ప్రేమిస్తే అతనివద్దకు వెళ్ళవేం మతి?

వసంత : నేనిప్పుడే వెడితే నన్ను ఆభరణాదికాలతో సంతోషపెట్టలేక పోయానని ఆయన విచారగ్రస్తుడౌతాడు... అందుకు!...

మద : నీ నగల్ని ఆయనవద్ద ఉంచిందిందుకేనా? (వసంతసేన, మదనిక నవ్వుతారు)

(తెరలో)

ఒరేయ్!.. పదిబంగారు నాణాలు బాకీపడ్డ జూదగాడు సంవాహకుడు పాటిపోతున్నాడు.. పట్టుకోండి!... పట్టుకోండి!...

సంవాహకుడు : (తనలో) జూదగాడికెన్నికష్టాలు! పదిబంగారునాణాలకోసం జూదరులు నన్నుపట్టుకొని ఉతికేశారు... అక్కడ వారిని



ఏమర్చి పాటిపోయి వచ్చాను! ఇప్పుడిక నాకు రక్షకులెవరు? ఆ!...ఇదిగో ఈశూన్యదేవాలయంలో దేవీ విగ్రహా న్నౌతాను...

(మాథురుడు, జూదగాడు జూదశాలాధ్యక్షుడు ప్రవేశిస్తారు)

మాథురు : భట్టారక! పది బంగారు నాణాలకి మనం బంధించిన సంవాహకుడు పాటిపోతున్నాడు... పట్టుకోండి... పట్టుకోండి... ఒరేయ్!... ఆగరా... ఆగు... ఒరేయ్... జూదరీ!

సభికుడు : ఒరేయ్! ఆగు... సాక్షాత్తూ ఆ రుద్రుడే దిగివచ్చినా నానుంచి నిన్ను కాపాడలేడు!...

మాథురు : అదుగో... ఆలయంలోకి పోతున్నాడు.

సభి : వెన్నంటి పోదాం పద... అరె! ఏవిఁటీ విగ్రహం కొయ్యతో చేశారు?

మాథురు : కాదిది శిలావిగ్రహమే.. (విగ్రహాన్ని అటూ ఇటూ కదిపి) సరే...రా...జూదమాడుదాం.

సంవాహ : (తనలో) ఈ పాచికల శబ్దం ఎంతటివాణ్ణీ ప్రలోభానికి గుటి చేస్తుంది. మేరుపర్వతం నుంచి క్రిందకి త్రోసే ఈ జూదం నావల్ల కాదు... అయినా కోకిలారావం వంటి పాచికల శబ్దం చెవినబడటంతో మనస్సు తెగ లాగేస్తోంది...

సభి : పాచికలు వేయటం ఇప్పుడు నావంతు!

మాథురు : కాదు... వంతునాదే...

సంవాహ : (మతోవైపునుంచి హఠాత్తుగా వచ్చి) మీ ఇద్దటిదీ కాదు... ఇప్పుడు నాదే వంతు...

సభి : ఆ!... దొరికాడు...

మాథురు : (సంవాహకుని పట్టుకొని) ఒరేయ్! అప్పెగేసి పోదామనుకుం టున్నావురా! ముందా పది బంగారు నాణాలు ఇవ్వు!

సంవాహ : ఇవాళిస్తాను!

మాధురు : అహం! ఇప్పుడే ఇవ్వు!...

సంవాహ : ఇస్తాను... కాస్త దయచూపుదూ!

మాధుర : ముందు సొమ్మిచ్చి మాట్లాడు...

సంవాహ : అయ్యో! తల తిరుగుతోంది... (కింద పడతాడు)

సభి : దొంగవేషాలు!... (ఇద్దఱూ సంవాహకుణ్ణి తంతూ ఉంటారు)

మాధురు : మన ద్యూతకేళీసమాఖ్య నిన్ను బంధించమంది...

సంవాహ : (లేచి విచారంతో) నాసంగతి సమాఖ్యదాకా వెళ్ళిందా?.. ఇప్పుడెలా?...

మాధురు : అయితే ఏదో ఒప్పందం చేసుకుందాం!

సంవాహ : అలాగే... (సభికుని చేతిలో చెయ్యివేసి) ఇవ్వాల్సిందాంట్లో సగం ఇస్తాను... మిగతా సగం వదిలేయండి!

సభిక : అలాగే కానీ...

సంవాహ : (మాధురునితో) సగం ఇస్తానని మాటిస్తున్నాను. సభికునివలె నువ్వూ సగం నాకు వదిలెయ్యి...

మాధురు : తప్పేదేముంది... అలాగే కానీ...

సంవాహ : సగం నాకు వదిలేశావుకదా!...

మాధురు : వదిలేశాను...

సంవాహ : (సభికునితో) సగం నువ్వు వదిలేశావు కదా!

సభిక : వదిలేశాను...

సంవాహ : అయితే మఱి నేనిక వెళ్ళొస్తా...

మాధురు : ఎక్కడికి పోతావురా సొమ్మివ్వకుండా?

సంవాహ : అయ్యా! చూడండి, చూడండి...ఇప్పుడే నేనివ్వవలసిన దాంట్లో సగం సభికుడు, మఱొక సగం మాధురుడూ వదులు



కొన్నామన్నారు. ఇక నేనేమీ ఇవ్వక్కర్లేదుగా.. మళ్ళీ ఇప్పుడు నేను దుర్బలుణ్ణని నన్ను రొక్కం కోసం నిలదీస్తున్నారు...

మాధురు : (పట్టుకొని) ధూర్తుడా! నేను మాధురుణ్ణి.. నీపాటి తెలివితేటలు మాకు లేవనుకుకోకు.. ముందా సొమ్మివ్వు...

సంవాహ : ఎక్కణ్ణుంచి తెచ్చివ్వను?

మాధురు : మీ బాబునమ్మి సొమ్మివ్వు!

సంవాహ : మా తండ్రి ఎప్పుడో మరణించాడు...

మాధురు : అయితే మీ అమ్మనమ్మి సొమ్మివ్వు!...

సంవాహ : మా అమ్మా అంతకుముందే పోయింది...

మాధురు : అయితే నిన్ను నువ్వే అమ్ముకొని ఇవ్వరా!

సంవాహ : అయితే కాస్త దయచూపు. నన్ను రాజవీధికి తీసికొని వెళ్ళు!...

మాధురు : నడు. అయితే ...

సంవాహ : ఈ సభికులకు పట్టుబడిన నన్నెవరైనా దయతో పది సువర్ణనాణాలకు కొని అనుగ్రహించేండి.. (ఆకాశం వైపుచూచి ఏదో వింటున్నట్లభినయించి) ఏవంటున్నారూ? నేనేం చేస్తాననా?.. మీ ఇంట్లో పనులన్నీ చేస్తాను... అయ్యో! సమాధానం చెప్పకుండానే వెళ్ళిపోతున్నారే?.. సరే.. ఇంకొకర్ని వేడుకొంటాను.. అయ్యో! ఈయనకూడా చులకనగా చూసిపోతున్నాడే.. అయ్యో!.. ఆర్య చారుదత్తుని వైభవం కరగిపోవటంతో నేనెంత దురదృష్టవంతుణ్ణైనాను!...

మాధురు : సొమ్మివ్వరా!..

సంవాహ : ఎక్కణ్ణుంచి తెచ్చిమ్మంటావ్?

(మాధురుడు, సంవాహకుణ్ణి పట్టుకొని ఈడుస్తున్నాడు)

అయ్యా!.. రక్షించేండి.. రక్షించేండి...

దుర్దరకుడు : (ప్రవేశించి) అయ్యా!... జూదగాడంటే మకుటంలేని మహారాజు!.. అవమానాన్ని అసలు పట్టించుకోడు... ఎప్పుడూ ధనాన్ని రాబట్టుకొంటాడు, పంచిపెడతాడు.. సంపన్నులు ఆయన్ని సేవిస్తూ ఉంటారు... నా సంపదంతా జూదంవల్ల వచ్చిందే... భార్య, స్నేహితులు, జూదంలో గెలిచిన సొమ్మువల్లే లభించారు.. జూదంతోనే దానధర్మాలు చేశాను.. భోగాలనుభవించాను... జూదంలోనే తండ్రి ఆస్తితో సహా అంతా తుడిచిపెట్టుకు పోయింది...

మాధురు : ఇవ్వరా ఇవ్వు!...

సంవాహ : ఎక్కణ్ణుంచి తేను? (మాధురుడు, సంవాహకుణ్ణి లాగుతాడు)

దుర్దర : ఏవిఁటిది?... (పైకిచూచి ఏదో విన్నట్లభినయించి) ఏ వఁంటున్నావ్? సభికుడీ జూదగాణ్ణి బంధించాడు, విడిపించేటాని కెవరూ రాలేదనా?... అహఁ! అయితే నేను విడిపిస్తాను. ఆఁ!..ఆఁ!.. తప్పుకోండి... తప్పుకోండి.. ఓహో! వీడు ధూర్తుడైన మాధురుడు..వీడు సంవాహకుడు... మాధురా! నమస్కారం! ఏవిఁటీ హడావిడి?

మాధురు : ఈ సంవాహకుడు మాకు పదిబంగారు నాణాలివ్వాలి!...

దుర్దర : ఓస్!. అంతేనా?.. నా చేద్దన్నం పాటి చేయదు!

మాధురు : (దుర్దరకుని చేంకలో ఉన్న చినుగుల ఉత్తరీయాన్ని లాగి) అయ్యలారా! చూడండి.. చూడండి! ఈ చింకిపాతతో ఉన్నవాడికి పదిబంగారు నాణలు చేద్దన్నంపాటి కావట!

దుర్దర : ఒరే మూర్ఖా! నేను పాచికలాడి పది సువర్ణాలూ నీకిస్తాను... ధనికుడు తన ధనాన్నందఱికీ చూపించుకొంటూ తిరుగుతాడా ఏవిఁటి? పది బంగారు నాణాలకోసం నిండు ప్రాణాన్ని తీయటానికి సిద్ధమౌతావా?...



మాధురు : మహారాజా! నీకు పదిసువర్ణాలు చేద్దన్నంపాటి చేయకపోవచ్చుకానీ మాప్రాణానికవే మహాసంపద!...

దుర్దర : అయితే ఒకపనిచెయ్యి.. మరోపది సువర్ణాలితనికే ఇవ్వు చెబుతా, వాటితో జూదమాడతాడు!...

మాధురు : తరువాతిమాట!...

దుర్దర : గెలిస్తే నీ ధనం నీకిస్తాడు!

మాధురు : ఓడిపోతే?...

దుర్దర : ఇవ్వడు!...

మాధురు : ఇక ఆపు నీ జిత్తులు... నువ్వే ఆ పదిసువర్ణాలితనికివ్వు.. ఎంతమోసం?

దుర్దర : నువ్వే మోసగాడివి... నీ బాబు మోసగాడు, నీ తాత మోసగాడు!...

(సంవాహకునికి పాఱిపొమ్మని సైగ చేస్తాడు)

మాధురు : తొత్తుకొడకా!.. నువ్విలాగే డబ్బెదురిచ్చి జూదమాడేవా?...

దుర్దర : నేనలాగే ఆడేను...

మాధురు : అరే! సంవాహకా!.. డబ్బివ్వరా!...

సంవాహ : ఇస్తాను... ఇవాళ తప్పక ఇచ్చేస్తాను... (మాధురుడు సంవాహకుని లాగుతాడు)

దుర్దర : ఓరిమూర్ఖుడా!... నేనిక్కడ ఉంటుండగానే సంవాహకుని బంధిస్తావా?... (మాధురుడు సంవాహకుని దగ్గఱగా లాగి ముక్కుమీద గుద్దుతాడు. సంవాహకుడు నెత్తురు కారుతున్న ముక్కుతో మూర్ఛపోయినట్లభినయిస్తాడు. దుర్దరుడు వచ్చి అడ్డుపడతాడు. మాధురుడు దుర్దరకుని కొడితే దుర్దరకుడు తిరిగి కొడతాడు)

మాధురు : దుష్టుడా! తొత్తుకొడుకా!... నన్ను కొట్టిన ఫలితం ఊరికేపోదు...

దుర్దర : ఒరే మూర్ఖా! నాత్రోవన నేను పోతుంటే నన్ను నిష్కారణంగా కొట్టావు... రేపు రాజ సభలోనూ ఇలాగే కొట్టు. అప్పుడు చూస్తావు!...

మాధురు : అలాగే చూస్తాలే!...

దుర్దర : ఎలా చూస్తావ్!...

మాధురు : (కళ్ళు పెద్దవిచేసి) ఇదిగో.. ఇలా!.. (దుర్దరకుడు మాధురుని కళ్ళలో మట్టికొట్టి సంవాహకుని పాటిపొమ్మని సైగ చేస్తాడు.. మాధురుడు చేతుల్తో కళ్ళు కప్పుకొని నేలపై పడిపోతాడు. సంవాహకుడు పాటిపోతాడు.)

దుర్దర : (తనలో) ప్రధానసభికుడు మాధురునితో విరోధం తెచ్చుకొన్నాను కనుక ఇక ఎక్కువసేపిక్కడ ఉండకూడదు. నామిత్రుడు శర్విలకుడొకమాట చెప్పాడు... ఆర్యకుడనే గొల్లపిల్లవాడు ఈదేశానికి రాజౌతాడని ఒక సిద్ధుడు చెప్పాడట!... కనుక ఈ రాజంటే ఇష్టంలేని వాళ్ళంతా అతనిని చేరటం మంచిదని... కనుక నేనిప్పుడు శర్విలకుని వద్దకు చేరటమే మంచిది...

సంవాహ : (నాలుగడుగులు నడిచి) ఇదిగో ఈ ఇంటి తలుపు తెఱిచే ఉంది... (లోనికి ప్రవేశించి వసంతసేనను చూచి) శరణు... శరణు...

వసంత : శరణాగతునికి అభయం!... చెలీ!... తలుపువేసిరా!... (చెలి తలుపుమూస్తుంది) ఎవరివల్ల నీకు భయం?

సంవాహ : అప్పులవాళ్ళనుంచి అమ్మా!

వసంత : చెలీ!.. ఇప్పుడు తలుపు తెఱు!



మాధురు : (కళ్ళు తుడుచుకొంటూ) అరే!.. ఇవ్వరా!.. ఇవ్వు.. డబ్బివ్వు...

సభి : మనం దుర్దరకునితో జగడానికి దిగినప్పుడే ఆ సంవాహకు డదను చూచి పాటిపోయాడు!...

మాధురు : వాడి ముక్కు పగిలి రక్తం ఓడుతోంది. కనుక ఆ రక్తపు చుక్కలఆనవాళ్ళు అనుసరించిపోదాం... (ఇద్దఱూ నడుస్తారు)

సభి : వీడు వసంతసేన ఇంట్లో ప్రవేశించినట్లుంది...

మాధురు : అయితే మన డబ్బు మనకు వచ్చినట్లే... (వస్తుంది, రాదు అనే రెండర్థాల్లో)

సభి : రాజసభలో అభియోగం తెస్తే?

మాధురు : ఈ దుర్మార్గుడిక్కడనుంచి ఇంకెక్కడికైనా పోగలడు.. కనుక వీణ్ణి అడ్డగించి పట్టుకోవటమే మంచిది!
(వసంతసేన మదనికకు సైగచేస్తుంది)

మద : అయ్యా!.. నువ్వెక్కణ్ణుంచి వచ్చావ్? మీదేఊరు? ఎవరి వాడవు? నీవృత్తి ఏమిటి? నీ కెవరివల్ల భయమో చెప్పు!...

సంవాహ : మాది పాటలీపుత్రం!.. సంవాహకవృత్తి నా జీవిక...

వసంత : మంచి కళనే చేపట్టావే!...

సంవాహ : (విచారంగా) కళగానే అభ్యసించినా అది నా జీవికైంది..

మద : ఆఁ!... ఆ తర్వాత?

సంవాహ : మా ఇంటికి వచ్చిపోయే అతిథుల ద్వారా దేశదేశాల సమాచారం తెలిసికొని దేశాటనం చేయాలని బుద్ధిపుట్టి ఈనగరానికి వచ్చాను... ఇక్కడ ఒకమహామహుని సేవించాను... ఆ మహాత్ముడు సద్గుణాలకు నిధి, శరణాగత వత్సలుడు... పరోపకారార్థమే శరీరమని భావించే ఉదారుడు...

మద : ఆ మహాత్ముడెవరై ఉంటాడబ్బా!... మా వసంతసేన మానసచోరుడు, ఉజ్జయిని కలంకారభూతుడైన చారుదత్తుడు కాడు కదా!

వసంత : బాగుంది!... నేనూ అలాగే అనుకొంటున్నాను...

మద : అయ్యా!.. ఆ తరువాత?

సంవాహ : అమ్మా!.. ఆ మహాత్ముడు మితిమించిన ఔదార్యంతో చేసిన దానధర్మాలతో...

వసంత : ఇప్పుడు వైభవం అంతరించి పేదవాడైనాడా?

సంవాహ : నేను చెప్పకపోయినా సరిగా గ్రహించారే?

మద : ఆయన పేరేవిఁటి?

సంవాహ : ఆయన పేరెరుగని వారంటూ ఎవరూ ఉండరమ్మా! వణిగ్వీథిలో ఉంటున్న ఆర్య చారుదత్తుడు!...

వసంత : (సంతోషంతో ఆసనంనుంచి లేచి) అయ్యా!.. ఈ ఇల్లు మీదే అనుకోండి... మదనికా! ఈయనకు ఆసనం తీసుకురా!.. విసనకఱ్ఱ అందుకో... ఈయన బడలికతో ఉన్నాడు... (మదనిక అలా చేస్తుంది)

సంవాహ : (తనలో) ఆర్య చారుదత్తుని పేరుచ్చరించిన మాత్రంగానే నాకెంత గౌరవం చేస్తోంది..! (పైకి) అమ్మా!.. మీరూ కూర్చోండి!

వసంత : (కూర్చుని) తరువాత?

సంవాహ : తరువాత ఆయన జీతానికి పెట్టుకునే సేవకుల్లో ఒకణ్ణైనాను.. ఆయన సంపదలు క్షీణించి పోవటంతో జూదమే వృత్తిగా చేసికొని జీవిస్తున్నా... ఇందులోనూ దురదృష్టం నన్ను వెంటాడటంతో పది సువర్ణనాణాలోడిపోయా!... ఆజూదగాళ్ళిప్పుడు నన్ను వెంట



తరుముతున్నారు... గుమ్మం దగ్గఱకొచ్చారు... అమ్మా! మీరే రక్షించాలి...

వసంత : మదనికా!... (తనచేతి సువర్ణాభరణం తీసి ఇచ్చి) ఈ సంవాహకుడే ఇచ్చాడని చెప్పి ఆ సభికులకీ బంగారు కంకణాన్నిచ్చిరా!..

మద : (వెళ్ళి తిరిగివచ్చి) అమ్మా! సువర్ణాభరణాన్ని తీసికొని ఆ జూదగాళ్ళానందంతో వెళ్ళిపోయారమ్మా!...

వసంత : ఇక సంవాహకుని కష్టాలు తీఱిపోయాయి కనుక అతడూ నిశ్చింతగా వెళ్ళొచ్చు!...

సంవాహ : అమ్మా!... నాకు తెలిసిన ఈ సంవాహక కళలో నీ పరిజనానికి శిక్షణనిచ్చి ఋణం తీర్చుకొందామని నా అభ్యర్థన...

వసంత : ఎవరికోసం పూర్వం ఈ విద్యని వినియోగించావో అతణ్ణే సేవించేటం మంచిది...

సంవాహ : (తనలో) ఎంత తెలివిగా నా అభ్యర్థనను తిరస్కరించింది!... (పైకి) అమ్మా!... ఈ సభికులు నన్నవమానించిన కారణంగా బౌద్ధభిక్షువునౌతాను.. నన్ను మఱిచిపోకండేం!

వసంత : ఎందుకంత సాహసం?

సంవాహ : ఇందులో ఒక నిశ్చయానికొచ్చాను... నా జూదవ్యసనంతోనే కదా మీవంటివారికింత ఇబ్బంది కలిగింది!... ఇకభిక్షువునై రాజమార్గంలో తలెత్తుకొని గౌరవంగా తిరుగుతాను...

= నేపథ్యంలో – కలకలం =

(విని) ఏవిఁటీ హడావిడి! (ఆకాశంవైపుచూసి) ఆఁ! ఏవఁంటున్నారు?... వసంతసేన మదగజం కల్లోలాన్ని

సృష్టిస్తోం దనా? అయితే వెళ్ళి చూడాలి!.. అయినా ఆ ఏనుగుతో నాకేం పని?.. నాపని నాకుందిగా! (నిష్క్రమిస్తాడు) (తరువాత కర్ణపూరకుడనేవాడు దురుసుగా ప్రవేశిస్తాడు)

కర్ణపూరకుడు : వసంతసేనమ్మగారెక్కడ?

మద : ఏవింటీ ఉద్వేగం? ఎదురుగా ఉన్న అమ్మగారినే చూడలేక పోతున్నావా?

కర్ణ : అమ్మా!... దండాలు!

వసంత : కర్ణపూరకా! ఏవింటివాళ నీ మొహం ఇంతగా వెలిగి పోతోంది!... ఏవింటి కథ?

కర్ణ : అమ్మా!... మంచి అవకాశం పోగొట్టుకొన్నారు.. ఇవాళ నా పరాక్రమం చూడలేకపోయారు!...

వసంత : ఏవింటది?...

కర్ణ : ఖుంటమోడకమనే పేరున్న మీ ఏనుగు కట్టుకొయ్యను విరగ్గొట్టి మావటివాణ్ణి మట్టుపెట్టి అందివచ్చినవాళ్ళని చితక్కొడుతూ జనంలో కల్లోలం రేపింది... ఆ బీభత్సాన్ని చూడటానికి ఉజ్జయినీ నగరమంతా ఒడ్డిగిలిపోయింది... ఇంతలో ఆ మదపుటేనుగొక బౌద్ధ భిక్షువును తన తొండంతో పైకెత్తింది.

వసంత : ఎంత ప్రమాదం!...

కర్ణ : కంగారు పడకండి.. అప్పుడు మీఉప్పుతిన్న నేను దాని బారి నుంచి సన్యాసిని రక్షించాను.

వసంత : మంచిపని చేశావు... ఆ తరువాత?

కర్ణ : అప్పుడొకాయన మెచ్చుకొంటూ నాకేదైనా బహుమానం ఇవ్వాలని చేతులు, మెడ తడుముకొని అక్కడాభరణాలేమీ



లేకపోవటంతో నిట్టూర్పు విడుస్తూ ఈశాలువాని పైకి విసిరాడు...

వసంత : ఆ ఉత్తరీయం జాజిపూల పరిమళంతో ఉందా కర్ణపూరకా!

కర్ణ : ఏనుగు మదం కంపుతో నాకు వాసన తెలియటంలేదు...

వసంత : పోనీ దానిమీద పేరేమైనా ఉందోచూడు!

కర్ణ : ఇదిగో ఇక్కడేదో పేరుంది... ఏవిటో మీరే చూడండి (శాలువా ఇస్తాడు)

వసంత : ఆర్య చారుదత్తునికి (అని చదివి దాన్ని ఎంతో స్నేహంతో కప్పుకొంటుంది)

మద : కర్ణపూరకా! ఈశాలువా అమ్మగారు కప్పుకొంటే చాలా అందంగా ఉంది కదూ!

కర్ణ : అవునీశాలువా అమ్మగారు కప్పుకుంటేనే ఎంతో బాగుంది..

వసంత : కర్ణపూరక! ఇదిగో నీకు బహుమానం (నగ ఇస్తుంది. కర్ణపూరకుడు సంతోషంతో స్వీకరిస్తాడు)

వసంత : కర్ణపూరకా! ఇప్పుడార్యచారుదత్తు డెక్కడ ఉండొచ్చు నంటావ్?

కర్ణ : ఈ త్రోవలోనే ఇంటికి బయలుదేరారనుకుంటా...

వసంత : చెలీ!మనం సౌధాగ్రాన్నెక్కి చారుదత్తులవారిని దర్శిద్దాం రా!

★ ★ ★

## మూడవఅంకం

రాచేబాట

చారు : ఆహా!... రేభిలుని సంగీతం ఎంతమనోహరంగా ఉంది... ఏమి వీణావాదనం!

మైత్రే : మిత్రమా!... ఇక ఇంటికి వెడదాం ...రా...

చారు : మహావిద్వాంసుడైన రేభిలుడు ఎంతమనోజ్ఞంగా గానం చేశాడు!.. ఏం నీకు నచ్చేలేదా?... ఓ! ఎంత బ్రహ్మాండంగా ఉంది! ఒక్కమాటలో చెప్పాలంటే ఎవరో ఒక వనిత అతనిలో దాగుండి పాడినట్లనిపించింది... కచేరీ ముగిసినా ఆ వీణానాదం, సాహిత్యం, తరంగాలుగా ఇంకా నాచెవికి సోకుతూనే ఉన్నాయి...

మైత్రే : మిత్రమా! అర్ధరాత్రివేళవుతోంది... దారిప్రక్క కుక్కలుకూడా కునుకుతీస్తున్నాయి... కనుక ఇంటికి వెడదాం పద... చంద్రుడస్తమిస్తూ చీకట్లు వ్యాపిస్తున్నాయి... హమ్మయ్య!.. ఇల్లుచేరాం!... వర్ధమానకా! తలుపుతెఱు... (తలుపుకొట్టిన శబ్దం)

వర్ధ : (తలుపుతీసి) అయ్యా! నమస్కారం... రండి... కూర్చోండి...

మైత్రే : వర్ధమానకా! రదనికను కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు తెమ్మను!...

చారు : ఆఁ!.. ఆఁ! నిద్రపోతుంటే లేపకు... మైత్రేయా! నువ్వు నీళ్ళు పొయ్యి.. వర్ధమానకుడు నాకాళ్ళు కడుగుతాడు..

వర్ధ : మైత్రేయ!.. నువ్వూ కాళ్ళు కడుక్కొని లోపలికిరా!... మైత్రేయా!.. ఇవిగో వసంతసేన ఇచ్చిన ఆభరణాలు.. వీటిని పగలు నేను, రాత్రి నువ్వూ కదా రక్షించాలి!... తీసుకో (నగలపెట్టెనిచ్చి నిష్క్రమిస్తాడు)



మైత్రేయ : అబ్బా!.. ఈ నగలింకా ఉన్నాయా?... చూస్తుంటే ఉజ్జయినిలో దొంగలే లేరల్లే ఉందే!... నా నిద్రను దొంగిలించాలనే ఏ దొంగా ఇంతవఱకూ ఈ నగల్ని దోచుకుపోలేదు!...

చారు : మైత్రేయ!.. అప్రమత్తుడవై నగల్ని రక్షించాలి సుమా!... లేకపోతే మాటొస్తుంది! (ఆవలించి) నిద్రొస్తోందయ్యా!...

మైత్రే : అయితే మఱింక నిద్రించాలి... (శర్విలకుని ప్రవేశం)

శర్విల : చోరకళలో నాకున్న నేర్పుతో, బలంతో ఇంటి గోడలకి కన్నం వేస్తాను. నా శరీర ప్రమాణానికి తగినంతమాత్రమే కన్నం ఉంటుంది. అదిగో చంద్రాస్తమయం కూడా అవుతోంది. చీకటి తన చీరతో నన్నుకప్పి కన్నతల్లిలా రక్షిస్తోంది... ఈ గోడకి ఎక్కడ కన్నం వేస్తే అనువుగా ఉంటుందో చూడాలి... (మూడునాలుగుచోట్ల తడిమి) ఆఁ! ఇక్కడ బాగుంది.. అనుష్ఠానం తర్వాత ప్రతిదినం నీళ్ళు ఇక్కడ పారబోస్తారు కనుక ఈ ప్రదేశం కొంచెం మెత్తగా ఉంది... కన్నం వేయటంలో రేపు ఉజ్జయినీ ప్రజలు నా నేర్పును ప్రశంసించాలి... చోరకళలో కన్నం వేయటంలో వికసించినపద్మం, భానుమండలం, చంద్రరేఖ, దిగుడుబావి, విశాలరూపం, స్వస్తికాకారం, పూర్ణకుంభం అని ఏడు ప్రసిద్ధ రూపాలున్నాయి. ఏ ఆకారం తీసికొన్నా నాశిల్పసామర్థ్యాన్ని చూపించాలి. ఈగోడ పండు ఇటికలతో కట్టింది కనుక పూర్ణకుంభ రూపమే ఎక్కువ వీలు!... ఇక పని ప్రారంభించాలి! చోరశాస్త్ర కర్తలైన కార్తికేయునికీ, కనకశక్తికీ, బ్రహ్మణ్యదేవునికీ, దేవవ్రతునికీ ప్రణామాలు... నా యోగాచార్యుడు భాస్కరనందికి సాష్టాంగ ప్రణామాలు... ఆయనకు నేను ప్రథమ శిష్యుణ్ణి కావటంతో

'యోగరోచన' అనే నల్లని లేహ్యాన్ని నాకనుగ్రహించారు. దీనిని ఒంటికి పట్టించుకుంటే ఎవరికీ కనబడను... నా ఒంటి మీద పడిన ఆయుధాలు కూడా నాకు బాధను కలుగజేయవు!.. అయ్యో!... కొలతబద్దను మఱచిపోయా! సరే... ఈనాజందెమే కొలబద్దౌతుం దిప్పుడు... "యజ్ఞోపవీతం పరమం పవిత్ర"మని ఊరకే అన్నారా? (కన్నం వేయటాన్ని అభినయించి) ముందు ఈ కన్నంగుండా దిష్టిబొమ్మని లోపలికి పంపుతా!... దాన్ని చూచి మెలకువ వచ్చి ఎవరైనా అఱిచినా నేనిటునుంచి ఇటే ఉడాయించొచ్చు... లేదా పని పూర్తిచేసుకోవచ్చు.. ఒక వైపు మృదంగం, దర్దురం, వేఱొక వైపు పణవం, ఇంకో వైపు వీణ, మఱొక వైపు గ్రంథాలు! చూడబోతే ఇది నాట్యాచార్యుని ఇంటిలా ఉంది... అయితే నేనొక నిర్ధనుని ఇంట్లో ప్రవేశించానా?

మైత్రేయ : (కలవరిస్తున్నట్లుగా) మిత్రమా! అక్కడేదో కన్నంలా కనిపిస్తోంది.. ఎవడో దొంగ దూరాడేమో!... అందుకని ఈ ఆభరణాల పేటికను నువ్వే తీసుకో...

శర్విల : (తనలో) ఏవిఁటీ? కొంపతీసి వీడు నన్ను గుర్తించాడా?... తాను దరిద్రుణ్ణని ఎగతాళి చేస్తున్నాడా? అయితే వీణ్ణి చేంపేస్తే?... ఒకవేళ కలవరిస్తున్నాడేమో?... (పరిశీలనగా చూసి) చిరిగినబట్ట చుట్టిఉన్న ఈపేటిక ధగద్ధగాయ మానంగా వెలిగిపోతోంది... కనుక ఇది బంగారు ఆభరణాలతో ఉన్నదే కావాలి... కానీ, దీన్ని తీసుకుంటాను... అహఁ! వద్దు.. వద్దు.. ఎంతైనా వీడూ నావంటి దరిద్రుడు లాగానే కనిపిస్తున్నాడు.. కనుక సాటివాణ్ణి దోచుకోవటం నీతికాదు... వెళ్ళిపోతాను...



మైత్రేయ : (కలవరింతగానే) మిత్రమా! ఈ పేటికను తీసికో... తీసికోకపోతే గోబ్రాహ్మణ హత్యచేసిన పాపానికి పోతావు...

శర్విల : అమ్మమ్మ! ఎంత ఒట్టుపెట్టాడు!... గోబ్రాహ్మణులు పరమ పూజనీయులు. అయ్యో... దీపం వెలుగుతోందే... ఇప్పుడెలా? సరే... దీపాన్నార్పటానికి దీపప్పురుగుని వదులుతాను. హమ్మయ్య... భద్రపీఠమనే ఈ పురుగు దీపంచుట్టూ తిరిగి తిరిగి ఈ దీపాన్నార్పేసింది. అంతా చీకటిమయమైపోయింది... ఛీ!...ఛీ... నావల్ల మా బ్రాహ్మణ వంశమే చిమ్మచీకటి వంటిదైంది.. బ్రాహ్మణుల్లో చతుర్వేద సారాన్నీ ఆపోశన పట్టి ఇతరుల నుంచి ఏమీ స్వీకరించేని మాన్యునికి కొడుకునై బ్రాహ్మణ పుటక పుట్టి శర్విలకుడనే పేరుతో ఘనాంతస్వాధ్యాయినై ఉండీ నే చేస్తున్న ఈ పనేవిఁటి?... మదనిక అనే వేశ్య మోజులో ఎంతటి నీచానికి పాల్పడుతున్నాను?... అయినా ఈ బ్రాహ్మడి కోరిక తీరుస్తాను. పేటికను అందుకొంటాను!...

మైత్రేయ : మిత్రమా! నీచేతివేళ్ళు చల్లగా ఉన్నాయేవిఁటి?

శర్విల : అయ్యో! ఎంతపొరపాటు! నీళ్ళవల్ల చెయ్యి తడిగా ఉంది.. సరే... (చంకలో చేతినుంచి వేడెక్కించి పేటిక నందుకొంటాడు)

అయ్యో ఎంతగా పతితుణ్ణైనాను.. మదనిక అనే వేశ్యకోసం బ్రాహ్మణ వంశ ప్రతిష్ఠనే మంట కలిపాను.. బ్రాహ్మణ బ్రువుడా! వందేళ్ళు హాయిగా నిద్రించు... ఎవత్తో వస్తోంది... దీన్ని చేంపేస్తే? ఎందుకులే... స్త్రీ హత్య మహాపాతకం... నేనే వెడతాను (నిష్క్రమిస్తాడు)

రదనిక : (ప్రవేశించి) అయ్యో!.. కన్నం! దొంగ!.. దొంగ!... (భయంతో) మైత్రేయా!.. లెండి.. లెండి.. దొంగ ఎవరో మనింటికి కన్నం వేసి పాఱిపోయాడు...

మైత్రేయ : ఏవంటున్నావు? ఇంటికి దొంగనువేసి కన్నం పాతిపోయిం దనా?

రదనిక : అయ్యో!.. ఏవింటీ పరిహాసం! కనిపించేటం లేదూ?

మైత్రే : చారుదత్తా! లే.. మిత్రమా లే... ఎవడో దొంగ మనింటికి కన్నంవేసి పాతిపోయాడు!

చారు : చాల్లేవయ్యా! నీ వేళాకోళాలు!

మైత్రే : వేళాకోళంకాదు. అదిగో నువ్వే చూడు!

చారు : ఓహ్!... ఎంత అందంగా ఉందీ కన్నం! ఈ పనిలోనూ ఎంతటి నైపుణ్యం!

మైత్రే : మిత్రమా! ఈ కన్నం వేసింది ఎక్కణ్ణుంచో వచ్చిన వాడైనా కావాలి. లేక ఇప్పుడిప్పుడే దొంగతనం నేర్చుకుంటున్న వాడైనా కావాలి... కాకపోతే ఈ ఉజ్జయినిలో మనవైభవం తెలియనివాడెవడు?

చారు : పాపం ఎవరో మన అందమైన ఇంటిని చూసి ఎంతో ఆశపడి లోపలికి వచ్చి హతాశుడై వెళ్ళిపోయుంటాడు.

మైత్రే : ఏవింటి మిత్రమా! ఆ దొంగవెధవని గూర్చే దిగులుపడు తున్నావా? వాడు ఓహో! బంగారుకొండలా ఉన్న ఈ భవనంలో బంగారు కుండైనా దొరకదా అని వచ్చి ఉంటాడు... ఆc!...ఆc! ఆ బంగారు నగల కుండెక్కడ? (ఆలోచించి) చూడు! చారుదత్తా! నువ్వు నన్నెప్పుడూ చదువూ సంధ్యా లేనివాణ్ణనీ, మూర్ఖుణ్ణనీ అంటూ ఉంటావు కదా!... ఆ పేటిక రాత్రి నీకందించి ఎంత తెలివైన పని చేశానో?

చారు : చాల్లే పరిహాసాలు!

మైత్రే : నేనెంత మూర్ఖుణ్ణైనా వేళాపాళా తెలియని వాణ్ణేమీకాదు.



చారు : పేటికను నువ్వు నాకెప్పుడిచ్చావ్?

మైత్రే : అదేవింటయ్యా! నీచేతివేళ్ళు చల్లగా ఉన్నాయేమని కూడా అడిగానుకదా!

చారు : (అంతా వెదికి) మైత్రేయా!.. ఒకసంతోషకరమైన వార్త!

మైత్రే : నగలపేటిక నట్టింట్లో భద్రంగానే ఉందా? దొంగ తీసికెళ్ళలేదా?

చారు : తీసికెళ్ళిపోయాడు...

మైత్రే : అయితే ఇది సంతోషకరమైన వార్తా?

చారు : నా ఇంటికి వచ్చి ఎంతో శ్రమతో కన్నం వేసి వట్టి చేతుల్తో పోక నగలతో వెళ్ళటం సంతోషించేదగిందే కదా!

మైత్రే : అవి దాచిపెట్టమని ఇచ్చిన వస్తువులు కానీ, మనవి కావుగా!...

చారు : ఆc! అవి వసంతసేన నగలా?! ( మూర్ఛిల్లుతాడు.)

మైత్రే : (ముఖంపై నీళ్ళుచల్లుతాడు.. చారుదత్తుడు తెప్పరిల్లుతాడు) ఎవరిదో సొమ్ము ఎవడో ఎత్తుకుపోతే నువ్వింతగా స్పృహ కోల్పోవటం ఎందుకు?

చారు : మైత్రేయా... ఇలా జరిగిందంటే ఎవడు నమ్ముతాడు?... లోకులంతా నన్నే నిందిస్తారు!... నా దరిద్రం అన్ని అపోహలకూ కారణం కదా!... నా సంపదలపై ప్రేమతో దైవమే వాటిని తీసికొన్నాడంటే సరేలే అనుకొన్నా... కానీ ఆ దుర్విధి నాశీలానికే చేటు తెచ్చిందే!...

మైత్రే : అసలీ నగలు దాచేమని నీకెవరిచ్చారు?... నువ్వెప్పుడు తీసికొన్నావ్? ఎవరు సాక్షి? అంటే పోలా?

చారు : మైత్రేయా!... ఇంతబతుకు బతికి ఇప్పుడబద్ధమాడుతానా? బిచ్చమెత్తైనా ఆమెసొమ్ము నామెకప్పగిస్తాను!...

రదనిక : ఈ విషయాన్ని ధూతాదేవి అమ్మగారికి ఇప్పుడే చెప్పాలి (నిష్క్రమిస్తుంది)

(కొద్దిక్షణాల్లో ధూతాదేవి రదనికతో ప్రవేశిస్తుంది)

ధూతాదేవి : (ఆదుర్దాగా) రదనికా! దొంగలు పడ్డారంటున్నావ్!.. ఆర్య పుత్రులకీ, మైత్రేయునికీ ఏమీ కాలేదు కదా!

రదనిక : ఏవీఁకాలేదమ్మా!

ధూతాదేవి : నిజఁవే?

రదనిక : నిజఁవేనమ్మగారూ!... వారికేమీ కాలేదు.. కానీ వసంతసేన నగలపేటిక కనబడటంలేదు...

ధూత : (స్ప్ృహకోల్పోయి, తెప్పరిల్లి) రదనికా! ఏమన్నావ్? ఆర్యపుత్రుని దొంగలేమీ చేయలేదనా?

రద : అవునమ్మగారూ!

ధూత : అలాకాకుండా ఉంటేనే బాగుండేది... దొంగలాయన్ని కొట్టి శరీరాన్ని హింసించేక పోయినా ఇప్పుడాయన శీలానికి మచ్చే కలిగించారు!... ఇవాళ ఉజ్జయినిలో ప్రజ లేవఁనుకొంటారు? ఆయనే నగల్ని అపహరించి దొంగలమీద పెడుతున్నాడనుకోరూ?... (ఆకాశం వైపుచూసి, నిట్టూర్చి) భగవంతుడా! మావంటి నిర్ధనులతో ఆడుకొంటున్నావా?... (ఆలోచించి) రదనికా!...

రద : అమ్మగారూ!...

ధూత : ఇప్పుడొక్కటే త్రోవ కనిపిస్తోంది...

రద : ఏవిఁటమ్మా?

ధూత : మా పుట్టింటివారిచ్చిన ఈ రత్నహారం ఒక్కటే మిగిలి ఉంది... దీన్ని అభిమానధనులైన ఆర్యపుత్రులు స్వీకరించేరు... కనుక మైత్రేయుని పిలు...

(రదనిక వెళ్ళి తిరిగి మైత్రేయునితో ప్రవేశిస్తుంది)



మైత్రే : అమ్మా!... శుభం భవతు!

ధూత : అయ్యా... నమస్కారం! తూర్పుముఖంగా తిరిగి దీన్ని తీసుకోండి!

మైత్రే : ఏవిఁటమ్మా ఇది?

ధూత : నేను ఉపవాసం చేసి 'రత్నషష్ఠీ' అనే వ్రతాన్నాచరించాను... 'రత్నషష్ఠీ' వ్రతం చేసినవారు ఒక రత్నహారాన్ని బ్రాహ్మడికి దానం చేయాలి!... కనుక ఈ రత్నహారాన్ని స్వీకరించేండి!...

మైత్రే : అమ్మా!... మీకు శుభమగుగాక!.. వెళ్ళొస్తాను.. ప్రియ మిత్రుడు చారుదత్తునికీ విషయం నివేదిస్తా!...

ధూత : మైత్రేయా...! నన్ను సిగ్గుపడనీయవద్దు సుమా!... (లోనికి వెడుతుంది)

మైత్రే : ఆహా!.. ఎంతటి గొప్ప మనస్సీమెది!...

చారు : మైత్రేయుడెటో వెళ్ళి ఇంకా రాలేదేం?... తీరని విచారంతో ఎటువంటి అఘాయిత్యానికీ పూనుకోలేదు కదా!... (పైకి) మైత్రేయా! మైత్రేయ!...

మైత్రేయ : ఇదిగో వచ్చాను... (రత్నహారాన్నిస్తూ) ఇది తీసికో!

చారు : ఏవిఁటిది?

మైత్రేయ : అనుకూలవతి అయిన భార్యను పొందినందుకు లభించిన ఫలం!...

చారు : భార్య దయాదాక్షిణ్యాలకు పాత్రుణ్ణై నేను నిజంగా దరిద్రుణ్ణైనాను.. స్త్రీ ధనంపై ఆధారపడ్డవాణ్ణౌతున్నాను... కలిమి లేములవల్లే స్త్రీ పురుషుల పరిగణన... అయినా నేను దరిద్రుణ్ణి కాదు... ఉన్ననాడు, లేనినాడు, సుఖంలో, దుఃఖంలో నన్ననుసరించే ఇల్లాలు, మిత్రుడవైన నువ్వు

విడువని సత్యవాక్కు నన్ను సేవిస్తూ ఉంటే నేనెలా దరిద్రుణ్ణౌతాను?... దరిద్రుల్లో ఈ మూడూ ఉండవు కదా!...మైత్రేయా!.. ఈ రత్నావళిని తీసికొని వసంతసేన వద్దకు వెళ్ళు... నువ్విచ్చిన నగల్ని మావే అనుకొని జూదంలో ఓడిపోయాను, దానికి బదులుగా ఈ రత్నావళిని స్వీకరించుమని మామాటగా చెప్పు.

మైత్రేయ : ఏవిఁటీ? తిన్నదీ కాక, ఒకరికిచ్చిందీ కాక, మళ్ళీ అంత విలువైనవీ కాని ఆమె నగల బదులు చతుస్సముద్ర సారభూతమైన ఈ రత్నావళినివ్వటమా? ... కుదరదు...

చారు : అలాకాదు మైత్రేయా..! ఇది ఆమె నగలకు బదులుకాదు. ఏ విశ్వాసాన్నాశ్రయించి దరిద్రులమైన మనవద్ద ఆమె నగలనుంచిందో ఆ విశ్వాసానికి బదులీ రత్నహారం! ఆమెకీ రత్నహారం ఇవ్వకుండా నువ్వు తిరిగివస్తే నామీద ఒట్టే!... వర్ధమానకా! ఆ ఇటుకలతోనే కన్నాన్ని త్వరగా పూడ్చు... నలుగురూ చూచి నాలుగు రకాలుగా అనుకోకముందే త్వరగా జేరగాలీ పని!.. మైత్రేయా!. నువ్వా వసంతసేన ఆత్మగౌరవానికెట్టిలోటూ రాకుండానే మాట్లాడు...

మైత్రేయ : దరిద్రుడైనా ఎంతటి అభిమానధనుడీ చారుదత్తుడు!...

చారు : మైత్రేయా! నేను దరిద్రుణ్ణికాను!... చెప్పానుగా ఇందాకే, నాభార్య, నువ్వు, సత్యవ్రతం మీ ముగ్గురూ నన్ను విడువనంత వఱకు నేను దరిద్రుణ్ణి కాదని!.. సరే... నువ్వెళ్ళిరా!... నేనూ స్నాన సంధ్యాదులు నిర్వహించు కొంటాను...

★ ★ ★



## నాల్గవఅంకం

వసంతసేనఇల్లు

(వసంతసేన చారుదత్తుని చిత్రపటాన్ని చూస్తూ కూర్చుంటుంది)

చేటి : అమ్మా! మిమ్మల్ని తీసికొని వెళ్ళటానికి గుమ్మంలో బండి సిద్ధంగా ఉంది. కనుక మీరు అలంకరించుకొని బయలుదేరమని అమ్మగారు మీతో చెప్పుమన్నారమ్మా!

వసంత : ఆర్య చారుదత్తులవారు నాకోసం బండిపంపారా?

చేటి : ఎవరోకానీ బండితోపాటు పదివేల బంగారు నాణాల విలువైన అలంకారాలు కూడా పంపేరటమ్మా!

వసంత : ఎవరాయన?

చేటి : రాజుగారి బావమఱది సంస్థానకులటమ్మా!

వసంత : (కోపంగా) వెళ్ళు.. మళ్ళీ ఎప్పుడూ ఇటువంటి కబుర్లు తీసుకురాకు!

చేటి : మన్నించేండమ్మా!... పెద్దమ్మగారు చెప్పమన్నారుకనుక చెప్పాను..

వసంత : నాకోపం నీ మీదకాదు... ఆ కబురు మీదే!

చేటి : అయితే మీ అమ్మగారికి ఏవఁని చెప్పమంటారు?

వసంత : నేను బ్రతికి ఉండాలని కోరుకుంటే ఇంకెప్పుడూ ఇటువంటి మాటలు చెప్పవద్దన్నానని చెప్పు!

చేటి : అలాగేనమ్మా! (నిష్క్రమిస్తుంది)

శర్వి : (ప్రవేశించి) (తనలో) దొంగలుపడ్డారని ఊరివాళ్ళంతా రాత్రిని తిట్టుకొనేట్లు చేశాను... మదనిక కోసం ఎంత సాహసం చేశాను! ఇది వసంతసేన ఇల్లు... మదనిక ఎక్కడుంది చెప్మా?.. (విసనకఱ్ఱతో మదనిక కనిపిస్తుంది) ఆc!.. అదిగో మదనిక!.. ఇటే వస్తోంది.

మదనిక : అరే... శర్విలకుడు.. స్వాగతం!.. ఇన్నాళ్ళూ ఏమైపోయావ్?...

శర్వి : చెబుతా! (ఇద్దఋూ ఎంతో ప్రేమతో ఒకర్నొకరు చూసుకుంటారు)

వసంత : విసనకఱ్ఱ తీసుకొనిరమ్మని మదనికకు చెప్పేను... ఏవిఁటీ ఇంత ఆలస్యం చేస్తోంది? (కిటికీలోంచి చూసి) ఎవరో మగాడితో మాట్లాడుతోంది.. కళ్ళతోనే తాగేస్తున్నట్లతన్ని చూస్తోంది. దీన్ని దాస్యం నుంచి విడిపించి తీసికొని పోవాలనుకుంటున్న వాడితడేలాగుంది. మదనికను పిలిచి వారి సంతోషాన్ని భగ్నపఱచేను....

మద : శర్విలకా! చెప్పు.. (శర్విలకుడు అటూ ఇటూ చూస్తూ ఉంటాడు) దిక్కులు చూస్తావేంటి?

శర్వి : నీకో రహస్యం చెప్పాలి! ఇక్కడ చెప్పొచ్చా అని!...

మద : ఏం పరవాలేదు చెప్పు!

వసంత : ఏదో రహస్యమంటున్నాడు! అయితే నేను వినటం భావ్యం కాదు...

శర్వి : మదనికా! ధనం చెల్లిస్తే వసంతసేన నిన్ను వదిలేస్తుందంటావా?...

వసంత : నావిషయమే మాట్లాడుకొంటున్నట్లుంది!... ఈకిటికీ దగ్గఱగా దాక్కొని వింటాను...

మద : శర్విలకా! మన విషయం వసంతసేనకి చెప్పి నన్ను విడిచిపెడతావా అని అడిగితే తనకే స్వేచ్ఛ ఉంటే ధనం ప్రసక్తి లేకుండానే అందర్నీ వదిలేస్తానంది... ఆమె తల్లి గారి వల్లే ధనప్రసక్తి.. అవునూ!.. ఇంతకీ నన్ను తీసికొని వెళ్ళటానికి నీకంత ధనం ఎక్కణ్ణుంచి వచ్చింది?...



శర్వి : మదనికా! నా పేదరికం నీకు తెలియనిదేమీ కాదుగా... నీ మీద ప్రేమకొద్దీ రాత్రి ఓ సాహసం చేశాను.

వసంత : ఇతని మొహం చూస్తే ప్రసన్నంగా ఉంది... రాత్రి సాహసం చేశాననటం ఉద్విగ్నతను రేకెత్తిస్తోంది...

మదని : అంటే దొంగతనం చేసుంటావ్... అంతేగా! సాహసమంటే... పాసిపోయేఅన్నంవంటిస్త్రీకోసం విలువైన రెంటినీ పణంగా పెట్టావా?

శర్వి : అవుననుకో... నీకోసం ఆమాత్రం చేయటంలో తప్పేముంది?

మద : దేహం, శీలం... ఈ రెంటినీ నాకోసం ఒడ్డావు... భటులు పట్టుకొంటే శిక్ష, అప్రతిష్ఠ...

శర్వి : అమాయకురాలా! సంపద సమకూడేది సాహసం వల్లనే!

మద : నాకోసం ఇంతటిపని చేయటం...

శర్వి : మదనికా! చూడు.. చేసేది దొంగతనమే అయినా ఎంతో విచక్షణతో చేస్తాను... సర్వాభరణభూషిత అయిన స్త్రీని బాధించి నగలను దోచుకోను, విప్రుని బంగారాన్ని హరించేను, యజ్ఞార్థం తెచ్చుకొన్న సామగ్రిని ముట్టుకోను. దాది ఒళ్ళోవున్న పిల్లల్ని ధనంపై ఆశతో అపహరించేను... కనుక నా శీలానికి భంగం కలిగే అలాంటి పనులేవీ ఆచరించేలేదు తెలుసా? కనుక ఈ నగలు నీకోసమే ప్రత్యేకంగా చేయించినట్లున్నాయి. అయితే నా మీద స్నేహంతో గుట్టుగా ధరించమని మీవసంతసేనకు చెప్పు!...

మద : అదేవిఁటి? ఎవరైనా నలుగురూ చూడాలనేగా నగలు పెట్టుకొనేది... ఇందులో మళ్ళీ గుట్టేవిఁటి? ఇంతకీ అవేవి? ఒక సారి చూస్తాను... (శర్విలకుడనుమానిస్తూ నగలను

మదనికకు ఇస్తాడు) ఇవి నేనిదివఅకు చూచిన నగలుగానే కనిపిస్తున్నాయే... ఇంతకీ ఇవి నీకెక్కడినుంచి వచ్చాయో చెప్పు!...

శర్వి : అవన్నీ ఇప్పుడెందుకులేద్దూ? తీసుకొని చూడు...

మద : నామీద నీకంత నమ్మకంలేకపోతే నాకోసం ఎందుకీపాట్లు?

శర్వి : ఎవరో చారుదత్తుని ఇంట్లో కన్నంవేశారని ఇవాళ ఉదయం వణిగ్వీథిలో నలుగురూ అనుకొంటుంటే విన్నా!

(మదనిక, వసంతసేన స్పృహకోల్పోయినట్లభినయిస్తారు.)

శర్వి : మదనికా! తెప్పఱిల్లు... దాస్యంనుంచి విముక్తినొందే ఈ సంతోషసమయంలో అంత భయం ఎందుకు?

మద : (తెప్పఱిల్లి) నాకోసం ఈ పనిచేసినప్పుడు ఆ ఇంట్లో ఎవరినీ చేంపటంకాని, గాయపఱచేటంకానీ జేరుగలేదుకదా!

శర్వి : మదనికా!.. నిద్రిస్తున్నవాణ్ణీ, భయపడుతున్నవాణ్ణీ ఈ శర్విలకుడు ఎప్పుడూ కొట్టడు, చేంపడు!.. ఆ ఇంట్లో ఎవరికీ ఏ ప్రమాదమూ లేదు.

మద : నిజేంవే?

శర్వి : నిజేం!

వసంత : హమ్మయ్య...ప్రాణాలు లేచి వచ్చాయి!...

మద : ఇదొక్కటే నువ్వు చేసిన మంచి పని!... నాకు ప్రీతి కలిగించేది!..

శర్వి : (ఆవేశంగా) ఓహో!.. చారుదత్తుడు నీకంత ప్రియుడా!...

మద : ఏం మాటలవి?

శర్వి : కాక? వేశ్యాగుణం పోనిచ్చుకున్నావు కావు!

మద : అనవసరంగా ఎందుకా కోపం? ఏవిఁటా అసంబద్ధ ప్రలాపం?



శర్వి : ఇందులో అసంబద్ధం ఏముంది?...

మద : ఇవి వసంతసేన నగలు!...

శర్వి : మరి అక్కడికెలావెళ్ళాయి?...

మద : వసంతసేనే వాటిని ఆయన కిచ్చింది...

శర్వి : ఎందుకు?...

మద : (చెవిలో ఏదో చెప్పి) ఇందుకూ...

శర్వి : అయ్యో! ఎంతపని జేరిగి పోయింది!

వసంత : పాపం తెలియక చేసినదానికి పశ్చాత్తాపపడుతున్నాడు...

శర్వి : మదనికా! అయితే ఇప్పుడేం చేద్దాం?...

మద : ఇటువంటి సందర్భాల్లో ఏం చేయాలో నాకంటే నీకే బాగా తెలుసు!

శర్వి : స్త్రీల తెలివితేటలు, పాండిత్యం సహజమైనవి. పురుషులకు చదువుకుంటే వచ్చేవి!... కనుక ఇటువంటి పరిస్థితిలో కర్తవ్య నిర్ణయం చేయటానికి మీరే తగినవారు!...

మద : నన్నడిగితే ఆ నగలన్నిటినీ తీసుకొనివెళ్ళి ఆ మహాత్మునికిచ్చి రావటమే మంచిదంటాను!

శర్వి : ఆయన నన్ను రాచేభటులకప్పగిస్తే?

మద : ఆయనలాంటివాడుకాడు... చంద్రు డెండకాస్తాడా ఎక్కడైనా?

వసంత : మదనికా! ఎంత బాగా చెప్పావు!

శర్వి : మదనికా! ఈ నగల్ని తిరిగి తీసికొనివెళ్ళి ఆ మహాత్మునికప్పగించేటానికి భయం కానీ, దిగులు కానీ లేవు కాని, ఆ సత్పురుషునిపట్ల ఇంతటి అపచారం చేశానే అనే దుగ్ధ నన్ను పీడిస్తోంది. మొహం చెల్లటం లేదు. పైగా

అపహరించిన సొమ్ము తిరిగి ఇవ్వటమనేది చోరనీతికి విరుద్ధం... ఇంకేదైనా ఉపాయం చెప్పరాదూ...?

వసంత : మదనిక ఇంకో ఉపాయం ఏం చెబుతుందో వినాలి!...

మద : ఆర్య చారుదత్తుల వారు మీకీ నగలను ఇచ్చి రమ్మన్నారని చెప్పి నువ్వే వాటిని వసంతసేనకు ఇవ్వు!...

శర్వి : దాని వల్ల మనకొఱిగేదేముంది?...

మదని : అందువల్ల నువ్వు దొంగవూ కావు, ఆర్య చారుదత్తుడు ఋణవిముక్తుడూ అవుతాడు!...

శర్వి : అది మఱింత సాహసం కదా!...

మద : అదే మంచిది... అలా చేయకపోతేనే అతి సాహసమౌతుంది...

వసంత : చాలా బాగుంది!...

శర్వి : నీ బుద్ధి నిరుపమానం మదనికా!

మద : నువ్వు కాస్సేపీ మదనమందిరంలో ఉండు... ఈలోగా నేను వసంతసేనకు నీరాకను చెబుతాను.

శర్వి : అలాగే!

మద : (వసంతసేనవద్దకు వెళ్ళి) అమ్మా! ఆర్య చారుదత్తుల వారి నుండి ఎవరో ఒక బ్రాహ్మణుడొచ్చాడు!...

వసంత : రమ్మను...

మద : రండి మహాశయా!

శర్వి : (సిగ్గుతో) అమ్మా!... స్వస్తి...

వసంత : నమస్కారం! కూర్చోండి...

శర్వి : వారిల్లు శిథిలమై ఉన్నందువల్ల ఈ పేటికను భద్రపఱచటం కష్టంగా ఉంది, కనుక మీకిచ్చిరమ్మని ఆర్యచారుదత్తుల



ఆదేశం (పేటికను మదనిక చేతిలో ఉంచి బయలుదేరబోతాడు)

వసంత : మఱి నామాట కూడా ఆయనతో చెప్పండి!...

శర్వి : (తనలో) అక్కడికెలావెడతాను? (పైకి) ఏమని చెప్పమంటారమ్మా?

వసంత : మీరు మదనికను స్వీకరించాలి!...

శర్వి : అమ్మా! మీరేమంటున్నారో నాకేం తెలియటం లేదు...

వసంత : నాకు తెలుసు...

శర్వి : ఏవిఁటి?

వసంత : ఎవరీ నగల పేటికను నీకు తెచ్చి ఇస్తారో వారికి మదనికనివ్వమని చెప్పారు... కనుక ఆర్యచారుదత్తులే మీకీమదనికనిస్తున్నారని తెలుసుకోండి...

శర్వి : (తనలో) ఈమెకంతా తెలిసిపోయింది.. (పైకి) ఆర్యచారుదత్తా! సాధు... సాధు!

వసంత : బండివాడెవడక్కడ?...

బండివాడు : అమ్మా!.. బండి సిద్ధంగా ఉంది...

వసంత : మదనికా!... నిన్నీ శర్విలకునికి అప్పగిస్తున్నాను.. బండెక్కు.. నన్ను తనివితీరా ఇప్పుడే చూసుకో... నన్ను మఱచిపోకేం?...

మద : (ఏడుస్తూ) నన్ను వదిలేస్తున్నారా అమ్మా! (కాళ్ళమీద పడుతుంది)

వసంత : ఇప్పుడు నువ్వే నమస్కరించే దగిన దానివి... బ్రాహ్మణ ముత్తైదువైనావు... వెళ్ళు.. బండెక్కు.. అప్పుడప్పుడు నన్ను తలుచుకుంటూ ఉంటావుగా!...

శర్వి : అమ్మా!... మీకు సర్వశుభాలూ కలగాలి.. కృతజ్ఞుణ్ణి.. మదనికా! అమ్మగారిని తనివి తీరా చూసుకో... ఈ మహాతల్లి వల్లే వేశ్యాజనానికి దుర్లభమైన 'ఇల్లాలి' పదం నీకు లభించింది.. గౌరవ కుటుంబినులకు లభించే మేలిముసుగు సంప్రాప్తించింది. (మదనికతో బండెక్కి వెళ్ళబోతుంటే)

(నేపథ్యంలో చాటింపు)

నగరాధ్యక్షుని ఆజ్ఞ!.. ఆర్యకుడనే పేరుకల గొల్లవాడు ఉజ్జయినికి రాజవుతాడనే సిద్ధునిమాటపై నమ్మకంతో మనరాజు పాలకుడతణ్ణి పట్టి బంధించి కారాగారంలో ఉంచారు... అందుచేత పుర ప్రజలంతా అప్రమత్తులై ఉండాలోహో!...

శర్వి : అయ్యో!.. ఎంత ఘోరం! నా ప్రియ మిత్రుడు ఆర్యకుణ్ణి పాలకుడు బంధించాడా? నేనిప్పుడే గృహస్థుణ్ణైనాను!.. లోకంలో అందటికీ భార్య, మిత్రుడు– వీరిద్దఱే ఎంతో ప్రేమ పాత్రులు! అందులోనూ వందమంది వనితల కన్నా మిత్రుడే విశిష్టుడు.. కానీ, బండి దిగుతాను...

మద : (కన్నీటితో) నన్ను అత్తమామల వద్దకుచేర్చి కర్తవ్యం నెరవేర్చండి!

శరి : నా మనసులో ఉందే నువ్వు పైకి అన్నావు. బాగుంది. ఏవంయ్యా!.. నీకు వ్యాపారి రేభిలుని ఇల్లు తెలుసు కదా!

బండి : ఆ! తెలుసునండి!...

శర్వి : ఈమె నక్కడకు చేర్చు!...

బండి : అలాగేనండి!...

మద : మీరు చెప్పినట్లే నేనక్కడికి వెడతాను. మీరు జాగ్రత్త! (నిష్క్రమిస్తుంది)



శర్వి : అప్పుడు బంధితుడైన ఉదయన మహారాజుని యౌగంధరాయణ మంత్రి యుక్తితో విముక్తుణ్ణి చేసినట్లు మిత్రుడైన ఆర్యకుని విడిపించేటానికి బంధువుల్నీ విటుల్నీ, మహావీరుల్నీ, పాలకునిచర్యతో కోపించిన రాజభృత్యుల్నీ రెచ్చగొడతాను.. తనకెక్కడ ముప్పొస్తుందోననే భయంతో నిష్కారణంగా నామిత్రుడు ఆర్యకుణ్ణి బంధించిన పాలకుని చర్య దారుణం. చెఱసాలపై హఠాత్తుగా దండెత్తి ఆర్యకుని రక్షిస్తాను.. (నిష్క్రమిస్తాడు)

చేటి : (ప్రవేశించి) అమ్మా!... వసంతసేనా!... నూతేళ్ళు వర్ధిల్లు... పూజ్య చారుదత్తులవారినుండి ఒక బ్రాహ్మణుడొచ్చా రమ్మా!...

వసంత : ఎంత చక్కని వార్త!.. బంధులునితో ఆ విప్రవరుని గౌరవంగా లోపలికి తీసికొనిరా!...

చేటి : అలాగేనమ్మా!.. (బంధులునితో మైత్రేయుడు ప్రవేశిస్తాడు)

మైత్రేయ : కఠోరతప స్సాచరించిన రావణుడు పుష్పక విమానంలో తిరిగేవాడు. ఆ తపస్సులేని నేను స్త్రీ పురుషులతో కలిసి తిరుగుతున్నాను. మేమిద్దఱం బ్రాహ్మలమే అయినా తేడా ఇది...

చేటి : అయ్యా!.. ఇది మా వసంతసేన గృహసింహద్వారం!... చూడండి..

మైత్రే : ఓహో! ఏం వైభవం! (ఏడు ద్వారాలు గడిచినట్లు ఎనిమిదిసార్లు కొద్దిగా వాద్య సంగీతం) ఈ ప్రాకారాల సౌందర్యాన్ని స్తుతించటానికి తగిన భాషా పాండిత్యం నాకు లేదు. భూతల స్వర్గంలా ఉంది! ఇంతకీ మీ అమ్మగారెక్కడ?

చేటి : అదిగో అక్కడ!

మైత్రే : (వసంతసేన వద్దకు వెళ్ళి) అమ్మా! నీకు శుభపరంపరలు ప్రాప్తించుగాక!

వసంత : ఓ!.. మైత్రేయులవారు... (లేచి) స్వాగతం! కూర్చోండి!

మైత్రే : మీరూ కూర్చోండి! (ఇద్దఱూ కూర్చుంటారు)

వసంత : ఆర్య చారుదత్తులు కుశలులేకదా!

మైత్రే : ఆ!.. క్షేమమేనమ్మా!

వంసత : తమరు వచ్చినపని?

మైత్రే : ఆర్య చారుదత్తులవారు తలపై చేతులుజోడించి మీకొక విన్నపం చేయుమన్నారు.

వసంత : (రెండుచేతులు జోడించి) వారి ఆజ్ఞ ఏమిటి?

మైత్రే : మీరు ఉంచుమని ఇచ్చిన నగలపేటికను మాదే అనుకొని స్వేచ్ఛగా జూదంలో ఓడిపోయాను. ఆ గెలిచిన సభికుడు రాజ వార్తాహరుడు కనుక అతడెక్కడుండేదీ తెలియలేదు!...

చేటి : అమ్మా! నీఅదృష్టం బాగుండటంవల్ల ఆర్య చారుదత్తుల వారు జూదగాడైనారు!

వసంత : (తనలో) దొంగ అపహరించిన దాన్ని ఎంత ఉదారంగా జూదంలో ఓడిపోయానని చెబుతున్నాడు... అందుకే నేనాయనపట్ల బద్ధానురాగనయ్యాను...

మైత్రే : ఆ కారణంగా ఈ రత్నావళిని స్వీకరింపుమని వారి అభ్యర్థన...

వసంత : (తనలో) ఆ నగల పేటికనతనికి చూపించేనా?.. అహ!ఁ.. వద్దు!...

మైత్రే : ఈ రత్నావళిని తీసికోరా ఏవిఁటి?...

వసంత : (నవ్వి, సఖివైపు చూసి) అయ్యో...ఎందుకు తీసికోనూ! (రత్నావళిని అందుకొని, ప్రక్కన పెట్టి) మైత్రేయా! మేమీ



సాయంత్రమే ఆ జూదరిని చూడటానికి వస్తున్నామని చెప్పండి!...

మైత్రే : (తనలో) అక్కడికొచ్చి ఇంకేం తీసుకుంటుందో? అయినా ఇంకేముంది తీసికోవటానికి? (పైకి) అలాగే చెబుతానమ్మా!...

వసంత : ఈ అలంకారాన్ని తీసుకో సఖీ!.. చారుదత్తుని అభిసరించేటానికి మేము బయలుదేరుతున్నాం!...

చేటి : అమ్మా! వసంతసేనమ్మా! అలా చూడు... అకాల మేఘం... గాఢాంధకారం క్రమ్ముకొంటోంది.. కుంభవృష్టి పడేలా ఉంది!...

వసంత : కారుమబ్బులు క్రమ్మి, చిమ్మ చీకట్లు వ్యాపించి, ఎడతెఱిపి లేకుండా కుండపోతగా వర్షం కురిసినా సరే, ప్రియుని అభిసరించేబోయే నన్ను ఇవేవీ అడ్డుకోలేవు! అతనితో సుఖించాలనే ఇచ్ఛ నా హృదయాన్నంతా ఆక్రమిస్తోంది... రత్నహారంతో త్వరగా నావెంట రా...

(అంతా నిష్క్రమిస్తారు)

★★★

## ఐదవఅంకం

(చారుదత్తునిఇల్లు)

చారు : ఆకాశం మేఘావృతమై ఉంది... చీకట్లు క్రమ్ముకొంటున్నాయి... వసంతసేన వద్దకు వెళ్ళిన మైత్రేయుడింకా రాలేదే!

మైత్రే : (ప్రవేశించి తనలో) వేశ్య లోభం, పిసినారితనం ఎంతటివి?... నగల విషయం కాక ఇంకొక మాట కూడా మాట్లాడలేదు!... కనీసం క్షేమమైనా అడగలేదు... మాటా పలుకూ లేక నిర్లక్ష్యంగానే రత్నహారాన్ని తీసికొంది... మంచినీళ్ళైనా అడగలేదు... ఇక దీనిమొహం చూడకూడదు.. చారుదత్తుని ఈమెస్నేహంనుంచి తప్పిస్తాను.. చారుదత్తు డాతోటలో కూర్చున్నాడు... ఆర్య చారుదత్తా... స్వస్తి.

చారు : వయస్యా! రారా... కూర్చో... వెళ్ళిన పనేమైంది?

మైత్రే : అంతా నష్టమైంది!

చారు : ఏం? వసంతసేన రత్నావళిని తీసుకోలేదా?...

మైత్రే : మనకంత అదృష్టం కూడానా?... లక్షణంగా తీసుకుంది!...

చారు : అయితే మణి నష్టమైందంటావేం?

మైత్రే : నష్టంకాక మరేవింటి? తిన్నదికాదు, తాగిందికాదు, దొంగ అపహరించిన అల్పమైన విలువకల నగలపేటికకు చతుస్సముద్రసారభూతమైన రత్నమాల చేజారి పోవటం నష్టం కాక మరేవింటి?

చారు : అదికాదు మిత్రమా! మనమీద ఎంతటి విశ్వాసంతో ఆ నగలపేటికను మనవద్ద విడిచి వెళ్ళిందో, ఆ గొప్ప విశ్వాసానికే మూల్యం మనం సమర్పించిన రత్నావళి!...



మైత్రే : పైగా కొంగడ్డుపెట్టుకొని నన్ను చూసి నవ్వింది... ఎంత అహంకారం? అలక్ష్యం? అవమానం? మిత్రమా!... నీకు సాగిలబడి నమస్కరించి మటీ చెబుతున్నా!... ఈ గణికతో స్నేహానికింక మంగళహారతి పాడుకోవటం మంచిది... గణిక అంటే చెప్పులోని రాయి!...

చారు : నువ్వు ప్రత్యేకంగా చెప్పనక్కఱలేదు... నా పేదరికంతో ఆమెతో స్నేహం ఏం నిలుస్తుంది? ఎంతో వైభవోన్నతునికే లభించే దగ్గది వసంతసేన.. (తనలో) ఈమెకు గుణోన్నతుడే ఇష్టుడు (ఆకాశంవైపు చూసి నిట్టూరుస్తూ (పైకి) నాదంతా గతవైభవం కదా! కనుక నేనామెను ఎప్పుడో విడిచాను!

మైత్రే : (క్రిందికి చూస్తూ తనలో) చారుదత్తుడు ఆకాశం వైపు చూసి నిట్టూరుస్తూ ఈ మాటలంటున్నాడంటే ఆమెపట్ల ఇతనికి ఉత్కంఠ ఏమాత్రం తగ్గలేదనిపిస్తోంది.. (పైకి) మిత్రమా! పైగా ఇవాళ సాయంత్రం ఇక్కడకి వస్తున్నానని నీతో చెప్పమంది కూడా! కనుక రత్నావళితో తృప్తిపడక ఇంకేదో రాబట్టుకోవాలనే దురాశతోనే వస్తోందనుకొంటున్నాను...

చారు : రానీ వయస్యా! సంతృప్తినొంది వెడుతుంది...

కుంభీలకుడు : (ప్రవేశించి) నాపేరు కుంభీలకుడు. నేను వసంతసేన గారి సేవకుణ్ణి... ఏడుకన్నా లున్న పిల్లనగ్రోవిని, ఏడు తీగలున్న వీణను చెవులకింపుగా వాయిస్తాను. గాడిదవలె హాయి కలిగించేలా పాడగలను.. సంగీతంలో నా ముందు నారదతుంబురులేపాటివారు? తన రాకను చారుదత్తునికి చెప్పిరమ్మని వసంతసేన ఆదేశం... ఆc!... చారుదత్తుని ఇంటికి వచ్చాను.. (సందులోనుంచి చూచి) చారుదత్తుడు తోటలో కూర్చున్నాడు... ఆయన ప్రక్కనే ఆ దుష్టవటువు మైత్రేయుడూ ఉన్నాడు. ఈ తోటకు గుమ్మం మూసి

ఉందే!... సరే... ఈ వటువుపై ఒక మట్టిబెడ్డ విసిరి నా రాకను తెలుపుతా!.. (మట్టిబెడ్డ విసురుతాడు)

మైత్రేయ : ఎవడ్రావాడు, నామీద మట్టిబెడ్డలు విసురుతున్నాడు? (అటూ ఇటూ చూసి) అరే! కుంభీలకా! నువ్వా! రా!రా! కూర్చో... ఏదోపనిమీద వచ్చినట్లుంది...

కుంభీ : మైత్రేయా! నిన్నో ప్రశ్న అడుగుతాను... సమాధానం చెప్పగలవా? చెబితే నేనొచ్చిన పనేమిటో తెలుస్తుంది!

మైత్రేయ : సరే అడుగు!

కుంభీ : మామిడిచెట్లు ఏకాలంలో మొగ్గతొడుగుతాయి?

మైత్రేయ : గ్రీష్మర్తువులో...

కుంభీ : (నవ్వుతూ) కాదు... కాదు...

మైత్రే : (తనలో) ఇప్పుడేం చెయ్యాలి?... చారుదత్తుణ్ణి అడుగుతా! (చారుదత్తునివద్దకు వచ్చి) ఒరే!.. ఒకనిముషం ఆగు... (చారుదత్తునితో) ఆర్యా! మామిడిచెట్లు ఏకాలంలో మొగ్గతొడుగుతాయి?...

చారు : మూర్ఖుడా!.. ..వసంతఋతువులో కదా!...

మైత్రే : (కుంభీలకునితో) మూర్ఖ! వసంతఋతువులో...

కుంభీ : అయితే ఇంకో ప్రశ్న!

మైత్రే : కానీ!...

కుంభీ : సంపదలతో ఉన్న గ్రామాన్ని రక్షించేదేవిఁటి?

మైత్రే : రథసమూహం!...

కుంభీ : (నవ్వుతూ) కాదు...

మైత్రే : (తనలో) ఏం చెయ్యను మఱి? మళ్ళీ చారుదత్తుణ్ణే అడగాలి.. (పైకి) ఓ నిముషం!.. చారుదత్తా!.. సంపన్న గ్రామాలకు రక్షణ కలిగించేదేది?



చారు : మిత్రమా! సేన...

మైత్రే : ఒరేయ్! తొత్తుకొడకా! సేన.

కుంభీ : ఇప్పుడీ రెండు మాటల్నీ కలిపి పలుకు!

మైత్రే : సేనా వసంతాలు!...

కుంభీ : తిప్పి చెప్పు!...

మైత్రే : (మఱొకవైపు తిరిగి) సేనా వసంతాలు!...

కుంభీ : తిప్పుమన్నది పదాలనురా!...

మైత్రే : (పాదాలను త్రిప్పి) సేనావసంతాలు!...

కుంభీ : (నవ్వుతాడు)

మైత్రే : ఎందుకు నవ్వుతావు? పదం అంటే పాదం కదా! తిప్పమన్నావు.. తిప్పాను... ఎందుకా నవ్వు?...

కుంభీ : ఒరే మూర్ఖ! పదాల్నంటే అక్షరాల్లో ఉన్న పదాల్ననికాని, నీ కాళ్ళను కాదురా!...

మైత్రే : ఆ మాట ముందే చెప్పొచ్చుగా... ఊఁ!... వసంతసేన...

కుంభీ : ఆఁ! అదీ... వసంతసేనమ్మగారు వచ్చారు!...

మైత్రే : అయితే ఈ వార్త ఆర్యదత్తునికి నివేదించాలి... చారుదత్తా!... మహాసంపన్నులొచ్చారు!...

చారు : అంత మహాసంపన్నులెవరూ మా చుట్టాల్లో లేరే!

మైత్రే : చుట్టాల్లో లేకపోతే గుమ్మంలో ఉన్నారు!.. వసంతసేన వచ్చింది!...

చారు : వయస్యా!... నాతో వేళాకోళమా?...

మైత్రే : అంతగా నమ్మకం లేకపోతే అదుగో ఆ కుంభీలకుని అడుగు... ఒరేయ్! తొత్తుకొడకా! ఇలా రా!...

కుంభీ : ఆర్యా!... వందనాలు!...

చారు : భద్రా!... రా... వసంతసేన నిజంగానే వచ్చిందా?

కుంభీ : అవునండీ... వసంతసేనమ్మగారొచ్చారు!

చారు : ప్రియవార్తనందించిన వారికేదో పారితోషికం ఇవ్వటం నా అలవాటు... ఇదిగో ఈ ఉత్తరీయం తీసుకో... (ఒంటిమీదున్న ఉత్తరీయాన్ని ఇస్తాడు)

కుంభీ : (తీసికొని నమస్కరించి) సంతోషం అయ్యా... ఈ విషయం అమ్మగారికి చెప్పాలి... (నిష్క్రమిస్తాడు)

మైత్రే : ఇంతవానలో ఆమె ఎందుకొచ్చిందో తెలుసా?

చారు : నాకంత స్పష్టంగా తెలియటం లేదు...

మైత్రే : నాకు తెలుసు!...

చారు : ఎందుకంటావ్?...

మైత్రే : మనం ఇచ్చిన రత్నావళికంటే ఆమె నగల విలువెక్కువని చెప్పి ఇంకేదో తీసుకెళ్ళాలని వచ్చిఉంటుంది.

చారు : (తనలో) సంతుష్టినొంది వెడుతుంది..

(ఉజ్జ్వల వేషంతో వసంతసేన, గొడుగుపట్టుకొన్న చేటి, విటుడు ప్రవేశిస్తారు)

విటుడు : (వసంతసేనతో) అమ్మా! మేఘాలు గర్జిస్తున్నాయి... కుండపోతగా వాన కురుస్తోంది...

వసంత : కారుమబ్బులతో కటికి చీకటి క్రమ్మినా, ఉరుములు, మెఱుపుతో కుంభవృష్టి కురిసినా, పిడుగులే పడ్డా ఉత్కంఠతో ప్రియుని అభిసరించే స్త్రీలను ఇవేవీ ఆపలేవు.. పైగా మన్మథేచ్ఛని విజృంభింపజేస్తాయి.. ఓ మేఘుడా!.. ప్రియుని అభిసరించేబోయే నన్ను ఉరుములతో భయపెట్టి వర్షధారలతో అడ్డుకోవటానికి నీకు సిగ్గులేదూ?...



విటుడు : అమ్మా! వచ్చేసేం! ఆ కనిపించేదే చారుదత్తుల వారి ఇల్లు!...

వసంత : (సంతోషంతో) అవును... అదే వారి భవనం... నీవు ముందు వెళ్ళి నా రాకను ఆర్య చారుదత్తునికి తెలిపిరా!...

విటుడు : అలాగేనమ్మా!... అమ్మా! వసంతసేనా!.. సకలకళాభిజ్ఞ అయిన నీకు నేను చెప్పవలసిందేమీ లేదనుకో... అయినా చిరకాలవాత్సల్యం నన్ను వాగిస్తోంది... చారుదత్తునిపై ఎక్కువగా కోపగించేకు సుమా! కోపిస్తే సమాగమానికి అంతరాయం కదా! అలా అని అసలు కోపం లేకపోయినా కోర్కె కలుగదు... నువ్వు కోపించి ఆయనక్కూడా కోపం కలుగజెయ్యి... ఆపైని ప్రసన్నురాలివికా.. ఆయన్నీ ప్రసన్నుణ్ణి చెయ్యి. అలకలు తీరిన కలయికలో అందం అంతా ఇంతానా?...

వసంత : (నవ్వుతుంది)

విటు : అయ్యా!.. చారుదత్తులవారూ, వసంతసేన మహా ప్రణయంతో ఇంత వర్షాన్ని లెక్కచేయక మీ గుమ్మం ముందాగి కాళ్ళు కడుక్కుంటోంది...

చారు : వయస్యా...! ఏమిటిది?...

మైత్రే : (వసంతసేన వద్దకు వచ్చి) మాన్య వసంతసేనకు శుభమగుగాక! స్వాగతం!

వసంత : మైత్రేయులకు నమస్కారం! ఈ స్వాగతం ఆర్య చారుదత్తుల దేనా?.. (విటుని వంకచూసి) ఈ చేటి ఇక నీకే గొడుగు పడుతుంది...

విటు : (తనలో) ఎంత నేర్పుగా నన్ను తప్పిస్తోంది.. (పైకి) అలాగేనమ్మా!...

వసంత : ఆర్యమైత్రేయా!... మీ జూదరెక్కడ?

మైత్రేయ : (తనలో) ఓహో!.. మిత్రుని 'జూదరి' అని ఎంతగౌరవంగా ప్రశంసించింది!.. (పైకి) ఇదిగో ఈ శుష్కవాటికలో ఉన్నారు. (చేత్తో చూపిస్తాడు) (వసంతసేన చిఱునవ్వు నవ్వుతుంది) రండమ్మా!

వసంత : (వచ్చి పూవుతో చారుదత్తుని కొట్టి) జూదరీ!.. కుశలమా?

చారు : (సంతోషంతో) ఓ!.. వసంతసేన వచ్చేసిందే! (పైకి) నీ సాన్నిధ్యంలో నాకు కుశలానికేం కొఱత? స్వాగతం వసంతసేనా!.. ఈ సాయంత్రం నీరాక మహానందాన్ని కలుగజేస్తోంది... వచ్చి కూర్చో... (వసంతసేన కూర్చున్న తరువాత అంతా కూర్చుంటారు)

చారు : వయస్యా మైత్రేయా!... వర్షోదకంతో ఈమె వస్త్రాలు తడిసిపోయాయి!.. లోపలికివెళ్ళి ఈమెకోసం పొడి వస్త్రాలు తీసుకురా...

మైత్రేయ : అలాగే.. (వెళ్ళబోతాడు)

చేటి : మైత్రేయా! మీరాగండి!.. (వసంతసేనకు వేఱే చీరె ఇస్తుంది)

మైత్రేయ : (చారుదత్తునితో) మిత్రమా! ఈమెను నేనేమైనా అడుగవచ్చా?...

చారు : అడుగు!...

మైత్రేయ : ఇంతటివానలో తమరెందుకు వచ్చారో తెలిసికోవచ్చా?

చేటి : ఈ బ్రాహ్మడెంత అమాయకుడమ్మా!...

వసంత : అమాయకుడంటావేం? నిపుణుడను!...

చేటి : వసంతసేనమ్మగారు మీరు పంపిన రత్నావళి వెల ఎంతని అడగటానికి వచ్చారు!

మైత్రేయ : మిత్రమా!.. నేను చెప్పలా?... తన నగలపేటికకంటే ఈరత్నావళి వెల తక్కువ అనీ, అందుకని ఇంకో



వస్తువేదైనా ఇమ్మని అడగటానికి వచ్చి ఉంటుందని నేను చెప్పానా? లేదా?

చేటి : ఆ రత్నహారం తనదేననుకొని జూదంలో ఒడ్డి వసంతసేనమ్మగారు ఓడిపోయారు.. ఆ గెలుచుకున్న సభికుడేమో రాజవార్తాహరుడు. ఎక్కడి కెళ్ళాడో అతని జాడ తెలియటం లేదు...

మైత్రే : అమ్మా! నేను చెప్పినట్లే మీరూ చెబుతున్నారు!...

చేటి : ఆ జూదగాడు దొరికేంతవఱకు ఆ రత్నహారానికి బదులు ఈ నగలపేటికను మీవద్ద ఉంచండి...

(మైత్రేయుడేదో ఆలోచిస్తూ ఉంటాడు)

మైత్రేయులేదో దీర్ఘాలోచనలో పడ్డారు!.. ఏం? ... దీన్నెప్పుడైనా చూశారా?

మైత్రే : ఈ పేటిక శిల్పచాతుర్యం నా కళ్ళని కట్టిపడేస్తోంది... అందుకే తదేకంగా చూస్తున్నా!...

చేటి : మైత్రేయులవారూ! మీకళ్ళు మిమ్మల్ని వంచిస్తున్నాయి... ఆ నగలపేటికే ఇది...

మైత్రే : (పట్టరాని సంతోషంతో) మిత్రమా!.. చారుదత్తా..! మనింట్లో దొంగ అపహరించిన బంగారునగలపేటికే ఇది!...

చారు : వయస్యా! వారి వస్తువుకు బదులివ్వటానికి మనం ఏ వంక చెప్పామో వీరూ అదే చెబుతున్నారు. అయితే ఇది నిజేమా? కాదా? అని..

మైత్రే : ఇది నిజంగా ఆ పేటికే!.. ఒట్టు...

చారు : ఇది నిజంగా మాకెంత సంతోషకరమైన విషయం?

మైత్రే : (చారుదత్తునితో) మిత్రమా? ఈ పేటిక వారికి ఎలా వచ్చిందో అడగమంటావా?

చారు : తప్పేముంది?.. అడుగు! (మైత్రేయుడు చేటి చెవిలో ఏదో అడుగుతాడు.. చేటి మైత్రేయుని చెవిలో ఏదో చెబుతుంది) ఏవిటా రహస్యాలు? మేం పరాయివాళ్ళమా?

మైత్రే : (చారుదత్తుని చెవిలో ఏదో చెప్పి) ఇదీ జరిగింది...

చారు : అమ్మ! ఈనగలపేటిక నిజంగా అదేనా?

చేటి : నిజం!...

చారు : నాకు చెప్పిన సంతోషకరమైన విషయం ఎప్పుడూ నిష్ఫలం కాలేదు. పారితోషికంగా ఈ ఉంగరం తీసికో... (చేతి వ్రేలివంక చూసి సిగ్గుపడతాడు)

వసంత : ఈ మహౌదార్యగుణమే నన్నితణ్ణి వలపింపజేసింది!...

చారు : సంతోషాన్ని వ్యక్తం చేసేందుకు కూడా నా దరిద్రం అడ్డు వస్తోంది!...

మైత్రే : విచారించేకు మిత్రమా!... చేటీ!... మీ నగలపేటిక మీకు అందింది కనుక దానికి చుట్టిన నాఅంగవస్త్రం నాకిచ్చేయండి!...

వసంత : ఆర్య చారుదత్తా! ఈ రత్నావళినిచ్చి మమ్మల్ని అవమానించటం ఏవైనా బాగుందా?

చారు : చూడు వసంతసేనా! జరిగిన సంగతి చెబితే ఎవరు నమ్ముతారు?...ప్రతివాడూ నన్నే నిందిస్తాడు. దరిద్రం అనుమానానికి ఆస్కారం కదా! అందువల్ల అబద్ధమాడి రత్నావళిని పంపానేకాని, వేతే ఉద్దేశ్యంతో కాదు... ఏమీ అనుకోకేం?...(ప్రేమగా) చిన్నబుచ్చుకోకూ!

మైత్రే : చేటీ! మీరీ రాత్రి ఇక్కడే పడుకుంటారా?

చేటి : (నవ్వి) మీ మాటల్లో అమాయికత్వం ప్రతిఫలిస్తోంది!



మైత్రేయ : మిత్రమా!... చారుదత్తా!... ఏదో కాస్త తెఱిపిచ్చింది కదా అనుకొంటుంటే హాయిగా కూర్చున్నవాళ్ళని లేపేస్తూ జేడివాన మళ్ళీ మొదలైంది...

చారు : ప్రియా!... చూడు!... ఆ విద్యుల్లత తనంతతానుగా వచ్చి ఆకాశాన్నెలా ఆలింగనం చేసుకుంటోందో!

(వసంతసేన శృంగారభావాన్నభినయిస్తూ చారుదత్తుని కౌగిలించుకొంటుంది. చారుదత్తుడు స్పర్శసుఖాన్నభినయిస్తూ వసంతసేనను కౌగిలించుకొని) ఓ మేఘుడా! ఇంకా గర్జించు.. నీ అనుగ్రహంతోనే నాకు వసంతసేన కౌగిలిలో అపూర్వసౌఖ్యం కలుగుతోంది...

మైత్రేయ : ఈ దిక్కుమాలిన వాన ఇప్పట్లో ఆగేలా లేదు..

చారు : మైత్రేయా..! వర్షాన్ని తిట్టకు... ఎడతెఱిపి లేకుండా ఈ వర్షం ఇలాగే ఇంకో వందేళ్ళు కురవాలి... ఈ మెఱుపుతీగల కాంతుల్లో వసంతసేన ముఖసౌందర్యం నన్ను తన్మయుణ్ణి చేయాలి... వర్షధారల్లో తనంత తానుగా వలచి వచ్చిన వనితల తడి కౌగిలింత పొందిన పురుషుల జీవితాలే ధన్యమైనవి.. ప్రేయసీ! వసంతసేనా!... ఈ తోటలోని గృహం శిథిలావస్థకు వచ్చింది.. గోడలు నానిపోయాయి. గోడలమీద చిత్రించిన చిత్రాలు కూడా పెచ్చులూడిపోయాయి! ఏక్షణంలోనైనా కూలిపోవటానికి సిద్ధంగా ఉందీ ఇల్లు... ఇక్కడెంతోసేపు ఉండటం క్షేమం కాదు. ఓహో అటుచూడు.. ఇంద్రధనుస్సు... ఎంత మనోహరంగా ఉంది! రా!.. లోపలికి వెడదాం!

★★★

## ఆఱవఅంకం

(చారుదత్తునిఇల్లు)

చేటి : (తనలో) ఏమిటీ? వసంతసేనమ్మగారింకా నిద్ర లేవలేదు.. వెళ్ళి లేపుతాను.. వసంతసేన దుప్పటి కప్పుకొని నిద్రిస్తూ ఉంటుంది) అమ్మా! తెల్లవాతింది... లేవండమ్మా!...

వసంత : (బద్ధకంగా) రాత్రి గడవకుండానే తెల్లారిందా?...

చేటి : మాకేమో ప్రొద్దున్న.. అమ్మగారికేమో ఇంకా రాత్రే!...

వసంత : చేటీ! ఇంతకీ మీ జూదరి ఎక్కడే?...

చేటి : వర్ధమానకునికి ఏదో ఆదేశించి పుష్పకరండకమనే జీర్ణోద్యానానికి వెళ్ళారమ్మా!

వసంత : ఏమని ఆదేశించారు?...

చేటి : వసంతసేన వెళ్ళటానికి రాత్రికి బండి కట్టమన్నారు...

వసంత : నేనెక్కడికి వెళ్ళాలి?...

చేటి : చారుదత్తులున్న చోటికి!...

వసంత : (చేటిని కౌగిలించుకొని) రాత్రి చీకట్లో చారుదత్తుని ఇల్లు సరిగా చూళ్ళేదు... ఇప్పుడు చూస్తాను... చారుదత్తుని ఆభ్యంతరమందిరంలో ఇప్పటికే ప్రవేశించానా?...

చేటి : ఒక్క అభ్యంతరమందిరంలోకే కాదు.. వారి సమస్త పరివారం హృదయాల్లోనూ ప్రవేశించారు...

వసంత : చారుదత్తుని భార్య ధూతాదేవి బాధపడుతోందా?...

చేటి : ఇక పడుతుంది...

వసంత : ఎప్పుడు?

చేటి : మీరిక్కడి నుంచి వెళ్ళిపోయినప్పుడు!...

వసంత : అయితే ముందుగా నేనే ఆవిడ మంచితనానికి బాధపడాలి... చూడు– ఈ రత్నావళిని తీసికెళ్ళి నా



అక్కగారు ధూతాదేవికివ్వు... నేను ఆమెవలెనే చారుదత్తుని గుణసంపదకు లొంగిపోయిన దాసినని, కనుక రత్నావళి ఆమె ధరిస్తేనే బాగుంటుందని చెప్పానని చెప్పు!...

చేటి : ఆర్య చారుదత్తులకు కోపం వస్తుందేమో?...

వసంత : కోపగించేరులే... వెళ్ళు!

చేటి : అలాగేనమ్మా! (హారం తీసికొని తిరిగివచ్చి) అమ్మా! తన భర్త చారుదత్తుడు మీకిచ్చిన హారాన్ని నేను మళ్ళీ స్వీకరించేటం తగదు; ఆర్యపుత్రుడే నాకు విశేషమైన అలంకారమని మీతో చెప్పమన్నారమ్మా!...

(ఒక బాలునితో రదనిక ప్రవేశం)

రదనిక : బాబూ!.. రా!... ఈ బండిబొమ్మతో ఆడుకుందాం రా!...

రోహసేను : ఈ మట్టిబొమ్మ నాకెందుకు? ఆ బంగారు బండే తీసుకురా!

రద : (బాధతో నిట్టూర్చి) మనకిప్పుడు బంగారం ఎక్కడిది బాబూ!.. మీ నాన్నగారికి మళ్ళీ డబ్బులొస్తాయి... అప్పుడు బంగారు బండితో ఆడుకుందువుకాని... వసంతసేన వద్దకు తీసుకెడతాను.. అమ్మా! నమస్కారం!...

వసంత : రదనికా! రా! ఎవరీ పిల్లవాడు? ఆభరణాలేమీ లేకపోయినా చంద్రబింబం లాంటి మొహంతో ఎంత ముద్దొస్తున్నాడో!...

రద : చారుదత్తుల వారబ్బాయి, రోహసేనుడమ్మా!...

వసంత : రా! నాన్నా!...రా!.. అంతా తండ్రి పోలిక... నన్ను కౌగిలించుకో!... ఒక్క ముద్దియ్యి!...

రదనికా! దేనికోసం ఈ పిల్లాడు పేచీ పెడుతున్నాడు?

రద : పొరుగింటి పిల్లాడు బంగారపు బండితో ఆడుకోవటం చూచి, నేను మట్టిబండి చేసిస్తే ఈ మట్టిబండి నాకొద్దు, బంగారపు బండే కావాలంటున్నాడు.

వసంత : ఇతరులకంటె వందరెట్ల సంపదతో తులతూగవలసిన చారుదత్తుని పుత్రుని కెంతటి అవస్థ? నాయనా! ఊరుకో... బంగారపుబండితోనే ఆడుకొందువుగానిలే....

రోహ : రదనికా!... ఈమె ఎవరు?

రద : ఈమె నీకు అమ్మవుతుంది.

రోహ : రదనికా! అబద్ధాలాడకు.. ఈవిడ నాకమ్మైతే ఈ బంగారు నగలెందుకుంటాయి?

వసంత : అమాయకంగా జాలి గొలుపుతూ ఎలా మాట్లాడుతున్నాడో! (నగలను తీసివేసినట్లభినయించి, ఏడుస్తూ) ఇప్పుడు నీకు అమ్మనైనానా? ఈ నగలను తీసికొని బంగారపుబండి చేయించుకో...

రోహ : నేను తీసికోనుపో.. నువ్వేడుస్తున్నావ్!...

వసంత : (కన్నీళ్ళు తుడుచుకొని) లేదమ్మా ఏడవన్లే.. వెళ్ళి ఆడుకో (ఆ మట్టి బండిని బంగారు నగలతో నింపి) బంగారు బండిని చేయించుకో నాన్నా!...

(రోహసేనుని తీసికొని రదనిక నిష్క్రమిస్తుంది)

వర్ధమాన : రదనికా! తెరలేర్పాటు చేసిన బండి పెరటిగుమ్మంలో సిద్ధంగా ఉందని వసంతసేనమ్మగారికి చెప్పు!...

రద : పెరటిగుమ్మంలో బండి సిద్ధంగా ఉందని వర్ధమానకుడు మనవిచేస్తున్నాడమ్మా!

వసంత : అలంకరించుకొంటున్నాను.. అంతవఱకు కాస్త ఆగమని చెప్పమ్మా!...

వర్ధ : అయ్యో! బండిలో పఱచే తివాచీ మఱచి పోయి వచ్చాను... వెళ్ళి తీసుకొస్తాను.. ఈ గిత్తలు పొగరుబోతువి.. నేనొచ్చేలోగా ఈ బండి నెక్కడికైనా లాక్కొనిపోతాయి. బండితో వెళ్ళొస్తేనే మంచిది... (నిష్క్రమిస్తాడు)

(శకారుని బండివాడు స్థావరకుడు ప్రవేశించి)



స్థావర : (తనలో) రాజుగారి బావమఱది సంస్థానకుడు నన్ను బండితీసుకొని పుష్పకరండకమనే జీర్ణోద్యానానికి తొందరగా రమ్మని ఆజ్ఞాపించాడు. (పైకి) ఛో!..ఛో!.. హెహె! ఎహెహె! ఇవాళ ఉజ్జయినీ నగరంలో ఇన్ని బళు ళ్ళన్నాయేవిఁటి? ఒరేయ్!తొలగండి! తొలగండి! బళ్ళని తప్పించేండి! (తనలో) వీడెవడో జూదంలో నుంచి పారిపోయి వచ్చినవాడు సభికుని చూచినట్లు నన్నుచూసి మొహం చాటు చేసికొని పోతున్నాడు! ఎవడై ఉంటాడు?..ఆఁ!.. కారాగారంలోంచి తప్పించుకు పారిపోతున్న ఆర్యకుడు... అయినా వీడితో నాకేం పని? ఒరేయ్! ఏవఁంటున్నావురా? బండి చక్రానికి త్రోవ ఇమ్మనా? నేన్నీకెలా కనిపిస్తున్నానురా? రాజుగారి బావమఱది సంస్థానకుల వారికి సంబంధించిన వాణ్ణి...(తనలో) పోన్లే.. వీడి బండిక్కొంచెం సాయంచేస్తే బళ్ళు తొందరగా వెళ్ళటానికి త్రోవ దొరుకుతుంది. అంతవరకు నాబండిని ఆర్యచారుదత్తుని పెరటిగుమ్మంలో ఉంచుతాను. (పైకి) ఏవఁయ్యా! నీబండి కదలటానికి సాయం కావాలా?

చేటి : అమ్మా!... వసంతసేనా! బండి చక్రాల చప్పుడు వినిపిస్తోంది... కనుక బండి వచ్చి ఉంటుందమ్మా!..

వసంత : నడు... నాకు త్రోవచూపు... పెరటి గుమ్మం చూపు...

చేటి : అమ్మా.. ఇటు... ఇటు...

వసంత : చేటీ! ఇంక నువ్వుండు...

చేటి : అలాగేనమ్మా!...

వసంత : (తనలో) ఏవిఁటి కుడికన్నదురుతోంది? (స్థావరకుని బండెక్కి) కానీ, సత్పురుషుడు చారుదత్తుని దర్శనంతో ఈ అపశకునం తొలగిపోతుంది!...

స్థావర : (తనలో) బండ్లన్నిటినీ పద్ధతిలో పెట్టి మార్గం సరిచేశాను. ఇకనేను నా బండిని తీసికొని తొందరగా వెళ్ళాలి!... బండి చేప్పుళ్ళు పెరిగి క్రమేపీ తగ్గుతాయి)

(నేపథ్యంలో) పట్టుకోండి.. పట్టుకోండి!...ఆర్యకుడు కారాగారం బద్దలుకొట్టి, కాపలావాణ్ణి చేంపి, సంకెళ్ళను తెంపుకొని తప్పించుకొని పారిపోతున్నాడు! పట్టుకోండి... (ఆర్యకుడు తెర తొలగించుకొని, హఠాత్తుగా ఒక కాలికి ఉన్న సంకెలతో ముసుగు వేసికొని స్థావరకుని బండి చాటుగా అటునుంచి ఇటు వెళ్ళిపోతాడు)

స్థావర : (తనలో) ఓహో! ఉజ్జయినీ నగరమంతా అల్లకల్లోలంగా ఉంది... కనుక నేను తొందరగా వెళ్ళాలి...

ఆర్యకుడు : (ప్రవేశించి–తనలో) నేను రాజౌతానని ఒక సిద్ధుడు చెప్పిన జోస్యంతో భయపడి పాలకుడు నన్ను బంధించాడు... మిత్రుడు శర్విలకుని సాయంతో కారాగారం నుంచి బయటపడి పాఱిపోయి వచ్చాను. నా అదృష్టం అలా ఉంటే అది నా తప్పా? బ్రహ్మ నుదుట వ్రాసిన వ్రాత తప్పించేటం ఎవరి వశం? రాజు నెదిరించేటం నావంటి బలహీనునివల్లేమౌతుంది? దురదృష్టవంతుణ్ణి. ఇప్పుడెక్కడికెళ్ళాలి? ఇదిగో... ఇక్కడ ఏ సత్పురుషుని పెరటి గుమ్మమో తెఱిచి ఉంది... కొంతసేపిక్కడ తలదాచుకొంటాను...

– నేపథ్యంలో –

వర్ధమాన : హెయ్!.. హెహెయ్!.. ఛో.. ఛో! నడవండి.. నడవండి!

ఆర్య : ఎడ్లబండిటే వస్తోంది... తెరలు కట్టి ఉండటంవల్ల గొప్పింటి స్త్రీలు ప్రయాణించే బండిలా కనిపిస్తోంది. భగవంతుడు నా



కోసమే ఈ బండిని పంపించినట్లుంది. ముందూ వెనుకా ఎవరూ లేరు కూడా!...

వర్ధ : (తనలో) హమ్మయ్య! ఎలాగో బండిలో పఱచే తివాచీ పఱచి తీసుకొచ్చాను. రదనికా!.. వసంతసేనమ్మగారితో చెప్పు బండి సిద్ధంగా ఉందని!...

ఆర్యకుడు : (తనలో) ఇది వెలయాలి కోసం వచ్చిన బండిలా ఉంది... ఊరి వెలుపలికి వెడుతున్నట్లుంది... సరేకానీ, ఈ బండెక్కటం కంటె ఇప్పుడు గత్యంతరంలేదు... ఆపైన భగవంతుడే ఉన్నాడు...

వర్ధ : (కాలిగొలుసుల చేప్పుడు విని, తనలో) నూపుర శబ్దం వినిపిస్తోంది. అమ్మగారు వచ్చినట్లుంది.. (పైకి) అమ్మా!.. ఈ గిత్తలు పొగరుబోతువి. కనుక మీరు వెనుకనుంచే ఎక్కండి! (ఆర్యకుడు వెనుకనుండి బండెక్కుతాడు తనలో) అందెల చేప్పుడు అణిగిపోయింది... బండీ బరువెక్కింది... కనుక వసంతసేనమ్మగారు బండెక్కి ఉంటారు! (పైకి) హెహెయ్! ఛో!..ఛో!... నడవండెహెయ్!

(చందనక, వీరకుల ప్రవేశం)

చందనకుడు : ఒరేయ్!.. వీరకా!.. ఆర్యకుడు పాఱిపోవటంతో నగరంలో బండ్లనన్నిటినీ వెదకమని రాజాజ్ఞ కదా!.. అదిగో తెరలు కట్టిన ఆ బండేదో పోతోంది చూడు!...

వీరకుడు : చందనకా! రాజాజ్ఞను అమలుచేసి ద్రోహిని పట్టుకోవటం మనవిధి! ఒరేయ్! బండాపు... ఎవరిదీబండి? ఎవడున్నాడీ బండిలో? ఎక్కడికి పోతోందీబండి?

వర్ధ : అయ్యా! ఈ బండి చారుదత్తులవారిది. ఇందులో ఉంది వసంతసేనమ్మగారు.. పుష్పకరండకమనే జీర్ణోద్యానంలో విహరించేటానికి చారుదత్తుల వారి వద్దకు వెడుతోంది.

చందన : అయితే పోనీ!...

వీరక : ఏవిఁటి? చూడకుండానే?

చందన : అవును!

వీరక : ఏవిఁటా నమ్మకం?

చందన : ఆర్య చారుదత్తులపై నమ్మకం!

వీరక : ఆర్య చారుదత్తుడెవరు? వసంతసేన ఎవరు? చూడకుండా బండెలా వెడుతుంది?

చందన : ఆర్య చారుదత్తులు తెలియదా? వసంతసేన నెఱుగవా?... ఈ ఉజ్జయినిలో మాన్య అయిన వసంతసేన, ధర్మానికి నిధి అయిన చారుదత్తుడు–వీరిద్దరే పూజ్యులు...

వీరక : వాళ్ళిద్దఱూ నాకు తెలుసు.. కానీ కర్తవ్యనిర్వహణలో కన్నతండ్రి కూడా నాకు కొత్తవాడే!

చందన : అయితే చూడు!...

వీరక : నువ్వేచూడు!...

చందన : నేనుచూస్తే నువ్వు చూచినట్లెలా అవుతుంది?...

వీరక : నువ్వు చూస్తే స్వయంగా రాజుగారు చూసినట్లే!...

చందన : ఒరేయ్ బండీ! బండిమీద కప్పును తప్పించు... చూస్తాను!...

ఆర్యక : (తనలో) ఈ రక్షకభటులిప్పుడు నన్ను చూస్తారా? ఎంతటి దురదృష్టం? చేతిలో ఆయుధం కూడా లేదు... నా బాహుబలాన్నే ఉపయోగించాలి. కారాగారంలో చేచ్చేకంటే కదనంలో చావటం మేలుకదా! అయినా సాహసానికిది అదను కాదు!(చందనకుడు బండెక్కినట్లభినయించి చూస్తాడు)

ఆర్యక : శరణు శరణు...



చందన : శరణాగతునికి అభయమిస్తున్నాను. (తనలో) ఆఁ!.. ఆర్యకుడు!.. ఇతడు నిరపరాధి, చారుదత్తుని బండెక్కిన వాడు, నా ప్రాణప్రదుడైన శర్విలకుని మిత్రుడు, తీరా అభయం కూడా ఇచ్చాను. ఇంకోవైపు రాజాజ్ఞ! కిం కర్తవ్యం?... ఏవైఁతే అవుతుంది..ఇతణ్ణెలాగైనా రక్షించాలి... (భయంగా బండిదిగి) అత... అదే.... ఆఁ! ఆఁ! ఆమెను చూశాను.. ఆర్యచారుదత్తుని అభిసరించేబోయే నన్నిలా నడివీధిలో నిలిపి ప్రశ్నించేటం మీవంటివారికి తగదం టోంది వసంతసేన.

వీరక : నిన్ను చూస్తుంటే నాకనుమానంగా ఉంది!

చందన : నీకనుమానమా?

వీరక : అవును.. కంగారులో నీగొంతు మాఱింది... అతణ్ణనబోయి ఆమెనన్నావు... అందుకే నీ మాటలపై నాకనుమానం! అందుకని నేనూ బండెక్కి లోపల ఎవరున్నారో చూస్తాను!.. ఎందుకంటే ఇది రాజాజ్ఞ, నేను రాజుగారికి విశ్వాసపాత్రుణ్ణి.

చందన : అంటే – నేనుకాదనా?

వీరక : అవునో కాదో నీకే తెలియాలి! నేను బండిలో ఎవరుందీ చూడాల్సిందే..

చందన : నేను చూసిన తర్వాత మళ్ళీ చూస్తావా? ఎవడ్రా వీడు?

వీరక : నువ్వెవడివిరా?

చందన : ఏది? చూడు, చూస్తాను!

వీరక : బండి ఇటుతిప్పరా! నేను చూడాలి... (వీరకుడు బండిలో చూడటానికి ప్రయత్నిస్తుంటే చందనకుడు వాడి జుట్టుపట్టుకొని లాగి క్రిందపడేసి కాలితో తంతాడు

వీరకుడు కోపంతో లేచి) కర్తవ్యపాలన చేస్తున్న నన్ను జుట్టుపట్టుకొని లాగి తంతావా?... చూడు! రేపు నిన్ను న్యాయస్థానానికి లాగి నీకు శిక్షపడేలా చేయకపోతే నాపేరు వీరకుడే కాదు!

చందన : న్యాయస్థానానికి కాకపోతే రాజాస్థానానికే పోరా కుక్కా!...

వీరక : అలాగే, చూద్దువు గాని!...

చందన : ఏయ్! బండీ.. వెళ్ళు... అమ్మా! వసంతసేనా! .. తోవలో ఎవరైనా ఆపి ప్రశ్నిస్తే ఈ బండి చందనవీరకులు చూశారనిచెప్పు.. ఇదిగో గుర్తుగా ఈ ఖడ్గాన్ని చూపించు!...

ఆర్య : (ఖడ్గాన్నందుకొని, తనలో) ఆహా! ఆయుధంకూడా లభించింది. కుడి భుజం అదురుతోంది. ఇంకే ఇబ్బందీలేదు!...

చందన : వసంతసేనా!.. ఈ చందనకుని గుర్తుంచుకో! నేను ప్రతిఫలాన్నపేక్షించి ఏమీ చేయలేదు సుమా! కేవలం స్నేహానికి లోబడే చేశాను.

ఆర్యక : (తనలో) సిద్ధాదేశం సత్యమైతే చందనకుని తప్పక గుర్తుంచుకొంటాను!

★★★



# ఏడవఅంకం

(జీర్ణోద్యానం)

చారు : వయస్యా!... వర్ధమానకుడింకా రాలేదే!...

మైత్రేయ : వసంతసేనను తీసికొని త్వరగా రమ్మనికూడా చెప్పాను...

చారు : మఱెందు కాలస్యం చేస్తున్నట్టు?...

వర్ధమాన : ఛో!.. ఎహెహే!...

ఆర్య : (తనలో) ఉజ్జయిని నగరం నుంచి చాలాదూరమే వచ్చాను.. కనుక బండిదిగి చెట్ల చాటుకు వెడితే!.. కాదు.. ఈ బండి చారుదత్తునివద్దకు వెడుతోంది. కనుక శరణాగతవత్సలుడని వింటున్న చారుదత్తుని దర్శించి వెళ్ళటమే మేలనిపిస్తోంది.

వర్ధ : ఉద్యానవనం చేరేను... ఆర్యమైత్రేయా!

మైత్రేయ : మిత్రమా! చారుదత్తా! అదిగో వర్ధమానకుని పిలుపు... వసంతసేనతో వచ్చి ఉంటాడు...

చారు : అంతకంటే సంతోషించేదగిందేముంటుంది?...

మైత్రేయ : తొత్తుకొడుకా! ఏవిఁటింత ఆలస్యం?

వర్ధ : కోపించేకయ్యా! బండిలో తివాచీ పఱచేటం మర్చిపోయి నందువల్ల వెనక్కి వెళ్ళి తీసుకొచ్చేటప్పటికి ఆలస్యమైంది.

చారు : వయస్యా!. వసంతసేనను బండినుంచి దింపు!

మైత్రే : నేను దింపటవేఁం? తాను దిగలేదూ? ఆమె కాళ్ళకేవైఁనా సంకెళ్ళున్నాయా?

(లోనికి చూసి) మిత్రమా! వచ్చింది వసంతసేనకాదు, వసంతసేనుడు...

చారు : చాల్లే పరిహాసాలు! ప్రణయం ఆలస్యాన్ని సహించేలేదు. నేనే దింపుతాలే!

ఆర్యక : ఓహో ఈయనే చారుదత్తుడు! చెవికే కాక చూపులకీ అందమైనవాడు!

చారు : (బండెక్కి ఆర్యకునిచూచి) అరె! ఎవరీయన? ఎంతో బలిష్ఠుడైన ఈయన ఒక కాలికి ఈ సంకెలలేవిఁటీ? మొహంలోనే మహానుభావలక్షణాలు కనిపిస్తున్న ఇతనికీ స్థితేవిఁటి? అయ్యా! తమరెవరు?

ఆర్యక : శరణాగతుణ్ణి... యాదవవంశోద్భవుణ్ణైన ఆర్యకుణ్ణి..

చారు : ఏవిఁటీ! గొల్లపల్లెనుంచి తెచ్చి పాలకుడు బంధించిన ఆర్యకుడవే?

ఆర్య : అవును!

చారు : నిన్ను దైవం తెచ్చి నా కళ్ళముందుంచాడు. ప్రాణాలైనా వదులుతా కానీ, శరణాగతుణ్ణి వీడను.. వర్ధమానకా! ఈయన కాలి సంకెలను ఛేదించు!

వర్ధ : అలాగే... సంకెల తొలగిపోయింది.

ఆర్య : స్నేహపూరితమైన మఱో దృఢమైన సంకెల తగిలింది.

మైత్రే : ఈ సంకెల నీకు మిత్రమా! ఇక మేం వెళ్ళొస్తాం!

ఆర్య : మిత్రమా!... చారుదత్తా! నీ అనుమతిలేకుండా నీ బండినెక్కివచ్చినందుకు క్షంతవ్యుణ్ణి!

చారు : నీకు నీవుగా అందించిన ఈ స్నేహం నాకో సత్కారం!

ఆర్య : అనుమతిస్తే వెళ్ళొస్తాను!

చారు : వెళ్ళిరా!

ఆర్య : బండి దిగుతాను...

చారు : మిత్రమా! బండి దిగొద్దు.. సంకెల తీసివేయటం వల్లన వెంటనే వేగంగా నడవలేవు.. చూసేవారు తెరలున్న ఈ బండిలో ఎవరో స్త్రీలున్నారనుకుంటారు. నీకూ రక్షణ.. కనుక బండిలోనే వెళ్ళిరా...



ఆర్య : అలాగే!...

చారు : క్షేమంగా బంధుజనాన్ని కలు!...

ఆర్య : నిన్ను మించిన ఆపద్బాంధవులెవరు?...

చారు : మఱచిపోక!...

ఆర్య : నన్ను నేనెలా మఱుస్తాను?...

చారు : త్రోవలో నిన్ను సకలదేవతలూ రక్షింతురుగాక!

ఆర్య : నీవే నాకు రక్ష!...

చారు : నీ అదృష్టమే నిన్ను కాపాడింది!

ఆర్య : ఆ అదృష్టానికి కూడా నువ్వే కారణం!...

చారు : మైత్రేయ! రాజులు చారచక్షువులు.. వారి దృష్టిపడితే రక్షణ చాలా దుర్లభం!... ముందితని సంకెలను ఆ పాడుబడ్డ నూతిలో పడెయ్!... ఇక్కడిక క్షణమైనా ఉండటం క్షేమం కాదు... త్వరగా పాఱిపో ఆర్యకా!... వయస్యా! మైత్రేయా! ఎందుకో ఎడమ కన్నదురుతోంది.. వసంతసేనను చూడాలని మనస్సువ్విళ్ళూరుతోంది.. అకారణంగానే మనస్సులో దిగులు చోటుచేసికొంటోంది. వెడదాం రా...ఆఁ! అక్కడెవరో బౌద్ధబిక్షువు దర్శనం కూడా అమంగళసూచకమే.. సరేలే.. అతనికెదురుగా కాకుండా ఈ ప్రక్కనుంచి పోదాం!...

★★★

## ఎనిమిదవఅంకం

(జీర్ణోద్యానం)

(శకారుడు విటునితో ఒకరాతి వేదికపై కూర్చుంటాడు)

శకార : బావా!... ఎంత ప్రయత్నించినా దుష్టునిమాటలా వసంతసేన నాకు మఱపు రావటం లేదయ్యా!...

విటు : (తనలో) వసంతసేన అంత తృణీకరించినా ఆమెనే తలచుకొంటున్నాడు. స్త్రీలు తృణీకరించిననీచులకు మదనజ్వాల మఱింత ఎక్కువౌతుంది... సత్పురుషుల్లో అది అంతరిస్తుంది.

శకా : తొందరగా బండి తీసుకురారా అని స్థావరకుడికి చెప్పి ఎంత సేపయింది? ఇంకా రాలేదు.. ఆకాశంలో సూర్యుడు నడినెత్తిన చండప్రచండంగా నిప్పులు కురిపిస్తున్నాడు. అంతవఱకు ఒక పాట పాడనా? (పాడతాడు) ఎలాఉంది?

విటు : (ఎగతాళిగా) ఏం చెప్పను?... గంధర్వగానం!

శకార : నాదెందుకు గంధర్వ గానం కాదు? ఇంగువ, జీలకఱ్ఱ, శొంఠి, బెల్లం, ఇంకెన్నో సుగంధ ద్రవ్యాలు కలిపిన కషాయం ప్రతిదినం తాగుతూ ఉంటే నా కంఠం మాధుర్యాన్ని ఒలకపోయకుండా ఎలా ఉంటుంది? నేను గంధర్వుణ్ణే (మళ్ళీ పాడతాడు) ఎలాఉంది?...

విటు : ఏం చెప్పమంటావు? నువ్వు గంధర్వుడివే!...

శకార : మళ్ళీ అదే వేళాకోళమా?... మిరియప్పొడి, ఇంగువతో, నేతితో వండిన కోకిల మాంసాన్ని రోజూ తింటూ ఉంటాను. నా గొంతులో మాధుర్యం కాక మఱేముంటుంది బావా! ఈ స్థావరకు డింకా దిగబడలేదు!...

విటుడు : కంగారు పడకు! నువ్వు స్థిమితంగా ఉండు. వచ్చేస్తాడు!... (స్థావరకుడు వసంతసేనతో ఉన్న బండిని తీసుకొని వస్తాడు)



స్థావర : ఎహెహె.. ఛోఛో! ఉరకండెహెయ్!...

శకార : (బండి చేప్పుడు విని) బావా! బావా! బండొచ్చింది...

విటుడు : నీకెలా తెలుసు?

శకార : నీక్కనిపించేటం లేదా? వినిపించేటం లేదా?

విటు : ఆఁ! ఆఁ! బాగా గుర్తించావు!...

శకార : స్థావరకా! వచ్చావా?...

స్థావర : ఆఁ! వచ్చాను!...

శకార : బండి వచ్చిందా?...

స్థావరక : బండి కూడా వచ్చింది.

శకార : ఎద్దులుకూడా వచ్చాయా?

స్థావర : ఆఁ! ఎద్దులుకూడా వచ్చాయి.

శకార : నువ్వూ వచ్చావా?

స్థావర : (నవ్వుతూ) అవును.. నేనూ వచ్చాను!

శకార : అయతే బండిని లోనికి ప్రవేశపెట్టు!

స్థావర : తీసుకురావటానికి దారేది?

శకార : ఈ మొండిగోడ మీదుగా!

స్థావర : బండి ఈ గోడమీదుగా వస్తే ఎద్దులు చేచ్చిపోతాయి, బండీ విఱిగిపోతుంది, నేనూ చేచ్చిపోతాను...

శకార : అరే! నేనెవరనుకొంటున్నావ్? రాజుగారి బామ్మర్దిని... ఎద్దులు చేస్తే కొత్తగిత్తలు కొంటాను, బండి విఱిగితే కొత్త బండి చేయిస్తా, నువ్వు చేస్తే ఇంకోణ్ణి పెట్టుకొంటాను...

స్థావర : అన్నీ చేసుకోవచ్చుగానీ, ఆత్మీయుణ్ణైన నేను నీకుండను!

శకార : అంతా నాశనమైనాసరే, బండిని మొండిగోడ మీదుగానే రానీ!

స్థావర : (బండిని గోడమీదుగా దుమికించి) అరే! విఱిగిపోలేదే! అయ్యా! బండి వచ్చింది.

శకార : ఎడ్లు తెగి పోలేదా, పగ్గాలు చేచ్చి పోలేదా? నువ్వూ విఱిగి పోలేదా?

స్థావర : చిత్తం! చిత్తం!...

శకార : బావా!.. రా! బండిని చూద్దాం రా... నువ్వునాకు గురువువు పరమగురుడివి, నా ఆంతరంగికుడివి, గౌరవభాజనుడివి, అందువల్ల నువ్వే ముందు బండెక్కిచూడు!

విటు : సరే, (విటుడు ముందు బండెక్కబోతాడు)

శకార : ఆగు... నాకన్నముందే నువ్వు బండెక్కుతున్నావంటే ఈ బండి నీతాతగారిసొమ్మా? ఈ బండి నాదిరా... నేను ముందెక్కాలి.

విటు : నన్నెక్కమని నువ్వే చెప్పావుగా!

శకార : ఎక్కమంటే ఎక్కేస్తావా? ఎందుకన్నానంటే స్వామీ మీరే ముందెక్కండని నువ్వు నన్ను ప్రార్థించాలని...

విటు : అయితే స్వామీ మీరే ముందెక్కండి...

శకార : ఇప్పుడు నేనెక్కుతా.. చేటుడా, స్థావరకా! బండినిటు తిప్పు!...

స్థావర : (తిప్పి) స్వామీ, ఇప్పుడెక్కండి!...

శకార : (బండెక్కి చూచి, భయంగా వేగంగా కిందికి దూకి, విటుని కౌగిలించి) బావా! బావా! చేచ్చావు, చేచ్చావు, ఈ బండిలో ఒక రాక్షసి ఉంది... లేకపోతే దొంగో! అది రాక్షససైతే మనిద్దఱినీ దోచుకొంటుంది, దొంగైతే ఇద్దఱినీ కరకరమని నమిలి మింగేస్తుంది.



విటు : భయపడకు... భయపడకు... రాక్షసెక్కడైనా బండెక్కి వస్తుందటయ్యా! ఒకవేళ వస్తే ఈపాటికే స్థావరకుణ్ణీ, ఎడ్లనీ తినెయ్యదూ? ఈ ఎండలో స్థావరకుని చొక్కా నీడ నీకా భ్రాంతిని కలిగించి ఉంటుంది...

శకార : చేటా! స్థావరకా! నాయనా నువ్వింకా బ్రతికే ఉన్నావా?

స్థావర : ఆc!.. బతికే ఉన్నా!

శకార : బండిలో ఎవరో స్త్రీ ఉన్నట్లుంది. నువ్వే చూడు!

చేటు : బండిలో ఉంది స్త్రీయా? ఉన్నది వనితైతే మేమిప్పుడే తలవంచుకొని వెళ్ళిపోతాం. మేం పరస్త్రీలను కన్నెత్తి చూసే వాళ్ళం కాదు... అందుకే మాకు గౌరవం.

వసంత : (తనలో) ఈ శకారుడంటేనే నాకు ఒళ్ళుమంట. వీడిక్కడకి దాపురించేటం ఎంత దురదృష్టకరం! ఇప్పుడు నేను ప్రాణాలతో బ్రతికి బయట పడటమే అనుమానాస్పదం. ఇప్పుడేం చెయ్యాలి?...

శకార : బావా! ఈ స్థావరకుడు అసలే పిరికి గొడ్డు.. బండెక్కి చూడడు... నువ్వూ తప్పుకొంటానంటే ఎట్లా బావా! నువ్వు బండెక్కి చూచి లోపలుంది రాక్షసో కాదో తేల్చి చెప్పు!...

విటు : తప్పేదేముంది? అలాగే!... (వసంతసేనను చూసి, తనలో) అయ్యో! లేడిపిల్ల పెద్దపులిని వెతుక్కొంటూ వచ్చినట్లైందే! వసంతసేనా! నీవంటిదానికిది సరైన పని కాదమ్మా!... ఇది వఱకు గర్వంతో శకారుని తిరస్కరించి ఇప్పుడు ధనం కోసమో, నీతల్లి బలవంతం మీదో ఈపనికి పూనుకున్నావా? (కాదుకాదని వసంతసేన తల త్రిప్పుతుంది) లేకపోతే వేశ్యాస్వభావానుగుణంగా వచ్చావా? (మళ్ళీ కాదని తల త్రిప్పుతుంది)

వసంత : బండ్లు తారుమారుకావటంవల్ల జరిగిందీఅనర్థం.. నిన్ను శరణువేడుతున్నా!...

విటు : భయపడకు... ఈ శకారుణ్ణెలాగో వంచిస్తాను... (క్రిందికి దిగి) శకారా! నువ్వన్నది నిజమే.. ఈ బండిలో ఉంది నిజంగా రాక్షసే...

శకార : బావా! రాక్షసే బండిలో ఉంటే నిన్నెందుకు దోచుకోలా? దొంగే ఉంటే నిన్నెందుకు భక్షించేలా?

విటు : ఇప్పుడా తర్కం ఎందుకు? ఈ చెట్ల నీడలో కాలినడకన ఉజ్జయిని చేరుకుందాం!...

శకార : దానివల్ల లాభమేముంది?

విటు : చెక్కని వ్యాయామం చేసినట్లూ అవుతుంది... ఎడ్లకి మనల్ని మోసే శ్రమా తప్పుతుంది.

శకార : సరేకానీ... స్థావరకా! బండిని తీసికెళ్ళు... అహఁహఁ ఆగు... దేవబ్రాహ్మణుల ఎదురుగా నేను కాలినడకన వెడతానా? అందుకని బండెక్కే వెడతాను.

విటుడు : (తనలో) విషాన్ని ఔషధంగా మార్చటం కష్టం. (పైకి) అట్లే కానీ.ఇదిగో ఈ వసంతసేన నీకోసం అభిసరించి వచ్చింది...

వసంత : (తనలో) నేనంత పాపిష్ఠిదాన్ని కాదు!...

శకార : (సంతోషంతో) బావా! పురుషశ్రేష్ఠుణ్ణి, మానవుణ్ణి, వాసుదేవుణ్ణి... వసంతసేన నన్నే అభిసరించి వచ్చిందా?

విటు : అవును....

శకా : ఇదివరకామెకొకసారి కోపం తెప్పించాను. ఇప్పుడామె కాళ్ళపై పడి నాపై ప్రేమ కలిగేలా చేసికొంటా!...

విటు : బాగా చెప్పావు...



శకా : (వసంతసేన కాళ్ళపైపడి) నే చేసిన పనికి క్షమించు. నేను నీ దాసానుదాసుణ్ణి.

వసంత : ఏవిఁటా వాగుడు? పో.. అవతలకి... (కాలితో తంతుంది)

శకార : మా అమ్మలు, అంబికలు, తల్లులు ఏ నా తలని ప్రేమతో ముద్దెట్టుకొన్నారో, దేవతలకు కూడా ఏ నా తల తలవంచేలేదో ఆ నా తలని తన్నావు కదూ!... ఒరే స్థావరకా! నీకిదెక్కడ దొరికిందిరా?

స్థావర : స్వామీ! రాజమార్గంలో బళ్ళతో నిండినప్పుడు నేనీ బండిని చారుదత్తుని పెరటి గుమ్మంలో ఉంచి, బండి దిగి మఱో బండి వెళ్ళటానికి సాయం చేసినప్పుడు బళ్ళు తారుమారు కావటంవల్ల ఈమె తన బండనుకొని ఈ బండెక్కిందను కుంటాను...

శకార : ఏవిఁటీ? బళ్ళు తారుమారు కావటంవల్ల వచ్చిందా?... నన్నభిసరించేటానికి కాదన్నమాట!... అయితే దిగు ముందు... దరిద్రచారుదత్తుణ్ణి అభిసరించేటానికి నీకు నా బండి కావల్సివచ్చిందా? నిన్ను నా ఎడ్లు మోయాలా? దిగు... దిగు...

వసంత : "చారుదత్తుని అభిసరించేటానికి"అనేమాట ఎంత బాగుంది! ఎంత గౌరవంగా ఉంది!

శకార : పదివేళ్ళూ, పదిగోళ్ళూ ఉన్న ఈ నా చేతుల్తో నీ జుట్టు పట్టి ఇది వఱకు జటాయువు వాలిభార్య తారను ఈడ్చినట్లు నిన్ను నా బండి నుంచి ఈడుస్తా...

విటు : స్త్రీలను, అందులోనూ ఇటువంటి ఉన్నతులైన వారిని జుట్టుపట్టుకులాగటం మంచిదికాదు.. కనుక నువ్వుండు... నేనీమెను బండినుంచి దింపుతాను... వసంతసేనా! దిగమ్మా!... (వసంతసేన బండి దిగుతుంది)

శకార : (తనలో) నన్ను తూలనాడి, కాలితో తన్నిన ఈ వసంతసేనను చేంపేయాలి (పైకి) బావా! నువ్వు నాకో పని చేసిపెట్టాలి!

విటుడు : చేయరాని పని తప్ప నీకోసం ఏమైనా చేస్తాను..

శకార : అబ్బే! అదేవీఁలేదు.. ఎంతో మంచి పని.

విటు : అయితే చెప్పు!...

శకార : ఈ వసంతసేనను చేంపాలి!...

విటు : (చెవులు మూసికొని) శివ శివా! శివ శివ! ఆడది, పిన్నవయసులో ఉంది, నిరపరాధి, ఎంతో మంచిది, నగరానికే అలంకారమైన ఈ స్త్రీని చేంపితే రేపు నరకంలో వైతరణీ నదిని దాటటానికి నాకు తెప్పేముంటుంది?

శకార : నీకు తెప్ప నేనిస్తాలే... ఈ నిర్జనారణ్యంలో నువ్వామెను చేంపుతుంటే ఎవడు చూడొచ్చాడు?

విటుడు : లేకేం? దశదిశలు, వనదేవతలు, సూర్యచంద్రులు, యమధర్మరాజు, వాయుదేవుడు, ఆకాశం, అంతరాత్మ, భూదేవి వీరంతా చూస్తూనే ఉంటారు...

శకార : అయితే ఒక పనిచెయ్యి! ఈమె కనిపించేకుండా ఒక ముసుగేసి చేంపెయ్!

విటు : మూర్ఖ! నిరపరాధిని చేంపే అధమాధముడవౌతున్నావు!...

శకార : ఈ ముసలి పందికి పాపభీతెక్కువ.. స్థావరకా! చేటా! నీకు బంగారు పీఠాన్నీ, నేను తినగా మిగిలిన వాటిని ఇచ్చి చేటులందఱికీ నిన్ను నాయకుణ్ణి చేస్తాను.. నే చెప్పిన పని చేసిపెట్టు...

స్థావర : చేయదగిందేదైనా చేస్తాను...

శకార : చేయరాని పని వాసనకూడా లేదు...

స్థావర : అయితే ఆనతీయండి...



శకార : ఈ వసంతసేనను వధించు!...

స్థావర : ఈ పూజ్యురాలిని ఇక్కడకు తెచ్చిన పాపిని నేనే!...

శకారి : నా ఆజ్ఞ నువ్వు పాటించేవా? ఎవరి వల్లరా నీకు భయం?

స్థావర : పరలోకం వలన!...

శకార : ఎక్కడుందిరా ఆ పరలోకం!

స్థావర : మనం చేసే పాపపుణ్యాలఫలితమే పరలోకం!...

శకార : ఆ పాపపుణ్యాలంటే ఏవిఁట్రా?

స్థావర : అనేకసువర్ణభూషణాలను ధరించిన నీ జన్మ పుణ్యఫలం, పరభాగ్యోపజీవినైన నావంటి వాని జన్మ పాపఫలం!... కనుక ఈ పాపకార్యాన్ని చేసి మఱింత పాపాన్ని మూటకట్టుకోను!...

శకార : ఒరేయ్! చేంపవురా? (కొడతాడు)

స్థావర : నన్ను కొట్టండి, చేంపడి, నేను మాత్రం ఈ పాపం చేయను!...

వసంత : అయ్యా! మిమ్మల్నే శరణు వేడుతున్నాను!...

విటు : భళా! స్థావరకా భళా! శకారా! చూడు, దరిద్రుడైనా, ధనం అవసరమైనా, తన్నులు తిన్నా, పాపభీతితో స్థావరకుడు యజమానివైన నీ ఆజ్ఞను తిరస్కరిస్తున్నాడు... పరలోక భీతిలేని నీవంటి పాపులు ధర్మాన్నుల్లంఘిస్తున్నా నాశనం కావటం లేదెందుకో!... ఏవిఁటో దైవం కూడా మంచివారికి కష్టాలు, దుష్టులకు సుఖాలనూ ఎందుకిస్తున్నాడో అర్థం కావటం లేదు...

శకార : ఈ విటుడో ముసలినక్క.. వీడికి పరలోకమంటే భయం! నేను? రాజుగారి బామ్మఱిదిని, మనుజశ్రేష్ఠుణ్ణి, నాకేం భయం? ఒరేయ్! చేటా! నువ్వవతలికిపో...

చేటు : చిత్తం... (నిష్క్రమిస్తాడు)

శకార : (నడుం బిగించుకొని) వసంతసేనా! ఆగు.. నిన్ను చంపాలి!

విటుడు : ఆఁ! నేనుంటుండగా నాఎదుటే (అని శకారుని గొంతు పట్టుకొని, క్రింద పడ వేస్తాడు. శకారుడు మూర్ఛిల్లినట్ల భినయించి, తేటుకొంటాడు)

శకార : నన్నే చంపటానికి ఒడిగడతావా? నా అన్నంతిని, నానేతితో, నేను పెట్టిన మాంసంతో తెగబలిసి, పనిబడ్డప్పుడా పని చేయక, నాకు శత్రువైపోతావా? నువ్వింత కృతఘ్నుడవను కోలేదు... (తనలో) ఆఁ! అయినా ఈ వసంతసేనను చంపే ఉపాయం చెప్పకనే చెప్పేవు.. గొంతు పిసకటంతోనని... (పైకి) బావా! గొప్పవంశంలో పుట్టిన నేను మాత్రం ఈమెనెందుకు చంపుతాను? ఊరికే బెదిరించానంతే!

విటు : కులంలో ఏముంది? గుణంలో కాని.. సుక్షేత్రాల్లో కూడా ముళ్ళచెట్లు మొలవ్వూ!

శకార : బావా! నాకు దగ్గఅగా రావటానికి, నన్ను ప్రేమించేటానికి ఈ వసంతసేన నువ్వు ఎదురుగా ఉన్నావని సిగ్గు పడుతోంది. చేటుడెటో పాటిపోయాడు.. కనుక నువ్వెళ్ళి వాణ్ణి పట్టుకురా!

విటు : (తనలో) నిజమేఁ.. వసంతసేన ఆభిజాత్యం వల్ల నా ఎదుట ఈ మూర్ఖుణ్ణి అంగీకరించేటం లేదేమో!.. నేనిక్కణ్ణుంచి తప్పుకొని, వీరికి ఏకాంతం కల్పిస్తాను... మన్మథభావాలు విజృంభించేది ఏకాంతంలోనే కదా! (పైకి) అలాగే.. వెళ్ళొస్తాను...

వసంత : (కండువా పట్టుకొని ఆపి) నేను నిన్ను శరణుజొచ్చాను కదా!

విటు : భయపడకు.. (శకారునితో) ఇదిగో ఈ వసంతసేనను రక్షణగా నీదగ్గఅ ఉంచుతున్నాను!...



శకార : ఈమెను రక్షిస్తాను!...

విటుడు : నిజమేఁ?

శకార : నిజం!

విటు : (రెండడుగులు వేసి-తనలో) నేను వెళ్ళగా చూచి ఈ దుర్మార్గుడీమెను చంపినా చంపుతాడు, తెలియకుండా వీడేం చేస్తాడో దాక్కొని చూస్తాను.

శకార : (తనలో) వీడో ముసలినక్క.. వెళ్ళినట్టే వెళ్ళి నేనేం చేస్తానో రహస్యంగా చూసినా చూడవచ్చు... వీణ్ణి నమ్మిస్తాను.. .(పూలుకోసి తనను తానలంకరించుకొంటూ) బాలా! కోమలా! తరుణీ! వనితా.... వసంతసేనా.. ఇలా రా!

విటుడు : ఓహో! శృంగార పురుషుడైనాడు! హమ్మయ్య. ..ఇప్పటికి మనస్సు కుదుటపడింది. ఇక వెడతాను... (నిష్క్రమిస్తాడు)

శకార : కాంతామణీ! కనకాభరణాలిస్తాను.. కర్ణపేయంగా మాట్లాడతాను. నీ పలువరస నన్ను పరవశుణ్ణి చేస్తోంది. తలపాగతో నీ కాళ్ళపై పడతానన్నా నన్ను కామిం చేవేం? కాంతలంత కఠినాత్మలా?

వసంత : నీచుడా! నన్ను ధనంతో ప్రలోభపెట్ట జూస్తావా? సత్పురుషుడు దరిద్రుడే అయినా ప్రయత్నించి సేవించాలి!... అంతటివాని పొందు వేశ్యలకైనా శోభిస్తుంది, కానీ నీవంటి మూర్ఖులది కాదు.. మామిడి చెట్టుని సేవించి మోదుగు చెట్టునాశ్రయిస్తానా?

శకార : తొత్తుకూతురా! ఆ దరిద్ర చారుదత్తుడేమో మామిడిచెట్టా, నేనేమో మోదుగచెట్టుగా కనిపిస్తున్నానా నీ కంటికి!... కనీసం కింశుక వృక్షంతోనైనా పోల్చలేదే కొంచెం ఘనంగా ఉండటానికి.. నాకిలా తాటాకులు కడతావా? ఇంకావాణ్ణే తలుస్తున్నావా?

వసంత : ఆయనెప్పుడూ నామనసులోనే ఉంటాడు. తలవకుండా ఎలా ఉంటాను?

శకార : వాణ్ణీ నిన్నూ ఒక్కసారిగానే నేలవైచి కాల రాస్తాను.. చూస్తాను వాడెలా నిన్నాదుకుంటాడో!

వసంత : నన్ను చూస్తే తప్పక రక్షిస్తాడు!

శకార : రక్షించేటానికి వాడేం ఇంద్రుడా, దేవేంద్రుడా, శక్రుడా? రంభకొడుకు కంసుడా? అంగదుడా, వాలిపుత్రుడా? రుద్రుడా? అశ్వత్థామా, జటాయువా? చాణక్యుడా? దుంధుమారుడా? త్రిశంకుడా? ఒకవేళ వీళ్ళంతా కలిసి వచ్చినా నా నుంచి నిన్ను రక్షించేలేరు... భారతయుద్ధంలో చాణుక్యుడు సీతాదేవిని, జటాయువు ద్రౌపదిని చంపినట్లు నిన్నిపుడు చేంపుతాను...

వసంత : (ఎలుగెత్తి) అమ్మా!.. చారుదత్తా!

శకార : ఈ తొత్తుకూతురింకా వాణ్ణే తలచుకొంటోంది. పిలవ్వే.. వాణ్ణే ఆ పాపాత్ముణ్ణే పిలు. (పీక పిసుకుతూ) గట్టిగా పిలు!...

వసంత : చారుదత్తా! నా చివరి ప్రణామాలందుకో...

శకార : (అక్కసుతో) చావు.. చావ్వే.. చావు.. (పీకను నులిమినట్లభినయిస్తాడు, వసంతసేన స్పృహతప్పి పడిపోతుంది) పాపాలపెట్టె, గర్వానికి గని అయిన ఈ వసంతసేన చారుదత్తునితో కులకటానికి వచ్చి కాలం మూడి చేచ్చింది... కానీ ఏం లాభం? నా ఈ పరాక్రమాన్ని చూడటానికి నాతండ్రికీ, సోదరునికి ప్రాప్తం లేకపోయింది... ఇప్పుడిక ఆ ముసలినక్క విటుడు వస్తాడు కనుక ప్రక్కకి తప్పుకొంటాను.. (విటుడు, చేటుడు ప్రవేశిస్తారు)



విటుడు : అయ్యో! ఈ చెట్టుకిందపడి ఎవరో స్త్రీ మృతి చెందింది. అపశకునం.. వసంతసేనగూర్చి నాకాందోళనగా ఉంది... శకారా! ఇదిగో స్థావరకుడైన చేటుని తీసుకొచ్చా!

శకార : మీ ఇద్దఱికీ స్వాగతం!

విట : నీ వద్ద నేను రక్షణగా ఉంచిన వసంతసేన ఏది?

శకార : వెళ్ళిపోయింది!

విటు : ఎక్కడికి?

శకార : నీ వెనకాలే తనూ వెళ్ళింది!

విటు : ఆమె అటువచ్చినట్లులేదే!

శకార : నువ్వేదిక్కుగా వెళ్ళేవ్?

విటు : తూర్పువైపు

శకార : అయితే ఆమె దక్షిణంగా వెళ్ళింది...

విటు : ఆహఁ! నేను వెళ్ళింది దక్షిణంగానే...

శకార : అయితే ఆమె ఉత్తరదిక్కుగా వెళ్ళింది...

విటు : ఏవిఁటి గందరగోళంగా చెబుతున్నావ్? నిజం ఏవిఁటో చెప్పు!

శకార : నీ నెత్తిమీద నా కాలు పెట్టి నిజం చెబుతున్నా.. ఆమెను నేను చేంపేశాను...

విటు : నిజంగా చేంపేశావా?

శకార : నామాటమీద నీకంత నమ్మకం లేకపోతే నీకళ్ళతో నువ్వే చూడు. నా ప్రతాపం ఏవిఁటో? (పడిఉన్న వసంతసేనను చూపుతాడు)

విటు : అయ్యో! ఎంత దురదృష్టవంతుణ్ణి (స్పృహ కోల్పోతాడు)

శకార : హిహిహీ.. బావకూడా చేచ్చిపోయాడు.

స్థావర : సరిగా చూడకుండా నేను బండిని తోలుకురావటం వల్ల నేనే ముందుగా ఆమెను చేంపినవాణ్ణైనాను.

విటు : (తేఱుకొని) అయ్యో! వసంతసేనా... నువ్వొక దయాప్రవాహానివి.. నగరానికే అలంకారంవంటి దానవు... మావంటి వారికి నువ్వే దిక్కు.. అయ్యయ్యో! (శకారునితో) (కన్నీటితో) ఎంతటి ఘోరానికి తలపడ్డావ్?... ఆమెను చేంపటంవల్ల నీకు ఒరిగిందేవింటి? ఈ ఉజ్జయినికే శోభనిచ్చే ఆ పుణ్యాత్మురాలిని పొట్టన పెట్టుకొన్నావ్! (తనలో) ఈ పాపిష్ఠివాడు ఈ పాపాన్ని నాకంటగట్టినా కడతాడు! సరే ఇక్కణ్ణుంచి వెళ్ళాలి. (వెళ్ళబోతాడు) (శకారుడు విటుని చేయి పట్టుకొంటాడు) పాపాత్ముడా! నన్ను ముట్టుకోకు. నీతో ఇక నాకేమీ సంబంధంలేదు.. నేను పోతాను!...

శకార : ఒరేయ్! ఎక్కడికి పోతావురా? వసంతసేనను నీచేతుల్తో నువ్వు చేంపి, ఆ నేరం నాకంటగట్టి నన్ను నోటికొచ్చినట్లల్లా తిట్టి, ఎక్కడికి పోతావురా? చూడు, నీకంతులేని సంపద లిస్తాను... ఈ అపరాధాన్ని ఎవరో గుర్తు తెలియని వారిపై మోపుదాం!...

స్థావర : పాపం శమించుగాక!...

విటు : ఛీ!..ఛీ!.. ఈ నేరం నువ్వు చేసిందే! (శకారుడు నవ్వుతాడు) ఏవింటా నవ్వు? చాలించు.. నిన్ను చూస్తేనే రోత పుట్టుకొస్తోంది... ఓ సుందరీ! వసంతసేనా!... వచ్చే జన్మలోనైనా నువ్వు వేశ్యగా పుట్టకు..శీలవతివై సంపన్నవై సత్కులంలో జన్మనెత్తు!...

శకారుడు : ఒరేయ్! నాపుష్పకరండోద్యానంలో వసంతసేనను వధించి ఎక్కడికి పాఱిపోతావురా? రా.. నిన్ను మా బావగారి ముందు నిలబెడతా!



విటు : ఆగరా నీచుడా! (కత్తి దూస్తాడు)

శకార : (భయంతో) ఏరా భయపడ్డావా? అయితే వెళ్ళు!...

విటు : (తనలో) ఇక ఇక్కడుండటం మంచిది కాదు.. శర్విలక చందనకాదులెక్కడున్నారో అక్కడికే వెడతాను... (నిష్క్రమిస్తాడు)

శకారు : చావు... స్థావరకా! నాయనా! నేచేసిన పనెలా ఉంది?

స్థావర : స్వామీ! మీరు చేసింది ఒక మహాపాపం!...

శకార : ఏవంటున్నావ్! నేచేసింది మహాపాపమనా? పోన్లే! ఈ ఆభరణాలను తీసుకో.. ఇవి నేను ధరించినప్పుడు నావి.. మిగతా సమయాల్లో నీవి... సరేనా?...

స్థావర : ఇది మీ ఒంటిమీదుంటేనే బాగుంటాయి... నాకెందు కీనగలు?...

శకార : అయితే వెళ్ళు... ఈ బండిని తోలుకెళ్ళి ఎడ్లను కట్టేసి, నువ్వక్కడే ఉండు.నేనూ వస్తాను.

స్థావర : అలాగే!

శకార : విటుడు వెళ్ళిపోయాడు... ఈ చేటుణ్ణి నా భవనంలో గొలుసులతో బంధించి ఉంచుతాను.. ఇక రహస్యం ఎక్కడా పొక్కదు... నేనూ వెడతాను...అయినా వసంతసేన చచ్చిందో లేదో ఒకసారి చూసి మఱీ వెడతాను. ఒకవేళ చావకపోతే ఇంకోసారి చేంపుతాను... (చూసి) ఆఁ! పూర్తిగా చచ్చింది! ఈ ఎండుటాకుల్తో దీన్ని కప్పివేస్తాను! (కప్పి) ఇప్పుడు న్యాయస్థానానికి వెళ్ళి ధనాశతో చారుదత్తుడు వసంతసేనను జీర్ణోద్యానానికి పిలిచి సంహరించాడని అభియోగం తీసుకొస్తాను.. (నిష్క్రమిస్తాడు)

(బౌద్ధ భిక్షువుగా మాఱిన సంవాహకుడు ప్రవేశిస్తాడు)

భిక్షు : ఈ కౌపీనాన్ని శుభ్రంగా ఉతికాను.. ఏ చెట్టుకొమ్మపై ఆరవేయను? ఈ ఎండుటాకుల గుట్టపై ఆరేస్తేనే మెఱుగు.. అరెఁ! ఈ ఎండుటాకుల గుట్టలోంచి ఏదో స్త్రీ హస్తం పైకి కనిపిస్తోంది... రెండో చేతిని కూడా పైకెత్తింది... (ఆకులు తీసిచూసి) ఆఁ! నన్నావేళ దశ సువర్ణాలతో సభికుల బారి నుండి రక్షించిన వసంతసేన! (వసంతసేన దాహమని సంజ్ఞ చేస్తుంది) మంచినీళ్ళడుగుతోంది!.. అయ్యో దగ్గఱగా బావికూడా లేదే!... (తన తడి వస్త్రం పిండుతాడు) వసంతసేన లేస్తుంది. భిక్షువు తన ఉత్తరీయంతో ఆమెకు విసురుతాడు)

వసంత : అయ్యా!... తామెవరు?

భిక్షు : ఆనాడు పది బంగారు నాణాలతో జూదరుల బారి నుండి నన్ను రక్షించింది నువ్వే కదా! గుర్తుపట్టలేదా?

వసంత : ఆఁ! గుర్తొచ్చింది!...

భిక్షు : అమ్మా!... ఏమిఁటిది?...

వసంత : నావంటి వేశ్యకు తగిన శాస్తే!...

భిక్షు : ఇదిగో ఈ తీగెను పట్టుకొని లే! ఇక్కడికి దగ్గర్లో ఉన్న బౌద్ధ విహారంలో నా సోదరి బౌద్ధ సన్యాసిని ఉంది... అక్కడ కాస్త సేద తీరి మీ ఇంటికి వెళ్ళవచ్చు.. ఆఁ!..ఆఁ!.. మెల్లగా... జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలను నిగ్రహించుకొన్న విశుద్ధ నడవడిక కలవారిని ఎవరూ ఏమీ చేయలేరు... పదమ్మా వసంతసేనా!...

★★★



# తొమ్మిదవఅంకం

(న్యాయస్థానం)

న్యాయాధికారి : మీ అభియోగం ఏమిఁటి?

శకార : మా బావగారు, నా సోదరి భర్త, నా తల్లి జామాత పాలక మహారాజు పుష్పకరండక జీర్ణోద్యానాన్ని నాపై ప్రేమతో సర్వాధికారాలతో నాకు బహూకరించాడు. దాన్ని చూడటానికి నిత్యం నేనక్కడకు వెడుతూఉంటాను. నిన్న నాకక్కడ చేచ్చిపడిఉన్న ఒక స్త్రీ కళేబరం కనిపించింది...

అధికారి : ఆ చేచ్చిపడి ఉన్న స్త్రీ ఎవరో నీకు తెలుసా?

శకార : తెలియకేం? బాగా తెలుసు! ఆమె ఉజ్జయినికే అలంకార ప్రాయురాలైన వసంతసేన... ఎవడో నీచుడామెను ధనం కోసం ఆ ఉద్యానవనానికి రప్పించి గొంతు నులిమి చేంపివేశాడు.. నేనుకాదు...

అధికారి : శ్రేష్ఠికాయస్థులారా! "నేను కాదు" అన్నమాట ముందుగా వ్రాయండి!

కాయస్థ : అయ్యా! వ్రాశాం!

అధికారి : ధనం కోసమే గొంతునులిమి చేంపాడని నీకెలా తెలుసు?

శకార : వాచి బోసిగా ఉన్న ఆమె మెడ నగలు లేని ఆమె శరీరం చూసి ఇది ధనలోభంతో జరిగిన హత్యేనని నిర్ధారణకు వచ్చాను!...

శ్రేష్ఠి, కాయస్థ : తర్కసహంగానే ఉంది... అయితే ఇప్పుడీ అభియోగం ఎవరిమీద?

అధికారి : ఈ విచారణ వాదాలను, వాస్తవాలనూ, దృష్టిలో పెట్టుకొని జేరగాలి... వాస్తవం న్యాయనిర్ణయానికి మూలం...

శ్రేష్ఠి, కాయ : అయితే ఇప్పుడు వసంతసేన తల్లినుంచి వాస్తవాన్ని తెలిసికోవాలంటారా?

అధికారి : అవును! శోధనకా! వసంతసేన తల్లిని కంగారుపెట్టకుండా తీసికొని రా!

శోధనకుడు : చిత్తం! (బయటకు వెళ్ళి ఆమెతో తిరిగివచ్చి) అమ్మా... ఇటు..

వసం. తల్లి : (తనలో) వసంతసేనేమో తనయౌవనాన్ని సార్థకం చేసుకోవటానికి తన మిత్రునింటికి వెళ్ళింది... న్యాయస్థానానికి రమ్మని ఇప్పుడీ పిలుపు... నాకేమీ తోచేటం లేదు.. గుండె దడదడలాడుతోంది...

శోధన : అమ్మా... ఇటు.. ఇటు...

అధికారి : అమ్మా.. అలా కూర్చోండి!

శకార : ఓహో! ఈ వేశ్యమాత వచ్చింది...

అధికారి : అమ్మా! మీరు వసంతసేన తల్లిగారేనా?

తల్లి : అవునండీ!

అధి : అయితే ఇప్పుడు మీ అమ్మాయి వసంతసేన ఎక్కడుందమ్మా?

తల్లి : తన మిత్రునింట్లో!

అధికారి : ఆ మిత్రుని పేరు?

తల్లి : (సిగ్గుపడుతుంది)

అధికారి : సిగ్గు పడకండి... న్యాయ విచారణకవసరమై అడుగుతున్నాం...

శ్రేష్ఠి, కాయ : న్యాయస్థానం అడుగుతోంది.. చెప్పమ్మా, తప్పేం లేదు!...

తల్లి : వణిక్ప్రముఖుడు, వినయదత్తుని దౌహిత్రుడు, సాగరదత్తుని పుత్రుడు, ప్రసిద్ధుడూ అయిన చారుదత్తుడు... అక్కడ నా కూతురు తన యౌవనాన్ని చరితార్థం చేసుకుంటోంది!

శకార : అయ్యలారా! విన్నారా? ఈ మాటలు రాయించేండి!... నా అభియోగం చారుదత్తుని మీదే!...



శ్రేష్ఠి, కాయ : చారుదత్తుడామె మిత్రుడు కావటంలో తప్పేముంది?...

అధికారి : ధనదత్తా! వసంతసేన ఆర్య చారుదత్తుని ఇంటికి వెళ్ళిం దనేది ఈ విచారణలో ప్రథమ పాదంగా లిఖించు... అతణ్ణి విచారించాలి... శోధనకా! వెళ్ళి ఆర్య చారుదత్తుని న్యాయాధీశులు మిమ్మల్ని చూడగోరుతున్నారని గౌరవంగా తీసుకురా!...

శోధన : చిత్తం... (వెళ్ళి చారుదత్తునితో తిరిగివస్తాడు)

చారు : (తనలో) న్యాయస్థానం నుంచి పిలుపొచ్చిందంటే ఇదేదో కీడుకే అయిఉంటుంది. పైగా ఎడం కన్నదురుతోంది కూడా! అపరాధిని పిలిచినట్లు ఇప్పుడు పిలిపిస్తున్నారంటే ఒకవేళ ఆర్యకుడు నా బండిలో పాఱిపోయాడన్న వార్త గూఢచారుల ద్వారా రాజు చెవిన పడిందేమో! అపశకునాలు పరంపరగా గోచరిస్తున్నాయి.. కానీ, అన్నింటికీ ఆ దేవుడే ఉన్నాడు...

శోధన : అయ్యా... ఇటు...ఇటు...

అధికారి : ఆర్య చారుదత్తునికి స్వాగతం! శోధనకా! వారికి ఆసనం తీసుకురా!

శోధన : (ఆసనం తీసికొనివచ్చి) ఆర్యా! కూర్చోండి. (చారుదత్తుడు కూర్చుంటాడు)

అధికారి : చారుదత్తా! ఈమె పుత్రికతో మీకు పరిచయం కాని, ప్రేమకాని, ప్రణయం కాని ఉన్నాయా?...

చారు : ఎవరి పుత్రికతో?

అధికారి : ఈమె (వసంతసేన తల్లిని చూపుతాడు)

చారు : (లేచి) అమ్మా!... నమస్కారం!

తల్లి : కలకాలం చల్లగా ఉండు నాయనా! (తనలో) ఆ చారుదత్తుడితడా? నా కూతురు తన యౌవనాన్ని తగినవానికే అర్పించి తరించింది.

అధికారి : గణిక వసంతసేన నీకు నేస్తమా? (చారుదత్తుడు సిగ్గునభినయిస్తాడు)

శ్రేష్ఠికాయ : చారుదత్తా! సిగ్గుపడితే ఎలా? ఇది న్యాయస్థానం!...

చారు : (సిగ్గుపడుతూ) అయ్యా! ఒకవేశ్య నా నేస్తమని ఎలా చెప్పను? అయినా ఈ విషయంలో దోషం యౌవనానిదే కాని నాది కాదు!...

అధికారి : ఇది చాలా క్లిష్టమైన వ్యవహారం! మీరు సిగ్గువిడిచి ధైర్యంగా నిజం చెప్పండి.. వెనక్కి తగ్గొద్దు... వసంతసేన మీకు నేస్తమేగా!...

చారు : అవును!...

అధికారి : ఇప్పుడామె ఎక్కడుంది?

చారు : వాళ్ళింటికి వెళ్ళింది...

శ్రేష్ఠికాయ : ఎలా వెళ్ళింది? ఎప్పుడెళ్ళింది? ఆమె వెళ్ళేటప్పుడెవరైనా తోడున్నారా?

చారు : (తనలో) రహస్యంగా వెళ్ళిందని చెప్పనా?...

శ్రేష్ఠి, కాయ : అయ్యా... చెప్పండి!...

చారు : ఇంటికెళ్ళింది... ఇంకేం చెప్పను?...

అధికారి : కాలినడకన వెళ్ళిందా? బండిలో వెళ్ళిందా?

చారు : ఆమె నేనుండగా వెళ్ళలేదు కనుక నడిచి వెళ్ళిందో, బండిమీద వెళ్ళిందో నాకు తెలియదు...

వీరకుడు : (ప్రవేశించి) (తనలో) చందనకుడు కాలితో తన్నిన అవమానంతో కుమిలిపోతూ రాత్రి ఎలాగో గడిపాను... ఇప్పుడీ న్యాయస్థానం చేరాను... (చేయిపైకెత్తి, పైకి) మాన్యులందరికీ క్షేమమా?



అధికారి : అరేఁ! ఉజ్జయినీ నగర రక్షణాధికారి వీరకుడు! వీరకా! ఇదేవిఁటిలావచ్చావు?

వీరక : సంకెళ్ళను తెంపుకొని పాటిపోతున్న ఆర్యకుని పట్టుకోవటానికి నేను, చందనకుడూ నిన్న ప్రయత్నిస్తుంటే తెరలున్న బండి ఒకటి కనిపించింది. చందనకుడు కూడా బండిని శోధించినా నేనూ చూడాల్సిందేనంటే ఆ మహానుభావుడు నన్ను కాలితో తన్నాడు.. జేరిగిందిదీ.. తమరు న్యాయం ప్రసాదించాలి...

అధికారి : బాబూ...! ఆ బండెవరిదో తెలుసా?

వీరక : ఈ ఆర్య చారుదత్తునిదే.. వసంతసేన పుష్పకరండక జీర్ణోద్యానానికి తీసికెడుతోందని బండివాడు చెప్పేడు.

అధికారి : వీరకా! నీ అభియోగాన్ని తరువాత చూద్దాం... ఈ న్యాయాలయం బయట గుఱ్ఱం ఉంది. దాన్నధిరోహించి నువ్వు పుష్పకరండక జీర్ణోద్యానానికి వెళ్ళి అక్కడ ప్రాణాలు కోల్పోయిన ఒక స్త్రీ ఉందో లేదో చూచిరా!...

వీరక : అలాగే (వెళ్ళి తిరిగివచ్చి) అయ్యా! అక్కడొక స్త్రీశవాన్ని కుక్కలు, నక్కలూ పీక్కుతింటున్నాయి...

అధి : అది స్త్రీ శవమేనని నువ్వెలా గుర్తు పట్టేవు?

వీరక : స్తన, కేశపాశాలు, పాణిపాదాలూ కనిపించేటం వల్ల అది స్త్రీ శవమేనని పోల్చుకొన్నా!

అధికారి : (తనలో) లోకం పోకడ ఎంత ఆశ్చర్యంగా ఉంది! ఛీ!ఛీ!... ఎంత నిపుణంగా పరిశీలిస్తున్నా ఎంతో సత్పురుషుడైన చారుదత్తుని దోషిగా నిలబెట్టటానికే సాక్ష్యాధారాలు తోడ్పడుతున్నాయి... దోషి అనటానికి అంతరాత్మ అంగీకరించేటంలేదు.. న్యాయ నిర్ణయం ఎంత క్లిష్టతరం!...

(పైకి) చారుదత్తా! నిజేం చెప్పండి!... వసంతసేనను వధించినట్లు మీమీద అభియోగం...

చారు : ఈర్ష్యాద్వేషాలతో, విషయాభిలాషతో ఉచితానుచితాలు లేక ఎంతటి హత్యకైనా వెనుదీయని వారి మాటలెలా ప్రమాణమౌతాయి? తీగను వంచి పూవులైనా కోయని నేను స్త్రీవధ కావిస్తానా? ఎప్పుడూ చేయను...

శకార : చారుదత్తా! ఇప్పటికైనా ఒప్పుకో... ఈ హత్య నేనే చేశానని అంగీకరించు!

చారు : (నిట్టూర్చి, తనలో) రోహసేనునికి బంగారు బండి చేయించుకోమని, వసంత సేన ఇచ్చిన నగలను తిరిగి ఆమెకు అప్పగించి రమ్మని పంపిన మైత్రేయుడింకా రాలేదేవింటి? (ఆభరణాలు తీసికొని మైత్రేయుడు ప్రవేశిస్తాడు)

మైత్రే : ఆర్యచారుదత్తా!... ఏవింటిదంతా?

చారు : (మైత్రేయుని చెవిలో చెప్పి) ఇది...

మైత్రేయ : ఎవడా అంది? (చారుదత్తుడు శకారునివైపు సైగచేసి చూపుతాడు)

చారు : దీనికంతా ఈ నీచుడే కారణం... అయినా వీణ్ణనుకొని ఏంలాభం? విధి బలీయం!

మైత్రేయ : అయినా వసంతసేన ఇంటికెళ్ళిపోయిందని నువ్వు చెప్పలేదా?

చారు : చెప్పాను... కాని వినేదెవరు? నా దౌర్భాగ్యం వల్ల వాడిమాటే చెల్లింది..

మైత్రేయ : ఒరేయ్ తొత్తుకొడకా! ఆగాగు! నీ బుద్ధిలాగానే వంకరగా ఉన్న ఈ కట్టతో నీబుఱ్ఱను వంద వ్రక్కలు చేస్తాను...



శకార : ఆర్యులారా! విన్నారా? నా వివాదం చారుదత్తునితో అయితే మధ్య వీడెవడు? నాబుఱ్ఱను వందవ్రక్కలు చేయటానికి? (మైత్రేయునితో) అది నీవల్లేమౌతుందిలే? (మైత్రేయుడు కట్టనెత్తుతాడు. శకారుడు కోపంతో లేచి అతణ్ణి తంతాడు. విదూషకుడు తిరిగి కొడతాడు... ఈ ఘర్షణలో మైత్రేయుని చేంక లోని నగల మూట క్రింద పడుతుంది. శకారుడు దాన్ని అందుకొని)

అయ్యా!... చూడండి... చూడండి... ఈనగలు వసంతసేనవే.. (చారుదత్తునితో) వీటికోసమే నువ్వామెను చేంపావు...

(న్యాయాధికారులంతా తలలు వంచుకొంటారు)

అధికారి : (తనలో) అయ్యో!... ఎంతటి కష్టం? ఇక చారుదత్తుని రక్షించేటం దుష్కరం...

శ్రేష్ఠికాయ : (వసంతసేన తల్లితో) అమ్మా! జాగ్రత్తగా ఈ నగల్నిచూడు! ఇవి వసంతసేనవో కావో చెప్పు!

తల్లి : ఇవి వాటిలాగానే ఉన్నాయి కానీ అవి కావు!...

శకార : ఏయ్ ముసలీ! కళ్ళతో అవునంటూ నోటితో కాదంటావా? అబద్ధాలాడకు!

తల్లి : ఛీ!.. అవతలకిపో... ఇవి అవి కానే కాదు!...

శ్రేష్ఠి, కాయ : అయితే ఇవి చారుదత్తునివా?

చారు : కానే కాదు!...

శ్రేష్ఠికా : అయితే ఎవరివి మతి?

చారు : ఇవి వసంతసేనవే!...

శ్రేష్ఠి, కాయ : అయితే ఇవి మీకెలా వచ్చాయి?

చారు : ఎలావచ్చాయో తెలియదుకాని, మాఇంటినుంచి వచ్చాయని మాత్రం తెలుసు.

శకార : ఈమెను ఉద్యానవనానికి రప్పించి, చేంపి, ఆ నగలను తీసుకొని ఇప్పుడేమో కప్పిపుచ్చుకోవటానికి తంటాలు పడుతున్నావ్!...

అధికారి : ఆర్య చారుదత్తా.. నిజం చెప్పండి!...

చారు : నాకే పాపం తెలియదు... నేను దోషినని మీరనుకుంటే నే చేయగలిగిందేమీ లేదు... (తనలో) వసంతసేనలేని నాబ్రతుకూ వ్యర్థమే.. (పైకి) ఇహపరాలను లెక్కించేక నాచేత ఒక స్త్రీరత్నం... తరువాతిమాట నానోటితో నేననలేను... అతడు చెబుతాడు (శకారుని చూపిస్తాడు)

శకార : వధకు గుఱైంది! ఒరేయ్ నువ్వూ చెప్పు.. నేనే చేంపానని స్పష్టంగా చెప్పు!

చారు : నువ్వు చెప్పావుగా! మళ్ళీ నేనెందుకూ చెప్పటం?

శకార : అయ్యా! విన్నారా? విన్నారా? వీడే చేంపాడని స్పష్టంగా అంగీకరించాడు కదా! కనుక శిక్ష విధించేండి! శారీరక శిక్ష!

అధికారి : ఇతనికి శారీరక శిక్షే విధిస్తున్నాం.. రాజ భటులారా! ఇతణ్ణదుపులోకి తీసికోండి.. (రాజభటులు చారుదత్తుని బంధిస్తారు)

తల్లి : న్యాయమూర్తులారా! దయతో నా విన్నపం ఆలకించేండి. అతనింట సువర్ణభాండాన్ని దొంగెత్తికెళితే చతుస్సముద్ర సారభూతమైన రత్నావళినిచ్చిన ఈ ఉదారుడు ఈ పనికిమాలిన నగలకోసం నాకూతుర్ని చేంపాడన్నది ఎలా నమ్మదగ్గ విషయం? నా కూతుర్ని ఒకవేళ ఇతడే చేంపినా కూడా ఇతడు దీర్ఘాయువుగా జీవించేలి... ఇంకో విషయం... వివాదం అర్థిప్రత్యర్థులకు సంబంధించింది కదా! అర్థినైన నేనే వేడుకొంటున్నా! ఇతణ్ణి విడిచి పెట్టండి...



అధికారి : అమ్మా! వెళ్ళు... రాజపురుషులారా! ఈమెను పంపండి!...

తల్లి : అయ్యో నాయనా! అయ్యో అమ్మా (ఏడుస్తూ నిష్క్రమిస్తుంది)

శకార : (తనలో) అనుకొన్న పని పూర్తయింది.. ఇక నేనూ వెడతాను..

అధికారి : ఆర్యచారుదత్తా! న్యాయాన్యాయ విచారణవఱకే మా పని... శిక్షావిధి రాజుగారిదే.. శోధనకా! పాలకమహారాజుగారికి పాపి విప్రుడయితే మరణశిక్ష కర్హుడుకాడని, మనుధర్మ శాస్త్రం చెబుతోంది. కనుక అతని ఆస్తినంతా గ్రహించి, దేశబహిష్కరణ యుక్తమన్నామని మా మాటగా చెప్పు!... (శోధనకుడు బయటకు వెళ్ళి తిరిగి కన్నీటితో వచ్చి)

శోధన : అయ్యలారా! రాజసన్నిధికి వెళ్ళివచ్చా! ఏ నగలకోసం నిందితుడు వసంతసేనను వధించాడో ఆ నగలనే అతని మెళ్ళోవేసి చాటింపుతో శ్మశానానికి తీసికొనివెళ్ళి కొఱత వేయించాలని రాజాజ్ఞ!

చారు : ఏమీ! ఈ పాలకుడెంత అవివేకి? మైత్రేయా! విష,జల, తులాగ్నిపరీక్షలు జరిపి నేరం నిర్ధారణైతే నాకీశిక్ష విధించేవచ్చు... కానీ, పాలకా! వాటి ప్రసక్తే లేకుండా నువ్వు నా శత్రువుమాటకు తలొగ్గి బ్రాహ్మణ వధ కావిస్తున్నావు.. కనుక నువ్వు పుత్రపౌత్రాదులతో నరకమధ్యంలో ఉంటావు.. ఇదిగో వస్తున్నా!

★★★

## పదవఅంకం

రాజవీథి

చాటింపు : అయ్యలారా!... అమ్మలారా!.. వినండి.. వినయదత్తశ్రేష్ఠి దౌహిత్రుడు సాగరదత్తునిపుత్రుడు ఈ చారుదత్తుడు ధనంకోసం వసంతసేన అనే గణికను పుష్పకరండక జీర్ణోద్యానానికి తీసికొనివెళ్ళి గొంతు నులిమి వధించాడు... అపహరించిన ధనంతో పట్టుబడి నేరాన్నంగీకరించిన ఇతనికి పాలక మహారాజు మరణశిక్ష విధించారు.. ఇకపై ఎవరిట్టి ఘాతుకాలకు పాల్పడినా వారికీ ఇటువంటి శిక్షే ఉంటుందని గ్రహించేండహో!...

స్థావరక : అయ్యయ్యో!.. ఏ పాపం ఎఱుగని ఆర్య చారుదత్తునికి మరణశిక్షా!... నన్ను నా యజమాని శకారుడు గొలుసులతో బంధించి ఈ సౌధంపై ఉంచాడు.. కానీ, జేరిగింది అందఱూ వినేట్లుగా పెద్దగా అఱుస్తాను... ఉహుఁ లాభం లేదు. వీధి వీధంతా జనంతో కిటకిటలాడుతూ కోలాహలం మిన్నంటి పోతుంటే నామాట వినే నాథుడెవడు? ఈ మేడ మీద నుంచి దూకేస్తాను... ఒకవేళ నేను చేచ్చిపోయినా నాకు మంచి లోకమే చేకూరుతుంది.. (దూకి) అరెఁ! నేను చావలేదే!.. నాకు తగిలించిన గొలుసూ ఊడిపోయింది. చారుదత్తుని తీసుకుపోత్ను కటికవారి దగ్గఱకు పోయి నిజం చెప్పేస్తాను.. దారివ్వండి... దారి.. ఓ చండాలా!.. ఆగు...ఆగు...

చండాలుడు : వీడెవడ్రా? మనని ఆగమంటూ వస్తున్నాడు?

స్థావర : అయ్యా! ఆగండాగండి! .. నే చెప్పేది కాస్త వినండి!... బండి తారుమారై వసంతసేన తెలియక నా బండెక్కింది, నాకు తెలియక నేనే ఆమెను జీర్ణోద్యానానికి చేర్చాను. అక్కడీ నీచుడు శకారుడు తనను కామించమని వసంతసేనను బలవంతపెట్టాడు. ఆమె ఒప్పుకోకపోవటంతో ఆమె పీక పిసికి చంపేశాడు. ఇది నేను కళ్ళారా చూశాను.. అందుకే నన్ను గొలుసులతో బంధించి ఉంచాడు.. చాటింపు వినబడ్డంతో గొలుసులు తెంపుకు పరుగెత్తుకొచ్చాను...



చండా : స్థావరకా! నువ్వుచెబుతోంది నిజమేఁ?...

స్థావర : నిజం! ముమ్మాటికీ నిజం!...

– చావుడప్పు... కోలాహలం –

శకార : ఆహాఁ! ఈ దరిద్ర చారుదత్తుని చావు డప్పు వీనులకెంత ఇంపుగా ఉంది. మధ్యమధ్యలో పటహధ్వనులు, చాటింపు మఱింత సంతోషాన్ని కల్గిస్తున్నాయి. శత్రువును ఉరితీస్తుంటే కళ్ళారా చూసినవానికి వచ్చే జన్మలో కళ్ళ వ్యాధులుండ వంటారు.. మేడెక్కి కళ్ళారా చూస్తాను.. అబ్బో! ఏం జనం? ఏం జనం? ఈ దరిద్రచారుదత్తుణ్ణి ఉరితీస్తుంటేనే ఇంతమంది గుమికూడితే– నావంటి మహానుభావుణ్ణి ఉరితీస్తే ఇంకెంతమంది ఉంటారో!.. అరెఁ! చాటింపు ఆగిపోయిందేమిఁటి? ఇదేమిఁటి ఇక్కడ స్థావరకుడు లేడేం?.. కట్టు తప్పించుకుపోయి నా గుట్టు రట్టుచేస్తాడేమో కొంపతీసి... ముందువీడెక్కడికి పోయాడో వెతకాలి...

స్థావర : అదుగో... శకారుడొస్తున్నాడు...

శకార : తప్పుకోండి.. తప్పుకోండి.. స్థావరకా! మనం ఇక్కడెందుకు? వెడదాం రా!...

స్థావర : దుర్మార్గుడా! వసంతసేనను చంపావు.. తృప్తికలగలా? ఇప్పుడు మహానుభావుడైన ఈ చారుదత్తుని కూడా చంపించాలని చూస్తున్నావా?

శకార : రతనాల కుండవంటి సత్పురుషుణ్ణైన నేను ఒక అబలను వధిస్తానా?

జనం అంతా : ఓహెూ!.. ఎంత అమాయకుడివి!.. వసంతసేనను నువ్వే చేంపావు... చారుదత్తుడు కాదు.. నువ్వే చేంపావ్!...నువ్వే చేంపావ్!...నువ్వే చేంపావ్!...

శకార : ఎవడా అంది?

అంతా : ఇదిగో.. ఈ సత్పురుషుడు (స్థావరకుని చూపిస్తారు)

శకార : (భయంతో తనలో) ఈ స్థావరకుణ్ణి నేను గట్టిగా బంధించే లేదా? ఎంత పొరపాటై పోయింది. నేను చేసినపనికి వీడొక్కడే ప్రత్యక్షసాక్షి... ఊc! సరే... (పైకి) అయ్యలారా! వినండి... వీడు నా సేవకుడై నా ఇంట్లో బంగారం కాజేస్తుంటే పట్టుకొని, కొట్టి గొలుసులతో బంధించాను. అందుకని నాపై పగబట్టి నోటికొచ్చినట్టు వాగే వీడి మాటలు నిజాలెలా అవుతాయి? కావాలంటే వాడి వీపు చూడండి!

(రహస్యంగా) స్థావరకా!. ఈ బంగారపు మురుగు తీసికో నేనేం నేరం చేయలేదని చెప్పు!

స్థావర : (తీసికొని అందటికీ చూపిస్తూ) అయ్యలారా! చూడండి! ఈ శకారుడు ఈ బంగారపు మురుగిచ్చి అబద్ధమాడ మంటున్నాడు చూడండి...

శకార : (స్థావరకుని చేతినుండి దాన్ని లాక్కొని) వీడు దేన్ని దొంగిలిస్తే నేను వీణ్ణి కొట్టించానో ఆ బంగారు మురుగిదే...

చండా : (చూసి) ఈయన చెబుతోంది నిజవేcనల్లే ఉందిరా!... తన్నులు తిని కడుపు మండిన వాడెంతలేసి మాటలన్నా అంటాడు.



స్థావర : సేవకుడి మాటకేం విలువుంటుంది... నిజం చెప్పినా ఎవరూ నమ్మరు. ఆర్య చారుదత్తా! ఇంతకన్నా నావల్ల ఇంకేమీ కాదు.. క్షమించేండి... (కాళ్ళమీద పడతాడు)

చారు : లే నాయనా!.. లే! నన్ను రక్షించాలని ఎంతో ప్రయత్నించావు.. భగవత్సంకల్పం వేఱుగా ఉన్నప్పుడు ఎవరు మాత్రం చేయగలిగేదేముంటుంది? అశక్తుణ్ణని బాధపడకు!

చండా : (శకారునితో) అయ్యా! ఈ స్థావరకుణ్ణి తన్ని తగిలెయ్యండి...

శకార : ఒరేయ్! ఇక పోరా!.. చండాలులారా!.. చారుదత్తుణ్ణి వధించేటానికింకేవిcటాలస్యం?

చండా : అంత తొందరగా ఉంటే ఆ పని నువ్వే చెయ్యొచ్చుగా!...

– డప్పు మ్రోగుతుంది –

అదుగో నాల్గవసారి చాటింపు..

చారు : వసంతసేనా!... హా!.. వసంతసేనా!.. ధూతా!... మైత్రేయా!... రోహణకా!... దైవోపహతుణ్ణి! మీకేమీ చేయకుండానే వెళ్ళిపోతున్నా!

(బౌద్ధభిక్షువు, వసంతసేన ప్రవేశం)

బౌద్ధభిక్షు : అమ్మా! నీకు స్వస్థత చేకూరింది! ఇప్పుడు నిన్నెక్కడికి తీసుకువెళ్ళమంటావ్?

వసంత : చారుదత్తుని ఇంటికే తీసుకు వెళ్ళు!

భిక్షు : రాచేబాట ద్వారానే ఆ పూజ్యుని ఇల్లు చేరాలి. పదమ్మా! .. ఇదేవిcటి? ఈ రాచేబాటలో ఇంతటి కోలాహలం?

వసంత : ఏవిcటింతమంది జనం?.. అయ్యా! అదేవిcటో తెలుసుకోండి!... ఉజ్జయినీ నగరం నగరమంతా ఒక్కచోటికే చేరినట్లుంది...

చండాల : ఒరేయ్! ఇదిగో చివరిదైన ఐదవ చాటింపు.. (డప్పు... చాటింపు) చారుదత్తా! సిద్ధంగా ఉండు.. భయపడకు... బాధ తెలియకుండా క్షణంలో ఒకే ఒక కత్తివేటుతో స్వర్గానికి పంపుతాం!...

భిక్షు : అమ్మా! చారుదత్తుడు నిన్ను వధించాడనే అభియోగంతో ఆయనని వధ్యస్థానానికి తీసికొని వెడుతున్నారు. అందుకే ఈ జనసందోహం!...

వసంత : అయ్యో!.. అయ్యో!.. పాపిష్ఠిదాన్ని నా కోసం చారుదత్తుని వధిస్తున్నారా? అయ్యా... త్వరగా అక్కడికి వెడదాం!

భిక్షు : తప్పుకోండి... తప్పుకోండి...

వసంత : దారివ్వండి.. దారివ్వండి...

చండాల : ఆర్యచారుదత్తా! రాజాజ్ఞకు లోబడి మేమీ పని చేస్తున్నాం. నిన్ను శిక్షిస్తోంది రాజాజ్ఞకానీ, మేము కాదు... కనుక చివరి ప్రార్థన చేసుకో..

చండాల2 : వధ్యశిలపై బోర్లా పడుకో.. కదలకు (ఒరనుంచి కత్తిని లాగి చారుదత్తునిపై వేయబోతుంటే చేయిజారి అది క్రింద పడుతుంది) అరెఁ! ఇదేవింటి? నా జీవితంలో మొదటిసారి కత్తి చేయిజారి కిందపడటం! దీనివల్ల చారుదత్తునికి మరణం తప్పిపోతుందేమో! సహ్యవాసినీ! చారుదత్తుని కరుణించు... ఆయనకు విముక్తి కలిగితే మా కులంపై నీదయ కలిగినట్లవుతుంది!...

చండాల1 : రాజాజ్ఞను పాటిద్దాం!...

చండాల2 : అలాగే! శూలారోపణచేద్దాం...

వసంత, భిక్షు : అయ్యలారా! ఆగండాగండి... ఆర్యచారుదత్తుడు ఎవరిని వధించినందుకు ఈశిక్షకు గురిఅయ్యాడో ఆ దురదృష్టవంతురాల్ని నేనే...



చండాల1 : ఒరేయ్! ఎవరో ఆవిడ చెయ్యెత్తి వద్దు వద్దంటూ ఇటే వస్తోందిరా..!

వసంత : ఆర్య చారుదత్తా! ఏవింటిదంతా? (వీపుమీద పడుతుంది) (చారుదత్తుడు లేస్తాడు, వసంతసేన, భిక్షువు అతనికాళ్ళపై పడతారు)

భిక్షు : ఆర్యచారుదత్తా! ఏవింటిదంతా?

చండాల : ఏవింటీ? వసంతసేనా?... ఇంకా నయం.. ఈ మహానుభావుణ్ణి చంపాం కాదు!

భిక్షు : ఒరేయ్!... చారుదత్తులవారు బ్రతుకుతారంటావా?

చండాల : నూటేళ్ళు బ్రతుకుతారు!

వసంత : మళ్ళీ జన్మెత్తాను!

చండాల : రారా!... ఈ సంగతి ఎగ్గింసేత్తున్న రాజుగోరికి సెబుదాం... (నిష్క్రమిస్తారు)

శకార : (భయంతో వణికిపోతూ) ఇది మళ్ళీ ఎలా బతికింది?.. అయితే నా ప్రాణాలు పోయినట్లే.. ఇక పారిపోవటం తప్ప గత్యంతరం లేదు! (పారిపోతాడు)

చండాల : వసంతసేనను చంపినవాణ్ణి చంపమని కదా మనకి రాజుగోరి ఆగ్గె!.. ఆణ్ణి పట్టుకోవాల!.. పారిపోతున్నోణ్ణి పట్టుకోవాల!...

చారు : (ఆశ్చర్యంగా) కత్తి ఎత్తి మృత్యుముఖంలోకి పోతున్న నన్నాపిన ఈమె ఎవరు? ఈమె ఇంకో వసంతసేనా? ఆ వసంతసేనేనా? నాకోసం స్వర్గంనుంచి దిగొచ్చిందా? లేకపోతే ఈమె వసంతసేనని భ్రాంతిపడుతున్నానా?

వసంత : ఆర్య చారుదత్తా!.. ఎవతె వల్ల నీకీ దుఃస్థితి వచ్చి పడిందో ఆ పాపిష్ఠిదాన్ని నేనే!

–నేపథ్యంలో అంతా–

ఆశ్చర్యం!... ఆశ్చర్యం!... వసంతసేన బ్రతికే ఉంది!

చారు : ప్రేయసీ!... వసంతసేనా!... నువ్వేనా?

వసంత : నేనే స్వామీ!

చారు : ఏమిటీ వసంతసేనా?... నిజంగా వసంతసేనే! నీకారణంగా చావబోయే నన్ను నువ్వే జీవింపజేయటం ఎంత వింత? ప్రేమకున్న శక్తి అది! (భిక్షువును చూస్తూ) ఈయనెవరు?

భిక్షు : ఆర్యచారుదత్తా!.. మీరు నన్ను గుర్తుపట్టలా? ఆనాటి మీపాద సంవాహకుణ్ణి... జూదగాళ్ళు నన్ను బంధిస్తే తమకు ఆత్మీయుణ్ణని నన్నీమె తన ఆభరణంతో నన్ను వారి బారి నుండి కాపాడింది... అపుడు జూదంపై విరక్తి కలిగి బౌద్ధ భిక్షువునయ్యాను... శకట పరివర్తనంతో పుష్పకరండక జీర్ణోద్యానాన్ని చేరిన ఈమెను ఆ పాపాత్ముడు శకారుడు తన్ను తిరస్కరించిందని గొంతు నులిమి చేంపబోవటం నా కళ్ళారా చూసేను! (నేపథ్యంలో కలకలం)

ఆర్యక మహారాజుకీ జై..! ఆర్యక మహారాజుకీ జై అనే నినాదాలు!

శర్విల : మహాజనులారా! నేను దుష్టుడైన పాలక మహారాజును వధించి ఆయన స్థానంలో నా మిత్రుడైన ఆర్యకుని ఈ ధాత్రికి మహారాజుగా పట్టాభిషిక్తుని చేశాను.. వధ్య శిలపై ఉన్న ఆర్య చారుదత్తుని విముక్తుణ్ణి చేయమని ఆర్యకమహారాజు మొదటి ఆజ్ఞ! (చేప్పట్లు) ఆర్య చారుదత్తా!... అభివాదయే!...

చారు : తమరెవరు?

శర్విల : ఆనాడు తమ ఇంటికి కన్నంవేసి నగల పేటిక నపహరించిన మహాపాపిని... శరణువేడుతున్నాను...



చారు : అలా అనకు... దానివల్ల నాకు మేలే జేరిగింది. నేరం ఒప్పుకొని నాకు నిందను తప్పించావు! (కౌగిలించు కొంటాడు)

శర్విల : మఱొక శుభవార్త!... ఆనాడు వసంతసేనకోసం పంపిన నీ బండినెక్కి వచ్చి నిన్ను శరణువేడిన ఆర్యకుడే నేడు దుష్టుడైన పాలకుణ్ణి యజ్ఞపశువును వధించినట్లు వధించాడు...

చారు : పాలకుడు గొల్లపల్లెనుంచి రావించి బంధించిన ఆర్యకుని కారాగారం నుంచి విముక్తిణ్ణి చేసింది నువ్వేగా?...

శర్విల : అవును!...

చారు : చాలా సంతోషం!...

శర్విల : ఉజ్జయినికి రాజైన వెంటనే వేణా నదీతీరంలో ఉన్న కుశావతీ మండలాధిపత్యాన్ని తమకు కానుకగా సమర్పించారు... నీ స్నేహితుని మొదటి కానుకను స్వీకరించే వలసిందిగా ప్రార్థన.. ఒరేయ్! పాపాత్ముడు శకారుణ్ణి బంధించి తీసుకు రండిరా!

ఒకగొంతు : (నేపథ్యంలో) శర్విలకులవారి ఆజ్ఞ!

(చేతులు వెనక్కి విఱిచి కట్టిన శకారుని భటులు తీసికొని వస్తారు)

శకార : (తనలో) తప్పించుకుపోవటానికి వీల్లేకుండా రాచభటులు నన్ను బంధించారు... ఇప్పుడు నాకెవరు రక్ష? శరణాగత రక్షకుడని చారుదత్తునికి ప్రసిద్ధి.. ఆర్య చారుదత్తా!.. రక్షించు... రక్షించు...

నేపథ్యంలో : ఆర్యచారుదత్తా!... ఈ దుష్టుణ్ణి కాపాడకు... వీణ్ణి వెంటనే హతమారుస్తాం!

శకార : ఆర్యచారుదత్తా!... నువ్వే దిక్కు... రక్షించు... రక్షించు...

చారు : (జాలిగా) శరణాగతునికి అభయం!

శర్విల : ఒరేయ్! వీణ్ణి చారుదత్తుణ్ణుంచి లాగేసెయ్యండిరా! (చారుదత్తునితో) ఆర్య చారుదత్తా! ఈ పాపిష్ఠివాడి కేశిక్ష వేయమంటారో ఆనతీయండి! వీణ్ణి కాళ్ళూ చేతులూ కట్టి ఈడ్చమంటారా? కుక్కలను ఉసికొలిపి కరిపించే మంటారా? శూలారోపణ చేయించేమంటారా?

చారు : నేను చెప్పినట్లు చేస్తారా?

శర్విల : తప్పకుండా!

శకార : ఆర్యచారుదత్తా! నువ్వేదిక్కు... రక్షించు.. రక్షించు... ఇటువంటి పనులు ఇకముందెప్పుడూ చెయ్యను!

– నేపథ్యంలో –

ఈ పాపాత్ముడింకా ఎలా బ్రతికున్నాడు?.. చేంపండి... చేంపండి...

(వసంతసేన వధ్యమాలను చారుదత్తుని మెళ్ళోనుంచి తీసి శకారునిపై విసురుతుంది)

శకార : అమ్మా! దయచూడు... నిన్ను మళ్ళీ చేంపను.. దయచూడు!

శర్విల : పాపిష్ఠివాణ్ణి లాగెయ్యండ్రా! ఆర్యచారుదత్తా! వీణ్ణేం చెయ్యమంటారో ఆజ్ఞాపించేండి!

చారు : నేను చెప్పినట్లే చేస్తారా?...

శర్విల : అందులో అనుమానమేముంది? తప్పకుండా మీ ఆజ్ఞానుగుణంగానే చేస్తాం!...

చారు : నిజేంగా?

శర్విల : నిజేం!



చారు : అయితే ఇతణ్ణి వెంటనే...

శర్విల : వధించేమంటారా?

చారు : కాదు కాదు... విడిచి పెట్టండి...

శర్విల : ఎందుకు?

చారు : చేసిన తప్పొప్పుకొని కాళ్ళమీద పడ్డాడు. అటువంటివాణ్ణి శస్త్రాలతో చేంపకూడదు.

శర్విల : అయితే కుక్కలతో కఱిపిస్తాం!

చారు : కాదు... ఉపకారం చేస్తేనే అది వాడిపట్ల వధ!

శర్విల : అయితే ఏం చేయమంటారో చెప్పండి!

చారు : అయితే ఇతణ్ణి విడిచిపెట్టండి...

శర్విల : విడవండ్రా!...

శకార : హమ్మయ్యా!.. బతికానురా!... (భటుల్తో నిష్క్రమిస్తాడు)

(మైత్రేయుడు, రదనిక, ధూతాదేవి ప్రవేశిస్తారు)

మైత్రే : ఆర్య చారుదత్తా! స్వస్తి...

చారు : మైత్రేయా.. రా.. .(కౌగిలించుకొంటాడు)

రదనిక : విధివిలాసం ఎంత విచిత్రమైంది!.. ఆర్య చారుదత్తా! ప్రణామాలు (కాళ్ళపై పడుతుంది)

చారు : (వీపుపై చేత్తో తట్టి) లే రదనికా!.. లే...

ధూత : (చారుదత్తుని పాదాలను కళ్ళకద్దుకొని వసంతసేనను చూసి) నువ్వు క్షేమంగా ఉండటం అదృష్టం! సోదరీ!...

వసంత : ఆప్యాయతతో నిండిన నీఆపిలుపే నాఅదృష్టం! (ఇద్దఱూ కౌగిలించుకొంటారు)

శర్విల : ఆర్యచారుదత్తున కీనాటికి భగవదనుగ్రహంవల్ల బంధుమిత్రులతో కలయిక చేకూరింది.

చారు : మీ అందఱి దయవల్ల...

శర్విల : (వసంతసేనను మేలిముసుగుతో సత్కరించి) వసంతసేనా! ప్రీతుడైన ఆర్యకమహారాజు మిమ్ము ఆర్యచారుదత్తుని 'కులకాంత'గా గౌరవిస్తున్నారు!

వసంత : కృతార్థురాలినైనాను!

★★★

# ముద్రారాక్షసం

సంస్కృతమూలం : **విశాఖదత్తుడు**

రంగస్థలకృతి : **డాక్టర్ రామవరపు శరత్‌బాబు**

# ఇందలి పాత్రలు

**పురుషులు**

1) సూత్రధారుడు
2) చాణక్యుడు
3) శార్ఙ్గరవుడు
4) నిపుణకుడు
5) సిద్ధార్థకుడు (వజ్రలోముడు)
6) చందనదాసు
7) విరాధగుప్తుడు (జీర్ణవిషుడు)
8) రాక్షసుడు
9) జాజలి
10) ప్రియంవదకుడు
11) బుఌకథకుడు
12) శకటదాసు
13) వైహీనరి
14) చంద్రగుప్తుడు
15) వైతాళికుడు
16) కరభకుడు
17) ద్వారపాలకుడు
18) ఒక పురుష కంఠం (నేపథ్యం)
19) మలయకేతువు
20) భాగురాయణుడు
21) జీవసిద్ధి (క్షపణకుడు)
22) భాసురకుడు
23) భటుడు
24) సిద్ధార్థకుడు (బిల్వవక్త్రుడు)
25) ఆర్తపురుషుడు
26) చందనదాసుకొడుకు (ఐదేళ్ళ బాలుడు)

**స్త్రీలు**

1) నటి
2) శోణోత్తర
3) ప్రతిహారి (విజయ)
4) మాలిని



# ముద్రారాక్షసం

## ప్రయోక్త

సహృదయ శిరోమణులకు సాధువాదం... విశాఖదత్తమహాకవి సంస్కృతంలో వ్రాసిన ముద్రారాక్షస నాటకాన్ని తెలుగు రంగస్థలిపై చూడాలని ఎన్నాళ్ళుగానో ఎన్నేళ్ళుగానో ప్రేక్షకులెదురుచూస్తున్నారు... దిగ్దంతులవంటి పండిత ప్రకాండులెంతోమంది దీనికి తెనుగు సేతను సంతరించినా ప్రేక్షకుల పుణ్యం పండలేదు... సమకాలీన సామాజికుని దృష్టిలో పెట్టుకొని డా॥రామవరపు శరత్‌బాబు చేసిన ఈ తెనుగు సేతను మీముందుంచేటానికి సాహసిస్తున్నాం.. నాట్యకళాతత్త్వ విదులైన మీ వంటి సహృదయసామాజికసమక్షంలో ప్రదర్శించేటం కంటే మా కృషికి వేఱే పరమార్థమేముంటుంది? ఇది చారిత్రకేతి వృత్తంతో కూడిన నాటకం. అశేష శేముషీ ధురంధరుడైన చాణక్యుని పేరు వినని వారంటూ ఎవరూ ఉండరు. విష్ణుగుప్తుడు, కౌటిల్యుడు ఆయనకున్న నామాంతరాలు. ప్రసిద్ధ అర్థశాస్త్ర రచయితగా ప్రపంచ ఖ్యాతి చెందిన మహామహుడు. దుర్వినీతిపరులైన నవనందులు భోజనవేళ ఆయన్ని అవమానిస్తే ఆ రాజ్యాన్ని కూలద్రోసి కాని తన శిఖను ముడివేయనని నిండుసభలో ప్రతిజ్ఞచేసి, నిర్వహణానంతరం ఆ మహారాజుకు మురవలన కలిగిన చంద్రగుప్తునికి పట్టాభిషేకం జరిపిస్తాడు. అయితే నందవంశానికెంతో విశ్వాసపాత్రుడు అఖండప్రజ్ఞాపరాయణుడైన మంత్రిపేరు రాక్షసుడు. అచంచల స్వామిభక్తి పరాయణుడైన రాక్షస మంత్రి చాణక్యుని పథకాలు పాఱకుండా ప్రయత్నిస్తూ ఉంటాడు. అంతటి రాక్షసమంత్రి చంద్రగుప్తునికి మంత్రి అయితేనే చంద్రగుప్తుని రాజ్యం సుస్థిరమౌతుందని చాణక్యుని తలపు. మహామేధావులైన చాణక్య, రాక్షసుల ఎత్తులు, పైఎత్తులతో, అపరాధపరిశోధకాంశాలతో ఎంతో ఉద్వేగభరితంగా ఉత్కంఠా పూరితంగా, శృంగార రసస్పర్శైనా లేకుండా సాగిపోయేనాటకం ఈ ముద్రారాక్షసం. ఒక బొట్టు రక్తపాతమైనా లేకుండా తన అఖండ ప్రజ్ఞాపాటవంతో రాక్షసుని చంద్రగుప్తునికి మంత్రిని చేసి తాను తపోవనానికి కదలిపోయిన నిస్స్వార్థమూర్తి చాణక్యుడు. 'ముద్ర' అంటే అంగులీయకం – ఉంగరం అని అర్థం. రాక్షసమంత్రి ఉంగరాన్ని ఒక నిపుణుడైన గూఢచారితో గ్రహించి దాని సహాయంతోనే రాక్షసమంత్రి ఎత్తుల్ని చిత్తు చేయటం ఇందులోని కథాంశం. కనుక దీనికి ముద్రారాక్షసమనే పేరు వచ్చింది. దేశవిదేశ భాషల్లో దీనికెన్నో అనువాదాలుండటమే కాక జర్మనీలో ఎన్నో ప్రదర్శనలకు నోచుకుంది ఈ నాటకం. తిలకించేండి.

## మొదటిఅంకం

(ముడి విడిపోయిన జుట్టు సవరించుకొంటూ చాణక్యుడు ప్రవేశిస్తాడు)

చాణ : (క్రోధంతో) ఆఁ!. ఎవడురా వాడు?నేనుండగానే చంద్రగుప్తుని పట్టుకోదలచేవాడు? ఆవులించిన సింహం నోట్లో కోఱ పెకలించేటం లాంటిదే చంద్రగుప్తుని పట్టుకో చూడటం! నందవంశానికి నల్లత్రాచువంటి నా శిఖాగ్రంథిని ఎవడురా విప్ప సాహసించేది? నంద వంశాటవీ దావాగ్ని అయిన నా క్రోధాగ్ని దరిచేరితే శలభాల్లా మాడిపోతారు... (అటూ ఇటూ తిరిగి కోపాన్నణచుకొని శార్ఙ్గరవా!.. శార్ఙ్గరవా!..

శార్ఙ్గరవుడు : గురుపాదులకభివాదాలు!

చాణ : ఆయుష్మాన్ భవ!

శార్ఙ్గ : ఏదో వ్యాకులపాటుతో ఉన్నట్లున్నారు! ఈ వేత్రాసనంపై ఒకింత విశ్రమించేండాచార్యా!

చాణ : ఈ విష్ణుగుప్తునికి విశ్రాంతా? ఇప్పట్లో అది సాధ్యమయ్యేట్లు కనిపించేటం లేదు! (కూర్చొని) శార్ఙ్గరవా...ఈ లోకులు అసాధ్యులు సుమా! నందవంశ వినాశానికి ఉగ్రుడైన రాక్షస మహామంత్రి పర్వతేశ్వరుని పుత్రుడైన మలయకేతువుని చేరదీసి రాజ్యాన్నంతా ఇప్పిస్తానని ప్రలోభపెట్టి చంద్రగుప్తుని పై దండయాత్రకు పథకాలు సిద్ధం చేస్తున్నట్లు పసికట్టేశారు!

శార్ఙ్గ : తమ శక్తి యుక్తుల ముందు శత్రువుల పన్నాగాలేపాటి వాచార్యా?

చాణ : బాగాచెప్పావ్!... హుఁ! ఈ చాణక్యుని ప్రతిభ ప్రతిపక్షుల కనుభవమైనా అర్థం కానట్లుంది. కానీ రాక్షసామాత్యుని



లోబఱచుకోనంత వఱకు, నందవంశం నిర్మూలించి ఏం లాభం? చంద్రగుప్తుని రాజ్యాని కెక్కడ సుస్థిరత్వం?. అయితే రాక్షసమంత్రి ప్రభుభక్తిమాత్రం స్పృహణీయమైంది సుమా! అందుకే అమాత్యరాక్షసుడంటే నాకంత అభిమానం!...

శార్ఙ్గ : అంతటి ఆగర్భశత్రువును చంద్రగుప్తులకు అమాత్యునిగా నియమించాలనుకొంటున్నారా?.. అదెలా సాధ్యం స్వామీ! అంతటి స్వామి భక్తి పరాయణుడు...

చాణ : కనుకనే సాచివ్యానికి అర్హుడు... నందవంశంలో ఏమాత్రం అంకురం మిగిలి ఉన్నా అతణ్ణి వృషలుని మంత్రిత్వానికి ఒప్పించేటం కాని నందవంశ పునః ప్రతిష్ఠాప్రయత్నాన్ని అవరోధించేటం కాని జేరిగే పని కాదు! అందుకే పా..పం! నందవంశాంకురం సర్వార్థసిద్ధి తపోవనంలో ఉన్నా చేంపించాను! అయినా రాక్షసుడు మలయకేతువు సహాయంతో చంద్రగుప్తుని నిర్మూలించాలని ప్రయత్నిస్తున్నాడు. (ఆకాశంలోకి చూస్తూ) సాధు!.. అమాత్యరాక్షసా! సాధు.. భళీ!. .ధనాశతో ప్రభువును సేవించే ప్రజల్ని చూశాం!.. ఆ ప్రభువుకు అనర్థం వాటిల్లినా భవిష్యదాశతో అతణ్ణే సేవించే ప్రజల్నీ చూశాం! కానీ, స్వామి స్వర్లోకవాసి అయినా నీవంటి నిస్స్వార్థస్వామిభక్తి పరాయణుల్ని ఎక్కడా చూడలేదు...

శార్ఙ్గ : మఱి, అంతటి స్వామిభక్తి పరాయణుణ్ణి స్వాధీనం ...

చాణ : చేసికోవటానికే అహోరాత్రులూ శ్రమిస్తున్నాను... అందుకే-చంద్రగుప్త పర్వతకుల్లో ఎవరు నశించినా చాణక్యునికి అపకారం చేసినట్లే అవుతుందని విషకన్యను-పాపం!.. మాకు అత్యంత ఆప్తుడూ, ఎంతో

సహాయకారీ అయిన పర్వతేశ్వరునిపై రాక్షసుడే ప్రయోగించి చేంపించాడనే జనాపవాదాన్ని ప్రజల్లో ప్రచారం చేయించాను... ప్రజలకీవిషయంలో ఇంకా నమ్మకం కలిగించేటానికి పర్వతేశ్వరుని కొడుకు మలయకేతువుతో "నీతండ్రిని చాణక్యుడే చేంపించాడని రహస్యంగా భాగురాయణునితో చెప్పించి, భయపెట్టి వాడు పలాయన మంత్రం పఠించేట్లు చేశాను... రాక్షస సహాయంతో మలయ కేతువు దండెత్తివచ్చినా అతణ్ణి వారించేటం నా ప్రతిభకసాధ్యమైందేమీ కాదు. కానీ – అలా వారిస్తే మేమే పర్వతకుని చేంపించామనే అపకీర్తి మాయని మచ్చేగా నిలుస్తుంది.

శార్ఙ్గ : మఱి ఇప్పటి కర్తవ్యం?

చాణ : స్వపక్ష పరపక్షాల్లో అనురక్తులెవరో, విరక్తులెవరో తెలిసికోవటానికి భిన్న భిన్న వేష భాషాచారాలు జీర్ణించుకొన్న గూఢచారుల్ని మాఱు వేషాల్లో యావద్భారతంలో సంచరించేటానికి నియోగించాను. ఈలోగా కుసుమ పురంలో నందామాత్యులు, నందమిత్రులు చేసే గూఢాలోచనల్ని వమ్ముచేయటానికి ప్రయత్నం జేరుగుతోంది... నా సహాధ్యాయి ఇందుశర్మ క్షపణక వేషంలో రాక్షసునికి ఆంతరంగిక మిత్రుడైనాడు.. అతనివల్ల ఒక మహాకార్యం నెఱవేఱాలి.

(యమపటంతో గూఢచారి ప్రవేశం)..

– పాట –

నిపుణకుడు : **యములోరికెట్టండి దండాలూ...**
**సెదిరిపోయేనండి గండాలూ...**
**సిల్లరా రాల్లను సేవిత్తే సిత్తుసిత్తైపోయి సచ్చేమూ**



**కట్టాలు ఎన్నైన గట్టెక్కి బత్తితో కొలిసేత్తే బతకొచ్చూ**
**అందరీ పానాలు తీసేటీ అయ్యోరి కెడదాము దండాలు ॥యము॥**

శార్ఙ్గ : (వాకిలి వద్దకు వచ్చి) ఏయ్!.. ఆగాగు... సరాసరి లోపలికొచ్చేస్తున్నావేఁమిటి?

నిపుణ : హంహెూ బమ్మన.. ఎవన్దీ ఇల్లు?

శార్ఙ్గ : మా ఆచార్యులు ఆర్య చాణక్యుల వారిది!

నిపుణ : గట్లనామల్ల! అయితే పికర్నేదు–లోనికి పోనియ్మల్ల... మీ పంతులుగోరికి యమపటం సూపించి దరమాలు సెప్పాలె...

శార్ఙ్గ : ఛీ! మూర్ఖుడా! ఆయనకే ధర్మోపదేశం చేసేటంత వాడివిరా?

నిపుణ : హంహెూ బమ్మన! అట్లనబాకు దొరా! అందరికీ అన్నీ తెలిసేదెట్టా? మా అసుంటోరికి క్యూడా కొన్ని తెలత్తవి దొరా! అవి మీదొరోరికి తెలవ్వు!

శార్ఙ్గ : మూఢుడా! సర్వజ్ఞులైన మా గురువు గారికే తెలియనివి నీకు తెలుస్తాయట్రా?

నిపుణ : హంహెూబమ్మన! మీ పంతుల్కి అన్నీ తెలిత్తే సెందురుడంటే ఇట్టంలేని వారెవరో సెప్పుకోమను సూత్తాం!...

శార్ఙ్గ : ఏవిఁటీ అసంబద్ధపు ప్రేలాపన?

నిపుణ : నాది పేలాపన కాదు దొరా! మీ అయ్యోరునడిగి సూడండి! అయ్యకి తెలత్తది!

చాణ : (విని, తనలో) ఓహెూ! చంద్రగుప్తుని పట్ల విరక్తులెవరో తెలిసికొని రమ్మని నేను పంపిన గూఢచారి నిపుణకుడై ఉండాలి... (పైకి) శార్ఙ్గరవా! అతణ్ణి లోనికి తీసుకురా!

శార్ఙ్గ : చిత్తం గురుదేవా! (లోపలికి తీసికొనివస్తాడు)

నిపుణ : దొరకి జయం గలగాలె! (చాణక్యుని కనుసైగతో శార్ఙ్గరవుడు నిష్క్రమిస్తాడు)

చాణ : నాయనా! నిపుణకా! కుశలమా? రా! కూర్చో!

నిపుణ : చిత్తం! (క్రింద కూర్చుంటాడు)

చాణ : ఊఁ! ఇప్పుడు చెప్పు.. నువ్వెళ్ళిన పనేమైంది? ప్రజలంతా చంద్రగుప్తుని పట్ల అనురక్తులే కదా!

నిపుణ : ప్రజల అసంతృప్తిని మీరు తొలగిస్తూ ఉంటే చంద్రగుప్త సార్వభౌములకు ప్రజానురాగానికి కొదువేముంటుంది? అయినా రాక్షసులవారితో పూర్వమైత్రికల ముగ్గురు మాత్రం చంద్రగుప్తుల వైభవాన్ని సహించలేక పోతున్నారు...

చాణ : "వినాశకాలే విపరీతబుద్ధిః" ఊఁ... ఎవరువాళ్ళు?

నిపుణ : తమ శత్రుపక్షంపై పక్షపాతం కలవారిలో మొదటివాడు జీవసిద్ధి అనే బౌద్ధ సన్యాసి!

చాణ : (సంతోషంతో తనలో) నేను పంపిన గూఢచారే జీవసిద్ధి! (పైకి) ఊఁ! రెండోవాడు?

నిపుణ : రెండోవాడు రాక్షసుని ప్రియ మిత్రుడు శకటదాసు!

చాణ : (నవ్వి, తనలో) ఆఁ!.. వాడెంత? అయినా అల్పుడైనా శత్రువుని ఉపేక్షించే గూడదు! వాడితో కపట స్నేహం చేయమని సిద్ధార్థకుణ్ణి పంపే ఉంచాను.. (పైకి) ఊఁ! మఱి మూడోవాడు?

నిపుణ : మూడోవాడు అమాత్య రాక్షసులవారి ఆఱోప్రాణం! చందనదాసనే రత్నాలవ్యాపారి.

చాణ : అంతటిగాఢమైత్రా వారిది?

నిపుణ : చిత్తం! ఎంతటి ప్రాణస్నేహం కాకపోతే అమాత్యరాక్షసులు తన కుటుంబాన్ని వారింట్లో వదిలివెడతారు?



చాణ : ఊఁ!... ఆ సంగతి నీకెలా తెలిసింది?

నిపుణ : ఇదిగో రాక్షసులవారి ముద్రాంగుళీయకం!.. ఇదే మీకు సర్వం నివేదిస్తుంది!

చాణ : (ఉంగరాన్ని తీసికొని దానిమీది'అమాత్యరాక్షస' అనే అక్షరాల్ని చేదివి సంతోషంతో తనలో) ఓహ్! రాక్షసుడిక నా చేతిలో చిక్కినట్లే! (పైకి) ఇది నీకెలా దొరికిందో వివరంగా చెప్పు!

నిపుణ : పురజనుల చిత్తవృత్తిని కనిపెట్టమనే తమరి ఆజ్ఞను పాటించి ఎవరికీ అనుమానం రాకుండా ఈ యమపటాన్ని ప్రదర్శిస్తూ ఊరంతా తిరుగుతూ రత్నాలవ్యాపారి చందనదాసింటికి వెళ్ళేను... ఆ ఇంటి ముందీ పటం పఱచి పాటలు పాడుతున్నాను.

చాణ : ఆఁ.. తరువాత?

నిపుణ : ఆ ఇంట్లోంచి దాదాపు ఐదేళ్ళ కుఱ్ఱాడు కళ్ళింతింత చేసికొని నాదగ్గఱకు రాబోయాడు.

చాణ : ఊఁ!

నిపుణ : అంతలోనే 'అయ్యో పిల్లాడు బయటకు వెళ్ళిపోయా" దని కంగారుగా అఱచిన స్త్రీల కంఠాలు వినిపించాయి. అప్పుడొకామె ఇవతలికి వచ్చి పిల్లాణ్ణి మందలిస్తూ లోపలికి తీసుకుపోయింది.

చాణ : అయితే?

నిపుణ : అలా తీసికెళ్ళే తొందరలో ఆమె వేలికున్న ఉంగరం జారి దొర్లుకుంటూ నాముందు పడింది... ఆ కంగార్లో ఉంగరం జారిపడటం ఆమె గమనించలేదు. దానిమీద అమాత్య రాక్షసులపేరు చూసి తీసికొని వచ్చి తమకు సమర్పించాను. ఇదీ జరిగింది..

చాణ : మంచిది... ఇక నువ్వు వెళ్ళొచ్చు! త్వరలోనే నీ శ్రమకు తగ్గ పారితోషికం లభిస్తుంది!

నిపుణ : చిత్తం!.. (నిష్క్రమిస్తాడు)

చాణ : శార్ఙ్గరవా!

శార్ఙ్గ : (ప్రవేశించి) ఆచార్యా!...

చాణ : వ్రాత పరికరాలు తీసుకురా!...

శార్ఙ్గ : (లోనికి వెళ్ళి వాటిని తీసికొనివచ్చి) ఇవిగో ఆచార్యా!...

చాణ : (తనలో) ఏం వ్రాయను?.. ఈ లేఖతోనే రాక్షసుని జయించాలి!...

శోణోత్తర : ఆర్యులకు జయం!...

చాణ : (తనలో) శుభశకునం! (పైకి) శోణోత్తరా!... ఏం పని మీదొచ్చావ్?

శోణో : ప్రభువులు పర్వతేశ్వరులకు పారలౌకిక క్రియలాచరించాలని సంకల్పించారు. తమరు అనుమతిస్తే ఆ ప్రభువు ధరించిన ఆభరణాలని బ్రాహ్మణులకు దానం చేయ సంకల్పించామని మీతో మనవి చేయుమన్నారు...

చాణ : మంచిది.. అవి చాలా విలువైన ఆభరణాలు కనుక మంచి విప్రులకే దానం చేయాలి... అటువంటి విప్రోత్తముల్ని మేమే స్వయంగా పరీక్షించి పంపుతామని చెప్పు!...

శోణో : చిత్తం!.. (నిష్క్రమిస్తుంది)

చాణ : (వ్రాత పరికరాల్ని చూస్తూ ఆలోచిస్తూ) ఉహుఁ! ఇది లేఖకి చివర ఉంటేనే బాగుంటుంది. ఎలా మొదలెట్టాలి? (ఆలోచించి) ఆఁ! అదీ.. ఆ మ్లేచ్ఛ రాజుల్లో కులూతేశ్వరుడు చిత్రవర్మ, మలయదేశాధీశుడు సింహనాదుడు, కాశ్మీరాధిపతి పుష్కరాక్షుడు, సింధునృపతి సింధుసేనుడు, పారశీక ప్రభువు మేఘుడు, ఈ ఐదుగురూ రాక్షసునికి ఎంతో ప్రీతిపాత్రులని గూఢచారుల వర్తమానం!... శత్రుసేనలో దిగ్దంతులైన వీరిపేర్లు చిత్రగుప్తుడు చెఱిపివేయటానికి వీలుగా వ్రాయాలి! అహఁ!... నేను వ్రాయను.. శార్ఙ్గరవా!...



శార్ఙ్గ : ఆచార్యవర్యా!

చాణ : ఎంత పట్టి పట్టి రాసినా నా అక్షరాలు కుదురుగా ఉండవు.. అందుకని, (దగ్గఱకు రమ్మని చెవిలో రహస్యం చెప్పి) ఈ మాటలు శకటదాసుచేత వ్రాయించి ఇమ్మని నా మాటగా సిద్ధార్థకునితో చెప్పు!.. ఇది నేను వ్రాయిస్తున్నట్లు తెలియ గూడదు సుమా!..

శార్ఙ్గ : ఆ సంగతి తమరు ప్రత్యేకంగా చెప్పాలా?... (నిష్క్రమిస్తాడు)

చాణ : (తనలో) హుఁ! మలయకేతునిక జయించినట్లే!...

సిద్ధార్థకుడు : (ప్రవేశించి) ఆచార్యా! జయం జయం!... ఇదిగో శకటదాసుతో రాయించిన లేఖ, చిత్తగించేండి!

చాణ : (చూసి) ఎంత చేక్కగా ఉన్నాయి అక్షరాలు! ఈ ఉంగరంతో దీనిపై ముద్రవేయి...

సిద్ధా : (ముద్రవేసి) ఇదిగో!

చాణ : సిద్ధార్థకా! రా...రా...!నీకోసమే ఎదురు చూస్తున్నా...ఎంతో ఆప్తులు, ఆంతరంగికులవల్ల జేరుగవలసిన పని నీకప్పగిస్తున్నాను!

సిద్ధా : తమ దయ!.. ఈ దాసుని వల్ల కాగల కార్యం ఆనతివ్వండి!

చాణ : ఊఁ!... జాగ్రత్త! ఈ కార్యనిర్వహణలో నువ్వెంతో అప్రమత్తుడివై ఉండాలి సుమా!

సిద్ధా : చిత్తం!.. సెలవివ్వండి!

చాణ : శకటదాసుని ఉరికంబం ఎక్కిస్తారు... అక్కడి తలారులకు నిన్నుచూసి శకటదాసుని విడిచిపెట్టాలని ముందే తెలియాలి... వధ్యస్థానానికి నువ్వు ఖడ్గపాణివై వెడతావు.. తలారులతో యుద్ధం చేసినట్లు నటిస్తావు... నీ ధాటికి తట్టుకోలేక వారు పాటిపోతారు... నువ్వు శకటదాసుని రక్షించి తీసికొని వెళ్ళి రాక్షసామాత్యునికి అప్పగిస్తావు... రాక్షసుడు తన ప్రాణమిత్రుని ప్రాణాల్ని కాపాడినందుకు సంతోషించి నీకు బహుమానం ఇస్తాడు. దాన్ని స్వీకరించు, కొంతకాలం ఎంతో విశ్వసనీయంగా రాక్షసమంత్రిని సేవిస్తావు. ఆ తర్వాత...

సిద్ధా : ఆనతివ్వండి...

చాణ : ఆ తరువాత... తరువాత.. .ఊం!.. ఇలారా!.. .(రహస్యం చెప్పి) ఇదీ జేరుగవలసింది.

సిద్ధా : మరి సెలవా? ఆచార్యా!

చాణ : వెళ్ళిరా!.. (సిద్ధార్థకుడు నిష్క్రమిస్తాడు) శార్ఙ్గరవా!.. (శార్ఙ్గరవుడు ప్రవేశిస్తాడు)

రత్నాల వ్యాపారి చందనదాసుని మేమొకసారి చూడగోరుతున్నాం!...

శార్ఙ్గ : చిత్తం! (వెళ్ళి చందనదాసునితో ప్రవేశిస్తాడు) శ్రేష్ఠిగారూ! ఇటు.. ఇటు...

చందన : (తనలో) దయాహీనుడు చాణక్యుడు కబురు పంపాడంటే ఏ నేరం చేయని వాడికైనా గుండెల్లో దడే! అటువంటప్పుడు నా సంగతిక చెప్పేదేముంది?... అందుకే దుర్మార్గుడైన చాణక్యుడెప్పుడో మన ఇంటిని సోదా చేయించేక మానడు, అమాత్యరాక్షసుని కుటుంబాన్ని మాత్రం ఎంతో జాగ్రత్తగా



కాపాడాలని ధనసేన ప్రముఖుల్తో చెప్పే వచ్చాను... నాకెలాగూ జేరుగవలసింది జేరక్క మానదు...

శార్ఙ్గ : శ్రేష్ఠిగారూ! ఇటు.. ఇటు...

చందన : అయ్యా... వస్తున్నా...(చందనదాసును నిలబెట్టి శార్ఙ్గరవుడు ముందుకు వెళ్ళి)

శార్ఙ్గ : ఆచార్యా! చందనదాసశ్రేష్ఠిగారు వచ్చారు!...

చందన : ఆర్యులకభివాదాలు!...

చాణ : స్వాగతం!.. శ్రేష్ఠిగారూ!.. కుశలమా?... అయ్యో! ఇంకా నుంచునే ఉన్నారు!... రండి... రండి... ఈ ఆసనాన్నధిష్ఠించేండి!...

చందన : (నమస్కరించి) అమాత్యవర్యులు మన్నించాలి!... మా వంటి అల్పులకు అగ్రాసనాన్ని సమర్పించేటం ధర్మమా?... నేనిక్కడ కూర్చుంటాను (నేలపై కూర్చోబోతాడు)

చాణ : అమ్మమ్మ!... అలా కాదు!... మీవంటి కోటీశ్వరులకు అగ్రాసనం కాకపోతే సమర్పించాల్సింది దర్భాసనమా? ఈ ఆసనంపైనే కూర్చోండి!...

చందన : (తనలో) ఈ దుర్మార్గుడు అప్పుడే దేనికో ప్రస్తావన చేస్తున్నాడు... (పైకి) చిత్తం!... (కూర్చుంటాడు)

చాణ : ఆం!.. అదీ!.. ఏమిటీ విశేషాలు? మీ వ్యాపారం సలక్షణంగా సాగుతోంది కదా! లాభాలు సంతృప్తికరంగా సమకూరుతున్నాయి కదా!

చందన : (తనలో) అత్యాదరం అనర్థశంకను కలిగిస్తోంది.. (పైకి) ఆం!.. ఏదో తమదయవలన అంతా సమృద్ధిగానే ఉంది!

చాణ : ఊం!... చంద్రగుప్తుని పరిపాలనలోని లోపాలు ప్రజానీకానికి పూర్వరాజుల్ని జ్ఞప్తికి తేవటం లేదు కదా!

చందన : అమ్మమ్మా! ఎంతమాట? శ్రీవారి పాలనలో ప్రజలంతా శరత్పూర్ణిమ నాటి వెన్నెల్లో వలె హాయిననుభవిస్తున్నారు!...

చాణ : అహాఁ!... అలాగా!... అయితే ప్రజలంతా సంతోషిస్తున్నారంటావ్!...

చందన : అందుకు సందేహమా?...

చాణ : తమ పాలనలో సంతోషిస్తున్న ప్రజల నుండి ప్రభువు లొకప్పుడు ప్రతిఫలాన్ని కోరుతారు!

చందన : సెలవియ్యండి ఎంతకావాలో? తమఆజ్ఞమేఱకు ధనరాశల్ని పంపుతాను!...

చాణ : (కోపంతో) శ్రేష్ఠీ! ఇది చంద్రగుప్తుని రాజ్యం! ధనధాన్యాల్ని దోచుకోవటానికిదేమైనా నందరాజ్యమఁటయ్యా?... ధనపిశాచి నందుడు మీరు ధనరాశుల్ని క్రుమ్మరిస్తే సంతోషించేవాడు... చంద్రగుప్తుడలాకాదు! ప్రజలకే కష్టాలూ లేకపోవటమే ప్రభువులకానందం!...

చందన : (సంతోషంతో) తమ అనుగ్రహ విశేషం!

చాణ : మఱి, ప్రజల కేకష్టం కలగకుండా ఉండాలంటే ఏం చెయ్యాలో అడగవేమిటయ్యా?

చందన : సెలవియ్యండమాత్యవర్యా!

చాణ : ఆఁ! అలా అడుగు!... ఒక్క ముక్కలో చెప్పాలంటే ప్రభువుకిష్టం లేని పనులేవీ ప్రజలు చెయ్యకూడదు!...

చందన : అంతటి రాజద్రోహం తలపెట్టిన వాడెవరాచార్యా!...

చాణ : (కోపంగా) చందనదాసూ! ఆపు నీ కుయుక్తులు!... రాజద్రోహుల్లో నువ్వే అగ్రేసరుడివి...

చందన : శివ శివ! దర్భలకు దావాగ్నితో వైరమా?



చాణ : ఆ సంగతి తెలిసుంటే అసలింత వఱకు రానిచ్చే వాడివే కాదు!... రాజద్రోహి అమాత్య రాక్షసుని అభిజనానికి నువ్వాశ్రయం ఇవ్వలేదూ?

చందన : ఆర్యా!.. ఇది అబద్ధం! కిట్టనివాళ్ళెవరో కల్పించిన కట్టుకథ ఇది...

చాణ : సెట్టీ... భయపడకయ్యా!... విప్లవంతో రాజ్యం అల్లకల్లోలమైనప్పుడు ప్రాణభీతితో వారి కుటుంబాన్ని మనకిష్టం లేకపోయినా మన ఇళ్లలో విడిచిపోతారయ్యా!... అందులో వాళ్ళ తప్పేం లేదు... ఎటొచ్చీ వారిని దాచేటమే నేరం! ...

చందన : అవును!... అప్పట్లో అమాత్య రాక్షసుల కుటుంబం కొంతకాలం మా ఇంట్లో ఉంది!

చాణ : అయితే వాళ్ళిప్పుడేమయ్యారు?

చందన : నాకు తెలియదు మంత్రివర్యా!

చాణ : ఏవిఁటీ! నీకు తెలియదూ? మొదట్లో అంతా కిట్టనివాళ్ళ కట్టుకథన్నావు, ఇప్పుడు అప్పుడున్నారు, ఇప్పుడు లేరంటు న్నావు.. చూశావా? నీ మాటల్లో ఇంతలోనే ఎంత వ్యత్యాసమో?...

చందన : మొదట్లో ఉన్నమాటా నిజేవేఁ! ఇప్పుడు లేనిమాటా నిజేవేఁ!... ఏదో నోరు జారి!...

చాణ : చంద్రగుప్తుని పాలనలో జారుపాట్లకు తావులేదయ్యా!... అందుకని, రాక్షసుని కుటుంబాన్ని మాకప్పగించి నువ్వు నిర్దోషివి కా!...

చందన : ఇప్పుడు మా ఇంట్లో లేందే ఎలా అప్పగించేమంటారు?...

చాణ : లేరూ?.. లేరూ?.. అయితే ఎక్కడున్నారు?

చందన : ఏమో, నాకు తెలియదు!

చాణ : (నవ్వి) తెలియదూ?.. తెలియదు.. అవున్లేపాపం నీకెలా తెలుస్తుంది? చూడూ! నందుని ఈ విష్ణుగుప్తునిలా చంద్ర గుప్తుని రాక్షసుడు ఉన్మూలిస్తాడని కల్లో కూడా అనుకోకు!... (నేపథ్యంలో కలకలం) శార్ఙ్గరవా!.. ఆ కోలాహలం ఏమిటో చూడు!

శార్ఙ్గవుడు : (బయటకు వెళ్ళివచ్చి) రాజద్రోహి బౌద్ధసన్యాసి జీవసిద్ధిని అవమాన పురస్సరంగా నగరాన్నుంచి బహిష్కరిస్తున్నా రాచార్యా!

చాణ : చూశావా చందనదాసూ! రాజుకిష్టంలేని పనులు చేయటం వల్ల కలిగే అనర్థం! విద్రోహులపట్ల రాజదండన ఇంత క్రూరంగా ఉంటుంది... సెట్టీ! నీమేలుకోరి చెబుతున్నా! విను.. వినకపోతే వినాశం తప్పదు.. రాక్షసుని కుటుంబాన్ని అర్పించి నీ కుటుంబాన్ని రక్షించుకో!...

చందన : అమాత్య!... రాక్షసుల వారి కుటుంబం ఎక్కడుందో తెలియ కుండా ఎలా అప్పగించేటం? (నేపథ్యంలో మళ్ళీ కలకలం)

చాణ : మళ్ళీ ఆ గొడవేమిటో చూడు శార్ఙ్గరవా!

శార్ఙ్గ : (బయటకు వెళ్ళివచ్చి) ఇంకో రాజద్రోహి గురువర్యా!... పేరు శకటదాసట! కొఱత వెయ్యటానికి తీసికొని వెడుతున్నారు!

చాణ : చేసికొన్న వారికి చేసికొన్నంత మహదేవ! చూస్తున్నావుగా చందనదాసూ!... ద్రోహం అల్పమే అయినా శిక్షమాత్రం అనల్పం! రాక్షసామాత్యుని కుటుంబానికి నువ్వు ఆశ్రయమివ్వటం చంద్రగుప్తుడు సహించేడు... కనుక ఇతరుల భార్యాబిడ్డల్ని అర్పించి నీ భార్యాబిడ్డల్ని సంరక్షించుకో!...



చందన : అయ్యా! మీరు నన్నింక భయపెట్టక్కర్లేదు... రాక్షసామాత్యుల కుటుంబం మా ఇంట్లో ఉన్నా నేను మీకప్పగించేను ఇక లేనిదే మీకెలా అర్పిస్తాను?...

చాణ : ఇదే నీ దృఢనిశ్చయమా?...

చందన : ముమ్మాటికీ ఇదే నా తుది నిర్ణయం!...

చాణ : (తనలో) భళా! చందనదాసూ! పర రక్షణకు ఆత్మ త్యాగానికే సిద్ధపడి శిబిచక్రవర్తి వంటివాడివైనావు! (పైకి కోపంగా) దురాత్ముడా!... అయితే రాజాగ్రహాన్ననుభవించు!...

చందన : (చేయిచాచి) ఇదుగో సిద్ధంగా ఉన్నా... నీ యథాశక్తి యథేచ్ఛగా శిక్షించేవచ్చు...

చాణ : శార్ఙ్గరవా! ఈ దుష్టవ్యాపారిని బంధించమని నగర రక్షణాధికారికి నా మాటగా చెప్పు!... అహఁ! ఆగు... రక్షణమంత్రి విజయపాలకునితో ఇతణ్ణి సపుత్రకళత్రంగా బంధించి సర్వ సంపదలనూ స్వాధీనం చేసుకొమ్మని చెప్పు!... నేనీలోగా చంద్రగుప్తునితో సంప్రతిస్తాను... చంద్రగుప్తుడే ఇతనికి మరణశిక్ష విధిస్తాడు...

చందన : దైవేచ్ఛ! మిత్ర రక్షణకై ప్రాణాలర్పించేటానికి మించిన పుణ్యం కంటె ఈ జన్మకింకేం కావాలి?

శార్ఙ్గ : రావయ్యా!.. చందనదాసూ! కారాగారానికి త్రోవ ఇటు... (ఇద్దఱూ నిష్క్రమిస్తారు)

చాణ : అహ్హహ్హా!... అది!... ఇక రాక్షసుడు నాచేతికి చిక్కినట్లే! తనకోసం ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ మిత్రుని ఉపేక్షించేటంత కృతఘ్నుడు కాదు రాక్షసుడు.. కనీసం చందనదాసు ప్రాణ రక్షణకైనా తప్పక వస్తాడు...

(నేపథ్యంలో కలకలం)

శార్ఙ్గ : (కంగారుగా వచ్చి) శకటదాసుని సిద్ధార్థకుడు వధ్యస్థలం నుంచి తప్పించుకొని తీసికొని పోయినట్లు వార్త వచ్చిం దాచార్యా!...

చాణ : (తనలో) సాధు సిద్ధార్థకా!.. సాధు!.. చేక్కగా కార్యారంభం చేశావ్!.. (పైకి) ఏవిఁటీ! పాఱిపోయాడా? పట్టుకోవటానికి తక్షణం ఏర్పాట్లు చేయమని భాగురాయణునితో మా మాటగా చెప్పు!...

శార్ఙ్గ : (బయటకువెళ్ళివచ్చి ఆదుర్దాగా) భాగురాయణుడు కూడా పాఱిపోయాట్ట ఆచార్యా!

చాణ : (తనలో) ఎంత సంతోషకరమైన వార్త! (పైకి కోపంగా) ఆః!... భద్రభట, పురుషదత్త, డింగరాత, బలగుప్త, రాజసేన, రోహితాక్ష, విజయవర్మలతో తఱిమికొట్టి వీళ్ళిద్దఱినీ పట్టి బంధించమని చెప్పు!

శార్ఙ్గ : చిత్తం!... (వెళ్ళి తిరిగివచ్చి–గాబరాగా) అయ్యో!.. అయ్యో! రాజ్యమంతా రాళ్ళపాలై పోతోందాచార్యా! వాళ్ళంతా రాత్రికి రాత్రే పాఱిపోయారట!...

చాణ : (తనలో) వారికి శుభం కలుగుగాక! (పైకి) వత్సా! విచారపడకు... (లేచి ఆకాశంవైపు దృష్టిసారించి) ఈ దుష్టుడు భద్రభటుణ్ణి, తక్కినవారినీ తొందరలోనే పట్టుకుంటాను.. (తనలో) రాక్షసా!.. ఇక నువ్వెక్కడికి పోతావ్?

★★★



# రెండవఅంకం

– నేపథ్యంలో – నాగస్వరం

– పాట –

విరాధగుప్తుడు (జీర్ణవిషుడు) : **పాములోల్లమండీ – మాపెగ్గె సూదరండి**
**బలే పాములోల్లమండి**
**పాములాటె రాజసేవ – రాజుసేవె పాములాట**
**పదిమందీ కళ్ళల్లో పడిపోతామయ్యలార ॥పాము॥**
**పాములాట మంత్రకట్టు రాజుసేవ పెఱువుగుట్టు**
**పొసిగిందా బగుమానం – బెడిసిందా అగుమానం**
**॥పాము॥**

(ఆకాశం లోకి చూస్తూ) ఏంది సామే! ఏమంటున్రూ! నువ్వెవరనా?... పాములోణ్ణి సామే... అగు పడ్డంలా?... నాపేరు జిన్నిసుడంటారు.. (మళ్ళీ ఏదో విన్నట్లభినయించి) ఏవంటారు? పాముల్నాడిస్తే మేంగూడ చూత్తవంటారా? అయితే తవరేం పనిసేత్తారు సామే! ఎట్టా? రాజుగోరి కొలువులో పనంటారా? ఆః! అయితే మల్ల పాములాట సూట్టం దేనికిసామే! పెఱిపొద్దూ సూత్తానే ఉన్నారుగా సామే! మందులు మంతరాలు తెలవని పాములోడు, అంకుసం లేని మావటోడు, రాజుగోరి దయతో పొగరెక్కిన జీతగాడూ నసించి పోతారంటారు... అరె!... తమాసగుంది.. ఈన సూత్తుండగానే కానరాకుండ పోయిండు.. ఏవంతున్నరూ? ఈ బుట్టలో ఏం ఉందనా? నాకు బువ్వెట్టే పాములు సావేః! సూపీరాదంటారా? సూపీడానికేం లేదు కానీ,ఇదిసోటుగాదంతాను... తెలవలా?... పానీ ఈ ఇంట్లోకి రాకూడదూ సూపిత్తా.. (మళ్ళీ విని) ఓ.. గట్టనమల్ల! ఇది అమాచ్చరాచ్చసులోరి ఇల్లా? మా అసుంటోల్లు రాడానికి ఈల్లేదంటారా? అయితే ఏం?

పోండిసావేఁ! నాబతుక్కేం పికర్నేదు. ఈన గూడ పోయిండే.. (తనలో) ఆశ్చర్యం!... చాణక్య మంత్రాంగం వల్ల రక్షితుడైన చంద్రగుప్తుణ్ణి చూస్తే రాక్షసామాత్యుని ప్రయత్నమంతా వ్యర్థమనిపిస్తుంది. మఱి, రాక్షసుని పథకాలను అంటిపెట్టుకొన్న మలయ కేతువును చూస్తే చంద్రగుప్తుని రాజ్యం ఊడిపోవటం నిశ్చయమనిపిస్తుంది. సరే... ఇప్పుడు రాక్షసామాత్యుని దర్శించాలి...ఈ ద్వారంవద్దే వేచి ఉంటాను...

రాక్షసుడు, సేవకుడు ప్రవేశిస్తారు

రాక్షసుడు : (కన్నీటితో) అహో!.. ఏమీ దౌర్భాగ్యం? రాజనీతి, పరాక్రమం, సుగుణసంపత్తీ ఉన్నా విధివశంవల్ల వృష్ణి వంశం వలె నందవంశం నేడెంత అథోగతినొందింది! ఇప్పుడు నా ప్రయత్నాలన్నీ నీటిమీద వ్రాతలైనాయి... నాకు నేడెంత అథోగతి వాటిల్లింది? ఏవిఁటీ అజ్ఞాత వాసం? ఆశలన్నీ అడియాసలౌతున్నా ఏ నాటికైనా శత్రుసంహారం చేయగల్గితే స్వర్గాన ఉన్న నారాజు సంతోషిస్తాడనే ఆశ నన్నింకా వీడలేదు... అదినెఱ వేఱిననాడే ఈ రాక్షసుని జన్మకు సార్థకత!...

జాజలి : (ప్రవేశించి) స్వస్తి భవతే!

రాక్షస : అభివాదాలు... ప్రియంవదకా!... మాన్య జాజలికి ఆసనం తీసుకొనిరా!

ప్రియంవదకుడు : (తీసుకొనివచ్చి) ఇలా కూర్చోండి!

జాజలి : అమాత్యా! కుమార మలయకేతువు మీ ఈ స్థితికి దిగులుపడుతున్నాడు.

రాక్ష : (నిర్జీవంగా నవ్వి) నాకేం? నేను బాగానే ఉన్నానే!...



జాజలి : మీరంటే సరిపోయిందా ఆర్యా! ఎన్నాళ్ళుగా మీ శరీరం పోషణ లేకుండా ఉంది? ఉచిత సంస్కారాలు, అలంకారాలు విసర్జించి ఎన్నాళ్ళయింది?

రాక్షస : నా స్వామి లేనినాడు నాకీ అలంకారాలతో పనేముంది?

జాజలి : స్వామి గుణాలు మఱువలేనివే! అయినా మలయ కేతువు మనవిని మన్నించి అతడు పంపిన ఈ మణిహారాన్ని తమరు ధరించాలి!...

రాక్షస : మాన్య జాజలీ!.. శత్రుసంహారంచేసి కుమార మలయ కేతువును సుగాంగప్రాసాదంపై స్వర్ణసింహాసనాన్ని అధిష్ఠింప జేసేంతవఱకు ఏ ఆభరణాలూ ధరింప లేమని మా మాటగా చెప్పండి...

జాజలి : తమరి నేతృత్వంలో అసాధ్యమేముంది అమాత్యా!... కుమార మలయకేతువు ముచ్చేటను కాదనటం దేనికి? పైగా మొదటిసారిగా తమపై మక్కువతో పంపిం దీమణిహారం... కాదనకండి!...

రాక్ష : సరే.. అతనిమాట తోసిపుచ్చేటం ఎందుకు? మీ ఇష్టప్రకారమే కానీయండి!

జాజలి : (హారం అలంకరించి) శుభం భూయాత్!... మఱి నేను వస్తాను! (నిష్క్రమిస్తాడు)

(నాగస్వరం బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్)

రాక్ష : ప్రియంవదకా! మా కోసం ఎవరో వేచి ఉన్నట్లుంది... చూచిరా!

ప్రియం : చిత్తం! (నిష్క్రమణ)

ప్రియం : (తెరలో) ఎవరునువ్వు?

జీర్ణ : సావేఁ!... నన్ను జిన్నిసుడంతారు.. అమాచ్చ రాచ్చసులోరి పాల పాముల్నాడిద్దామనొచ్చినా!

ప్రియం : సరే, ఇక్కడే ఉందు... వారికి మనవి చేసి వస్తా! (ప్రవేశించి) ఎవరోపాములవాడు జీర్ణవిషుడట! తమరిముందు తన విద్యను ప్రదర్శించాలని కుతూహలపడుతున్నాడు.

రాక్ష : (తనలో) వామాక్షి స్పందనం!.. పైగా ప్రప్రథమంగానే సర్పదర్శనం... (పైకి) ప్రియంవదకా! ప్రస్తుతం సర్పకేళిని తిలకించాలని ఉత్సాహంగా లేదు... అతనికేదైనా ఇచ్చి పంపించెయ్యి!

ప్రియం : చిత్తం! (తెరలో) అమాత్యులవారు నీప్రదర్శన చూడలేక పోయినా, తగిన ప్రతిఫలం ముట్టచెప్పారు...

జీర్ణ : సావేః!.. నేను పాములోణ్ణేకాను... పద్దేలురాసే కైత్తెంకూడా నాకెఱికే... అమాచ్చులోరి దరిసెనం లేకుంటేపాయ్! ఈపదవైఃనా సూడమని సెప్పండ్రి...

ప్రియం : (తాళపత్రంతో ప్రవేశించి) ఆర్యా! వాడు పాములోడే కాక కవిత్వం కూడా చెప్పగలడట! కనీసం ఇదైనా చిత్తగించేండని ప్రాధేయ పడుతున్నాడు.

(రాక్షసుడు పత్రం చూస్తుండగా నేపథ్యంలో పాట)

**పూలు పూలంటావు తుమ్మెదా**
**నీవు పూలలో తిరిగేవు తుమ్మెదా!**
**పూలతేనెను గ్రోలి తుమ్మెదా**
**నీవు పూనికతో దాచేవు తుమ్మెదా**
**నీ పడిన పాటంతాను తుమ్మెదా**
**మఱి పరుల పాలైపోవు తుమ్మెదా!!**

రాక్ష : (తనలో) ఓహో! కుసుమపురవృత్తాంతాన్ని తెలుసుకుని వచ్చిన గూఢచారినని ఈ గేయం సూచిస్తోంది... కనుక వీడు పాములవాని వేషంలో ఉన్న విరాధగుప్తుడై



ఉండాలి.... (పైకి) ప్రియంవదకా!... చూస్తే మంచి కవీశ్వరునిలా ఉన్నాడు... లోనికి పంపు.

ప్రియం : చిత్తం.... (తెర వెనుక) లోపలికి రండి!...

విరా/జీర్ణ : (ప్రవేశించి) అమాత్యులకు జయం!...

రాక్ష : విరాధగుప్తా!... రా!... కూర్చో!... నువ్వు తెలిసికొని వచ్చిన కుసుమపుర సమాచారం ఏవిఁటి? (ఫ్రీజ్)

**బుఱ్ఱకథ**

**నందరాజుపై భక్తితో – సై**
**చంద్రగుప్తుని చావుకై – నే**
**పంపిన గూఢ చారులూ – మా**
**నందరాజ పక్షపాతులూ –– ఏమిచేసిరో చెప్పుమా–**
**విందును నేను మిత్రమా!**
**భళానోయి భాయితమ్ముడా భాయి భళానోయి దాదానా॥**
**అమాత్య రాక్షస ఏమి చెప్పుదును కుసుమపురపుగాథా–**
**"తందానా తందానా ఓ దేవనందనానా"**
**ఒక్క దిక్కునా యవనసైన్యము – తందానా**
**ఓ తానె తందనా।**
**వేఱొకదిక్కున కిరాతరాజులు – తందానా**
**ఓ తానె తందనా**
**మఱియొకదిక్కున – శకులసైన్యమూ–మోహరించెనండీ**
**అయ్యో!... మోహరించెనండీ॥**
**ముందునుండే కాంభోజ బలములు**
**వెనుకనుండిరీ బాహ్లిక భటులూ**
**చంద్రగుప్తునకు తోడునీడగా పర్వత రాజుండా...**
**అయ్యయ్యో!...**

**నందరాజ్యమును నాలుగు దిక్కుల ముట్టడించెనండీ॥**
**తందనా.. తందానా ఓ దేవనందనానా॥**

రాక్ష : (ఒరనుంచి కత్తిలాగి సంభ్రమంతో) ఆఁ!.. ఎవడురావాడు? నేనుండగా కుసుమపురాన్ని ముట్టడించేవాడు? ప్రవీరకా! తక్షణం వెళ్ళి ప్రాకారం చుట్టూ ధనుర్ధారుల్ని నిలబెట్టండి! గజసేనను రక్షణగా నిలపండి.. ప్రాణభయం వీడి శత్రువుల్ని చీల్చి చెండాడండి...

విరాధ : అమాత్యవర్యా! ఆవేశపడకండి!... ఇది జేరిగిపోయిన సంగతి... వర్తమానం కాదు...

రాక్ష : (నిట్టూర్చి, కత్తిని వదలి కన్నీటితో) అయ్యో!, జేరిగి పోయిందా? నందమహారాజా! సర్వధా నిర్వీర్యుణ్ణైనాను!

విరాధ : అమాత్యా! ఊఁఅడిల్లండి... అంతా విధివిలసితం! మీరేం చేస్తారు?

రాక్షస : ఊఁ!.. తరువాత?

**(ఫ్రీజ్... బుఱ్ఱకథ)**

**వినరా భారత వీరకుమారా విష్ణుగుప్తనీతి ॥భళాభళి విష్ణుగుప్తనీతి**

**నందరాజ్యమునె నాశమొనర్చగ ప్రతినబూనినాడా ॥భళాభళి ప్రతిన బూనినాడా!**

**ఆ టక్కరి బాపడు పర్వతరాజునె విందుకు పిలిచాడా – భళాభళి విందుకు పిలిచాడా**

**విందును కుడిచిన పర్వతరాజుకు మధువునిచ్చినాడూ – భళాభళి మధువునిచ్చినాడూ**

**తప్పతాగిన పర్వతరాజుపై పడతిని తోలేడా – విషకన్యనె తోలాడా**



**పడతిని కూడిన పర్వతరాజూ అసువులబాశాడూ – అయ్యో! అశువులు బాశాడూ!...**

**అతని తమ్ముడూ వైరోచనునీ చేరదీసినాడూ – చాణక్య హతకుడు చేరదీసినాడూ॥**

రాక్షస : ఎంతటి నయవంచన! అందుకే కౌటిల్యుడని సార్థక నామధేయుడయ్యాడు... ఆఁ! ఆ తర్వాత?

**బుఱ్ఱకథ**

**దారువర్మ బంగారుతోరణం – ॥తందానా ఓ తానె తందనా॥**

**చాణక్యునిలో శంకను రేపే – ॥తందానా॥**

**తన అనుమానం తెలియనీయక – వైరోచన భ్రాతను అలంకరించీ**

**॥తందాన ఓ తానె తందనా॥**

**భద్రగజముపై కూర్చోబెట్టి – భవనప్రవేశం చేయించాడు – ॥భళాభళి ॥**

రాక్షస : ఆఁ!...ఆఁ!.. అప్పుడేమైంది విరాధగుప్తా!

విరాధ : మీరు పంపిన దారువర్మ వైరోచకుణ్ణే చంద్రగుప్తునిగా భ్రమించి యంత్రతోరణాన్ని అతని మీద విరిగి పడే ప్రయత్నం చేశాడు. మావటివాడు బర్బరకుడు తన కత్తినతని మీదకు విసిరే ప్రయత్నంలో ఏనుగు బెదిరి గతి తప్పిందట! దాంతో యంత్రతోరణం బర్బరకునిపై బడి వాడు నేలకూలేడు... దారువర్మ తనగుట్టు బయట పడుతుందని ప్రాణభీతితో తెగించి ఒకపెద్ద ఇనుపమేకును లాగి వైరోచకునిపై విసిరి వాణ్ణి హతమార్చాడు...

రాక్షస : అయ్యో! ఒకే సారి రెండనర్థాలు... ఇంత జాగ్రత్తగా పథకం వేసినా వైరోచకబర్బరులు నిహతులవటం, చంద్రగుప్తుడు

సురక్షితుడు కావటం ఆశ్చర్యంగా లేదూ!... ఊc! సరే, ఇంతకీ దారువర్మేమైనాడు?

విరాధ : వైరోచకుని ముందున్న చంద్రగుప్త సైనికులు వధించారటమాత్యా!

రాక్షస : మఱి చంద్రగుప్తుని వధలో వైద్యుడు అభయదత్తుని ప్రయత్నమైనా ఫలించేలేదా?

విరాధ : లేదమాత్యా! చంద్రగుప్తుని చేంపటం కోసం వైద్యుడు తయారుచేసిన విషమిశ్రితౌషధాన్ని చాణక్యుడు పసికట్టాట్ట!...

రాక్షస : అదెలా సాధ్యమైంది?

విరాధ : ద్రావకాన్ని సువర్ణపాత్రలో ఉంచేటంతో రంగు మాఱింది... దాంతో సులభంగా గుట్టు రట్టు చేసి దాన్ని వైద్యుని చేతనే త్రావించి వైద్యుణ్ణే హతమార్చాడు.

రాక్షస : అన్నా!... ఎంతదారుణం!... ఊc!... శయన మందిరాన్ని అమర్చిన ప్రమోదకుని ప్రయత్నాలైనా ఫలించేలేదా?

విరాధ : లేదమాత్యా! ఆ మూర్ఖుడు మీరిచ్చిన అపారధనాన్ని యథేచ్ఛగా అనుభవిస్తుంటే చాణక్యుడు సంశయించి వానికంత ధనం ఎక్కణ్ణుంచి వచ్చిందని నిలదీసి నిజమెఱిగి వాణ్ణి చిత్రవధ చేయించాడు.

రాక్షస : అయ్యో!... ఇందులో కూడా దైవం మమ్మల్ని వంచించింది... మఱి, చంద్రగుప్తుడు నిద్రిస్తున్నప్పుడు వధించేటానికి గోడలలో దాగిన బీభత్సకారుల ప్రయత్నాలేమైనాయి?

విరాధ : వారి అవస్థమహాదారుణం!.. చంద్రగుప్తుడాభవనంలో ప్రవేశించేటానికి ముందే శయనాగారం పరిశీలించేటానికి



చాణక్యుడు ప్రవేశించాడు. గోడ రంధ్రం ద్వారా మెతుకుల చిదుపుల్ని తీసుకువస్తున్న చీమలబారుని చూసి అందులో ఎవరో నివసించి ఉండి ఉంటారని పసికట్టి శయనాగారం దగ్ధం చేయించాడు... అలా వారికి సజీవదహనం ప్రాప్తించింది.

రాక్షస : ఎంతఘోరం జేరిగిపోయింది? సర్వథా దైవోపహతుణ్ణైనాను.. నా ప్రయత్నాలన్నీ ఎలా వ్యర్థమైపోయాయో చూడు!... ఇంకేం చేసి ఏం ప్రయోజనం?

విరాధ : మన్నించాలి... అలా అని మన ప్రయత్నాలను విరమిస్తామా అమాత్యా?

రాక్షస : ఆ పట్టుదలతోనే కదా ఇంకా ఊగులాట్టం!... (నిట్టూర్చి) ఊc!.. ఆ తరువాత?

విరాధ : చాణక్యుడు అప్రమత్తుడై చంద్రగుప్త రక్షణకు కట్టుదిట్టాలధికం చేస్తున్నాడు. కుసుమపురంలో మన ఆత్మీయులందర్నీ నిర్బంధించాడు...

రాక్షస : ఎవరెవర్ని బంధించాడు?

విరాధ : జీవసిద్ధిని అవమానపుస్సరంగా నగరాన్నుంచి బహిష్కరించాడు...

రాక్షస : అతనిపై మోపిన నేరం?

విరాధ : తమ ప్రేరణతో విషకన్యను పర్వతేశ్వరునిపై ప్రయోగించి పంచత్వం నొందించాడనే అభియోగం అతనిపై మోపారు!...

రాక్షస : (తనలో) భళా! కౌటిల్యా! భళా..! రాజనీతి అంటే నీదే కదా! నీ మీదున్న అపకీర్తిని పోగొట్టుకోవటం కోసం అది నాకాపాదించావు.. అర్ధరాజ్యాపహరుని అపహరించావు...

నీ నీతి బీజం అల్పమే అయినా అనల్పఫలాన్నిచ్చింది... (పైకి) తరువాత?...

విరాధ : చంద్రగుప్తుని వధకు దారువర్మాదులను నియోగించాడనే అభియోగంతో శకటదాసుని కొఱత వేయించాడమాత్యా!...

రాక్షస : పరమ మిత్రుడు శకటదాసునికెంతటి దురవస్థ!... అయినా స్వామి కార్యంలో ప్రాణాలర్పించిన ధన్యుడతడు! అతనికోసం విచారించేనక్కర్లేదు... నందకులం అంతా సర్వనాశనమైనా చేవలేక బ్రతికున్న నా కోసమే చింతించాలి!...

విరాధ : విచారించేకండి అమాత్యా!... మీరూ స్వామి కార్యానికే మీ జీవితం ధారపోస్తున్నారు కదా!...

రాక్షస : ఇంతవఱకు ఆ ఆశతోనే జీవిస్తున్నా! చేచ్చి స్వర్గాన ఉన్న నా రాజువద్దకు కృతఘ్నుణ్ణిగా వెళ్ళకపోతే అదేచాలు... ఊఁ!.. చెప్పు... స్నేహితుల దురవస్థ పరంపరను వినటానికి సిద్ధంగా ఉన్నాను...

విరాధ : రాజధానిలో రాజకీయాలని కనిపెడుతున్న చందనదాసు తమ కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాడు!...

రాక్షస : ఆ దుష్ట చాణక్యుడు చందనదాసుని ఏమీ చేయలేదు కదా!

విరాధ : చేయకేం?.. సామదాన భేదాలు ప్రయోగించి మీ కుటుంబం ఆచూకీ తీయటానికి ప్రయత్నించినా చందనదాసు లొంగలేదు!...

రాక్షస : (ఉద్వేగంతో) ఆ కోపంతో చందనదాసుని వధించేలేదు కదా!...

విరాధ : ఇంకాలేదు... ఆయన సంపదనంతా స్వాధీనం చేసికొని, సకుటుంబంగా అతణ్ణి చెఱసాలలో ఉంచాడు.



రాక్షస : సుహృద్రత్నం చందనదాసుకెంతటి దురవస్థ?... (నేపథ్యంలో కలకలం)

ప్రియం : (ప్రవేశించి) అమాత్యా!... జయం!..జయం..శకటదాసు మిత్రుడు సిద్ధార్థకుడు అతణ్ణి వధ్యస్థలం నుంచి తప్పించి తీసికొనివచ్చాడు!

రాక్షస : (ఆశ్చర్యానందాలతో) ఆఁ! ఏమిటీ శకటదాసునా? శకటదాసునే?.. శకటదాసు ఇంకా సజీవుడై ఉన్నాడా?... ఎంత చేల్లని వార్త? ఇంకా ఆలస్యం చేస్తావేం?.. వారిద్దర్నీ వెంటనే ప్రవేశపెట్టు ప్రియంవదకా! (శకటదాసు, సిద్ధార్థకుడు ప్రవేశిస్తారు)

శకటదాసు : అమాత్యులకు జయం! జయం!

రాక్షస : మిత్రమా! శకటదాసూ! ఎన్నాళ్ళకు చూడగలిగాను? (కౌగిలించుకొని) కౌటిల్యుని బారిన పడ్డ నిన్ను చూడగలగటం నా అదృష్టం! ఇలా కూర్చో! (కూర్చుంటాడు) ఇప్పుడు చెప్పు... ఆపదనుంచి ఎలా బయటపడగలిగావు?...

శకట : (సిద్ధార్థకుని చూపిస్తూ) ఈ నా ప్రియమిత్రుడు సిద్ధార్థకుడపార ధైర్యసాహసాలతో తలారులను తఱిమికొట్టి నన్ను వధ్యస్థలం నుంచి రక్షించి తీసికొచ్చాడు.

రాక్షస : వత్సా! సిద్ధార్థకా!.. నువ్వు చేసిన మహోపకారానికి ఇది సముచిత బహుమానం కాకపోయినా దీన్ని స్వీకరించు (తన మెడలోని హారాన్ని ఇస్తాడు)

సిద్ధార్థ : (తీసికొని తనలో) ఇదేగా ఆర్యచాణక్యుల ఉపదేశం! (పైకి) అమాత్యులవారు మన్నించాలి... నేనీ ప్రాంతానికి కొత్త... ఈ అమూల్యమైన హారాన్ని నేను దాచుకోలేను.. తమ రనుమతిస్తే ఈ ఉంగరంతో ముద్రవేసి తమ భాండాగారం

లోనే దాచి ఉంచేండి... నాకవసరమైనప్పుడు తీసుకుంటాను.

రాక్షస : ఓ!..దానికేం? అలాగే చెయ్యి శకటదాసూ!

శకట : చిత్తం! (రాక్షసునితో) అమాత్యా! ఈ అంగుళీయకంపై తమనామధేయం ఉందేమిటి?

రాక్షస : అరెరె! ఆశ్చర్యంగా ఉందే! (తనలో) నేను నగరంవిడిచి వచ్చే టప్పుడు నా ఇల్లాలు ఉత్కంఠతో నా వ్రేలినుండి తీసుకుంది. ఇది ఇతనికెలా వచ్చింది? (పైకి) నాయనా! సిద్ధార్థా! ఈ ముద్రిక నీకెలా లభించింది?...

సిద్ధార్థ : అమాత్యా! నాకిది కుసుమపురంలో దొరికింది...

శకట : మిత్రమా! సిద్ధార్థకా! ఇది అమాత్యుల పేరు చెక్కిన ఉంగరం! దీని వెలకంటె అధిక ద్రవ్యం నీకు బహుమానంగా ఇస్తారు... ఇది అమాత్యులవారికే అర్పించు!...

సిద్ధార్థ : అంతకంటేనా? ఇదిగో స్వీకరించేండి...(ఉంగరం ఇస్తాడు)

రాక్షస : మిత్రమా.. శకటదాసూ! ఈ ముద్రికతోనే నువ్వు నీ అధికారాన్ని నిర్వర్తించు...

శకట : చిత్తం!...

సిద్ధార్థ : అయ్యా! నాదో చిన్న మనవి!...

రాక్షస : నిస్సంకోచంగా చెప్పు సిద్ధార్థకా!...

సిద్ధార్థ : ఆ కౌటిల్యునికి అపకారం చేసి మళ్ళీ పాటలీపుత్రంలో పాదం మోపటం ప్రాణాపాయకరమని ప్రాజ్ఞులైన మీకు తెలియని విషయం కాదు... తమరనుగ్రహిస్తే మీపాదసేవ చేసుకుంటూ తమ సన్నిధిలోనే ఉందామని...



రాక్షస : అంతకంటేనా?.. నీవంటి విశ్వాసపాత్రులు మాకూ అవసరమే... అవశ్యం అలాగే కానీ....

సిద్ధార్థ : మహాప్రసాదం!...

రాక్షస : ఇక మీరిద్దఱూ విశ్రమించేండి.. .(శకటదాసు, సిద్ధార్థకుడు నిష్క్రమిస్తారు) విరాధగుప్తా! ఇక చెప్పు!... కుసుమపురంలో ప్రజలు మన భేదోపాయాలకనుకూలంగానే ఉన్నారుగా!

విరాధ : నిస్సందేహంగా!... మలయకేతువు పాఱిపోవటంతో చంద్రగుప్తుడు చాణక్యుని మీద కోపంతో ఉన్నాట్ట! చాణక్యుడూ ప్రతిజ్ఞా విజయంవల్ల గర్వోపేతుడై తఱచు చక్రవర్తి ఆజ్ఞలను ధిక్కరిస్తున్నాడు! ఇది నేను అనుభవ పూర్వకంగా తెలుసుకొన్న విషయం...

రాక్షస : (సంతోషంతో) విరాధగుప్తా! నువ్వీ పాములవాని వేషంతోనే మళ్ళీ కుసుమపురానికి వెళ్ళు! అక్కడ నా మిత్రుడు స్తవకలశుడనే వాడు వైతాళికుని వేషంలో ఉన్నాడు. అతనితో చాణక్యుడు ఆజ్ఞాభంగం చేసినప్పుడల్లా చంద్రగుప్తుని పౌరుషాన్ని రెచ్చగొడుతూ స్తుతించమని చెప్పు... పర్యవసానం కరభకుని ద్వారా కబురుపంపు!

విరాధ : చిత్తం... మఱినాకు సెలవా? (నిష్క్రమిస్తాడు)

ప్రియం : (ప్రవేశించి) అమాత్యా! అనర్ఘమైన ఈ మణిహారాలు అమ్మకానికి వచ్చాయి.. వీటిని తాము స్వయంగా పరిశీలించేవలసిందిగా శకటదాసు విన్నపం... (ఆభరణాలు రాక్షసునికిస్తాడు)

రాక్షస : (పరిశీలించి) ఈ ఆభరణాలు చాలా విలువైనవి... విక్రేతను సంతోషపెట్టి వీటిని తీసుకోమని శకటదాసుతో చెప్పు!...

ప్రియం : చిత్తం!...

రాక్షస : (తనలో) కరభకుణ్ణి కుసుమపురానికి పంపాలి... (లేచి పచార్లుచేస్తూ) దురాత్ముడైన చాణక్యుని నుంచి చంద్రగుప్తుడు వేఱవుతాడా? నిస్సందేహంగా వేఱవుతాడు.. చంద్రగుప్తుడు తనను ఆశ్రయించేటం వల్లనే రాజయ్యాడని చాణక్యునికి గర్వం. దాన్ని చంద్రగుప్తుడు సహించేడు.. ఎలాగైనా వీరిని వేఱుచెయ్యాలి!

★★★



## మూడవఅంకం

– రాత్రిని స్ఫురింపజేసే షెహనాయ్ వాద్యం –

వైహీనరి : (ప్రవేశించి ఆకాశంవంక చూస్తూ) సుగాంగప్రాసాదాధికారులారా! చంద్రగుప్త చక్రవర్తి కుసుమపురాన్నంతా కౌముదీ మహోత్సవ సందర్భంగా అపురూపంగా అలంకరించేండని ఆజ్ఞాపిస్తున్నారు.. (పైకిచూసి) ఏవింటీ? కౌముదీ మహోత్సవాన్ని కౌటిల్యుడు నిషేధించినట్లు రాజుగారికి తెలియదా అని అడుగుతున్నారా? ఓరి దౌర్భాగ్యులారా? పీకలమీదకి తెచ్చేవార్త మీకెందుకు? మీ పని మీరు చూసుకోండి... త్వరగా ఏర్పాట్లు పూర్తిచేయండి.. చంద్రగుప్త మహారాజులు వేంచేస్తున్నారు!

(తెరలో) దేవా!.. ఇటు.. ఇటు...

చంద్రగుప్త : (ప్రవేశించి, తనలో) రాజధర్మాన్ననుసరించి నడుచుకొనే రాజులకు రాజ్యం ఎప్పుడూ ప్రీతిపాత్రం కాదు... ఆచార్య చాణక్యులు కొంతకాలం తనపట్ల విరోధాన్ని నటిస్తూ స్వతంత్రంగా వ్యవహరించమని ఆదేశించారు... నేటికి ఎంత పాపానికి ఒడిగట్ట వలసి వచ్చింది... (పైకి) ఆర్యా!... వైహీనరీ! సుగాంగ సౌధానికి వెళదాం పదండి!

వైహీ : ఇదిగో... సుగాంగప్రాసాదం చేరాం ప్రభూ!

చంద్ర : ఆహా!... శరత్శోభాసనాథమైన ఈ ప్రకృతిసుందరి అతి రమణీయమై ఎంత పరవశ పఱుస్తోంది!.. వైహీనరీ! నగరంలో ఎక్కడా కౌముదీ మహోత్సవ కుతూహలం కనిపించేదేం? కౌముదీ మహోత్సవం చాటించేమన్నాం కదా!... చాటించేలేదా?

వైహీ : చాటించాం ప్రభూ!

చంద్ర : అయితే పౌరు లీచంద్రగుప్త సార్వభౌముల శాసనం ధిక్కరిస్తున్నారా?

వైహీ : అమంగళం శమించుగాక! ఈ పృథివిలో ప్రభువుల శాసనం ప్రతిఘటించే పౌరులెవరు ప్రభూ!

చంద్ర : అయితే కౌముదీమహోత్సవసంరంభం ఏమీ కనిపించేదేం?

వైహీ : మఱి.. మఱి...

చంద్ర : స్పష్టంగా చెప్పవయ్యా!

వైహీ : కౌముదీ మహోత్సవం ప్రతిషేధితమైంది ప్రభూ!...

చంద్ర : ఏమీ? మేం ప్రకటించిన ఉత్సవాన్ని నిషేధించేటమా? ఎవరి పని అది?...

వైహీ : ప్రభువులు మన్నించాలి... ఆ వ్యక్తిపేరు మేం చెప్పలేం!...

చంద్ర : నయనపర్వమైన ఈ ఉత్సవాన్ని నిషేధించింది ఆర్య చాణక్యులు కారు కదా!

వైహీ : తమ శాసనాన్ని కాదనే చొరవ చాణక్యుల వారికి కాక మరెవరికుంటుంది ప్రభూ!...

చంద్ర : ఆచార్య చాణక్యుల వారిని మేం అత్యవసరంగా చూడగోరుతున్నామని తెలిపి తీసుకొనిరా!

వైహీ : చిత్తం ప్రభూ! (లైట్స్ ఆఫ్ & ఆన్)

(తనలో) చతురంభోధిపరీత భూవలయ చక్రవర్తి చంద్రగుప్తుల మహామాత్యులు ఆర్యచాణక్యుల నివాసమా ఈ కుటీరం! కచ్చికలను చితక్కొట్టే సుత్తి ఈ వైపు, దర్భల మోపులావైపు, ఎండబెట్టిన సమిధల బరువుకు కుంగిన చూరు, కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న గోడలు! ఆర్య చాణక్యులింత నిరాడంబరులు కనుకనే అంతటి సర్వతంత్ర స్వతంత్రులు!



చాణ : (తనలో) ఏమీ, ఈ దుష్టరాక్షసునికి నా తోటి స్పర్ధా? అవమానంతో పాములా పగబూని పట్టణం వెడలి నేను నందుని రూపుమాపి, మౌర్యుని పట్టాభిషిక్తుని చేస్తే తాను మౌర్యాభ్యుదయాన్ని నిర్జించాలని ప్రయత్నిస్తున్నాడా? రాక్షసా!... చాలించు నీ దుష్ప్రయత్నం... పనికిమాలిన మంత్రులు పనులు చూస్తూ ఉంటే గర్వితుడైన నందుడు కాడు చంద్రగుప్తుడు. నువ్వు చాణక్యుడివీ కావు...

వైహీ : (తనలో) ఔరా! ఏమీ రాజాధిరాజమహామంత్రుల గృహసంపద! ఇందువల్లే మహాచక్రవర్తులు చంద్రగుప్తుల వారిని సైతం 'వృషలా' అని పిలువగలుగుతున్నారు! (పైకి) మహామాత్యులకు జయం జయం!...

చాణ : వైహీనరీ!.. ఏమిఁటింత అర్ధరాత్రి వేళ వచ్చావు?

వైహీ : తమకభ్యంతరం లేకపోతే చంద్రగుప్త ప్రభువులు ఒకసారి తమను చూడవలసిందిగా అభ్యర్థిస్తున్నారు...

చాణ : ఓ!.. అలాగా! నేను కౌముదీమహోత్సవాన్ని నిషేధించినట్లు చంద్రగుప్తుని చెవిని పడలేదుకదా!...

వైహీ : తెలిసిందమాత్యవర్యా!

చాణ : (కోపంతో) ఎవడా చెప్పినవాడు?

వైహీ : మన్నించాలి... మహారాజులవారే సుగాంగ సౌధాగ్రం నుంచి శోభావిహీనమైన కుసుమపురిని స్వయంగా దర్శించారు.

చాణ : అహఁ!... అలాగా!... దాంతో అవకాశం చూసుకొని దీనికంతా నేనే కారణమని మీరంతా వృషలునికి పురెక్కించారు! అంతేకదూ!...

వైహీ : (భయంగా) అమాత్యవర్యా!...

చాణ : (కోపంతో) ఆయ్! రాజభృత్యులక్కూడా చాణక్యుడంటే అంతటి ఎకసెక్కెమా?... ఊc!... సరే, ఇంతకీ ఇప్పుడా వృషలుడెక్కడ?...

వైహీ : సుగాంగ ప్రాసాదం నుంచి మహారాజు నన్ను తమ పాదసన్నిధికి పంపారు!...

చాణ : సరే, అక్కడికే వెడదాం పద!...

లైట్స్ ఆఫ్ & ఆన్

విజయోస్తు వృషలా!...

చంద్ర : (సింహాసనం నుంచి లేచి) గురుపాదులకు ప్రణామాలు...

చాణ : (లేవదీస్తూ) లే!.. వత్సా!.. లే!... ఆసేతు శీతాచల పర్యంతమైన భూవలయంలోనిరాజులు సదా నీ పాదాక్రాంతు లగుదురుగాక!... నీ సామ్రాజ్యాధిపత్యం నిరంతరం నిరాఘాటంగా వర్ధిల్లుగాక!...

చంద్ర : తమ అనుగ్రహం!... ఆసీనులు కండి ఆచార్యా!

చాణ : మమ్మెందుకు పిలిపించినట్లు?

చంద్ర : తమ దర్శనభాగ్యం కోసం!

చాణ : (చిరునవ్వుతో) అదిసరే... నృపతులు నిష్కారణంగా అధికారులను పిలువనంపరుకదా!

చంద్ర : ఆర్యా!... కౌముదీ మహోత్సవాన్ని నిషేధించేటంలో తమ ఆంతర్యం?

చాణ : ఓ!... ఆక్షేపించేటానికన్నమాట!

చంద్ర : కాదు.. కాదు...

చాణ : అలాగా! అదే నిజమైతే గురువుల ఇష్టానికి వ్యతిరేకంగా ఏదీ జేరుగకూడదు...



చంద్ర : అందులో సందేహం లేదు... అయినా ఆర్యులు ప్రయోజనాపేక్ష లేని పని చేయరని....

చాణ : ఇంకేం? ప్రయోజనాపేక్ష లేని పని నేను చేయనని నీకు తెలుసుగా...

చంద్ర : కాబట్టే ఆ ప్రయోజనమేమిటో తెలుసుకోవాలని....

చాణ : అయితే విను... అర్థశాస్త్రవేత్తలు కార్యసిద్ధి రాజాయత్తం, సచివాయత్తం, ఉభయాయత్తమని మూడు విధాలుగా చెబుతారు... వాటిలో ఇది సచివాయత్తమైంది... కాబట్టి నువ్వు అడగనూ అక్కర్లేదు, మేము చెప్పనూ అక్కర్లేదు...

(రాజు కోపంతో పెడమొగం పెట్టుకుంటాడు)

–నేపథ్యంలో– పాట

వైతాళిక : **స్వయమేవా మృగేంద్రతా – స్వయమేవా మృగేంద్రతా!**
**నీదొక కారణ జన్మం – నీ ఆజ్ఞయె అప్రతిహతము**
**సకలాశాంతమె నీ హద్దు – నీ ధిక్కారమె ఒకనేరం॥**

చంద్ర : భళి! భళీ!..

చాణ : (విని, తనలో) ఓహ్! తెలిసింది... ఇది రాక్షస ప్రయోగం!... రాక్షసా!... చాణక్యుడింకా నిద్రపోవటం లేదురా!...

చంద్ర : ఆర్య వైహీనరీ! ఈ వైతాళికునకు పారితోషికంగా సహస్ర సువర్ణాలివ్వండి!

వైహీ : ఆజ్ఞ! (ముందుకు పోబోతాడు)

చాణ : వైహీనరీ!... ఆగు... (వైహీనరి భయంతో రాజువంక చూస్తాడు) వృషలా!... ఇప్పుడెందుకింత వృథా వ్యయం?...

చంద్ర : ప్రతి విషయంలోనూ ప్రతిషేధాలతో కూడిన ఈ ప్రభుత్వం ప్రతిబంధకంగా ఉంది కాని ప్రభుత్వంలా లేదు...

చాణ : స్వతంత్రించి స్వకార్య నిర్వహణ చేతకాని అసమర్థులకలాగే ఉంటుందిలే!... అది నీకిష్టం లేకపోతే నీపనులు నువ్వు స్వతంత్రంగానే చూసుకోవచ్చునే...

చంద్ర : అదే మేమూ ఆలోచిస్తున్నాం...

చాణ : చాలా సంతోషం....

చంద్ర : సరే! ఇంతకీ కౌముదీమహోత్సవాన్ని నిషేధించేటంలో మీ ప్రయోజనం?...

చాణ : ఉత్సవం నిర్వహించేటంలో నీ ప్రయోజనం?...

చంద్ర : మా ఆజ్ఞ అప్రతిహతంగా అమలు జేరగటమే మా ప్రయోజనం...

చాణ : అయితే నీ ఆజ్ఞను ప్రతిఘటించి నా ఆధిపత్యాన్ని నిలుపుకోవటమే నా ప్రయోజనం.. అవ్యాహతమైన నీ ఆజ్ఞ, నీ సార్వభౌమత్వం, నా దగ్గఱ సాగక నా పట్ల నీ వినయ విధేయతలెటువంటివో లోకానికి చాటటమే నా పరమార్థం...

చంద్ర : ఇంకా మిమ్మల్ని అడగవలసిన విషయాలు చాలా ఉన్నాయి.

చాణ : ఓ!... నిరభ్యంతరంగా అడగవచ్చు!...

చంద్ర : మొదటినుండీ మాపట్ల అనురక్తులైన భద్రభటాదులు నేడు విరక్తులై శత్రువు మలయకేతువును ఆశ్రయించేటానికి కారణం?

చాణ : వారి వారి స్వదోషాలే... స్త్రీ లోలత, సురాపానాసక్తి, స్వార్థం, ప్రాణభయం, దురభిమానాలు...

చంద్ర : మఱి, కారణం తెలిసీ ప్రతిక్రియ చేయక పోవటంలో ఆంతర్యం?

చాణ : ఆంతర్యమేమీ లేదు.. వీలు కాక పోయింది...



చంద్ర : వీలుకాకా? చేతకాకా?...

చాణ : చేతకాకేం? ప్రయోజనాన్ని అపేక్షించే ఉపేక్షించాం!...

చంద్ర : అపేక్షించిన ప్రయోజనమేమిటో తెలుసుకోవచ్చా?...

చాణ : అయితే విను!... స్వజనం విరక్తులైనప్పుడు వాళ్ళపట్ల అనుసరించాల్సిన విధానం అనుగ్రహం, నిగ్రహం అని రెండు రకాలుగా ఉంటుంది... నిగ్రహించేటమంటే వాళ్ళని దండించేటం. మనం మనసామ్రాజ్యాన్ని ఇటీవలే స్థాపించాం. క్రొత్తలోనే ప్రధానోద్యోగులకు తీవ్ర దండనలు విధిస్తే ప్రజలకు మనపట్ల విశ్వాసం నశిస్తుంది. లేక, అనుగ్రహించి వారి అధికారాన్ని కొనసాగనిస్తే దానివల్ల సామ్రాజ్యమే నష్టపోతుంది... కనుక రెండూ పనికి రావు... అందుకే వాళ్ళు పాఱిపోతుంటే ఉపేక్షించాను. పైగా తండ్రిని వధించామనే కోపంతో మలయకేతువు మన పైకి దండెత్తి రావటానికి సిద్ధంగా ఉన్నాడు. మన బలాలను అప్రమత్తం చేసి కోటను సుదృఢం చేసికోవలసిన సమయం, కాని ఇది ఉత్సవాలకు తగిన సమయంకాదు.. అందుకే కౌముదీ మహోత్సవాన్ని నిషేధించాం.

చంద్ర : మఱి, ఇంతటి అనర్థానికి హేతువైన మలయకేతువు పలాయితుడైనప్పుడు ఉపేక్షించారేం?

చాణ : ఉపేక్షించేకపోతే?... అతణ్ణి నిగ్రహించేటమో లేక అర్ధరాజ్యం ఇవ్వటమో చేయాలి. నిగ్రహిస్తే అతని తండ్రిని చేంపింది మనమేనన్న సంగతి రూఢి అవుతుంది. అర్ధరాజ్యం ఇచ్చేస్తే అతని తండ్రిని చేంపించటంలోని ప్రయోజనం దెబ్బతింటుంది... అందుకే ఉపేక్షించాను...

చంద్ర : అయితే నగరంలో ఉన్న రాక్షసుడు పాఱిపోతోంటే చూస్తూ ఊరుకున్నారు!... దీనికి మీ సమాధానం?

చాణ : రాక్షసుడు అకలంక స్వామి భక్తిపరాయణుడు... నందుని అభిమానులకు విశ్వసనీయుడు.. బుద్ధిబలం, పౌరుషం అతనిసొత్తు... అంగబలం, అర్థబలం ఉన్నవాడు... అటువంటి వాడు దూరంలో ఉండి అపకారం తలపెట్టినా ఎదుర్కోవచ్చు కానీ, ఇక్కడే ఈ నగరంలోనే ఉంటే ఏనాటికైనా అంతఃకలహాలను రేపి ఈ విశాల సామ్రాజ్యాన్ని నేలపైచి కాల రాస్తాడు... అందుకే ఊరుకున్నాం...

చంద్ర : పోనీ పరాక్రమం ప్రయోగించి పట్టుకోవచ్చుగా?...

చాణ : వాడు రాక్షసుడయ్యా!... పరాక్రమిస్తే పరిక్రమించి నీసేననైనా నాశనంచేస్తాడు, పరిక్లమించి తానైనా నశిస్తాడు... ఈరెంటిలో ఏది జేరిగినా అనర్థమే... అతడే నశిస్తే అటువంటి మంత్రి నీకు లభించేటం దుర్లభం... అందుకే మదగజాన్ని పట్టుకొన్నట్లు మంత్రాంగంతోనే సాధించాలి.

చంద్ర : మీతో మేం వాదించేలేం.. .అన్నివిధాలా రాక్షసుడే ప్రశంసార్హుడు...

చాణ : నేను కాదనేగా నీ తాత్పర్యం? నువ్వంతగా ప్రశంసించేటానికి నీకు రాక్షసునిలో కనిపించిన ఘనతేవిఁటో?

చంద్ర : లేకేం?... విజేతలం మనమే అయినా మనల్ని ఎదిరించి ఇష్టం వచ్చినంత కాలం ఈ నగరంలోనే ఉన్నాడు... మనసైన్యం చేసే జయఘోషలు ఆపగలిగాడు... తన నీతి పథకాలతో మనల్ని ఉక్కిరిబిక్కిరి చేశాడు... మనవాళ్ళలోనే మనకు మిత్రులెవరో శత్రువులెవరో తెలుసుకోలేకుండా చేశాడు.

చాణ : (పెద్దగా నవ్వి) ఓహో!... అదా రాక్షసుని ఘనత? అహఁ!... నేను నందుల్ని నాశనం చేసి నీకు పట్టం కట్టినట్లే నిన్ను పదవీభ్రష్టుణ్ణి చేసి రాక్షసుడు మలయకేతువుకి పట్టం కట్టాడేమో అనుకొన్నాలే!...



చంద్ర : ఇందులో మీరు చేసిందేముంది?

చాణ : (కోపంతో) ఆహఁ!... కృతఘ్నుడా!... శిఖాగ్రంథిని విప్పి లోకభీకర ప్రతిజ్ఞచేసి కోట్లకు పడగలెత్తిన ధనమదాంధులైన నందుల్ని రాక్షసుని కట్టెదుట వధించింది నేను కాకపోతే ఎవరు? వల్లకాట్లో పీనుగు పెంటలైన నందుల్ని ఆకాశంలో ఎగిరే గ్రద్దలు, భూమ్మీద నక్కలూ, తోడేళ్ళూ ఇంకా పీక్కు తింటూనే ఉన్నాయ్!... వెళ్ళిచూడు!...

చంద్ర : అదంతా దైవవిలసితం!

చాణ : అజ్ఞానులు దైవం మీదే ఆధారపడతారు!

చంద్ర : విజ్ఞులెవరూ ఆత్మస్తుతికి పాల్పడరు!

చాణ : (కోపంగా) ఆహఁ!... భృత్యుని మీదికి వచ్చినట్లు మామీద ఒంటి కాలిపై లేస్తున్నావు కదూ!... ఈశిఖాగ్రంథిని విప్పటానికి నా హస్తం ఉద్యుక్తమౌతోంది. (కాలుకిందకొట్టి) పునఃప్రతిజ్ఞా స్వీకారానికి నాపాదం భూమిని తాటిస్తోంది.. నందవినాశంచేత చల్లారిన నా క్రోధాగ్నిని నువ్వు మళ్ళీ రగిలిస్తున్నావు సుమా!...

చంద్ర : (భయంగా-తనలో) ఏవిఁటీ? పూజ్యపాదులకు నిజంగానే కోపం రాలేదు కదా!... ప్రళయకాలరుద్రునివలె విజృంభిస్తున్నారు!

చాణ : వృషలా!... ఎందుకీ వ్యర్థ వాగ్వాదం?... ఇదిగో నా అమాత్యఖడ్గం... నాకంటే రాక్షసుడే యోగ్యుడనుకొన్నప్పుడు అతనికే అర్పించు... (ఆకాశంవంక చూసి తనలో) రాక్షసా!... ఈ కౌటిల్యుని బుద్ధిబలాన్నే జయించే దలచిన నీబుద్ధి ప్రకర్షేఇది... మొదట నాపై భక్తి నశిస్తే చంద్రగుప్తుని సులభంగా నిర్జించేవచ్చని నువ్వు ప్రయోగించిన ఈ విభేదం నీకే కీడు కలుగజేస్తుంది... (నిష్క్రమిస్తాడు)

చంద్ర : ఆర్య వైహీనరీ!... ఈనాటినుండి చాణుక్యునితో సంబంధం లేకుండా మేమే రాజకార్యాలు నిర్వహిస్తామని ప్రజలందఱికీ ప్రకటించేండి!...

వైహీ : (తనలో) ఎప్పుడూ "ఆర్యచాణక్యుల"నేవారు... ఇప్పుడు పూజ్య వాచకం లేకుండా చాణక్యుడని ఏకవచన ప్రయోగం చేయుటంవల్ల చాణక్యులవారిని అధికారంలోంచి నిశ్చయంగా తొలగించినట్లే తోస్తోంది...

చంద్ర : ఆర్యా!... ఏవిఁటా ఆలోచన?

వైహీ : అహహఁ!... ఏం లేదు... అదృష్టవశాత్తూ ఈనాటికి మీరు నిజంగా ప్రభువులయ్యారని సంతోషంగా ఉంది!...

చంద్ర : (తనలో) దగ్గఱివాళ్లు కూడా ఈకృతక కలహాన్ని నిజేవఁనే అనుకొంటున్నారు. ఆర్య చాణక్యులకు సత్వరమే కార్యసిద్ధి కలుగుగాక!... (పైకి) ఆర్యా!.. త్వరగా వెళ్ళి మా ఆజ్ఞ నిర్వర్తించేండి...

వైహీ : చిత్తం... (నిష్క్రమిస్తాడు)

చంద్ర : శోణోత్తరా!... ఈ శుష్కకలహం వల్ల మాకు శిరోవేదనగా ఉంది... శయనాగారానికి దారి చూపు...

శోణో : ప్రభూ! దయచేయండి... ఇటు...ఇటు...

చంద్ర : (తనలో) పూజ్యగురుపాదులఆజ్ఞమేరకే వారిని ధిక్కరించినట్లు నటిస్తేనే భూమి క్రుంగిపోయినట్లు తోస్తోంది!... ఇక నిజంగా గురుధిక్కారం చేసినవారి హృదయం ఎందుకు బ్రద్దలైపోదో?!...

★ ★ ★



## నాల్గవఅంకం

= రాక్షసుని ఇంటిముందు వీధి...బాటసారి వేషంలో ఒకని ప్రవేశం =

కరభకుడు : అయ్యా!.. ద్వారపాలకులారా! మిమ్మల్నే!.. మీలో ఎవరైనా అమాత్య రాక్షసులతో పాటలీపుత్రం నుంచి పరుగులమీద కరభకుడొచ్చాడని మనవి చేయండి...

ద్వారపాలకుడు : అయ్యా! మెల్లగా మాట్లాడండి! అమాత్యులవారు అహర్నిశలూ ఆలోచించేటంతో నిద్రలేక తలనొప్పితో పడుకొన్నారు. ఇంకా లేవలేదు... కొంచెం వేచి ఉండండి. సమయం చూసుకొని వారితో మీ రాకను గూర్చి మనవి చేస్తాను...

కరభ : సరే... అలాగే చేయండి...

– రాక్షసుడు పడకగదిలో పచార్లు చేస్తుంటాడు –

రాక్షస : దుష్టుడైన చాణక్యునికి....

ద్వార : జయం!

రాక్ష : పరాజయం!

ద్వార : అమాత్యుల వారికి...

రాక్షస : (ఎడమకన్ను అదురుటను సూచిస్తూ) (తనలో) దుష్టుడు చాణక్యునికి జయం, అమాత్యులకు పరాజయం! (పైకి) ఏవఁన్నావ్?

ద్వార : ఎవరో కరభకుడట! పాటలీపుత్రం నుంచి పరుగులతో వచ్చానంటున్నాడు.

రాక్షస : లోనికి పంపు!

ద్వార : చిత్తం!...

(తెర వెనుక)

అయ్యా! లోపలికి వెళ్ళొచ్చు!...

కరభ : అమాత్యులకు జయం! జయం!...

రాక్షస : నాయనా!... కూర్చో!...

కరభ : ఆజ్ఞ!...

రాక్షస : (తనలో) పని ఒత్తిడివల్ల ఇతణ్ణి ఏం పనిమీద పంపానో గుర్తురావటం లేదు...

ఒక కంఠం : (తెరలో) తొలగండి... తొలగండి.. అమాచ్చరాచ్చసులోరికి తలనొప్పిగా!... అందుకని సూద్దామని మలయ కేతులుం గారు వత్తుండారు... అందుకని తొలగిపోనక్కర్లా?... (భాగురాయణ కంచుకులతో మలయకేతువు ప్రవేశం)

మలయ : (నిట్టూర్చి–తనలో) నాయనగారు నిర్యాణమై పదినెలలైంది. వృథాపౌరుషంతో ఇంతవరకు దోసెడు తిలోదకాలైనా ఇవ్వలేదు. నాయన గారి మరణంతో నా తల్లులకు కలిగిన దురవస్థ శత్రు స్త్రీలకు కలుగజేసికాని తిలోదకాలివ్వనని ప్రతిజ్ఞచేశాను... వీరుణ్ణయితే యుద్ధంలో పోరాడి తండ్రితోనైనా కలవాలి... లేదా తల్లుల కంటనీరు తుడిచి శత్రు స్త్రీల కంటనీరు కార్పించాలి.. (పైకి) ఆర్య జాజలీ! అమాత్యరాక్షసులను మేం ఒంటరిగానే చూడదలచు కొన్నాం!... మీరు పరివారంతో వెను దిరిగి వెళ్ళండి... భాగురాయణుడొక్కడే నన్ను అనుసరిస్తాడు!...

జాజలి : ఆజ్ఞ!...

మలయ : మిత్రమా! భాగురాయణా! భద్రభటాదులు ఇక్కడికి వచ్చిం తర్వాత పంపిన విజ్ఞప్తిలో “మేము అమాత్య రాక్షసులవల్ల మిమ్మల్ని ఆశ్రయించేటంలేదు, సేనాపతి శిఖరసేనుని పురస్కరించుకొని ఆశ్రయిస్తున్నాం, దుష్టుడైన మంత్రికి లోబడ్డ చంద్రగుప్తునిపై విరక్తి కలిగి సద్గుణసంపన్నుడైన మిమ్మల్ని ఆశ్రయిస్తున్నాం” అని తెలియజేశారు... ఎంత ఆలోచించినా ఆ మాటలకి అర్థం ఏవిఁటో తెలియటం లేదు...



భాగు : కుమారా! ఇందులో విశేషమేముంది? విజిగీషువు ఆత్మగుణ సంవాదం కలవాణ్ణి ప్రియులు, హితులు అయిన వారిని పురస్కరించుకొని ఆశ్రయించాలని ధర్మం నిర్దేశిస్తోంది కదా!

మలయ : అవును... మరి అమాత్యరాక్షసులు మాకందఱికంటె ప్రియులు, హితులు కదా!

భాగు : నిజవేఁ... అయినా ఇక్కడ ఇంకో విశేషముంది. రాక్షసుల వారి పగ చాణక్యుని మీదే కాని చంద్రగుప్తుని మీద కాదు.. అందువల్ల భవిష్యత్తులో ఎప్పుడైనా గర్విష్ఠి అయిన చాణక్యుని మంత్రి పదవి నుంచి తొలగించే అవకాశం లేకపోలేదు... అప్పుడు– చంద్రగుప్తుడు కూడ నందవంశం వాడే కనుక – నందవంశంపై భక్తితో అయితేనేం, చందనదాసువంటి మిత్రులకోసమైతేనేం అమాత్య రాక్షసులుకూడ చంద్రగుప్తునితో సంధిచేసికొనే అవకాశం లేకపోలేదు... అప్పుడు తమను కూడ విశ్వసించేరేమోనని అలా చెప్పి ఉంటారు...

మలయ : బాగుంది... పద, రాక్షసులవారిని దర్శిద్దాం!... (ఇరువురూ ప్రవేశిస్తారు)

రాక్షస : (తనలో) ఆఁ! గుర్తొచ్చింది... (పైకి) కరభకా! కుసుమ పురంలో స్తవకలశుడనే వైతాళికుని చూశావా?...

కరభ : ఆఁ! చూశాను స్వామీ!...

మలయ : భాగురాయణా!... కుసుమపుర విషయాలే మాట్లాడు తున్నట్లుంది. ఉష్... ఇక్కడే ఉండి విందాం...

రాక్షస : ఆ పని నెఱవేఱినట్లేనా?

కరభ : తమఅనుగ్రహంవల్ల నెఱవేఱింది.

మలయ : ఏవిఁటాపని?...

భాగు : అమాత్యుల వ్యవహారం అర్థం కావటం లేదు.. అప్పుడే మనం ఒక నిర్ణయానికి రాకూడదు! జాగ్రత్తగా విందాం...

కరభ : మీ ఆజ్ఞను స్తవకలశునికి అందించాను. ఇంతలో చంద్రగుప్తుడు ప్రజల సంతోషానికి కౌముదీ మహోత్సవాన్ని చాటిస్తే-కనుల పండువుగా ఉండే ఆ ఉత్సవాన్ని చాణక్యుడు నిషేధించాడు. ఆ అదను చూసుకొని స్తవకలశుడు తన స్తోత్రాలతో చంద్రగుప్తునికి పురెక్కించాడు...

రాక్షస : భళిభళీ!...ఊc!.. తరువాత?...

కరభ : దాంతో చంద్రగుప్తుడు మండిపడి తమ గుణాల్ని పొగిడి చాణక్యుణ్ణి మంత్రి పదవి నుంచి ఊడబెఱికాడు!...

మలయ : చంద్రగుప్తుడు రాక్షసునిపై తనకున్న పక్షపాతాన్ని ఎలా ప్రదర్శించాడో!...

భాగు : చాణక్యుని తొలగించేటం ఇక్కడ ముఖ్యమైన విషయం!...

రాక్షస : చంద్రగుప్తునికి చాణక్యునిపై కోపం రావటానికి ఉత్సవ నిషేధం ఒక్కటే కారణమంటావా? లేక మఱేదైనా?...

మలయ : వేఱే కారణం వెదకటంలో ఆంతర్యం?

భాగు : ఈ అల్పమైన దానికే చాణక్యుడు చంద్రగుప్తుని ఆగ్రహానికి పాత్రం కాడు... కృతజ్ఞుడైన చంద్రగుప్తుడూ ఈ మాత్రానికే చాణక్యుణ్ణి పదవీభ్రష్టుని చెయ్యడు... బలమైన కారణాలవల్ల వాళ్ళు విడిపోతే ఆ విరోధం శాశ్వతంగా ఉంటుంది. అందుకూ!...

కరభ : బలమైన కారణాలు లేకేం? మీరూ, కుమారమలయ కేతువూ పలాయితులైనప్పుడు చాణక్యుడు ఉపేక్షించాడని!...

రాక్షస : భళా!.. ఇక చంద్రగుప్తుడు నా చేతిలో చిక్కినట్లే!... ఏమంటావు శకటదాసూ!



శకట : అనటానికేముంది? చందనదాసుకు చెఱసాల నుంచి విడుదలా, మీకు ఆలుబిడ్డలతో కలయికా, జీవసిద్ధి కష్టాలు గట్టెక్కటం...

మలయ : మిత్రమా! చంద్రగుప్తుడు నాచేతిలో చిక్కినట్లే అనటంలో అంతరార్థం?

భాగు : ఆc!.. ఏముంటుంది?... చాణక్య వియోగాన్ని పొందిన చంద్రగుప్తుణ్ణి ఉద్ధరించేవచ్చు కదా అని!...

రాక్షస : పదవీభ్రష్టుడైన చాణక్యుడిప్పుడెక్కడున్నట్లు?...

కరభ : అక్కడే, పాటలీపుత్రంలోనే ఉన్నాడు...

రాక్షస : (ఆవేశంతో) ఆc!.. .ఇంకా అక్కడే ఉన్నాడా? పునఃప్రతిజ్ఞా స్వీకారంకాని, తపోవన గమనం కాని చేయలేదా?...

కరభ : తపోవనానికి వెడతాడనుకుంటున్నారు...

మలయ : భాగురాయణా! తర్వాత చాణక్యుడేమైంతే ఇతనికెందుకు?

భాగు : అహc!... చాణక్య చంద్రగుప్తులు ఎంత దూరంగా ఉంటే తనకంత మంచిదని...

రాక్షస : శకటదాసూ! ఇక నువ్వెళ్ళి కరభకుణ్ణి విశ్రమింపజెయ్యి!...

శకట : ఆజ్ఞ!.. (కరక, శకటదాసులు నిష్క్రమిస్తారు)

మలయ : అమాత్యరాక్షసులకభివాదాలు... తమ అస్వస్థత సర్దుకుందా?

రాక్షస : మీకు మహారాజ పదవి లభించేకుండా నా అస్వస్థత ఎలా సర్దుకుంటుంది?

మలయ : తమకు అసాధ్యమైనదేముంది?... సమర్థమైన సైన్యాన్ని సమకూర్చుకొనీ ఎన్నాళ్ళిలా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవాలీ అని!...

రాక్షస : కుమారా! దండయాత్రాసన్నాహంలోనే ఉన్నాంగా... నేడో రేపో ప్రశస్తమైన ముహూర్తం చూసి విజయయాత్రా ప్రస్థానం చెయ్యటమే తరువాయి.

మలయ : ఆర్యా! శత్రువు పరిస్థితి ఏమైనా తెలిసిందా?

రాక్షస : చాణక్యుడినుంచి చంద్రగుప్తుడు వేఱుపడ్డాడు!

మలయ : దానివల్ల చంద్రగుప్తునికి నష్టమేముంది?

రాక్షస : మిగతా రాజులకు మంత్రిదూరమైతే నష్టం లేకపోవచ్చు కాని చంద్రగుప్తునికలాకాదు...

మలయ : అదికాదు... చందగ్రుప్తుని సేవకులకు అతనిపై అనిష్టత కలగటానికి చాణక్యుడే కారణం... ఇప్పుడు చాణక్యుడు లేడు కనుక సహజంగా చంద్రగుప్తునిపై అభిమానం కల పరిజనానికి ఆ అభిమానం సహజంగా రెట్టింపౌతుంది.

రాక్షస : నాయనా అలాకాదు.. ప్రజల్లో రెండు రకాలున్నారు.. కొంతమందికి చంద్రగుప్తుని మీద అభిమానం, మఱికొందఱికి నందకులం మీద అనురాగం. చాణక్యుని దోషాలు, చంద్రగుప్తుని అనుచరుల అనిష్టతకు కారణం కాని, నందకులానురాగుల అనిష్టతకు కాదు... వాళ్ళంతా నందవంశాన్ని కృతఘ్నుడై ఇతడు నాశనం చేశాడని అనిష్టమూ, కోపం కలిగి ఉన్నారు. తగిన ఆశ్రయం లేకపోవటం వల్ల చంద్రగుప్తుని అనుసరిస్తున్నారు. శత్రూన్మూలన దక్షుడైన నీవంటివాడు దండెత్తిపోతే అతన్ని వదిలి నిన్నే ఆశ్రయిస్తారు. ఈ విషయంలో నేనే నిదర్శనం...

మలయ : చంద్రగుప్తుని మీద దండయాత్ర చేయటానికి చాణక్యుడు లేకపోవటమే కారణమా? ఇంకేమౌనా ఉందంటారా?...

రాక్ష : తక్కిన వెన్నుంటేనేం? ఇదే ప్రధానమైంది...



మలయ : ఏమిఁటీ, ఇదే ప్రధానమా? చంద్రగుప్తుడు కార్యభారం మఱొకరిపై వేసి కాని, తానేస్వయంగా కానీ దీనికి ప్రతిక్రియ చేసుకోవచ్చుగా!...

రాక్ష : ముమ్మాటికీ చేసుకోడు.. అది స్వాయత్త సిద్ధులైన రాజులవిషయంలో జేరిగేది... కాని చంద్రగుప్తుడు ఎప్పుడూ సచివాయత్తసిద్ధుడే...ఆ సచివుడు వెళ్ళిపోవటంతో అంధుడౌతాడు...

మలయ : (తనలో) అదృష్టవశాత్తూ నేను సచివాయత్త సిద్ధుణ్ణికాను... (పైకి) నిజమేఁ... సరియైన సచివుడు లేనప్పుడు దండయాత్ర చేయటంలో ఒక సౌలభ్యం ఉంది...

రాక్షస : అవును.. మనకు కార్యసిద్ధి తథ్యం...

మలయ : ఇదే దండయాత్రకు తగిన సమయం అని మీరు నిర్ణయించిన తర్వాత ఇక ఆలస్యమెందుకు?

రాక్షస : ఎవరక్కడ?

ప్రియం : చిత్తం ప్రభూ!

రాక్షస : ప్రియంవదక! ఇక్కడ జ్యోతిష్కులెవరున్నారు?

ప్రియం : క్షపణకుడొకడున్నాడు....

రాక్షస : క్షపణకుడా!?...

ప్రియం : అవును, క్షపణకుడు జీవసిద్ధి...

రాక్షస : సరే, ప్రవేశపెట్టు!...

జీవసిద్ధి(క్షపణ) : శ్రావకా! ధర్మలాభం కలుగుగాక!...

రాక్షస : భదంతా! దండయాత్రకు మంచి ముహూర్తం చూడు!...

క్షపణ : పౌర్ణమి ప్రశస్తంగా ఉంది. ఉత్తరం నుంచి దక్షిణానికి కనుక మీకు నక్షత్రం దక్షిణం. సూర్యాస్తమానసమయం. పూర్ణచంద్రోదయం... లగ్నంలో బుధుడు.. ప్రయాణానికి దివ్యంగా ఉంది....

రాక్ష : అరె!.. తిథిశుద్ధి ఏది?

క్షపణ : "ఏకా గుణా తిథిః, చతుర్గుణం నక్షత్రం, శతగుణ శ్చన్ద్రః" అని జ్యోతిషుల సిద్ధాంతం... దుర్లగ్నాన్ని విడిచి చంద్రబలంతో సాగిపోయారంటే మహత్తరమైన లాభం!...

రాక్షస : భదంతా! ఇంకా ఎవరితోనైనా సంప్రదించేగూడదూ?

క్షపణ : మీరే సంప్రదించేండి... నేపోతున్నాను...

రాక్షస : ఏం కోపం వచ్చిందా?...

క్షపణ : మీ మీద కాదు నాకు కోపం...

రాక్షస : మఱెవరికి?

క్షపణ : యమధర్మరాజుకి... లేకపోతే స్వపక్షాన్ని విడిచి పరపక్షం ప్రమాణమంటారా? (నిష్క్రమిస్తాడు)

రాక్షస : ప్రియంవదక! ఎంత పొద్దయింది?...

ప్రియం : సూర్యాస్తమయం కావస్తోంది...

రాక్షస : అహెూ!... సూర్యాస్తమయమా?

★ ★ ★



## ఐదవఅంకం

సిద్ధార్థకుడు : (ముద్రవేసిన లేఖ, ఆభరణాల పెట్టెను తీసికొనివచ్చి) ఆశ్చర్యం!... ఆశ్చర్యం!... ఆర్య చాణక్యులు వ్రాసిన రాక్షస ముద్రాంకితమైన లేఖ, ఆ ముద్రతోనే ఉన్న ఈ ఆభరణాలపెట్టె తీసికొని పాటలీపుత్రం నుంచి బయలుదేరుతుంటే– ఈ క్షపణకుని ఎదురేవిఁటి? ఇది మంచి శకునం కాదు కానీ – అయినా నష్టం లేదు.. ఇదీ ఒకందుకు మంచిదే!... భదంతా! నమస్కారం!

క్షపణకుడు : ధర్మసిద్ధికలుగుగాక! ఎక్కడికో బయలుదేరుతున్నట్లుందే!

సిద్ధార్థ : అది నీకెలా తెలిసింది?...

క్షపణ : నీ చేతిలో ఉన్న ఆ ఉత్తరమే తెలుపుతోంది...

సిద్ధార్థ : బాగానే తెలుసుకొన్నావు! నేను దేశాంతరం బయలుదేరాను!.. ఇవాళ మంచిదేనేమో చూడు!...

క్షపణ : బుఱ్ఱగొఱిగించుకొన్న తర్వాతా తిథివారనక్షత్రాలు చూసుకోవటం?

సిద్ధార్థ : అదికాదు – ఇప్పుడు కొంపేం మునిగిపోయింది? నువ్వు చూసి చెప్పు... ఇవాళ బాగుంటే వెడతాను.. లేకపోతే ఉండి పోతా!...

క్షపణ : బాగుండటం మాట అటుంచి ఇప్పుడు మలయకేతువు శిబిరంలో పను లనుకూలం కావు..

సిద్ధార్థ : ఏం, ఎందుకని?

క్షపణ : మొదట్లో ఇక్కడకి రాకపోకలకు ఏ చిక్కూ ఉండేది కాదు.. ఇప్పుడలాకాదు... ఇక్కడ నుంచి బయటకువెళ్ళాలన్నా, లోపలికి రావాలన్నా శిబిరాధికారుల అనుమతి ముద్రకావాలి. నీకా అనుమతి ముద్ర లభిస్తే హాయిగా

వెళ్ళు... లేకపోతే కిక్కురుమనకుండా పడిఉండు... సాహసం చేశావో కాళ్ళూ చేతులూ కట్టి కారాగారంలో పడేస్తారు..

సిద్ధార్థ : నేను అమాత్యరాక్షసులకు సన్నిహితుణ్ణని నీకు తెలియదల్లే ఉందే! ముద్ర వేయించుకోక పోయినా నన్నడ్డటానికి ఎవరికయ్యా గుండెలు?...

క్షపణ : నువ్వు రాక్షసుల వాడివైనా పిశాచానివైనా ముద్ర లేకుండా మాత్రం రాకపోకలకు వీల్లేదు...

సిద్ధార్థ : కోప్పడకయ్యా! నాకు కార్యసిద్ధి కావాలని దీవించు!

క్షపణ : సరే వెళ్ళు.. నీకార్యం నెఱవేఱుతుంది.. నేను భాగురాయణుని దగ్గఱకెళ్ళి ముద్ర నడుగుతాను.. (ఇద్దఱూ వెళ్ళిపోతారు, భాసురక భాగురాయణుల ప్రవేశం)

భాగు : భాసురకా! నేను కుమార మలయకేతువుకు సమీపంలోనే ఉండటం మంచిది.. నాకు ఈ ఆస్థానమండపంలోనే ఆసనాన్నేర్పాటుచెయ్యి...

భాసు : భాగురాయణా! ఇదిగో ఆసనం ఇక్కడే ఉంది.. కూర్చోండి...

భాగు : ఆమోదముద్ర కోసం ఎవరైనా నన్ను చూడటానికి వస్తే లోపలికి పంపు!...

భాసు : అలాగే... (నిష్క్రమిస్తాడు)

భాగు : (తనలో) నాపై ఇంతటి అవ్యాజమైత్రిని నెఱపుతున్న కుమారమలయకేతువును మోసం చేయటమంటే ఎలాగో ఉంది... (మలయకేతువు ప్రవేశం)

భాసుర : (ప్రవేశించి) ఆర్యా! క్షపణకుడు ఆమోదముద్ర కోసం మంత్రులను చూడగోరుతున్నాడు.

భాగు : లోనికి పంపు!...



జీవ : శ్రావకా! నీకు ధర్మం సిద్ధించుగాక!

భాసు : (తనలో) ఓహో! రాక్షసమిత్రం జీవసిద్ధా! (పైకి) ఏం! రాక్షసుని పనిమీదేనా వెళ్ళేది!...

జీవ : ఛ..ఛ!.. రాక్షసుని పేరైనా వినపడనిచోటకు వెడుతున్నా...

భాగు : పరమమిత్రుని మీద అంత ఆగ్రహం ఎందుకయ్యా! పాపం ఆయన నీకేం అన్యాయం చేశాడని?...

జీవసిద్ధి : రాక్షసుడు నాకేం అన్యాయం చెయ్యలేదు.. దౌర్భాగ్యుణ్ణి నాకు నేనే చేసుకున్నాను. చేసినదానికి సిగ్గుపడుతున్నాను...

భాగు : ఇదేదో చాలా కుతూహలంగా ఉందే!

మలయ : (తనలో) నాక్కూడా!

భాగు : కొంచెం వివరంగా చెప్పవయ్యా! వింటాను...

మలయ : (తనలో) నాకూ వినాలనే ఉంది!...

జీవ : పోనివ్వండి... ఇప్పు దదంతా ఎందుకు?...

భాగు : అంత రహస్యమైతే పోనీ చెప్పొద్దులే...

జీవ : అబ్బే! ఇందులో రహస్యవేఁవుంది?...

భాగు : అయితే చెప్పు!...

జీవ : ఇది రహస్యం కాదు కానీ చెప్పను...

భాగు : అయితే నేను ఆమోదముద్ర ఇవ్వను..

జీవ : అయితే మరేం దారి? చెబుతా విను.. ఇదివఱకు నేను పాటలీపుత్రంలో ఉండే దినాల్లో రాక్షసుడూ నేనూ ప్రాణస్నేహితులం... అప్పుడే రాక్షసుడు విషకన్యను ప్రయోగించి పరమరహస్యంగా పర్వతేశ్వరుణ్ణి పరలోకానికి సాగనంపాడు...

మలయ : (దుఃఖోద్వేగంతో-తనలో) ఆఁ! ఏవిఁటీ!.. నాతండ్రిని చేంపించింది రాక్షసుడా! చాణక్యుడు కాదూ?

భాగు : అదేవిఁటయ్యా! అర్ధరాజ్యం ఇవ్వవలసి వస్తుందని చాణక్యుడే పర్వతేశ్వరుణ్ణి చేంపించాడని విన్నామే!...

జీవసిద్ధి : పాపం శమించుగాక! పాపం, చాణక్యునికి విషకన్య పేరైనా తెలియదు...

భాగు : ఊఁ... తరువాత?

జీవ : దారిలో చాణక్యుడు నేను రాక్షసుని మిత్రుణ్ణని నన్నవమానించి నగరం నుంచి బహిష్కరించాడు... మళ్ళీ నన్నీ లోకం నుంచే సాగనంపటానికి కాబోలు రాక్షసుడేదో తలపెడుతున్నాడు. అందుకే బ్రతికుంటే బలుసాకైనా తినొచ్చునని నగరం విడిచి దూరంగా పోతున్నాను.. బాబ్బాబు!.. నాకు ఆమోదముద్ర నిప్పించేండి.. మీకు పుణ్యముంటుంది.

భాగు : సరే, నీకు ఆమోదముద్ర ఇస్తాలే కాని, ఈ విషయం కుమార మలయకేతువుతో చెబుదాం.. రా!...

మలయ : (కన్నీటితో) విన్నాను మిత్రమా! హృదయవిదారకమైన వార్త విన్నాను.. పితృపాదులు పరలోకగతులై పదిమాసాలైనా ఆ దుఃఖం ఇప్పుడు ద్విగుణీకృతమౌతోంది...

జీవ : (తనలో) హమ్మయ్య!... ఈవార్త మలయకేతువు చెవిని పడింది... ధన్యోస్మి... (నిష్క్రమిస్తాడు)

మలయ : (ఆకాశంలోకి చూస్తూ) ఆఁ! రాక్షసా! ఎంత పాపానికి ఒడిగట్టావ్! నిన్ను నమ్మి తన పనులన్నీ నిశ్చింతగా నీ మీదపెట్టి నిన్ను ప్రాణాధికంగా చూసుకొన్న పితృపాదులు పర్వతేశ్వరుల ప్రాణాలే నిర్దాక్షిణ్యంగా తీసేశావుకదూ!... నిన్నేం చేస్తానో చూడు! నిన్ను... నిన్ను... (ఒరనుండి కత్తిని లాగుతాడు)



భాగు : (తనలో) రాక్షసునికి ప్రాణాపాయం కలుగగూడదని ఆర్య చాణక్యుల ఆజ్ఞ.. (పైకి) కుమారా! ఆవేశపడకు... ఇలా కూర్చో చెబుతా...

మలయ : (కూర్చుని) చెప్పు!...

భాగు : ఇటువంటి సమయాల్లోనే నిగ్రహాన్ని పోగొట్టుకో గూడదు... రాజనీతిలో శత్రు మిత్ర మధ్యస్థ భావాల వ్యవస్థ చేపట్టిన కార్యాన్ని బట్టి మాఱుతూ ఉంటుంది. కానీ సామాన్య ప్రజల కున్నట్లుకాదు...అప్పట్లో రాక్షసుడు సర్వార్థసిద్ధిని రాజుగా చేయదలచుకొన్నాడు... చంద్రగుప్తునికంటే నీతండ్రి పర్వతేశ్వరుడే బలీయుడని నీతండ్రిని ముందు చేంపించాడు. కనుక ఇప్పుడు మన కార్యసిద్ధి దృష్ట్యా నందరాజ్యం మన చేజిక్కే వఱకు ఈ విషయం మనకు తెలియనట్లే నటించాలి... ఏవంటావ్? పోనీ నువ్వే ఆలోచించి చూడు!...

మలయ : అవును.. నిజవేఁ! ఇప్పుడే మనం రాక్షసుణ్ణి వధిస్తే ప్రజాసంక్షోభం కలిగి విజయావకాశాలు కూడా క్షీణించి పోతాయి. (సిద్ధార్థ భాసురకులు ప్రవేశిస్తారు)

భాసుర : జయం!... జయం!... ఇతడీ లేఖతో ఆమోదముద్ర లేకుండా పోతుంటే దీర్ఘచక్షువు పట్టుకొన్నాడు ప్రభూ! తమరు స్వయంగా పరిశీలించాలని మనవి చేస్తున్నాడు...

భాగు : ఎవరు నువ్వు?

సిద్ధా : అమాత్య రాక్షసులవారి ఆశ్రితుణ్ణి...

భాగు : అయితే ఆమోదముద్ర లేకుండా బయటకెందుకు వెడుతున్నావ్?...

సిద్ధా : అత్యవసరమైన పనిమీద వెళ్ళవలసి వచ్చిం దార్యా!...

భాగు : రాజశాసనాన్ని కూడా ఉల్లంఘించేటంత అవసరమైన పనా?...

మలయ : భాగురాయణా!... ఆ లేఖ నిలా అందుకో!...

భాగు : (సిద్ధార్థకుని చేతినుంచి లేఖను తీసికొని మలయ కేతువుకిస్తూ) ఇదిగో కుమారా లేఖ!.. (ముద్రనుచూసి) అరేఁ!.. దీని మీద అమాత్యరాక్షసుల ముద్ర ఉందే...

మలయ : ఊఁ!. ముద్ర చెదిరిపోకుండా జాగ్రత్తగా లేఖను తెఱిచి ఇలా ఇవ్వు!

భాగు : అలాగే! (లేఖను తెఱచి ఇస్తాడు)

మలయ : (చదువుతాడు) "స్వస్తి... మా శత్రు నిరాసనం చేత తమ సత్యసంధత వెల్లడియగు చున్నది.. సంధికి అంగీకరించిన నా మిత్రులకు మీరిచ్చియున్న మాట ప్రకారము వారి వారికి రావలసినది ఈయవలసినదిగ కోరుచుంటిమి. వారుకూడ తమయెడల కృతజ్ఞులై ఉండగలరు... తమకు తెలిసినదేయైనను సంధినియమముల మఱల జ్ఞప్తి చేయుచుంటిని.. కొందఱు శత్రు భాండాగారమును, వేఱొక కొందఱు గజబలమును, మఱికొందఱు రాజ్యమును కోరియుండిరి.. తాము పంపిన భూషణత్రయము అందినది... మేమును వట్టిచేతులతోకాక, ఏదియో యథాశక్తి పంపితిమి... దానిని స్వీకరింపగోరెదము.. మా సందేశమును సిద్ధార్థకుడు తెలుపగలడు...

భాగురాయణా!. ఏవిఁటీ లేఖ?...

భాగు : (గద్దింపుగా) సిద్ధార్థకా!.. ఏవిఁటీ లేఖ?...

సిద్ధార్థ : (గాభరాగా) లేఖప్రభూ!... లే..లే..లే.. లేఖఁ...

భాగు : (గద్దిస్తూ) అది తెలుస్తూనే ఉంది.. ఎవరికీ లేఖ?



సిద్ధా : అదె.. అదె... ఆఁ! .. తె..తె..తె.. తెలియటంలేదు!...

భాగు : ధూర్తుడా! లేఖను తీసికెడుతున్నావ్.. ఎవరికో తెలియదా? పోనీ నువ్వు చెప్పవలసినమాటలెవరితో?

సిద్ధా : (భయంనటిస్తూ) మీ...మీ.. మీతోనే...

భాగు : ఏవిఁటీ? మాకా? ఎవరి దగ్గర్నుంచి?...

సిద్ధార్థ : (భయంతో) మీ...మీ...మీనుంచే...

భాగు : ఏవిఁటీ అసందర్భ ప్రలాపం?...

సిద్ధా : మీరు నన్ను నిర్బంధించి గద్దిస్తుంటే ఏం చెప్పాలో తెలియటం లేదు..

భాగు : ఊఁ!.. తెలుస్తుంది... భాసురకా! ఇతనిచేత నిజం చెప్పించేండి! (భాసురకుడు/లేదా మఱో పురుషుడు కొఱడాతో కొడతాడు. చేంకలోంచి పెట్టె కింద పడుతుంది) అరెఁ! అదేవిఁటి? చేంకలో పెట్టె క్రింద పడ్డది?...

భాసు : (తీసి భాగురాయణునికిస్తూ) ఇదిగో...

భాగు : అరెఁ!.. దీనిమీదకూడ రాక్షసుని ముద్రే ఉంది!...

మలయ : వట్టి లేఖ కాకుండా 'యథాశక్తి' పంపింది ఇదే అయి ఉంటుంది... ముద్ర చెదిరిపోకుండా తీసి అందులో ఏముందోచూపించు. (చూపిస్తాడు) అరెఁ! ఆశ్చర్యం!.. ఈ ఆభరణం మాది.. మేం స్వయంగా రాక్షసునికి పంపింది.. ఊఁ!.. అయితే ఈ లేఖ రాక్షసుడు చంద్రగుప్తునికి పంపిస్తోందన్నమాట!...

భాగు : మఱి ఊహాగానాలెందుకు? ఇప్పుడే తేల్తుంది.. ఊఁ!.. కొట్టండి.. (మళ్ళీ కొడతారు)

సిద్ధా : అమ్మబాబోయ్! కొట్టకండి.. కొట్టకండి.. అంతా మనవి చేసుకుంటాను... (మలయ కేతువు కాళ్ళపై బడి) దేవరవారు నాకభయమిచ్చి కరుణించాలి.

మలయ : నీకేం భయంలేదు.. నిజం నిర్భయంగా ఉన్నదున్నట్లు చెప్పు!...

సిద్ధా : క్షమించాలి... అమాత్యరాక్షసులవారీలేఖను చంద్రగుప్తులకు అందజేయమని ఆజ్ఞాపించారు!

మలయ : నీతో పంపిన సందేశం?

సిద్ధా : అవధరించేండి ప్రభూ!... రాక్షసులవారు చంద్రగుప్తులతో తమ మాటగా చెప్పుమన్నదేమంటే... తమ మిత్రులైన చిత్రవర్మ, మలయదేశాధీశుడు సింహనాదుడు, కాశ్మీర నృపతి పుష్కరాక్షుడు, సింధుభూపతి సింధుసేనుడు, పారశీక ప్రభువు మేఘనాదుడు, సంధి కంగీకరించారు. మొదటి ముగ్గురు మలయకేతు దేశాన్ని, చివరి ఇద్దఱు కోశాన్నీ గజబలాన్నీ కోరుతున్నారు. చక్రవర్తుల వారు చాణక్యుని తొలగించి తమకు ప్రీతి కలిగించినట్లే సంధిశుల్కాలనిచ్చి వారినికూడా సంతోషపెట్టవలసిందిగా మనవిచేయమన్నారు మహారాజా!...

మలయ : (తనలో) ఏమిటీ! చిత్రవర్మాదులుకూడా మిత్రద్రోహులే నన్నమాట!.. అందుకే వారికి రాక్షసునిపై అంతప్రీతి! (పైకి) విజయా!... మేము రాక్షసులవారిని చూడగోరుతున్నామని చెప్పు!...

ప్రతీహారి : చిత్తం ప్రభూ!...

లైట్సాఫ్ & ఆన్

(రాక్షసుడు ఆసనంపై కూర్చుని ఆలోచిస్తూంటాడు. ప్రియంవదకుడు ప్రక్కనుంటాడు)

రాక్షస : (తనలో) అక్కడక్కడ చంద్రగుప్తుని సైనికులున్నారనే అనుమానంతో మనశ్శాంతి లేకుండాపోతోంది.. అయినా వాళ్ళు చంద్రగుప్తునిపై విరక్తులని తగినంత కారణంతో నిర్ణయించుకొనే సైన్యంలో చేర్చుకొన్నాను... అందువల్ల వాళ్ళమీద అనుమానపడటం అనవసరం!.. (పైకి) ప్రియంవదకా! కుమార మలయకేతువును అనుసరించే రాజులకు మా మాటగా చెప్పు.. మనం కుసుమపురా న్నిప్పుడు మఱింత సమీపిస్తున్నాం.. కనుక ఇకముందు ప్రయాణంలో సేనావిభాగాన్ని సరిగ్గా అమర్చుకొని నడవాలని చెప్పు!...



ప్రియం : చిత్తం...

విజయ : (ప్రవేశించి) అమాత్యులవారికి జయం!... కుమారమలయకేతువు తమను చూడాలను కొంటున్నారు...

రాక్షస : అమ్మా!.. కొంచెం ఆగు!... ఎవరక్కడ?...

భటుడు : (ప్రవేశించి) చిత్తం...

రాక్షస : నువ్వు వెంటనే వెళ్ళి మేం పూర్వం వర్తకులవద్ద తీసుకున్న ఆభరణాల్లో ఏదో ఒకటి శకటదాసునడిగి తీసుకొనిరా... అలంకారం లేకుండా కుమార మలయకేతువుని చూడకూడదు...

భట : చిత్తం సెలవు... (వెళ్ళి తిరిగి వచ్చి) అమాత్యా! ఇదిగో ఆభరణం...

రాక్షస : (అలంకరించుకొని) అమ్మా! విజయా! మలయకేతువున్న చోటికి మార్గం చూపు...

విజయ : చిత్తం నా వెంట దయచేయండి... ఇరుగో కుమార మలయకేతువు...

రాక్షస : కుమారా! విజయోస్తు...

మలయ : ఆర్యా! అభివాదాలు... కూర్చోండి...

రాక్షస : ఎందుకో రమ్మన్నారట...

మలయ : ఆఁ!... ఏంలేదూ!... విజయయాత్రా సన్నాహాలన్నీ సిద్ధంగా ఉన్నాయి. యుద్ధవ్యూహాన్ని తెలుసుకొందామని...

రాక్షస : అప్పుడే రాజన్యు లందఱికీ వార్త పంపాను.. మగధ, ఖశసైన్యాలు నన్ననుసరించి అగ్రభాగంలో ఉంటాయి. హూణ, శక, చీని సేనలు వెనుక భాగంలోను, గాంధార యవనులు మధ్య భాగంలోనూ ఉంటారు... కులూతాది రాజకం నిన్ను పరివేష్టించి ఉంటుంది.

మలయ : (తనలో) ఔర! ఎవరు నన్ను చేంపి చంద్రగుప్తునికి ప్రీతిని కలుగజేయదలచుకొన్నారో వారినే నా రక్షణకు నియోగించాడు... (పైకి) కుసుమపురాని కెవర్నైనా వార్తాహరుని పంపటంకాని, లేదా అక్కణ్ణుంచి వార్తాహరు డెవరైనా రావటంకాని జేరిగిందా?

రాక్షస : అలా రాకపోకలాగిపోయి చాలా కాలమైంది.. కొద్దిదినాల్లో మనమే అక్కడుంటాం కదా!...

మలయ : ఊఁ!... అయితే లేఖనిచ్చి చంద్రగుప్తునివద్దకు ఇతణ్ణెందుకు పంపుతున్నారు?

రాక్షస : భద్రా! సిద్ధార్థకా! నువ్వా?... ఏవిఁటిది?...

సిద్ధా : క్షమించేం డమాత్యవర్యా! కొరడాతో కొడుతుంటే రహస్యాన్ని రక్షిం చేలేకపోయాను.

రాక్షస : రహస్యమేవిఁటయ్యా! నాకేం అర్థం కావటం లేదు...

మలయ : భాగురాయణా! ఆచార్యుల కర్థమయ్యేట్లు చెప్పు...

భాగు : చిత్తం... అమాత్యా!... సిద్ధార్థకుడు మీరీలేఖను, సందేశాన్ని చెప్పి చంద్రగుప్తుని దగ్గఱకు పంపించారని చెబుతున్నాడు...

రాక్షస : సిద్ధార్థకా! వాళ్ళంటోంది నిజేవేఁ?!



సిద్ధార్థ : (సిగ్గుతో) దెబ్బలకోర్వలేక చెప్పేశానమాత్యా...

రాక్షస : అబద్ధం... ఇదంతా పచ్చి అబద్ధం...

మలయ : భాగురాయణా! నువ్వా లేఖను చూపించు...

భాగు : అమాత్యా! ఇదిగోలేఖ...

రాక్షస : కుమారా! ఇదేదో శత్రువుల ప్రయోగంలా ఉంది...

మలయ : లేఖతోపాటు మేం మీకిచ్చిన ఆభరణంకూడా పంపారుగా! పోనీ, లేఖ శత్రుప్రయోగమనుకొన్నా మా ఆభరణం వారికెలా లభిస్తుంది?

రాక్షస : ఇది నేను పంపలేదు... ఈ ఆభరణాన్ని ఒకానొక సంతోష సమయంలో సిద్ధార్థకునికి బహుమానంగా ఇచ్చాను.

భాగు : ఏవిఁటీ! ఈ ఆభరణాన్ని – అందులోనూ మహారాజు మలయకేతువు మిక్కిలి మక్కువతో పంపిన మణిహారాన్ని ఒక మామూలు మనిషికి బహుమానంగా ఇచ్చారా?...

మలయ : ఆప్తతముడైన సిద్ధార్థకునిద్వారా సందేశాన్నికూడా పంపుతున్నామని వ్రాశారు?...

రాక్షస : లేఖే నాదికానప్పుడు ఇక సందేశం మాత్రం నాదెలా అవుతుంది?

మలయ : అయతే ఈ ముద్ర ఎవరిదంటారు?

రాక్షస : వంచకులకు కపటముద్రను సృష్టించేటం అసాధ్యం కాదు నాయనా!

భాగు : బాగుంది... సిద్ధార్థకా! ఈ ఉత్తరం రాసిందెవరు?

సిద్ధార్థ : మఱి...మఱి...

భాగు : మళ్ళీ తన్నులు తినకుండా నిజేంచెప్పు!

సిద్ధా : ఇది రాసింది శకటదాసు!

రాక్షస : ఆఁ!. శకటదాసు వ్రాసిందే నిజమైతే నేను వ్రాసినట్లే...

మలయ : అయితే శకటదాసుని పిలిపించేండి...

భాగు : కుమారా! శకటదాసు రాక్షసామాత్యుల సమక్షంలో ఆరాత తనదని ఎలాగూ ఒప్పుకోడు.. కనుక అతని రాతను మఱొకటి తెప్పించి పోల్చిచూద్దాం!

భాసుర : ఇదిగో ప్రభూ! శకటదాసు రాసింది వేఱొకటి ఇక్కడే ఉంది... (ఇంకో లేఖను మలయకేతువుకిస్తాడు)

మలయ : (పోల్చిచూచి) అక్షరాలు ఒకేలా ఉన్నాయి.

రాక్షస : (తనలో) అక్షరాలు ఒకేలా ఉన్నాయ్.. దీన్ని శకటదాసే వ్రాశాడా! శకటదాసు కూడ శాశ్వతమైన కీర్తిని లెక్కించేక చంచలమైన సంపదల్నే ఆశ్రయించాడా? స్వామి భక్తిని వీడి ఆలుబిడ్డలకోసం పాటుపడుతున్నాడా? హుఁ! ఇక అనుమానం దేనికి? ముద్రిక అతని వేలికి ఉంది... అతని మిత్రుడితడు.. శత్రువ్యూహంలో భాగమైన ఈ లేఖ అతనిదిగానే ఉంది. స్వామిభక్తికి స్వస్తిపలికి స్వార్థసిద్ధికి స్వాగతం పలికాడు.

మలయ : అమాత్యా! "తమరు పంపిన ఆభరణత్రయం అందింది" అని వ్రాశారే, ఇప్పుడు మీరు ధరించిన ఆభరణం వాటిలోదేనా? (ఆభరణం వంక తేఱిపాఱచూచి-తనలో) ఏవిఁటిది పితృపాదుల ఆభరణంలా ఉంది! (పైకి) ఇప్పుడు మీరు ధరించిన ఆభరణం మీకెక్కడిది?

రాక్షస : వర్తకుల దగ్గఱ కొన్నాను కుమారా!

మలయ : అసత్యకల్పనతో మా సహనాన్నింకా పరీక్షించేకండి.. ఇది మా పితృపాదులు పర్వతేశ్వరుల ఆభరణం!



రాక్షస : (తనలో) అయ్యో! ఇది పర్వతేశ్వరుని ఆభరణమా? అయితే నిజంగా ఇదంతా చాణక్యుని పనే.. చాణక్యుడే వర్తకులద్వారా పంపి దీనిని మాకు అమ్మించాడు...

మలయ : అమాత్యా! మా తండ్రి ఆభరణాన్ని – అందులోనూ చంద్రగుప్తుని చేతపడిన దాన్ని వర్తకులు విక్రయించారంటే విశ్వసించే దగిందేనా?

రాక్షస : (తనలో) అహో! దోషారోపణం ఎంతదుష్ప్రతారంగా ఉంది! నాముద్ర ఉండటం వల్ల లేఖ నాది కాదనటానికి వీల్లేదు. శకటదాసు మిత్రద్రోహం చేశాడన్నా నమ్మేదెవరు? ఇప్పుడింకేం చెప్పినా లాభంలేదు... చెయ్యని నేరం అంగీకరించేటమే మంచిది!

మలయ : ఆర్యుల నొక విషయం అడగాలి!

రాక్షస : ఆర్యులనడుగు! మేమిప్పుడు అనార్యులమైనాం కదా!

మలయ : (అనునయంగా) అమాత్యా! ఈ ఉత్తరం, ఈ ఆభరణాలు... ఏవిఁటిదంతా?

రాక్ష : అంతా దైవవిలసితం!...

మలయ : (కోపంతో) ఆఁ! దైవవిలసితమా! దుర్బుద్ధి విలసనం కాదూ?.. ఇంకా ఎందుకు కప్పిపుచ్చుకోవాలని చూస్తావ్?... ఎంతటి కృతఘ్నుత?.. నిన్ను నమ్మి మంత్రిగా చేసుకొన్న మా పట్ల క్రూరంగా ప్రవర్తించావు.. నువ్వే సర్వస్వమని విశ్వసించిన నా తండ్రిని విషకన్యను ప్రయోగించి చేంపించావు!...

రాక్షస : (తనలో) గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు ఇది మఱో అభియోగం!.. (పైకి) విషకన్య విషయం నిజంగా నాకేం తెలియదు...

మలయ : అలా అయితే పర్వతేశ్వరుని విషయంలో పాపం మూటకట్టుకొందెవరు?

రాక్షస : ఆ భగవంతునికే తెలియాలి!...

మలయ : భగవంతునికా? క్షపణకుడు జీవసిద్ధికి కాదూ?

రాక్షస : (తనలో) అయ్యో! జీవసిద్ధి కూడా శత్రుచారుడేనా?

మలయ : (కోపంతో) భాసురకా! రాక్షసమిత్రులు, చంద్రగుప్తారాధకులూ అయిన కౌలూతాధిపతి చిత్రవర్మ మలయదేశాధీశుడు సింహనాదుడు, కాశ్మీరాధిపతి పుష్కరాక్షుడు మా రాజ్యాన్ని అపహరింపజూశారనే నేరానికి వారిని సజీవ సమాధిచేయాలి... సింధురాజు సింధుసేనుడు పారశీక ప్రభువు మేఘనాదుడు, మాకోశాన్నీ, గజబలాన్నీ అపహరింపజూచినందుకు వారిని ఏనుగులతో తొక్కించి వధించాలి... ఇది మా ఆజ్ఞ... వెళ్ళు!...

భాసుర : చిత్తం ప్రభూ!

మలయ : (క్రోధంతో) రాక్షసా! సార్థక నామధేయుడవయ్యావ్!... కాని నేను విశ్వాసఘాతకుడైన రాక్షసుణ్ణికాను... మలయకేతువుని... వెంటనే ఇక్కణ్ణుంచి వెళ్ళు... వెళ్ళిపో... చంద్రగుప్తుణ్ణే సేవించు.. నువ్వు చంద్రగుప్త చాణక్యులతో కలిసివచ్చినా మిమ్మల్ని సర్వనాశనం చెయ్యగలను.

భాగు : కుమారా! ఇక కాలహరణం దేనికి? మనసేనల్ని కుసుమపురాన్ని ముట్టడించేటానికి ఆజ్ఞాపించేండి...

రాక్షస : (ఆవేశంతో) హ్హాః!... ఎంతటి దౌర్భాగ్యం?!... అమాయకులు చిత్రవర్మాదులకా చిత్రవధ!... శత్రునాశనం కోసం చేసిన నా ప్రయత్నాలన్నీ మిత్రవినాశంలోనే



పరిణమించాయి.. కిం కర్తవ్యం?... తపోవనానికి వెళ్ళినా చిత్తక్షోభ చేల్లారదు!... ఆత్మహత్యకు పాల్పడదామన్నా అదీ పౌరుషం కాదు... (ఆలోచించి) ఆఁ!... చందనదాసు నావల్ల ప్రాణాపాయంలో పడ్డాడు.. అతణ్ణి రక్షించాలి.. ముందతణ్ణి రక్షించాలి...

(నేపథ్యంలో యుద్ధఘోష, తెర)

★★★

## ఆఱవఅంకం

(సిద్ధార్థకుడు అలంకృతుడై, సంతోషంతో ప్రవేశిస్తాడు.. వేఱొకవైపు నుంచి సమిద్ధార్థకుడు వస్తాడు.. ఇద్దఱూ కౌగిలించుకొంటారు)

సిద్ధార్థకుడు : మిత్రమా! సౌఖ్యమా?

సమిద్ధార్థకుడు : మిత్రమా! దేశాంతరం నుంచి తిరిగి వచ్చి ఎన్నాళ్ళయింది? ఇన్నాళ్ళుగా మా ఇంటికి రాకుండాఉంటే నాకు సౌఖ్యం ఎక్కణ్ణుంచి వస్తుంది?...

సిద్ధా : క్షమించు మిత్రమా!... నేను రావటంతోనే చాణక్యుల వారు ఒక ప్రియవార్తను చంద్రగుప్త మహారాజులకు తెలియజేయమని నన్నాదేశించారు.. తరువాత రాజు గారిని చూసి విషయం విన్నవించి ఆయన అనుగ్రహాన్ని పొంది వచ్చేటప్పటికి ఇంతకాలమైంది.

సమి : ఆ ప్రియవార్తేమిటో తెలుసుకోవచ్చా?

సిద్ధా : నువ్వు తెలిసికోకూడనిదేముంది? ఆర్యచాణక్యుల ప్రతిభా ప్రభావంతో మలయకేతువు రాక్షసుణ్ణి వెళ్ళగొట్టి తనకు అండగాఉన్న ఐదుగురు రాజుల్నీ చంపించాడు... దాంతో మిగతా రాజులు ఇతడు యుక్తాయుక్త విచక్షణ లేనివాడని, స్వీయక్షేమం కోసం సేనలతో తమ తమ దేశాలు వెళ్ళిపోయారు... తరువాత భద్రభటుడు, పురుషదత్తుడు, డింగరాతుడు, బలగుప్తుడు రాజసేనుడు, భాగురాయణుడు, రోహితాక్షుడు, విజయవర్మ, ప్రభృతులంతా కలిసి మలయకేతువును బంధించారు.

సమి : అదిసరేకానీ మిత్రమా! నువ్వు చెప్పిన ఈ రాజులంతా చంద్రగుప్తమహారాజంటే పడక మలయకేతువును చేరారనికదా లోకులనుకొంటున్నారు!... మఱి, చేతకాని కవి రాసిన నాటకంలో లాగ మొదట్లో ఒకటి, చివర్లో ఒకటీ ఏవింటీ?



సిద్ధా : విధివిధానంలా చాణక్యనీతి కూడా దురవగాహమైంది... దానికి మొక్కాల్సిందే!

సమి : ఆ... ఆ తర్వాత?...

సిద్ధా : ఆ తర్వాత ఇంకేముంది? చాణక్యులవారు తగిన బలంతో బయల్దేరి మ్లేచ్ఛ బలాన్నంతా లోగొన్నారు.

సమి : అది సర్లే కాని మొదట్లో అధికారాన్ని వదలుకున్న చాణక్యుడు మళ్ళీ తగుదునమ్మా అని ఆ పదవికెలా సిద్ధపడ్డాడు?

సిద్ధా : నీతెలివితక్కువకి జాలేస్తోంది... అమాత్య రాక్షసులంతటివారు అర్థంచేసికో లేని ఆర్య చాణక్య నీతిని నువ్వర్థం చేసుకోవాలనుకొంటున్నావు...

సమి : ఇంతకీ అమాత్య రాక్షసులిప్పుడెక్కడ?...

సిద్ధా : మలయకేతువు శిబిరాన్నుంచి బయల్దేరి ఈ పాటలీపుత్రానికే వచ్చినట్లు ఉదుంబరుడనే చారుడు చాణక్యులకు తెలిపాడు...

సమి : అమాత్యరాక్షసుడు నందరాజ్యాన్ని పునఃప్రతిష్ఠించాలనే దృఢనిశ్చయంతో ఊరు విడిచిపెట్టారు కదా! మఱి, ఇష్టసిద్ధి కాకుండా తిరిగి ఎలా వచ్చాడు?...

సిద్ధా : బహుశః చందనదాసుమీది స్నేహం కొద్దీ వచ్చాడను కొంటాను...

సమి : అయతే చందనదాసును విడిచిపెడతారంటావా?...

సిద్ధా : ఆ దురదృష్టవంతునికి అంత అదృష్టమెక్కడ? ఇప్పుడే మనిద్దఱినీ అతణ్ణి వధ్యస్థానానికి తీసికొని వెళ్ళమని ఆర్య చాణక్యులు ఆదేశించారు.

సమి : (కోపంతో) ఏవిఁటీ! ఆర్యచాణక్యులకు వేఱే తలారి వాడెవడూ దొరకలేదా? ఈ పాపిష్ఠి పనికిక్కూడా మన్నే పురమాయించాలా?

సిద్ధా : మిత్రమా! బతుకుమీద ఆశ ఉంటే కిక్కురుమనకుండా నడు... తలార్లవేషంలో చందనదాసుని వధ్యస్థానానికి చేరుద్దాం!

**జీర్ణోద్యానం**

ఆర్తపురుషుడు : (తనలో) ఉదుంబరుడనే గూఢచారి రాక్షసులవారు ఈ జీర్ణోద్యానంలో సంచరిస్తున్నారని చాణక్యులవారికి చెప్పాట్ట. చాణక్యులవారి ఆజ్ఞానుసారం అమాత్యరాక్షసులకోసం ఎదురుచూస్తూ ఇక్కడే ఉంటాను... అదుగో... తలమీద ముసుగేసుకొని అమాత్య రాక్షసులవారిటే వస్తున్నారు.. ఈ చెట్లతోపులో ప్రచ్ఛన్నంగా ఉండి చూడాలి...

రాక్షస : (విచారంగా) విధి నాకెంత ప్రతికూలమైంది! "వారాంగ నేవ నృపనీతి రనేకరూపా" అనే ఆర్యోక్తిలోని ప్రత్యక్షరసత్యం ప్రత్యక్షమౌతోంది... నా ప్రజ్ఞాపౌరుషాలు వ్యర్థ మైనాయి... శత్రువులచేజిక్కి మరణమైనా పొందుతాను కానీ చంద్రగుప్తునితో సంధికంగీకరించేను... చేసిన ప్రతిజ్ఞ నిలుపుకోలేకపోయాననే అపకీర్తి ఒకటే మిగులుతుంది. చందనదాసు వృత్తాంతమే తెలియకుండా ఉంది...

(నేపథ్యంలో పటహాభేరీ నినాదం) ఏవిఁటీ ధ్వని? (మళ్ళీ అదేధ్వని)

ఓహో! ఈ విజయదుందుభిస్వనం మలయకేతువుని పట్టి బంధించేటం వల్ల రాజకులానికి (సిగ్గుతో) ఛ!.. ఛ!.. మౌర్యకులానికి కలిగిన ఆనందోత్సాహసూచన...



ఆర్త : (తనలో) రాక్షసులవారు ఉపవిష్టులయ్యారు. ఇక చాణక్యులవారి ఉపదేశాన్ని పాటించాలి. (రాక్షసుని చూడనట్లు అతనికెదురుగా ఉరితాటిని మెడకు చుట్టుకొంటాడు)

రాక్షస : (తనలో) అరెరెఁ!... వీడెవడో నావంటి నిర్భాగ్యుడే మఱొకడులా ఉంది... (పైకి) నాయనా! నాయనా! ఏవిఁటిదీ? ఏవిఁటి నువ్వు చేస్తున్నపని?...

ఆర్త : (దుఃఖంతో) నన్నాపకండి... ప్రియజనవియోగం కలిగినప్పుడు ఎవరుమాత్రం ఇంతకంటె ఏంచేస్తారు?...

రాక్షస : ఆగు నాయనా!... చేచ్చినవాళ్ళతో పాటు మనమూ చావలేం కదా! ఇంతకీ నీకు వచ్చినకష్టవేఁవిఁటి?...

ఆర్త : ప్రియమిత్రుడు విధిలేక చావటానికి సిద్ధమైనాడు.. ఆ వార్త ఈ చెవులతో వినేముందే ప్రాణాలు తీసుకుంటే కనీసం పరలోకంలోనైనా కలిసి ఉండవచ్చేని!...

రాక్షస : నేనూ అలాంటి దుఃఖాన్నే అనుభవిస్తున్నానయ్యా!... నీకభ్యంతరం లేకపోతే వివరంగా చెప్పు!...

ఆర్త : మీరింతగా అడుగుతున్నారు కనుక చెబుతాను... ఈ ఊళ్ళో నా మిత్రుడు జిష్ణుదాసనే ఒక రత్నాలవ్యాపారి ఉన్నాడు.

రాక్షస : అవును.. చందనదాసు ప్రియమిత్రుడు...

ఆర్త : అవును! ఆ నా ప్రియమిత్రుడు జిష్ణుదాసు తన ధనాన్నంతా బీదసాదలకు దానం చేసి అగ్నిప్రవేశం చెయ్యబోతున్నాడు...

రాక్షస : అతనికంత అగత్యం ఏమొచ్చిందయ్యా?

ఆర్త: అతని ప్రియ మిత్రుడు చందనదాసుని చంద్రగుప్తుడు ఈనాడే ఉరితీయటానికి నిర్ణయించాడు... జిష్ణుదాసు తన సర్వస్వం ఇస్తాను, చందనదాసుని విడిచిపెట్టమన్నా చంద్రగుప్తుడు ఒప్పుకోలేదు...

రాక్షస : జిష్ణుదాసు సర్వస్వం ఇస్తానన్నా ఒప్పుకోలేదా చంద్రగుప్తుడు? మఱేం కావాలట?

ఆర్త : చందనదాసు అమాత్యరాక్షసుల వారి కుటుంబానికి ఆశ్రయమిచ్చాట్ట! వాళ్ళని తన కప్పగిస్తేకానీ చందనదాసుని విడిచిపెట్టనన్నాట్ట!... చందనదాసు ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డాడుకానీ, అమాత్య రాక్షసులవారి కుటుంబాన్ని అప్పగించేటానికి అంగీకరించేలేదు...

రాక్షస : (తనలో) భళా చందనదాసా! ఈ త్యాగంతో నువ్వు శిబిచక్రవర్తిని మించావు సుమా! (పైకి) చందనదాసుని నేను బ్రతికిస్తాను.. నువ్వు త్వరగా వెళ్లి జిష్ణుదాసు అగ్ని ప్రవేశాన్నాపు!

ఆర్త : చందనదాసుని మీరెలా రక్షిస్తారు?...

రాక్షస : నాయనా! నేనే ఆ రాక్షసుణ్ణి.. (కత్తినిదూసి) ఈ ఖడ్గసహాయంతో నాకదోపెద్ద పనేమీకాదు!

రాక్షస : ఆం!... అమాత్య రాక్షసులు మీరేనా? నా జన్మ తరించింది... అనుగ్రహించండి (కాళ్ళమీదపడి) నా సందేహాన్ని తీర్చండి...

రాక్షస : లేనాయనా! లే... ఇప్పుడే వెళ్ళి జిష్ణుదాసుకీ విషయం తెలియజెయ్యి!...

ఆర్త : (మళ్ళీ విచారంగా) కానీ ఏం లాభం లేదు.. మీరేం చేయలేరు...

రాక్షస : అదేం నాయనా? ఎందుకని?

ఆర్త : ఇదివరకిలాగే శకటదాసుకి మరణశిక్ష విధిస్తే ఎవరో కత్తితో తలారులను భయపెట్టి ఆయనని విడిపించుకుపోయాడట! దాంతో చంద్రగుప్తు దుగ్రుడై ఆ తలారుల తలలు తీయించి వాళ్ళ స్థానంలో కొత్తవాళ్ళను నియమించాడు... ఇకముందెవరైనా కత్తితో అంతదూరంలో కనిపించినా చేంపవలసినవాణ్ణి మఱుక్షణమే చేంపివేయమని ఆజ్ఞాపించాడు...



రాక్షస : (తనలో) ఆహాఁ ఈచాణక్యనీతి ఎంత దురవగాహంగా ఉంది... శకటదాసుని నా దగ్గఱకు నిజంగా అతడే పంపితే తలారుల్ని చేంపటం ఎందుకు? అతడు పంపకపోతే శకటదాసు ఆ లేఖ ఎందుకు రాస్తాడు? ఎంత ఆలోచించినా అంతుపట్టటం లేదు.. (పైకి) అలా అయితే నాప్రాణాలిచ్చైనా చందనదాసుని రక్షిస్తాను. నేనిటు చందనదాసు దగ్గఱకు వెడతాను... నువ్వు ముందు వెళ్ళి జిష్ణుదాసు అగ్నిప్రవేశాన్ని ఆపు... పద...పద...

★ ★ ★

## ఏడవఅంకం

(వధ్యస్థానం. వజ్రలోముడనే చండాలుడు ప్రవేశిస్తాడు.)

వజ్రలోముడు : (డప్పుకొడుతూ) ఇనుకోండి... ఇనుకోండి... పెబువు లోరికి ఇట్టంనేంది సేసినందుకు ఈ సెందనదాసు సెట్టిగోరికి మరన చిచ్చ ఇదించిన్రు... అమాచ్చ రాచ్చసు లోరి ఆలుబిడ్డల్ని పెబువులోరి ఆన పెకారం వొగ్గీయ నందుకీ చిచ్చ...

బిల్వపత్రకుడు : ఒరేయ్! వొజిరలోవుఁడా! వొచ్చేసినోం రా... సంపేసోటి కొచ్చేసినం...

వజ్ర : అవున్రోయ్.. బిల్లోత్తుడా! మఱి సెందనదాసయ్యగోరి ఆలుబిడ్డల్ని ఎల్లిపొమ్మని సెప్పరా!...

బిల్వ : అయ్యోయ్! సెందనదాసయ్యా! సంపేసోటికొచ్చేసినం... మీవోల్లనింకొగ్గేయ్...

చందన : మాలినీ! ఇక నువ్వింటికి వెళ్ళు!...

మాలిని : (దుఃఖంతో) ఆర్యపుత్రులు దేశాంతరం వెడుతుంటే అలాగే వెనక్కి తిరిగిపోయేదాన్ని.. మీప్రయాణం పర లోకాని కైనప్పుడు నన్ను తిరిగివెళ్ళమనటం ధర్మమా?... (వెక్కి వెక్కి ఏడుస్తుంది)

చందన : ఊరుకో మాలినీ! ఊరుకో! పరమమిత్రుని కార్యంలో నాకీ పరలోకప్రయాణం ప్రమోదహేతువే కాని పరితాప కారణం కాదు...



మాలిని : అయితే ఇది కులస్త్రీలకు వెనుదిరగవలసిన సమయం కూడా కాదు...

చందన : అంతకంటే చేసేదేముంది చెప్పు!...

మాలిని : మీతో సహగమనం చేసి చరితార్థురాలనౌతాను...

చందన : తప్పు మాలినీ! తప్పు... అభం శుభం ఎఱుగని ఈ పసివానికోసమైనా నువ్వు జీవించాలి... వాడు ప్రాజ్ఞుడయ్యేవఱకైనా నువ్వు జీవించేక తప్పదు... వాడికి నీరక్షణ అవసరం...

మాలిని : వాడికి భగవంతుడి ఆశీస్సులుంటాయి. (కొడుకుతో) నాయనా! నాన్నగారి పాదాలకు నమస్కరించు...

కొడుకు : (తండ్రిపాదాలకు నమస్కరించి) మీరు లేనప్పుడు నేనేం చెయ్యాలి నాన్నా?

చందన : తండ్రీ! నువ్వూ, మీఅమ్మా – చాణక్యుడు లేనిచోట జీవించండి!

వజ్రలో : అయ్యోయ్!... సెందనదాసయ్యా! కొఱితిని బాతీసినం... ఇంక మీవోల్లనొగ్గేయ్...

మాలిని : అయ్యా! రక్షించేండి... రక్షించేండి... (ఏడుస్తుంది)

చందన : మాలినీ! ఎందుకు దుఃఖిస్తావ్?... నాకీ మరణశిక్ష అనుచితమైన పనిచేసినందుకు కాదుగా, ఊరుకో... ఇక్కడ మన మొఱ వినే వాళ్ళెవరూ లేరు.. మొఱలాల కించే నందుడేనాడో దివంగతుడయ్యాడు... ఊరుకో.. ఇది

నిజంగా సంతోషించే వలసిన సమయం. స్వర్గస్థులైన వారి జనాన్ని దేవతలు రక్షిస్తారంటారు... ఊరుకో...

వజ్ర : వోరి బిల్లొత్తుడా! సెందనదాసయ్యగోర్ని పట్టుకోరా! ఆలుబిడ్డలు ఆల్లే పోతారు...

బిల్వ : ఇదిగో పట్టేసినా!... వొల్లకమ్మవొల్లకో.. ఇంటికెల్లిపోమ్మా! ఏటిశాత్తాం...

చందన : ఆగు... ఒక్కముహూర్తం ఆగు... కడసారిగా కొడుకును కౌగిలించుకోనీ... (కొడుకును కౌగిలించుకొని ముద్దు పెట్టుకొని) నాన్నా! చావనేది ఏదో ఒకనాడు తథ్యమే అయినా మిత్రకార్యంలో మరణించేటమన్నది అనేక జన్మల సుకృతం. (మళ్ళీ ముద్దుపెట్టుకుంటాడు)

కొడుకు : ఆ విషయం మీరు వేఱుగా చెప్పాలా నాన్నా! ఇది మనకు వంశాచారమే కదా!

మాలిని : (ఔొమ్ము బాదుకొంటూ) అయ్యలారా! కాపాడండి.. కాపాడండి... (తెరను తొలగదీసుకుని రాక్షసుడు ప్రవేశిస్తాడు)

రాక్షస : అమ్మా! భయపడకు... ఒరేయ్! ఆగండిరా! చందనదాసుని చేంపకండిరా! నన్ను చేంపండిరా!...

చందన : (కన్నీటితో) అమాత్యా!. ఏవిఁటిది?

రాక్షస : నీపుణ్యమయ జీవితంలోని ఒక అనుపమ ఘట్టానికి అనుసరణ. ఇందులో నేచేస్తోందేమీ లేదు..అంతా నా



స్వార్థమే.. ఒరేయ్! వెళ్ళి నేనొచ్చానని చాణక్యునితో చెప్పండిరా!...

వజ్ర : యామని సెప్పమన్రూ?...

రాక్షస : రాక్షసుడు వచ్చాడనీ, చందనదాసు ప్రాణాలకు బదులు తన ప్రాణాలు తీయుమని అడుగుతున్నాడనీ చెప్పండిరా!...

వజ్ర : వొరేయ్! బిల్లొత్తుడా! మాగొప్ప సిక్కులోపడిపోనాన్రా... సర్లేరా... నేపొయ్యి అమాచ్చరాచ్చసులోరొచ్చేసిన్రని సాణక్కులయ్యోరికి మనయిసేసొత్తాను, నువ్వీ వల్లకాడు సెట్టునీడ్న ఈల్లని సూత్తా వుండు.. జాగరతరొరేయ్! పీకలమీదెవ్వారం...

బిల్వ : అట్నేరా! ఆపాటి నాకు తెల్దేటి? నువ్వు బేగొచ్చీయ్... (నిష్క్రమిస్తాడు– మొహం మాత్రం కనిపించేట్లు ధరించిన మేలికవచంతో చాణక్యుని ప్రవేశం)

రాక్షస : (తనలో) అహో! దురాత్ముడు, కాదు.. కాదు... మహాత్ముడైన చాణక్యుడు వస్తున్నాడు... ఇతడు నిజంగా మహాత్ముడే.. మాత్సర్యం వల్ల నేను ప్రశంసించేలేను గాని, సర్వరత్నాలకీ ఆకరమైన సముద్రంలాగా సర్వశాస్త్రపారంగతు డీచాణక్యుడు.

చాణ : (తనలో) ఎన్నాళ్ళకీ మహాత్ముడైన రాక్షసుని దర్శన మైంది!... తన అనల్ప నీతి ధిషణా వైదగ్ధ్యంతో మమ్మల్నీ మా సేననీ దీర్ఘ జాగరణలు చేయించిన పుంభావ రాజనీతి!.. (పైకి) అమాత్య రాక్షసులవారికి విష్ణుగుప్తుని అభివాదాలు..

రాక్షస : (తనలో) ఈ అమాత్య విశేషణమే లజ్జాకరంగా ఉంది.. (పైకి) విష్ణుగుప్తా! నన్ను స్పృశించేకు...

చాణక్య : అమాత్యరాక్షసా! ఈ తలారులెవరనుకొన్నారు? ఇతడు మీకు పరిచితుడైన సిద్ధార్థకుడు. ఇతడే కృత్రిమస్నేహం చేసి ఏ పాపం ఎఱుగని శకటదాసుచేత కపట లేఖ వ్రాయించాడు.. మఱి, ఇతడుకూడా సమిద్ధార్థకుడనే రాజపురుషుడే...

రాక్షస : (తనలో) శకటదాసు మీద కలిగిన అనుమానం అదృష్టవశాత్తూ తొలగిపోయింది.

చాణ : ఇక దాపరికమెందుకు? క్లుప్తంగా చెప్పాలంటే ఇదంతా చంద్రగుప్తునికి మీతో సంధిచేసి మీ అశేష శేముషీ ప్రాభవంతో ఈ సామ్రాజ్యాన్ని వర్ధిల్ల జేయటానికి నేను పన్నిన నీతి... అదుగో.. వృషలుడు తమ దర్శనాభిలాషియై వస్తున్నాడు...

చంద్ర : (తనలో) బలప్రయోగం లేకుండా దుర్జయమైన పరబలాన్ని పరాభూతం చేసిన గురుదేవులు చాణక్యులవారిని చూడటానికి సిగ్గుపడుతున్నాను... (పైకి) గురుపాదులకు ప్రణామాలు.

చాణ : నా ఆశీస్సులు నీకెప్పుడూ ఉండేవే! పూజ్యులైన అమాత్య రాక్షసులకు నమస్కరించు...

చంద్ర : అమాత్యరాక్షసులకు అభివాదాలు...



రాక్షస : (తనలో) చంద్రగుప్తుడు ఎంతవాడయ్యాడు... (పైకి) రాజన్! స్వస్త్యస్తు తే...

చంద్ర : అమాత్యవర్యులు, మాన్యులూ అయిన మీరుభయులూ నాకు అండగా ఉంటే ఈలోకంలో అసాధ్యం ఏముంది మహాశయా!

రాక్షస : (తనలో) ఈ చంద్రగుప్తుడు నన్ను మంత్రిగా చేసికోవాలని అభిలషిస్తున్నాడు.. నాకుండే మాత్సర్యంవల్ల విపరీతంగా తోస్తోందికానీ, నిజానికిది అతని వినయ సంపద... చాణక్యుడు నిజంగా కీర్తిశాలి... అదృష్టవంతుడైన రాజుకి మేధా విలసితుడైనవాడు మంత్రిగా ఉంటే రాజు మందబుద్ధి అయినా జయిస్తాడు.. దుర్నీతి పరుడైన రాజుని సేవించే మంత్రి నిపుణుడైనా నది ఒడ్డనున్న వృక్షంలా కూలిపోతాడు...

చాణ : అమాత్యా రాక్షసా! చందనదాసు ప్రాణాలు కాపాడా లంటారా?

రాక్షస : అందులో సందేహమేముంది విష్ణుగుప్తా!

చాణ : అయితే ఇదిగో.. ఈ అమాత్యశస్త్రాన్నందుకోండి...

రాక్షస : వద్దు, విష్ణుగుప్తా... వద్దు... ఈ అమాత్యశస్త్రాన్ని అందు లోనూ నువ్వు ధరించిన దాన్ని ధరించేటానికి నేననర్హుణ్ణి...

చాణ : (నవ్వి) నేను యోగ్యుణ్ణీ, మీరు కాదనా? ఎంతమాట! అదిగో అలా చూడండి.. సర్వసన్నద్ధమై ఏ క్షణాన యుద్ధానికి పిలుపొస్తుందోనని నిద్రాహారాలు లేక

నిరీక్షిస్తోంది రథగజతురగపదాతిసేనా నివహం... ఇదంతా మీ ప్రజ్ఞా భయంవల్ల కాదూ!.. సరే.. పోనీయండి, ఇంతెందుకు? మీరు అమాత్యశస్త్రాన్ని స్వీకరించేకపోతే చందనదాసుకి విముక్తిలేదు...

రాక్షస : (తనలో) విధి అనుల్లంఘనీయం కదా! (పైకి) జయించావ్ విష్ణుగుప్తా నువ్వే జయించావ్... మిత్రరక్షణకీబాధ్యతను స్వీకరిస్తున్నాను...

చాణ : (సంతోషంతో తనలో) అమ్మయ్య! ఇప్పటికి కృతార్థుణ్ణైనాను.. ఇక విశ్రాంతి (పైకి) చంద్రగుప్తా! అమాత్య రాక్షసులు అమాత్య ఖడ్గం స్వీకరించి నిన్ననుగ్రహించారు... నీదెంతటి మహాభాగ్యం? నేటికి నా ప్రతిజ్ఞాపాలన పరిపూర్ణమైంది...

చంద్ర : ఇదంతా తమ కృపావిశేషం!... శ్రమించి సంపాదించింది మీరు, అనుభవించేది చంద్రగుప్తుడు...

భటుడు : (ప్రవేశించి) అమాత్యులకి జయం... భద్రభట, భాగురాయణాదులు మలయకేతువుని బంధించి తీసుకొని వచ్చా రమాత్యా!...

చాణ : భద్ర! అరుగో.. అమాత్య రాక్షసులవారు... వారికి నివేదించు.. ఇక కర్తవ్య నిర్వహణ చేయవలసింది వారే!...

రాక్షస : (తనలో) ఇంకేం చెయ్యను? చాణక్యుడు నన్ను లోబఱచు కొని, ఇప్పుడు విజ్ఞాపనలు కూడా చేయిస్తున్నాడు.. సరే... ఇక తప్పదు... (పైకి) మహారాజా! ఈ మలయకేతువు



వద్ద మేం కొన్నాళ్ళు ఆశ్రితులుగా ఉన్న విషయం మీరెఱిగిందే.. కనుక అతనికి ప్రాణభిక్ష పెట్టవలసిందిగా అభ్యర్థిస్తున్నాను..

(చంద్రగుప్తుడు చాణక్యుని వంక చూస్తాడు)

చాణ : చంద్రగుప్తా! అమాత్యరాక్షసులవారి ఈ తొలికోరిక ఆదరణీయమైంది. (భటునిచూసి) భద్ర! భద్రభట ప్రముఖులతో మా మాటగా చెప్పు.. రాక్షసామాత్యుల విజ్ఞప్తిపై చంద్రగుప్త చక్రవర్తి మలయకేతువును అతని తండ్రి పర్వతేశ్వరుని సింహాసనంపై పునఃప్రతిష్ఠి స్తున్నారు.. కనుక వారందఱినీ వెళ్ళి మలయకేతువుని పట్టాభిషిక్తుని చేసి తిరిగిరమ్మంటున్నామని చెప్పు...

భటు : చిత్తం ప్రభూ...

చాణ : ఆగు!... అమాత్యరాక్షస లాభం వల్ల ప్రీతులైన చంద్రగుప్త చక్రవర్తులవారు చందనదాసశ్రేష్ఠిని సామ్రాజ్యవణిక్ ప్రముఖ పదవితో సత్కరింపనున్నారని చాటించేండి... ఈ సంతోష సమయంలో బంధితులందర్నీ బంధ విముక్తులను చేయవలసిందిగా కారాగారాధ్యక్షునకు వార్తనంపండి...

భటు : ప్రభూ! ఆజ్ఞ!...

చాణ : రాజా! చంద్రగుప్తసార్వభౌమా!...

చంద్ర : గురుదేవా! తమరు....

చాణ : (నవ్వి) ఓ! సంబోధనకు ఆశ్చర్యంగా ఉందా!... నాపని

పూర్తయ్యేవఱకే నువ్వు నా వృషలుడివి.. ఇప్పుడు నిజమైన చక్రవర్తివి...

రాక్షస : (తనలో) ఏమీ ఇతని ప్రజ్ఞావైభవం!...

చాణ : చంద్రగుప్తసార్వభౌమా!.. అమాత్యరాక్షసా! నావల్ల జరుగవలసిన పని ఇంకేమైనా ఉంటే ఆజ్ఞాపించేండి!

చంద్ర : రాజ్యమూ, రాక్షసామాత్యులతో మైత్రీ తమకృపవల్ల లభించాయి... సమూలంగా శత్రునిర్మూలనమైంది. ఇక ఇంతకుమించి కావలసిందేముంది?

రాక్షస : నాడు కల్పాంతంలో సముద్రంలో మునిగిన భూదేవిని విష్ణుమూర్తి వరాహావతారం ఎత్తి రక్షించినట్లే నేడు మ్లేచ్ఛభయభ్రాంతమైన మాతృదేశం చంద్రగుప్త రూపంలో రక్షితమైంది... సర్వే జనా స్సుఖినో భవన్తు!

★★★

# వేణీసంహారం

సంస్కృతమూలం : **భట్టనారాయణమహాకవి**

రంగస్థలకృతి : **డాక్టర్ రామవరపు శరత్‌బాబు**

# ఇందలిపాత్రలు

## పురుషులు

1) సూత్రధారుడు
2) పారిపార్శ్వకుడు
3) భీముడు
4) సహదేవుడు
5) కంచుకి
6) ఒక కంఠం (నేపథ్యంలో)
7) దుర్యోధనుడు
8) కంచుకి (దుర్యోధనుని కొలువులో) (వినయంధరుడు)
9) ప్రతీహారి
10) రాక్షసుడు (రుధిరప్రియుడు)
11) అశ్వత్థామ
12) సూతుడు
13) కృపాచార్యుడు
14) కర్ణుడు
15) సుందరకుడు
16) ధృతరాష్ట్రుడు
17) సంజయుడు
18) యుధిష్ఠిరుడు
19) బుధకుడు
20) పాంచాలకుడు
21) చార్వాకుడు
22) శ్రీకృష్ణుడు
23) అర్జునుడు

## స్త్రీలు

1) చేటి
2) ద్రౌపది
3) సఖి (భానుమతిదేవిచెలి) (సువదన)
4) భానుమతి
5) చేటి (భానుమతీదేవిచెలి) (తరలిక)
6) మాత (సైంధవుని తల్లి)
7) దుశ్శల (సంభాషణలు లేవు)
8) రాక్షసి (వసాగంధి)
9) ఆకాశవాణి (పాత్ర ప్రవేశంలేదు)
10) గాంధారి



# వేణీసంహారం

## ప్రయోక్త

"వింటే భారతం వినాలి, తింటే గారెలు తినాలి" అనే ఆర్యోక్తి ఆంధ్రులకు సుపరిచితమే. అటువంటి విజ్ఞానసర్వస్వ, నవరసభరితమైన మహాభారతాన్ని భారతీయులకే కాక, ఈ విశ్వాని కందించిన వేదవ్యాస భగవానుని పాదపద్మాలకు ప్రణామాలు... ఆ భారతకథ నాధారంగా గ్రహించి వీరరసప్రధానమైన వేణీ సంహారమనే నాటకాన్ని సంస్కృతంలో రచించిన భట్టనారాయణునికి కృతజ్ఞతలు.. దీనిని ప్రదర్శనోచితంగా తెలుగులో రూపొందించినవారు డా।। రామవరపు శరత్‌బాబు.

కథ ప్రసిద్ధమైందే. మాయాజూదంలో ప్రతివ్రతాశిరోమణి ద్రౌపదిని జుట్టుపట్టుకులాగి సభ కీడ్చుకొని వచ్చి సభాంగణంలో ఆమె వస్త్రాపహరణ ప్రయత్నం కావించిన దుశ్శాసనునిగుండెను చీల్చి ఆ రక్తంతో ద్రౌపది కురుల్ని ముడుస్తా నని చేసిన భీముని ప్రతిజ్ఞాపాలనమే ఈ నాటకేతివృత్తం. మూలంలోని సన్నివేశాలను నాటకీయంగా చిత్రించి వీరరసప్రధానంగా ఈ నాటకాన్ని తీర్చిదిద్దిన మహాకవి భట్టనారాయణునికీ, ఈ నాటకానికీ ఒక ప్రత్యేక ప్రతిపత్తి ఉండటం వల్ల ఇది సంస్కృతనాటకాల్లో ఒక రత్నంగా శోభిస్తోంది.

## మొదటిఅంకం

– భీమసహదేవులు ప్రవేశిస్తారు –

భీముడు : (క్రోధంతో) లాక్షాగృహదహనం, విషాన్నప్రదానం, మాయాజూదాలతో మా మానధనాల నపహరించి, ద్రౌపది శిరోజవస్త్రాలను లాగి, సభ కీడ్చిన కౌరవాధములకు నేను బ్రతికుండగా సుఖశాంతులా? అసంభవం!...

సహదేవుడు : అన్నా!... శాంతించేండి... శాంతించేండి...! శ్రీకృష్ణుని మాటలను మన్నిస్తే ధార్తరాష్ట్రులకు ఇహలోకంలో, మన్నించేకపోతే వీరస్వర్గం అలంకరిస్తారు కనుక అక్కడా సుఖశాంతులు లభిస్తాయని ఆయన ఉద్దేశ్యం!

భీమ : (వెక్కిరింతగా) అవునవును.. మీ దృష్టిలో కౌరవులతో సంధిచేసుకోవటమే మంచిది.

సహ : అగ్రజా! పెద్దన్నగారు ధర్మజుని అవరోధమేలేకపోతే నీ తమ్ముల్లో కౌరవుల్ని ఉపేక్షించేవాడెవరు చెప్పు!

భీముడు : (రోషంగా) అవునవును.. అందుకే ఇవాల్టినుంచి నేను మిమ్మల్ననుసరించేను... చూడూ!.. చిన్నప్పటినుంచి నాకు కౌరవులతో విరోధం పెరగటానికి ధర్మజుడుకాని, అర్జునుడుకాని కవలలైన మీ ఇద్దఱూ కానీ కారణం కానే కాదు. మీరు సంధిని కోరుకొంటే కోరుకోండి. నేను మాత్రం దీన్ని ఛేదించి తీరుతాను..

సహ : అన్నా!... అవధులులేని మీ కోపానికి ధర్మజులు బాధపడతారేమో!

భీమ : ధర్మజునికి బాధ అనేది కూడా ఉందా? రాజసభలో అంతటి పరాభవం పాలైన ద్రౌపదిని చూసికూడా, వల్కలాలు ధరించి పన్నెండేళ్ళపాటు కిరాతులతో సహజీవనం గడిపి విరాటుని



కొలువులో అడ్డమైన పనులు చేసిన మనల్ని తలచుకొని నేను బాధపడుతుంటే ఆయనకు చీమకుట్టినట్లైనా లేకపోగా కౌరవులపట్ల క్రుద్ధుణ్ణైన నాపట్ల ఆయనకు కోపం! అందుకని...

సహ : అందుకని?

భీమ : ఇక నాకేమీ చెప్పకు... ధర్మరాజుతో చెప్పు!...

సహ : ఏమఁని చెప్పమంటారు?...

భీమ : మీ ఆజ్ఞను జవదాటటంవల్ల నాకు పాపం వస్తే రానీ, తమ్ముల నిందకు గురైతేకానీ, మితిమీఱిన క్రోధంతో గదనెత్తి కౌరవులను పిండి పిండిచేసే నాకు నేడు మాత్రం నువ్వు అన్నవూ కావు, నేను నీకు తమ్ముణ్ణీ కానని నా మాటగా చెప్పు!...

సహ : (భీముణ్ణి అనుసరించి నడుస్తూ – తనలో) అన్నగారు పాంచాలి నట్టింటివైపు బయలుదేరుతున్నారు... నేనిక్కడే ఉంటాను... (నిలుచుంటాడు)

భీమ : (వెనక్కి తిరిగి చూచి) సహదేవా! వెళ్ళు... ధర్మరాజువద్దకు వెళ్ళు.. నేను ఆయుధాగారానికి వెళ్ళి సాయుధుణ్ణౌతాను...

సహ : అన్నా!... ఇది ఆయుధాగారం కాదు.. పాంచాలి పంచపాళిక...

భీమ : ఏమిఁటీ ఇది ఆయుధాగారం కాదా? పాంచాలి పంచ పాళికా?... సరే.. రా... అక్కడికే వెడదాం...ఆమెతో మాట్లాడితే ధర్మజుడు కౌరవులతో సంధిచేసుకొని మనని ఇంకా ఎంతగా బాధించేదలస్తున్నాడో తెలుస్తుంది.

సహ : ఇదిగో విశాలమైనఆసనం.. ఇక్కడ కూర్చుని కృష్ణాగమనాన్ని నిరీక్షిద్దాం...

భీమ : ఆఁ! కృష్ణాగమనమంటే గుర్తొచ్చింది... ఇంతకీ సంధినియమాలేం చెప్పి శ్రీకృష్ణుని దుర్యోధనునివద్దకు పంపారు?

సహ : అయిదూళ్ళిచ్చి సంధి చేసుకొమ్మని...

భీమ : (చెవులు మూసికొని) అయ్యయ్యో! అజాతశత్రు వింతటి అధమస్థితికి చేరినందుకు నా హృదయం దహించుకు పోతోంది!... నాన్నా! ఈ సంగతి నువ్వు చెప్పనూలేదు, నేను వినునూలేదు... మన మహారాజు క్షాత్రతేజం ఆనాడు పాచికలతోనే అంతరించిపోయింది. నేడు దుర్యోధనుని ఐదూళ్ళను యాచిస్తున్నాడంటే ఇంకేమనాలి?

చేటి : (నేపథ్యంలో) ఊరుకోండమ్మా! ఊరుకోండి...

సహ : (తెరవైపుకు చూసి తనలో) పెల్లుబుకుతున్న కన్నీటితో యాజ్ఞసేని భీముని సమీపిస్తున్నట్లుంది... కనుక పెద్ద కష్టమే వచ్చిఉండాలి... అసలే కోపంతో ఉన్న భీమసేనుడీమె కన్నీటితో మఱింత మండిపడతాడు...

(ద్రౌపదీ, చేటి ప్రవేశిస్తారు. ద్రౌపది కన్నీటితో నిట్టూరుస్తుంది)

చేటి : ఊరుకోండమ్మా! ఊరుకోండి!.. నిత్యం కౌరవుల శత్రుత్వంతో కుతకుతలాడుతున్న యువరాజు భీమసేనులు మీ దుఃఖాన్ని పోగొడతారు...

ద్రౌపది : బుద్ధిమతికా! మహారాజు ప్రతికూలురుకాకపోతే నువ్వన్నది జేరుగుతుంది...

చేటి : ఇదిగో... యువరాజిక్కడే ఉన్నారు... సమీపించేండి.

ద్రౌపది : అలాగే... పద... వెడదాం...

చేటి : యువరాజులకు జయం!...జయం!...



భీమ : (వినకుండా) యుధిష్ఠిరుని క్షాత్రతేజం జూదమాడటంతోనే అంతరించిపోయింది...

చేటి : (వెనక్కి తిరిగి) అమ్మా! యువరాజు భీమసేనులు కోపంగా ఉన్నట్లుంది...

ద్రౌపది : అదే నిజమైతే ఆ కోపమే నాకు కొండంత ఓదార్పు... ఇక్కడే ఉండి ఆయన నిర్ణయం ఏవిఁటో విందాం!

భీమ : (సహదేవునితో–కోపంగా) అయిదూళ్ళతో సంధేవిఁటి? మీ మహారాజు ఐదూళ్ళతో సంధి చేసికొంటే చేసుకోనీ... నేను మాత్రం యుద్ధభూమిలో కౌరవుల్ని నూఱుగుర్నీ నుగ్గునుగ్గు చేసితీరుతాను... దుశ్శాసనుని గుండెలు చీల్చి రక్తం త్రాగుతాను... దుర్యోధనుని తొడలు రెంటినీ పిండికొడతాను...

ద్రౌపది : (సంతోషంతో, జనాంతికంగా) నాథా! మీరిలా మాట్లాడటం నేనింతవఱకు వినలేదు. ఏదీ! మళ్ళీ ఇంకోసారి అనండి!

భీమ : (ఆమె మాట వినకుండానే) యుద్ధభూమిలో కౌరవులు నూఱుగుఱినీ నుగ్గు నుగ్గు చేసి తీరుతాను... దుశ్శాసనుని గుండెలు చీల్చి రక్తం త్రాగుతాను... దుర్యోధనుని రెండు తొడల్నీ పిండికొడతాను...

సహ : ధర్మజుని సంధి సందేశం ఆలోచించి చేసింది కాదంటారా?

భీమ : కాక? ఏవిఁటా సందేశంలో తెలివి? అసలేమని పంపారు?

సహ : ఇంద్రప్రస్థం, వృకప్రస్థం, జయంతం, వారణావతం అనే నాలుగు గ్రామాల్తో పాటు ఇంకొకటేదైనా నీకిష్టమైంది ఐదవదిగా ఇమ్మన్నారు!

భీమ : దీనివల్ల ఒరిగేదేవిఁటి?

సహ : ఇలా గ్రామాల పేర్లు ప్రత్యేకించి చెప్పటంవల్ల విషాన్న ప్రదానం, లాక్షాగృహ దహనం, మాయాజూదంవంటి వారు

చేసిన అపకారాలను గుర్తుచేసినట్లైంది. ఇంద్రప్రస్థం – మనని హస్తినాపురంనుంచి వెళ్లగొట్టిన సన్నివేశాన్ని స్మరింప జేస్తుంది. ఐదవది నీ ఇష్టమనటంలో అత డెలాగూ సంధికంగీకరిం చేడు కనుక యుద్ధానికి ఆహ్వానించే దోషంకూడా అతనిదే అని చెప్పటం...

భీమ : (చిరాగ్గా) దీనివల్ల ఏంచేసినట్లు?

సహ : అన్నా!... దీంతో దుర్యోధనుని దురోదరాన్ని ప్రపంచానికి చాటినట్లైంది. సంధి కంగీకరించేని ఆయన మొండితనాన్ని కూడ లోకానికి తెలియజెప్పినట్లైంది.

భీమ : దీనివల్ల సాధించేదేముంది? మనం వనవాసానికి ప్రతిజ్ఞలు చేసి బయలుదేరిన్నాడే దుర్యోధనుడు సంధికంగీకరించే ఘటం కాదని లోకానికి తెలిసిపోయింది... శత్రువంశ నిర్మూలనం మీకు సిగ్గుచేటవుతోందికాని, నిండుసభలో భార్యను జుట్టుపట్టుకు ఈడ్చటం సిగ్గనిపిం చేటం లేదు కదూ!

ద్రౌపది : (జనాంతికంగా) నాథా! వీరావిషయాన్ని మర్చిపోయి నట్లున్నారు. మీరు మరువకండేం? ...

భీమ : నాయనా!.. ద్రౌపది ఇంకా రావటం లేదే!...

సహ : ఆమె ఎప్పుడో వచ్చింది... కాకపోతే మీకోపావేశంలో మీరు గమనించేలేదంతే!

భీమ : (చూచి) నాక్రోధావేశంలో నీరాకను గమనించేలేదు.. కోపగించుకోకూ!...

ద్రౌపది : మీరు ఉదాసీనంగా ఉంటే నాకు కోపం వస్తుంది కానీ, మీరు క్రోధోద్విగ్నులైతే నాకెందుకు కోపం?...

భీమ : అయితే పగ తీరిందే అనుకో... (చేయిపట్టుకొని ప్రక్కన కూర్చోబెట్టుకుని ముఖంలోకి చూస్తూ) నీమోహంలో ఏదో దిగులు కనిపిస్తోందెందుకు?...



ద్రౌపది : మీరు నా ప్రక్కన ఉంటూ ఉంటే నాకేం దిగులు?...

భీమ : ఇంతకీ దిగులుకు కారణం చెప్పావుకావు.. (కేశపాశంచూసి) అయినా వేఱుగా చెప్పటం ఎందుకు?... భర్తలు సజీవులై సన్నిహితంగానే ఉన్నా పాంచాలరాజపుత్రి ఇంతటి దుస్థితిలో ఉండటం కంటే ఉద్విగ్నతకు వేఱే కారణం ఎందుకు?

ద్రౌపది : బుద్ధిమతికా!.. స్వామికి చెప్పవే! నా అవమానానికి బాధపడేవారాయన తప్ప ఇంకెవరున్నారు?...

చేటి : (భీముని సమీపించి చేతులు జోడించి) అమ్మగారి కోపానికి అంతకంటె ఎక్కువదే ఇవాళ జరిగింది!

భీమ : ఏవిఁటీ?... అంతకంటే ఎక్కువైందా? చెప్పు...చెప్పు!...

చేటి : అమ్మగారివాళ కుంతి, సుభద్రలతో కలిసి గాంధారీదేవికి నమస్కరించేటానికి వెళ్ళారు.

భీమ : పెద్దల ఆశీర్వచనం మంచిదేగా!.. తరువాత?

చేటి : తిరిగివస్తుంటే భానుమతీదేవి కనిపించింది...

భీమ : (కోపంతో) ఆఁ! శత్రుభార్యాదర్శనమా?... అహఁ!... ద్రౌపది కోపానికదా కారణం? తరువాత?

చేటి : ఆమె అమ్మగారిని చూచి గర్వంతో మందహాసం చేసి తన చెలికత్తెలనుచూచి...

భీమ : ఏమంది?...

చేటి : యాజ్ఞసేనీ! నీ భర్తలు ఐదూళ్ళడిగారని వింటున్నాం, ఇంకా మఱి జడ అల్లుకోలేదేమంది...

భీమ : సహదేవా!... విన్నావా?...

సహ : ఆవిడ దుర్యోధనుని భార్య కదా!... భర్త సాహచర్యం వల్ల భార్యలకు భర్తగుణా లలవడతాయి కదా!...

భీమ : బుద్ధిమతికా! అప్పుడు దేవి ఏమంది?...

చేటి : నేను చెప్పలేకపోతే కదా!... అమ్మగారు సమాధానం చెప్పటం!

భీమ : అయితే నువ్వేమన్నావ్?...

చేటి : భానుమతీదేవీ! మీ శిరోజాలు విడిపోకుండా మా అమ్మగారు తమ శిరోజాలనెలా ముడుచుకొంటారని బదులు చెప్పాను!...

భీమ : (సంతోషంతో) భళా!.. బుద్ధిమతికా భళా! బాగాచెప్పావ్! (లేస్తూ) పాంచాలీ! విను... చండప్రచండమైన నా గదాఘాతాలతో దుర్యోధనుని తొడలు తుత్తునియలు చేసి, ఆ రక్తపు చేతులతో నీ వేణిని ముడిచే దినం అతి శీఘ్రంగానే వస్తుంది...

ద్రౌపది : క్రోధోద్భూతులైన మీకసాధ్యం అంటూ ఏముంటుంది?... అది జరిగిన నాడు మీ సోదరుల అభినందనలకు కూడ పాత్రులౌతారు.

(నేపథ్యంలో కలకలం - అందఱూ ఆశ్చర్యంగా వింటుంటారు)

సహ : ఏమిటీభేరీ నాదం?... ఓc కురువంశ వినాశాన్ని సూచించే మనసేన సింహగర్జనలు...

కంచుకి : (ప్రవేశించి) యువరాజా! భగవాన్ వాసుదేవుడు...

(అంతా నమస్కరిస్తూ లేస్తారు)

భీమ : (తొట్రుపాటుతో) శ్రీకృష్ణభగవానుడెక్కడ?

కంచుకి : పాండవపక్షపాతి అనే కోపంతో సుయోధనుడాతనిని బంధింప జూశాడు..

(అంతా కంగారు పడతారు)

భీమ : ఏమిటీ?... బంధించాడా?...

కంచుకి : లేదు... లేదు... బంధించేటానికి ప్రయత్నించాడంతే!...

భీమ : అప్పుడు భగవంతుడేం చేశాడు?



కంచుకి : తన విశ్వరూప ప్రదర్శనతో ఆ సభాసదుల్ని మూర్ఛిల్లజేసి మన శిబిరానికి వచ్చారు... భీమసేనకుమారులను వెంటనే చూడగోరుతున్నారు...

భీమ : (హేళనగా) దుర్మార్గుడు దుర్యోధనుడు భగవంతుడైన శ్రీకృష్ణునే బంధించేలనుకొన్నాడా?... ఓరీ పాపాత్ముడా! ఇక నీ వినాశానికి పాండవులకోపం నిమిత్తమాత్రమేరా!...

సహ : ఆర్యా!... దురాత్ముడైన దుర్యోధనునికి శ్రీకృష్ణుడు భగవంతుడని తెలియదా?...

భీమ : అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న ఆ ఖలునికి ఆత్మారాముడై ఎప్పుడూ నిర్వికల్ప సమాధిలో ఉండే భగవత్ స్వరూపం ఎలా తెలుస్తుంది? (కంచుకితో) జయంధరా! మా అన్నగారిప్పుడు ఏం నిశ్చయించారు?

కంచుకి : మీరు స్వయంగావెళ్ళి మహారాజును దర్శించి వారి అభిప్రాయం తెలుసుకోవటం యుక్తం..

(నిష్క్రమిస్తాడు-నేపథ్యంలో కలకలం - అనంతరం ఒక గొంతు)

ఒక గొంతు : ద్రుపదవిరాటవృష్ణ్యంధక సహదేవ ప్రభృతులైన పాండవసేన అక్షౌహిణీపతులారా! కౌరవసేనాగ్రేసరులారా! వినండి... సత్యవ్రతానికి భంగంకలుగుతుందనే భయంతో అణచుకొన్న యుధిష్ఠిరసార్వభౌముని క్రోధాగ్ని కురువంశాటవీ దావాగ్నిగా ప్రజ్వరిల్లుతోంది...

భీమ : (విని, సంతోషంతో) ప్రజ్వలించేలి. ఆర్యుని క్రోధాగ్ని ఇంకా ప్రజ్వలించేలి...

ద్రౌపది : నాథా! ప్రళయసమయ పర్జన్యగర్జనల వలె ఈ యుద్ధభేరీ నినాదాలేమిటి?

భీమ : ఏముంది? యజ్ఞారంభం కాబోతోంది?

ద్రౌపది : యజ్ఞమా?!...

భీమ : అవును... రణయజ్ఞం.. యుధిష్ఠిరుడు ఈ యజ్ఞదీక్షితుడు, మేం నలుగురం ఋత్విజులం. శ్రీకృష్ణుడు కర్తవ్యోపదేష్ట, నువ్వు సోమిదేవమ్మవు... కౌరవులు యజ్ఞపశువులు... నీదుఃఖోపశాంతే యజ్ఞఫలం.. సకలరాజన్యుల్నీ ఆహ్వానించేటానికే ఆ దుందుభిధ్వానం...

సహ : ఇక గురుజనామతితో మన పరాక్రమాన్ని పరిక్రమింప జేయటానికి పదండి పోదాం,...

భీమ : పూజ్యుడైన ధర్మజుని ఆదేశాన్ననుసరించేటానికి మనం ఎప్పుడూ సంసిద్ధులమే.. దేవీ! మేం కురుకుల వినాశానికి కటిబద్ధులమై వెళ్ళివస్తాం!...

ద్రౌపది : (కన్నీటితో) మీకు శుభపరంపరలు ప్రాప్తించుగాక!...

భీమ,సహ : నీ శుభాశంసనం మమ్మల్ని విజయుల్ని చేస్తుంది...

ద్రౌపది : యుద్ధంలో విజయులై తిరిగి వచ్చిన మీ ఓదార్పుకోసం నిరీక్షిస్తూ ఉంటాను.

భీమ : పాంచాలీ!... ఓదార్పు మాటల్లో ఎందుకు? క్రియారూపంగానే చూపిస్తాం!

ద్రౌపది : నాథా! మఱొక్కమాట! నాపరాభవంవల్ల కలిగిన క్రోధోద్రేకంలో ఏమరుపాటుతో ఉండకండేం!... రిపుబలాలను అప్రమత్తులై ఎదుర్కోండి... జాగ్రత్త!...

భీమ : వీరపుత్రీ!... వీరపత్నీ!... వీరమాతా!...కౌరవ సేనాసముద్రాన్ని మథించేటంలో పాండవులెప్పుడూ అప్రమత్తులే!...

★★★



# రెండవఅంకం

కంచుకి : భానుమతీదేవి మా మాతృదేవి గాంధారీదేవి పాదపద్మాలకు నమస్కరించి తిరిగి వచ్చిందోలేదో ఇప్పుడెక్కడుందో చూసిరమ్మని సుయోధనమహారాజు నన్నాజ్ఞాపించారు... అభిమన్యుని వధించిన కర్ణజయద్రథాదివీరులను సత్కరించేటానికి తాను వెళ్ళాలనీ, కనుక తొందరగా రమ్మనీ వారి ఆదేశం... (ఆకాశంలోకి చూస్తూ)ఆఁ!... ఏమంటున్నావూ?... భానుమతీదేవి అత్తమామలకు నమస్కరించి, తన భర్తకు యుద్ధంలో విజయాన్నాకాంక్షిస్తూ నేటినుంచి వ్రతదీక్షపూని బాలోద్యానంలో ఉందనా?... సరే!... నీపని నువ్వు చూసుకో... ఈలోగా నేను మహారాజుకీవార్త నివేదిస్తాను... పతివ్రతా తిలకమైన భానుమతీదేవీ!... నీ పూనిక ప్రశస్తం... కాని ఒక ప్రక్క శ్రీకృష్ణసహాయులైన పాండవవీరులు యుద్ధానికి తరలివస్తుంటే అంతఃపుర విహారాన్ని కోరుతున్న సుయోధనమహారాజు ప్రవర్తన శ్లాఘనీయంకాదు... పైగా ఆయుధాన్ని పట్టింది మొదలు అకుంఠిత పరాక్రమంతో పరశు రామునే జయించిన భీష్మాచార్యులు యుద్ధంలో ఓడిపోతే దుఃఖించేని దుర్యోధన మహారాజు ప్రౌఢులైన ధానుష్కులు ఒక్కుమ్మడిగా ఎదుర్కొని అలిసి ఏకాకైన బాలుడు అభిమన్యుని వింటిని విఱిచి సంహరిస్తే సంతోషిస్తున్నా డంటే ఏమనాలి?... (నిష్క్రమిస్తాడు) (భానుమతి ఇరువురు సఖులతో ప్రవేశిస్తుంది)

సఖి : సఖీ! భానుమతీదేవీ! అభిమానధనులైన సుయోధన మహారాజు పట్టమహిషివై ఉండీ ఏదో దుస్స్వప్నం వచ్చిందని ఇంత దిగాలుపడిపోవటం ఏమీ బాగోలేదు...

చేటి : సువదన చెప్పింది నిజమేనమ్మా!... కలదేం ఉందమ్మా?... కలలో ఏదైనా కనిపించేవచ్చు.. ఏదైనా పలవరించేవచ్చు...

భాను : మీరు చెప్పింది నిజమే. కానీ ఈకల నాకెంతో అశుభసూచకంగా తోస్తోందే!...

సఖి : ప్రియసఖీ! ఇంతకీ నీకు వచ్చిన కలేమిటోచెప్పు!... దాన్ని బట్టి మేం ప్రతిక్రియ ఆలోచిస్తాం...

చేటి : సువదన చెప్పింది బాగుంది... పీడకలలొస్తే దైవప్రార్థన, దర్భలను చేతపట్టుకోవటం వంటివి చేస్తే ఆ పీడ తొలగి శుభపరిణామాలు కలుగుతాయంటారు.

భాను : అయితే చెబుతా విను!...

సఖి : చెప్పు... చెప్పు...

భాను : ఉండవే!.. భయంతో మఱచిపోతున్నా.. గుర్తుతెచ్చు కునేంతవఱకు ఆగు... (ఆలోచిస్తుంటుంది. కంచుకి, దుర్యోధనులు ప్రవేశిస్తారు)

దుర్యో : శత్రువులకు ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా, తనచేత నైనా ఇతరులవల్లనైనా, కొంచెంగా కానీ, ఎక్కువగాగానీ జరిగిన అపకారం ఎంతో సంతోషాన్నిస్తుందని ఎవరో కాని గొప్పగా చెప్పారు. ఎందుకంటే... నేడు ద్రోణ, కర్ణ, సైంధవాది వీరులు అభిమన్యుణ్ణి వధించేటంతో నామనస్సుకెంతో తృప్తికలిగింది...

కంచుకి : మహారాజా! ద్రోణాచార్యునివంటి మహావీరునికి అభిమన్యువధ ఒక మహాకార్యంకాదు... కర్ణ సైంధవులది మాత్రం ఈ విషయంలో గొప్పేముంది?

దుర్యో : వినయంధరా!... ఏమంటున్నావ్?...ఒంటరివాడు, బాలుడు, ధనుర్విముక్తుడైన అభిమన్యుని ఎందఱో కలిసి చేంపటంలో



గొప్పేముందనా?... ఓరి మూర్ఖుడా!... చూడూ!... శతాధికవృద్ధుడైన భీష్మాచార్యుని శిఖండిని ముందుంచుకొని చేంపటం వల్ల పాండవుల కేఘనత కలిగిందో ఆ ఘనతే మాకూ కలిగింది.. అదంతే... భృత్య, బాంధవ, మిత్ర, సుత, సోదర సహితుడైన సుయోధనుని తనబలంతో అనతికాలంలోనే ధర్మజుడు సంహరిస్తాడు.

కంచుకి : (చెవులు మూసికొని) అమంగళం ప్రతిహతమగుగాక!

దుర్యో : వినయంధరా!... నేనేమన్నానిప్పుడు?

కంచుకి : భృత్య, బాంధవ, మిత్ర, సుత, సోదరసమేతుడైన ధర్మజుని అనతికాలంలోనే సుయోధనుడు సంహరిస్తాడనటానికి సరిగ్గా వ్యతిరేకంగా పలికారు!...

దుర్యో : వినయంధరా!... ఎప్పటిలాగా నాకు వీడ్కోలు చెప్పకుండా భానుమతి ఇవాళ వేకువజామున శయ్యాగృహం వీడింది... అందుకే మనస్సులో దిగులుగా ఉంది... ఆమె ఎక్కడుందో చెప్పు!...

కంచుకి : మహారాజా! ఇటు.. ఇటు.. మహారాణి భానుమతీదేవి చెలులతో అదిగో ఆ బాలోద్యానంలో కూర్చున్నారు. తమరు సమీపించేండి!

దుర్యో : (చూచి) వినయంధరా! మీరువెళ్ళి మా యుద్ధరథాన్ని సిద్ధం చేయండి... మేమూ మీ వెంటనే వస్తాం!

కంచుకి : చిత్తం! (నిష్క్రమిస్తాడు)

సఖి : ప్రియసఖీ! భానుమతీ... గుర్తొచ్చిందా కల?

భాను : సఖీ! గుర్తుకొచ్చింది... ఇవాళ ప్రమదావనంలో కూర్చున్న నా ఎదుటగా అమోఘమైన నకుల దివ్యరూపం సాక్షాత్కరించింది... ఆ నకుల దివ్యరూపం నూఱు పాముల్ని చేంపిందట!...

చెలులిద్దఱూ : (ఆమెకు కనబడకుండా చేతినడ్డం పెట్టుకొని తమలో) అమంగళం ప్రతిహతమగుగాక! (పైకి) తరువాత?... తరువాత?...

భాను : దుఃఖభాజనమైన మనస్సుతో మళ్ళీ మఱిచాను... గుర్తు తెచ్చుకోనీవే!...

దుర్యో : ఓ!... మహారాణి భానుమతీదేవి సువదన, తరళికలతో కలిసి ఏదో ముచ్చేటించుకుంటోంది. ఈ లతల వెనుక నుండి వారి మాటల్ని వింటాను...

సఖి : బెంగపడకు చెప్పు!...

దుర్యో : (తనలో) ఈమె బెంగకు కారణమేమై ఉంటుందబ్బా!... ఒకవేళ పడక గదినుంచి "వెళ్ళొస్తా"నని నాతో చెప్ప కుండా వెళ్ళటమే అయిఉండాలి... దేవీ!... గతరాత్రి నీపట్ల నేనేమీ అనుచితంగా ప్రవర్తించేలేదే!... నేను అన్యస్త్రీలతో కాలక్షేపం చేస్తున్నట్లు కలొచ్చిందా? ఏ పాపం ఎఱుగని నాపై అలిగి నాతో చెప్పకుండానే శయ్యాగారం నుంచి వెళ్ళిపోయావా? అయినా నా ప్రేయసి ఏం చెబుతుందో వింటాను...

భాను : చెలీ! ఆ తర్వాత సాటిలేని సౌందర్యంతో ఆ నకుల దివ్యసందర్శనంతో నాలో ఉత్సాహం పెల్లుబికింది...

దుర్యో : ఏమిఁటీ? నకుల సందర్శనంతో ఉత్సాహం పెల్లుబికిందా? అయితే మాద్రీసుతుడైన నకులునిపట్ల అనురక్తయై ఈ పాపాత్మురాలు మమ్ము వంచిస్తోందన్నమాట!... ఓహో!... ప్రాతఃకాలంలోనే ఈమెకు వ్రతం పేరుతో ఏకాంతవాసం, ఇష్టసఖులతో ముచ్చేట్లు ఇందుకోసమే నన్నమాట! నామోహావేశంతో ఈ కులట మనస్సు తెలియక మోసపోయాను... నా ప్రత్యక్షంలో అంతటి ముగ్ధత్వం, పరోక్షంలో ఇంతటి సాహసం! నయవంచకి!...



సఖి : ఆ తరువాత?...

భాను : నేనాతర్వాత ఉన్నచోటునుండి లతామండపం ప్రవేశిస్తే ఆ దివ్య నకులరూపం కూడా నన్ననుసరించింది...

దుర్యో : అహో! ఈ పాపిష్ఠురాలు ఇలా సిగ్గులేకుండా చెప్పటం జారస్త్రీ జనోచితంగానే ఉంది.

సఖి & చేటి : ఆ తర్వాత?

భాను : ఆ తర్వాత ఆ సుందర నకుల రూపం ఎంతో గర్వంగా తన చేతిని చాపి నా పైట లాగింది!

దుర్యో : ఆఁ! సగర్వంగా పైట లాగటం జరిగిందా? ఇక వినటం ఎందుకూ? ఊఁ! పరస్త్రీ లోలుడై, నీచుడైన మాద్రీసుతుడు నకులుని హతమారుస్తాను... (రెండడుగులువేసి) అంతకంటే ముందీబంధకికే దండించాలి...

సఖి, చేటి : తర్వాత, తర్వాత?...

భాను : ఆ తర్వాత ప్రాతఃకాంలో ఆర్యపుత్రుని నిద్రలేపే మంగళవాద్యాలతో, వారస్త్రీల మేలుకొలుపు పాటలతో నాకు నిద్రనుంచి మెలకువ వచ్చింది...

దుర్యో : ఏమంటోది? నిద్ర నుంచి మెలకువ వచ్చిందనా? అయితే ఇదంతా కలన్నమాట! కానీ సఖుల మాటలతో స్పష్టమౌతుంది.

(సఖులిద్దఱూ దిగులుగా ఒకరినొకరు చూచుకొంటారు)

సఖి : ఈ దుస్స్వప్నంలోని అమంగళం అంతా గంగాజల ప్రోక్షణంతో బ్రాహ్మణాశీర్వచనంతో, హోమాదులతోనూ తీఱిపోతుంది.

దుర్యో : ఇక నా తర్కం వ్యర్థం. ఈమె తనకు వచ్చిన స్వప్నం చెబుతుంటే బుద్ధిహీనుణ్ణైన నేను ఇంకోవిధంగా భావించాను... ఇంకా నయం!... సగమే విని ఆకోపంతో

ఇక్కణ్ణుంచి వెళ్ళిపోయాను కాదు! అదృష్టం బావుండబట్టి సగమే విని దుర్భాషలాడాను కాదు!...

భాను : సఖీ!... ఈ కలలో శుభసూచకమైనదేమైనా ఉందే?

సఖి,చేటి : (ఒకరినొకరు చూసుకొంటూ తమలో) ఈ కలలో శుభసూచకమనేది ఏమాత్రం లేదు... ఈ విషయంలో ఉన్నదున్నట్లుగా చెప్పకపోతే మహారాణిపట్ల అపరాధం చేసినవారమౌతాం. అడిగినప్పుడు వినటానికి కష్టంగా ఉన్నా హితాన్ని చెప్పేవారే నిజమైన మిత్రులు... (పైకి) సఖీ! ఈ స్వప్నంలో శుభమనేది రవ్వంతైనా లేదు. కలలో పంది కాని, ముంగిస కాని, కనిపించేటం, పైగా ఆ ముంగిస నూఱు పాముల్ని చేంపటమనేది అనర్థ సూచకమని స్వప్న శాస్త్రవేత్తలంటారు.

దుర్యో : ఈ సువదన పలికింది సత్యమే... ఒక నకులం శతపన్నగాల్ని వధించేటం. పైట తొలగించేటం తప్పక అమంగళ సూచనే... అందులోనూ ఈ శతసంఖ్య సోదర సహితుణ్ణైన నాకన్వయిస్తున్నట్లుంటోంది... అరే!... ఇదేవిఁటీ ఎడం కన్నదురుతోంది? (గర్వంతో) ఆఁ! పిరికివారిని భయపెట్టే ఇటువంటి శకునాలతో ఈ రారాజుకి లెక్కేవిఁటి? అంగిరస మహర్షి గ్రహచారం, స్వప్నాలు, అపశకునాలు శాంతి ప్రక్రియలూ కాకతాళీయంగా ఫలిస్తాయి. కానీ ప్రజ్ఞాశీలురు వీటికి భయపడరని ఎప్పుడో చెప్పాడు... కనుక నేనిప్పుడు భానుమతికి స్త్రీ సహజమైన బేలతనంతో కలిగిన అనర్థ శంకను రూపుమాపుతాను.

భాను : సఖీ... సువదనా! మధ్యాహ్నం సమీపిస్తున్నట్లుంది...

సఖి : అవును... సూర్యభగవానుడు దుర్నిరీక్షంగా ఉన్నాడు. ఇది మీ సూర్యారాధనకు తగిన సమయం...



భాను : తరలికా! పూజా ద్రవ్యపాత్రను తీసుకురావే!...

తర, చేటి : అలాగేనమ్మా!... (నిష్క్రమిస్తుంది)

దుర్యో : దేవిని సమీపించేటానికిదే తగినసమయం... (సమీపిస్తాడు)

తర,చేటి : (ప్రవేశించి) అమ్మా! ఇదిగో పూజాద్రవ్యాలపాత్ర! ఆదిత్యారాధన ఆరంభించేండి!...

సఖి : (దుర్యోధనుని చూచి, తనలో) ఏవిఁటీ! మహారాజు వచ్చారు?... అయ్యో!.. భానుమతీదేవికి వ్రతభంగం అవుతోందే!...

(దుర్యోధనుడు చేసన్నతో చెలికత్తెలను తప్పించి అర్ఘ్యపాత్రను భానుమతికి అందిస్తాడు)

భాను : (సూర్యునివైపు చూసి నమస్కరిస్తూ) సకల భువనాలకు రత్నప్రదీపమా! నాకు వచ్చిన దుఃస్వప్నం వల్ల ఏ దుష్పరిణామాలూ ప్రాప్తించేకుండా, సోదరయుక్తుడైన ఆర్య పుత్రునికి సకల శుభాలూ కలిగేలా అనుగ్రహించు తండ్రీ! (అర్ఘ్యమిచ్చి) తరలికా! పూలనివ్వవే!...

(పూలకై చేయి చాస్తుంది, దుర్యోధనుడు పూలనందిస్తాడు. అతని హస్తస్పర్శకు పరవశయై పూలను క్రింద పడవేస్తుంది) (కోపంగా) సేవకుల క్కూడా ఇంత నిర్లక్ష్యమా? (తిరిగి దుర్యోధనుని చూచి) తొట్రుపాటుతో) ఆర్యపుత్రా! మీరా?...

దుర్యో : ఈ దాసునికిటువంటి సేవల్లో నేర్పులేదు. కనుక శిక్షార్హుడు...

(భానుమతి సిగ్గుపడుతుంది) సుందరీ! ఈ సేవకుని నీ అపాంగ వీక్షణంతో అనుగ్రహించు... చిరునవ్వులు చిందిస్తూ మధురవాక్కులతో మన్నించు. నీ స్పర్శతో సంభావించు..

భాను : ఆర్యపుత్రా! నేనొక వ్రతనియమంలో ఉన్నానని తెలుసు కదా!

దుర్యో : నీ స్వప్న వృత్తాంతాన్నంతా విన్నాను. దానికి భయపడి కోమలమైన నీ శరీరాన్ని బాధించుకోవటమెందుకు?

భాను : ఆర్యపుత్రా! ఈ స్వప్నంవల్ల అనర్థశంక నన్నెంతో పీడిస్తోంది. అందుకే ఈ వ్రతం.. . అనుగ్రహించేండి!...

దుర్యో : నువ్వింత భయస్థురాలివైతే దశదిశాపర్యాప్తమైన ఈ భూమండలాన్నే సంక్షోభింపజేసే మనఏకాదశాక్షౌహిణీ సేనల ఫలితం ఏముంది?... దిగంతవిశ్రాంత కీర్తిసాంద్రులైన ద్రోణకర్ణాదులెందుకు చెప్పు!... మా నూఱుగురు సోదరుల బాహువుల నీడలో నువ్వెప్పుడూ సురక్షితవై ఉన్నావు... ఈ దుర్యోధనుని ఇల్లాలివైన నీ కీబేలతనం ఎందుకు?...

భాను : ఆర్యపుత్రా! మీరు నావద్ద ఉంటే నాకు భయమేమీ లేదు... అయినా మీమనోరథ సిద్ధినే నేనెప్పుడూ కోరుకొనేది!...

దుర్యో : సుందరీ! నీతో కలిసి యథేచ్ఛగా విహరించేటమే నా కోరిక. చిఱునవ్వులు చిలికిస్తున్న నీ ముగ్ధమనోహర రూపాన్ని తనివితీరా ఆస్వాదించేటం కంటె దుర్లభమైం దేమీ లేదు... సదా నీ పరిష్వంగంలో నీ అధరసుధను పానంచేయటాన్ని మించిన అదృష్టమేముంది? ...(నేపథ్యంలో గొప్ప కలకలం-ఝంఝామారుత ధ్వని)

భాను : (భయంతో కౌగిలించుకొని) ఆర్యపుత్రా! రక్షించేండి... రక్షించేండి!

దుర్యో : ఎందుకంత కంగారు? సుడిగాలి తీవ్రంగా వీస్తోంది అంతేగా!...



సఖి : మహారాజా! ఈ ప్రళయ ఝంఝానిలంతో చెట్లన్నీ కూలిపోతున్నాయి...ఈ లీలాపర్వతం మీదున్న ప్రాసాదాన్ని ప్రవేశించేండి.. ఈ గాలికి దుమ్మురేగి కళ్ళలో పడి గ్రుడ్డివాళ్ళను చేస్తోంది... మీరా భవనంలోకి వెళితే రక్షణ!

దుర్యో : (సంతోషంగా) ఈమహావాయువువల్ల మాకో మహోపకారం జరిగింది!... ఎందుకంటే అప్రయత్నంగానే వ్రతనియమాన్ని విడిచి నాదేవి నన్నాలింగనం చేసికొని నన్నానందాబ్ధిలో ఓలలాడించింది... దేవీ!... ఈ గృహాంతర్భాగంలోకి వెడదాంరా.. అక్కడికీ సుడిగాలి చేరలేదు...

భాను : (ప్రవేశించి) హమ్మయ్య! దైవవశంవల్ల సుడిగాలి లోపలికి రాకపోవటం వల్ల హాయిగా ఉంది...

దుర్యో : అయినా నువ్వు భయంతో బాగా అలిసిపోయావు. కాసేపు నా ఒళ్ళో కూర్చుని అలసట తీర్చుకోవచ్చుకదా! (భానుమతి సిగ్గుపడుతుంది)

కంచుకి : (ప్రవేశించి) మహారాజా! భగ్నం.. భగ్నం...

దుర్యో : ఏవిఁటి?

కంచుకి : భీమ...

దుర్యో : ఏవిఁటావాగుడు?...

భాను : ఆర్య! అమంగళం పలుకుతున్నారేవిఁటి?...

కంచుకి : మీ... భీమ...

దుర్యో : ఏవిఁటా ప్రేలాపన? మతిపోయిందా?...

కంచుకి : ప్రేలాపన కాదు... నిజమే... భీమవాయువులతో మీ రథకేతనం కూలిపోయింది.

దుర్యో : ఈ భీషణవాయువుతో ప్రపంచమే కంపించిపోతుంటే రథకేతనం పడిపోవటంలో వింతేముంది? ఈ మాత్రానికే భగ్నం భగ్నమని గోలపెట్టాలా?

కంచుకి : మహారాజా! ఏంలేదు... ఈ అనిమిత్త పరిహారం కోసం ఏదైనా శాంతి చేయించాలనే స్వామిభక్తే నన్ను ప్రేరేపించింది!

భాను : ఆర్యపుత్రా! దీనికేదైనా హోమాదికాలు జేరిపించి, శాంతిచేయించటం మంచిది...

దుర్యో : ఊం!...సరే...అయితే వెళ్ళి మన పురోహితుడు సుమిత్రునితో ఈ విషయం చెప్పు!...

కంచుకి : ఆజ్ఞ!... (నిష్క్రమిస్తాడు)

ప్రతిహారి : (ప్రవేశించి) మహారాజులకు జయం!... తమదర్శనానికై సైంధవుల తల్లి, దుశ్శల వేచి ఉన్నారు.

దుర్యో : వెంటనే ప్రవేశపెట్టు!...(దుశ్శలా, సైంధవుని తల్లీ ప్రవేశించి కాళ్ళమీదపడి ఏడుస్తారు)

మాత : నాయనా! రక్షించు... రక్షించు... (మాతా, దుశ్శలా ఏడుస్తారు)

దుర్యో : (వారిని లేవదీసి) ఊరుకోండి! ఊరుకోండి! ఏమైంది? సైంధవుడు కుశలమేనా?

మాత : ఏం కుశలం నాయనా?...

దుర్యో : ఏం?...

మాత : అభిమన్యునివధతో క్రుద్ధుడైన గాండీవి నేటి సూర్యాస్తమయంలోగా సైంధవుని సంహరిస్తానని ప్రతిన పూనాట్ట!

దుర్యో : (చిఱునవ్వుతో) ఓ!.. మీ దుఃఖానికిదా కారణం?... పుత్రవధజనితోన్మాదంతో చేసిన పార్థుని ప్రలాపాల కింత పరితపించాలా?... నా భుజరక్షణలో ఉన్న సైంధవుని కన్నెత్తి చూడటానికైనా ఆ కవ్వడికెన్ని గుండెలు?



మాత : అవుననుకో! అయినా తమ పుత్రుని వధించారన్న కోపావేశంతో పాండవులెంతకైనా తెగించి యుద్ధం చేస్తారు కనుక భయం!

దుర్యో : పాండవులకోపం ఎవరికి తెలియంది? (ఎగతాళిగా) చూడు– నా ఆజ్ఞతో దుశ్శాసనుడు నిండు సభలో ద్రౌపది జుట్టుపట్టి ఈడ్చి వలువలొలుస్తూ ఉంటే ఈ గాండీవి అక్కడ లేడా? రాచబిడ్డ శస్త్రాస్త్ర నిపుణుడు, యువకుడైనవానికంత కంటే కోపం రాదగ్గ సన్నివేశ మేముంది?...

మాత : తన ప్రతిజ్ఞ నెరవేర్చలేకపోతే ఆత్మాహుతి చేసికొంటానని ప్రతిజ్ఞ కూడా చేశాట్ట!

దుర్యో : మఱి దానికి సంతోషించేవలసిందిపోయి దుఃఖిస్తారేం? నీకొడుకు గొప్పతనం నీకు తెలియటం లేదమ్మా!... కౌరవ శతంతో కృప కర్ణద్రోణాశ్వత్థామాది అతిరథమహారథుల అండదండలతో అవక్ర పరాక్రమోపేతుడైన నీ పుత్రుని పేరెత్తటానికైనా ఆ పార్థునికి కాని ఇంకోడికి గాని ఎలా వీలౌతుందమ్మా?...

భాను : ఆర్యపుత్రా! మీరు చెబుతోంది నిజమే అయినా ధనంజయుని ప్రతిజ్ఞాస్వీకారం ప్రమాదసూచకం, భయహేతువు కదా!...

దుర్యో : ఆం!... పాండవులు ఈ దుర్యోధనునికా భయ హేతువులు?... నా అశేష సేనావాహిని శత్రువులపై పడి పాండవసేనని నుగ్గు నుగ్గు చేస్తుంది!... భానుమతీ దేవీ!... పాండవ ప్రతాపం ఏపాటిదో తెలిసికూడా శంకిస్తు న్నావా?... చూడు, దుశ్శాసనునిరక్తం త్రాగుతానని, నా

తొడలు విరగకొడతాననీ (ఎగతాళిగా) మహాశూరులు పాండవుల ప్రతిజ్ఞ ఎటువంటిదో సైంధవుని సంహరిస్తా నన్నదీ అటువంటిదే!... (చేప్పట్లు చేఅచి) ఎవరక్కడ?... నా జైత్రరథాన్ని సిద్ధం చెయ్యండి... వీరమరణం కాకుండా ప్రతిజ్ఞా భంగంతో సిగ్గుతో చేచ్చే చావెటువంటిదో ఆ సవ్యసాచికి ఉపదేశించి వస్తాను...

కంచుకి : మహారాజా!... మీ జైత్రరథం సిద్ధంగా ఉంది!...

దుర్యో : దేవీ!... నువ్వు అంతఃపురానికి వెళ్ళు... నేనూ ఆ పార్థునికి ప్రతిజ్ఞాభంగంవలన సిగ్గుతో చేచ్చే చావెటువంటిదో ఉపదేశించి వస్తాను. (అంతా నిష్క్రమిస్తారు)

★★★



## మూడవఅంకం

రాక్షసి : (వికృతంగా నవ్వుతూ సంతోషంగా) చేచ్చిన ఈరుల మాంసం గుట్టలు, ఎయ్యి కడవల వసతో నిండిపోయిన ఈ యుద్ధభూమిలో నెత్తురు తాగుతానే ఉన్నా... ఈ యుద్ధం ఎయ్యేల్లు వొద్దిల్లాల!... (సంతోషంతో గెంతుతూ) సైంధవున్ని సంపిన నాదు మల్లే పెతిదినం అజ్జునుడు యుద్దం సేత్తాంటే నా ఇల్లు రగతమాంసాలతో నిండిపోతా ఉంటాది... (అటూ ఇటూ తిరిగి అన్నివైపులకీ చూస్తూ) ఇంతకీ నా మనసైనోదు, నా పెనివిటి రుదిరపియు డెక్కద?... ఒరేయ్!... రుదిరపియా!... రుదిరపియా!... ఇటురమ్మీ! ఓపాలిటురమ్మీ!...

రాక్షసుడు : (విని) నన్నెవిత్తే పిలుత్తాంది! ఓ!... వొసాగందా!... (దగ్గఱకు వచ్చి) ఎందుకే ఆ కేకలు? నానీణ్ణిగా ఉంది!...

రాక్షసి : వొరే రుదిరపియా!... నీకోసం ఇప్పుడే సచ్చిన రాజు కొవ్వుతో గోరెచ్చటి రగతం, మాంసం తెచ్చినానురా... మాంసాన్ని నంజుకొంటూ నెత్తురు కల్లు తాగరా!...

రాక్షసుడు : వొలే వసాగందా!... మా మంచిపని సేసినావే!... బాగా దప్పిగ్గా ఉందే! ఇయ్యి...

రాక్షసి : ఇంత యుద్దబూమిలో తిరుగుతున్న నీకు దప్పికేటిరా!... ఇద్దూరం కాకపోతే?...

రాక్షసుడు : గటోతుకచుడు సచ్చినాదు గంద!... ఇడింబను సూట్టానికి పోయినానే!

రాక్షసి : కొడుకు పోయిన దుక్కం ఆ అమ్మకింకా తీరనే లేదేంటిరా?...

రాక్షసుడు : అప్పుడే ఎట్టాతీరుతుందే! అబిమన్నుడు పోయిన సుబదరా, పాంచాలీ దేయి ఆ అమ్మ నోదారుత్తుండారు!... ఆc!... ఇంతకీ ఏపాటి రగతమాంసాలు నిలవ సేసినావే?...

రాక్షసి : ఇందంక నిలవసేసింది నీకెరికేగందా!... బగదత్తుని నెత్తురుతో ఉన్న కుండొకటి, సైందవుని కొవ్వుతో రెండు కుండలు, దురుపదుడు, ఇరాటుడు, బూరిసెవసుడు, సోమదత్తుడు, బాయిలికుడు వంటి రాజులు, మిగతా సైనికులు రగతం మాంసం యేల కుండలగొందీ ఉన్నాయి.

రాక్షసుడు : (సంతోషంతో కౌగిలించుకొని నవ్వుతూ) ఓసోసి!... ఇంటాడదంటే అట్నే ఉండాల!... ఇట్నే దాసిపెట్టు... ఇడింబేమో నన్ను ఆవిడ పెనివిటి బీమయ్యగోరిని అంటకాసుండమని సెప్పింది... ఆ భీమయ్యోరిగోర్ని యుద్దబూమిలో ఎన్నంటి తిరుగుతుండటం వొల్ల నాకు ఆకలిదప్పులు మా ఎక్కువగా ఉన్నాయి... గనక నాకిక్కడే సొరగం...

రాక్షసి : అదిసరేలేగానొ॰రే! బీమయ్యగోరిని అంటకాసి తిరుగుమని ఎందుకు సెప్పినట్టూ ఆ ఇడింబమ్మ?

రాక్షసుడు : బీమయ్యగోరు దుస్సేసనుని రగతం తాగుతానని పెతిగ్గె సేసిందుగందా!... గనక ఆ యాలప్పుడు ఆయనలో దూరి రగతం నన్ను తాగమని!...

రాక్షసి : మంచిది ఇడింబమ్మా...మంచిది... నా పెనివిటికి మంచిపనే అప్పజెప్పినవ్వ..

(నేపథ్యంలో కలకలం) హొలేయ్ ఏటాగోల?...

రాక్షసుడు : హొసాగందే!... అదిగో దుట్టదుమునుడు దురోణ గురువుగోరి జుట్టట్టుకొని పీక తెగ్గోత్తుండు.

రాక్షసి : (సంతోషంగా) రారా!.. మనం ఎల్లి ఆ అయ్యోరి రగతం తాగుదాం...



రాక్షసుడు : (భయంగా) ఒసే అది బాపనయ్య రగతం... అది గొంతు మండిత్తది... వొద్దే... వొద్దొద్దు...

– నేపథ్యంలో – మళ్ళీ కలకలం

రాక్షసి : మళ్లీ ఆగోలేందిరా?

రాక్షసుడు : ఆ అయ్యోరి కొడుకు అస్సెత్తామ కత్తట్టుకొని ఇటే వొత్తుండు... దుట్టదుమ్ముని మీన కోపంతో మన్ని సంపినా సంపగలడు... రాయే పోదాం...

(ఇద్దఱూ నిష్క్రమిస్తారు, నేపథ్యంలో కలకలం– వింటూ ఎత్తిన కత్తితో అశ్వత్థామ ప్రవేశిస్తాడు)

అశ్వత్థామ : (తనలో) ఏవి॰టీ? కలకలధ్వని అవిచ్ఛిన్నంగా వినవస్తోంది?... యౌవనదర్పంతో భీమార్జునులు కాని సాత్యకి కాని మర్యాదనతిక్రమించి ప్రవర్తిస్తే పితృపాదులు స్వపరాక్రమానుకూలంగా పోరు సలుపుతున్నారు కాబోలు... (పైకి) ఎవర్కడ? రథం తీసుకొని రండి... (తనలో) రథంకోసం వేచి ఉండటం ఎందుకు? కాల హరణం... చేతిలో ఆయుధం ఎలాగూ ఉంది... దీంతో యుద్ధభూమికి వెడతాను... అరె॰! ఇదేవి॰టి? ఎడం కన్నదురుతోంది? తండ్రి పరాక్రమాన్ని కళ్ళారా చూడాలని వెళ్ళే నాకు కూడ ఈ శకునాల పట్టింపేవి॰టి?... అదేవి॰టి?... కౌరవసేన రథగజతురగాల వెనుక దాగిదాగి పాఱిపోతోంది?... మహారథులైన కర్ణాదులు కూడా పాఱిపోతున్నట్లుం దేవి॰టి?... నాతండ్రి సేనాధిపతిగా ఉన్న సేనలకూ ఈ దుఃస్థితి ఏవి॰టి?...

సూతుడు : (గాయాలతో ప్రవేశించి) కుమారా! రక్షించు... రక్షించు... (కాళ్ళపై పడతాడు)

అశ్వ : ఏమిటీ నాతండ్రి రథసారథి అశ్వసేనుడా!... త్రిలోక రక్షణ సమర్థుడైన నాతండ్రికి రథసారథివై ఉండీ నన్ను శరణువేడుతున్నావేమిటి?

సూతు : (లేచి) ఇంకెక్కడి తండ్రి నాయనా? (దుఃఖిస్తాడు)

అశ్వ : (ఆదుర్దాగా) ఏమిటీ, నాతండ్రే లేడా?

సూతు : చిత్తం! (దుఃఖం) మీనాయనగా రిక లేరు...

అశ్వ : తండ్రీ! (దుఃఖంతో మూర్ఛిల్లుతాడు)

సూత : ఊరుకో నాయనా!.. ఊరుకో...!

అశ్వ : హా!.. తండ్రీ! నువ్వెక్కడ? నాకు బదులివ్వు... (దుఃఖిస్తాడు)

సూత : వీరులకు దుఃఖావేశం తగినదికాదు... తండ్రికి తగిన విధంగానే నీ పరాక్రమంతో దుఃఖసాగరాన్ని దాటటం నీకు అర్హమైంది.

అశ్వ : అంతటి మహావీరుడెలా అస్తమించాడు? చెప్పు... ప్రియ శిష్యుడు భీముడు తన గదాప్రహారంతో గురుదక్షిణ సమర్పించాడా? ప్రియాతిప్రియశిష్యుడు అర్జునుని పనా ఇది? లేక కృష్ణుని చక్రాహతితో యుద్ధభూమిలో పడిపోయారా? వీళ్ళు ముగ్గురూతప్ప మఱొకనితో ఆయనకీ ఆపద ప్రాప్తించి ఉంటుందని నేననుకోను...

సూత : ఈ ముగ్గురిలో ఎవరూ క్రుద్ధుడై శస్త్రాన్ని చేపట్టిన ద్రోణునితో సమానులు కారు.

అశ్వ : దుఃఖంతో అస్త్రసన్యాసం చేశాడా?...

సూత : అవును! ఆయన మరణానికి నువ్వే కారణం!...

అశ్వ : నేనా?...

సూత : అవును! సత్యవాక్పరిపాలకుడైన యుధిష్ఠిరుడు అశ్వత్థామ మరణించాడని స్పష్టంగా పెద్దగా చెప్పిన తరువాత ఏనుగని



అస్పష్టంగా మెల్లగా ఉచ్చరించాడు. నీతండ్రి మొదటిసగాన్నే విని ధర్మజునిపట్ల ఉన్న నమ్మకంతో నీపై ప్రేమాతిశయంతో కన్నీటితో అస్త్రసన్యాసం చేశాడు....

అశ్వ : అయ్యో!... తండ్రీ! అబద్ధమైన నా చావు వార్త విని నాకోసం వృథాగా ప్రాణాలు వదిలావా?... (దుఃఖిస్తాడు)

సూత : ఊరుకో తండ్రీ... ఊరుకో!...

కృపాచార్య : (ప్రవేశించి) ఛీ...ఛీ... సోదరసహితుడైన దుర్యోధనుడు, ధర్మరాజు, సమస్తరాజకం, నేనూ వ్యర్థులం. ఆనాడు ద్రౌపదికేశాల్నీ, ఈనాడు ద్రోణుని శిఖను పట్టుకొంటే బొమ్మకట్టుకు పోయి చూచినవారందఱికీ సిగ్గు సిగ్గు.. చిన్నవాడు అశ్వత్థామ మొహం ఎలా చూడను? ఆనాడు ద్రౌపది జుట్టుపట్టుకొని ఈడ్చిన ఫలితమే నేటి మహాభారత యుద్ధం...ఈనాటి ద్రోణాచార్యుని శిఖపట్టిన ఫలితంగా ఈ లోకమే నశించి పోతుందేమో? (అశ్వత్థామతో) నాయనా! ఊఱడిల్లు... ఊఱడిల్లు!...

అశ్వ : హా! తండ్రీ!... లోకైకగురూ!... (ఆకాశంవైపు చూచి) యుధిష్ఠిరా! పుట్టింది మొదలు అబద్ధం అంటూ ఆడి ఎఱుగవే! ఎవరికీ విరోధివి కాకపోవటం వల్లే అజాతశత్రువనే కీర్తిని కూడా పొందావే! నాతండ్రి నీకేం ద్రోహం చేశాడని ఇంతపనికి ఒడిగట్టావు?...

సూతుడు : కుమారా! నీ మేనమామ కృపాచార్యులు వచ్చారు!...

అశ్వ : మావయ్యా! (దుఃఖిస్తాడు) నీతో ఎప్పుడూ పరిహాసాలాడుతూ నువ్వంటే వల్లమాలిన అభిమానం కల నీ బావగారు మఱిలేరు మావయ్యా! (దుఃఖిస్తాడు) ఇక నాకు దుఃఖం అంటూ లేదు.. తండ్రినే అనుసరించి వెళ్ళి ఆయన్ని సేవిస్తాను.

కృపా : నాయనా! తల్లితండ్రులు సంతానం చేత ఎప్పుడూ సేవించే దగినవారే... కాని ప్రాణత్యాగం కాదు. నీవంటి మహావీరులకది తగిన పనికాదు... తండ్రికి పారలౌకిక క్రియలొనర్చటంవల్లే సంతానం వారికి ప్రీతిని కలుగజేసినవారవుతారు...

అశ్వ : నువ్వు చెప్పింది నిజేవేఁ అయినా నేనీ దుఃఖభారాన్ని సహించేలేకపోతున్నా...

– నేపథ్యంలో –

ఒకకంఠం : ఓరాజాధిరాజులారా! వీరాగ్రేసరులారా! పూజ్యుడు, సర్వలోకైకగురుడైన ద్రోణుని కీనీచుడు చేసిన పరాభవాన్ని చూస్తూ ఎలా ఊరుకున్నారు?

అశ్వ : ఏమీ? నా తండ్రికి పరాభవమా?

(తిరిగి నేపథ్యంలో)

అదే కంఠం : యుద్ధభూమిలో శోకావేశంతో అస్త్రసన్యాసం చేసిన త్రిజగద్గురువు ద్రోణాచార్యుని శిఖనుపట్టి నీచుడైన ధృష్టద్యుమ్నుడాయన తలతటిగి తన శిబిరానికి వెడుతున్నాడు. దీన్ని ఉపేక్షించేటం మీకు తగినపని కాదు!...

అశ్వ : (కృపసూతుల్నిచూసి) ఏఁవిటీ? ప్రాయోపవేశం చేసి చేతిలో ఆయుధంలేని నాతండ్రిపై శస్త్రాఘాతమా?...

కృపా : అవును నాయనా!

అశ్వ : దుర్మార్గుడు ధృష్టద్యుమ్నుడు నాతండ్రి శిఖను పట్టుకొన్నాడా?...

సూతుడు : (భయంతో) అవున్నాయనా!... మున్నెన్నడూలేని ఈ ఘోరావమానం నీ తండ్రికీనాడు కలిగింది...

అశ్వ : ఆ పాంచాలాధముడు నాతండ్రి శిరస్సును పట్టుకొంటే వాడి శిరస్సుపై నా పాదాన్ని మోపుతాను. ఈ అకృత్యాన్ని చూస్తూ



ఉన్న భీమార్జునకృష్ణులు కూడా పాపులే! వారి రక్తమాంసాల్ని పది దిక్కులకూ బలిపెడతాను.

కృప : నాయనా!... దివ్యాస్త్రకోవిదుడవు, తండ్రితో సమానుడవైన నీకసాధ్యమంటూ ఏముంది?

అశ్వ : సూతా! నువ్వు వెళ్లి సమస్తాయుధాలతో ఉన్న నా రథాన్ని సిద్ధం చేసి తీసుకురా!

సూత : ఆజ్ఞ! (నిష్క్రమిస్తాడు)

కృపా : నాయనా! నీకు సేనాపత్యభిషేకం జరగాలని కోరుతున్నాను.

అశ్వ : ఆ పని చేయవలసినవాడు దుర్యోధనుడు... అయినా దానివల్ల ప్రత్యేకంగా ఒరిగేదేముంది?...

కృపా : అలా అనకు...భీష్మద్రోణులు లేని కౌరవసేనను సేనాధిపతిగా నువ్వుతప్ప రక్షించేవారెవరు?... యుద్ధసన్నద్ధుడవైన నీముందు ముల్లోకాలూ ఏకమై వచ్చినా నిలువ లేవు. ఇక యుధిష్ఠిరుని బలమంటే ఎంత? బహుశః దుర్యోధనుడు కూడా నిన్నే సేనాధిపతిగా అభిషేకించేటానికి ఎదురు చూస్తూ ఉంటాడనుకొంటాను...

అశ్వ : ముందు స్నానం చేసి ఈ సైన్యాధ్యక్షపదవిని నాకు నేనుగా కోరి దుర్యోధనుని సంతోషపెడతాను.

కృపా : అదే మంచిది...రా! దుర్యోధనుని వద్దకు పోదాం! (కర్ణదుర్యోధనులు ప్రవేశిస్తారు)

దుర్యో : అంగరాజా! యుద్ధంలో బంధువధ జరిగినప్పుడు పరాక్రమశాలి మతింత కినుకతో అస్త్ర గ్రహణం చేస్తాడు కదా!... పుత్రవధ వార్త విన్న ద్రోణుడు అలాకాక అస్త్ర సన్యాసం చేశాడెందుకో!... పుత్రవియోగ దుఃఖం అతి వేలం కావటంవల్ల వివేకం కోల్పోయి క్షత్రియ జనోచిత కర్కశత్వాన్ని

వీడి బ్రాహ్మణ ధర్మానుకూలమైన మార్దవాన్ని స్వీకరించినట్లుంది...

కర్ణుడు : మహారాజా!... ఇది నువ్వనుకొన్నట్లు కాదు సుమా!

దుర్యో : మఱి?

కర్ణ : ఎలా అయినా అశ్వత్థామ రాజపదవి నొందాలని ద్రోణుని సంకల్పం... పుత్రమరణంతో అది నెఱవేఱే ఆశ అడుగంటటం వల్ల తనకిక శస్త్రంతో పనిలేదని అస్త్రసన్యాసం చేసి ఉండాలి...

దుర్యో : (తలూపుతూ) ఆఁ! అవునవును!

కర్ణ : అందుకే ప్రతిపక్షంలో ప్రధానవీరుల్ని వధించేక ఊరుకొన్నాడు...

దుర్యో : నువ్వు చెప్పింది ఎంతో హేతుబద్ధంగా ఉంది!...

కర్ణ : మహారాజా! మఱో విషయం... అందుకే ఈ ద్రోణుని ఉద్దేశ్యం తెలిసినవాడు కావటంవల్లే ఆనాడు ద్రుపదుడు కూడ ఆయనకి తన రాజ్యంలో చోటివ్వలేదు...

దుర్యో : చేక్కని ఆలోచన... సందేహం లేదు... కాకపోతే అతిరథుడైన ద్రోణుడు అర్జునుడు, సైంధవుని చేంపుతూ ఉంటే చూస్తూ ఎందుకూరుకుంటాడు?

కర్ణ : ఈ అభిప్రాయం కేవలం నాదే కాదు... రాజనీతి కోవిదులంతా ఇలాగే ఆలోచిస్తున్నారు.

కృపా : నాయనా! అశ్వత్థామా! దుర్యోధనుడు కర్ణునితో ఆ మఱ్ఱిచెట్టు నీడలో కూర్చున్నాడు. రా! వెడదాం... (సమీపించి)

కృపాశ్వత్థామలు : కౌరవేశ్వరునికి జయం!

దుర్యో : ఓ!.. కృపాశ్వత్థామలారా!.. (లేచి) ఆచార్యుల కభివాదాలు.. గురుపుత్రా! రా.. (కౌగిలించుకొని తన ప్రక్కన కూర్చోబెట్టుకుంటాడు. అశ్వత్థామ కన్నీరు విడుస్తాడు.)



కర్ణ : ఊరుకో అశ్వత్థామా!... దుఃఖించేకు!...

దుర్యో : ఈ దుఃఖం మనిద్దఱికీ సమానమే... జగత్ప్రసిద్ధుడైన నీ తండ్రి నాతండ్రికి చెలికాడు... శస్త్రవిద్యలో నీలానే నాకూ ఆ మహానుభావుడు గురుపాదుడు. ఆయన నేడు మనల్ని వీడిపోవటం నాకెంతదుఃఖాన్ని కలిగిస్తోందో ఎలా చెప్పను? నువ్వు పొందుతున్న దుఃఖంతో నువ్వే తెలుసుకో!

కృపా : కురుపతి చెప్పింది నిజేం!

అశ్వ : నేను బ్రతికుండగానే ఆ నీచుడు నా తండ్రి జుట్టుపట్టుకొన్నాడంటే ఇక ఎవరికైనా కొడుకులుండీ ప్రయోజన మే ముంది?

కర్ణ : అందఱి పరాభవాలకూ ప్రతిక్రియ చేయగల ఆయనే అస్త్రసన్యాసం చేసి ఆ దుఃస్థితిని తనకు తానుగా తెచ్చుకొంటే మన మేం చేస్తాం?

అశ్వ : అంగరాజా!... ఏవఁంటున్నావ్ నువ్వు?... మనమేం చేయగలమనా?... శస్త్రధారులై మదించిన పాండవుల్నీ, పాంచాలురనూ అక్కడ యుద్ధభూమిలో ఆ చోద్యాన్ని చూస్తున్న వారందఱినీ గర్భస్థ శిశువులతో సహా మట్టుపెడతాను. అంతేకాదు.. పరశురామశిష్యా... ఆనాడు పరశురాముని తండ్రి జమదగ్నికి జేరిగిన అవమానం వంటిదే నేడు నా తండ్రికి జేరిగింది. ఆనాడు పరశురాముడేం చేశాడో ఈనాడు నేనూ అదే చేస్తాను...

దుర్యో : ఆచార్యపుత్రా! అది నీపరాక్రమోచితమైనకర్మే!

కృపా : మహారాజా! అశ్వత్థామ పూనుకొన్నదొక మహాకార్య నిర్వహణ.. కనుక దానికి సమర్థుడైన అశ్వత్థామను సర్వసైన్యాధిపతిగా అభిషేకించేటం తగినపని...

దుర్యో : మీరు చెబుతోంది బాగానేఉంది కానీ సర్వసేనాపతిత్వం కర్ణునికి జేరగాలని ముందే నిశ్చయమైంది...

కృపా : మహారాజా! ఇప్పుడు దుఃఖభారం, ప్రతీకారేచ్ఛ అశ్వత్థామవి. కనుక కర్ణునికై అశ్వత్థామను ఉపేక్షించేటం తగిన పని కాదు... తాను వధించేవలసిన వారు కర్ణునిచే నిహతులు కావటం అశ్వత్థామ బాధకు కారణమౌతుంది కదా!

అశ్వ : కౌరవేశ్వరా! ఇప్పుడుకూడా ఈ యుక్తాయుక్త విచక్షణా వితర్కమెందుకు? నేటిరాత్రి నువ్వు నిశ్చింతగా నిద్రపో!.. నేడీభూలోకం, కృష్ణరహితం, అపాండవమౌతుంది. ఈ యుద్ధం నేటితో ముగిసినట్లే!... భూదేవికి రాజుల భారం తొలగిపోతుంది...

కర్ణ : (హేళనగా నవ్వి) చెప్పటం సులభం కానీ, చేయటమే కష్టం... ఆ పనిచేసే సమర్థులు కౌరవబలంలో చాలామందే ఉన్నారు.

అశ్వ : అంగరాజా!... ఈ కార్యనిర్వహణాదక్షులు కౌరవసేనలో చాలామంది ఉన్నారన్న నీమాట నిజమే!...శోకావేశంతో నేనీకార్యాన్ని నిర్వహిస్తానన్నానేకాని వీరుల నాక్షేపించేటానికి కాదు...

కర్ణ : మూర్ఖ! శోకాతురులకు కంటతడి పెట్టటం, క్రోధావిష్టుడైన వానికి ఆయుధ గ్రహణం తగిన పనులు కాని, ప్రగల్భాలు పలుకటం కాదు.

అశ్వ : (కోపంతో) ఓరీ!.. రాధాగర్భభారభూతా!... నీచ రథకారా!... దుఃఖితుణ్ణైన నన్ను కన్నీటితో ప్రతీకారం తీర్చుకోమంటున్నావా?... ఆయుధంతో ప్రతీకారం చేయటం నా చేత కాదంటావా? చూడూ!... నా ఆయుధాలు నీ ఆయుధాల్లాగా గురుని శాపానికి బలైనవి కావు... నీలాగా భయంతో నేనేమైనా యుద్ధభూమినుంచి పాటిపోయి వచ్చానా ? ఇతరుల్ని భజించేటంలో నేర్పరులైన సూతకులంలో పుట్టేనా?...



కర్ణుడు : (క్రోధంతో) అరెరే వాచాలా! వృథాగా ఆయుధం ధరించి మిడిసిపాటుతో ఉన్న బ్రహ్మచారీ!... నేనేమీ మీ తండ్రిలాగా ధృష్టద్యుమ్నునికి భయపడి ఆయుధాన్ని విడిచిపెట్టలేదు... నేను సూతుణ్ణో, సూతపుత్రుణ్ణో ఎవరైతేనేం?... ఒక కులంలో పుట్టటం దైవాయత్తమైతే పౌరుషం నేనార్జించుకొందిరా!...

అశ్వ : అరే! శస్త్రప్రయోగం తెలియని మూర్ఖా!...నువ్వురా నాతండ్రి నధిక్షేపించేది?... ఆయన భీరుడో, వీరుడో అదలా ఉంచు. ఇన్నాళ్ళుగా రణరంగంలో ఆయన చేసిందేవిఁటో అందరికీ తెలుసు... ఒరేయ్! పిరికిపందా!... నువ్వప్పుడక్కడ లేవురా?...

కర్ణుడు : (హేళనగా నవ్వి) అవును.. నేను పిరికివాణ్ణే.. పరాక్రమోపేతుడైన నీతండ్రిని తలచుకొని నువ్వేం చేయబోతున్నావో నాకంతు పట్టటంలేదు... రాజు లందరి సమక్షంలో ఆడదానిలా శిరచ్ఛేదం పూర్తయ్యేవఱకు నీతండ్రి చూస్తూ ఊరుకొన్నాడే కాని ప్రతిఘటించేలేదు...

అశ్వ : (కోపంతో కంపించిపోతూ) దుర్మార్గుడా! రాజముఖస్తుతే నీపని... నీచసూతుడా!... అసంబద్ధప్రలాపీ!... దుఃఖావేశంతోనో, పిరికితనంతోనో నాతండ్రి ధృష్టద్యుమ్నుని ఎదిరించేలేదేమో!... ఇప్పుడు నీతలమీద నాకాలేసి తొక్కుతున్నా.. చేతైతే కాచుకో... (కాలెత్తుతాడు)

కృప, దుర్యో : గురుపుత్రా! శాంతించు...శాంతించు!

కర్ణ : (కోపంతో కత్తిదూసి) ఓరి వదరుబోతా! బ్రాహ్మణాధమా! ఆత్మస్తుతి పరాయణా! బ్రాహ్మణ పుటక పుట్టావు కనుక అవధ్యుడివై పోయావు. ఆ నీ ఎత్తినకాలిని ఇదిగో ఖండిస్తున్నా!

అశ్వ : ఓరీ... మూర్ఖుడా!... ఏవంన్నావ్?... బ్రాహ్మణ్ణి కనక చేంప దగని వాణ్ణనా?...ఇదిగో నా జాతిని విసర్జిస్తున్నా... (జంధెం త్రెంచి క్రిందపడేస్తాడు) రారా!... పార్థుని ప్రతిజ్ఞను వ్యర్థం చేసి నిన్నిప్పుడే వధిస్తాను... ఆయుధాన్ని పట్టరా! లేకపోతే చేతులెత్తి దండంపెట్టి శరణువేడు... (ఇద్దఱూ ఒకరినొకరు చేంపటానికి సిద్ధపడతారు. కృప,దుర్యోధనులు వారిని వారిస్తారు)

దుర్యో : ఆచార్యపుత్రా!.. ఆగాగు!...

కృప : కర్ణా!... ఆగాగు...

అశ్వ : మామా! నన్నాపకు!... వీడుకూడా ధృష్టద్యుమ్నుని వంటి వాడే...

కర్ణ : రాజా! నన్నుకాదు ఆపవలసింది...

అశ్వ : రాజా! వీణ్ణివిడిచిపెట్టు... నానుంచి వీణ్ణి రక్షించేలేవు... కిరీటికోసం నువ్వు వీణ్ణి రక్షించేక్కర్లా!... నేడు నేనే ఈ భూమిని కర్ణార్జునులు లేనిదాన్నిగా చేస్తాను.

కర్ణ : రారాజా!... నన్నొదులు!...

దుర్యో : కర్ణా!.. అశ్వత్థామా!.. మీకిద్దఱికీ ఇదేవింటివాళ ఈ బుద్ధిమాంద్యం?...

కృపా : నాయనా! అశ్వత్థామా! మీరిద్దఱూ ఇలా స్వపక్షవినాశానికే సిద్ధం కావటం ఏవైంనా బావుందా?

అశ్వ : పుట్టిన కులానికే మాయని మచ్చే అయిన వీడి గర్వాన్ని అణిచేస్తాను... నువ్వూరుకో!...

కృప : మనసేనలో ప్రధానవీరునితో విరోధం తెచ్చుకోవటానికిది సమయం కాదు...

అశ్వ : అలా అయితే వీడు యుద్ధ రంగంలో ఉన్నంత వఱకు నేనాయుధాన్ని పట్టను... యుద్ధరంగంలో కోపావేశ



పూరితులైన భీమార్జునుల నుంచి తన ప్రియాతిప్రియ మిత్రుడైన సేనల్ని వీడేపాటి రక్షించేగలడో రారాజు కివాళ తెలుస్తుంది...

కర్ణ : (బిగ్గఱగా నవ్వి) అస్త్రసన్యాసం మీలాంటివారికి వంశపారంపర్యంగా తెలిసిన విద్యేగా!

అశ్వ : నేను విడిచిపెట్టినా నువ్వు శస్త్రపాణివైనా ఒకటేరా?

(నేపథ్యంలో భీముని కంఠం)

భీమ : ఓరీ! దురాత్ముడా! ద్రౌపది కేశవస్త్రాలను లాగిన మహాపాపీ!... ఇప్పటికి నాఎదుట పడ్డావ్!...ఇంకెక్కడికి పోతావ్‌రా!...ఒరేయ్!... రాధేయ దుర్యోధన శకుని ప్రభృతులైన పాండవ శత్రువులారా!...నేనెవడి వక్షస్స్థలం చీల్చి రక్తం తాగుతానని ప్రతిజ్ఞచేశానో ఆ ఖలుడు దుశ్శాసనుడు నా బాహువుల్లో చిక్కాడు... చేతనైతే రక్షించుకోండిరా!...

అశ్వ : (ఎగతాళిగా) సేనాపతీ అంగరాజా! పరశురామ శిష్యుడా! ద్రోణాచార్యునే పరిహసిస్తావురా!... నీభుజశక్తితో సకల లోకాల్నీ రక్షిస్తానని ప్రగల్భాలు పలకటంకాదు... ఇదిగో సమయం వచ్చింది... భీముని బారి నుంచి దుశ్శాసనుణ్ణి రక్షించేరా!...

కర్ణ : ఆఁ! నేను బ్రతికుండగా దుశ్శాసనుని నీడనైనా తాకటానికా భీమునికెలా సాధ్యమౌతుంది?... రాజా!... భయపడకు! భయపడకు!... ఇదిగో వస్తున్నా!... (నిష్క్రమిస్తాడు)

అశ్వ : రారాజా!... భీష్మద్రోణులు లేని కురుసేనని కల్లోల పఱుస్తున్న భీమార్జునుల్ని ఎదుర్కోవటం కర్ణునివల్ల కాని మఱొకనివల్ల కాని జేరిగేపని కాదు... కనుక నువ్వే స్వయంగా వెళ్ళి సోదరుని రక్షించుకో!...

దుర్యో : నేనాయుధాన్ని చేపట్టి బ్రతికున్నంతవఱకు భీముడికి కాని మఱొకడికి కాని నా తమ్ముని నీడనైనా తాకటానికి ఎన్ని గుండెలు?... దుశ్శాసనా!... భయపడకు... వస్తున్నా!... ఎవరక్కడ?... రథాన్ని తీసుకురా... (నిష్క్రమిస్తాడు) (నేపథ్యంలో కోలాహలం)

అశ్వ : మామా! ఎంతటి కష్టం? భీమునికి ఎక్కడ ప్రతిజ్ఞాభంగ మౌతుందోననే భయంతో అర్జునుడు కర్ణదుర్యోధను లిద్దఱినీ తన బాణవర్షంతో ముంచెత్తుతున్నాడు... ఈ ఆపదను చూసి సహించేలేను... అసత్యదోషం ప్రాప్తించినా సరే... తెలిసే అసత్య పాపానికి ఒడిగడుతున్నా... ఆయుధాన్నివ్వు!...

ఆకాశవాణి : మహాత్మా! ద్రోణపుత్రా! ఇంతకు మున్నెన్నడూ నువ్వు సత్యవాక్పరిపాలన వీడలేదు, నేడు కూడా విడువ దగింది కాదు!...

కృపా : ఈ ఆకాశవాణి నిన్నసత్యంనుంచి కాపాడుతోంది నాయనా!

అశ్వ : ఈ దైవవాణి నన్నుయుద్ధానికి పోనివ్వటం లేదు.. దైవంకూడా పాండవ పక్షపాతే అయింది. ఎంతకష్టం!... భీముడు దుశ్శాసన రక్తాన్ని నిరాఘాటంగా త్రాగి వేశాడు!... మామా! ఇంతటి అకార్యం జరుగుతున్నా కర్ణునిపై కోపంతో నేను ప్రేక్షకునిలా మిగిలిపోయాను... నువ్వైనా వెళ్ళి రారాజుకు సహకరించు...

కృపా : ప్రతీకారానికి నేబయలుదేరుతున్నా... నువ్వు శిబిరోన్ముఖుడివికా!... (ఇద్దఱూ రెండు వైపులకూ నిష్క్రమిస్తారు)

★ ★ ★



## నాల్గవఅంకం

(దెబ్బలతో మూర్ఛనొంది రథంపై పడిఉన్న దుర్యోధనుని యుద్ధభూమి నుంచి తప్పించి తీసికొనిపోతున్న సూతుడు ఆందోళనగా అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు)

– నేపథ్యంలో –

కృపా : కౌరవ విజయాన్ని కోరుతూ ప్రాణాలనే పణంగా పెట్టి పోరుతున్న మహావీరులారా!... రాజన్యులారా!... దుశ్శాసనుని గుండెలు చీల్చి రక్తాన్ని త్రాగి మిగతా రక్తాన్ని ఒంటినిండా పులుముకొన్న భీమునిచూచి భయపడి పాఱిపోకండి!... నిలవండి..నిలవండి!...

సూతుడు : ఏమిటీ!.. పాఱిపోతున్న సేనల్ని నిలువరిస్తూ కృపాచార్యుడు భీషణంగా యుద్ధం చేస్తున్నాడు!... అర్జునునితో తలపడిన కర్ణునికి బాసటై నిలుస్తున్నట్లుంది!...

నేపథ్యంలో : జాఱిపోతున్న ఆయుధాలతో పాఱిపోతున్న కౌరవ సైనికులారా!... భయపడకండి...

భీముడు : దుశ్శాసనుని రక్తమనే మద్యాన్ని తాగి మత్తిల్లిన ఈ భీమునికి చేయవలసింది ఇంకా కొంచెం మిగిలి ఉంది... ఈ కుంతీసుత మధ్యముడు చేయబోయే ఆ పనికి మీరంతా సాక్షులు కావాలి... ధనుర్ధారులైన దుర్యోధన, కర్ణులు, శల్యుడు చూస్తుండగానే వాడి గోళ్ళతో ద్రౌపది కేశాంబరాకర్షణ గావించిన దుశ్శాసనుని గుండెచీల్చి వాడి వేడి వేడి రక్తాన్ని త్రాగుతున్నాను... (వికటట్టహాసం)

సూత : (విని భయంతో) అయ్యయ్యో! ఈ దుష్టుడు భీముడు దుశ్శాసనునికి చేసినట్లే రారాజుకీ అపకృతి చేయవచ్చు... రారాజింకా మూర్ఛనుండి తేఱుకోలేదు... కానీ, రథాన్ని దూరంగా తొలగిస్తాను... ఈ సరోవర తీరంలో ఉన్న

మఱ్ఱిచెట్టు నీడలో మహారాజు మూర్ఛనుండి త్వరలో తేఱుకోవచ్చు. ఎవరక్కడ? (చుట్టూచూసి) అయ్యో! ఇక్కడ సేవకుడొక్కడూ లేడే!... ఆ భీముడి భయంకరాకారాన్నీ, ఈ రారాజు మూర్ఛనూ చూసి భయంతో అంతా శిబిరాల్లోకి పాఱిపోయి ఉంటారు... అయ్యో!... ఎంతటి కష్టదశ!... (దుర్యోధనుని చూసి) అయ్యో! రారాజింకా మూర్ఛనుండి తేఱుకోలేదు! హతవిధీ!...

దుర్యో : (మెల్లగా తేఱుకుని) ఆఁ!... నేను బ్రతికుండగా ఆ నీచ భీముని ప్రతిజ్ఞ ఎలా తీరుతుంది? ఇదిగో వస్తున్నా! సారథీ! దుశ్శాసనుడున్న చోటికి రథాన్ని పోనీ!...

సూత : చిరంజీవ! గుఱ్ఱాలిప్పుడు అలిసి ఉన్నాయి. రథాన్ని నడపలేవు. (మెల్లగా) నీ మనోరథాన్ని కూడా!...

దుర్యో : అయితే రథమెందుకు? కాలహరణం!...

సూత : చిరంజీవీ! మన్నించు...

దుర్యో : నీతోనూ పనిలేదు! ఈ గదతోనే యుద్ధరంగానికి వెడతాను. పాపాత్ముడు భీముడు గదనెత్తి నా తమ్ముడైన దుశ్శాసనునికి కీడు తలపెట్టబోతుంటే నన్ను యుద్ధభూమి నుంచి తప్పించేటం ఏవిఁటి?

సూత : (పాదాలపైపడి దీనంగా) దుర్మార్గుడైన భీము డీపాటికి తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొని యుద్ధభూమి నుంచి మఱలిపోయి ఉంటాడు. అందుకని అలా అన్నాను...

దుర్యో : (నేలపై పడి) హా!.. దుశ్శాసనా! పరాక్రమశాలీ!... నావల్లే పాండవులతో విరోధం తెచ్చుకొన్నావు... ఎక్కడున్నావు?... బదులుపలుకు!... (మూర్ఛిల్లుతాడు)

సూత : మహారాజా! ఊఱడిల్లండి!



దుర్యో : (తేఱుకొని) తమ్ముడా! నీకు కలిగిన ఈ దుఃస్థితికి నేనే కారణం...పాపం చేయటానికి నిన్ను ప్రోత్సహించానే కానీ నిన్ను రక్షించేటంలో అసమర్థుణ్ణైనాను.. (పడిపోతాడు)

సూత : చిరంజీవీ! ఊరుకో! ఊరుకో!...

దుర్యో : ఛీ!... నువ్వు చేసిన పనేవిఁటి?... నన్ను రక్షించేటం కోసం ఎప్పుడూ నా కనుసన్నల్లో మెలిగే చిన్నవాడు దుశ్శాసనుణ్ణి బలిచేశావు!

సూత : మహారాజా!... పాండవులు ప్రయోగించిన భీకరమైన శస్త్రాలతో స్పృహ కోల్పోయిన మిమ్ము రణరంగం నుంచి తప్పించేక తప్పలేదు...

దుర్యో : కానీ నువ్వు చేసింది కానిపని...నేనో, భీముడో అక్కడే పడిపోయి ఉండవలసింది! సమస్త బంధువులూ చేచ్చిన తరువాత విజయంతో కాని, రాజ్యంతో కాని నాకేం పని?...

సుందరకుడు : (ప్రవేశించి) మహారాజా! జయం! జయం!

దుర్యో : అరే! యుద్ధభూమినుంచి సుందరకుడు వచ్చాడే! అంగరాజు కుశలమే కదా సుందరకా!...

సుంద : శారీరకంగా కుశలుడే! ఇప్పుడు జరిగింది దుశ్శాసనవధ... (చెబుతూ ముఖం చాటుచేసుకుంటాడు)

దుర్యో : ఆఁ!... ఆ విషయం తెలిసిందే!... అనుమానించేకు చెప్పు!...

సుంద : దుశ్శాసనవధతో కుపితుడైన కర్ణుడు భీమునెదిరించాడు... ఈలోగా భీమునికే ఆపదైనా కలుగుతుందేమోనన్న భీతితో అర్జును డండగా వచ్చి కర్ణునిపై దుర్నివారమైన బాణాల్ని ధారాపాతంగా కురిపించాడు...

దుర్యో : ఆ తరువాత?...

సుంద : భీమార్జునులెదుర్కొంటున్న తన తండ్రి కర్ణుని రక్షణార్థం, అతని కొడుకు వృషసేనుడు యుద్ధభూమిలో ప్రవేశించాడు... వృషసేనుని బాణ ధారాపాతంతో అర్జునుని రథం నిండిపోయింది.

దుర్యో : (ఉత్సాహంతో) అప్పుడేమైంది అర్భకా!...

సుంద : కిరీటి వృషసేనుని చూసి "అరే! నన్నెదుర్కోవటానికి కర్ణుడే చాలడు... నువ్వెందుకిక్కడికి వచ్చావు? వెళ్ళి నీ తోటి వారితో తలపడమన్న మాటలతో కుపితుడై అర్జునునిపై తీవ్రాతి తీవ్రమైన బాణాలు పఱగించాడు... వారిద్దఱి మధ్య అపూర్వమైన రీతిలో అద్భుత సమరకేళి జరిగింది.

దుర్యో : సాధు వృషసేనా!.. సాధు... అటుపైన?

సుంద : క్రుద్ధుడైన క్రీడి వృషసేనుని రథాన్ని విఱగ్గొడితే కర్ణుడు ధనంజయునిపై బాణధారలు కురిపించాడు. ఈ లోగా పరిజనులు తీసుకొచ్చిన మఱో రథాన్నెక్కి వృషసేనుడు కిరీటిని తన బాణపరంపరలతో ముంచెత్తాడు...

దుర్యో : బళీ! వృషసేనా! బళీ... ఆ తరువాత?...

సుందర : తన తండ్రిని నిందించాడన్న క్రోధం మిన్నంటగా వేలాది బాణాలతో వృషసేనుడు పార్థుని కప్పివేశాడు. ఆ తర్వాత అత్యద్భుతమైన వారి యుద్ధాన్ని భీమకర్ణు లిరువురూ క్షణకాలం తమ వైరం మాని ఆశ్చర్యంతో చూడసాగారు.

దుర్యో : ఆపైన?...

సుంద : అర్జునుడు ప్రయోగించిన 'శక్తి' ఆయుధాన్ని వృషసేనుడు త్రుంచేటంతో అర్జునుడు ఓరీ!.. దుర్యోధ...!(ఆర్ధోక్తితో ఆపివేస్తాడు)



దుర్యో : ఇవి మా శత్రువుల మాటలు కదా! చెప్పు.. చెప్పు... సంశయించేకు!

సుంద : ఓరీ దుర్యోధన సేనాపతులారా! దుర్నీతికి చుక్కాని పట్టిన కర్ణాధమా! నేను లేకుండా చూసి మహారథులైన అనేకులు కలిసి నా కొడుకుని ఏకాకిని చేసి వధిస్తే నేను మీఅంతా చూస్తుండగానే కర్ణకుమారుడు వృషసేనుని వధిస్తున్నానంటూ సింహనాదం చేసి ఆబాలుణ్ణి హతమార్చాడు.

దుర్యో : (కన్నీటితో) హా!... వృషసేనా!...నువ్వూ మమ్మల్ని శోక సాగరంలో ముంచిపోయావా?...

సుంద : చిరంజీవీ!... దుఃఖావేశాన్ని నిగ్రహించుకో!...

దుర్యో : పుణ్యవంతులే దుఃఖభాగులౌతుంటారు. పరాభవాగ్నితో దందహ్యమానుణ్ణౌతున్న నాకిక దుఃఖం ఎక్కడ? (మూర్ఛ నొందుతాడు)

సుందర : ఊఱడిల్లండి మహారాజా! ఊఱడిల్లండి!... (ఉత్తరీయంతో విసురుతాడు)

దుర్యో : తరువాత అంగరాజేం చేశాడు?

సుందర : కన్నీటిని తుడుచుకుంటూ కోపావేశంతో అర్జును నెదుర్కొన్నాడు... అవక్ర విక్రమంతో ఎదుర్కొంటున్న కర్ణుని చూచి భీమాదులు అర్జునుని రథాన్నక్కడినుంచి తప్పిస్తే శల్యుడు, విఱిగిన రథాన్నుంచి కర్ణుని దింపి అనేక విధాల అతణ్ణి ఊఱడించాడు...

దుర్యో : ఆ తరువాత?...

సుందర : కర్ణుడు చాలాసేపు విలపించి నన్నురమ్మని తన రక్త బిందువులతో లేఖవ్రాసి మీకిమ్మని పంపించాడు. (లేఖ నందిస్తాడు)...

దుర్యో : (అందుకొని చదువుతాడు) "దుర్యోధనమహారాజా! చివరిసారిగా మిమ్ము గాఢంగా కౌగిలించుకొని చేసే విజ్ఞప్తి... నావల్ల శత్రువులు నిశ్శేషంగా హతులౌతారని మీరెంతగానో విశ్వసిస్తే నేను కనీసం భీమసేనునైనా చంపి మీకు ఊఅట కలిగించేలేక పోయాను... మీరు అస్త్రవితతితోకాని, అశ్రుతతితోకాని దుఃఖప్రతీకారాన్ని పొందండి".. కర్ణా! నూర్గురు తమ్ముల వధతో దుఃఖిస్తున్న నాపై మఱోవాగ్బాణాన్ని సంధిస్తున్నావా?... సుందరకా! అయితే కర్ణుడిపుడేం చేయనిశ్చయించాడు?...

సుందర : తన వినాశానికై నిశ్చయించుకొన్న రాధేయుడు పార్థునితో తిరిగి యుద్ధానికి సన్నద్ధుడౌతున్నాడు...

దుర్యో : (లేచి) సూతా! రథాన్ని త్వరగా తీసుకురా! సుందరకా! నువ్వు త్వరగా వెళ్ళి అంగరాజుతో సాహసించేవద్దనీ, నేను వస్తున్నాననీ చెప్పు!...

సుంద : ఆజ్ఞ! (నిష్క్రమిస్తాడు)

దుర్యో : శీఘ్రంగా రథాన్ని నాముందు నిలుపు!...

సూత : మహారాజా! రథచక్రధ్వని, గుఱ్ఱాల సకిలింపులు వినిపిస్తున్నాయి... పరిజనులు రథాన్ని తీసికొని వస్తున్నారనుకొంటాను.

దుర్యో : సూత!.. నువ్వెళ్ళి రథాన్ని సిద్ధం చెయ్యి!

సూత : చిత్తం! (వెళ్ళి తిరిగివస్తాడు)

దుర్యో : ఏం మళ్ళీ వచ్చావ్?

సూత : వచ్చింది తమ మాతాపితరులతో సంజయుడెక్కిన రథం!...

దుర్యో : ఏవిఁటీ!... తల్లితండ్రులు వచ్చారా? హతవిధీ! సూతా! నువ్వెళ్ళి రథాన్ని తొందరగా తీసుకురా! నేను ఇప్పుడు వారిని చూడకుండా ఏకాంతంగా ఉంటాను.



సూత : మహారాజా! ఇప్పుడు వారికి మిగిలింది తమరొక్కరే... వారిని ఓదార్చకుండా ఉండటం న్యాయం కాదేమో!...

దుర్యో : దురదృష్టవంతుణ్ణైన నేను వారినెలా ఓదారుస్తాను?... చూడూ, నేనూ, దుశ్శాసనుడూ నేడే మాతల్లితండ్రులకు నమస్కరించి వారి ఆశీస్సులను తీసుకొని యుద్ధభూమిని ప్రవేశించాం... శత్రువుల చేతిలో దుశ్శాసనుని కంతటి దురవస్థ ప్రాప్తిస్తే నే నేమొహం పెట్టుకొని వారిని చూస్తాను? ఏవిధంగా వారి నోదారుస్తాను?... అయినా నన్ను వెతుక్కుంటూ వచ్చిన తల్లిదండ్రులు వందనీయులే!

(ఇద్దఱూ నిష్క్రమిస్తారు)

★ ★ ★

## ఐదవఅంకం

(రథంపై గాంధారీధృతరాష్ట్రులూ, సంజయుడూ ప్రవేశిస్తారు)

ధృతరాష్ట్ర : నాయనా సంజయా! చెప్పు... కురువంశంలో మిగిలిన నా కొడుకు దుర్యోధనుడు బ్రతికి ఉన్నాడా? లేడా?... బ్రతికుంటే ఎక్కడున్నాడు చెప్పు!...

గాంధారి : నిజెం చెప్పు... బ్రతికున్నాడా లేడా?...

సంజయ : ఇదిగో దుర్యోధనుడు ఇక్కడే ఈ మఱ్ఱిచెట్టు నీడలో కూర్చుని ఉన్నాడు...

గాంధారి : (జాలిగా) నాయనా! ఒక్కడే అంటున్నావు.. ఎప్పుడూ నూర్వురు సోదరులూ కలిసే ఉంటారుగా!

సంజ : అమ్మా!... ధైర్యంగా రథం దిగండి...(ఇద్దఱూ రథం దిగినట్లభినయిస్తారు) (పిదప సిగ్గుపడుతూ దుర్యోధనుడు ప్రవేశిస్తాడు)

సంజ : (సమీపించి) మహారాజా!... జయం!... తమ తల్లిదండ్రులు వచ్చారు. చూడలేదా?

(దుర్యోధనుడు సిగ్గుపడుతున్నట్లభినయిస్తాడు)

గాంధారి : యుద్ధంలో క్షతగాత్రునివై అలిసిపోయావా?... నీ క్షేమాన్నైనా అడగలేకపోయాను!...

(ధృతరాష్ట్రుడు, గాంధారి దుర్యోధనుని తడుముకొని కౌగలించుకొంటారు)

ధృత : నాయనా! దుర్యోధనా! దగ్గఱకు వచ్చినా, దుర్మర్షణుడైనా మాట్లాడతాడే? పోనీ నా బిడ్డల్లో ఇంకెవరైనా మాట్లాడ వచ్చుగా!... (ఏడుస్తాడు)



దుర్యో : అమ్మా!.. సోదరులవినాశాన్ని చూస్తూ ఊరుకొని ప్రతీకారం చేయలేని నేను మీ ఇద్దఱి పుత్రశోకానికీ కారణ భూతుడైన పాపాత్ముణ్ణి... ఈ వంశంలోనే చెడబుట్టిన వాణ్ణి... ఇంకా నన్ను కొడుకని ఎందు కనుకొంటున్నారు?... పుత్రశబ్దానికే అనర్హుణ్ణి!

గాంధా : దుఃఖించేకు నాయనా!... అంధులమైన మాకు నువ్వే దిక్కు... నిన్ను చూసుకొంటూనే బ్రతకాలి... విజయంతో కాని, రాజ్యంతో కాని పనేముంది?

దుర్యో : అమ్మా! నీవంటి వీరమాత అలా అనకూడదు... సుక్షత్రియ వంశంలో పుట్టిన నువ్వెక్కడ, ఈ దైన్యం ఎక్కడ?... నీకు పుత్రవాత్సల్యం లేదా?... గతించిన నూఱుగురి గుఱించి తలచుకోక అయోగ్యుడనైన నేనొక్కణ్ణీ బ్రతికుంటే చాలు ననుకొంటున్నావు!...

సంజ : మహారాజా!... బొక్కెన నూతిలో పడితే తాడు కూడా పడవేయకూడదనే నానుడి అసత్యం కాదుకదా!

దుర్యో : నువ్వు చెప్పింది సరికాదు... అనుభవించేవాళ్ళే లేనప్పుడు భోగాలెందుకు?... (దుఃఖిస్తాడు)

ధృత : (దుర్యోధనుని కౌగిలించుకొని) నాయనా! ఊరుకో! అతి దీనులైన మా ఇద్దర్నీ కూడా నువ్వే ఊఱడించాలి..

దుర్యో : మిమ్మల్ని ఊఱడించేటం అంత తేలికైన పనికాదు... ఇవాళ నేను కౌంతేయులందర్నీ సంహరించిన తర్వాత కుంతీదేవితో సమానమైన పుత్రశోకంతో మీరిద్దఱూ ఊఱడిల్లండి!

గాంధా : నాయనా! ఇప్పటికి నువ్వొక్కడివైనా బతికున్నావు... అదే పదివేలు... యుద్ధానికిది సమయంకాదు... నీకిదే శీర్షాంజలి...యుద్ధప్రయత్నం విరమించు... తండ్రిమాట విను!...

ధృత : మామాట విను నాయనా!... సమస్తమైన బంధువుల్నీ పోగొట్టుకొన్న శోకంతో అలమటిస్తున్న మాకు మఱింత దుఃఖాన్ని కలుగజేయకు... ఎవరి బలం చూసుకొని నువ్వు యుద్ధానికి సిద్ధమైనావో ఆ భీష్మద్రోణులీనాడు లేరు. కర్ణుని కట్టెదుటే అతని కుమారుడు వృషసేనుని వధించిన అర్జునుణ్ణి చూసి లోకం భయంతో గడగడలాడి పోతోంది... శత్రువుల ప్రతిజ్ఞలో నువ్వొక్కడివే మిగిలి ఉన్నావు. కనుక వారిపట్ల కోపాన్ని విడనాడు... అంధుల మైన మమ్మాదుకో...

దుర్యో : యుద్ధానికి వెళ్ళకుండా నేనేం చేయాలి?...

గాంధారి : నీ కర్తవ్యాన్ని నీతండ్రికాని, పినతండ్రి విదురుడు కాని చెబుతారు...

సంజ : మహారాజా! అది యుక్తమైంది!...

దుర్యో : సంజయా! ఇప్పుడుకూడా నాకింకా ఉపదేశించేవలసింది ఉందా?...

సంజ : మహారాజా! మనిషి జీవించి ఉన్నంతవఱకు ఉపదేశాన్ని పొందవలసినవాడే!...

దుర్యో : (కోపంగా) అయితే ప్రజ్ఞాశాలివైన నువ్వేం ప్రబోధిస్తావో ప్రబోధించు!...

ధృత : నాయనా! హితాన్ని చెప్పే సంజయునిపట్ల అంత కోపమెందుకు? ప్రశాంతంగా వింటే నేనే చెబుతాను!...



దుర్యో : చెప్పండి తండ్రీ!...

ధృత : ఎక్కువ మాటలెందుకు? ధర్మజుడడిగిన ఐదూళ్ళిచ్చి వాడితో సంధి చేసుకో!...

దుర్యో : సంధా?.. నా నూర్గురు సోదరులున్నప్పుడే నేను కృష్ణ వచనాన్ని లెక్కచేయలేదు. ఇక ఇప్పుడా?... భీష్మ ద్రోణులు, బంధుకోటి, రాజకం నశించిన తర్వాత కేవలం ఈ శరీర రక్షణకు సంధిచేసుకోవటం ఎంతసిగ్గు చేటు?... నీతి విశారదా! సంజయా! మఱో మాట! ఎవరైనా తమబలం తగ్గిపోతున్నప్పుడు సంధిచేసుకుంటారు!... క్షీణించేకుండా ఉన్న పంచపాండవులు సంధికసలెలా అంగీకరిస్తారు?

ధృత : వత్సా! యుధిష్ఠిరుడెప్పుడూ నామాట కాదనడు!...

దుర్యో : అదెలా?...

ధృత : తన సోదరుల్లో ఏ ఒక్కనికి విపత్తి కలిగినా తాను జీవించి ఉండనని ధర్మజుని ప్రతిజ్ఞ... కనుక యుద్ధంలో మాయోపాయంతో సోదర మృతిని అనుమానిస్తూనే ఉంటాడు. అందువల్ల నీకెప్పుడిష్టమైతే అప్పుడే సంధికి సంసిద్ధుడౌతాడు...

సంజ : నిజమే!...

గాంధారి : హేతుబద్ధమైన నీతండ్రి మాట విను తండ్రీ!

దుర్యో : కౌరవ వంశంలో ఒక్కణ్ణైనా మిగల్చకుండా వధిస్తానని పార్థుని ప్రతిజ్ఞ... దుర్యోధనుణ్ణైన నేను సోదరులందఱూ చేచ్చినా జీవించాలనుకొంటానా?... దుశ్శాసనుని రక్తపానం చేసిన ఆ భీమసేనుణ్ణైనా గదాఘాతాలతో పిప్పిచేసి దశదిశలకూ విసిరేస్తాను కానీ దీనుణ్ణై సంధి కుదుర్చుకొంటానా?...

గాంధా : అయ్యో! దుశ్శాసనా!... నీకు వాటిల్లిన ఈ దుర్దశ ఇంతవఱకు కనీవినీ ఎఱుగంది!... ఓసి గాంధారీ!...నువ్వు కన్నది నూఱుగుఱు బిడ్డల్ని కాదే! నూఱు శోకాల్ని... (అంతా ఏడుస్తారు)

దుర్యో : తండ్రీ! నీనూర్గురు కొడుకులూ యుద్ధభూమిలో శత్రువుల్ని వధిస్తూ నిహతులైనారు. కనుక ఆనాడు అఱవైవేలమంది కొడుకుల్ని కోల్పోయి భూమిని పాలించిన సగరచక్రవర్తిలా నువ్వే ఈ భువిని పాలించు... అలాచేయకపోతే క్షాత్రధర్మానికే క్షతి కలుగుతుంది.

(నేపథ్యంలో)

గాంధారి : (భయంతో) నాయనా! కలకలంతో ఆ తూర్యధ్వను లేవిఁటి?...

సంజ : అమ్మా! పిఱికివాళ్ళని భయభ్రాంతుల్ని చేసే ఇటువంటివి యుద్ధభూమిలో మామూలే.

ధృత : ఇంతటి మహాకలకలానికి ఏదో బలమైన కారణమే ఉండాలి...

దుర్యో : తండ్రీ శాంతించు!... దైవం మనకి ప్రతికూలంగా ఉంది... ఇంకో దుర్వార్త వినకముందే నన్ను యుద్ధ భూమికి వెళ్ళమని ఆజ్ఞాపించు!...

గాంధా : నాయనా! నువ్వు ఒంటరివాడవు... నీకు సహాయు లెవరు?...

దుర్యో : ఈ నాటిదాకా శత్రువుకు తోడ్పడిన దైవం ఇవాళ నాకు తోడ్పడవచ్చుగా... తోడ్పడకపోతేమానె,పక్షపాతం వహించేకుండా ఉంటేచాలు, భువిని అపాండవం చేస్తాను.



(నేపథ్యంలో కలకలం తరువాత ఒక కంఠం)

ఒక కంఠం : నేడు పార్థుని పేరున్న బాణాఘాతాలతో అంగరాజు నిహతుడైనాడు... హృదయ శల్య సదృశమైన ఈ వార్తను అందజేయటానికి శల్యుడు కర్ణరహితమైన రథంతో దుర్యోధనుని వద్దకు వస్తున్నాడు.

దుర్యో : అశనిపాతం వంటి ఈ అస్పష్టవార్తను చెబుతోందెవరు?... ఎవరక్కడ?...

సూత : అయ్యో! హతాత్ములమైనాం... (పడిపోతాడు)

దుర్యో : చెప్పవయ్యా!.. చెప్పు!...

ధృత, సంజ : చెప్పు, చెప్పు!...

సూత : చిరంజీవ! ఇక వేఱే చెప్పేదేముంది? మన మనోరథంలా కర్ణుడు లేని రథాన్ని తీసుకువస్తున్నాడు శల్యుడు.

దుర్యో : హా!.. కర్ణా!... (మూర్ఛిల్లుతాడు)

గాంధారి : ఊరుకో నాయనా! ఊరుకో!...

సంజ : మహారాజా! ఊఱడిల్లండి!...

ధృత : అయ్యో! ఎంతకష్టం?... భీష్మద్రోణుల అనంతరం నా కొడుక్కి ఆలంబనమైన ప్రియమిత్రుడు శూరాగ్రేసరుడు కర్ణుడు కూడా నిహతుడయ్యాడు... హతవిధీ!...

దుర్యో : (తేఱుకొని) రాధేయా! ఒక్క నిముషమైనా నన్ను విడిచి ఉండవే!... ఎప్పుడూ నాకు ప్రియాన్నే కోరుతుండే వాడివే!... నేడు నువ్వా నన్ను విడిచిపోయావా? (మళ్ళీ మూర్ఛిల్లుతాడు, అంతా ఓదారుస్తారు) నువ్వెళ్ళిపోయినా నేనింకా బ్రతికున్నందుకే సిగ్గుపడుతున్నాను... ఇప్పుడు దుశ్శాసనుని గూర్చిగాని తదితర బంధువర్గం గుఱించి

గాని నాకు చింత లేదు. నిన్ను వధించినవాడి వంశనాశం చేసితీరుతాను... సూత! ఈ అకార్యాన్ని చేసినవాడెవడు?

సూత : చిరంజీవీ!... భూమిలో కూరుకుపోయిన రథచక్రం కల కర్ణుణ్ణి కృష్ణ సారథ్యంలో అర్జునుడు తన బాణాలతో వధించాడని అనుకొంటున్నారు.

దుర్యో : నా క్రోధాగ్నిలో దుఃఖం ఇంకిపోతోంది... నాకిప్పుడు యుద్ధమే శరణ్యం!... సారథీ! రథాన్ని సిద్ధం చేసి తీసు కురా!... నీకొకవేళ పాండవ భయమైతే ఉండిపో... కేవలం గదాపాణినైన నేనొక్కణ్ణే వెడతాను!

ధృత : నాయనా!... అదే నీ నిర్ణయమైతే ఎవరినైనా సైన్యాధి పతిగా...

దుర్యో : ఆపనైపోయిందిగా!...

ధృత : ఎవరిని సర్వసైన్యాధ్యక్షునిగా అభిషేకించావు? శల్యునా? అశ్వత్థామనా?

దుర్యో : శల్యుణ్ణి!

సంజ : అయ్యో! ఎంతకష్టం! భీష్మద్రోణకర్ణులు పోగా ఇప్పుడిక శల్యుడా పాండవులను జయించేవాడు?... రాజా! ఆశ చాలా బలమైంది!...

దుర్యో : శల్యుడెందుకు?... అశ్వత్థామతో పనేముంది?...కర్ణుని కలిసి కౌగిలించుకోవటానికో, పార్థుని ప్రాణాలు తీయ టానికో–నా కన్నీటితో నన్ను నేనే అభిషేకించుకుంటాను!

(నేపథ్యంలో కలకలం– తరువాత రథారూఢులై వచ్చిన భీమార్జునుల ప్రవేశం)



భీమ : ఓ దుర్యోధన సేవకులారా!...మమ్మల్ని చూసి ఇటూ అటూ పరుగెత్తుతున్నా రెందుకు?... భయపడకండి... భయపడకండి.. మాయాద్యూతకర్త, లాక్షాగృహదహనకారి, ద్రౌపది కేశాంబరాకర్షణలో వాయువు, కౌరవ సేనకు పెద్ద, కర్ణమిత్రుడూ అయిన దుర్యోధను డెక్కడున్నాడో చెప్పండి!...

దుర్యో : సూతా! నువ్వెళ్ళి నేనిక్కడున్నానని చెప్పు!...

సూత : దుర్యోధన మహారాజు, తల్లిదండ్రులు గాంధారీ, ధృతరాష్ట్రులు ఈ మఱ్ఱిచెట్టు నీడలో ఉన్నారు!

అర్జున : అగ్రజా! ఆగండి! పుత్రశోకంతో ఉన్నవారిని చూసి వారి దుఃఖాన్ని మఱింత పెంచేటం యుక్తం కాదు! అందుకని మనం వెళ్ళిపోవటం మంచిది!...

భీమ : మూర్ఖుడా! సదాచారాన్ని అతిక్రమించేకూడదు... గోత్ర నామాలు చెప్పుకొని తల్లిదండ్రులకు నమస్కరించేటం సంప్రదాయం కదా!

అర్జున : అమ్మా!... ఎవణ్ణి ఆసరాగా చూసుకొని నీ కొడుకు దుర్యోధనుడు ప్రపంచాన్నంతా గడ్డిపఱకగా భావించాడో ఆ కర్ణుని వధించిన అర్జునుడు మీ ఇద్దఱికీ నమస్కరిస్తున్నాడు.

భీమ : అశేష కురుసైన్యాన్ని నామమాత్రావశిష్టం చేసిన సోదరులు కలవాడు, దుశ్శాసనుని రక్తంతో మదించిన వాడు, అచిరకాలంలోనే దుర్యోధనుని తొడలను పిండి కొట్టబోయే ఈ భీమసేనుడు శిరసా నమస్కరిస్తున్నాడు...

ధృత : దుర్మార్గుడా! శత్రువులను జయించేటం నీ మొహానే రాసి పెట్టలేదు... రాజ్యాలున్నంత వఱకు అందఱూ చేసేపనే అది!... ఆత్మ ప్రశంసతో మమ్మల్ని ఉద్వేగపఱచకు.!

భీమ : తండ్రీ! కోపించేకు!... నీ సభామంటపంలో ఆనాడు పాండవపత్ని ద్రౌపదిని జుట్టుపట్టుకు ఈడ్చి వస్త్రాపహరణచేస్తుంటే వారించేని రాజలోకమంతా ఈనాడు మా క్రోధాగ్నిలో శలభాయమానులైపోయారు... ఆవేళ నువ్వు ఊరుకోవటంవల్ల నేడింత జరిగిందని నీకు తెలుపటానికన్నాను కానీ ఆత్మస్తుతి కాదు!

దుర్యో : అరే! భీమసేనా!... వృద్ధులైన పితరుల ఎదుట నీ ఆత్మ ప్రశంస నిందార్హం. నన్ను జయించేకుండానే ఇంతటి బీరాలు పలుకుతావేం? (భీముడు క్రోధాన్నభినయిస్తాడు)

అర్జు : అన్నా! కోపించేకు! శాంతించు... సోదరులు మృతులైనారనే దుఃఖంలో చేతలు చేతకాక మాటలతోనే ఆపని చేస్తున్నాడు పోనిద్దూ!...

అశ్వత్థామ : ఓరీ! అర్జునా!... ఇప్పుడింక నువ్వెక్కడికి పోతావ్? ఇన్నాళ్ళూ కర్ణునిపై కోపంతో నా ధనుస్సును విడిచాను!... పాండవులకు ప్రళయాగ్ని, ధృష్టద్యుమ్నుని సేననంతా భక్షించేటానికి ఈ అశ్వత్థామ సన్నద్ధుడై ఉన్నాడు. కిరీటీ!... రారా!...

ధృత : (విని సంతోషంతో) సుయోధనా!... పితృవధాదందహ్యా మానహృదయుడై, తండ్రిని మించిన తనయుడు అశ్వత్థామ వచ్చాడు... ఎదురువెళ్ళి గౌరవించు!...

గాంధా : నాయనా!... ఆ మహాభాగునికి ఎదురువెళ్ళి తీసుకురా!...

దుర్యో : తండ్రీ!... కర్ణవధను కోరిన ఈ అశ్వత్థామతో నాకేం పని?...

ధృత : మహాపరాక్రమవంతులకు మాట మాత్రంగానైనా విరక్తి కలిగించేటానికిది సమయం కాదు....



అశ్వ : (ప్రవేశించి) సుయోధనా! విజయీ భవ!...

దుర్యో : (లేచి) గురుపుత్రా!... కూర్చో!... (కూర్చోబెడతాడు)

అశ్వ : దుర్యోధనమహారాజా!... వీనులవిందుగా మాట్లాడి కర్ణుడు యుద్ధభూమిలో చేసిన నిర్వాకం చూశావుకదా!... ఇక ఇప్పుడు విల్లెక్కుపెట్టి ఈ అశ్వత్థామ ఏం చేస్తాడో చూడు!... నిశ్చింతగా ఉండు!...

దుర్యో : (ఈర్ష్యతో) ఆచార్యనందనా!... కర్ణుని అవసానానంతరం కదా నువ్వు యుద్ధం చేస్తానన్నది! కనుక నా చావును కూడా చూచి ఆ తర్వాత విల్లెక్కుపెట్టు... ఎందుకంటే కర్ణదుర్యోధనులు వేఱుకాదు కదా!...

అశ్వ : (తనలో) హుం!... ఇప్పటికీ ఈ దుర్యోధనునికి కర్ణుని పట్లే పక్షపాతం, నాపట్ల తిరస్కారం!... (పైకి) దుర్యోధనా! అలాగేకానీ! (నిష్క్రమిస్తాడు)

ధృత : నాయనా! ఇప్పుడుకూడా మహానుభావుడైన అశ్వత్థామకు నీ వాక్చాతుర్యంతో ద్వేషాన్ని కలిగిస్తున్నావ్!... నీకేవింటీ చిత్తభ్రమ!...

దుర్యో : నేనేం అసత్యం పలుకలేదే!... ఇది కోపించేదగిన సమయం కాదా? నాకత్యంత ఆత్మీయుడైన కర్ణుని నా ఎదుటే తూలనాడే వీడికీ అర్జునుడికీ తేడా ఏముంది?

ధృత : నాయనా! భరతకులానికి అవసానదశ ఆసన్నమైంది... దురదృష్టవంతుణ్ణి ఇప్పుడేం చేయను?... (ఆలోచించి) సంజయా!... "అశ్వత్థామా! నువ్వు దుర్యోధనునితో కలిసి తల్లిపాలను పంచుకొన్నావు... నా ఒళ్ళో దొర్లి నా బట్టల్ని పాడుచేశావు.. ఆ విషయాన్ని తలచుకొని కర్ణునిపట్ల అత్యధిక ప్రేమతో అతని మరణంతో భరింపరాని శోకంతో

మాట్లాడుతున్న దుర్యోధనుని మాటలకు ఏమీ అనుకోక కర్తవ్యోన్ముఖుడివి కమ్మని నా మాటగా చెప్పు!...

సంజయ : ఆజ్ఞ! (నిష్క్రమిస్తాడు)

దుర్యో : సూతా! యుద్ధానికి రథాన్ని సిద్ధం చెయ్యి!...

సూత : అట్లే చిరంజీవీ!...

ధృత : గాంధారీ!... మనం ఇక్కడనుంచి మద్రదేశాధిపతి శల్యుని శిబిరానికి వెడదాం!... సంజయా! నీవుకూడా!... (అంతా నిష్క్రమిస్తారు)

★ ★ ★



## ఆఱవఅంకం

(యుధిష్ఠిరుడు ఆసనంపైనా, ద్రౌపది ప్రక్కనా కూర్చుని ఉంటారు. చేటి, పురుషుడు నిలుచుని ఉంటారు)

యుధి : (ఆలోచించి, నిట్టూర్చి) అతికష్టంతో భీష్ముడనే మహా పరాక్రమసముద్రాన్ని దాటాం. ద్రోణాచార్యశౌర్యాగ్నిశిఖల్ని చేల్లార్చాం... కర్ణుడనే మహావిషసర్పాన్ని మట్టుపెట్టాం... శల్యుడు స్వర్గస్థుడయ్యాడు... ఇక యుద్ధసమాప్తి కనుచూపుమేరలో ఉంటుంటే భీముడు ఈ దినమే దుర్యోధనుణ్ణి వధిస్తానని తొందరపాటుతో ప్రతిజ్ఞ చేశాడు... దాంతో అందఱి జీవితాలూ సంశయగ్రస్తాలైనాయి... ఊః! బుధకా!...

బుధకుడు : ఆజ్ఞాపించేండి మహారాజా!...

యుధి : నువ్వెళ్ళి సహదేవునికి ఒకమాట చెప్పిరావాలి!...

బుధ : చెప్పండి మహారాజా!...

యుధి : కోపావేశంతో భీముడు ఇవాళే దుర్యోధనుణ్ణి వధిస్తానని ప్రతిజ్ఞ చేయటంతో పాఱిపోయిన దుర్యోధనుని ఆచూకీ తెలుసుకుని రావటానికి సమర్థులైన గూఢచారుల్ని నియమించమని మా ఆజ్ఞగా తెలుపు!... ఆచూకీ తెలిపినవారికి గొప్ప బహుమానం ఉంటుందని చాటింపు కూడ వేయించమను!

బుధ : ఆజ్ఞ!... (బయటకు వెళ్ళి తిరిగివచ్చి) స్వామీ మీ దర్శనార్థం పాంచాలకుడు వచ్చాడు

యుధి : శీఘ్రమే ప్రవేశపెట్టు!...

బుధ : (వెళ్ళి పాంచాలకునితో తిరిగి వచ్చి) అరుగో మహారాజు.. సమీపించు!...

పాంచాలక : మహారాజులకు జయం జయం!... ప్రియవార్తను తెచ్చాను!...

యుధి : ఆ కురుపతి జాడ ఏమైనా తెలిసిందా?

పాంచాలక : జాడేకాదు మహారాజా!... కురుపతే దొరికాడు!...

యుధి : బాగుంది... కురుపతే కంటపడ్డాడా?

పాంచా : కంటపడటమేమిటి? కదన వృత్తాంతాన్నడగండి!...

ద్రౌపది : (భయంతో) నానాథుడు భీమసేను దాదుర్మార్గునితో యుద్ధం చేస్తున్నాడా?...

యుధి : భీమదుర్యోధనులకు యుద్ధం జరుగుతోందా?

పాంచాలక : నిజేం... మహారాజుల కసత్యం ఎలా చెబుతాను?

యుధి : నా తమ్ముడు భీమసేనుని గదాయుద్ధ నైపుణ్యం తెలిసినా ఏదో బెంగగా ఉంది... (ద్రౌపదితో) దేవీ! మనకానాడు సభలో జరిగిన పరాభవానికి ప్రతీకారంగా దుర్యోధనుని వధో, లేక విధి ప్రతికూలించి అతడే జయిస్తే భీమునితో పాటు మనందటి మరణమో?... ఈ రెంటిమధ్య మనసు ఉద్వేగంతో కొట్టుకుపోతోంది!... అయినా నిన్నవ మానించిన ఆ నీచుడు నిశ్చయంగా బంధితుడౌతాడు... పాంచాలకా!... వాడెక్కడ దొరికాడు? ఇప్పుడక్కడ ఏమౌతోందో చెప్పు!

పాంచాలక : మహారాజా!... మద్రాధిపతి శల్యుని మీరు వధించిన తరువాత గాంధారపతి శకునిని సహదేవులు సంహరించారు. నష్టావశిష్టమైన కురుసైన్యం ధృష్టద్యుమ్నుని ధాటికాగలేక పాటిపోయింది... కృపకృతవర్మాశ్వత్థామ లెటో వెళ్ళిపోయారు. ఆనాడే దుర్యోధనుని వధిస్తామన్న భీమసేనులవారి ప్రతిజ్ఞకు భయపడి శమంతపంచకంలో దాగున్న దుర్యోధనుని భీమార్జునులు కృష్ణసారథ్యంలో రథారూఢులై గుర్తించారు...



యుధి : ఎలా గుర్తించారు?...

పాంచాలక : సరస్తీరంలో అడుగుజాడల్లో చక్రాదుల్ని చూసి అవి దుర్యోధనునివే అయి ఉంటాయని నిశ్చయించారు... దుర్యోధనునికి జలస్తంభనవిద్య తెలుసు కనుక ఆ నీటిలో దాగి ఉంటాడని శ్రీకృష్ణులవారు భీమునికి తెలిపారు... భీముని నిష్ఠురోక్తులతో అభిమానధనుడైన దుర్యోధనుడు పాలసముద్రం నుంచి కాలకూట విషంలా పైకి వచ్చాడు...

యుధి : సుక్షత్రియునికి అనువైన పనే చేశాడు!...

ద్రౌపది : ఇంతకీ వారిరువురికీ యుద్ధం జరిగిందా? లేదా?...

పాంచాలక : అప్పుడు భీమసేనుడు దుర్యోధనునితో...

యుధి : ఏమన్నాడు?

పాంచాలక : "నువ్వొక్కడివీ, మేమైదుగురం ఉన్నామని దిగులు పడొద్దు... మా ఐదుగురిలో నీ ఇష్టం వచ్చిన ఏ ఒక్కని నైనా ఎన్నుకొని జయించు... చాలు" నన్నారు భీమసేనులు.. అపుడు దుర్యోధనుడు అసూయాపరుడై భీమార్జునులపై దృష్టిని నిలిపి...

యుధి : నిలిపి?

పాంచాలక : దుశ్శాసన కర్ణహంతలైన మీరిద్దఱితోనూ నాకు శత్రుత్వం సమానమే. అయినా సాహసప్రియుడవైన నువ్వే నాకు సరైన జోడీ. అని భీమసేనులతో పలికి వారితోనే యుద్ధానికి సన్నద్ధులయ్యారు కనుక విజయోత్సవాలు ఆరంభించేటానికి ప్రయత్నాలు చెయ్యండని శ్రీకృష్ణభగవానులు నాతో మీకు సందేశం పంపారు!...

ద్రౌపది : (కన్నీటితో) త్రిలోకాధిపతి శ్రీకృష్ణుని ఆశీస్సులు అసత్యమెలా అవుతాయి?...

పాంచాలక : ఇది కేవలం ఆశీస్సు కాదమ్మా! శ్రీకృష్ణుని ఆదేశం!...

యుధి : శ్రీకృష్ణుని ఆజ్ఞానుసారం నా తమ్ముడు భీమసేనుని విజయోత్సవానికి ఏర్పాట్లు చేయండి.... ఈ శుభవార్తను తెచ్చిన పాంచాలకుని సముచిత సత్కారంతో సంతోషపెట్టు!

కంచుకి : చిత్తం మహారాజా!...

(పాంచాలకునితో నిష్క్రమిస్తాడు)

ద్రౌపది : ఆర్యపుత్రా!...

యుధి : చెప్పు దేవీ!...

ద్రౌపది : మా ఐదుగురిలో నీ ఇష్టం వచ్చినవారితో యుద్ధం చేయమని ఆ దుర్మార్గుడితో భీమసేనులెందుకన్నారు?... ఒకవేళ ఆ దుష్టుడు కవలల్లో ఎవరినైనా కోరుకొని ఉంటే ఎంతప్రమాదం?...

యుధి : దేవీ! పంచపాండవుల్లో దుర్యోధనుడు ఏ ఒక్కరికీ సాటిరాడు... అతనికి గదా యుద్ధంలోనే మక్కువ కనుక భీముడే అతనికి సాటి... కానీ దుర్యోధనుడు గదాయుద్ధంలో తనగురువైన బలరామునితో సమానమైనవాడు... అయినా భీముని కీయుద్ధంలో విజయమే చేకూరుతుంది.



– నేపథ్యంలో –

చార్వాకుడు : ఎవరైనా నాకు నీళ్ళూ, నీడా ఇచ్చి ఆదరించేగలరా?...

యుధి : (విని) ఎవరక్కడ?...

కంచుకి : (ప్రవేశించి) ఆజ్ఞాపించేండి మహారాజా!...

యుధి : ఎవరో వచ్చినట్లుంది, చూడు!...

కంచుకి : ఆజ్ఞ!... (వెళ్ళి తిరిగివచ్చి) ఎవరో ఆకలిగొన్న అతిథి ప్రభూ!...

యుధి : శీఘ్రమే ప్రవేశపెట్టు!...

కంచుకి : చిత్తం!...

(నిష్క్రమిస్తాడు– మునివేషంలో చార్వాకుడు ప్రవేశిస్తాడు)

చార్వా : (తనలో) దుర్యోధనుని స్నేహితుణ్ణైన చార్వాకుడనే రాక్షసుణ్ణినేను... పాండవులను వంచించేటానికి వచ్చాను. (పైకి) దాహం వేస్తోంది.. ఎవరైనా నీరూ, నీడా ఇస్తారేమోనని తిరుగుతున్నాను. (ధర్మజుని సమీపిస్తాడు. అంతా లేచి నిలుచుంటారు)

యుధి : మునీశ్వరులకు అభివాదం!...

చార్వాక : శిష్టాచారానికిది సమయంకాదు... నీటినిచ్చి గౌరవించు చాలు!...

యుధి : స్వామీ! ఇదిగో ఈ ఆసనంపై కూర్చోండి!...

చార్వా : (కూర్చొని) నీవూ కూర్చో!...

యుధి : (కూర్చుని) ఎవరక్కడ? మంచితీర్థం తీసుకురండి!...

కంచుకి : (ఒక పెద్దపాత్ర మఱొక చిన్నపాత్రతో ప్రవేశించి) మహారాజా! సుగంధయుక్తమైన చేల్లనినీరు... త్రాగటాని కుపకరించేపాత్ర!...

యుధి : మునీశ్వరా! జలాన్ని గ్రహించి దప్పిక తీర్చుకోండి!...

చార్వాక : (కాళ్ళు కడుక్కొని, ఆచమించి ఆలోచిస్తూ) నువ్వు క్షత్రియుడవనుకొంటాను!

యుధి : చేక్కగా పోల్చుకొన్నారు.. నేను క్షత్రియుణ్ణే!...

చార్వా : ఎప్పుడూ యుద్ధాల్లో మునిగితేలుతూ రక్తపాతంతో సంతోషించే మీ నుంచి జలాదికం మేం స్వీకరించేం..ఈ సరస్వతీనదీతరంగాలపై వీచే చల్లగాలితోనే సేదతీరుతాం....

ద్రౌపది : బుద్ధిమతికా!ఈ విసనకఱ్ఱతో మునీశ్వరునికి విసరు!...

(చేటి వీస్తూ ఉంటుంది)

మహర్షీ! తాము వేంచేసిన పని?...

చార్వా : మునులకు సహజంగానే కుతూహలం కలిగించే రాజుల ద్వంద్వయుద్ధం చూడటానికి శమంతపంచకంలో తిరుగుతూఉన్నా..ఇవాళ భరించేరాని శరత్కాలపు ఎండతో అర్జున దుర్యోధనుల గదాయుద్ధాన్ని కొంతవఱకే చూసి ఇలా వచ్చాను!

కంచుకి : మహర్షీ! అర్జున దుర్యోధనులదికాదు, భీమదుర్యోధనులది!...

చార్వాక : ఇక్కడుండి అక్కడేం జరుగుతోందో తెలియకుండానే చూసివచ్చి చెబుతున్న నన్నాక్షేపిస్తున్నావా?...

యుధి : మహర్షీ! చెప్పండి... చెప్పండి!...



చార్వాక : ఒక్కక్షణం విశ్రమించి నీకంతా వివరంగా చెబుతాను!... ఈ ముసలాడికి కాదు!

యుధి : చెప్పండి... అర్జున దుర్యోధనులకా?...

చార్వాక : ఔను.. ఇప్పుడే చెప్పాను కదా!... గదాయుద్ధం ఆరంభమైందని!...

యుధి : భీమదుర్యోధనులకు కాదని!...

చార్వా : వారిద్దఱిదీ జేరిగిపోయిన సంగతి! (ద్రౌపదీ యుధిష్ఠిరులు మూర్ఛిల్లుతారు)

కంచుకి : (వారిద్దఱిపై నీరుచేల్లి) తెప్పఱిల్లండి... తెప్పఱిల్లండి,... (ఇద్దఱూ తేఱుకొంటారు)

యుధి : ఏవంటున్నారు మహర్షీ! భీమదుర్యోధనుల గదాయుద్ధం జేరిగిపోయిన సంగతనా?...

ద్రౌపది : జేరిగిపోయిన విషయమేమిటో చెప్పండి మహాశయా!

చార్వా : కంచుకీ, వీరిద్దఱెవరు?...

కంచుకి : వీరు యుధిష్ఠిరమహారాజు, ఈమె పాంచాలరాజ తనయ ద్రౌపది!...

చార్వా : అయ్యో!... నేరకపోయి ఈ విషయాన్ని చెప్పాను!...

ద్రౌపది : నాథా! భీమసేనా!... (మూర్ఛిల్లుతుంది)

కంచుకి : ఏం చెప్పానంటున్నారు?

చేటి : అమ్మా! తెప్పఱిల్లండి... తెప్పఱిల్లండి!

యుధి : మహర్షీ! ఈ సందేహాస్పద విషయానికే నాకు దుఃఖం పొంగుకొస్తోంది! భీముని పరిస్థితి నిశ్చయంగా తెలిస్తే నా ప్రాణాలే ఉండవు!...

చార్వా : (సంతోషంతో తనలో) నాక్కావలసింది అదే... (పైకి) చెప్పక తప్పదంటే అలాగే క్లుప్తంగా చెబుతాను. బంధువుల ఆపదను వివరించేగూడదు కదా!

యుధి : క్లుప్తంగానో, వివరంగానో ఎలాగోలా చెప్పండి... భీమునికి సంబంధించిందేదైనా వినటానికి సంసిద్ధంగా ఉన్నాను!...

చార్వా : అయితే విను... భీమ దుర్యోధనులమధ్య పెనుగదాయుద్ధం జేరుగుతూ ఉంటే...

ద్రౌపది : (హఠాత్తుగా లేచి) జేరుగుతుంటే?...

చార్వా : (తనలో) వీరికి కలిగిన స్పృహనెలా పోగొట్టాలి? (పైకి) బలరాముడు అక్కడికి వచ్చాడు... ఆయన ఎదుటే చాలాసేపు వారిద్దఋూ పోరాడారు.. బలరాముడు ప్రియ శిష్యునికి రహస్యంగా ఏదో సంజ్ఞ చేస్తే దుర్యోధనుడు దాన్ని గ్రహించి తన తమ్ముడు దుశ్శాసనుని వధించిన భీముని పట్ల ప్రతీకారం తీర్చుకున్నాడు.

యుధి : అయ్యో!... భీమసేనా! (మూర్ఛిల్లుతాడు)

ద్రౌపది : హా! నాథా!... భీమసేనా!... నా కోసం నీ ప్రాణాల్ని బలిపెట్టావా? జటాసుర, బకాసుర, హిడింబాసుర, కిమ్మీర, కీచక, జరాసంధుల్నే వధించావే! నాకోసం సౌగంధిక పుష్పాన్ని తెచ్చావే! నాకు బదులు పలుకవూ? (మూర్ఛిల్లుతుంది)

కంచుకి : (కన్నీటితో) హా! భీమసేన ప్రభూ!...అమ్మా!ఊఱడిల్లండి మహారాజా!... ఊఱడిల్లండి!... మహర్షీ... ఈ ఉభయుల్నీ మీరూ ఊఱడించేండి!...



చార్వా : (తనలో) ఊఱడిస్తాను... ప్రాణత్యాగం చేసుకోవటానికి ఊఱడిస్తాను... (పైకి) యుధిష్ఠిరా!... క్షణ కాలం ఊఱడిల్లు... ఇంకా చెప్పవలసింది ఉంది!...

యుధి : (తేఱుకొని) మిగిలిందేవిఁటో చెప్పండి!...

కంచుకి : చెప్పండి... చెప్పండి!...

చార్వాక : తరువాత భీమసేనుడు దుర్యోధనుని గదాఘాతంతో వీర మరణాన్నొందటంతో అర్జునుడు అన్నగారి మరణం వలన ఉబుకుతున్న కన్నీటిని తుడుచుకొని గాండీవాన్ని విడిచి భీముని గదనే తీసికొని శ్రీకృష్ణుడు వారిస్తున్నా వినక దుర్యోధనుణ్ణి ఎదుర్కొన్నాడు... గదాయుద్ధంలో అంత నేర్పరి కాని అర్జునునకు దుర్యోధనునిచేతిలో చావు తప్పదని శ్రీకృష్ణుడతికష్టంతో రథం ఎక్కించి బలరామునితో ద్వారకకు తీసుకొనిపోయాడు. ఆ తరువాత నేను...

యుధి : చాలు మహర్షీ! చాలు... ఇక వినటానికేముంది? అయ్యో! భీమసేనా!... లక్కఇల్లు దగ్ధమైనప్పుడందర్నీ కాపాడావే!... ఎదురులేని మల్లయుద్ధ ప్రవీణుడవై ఎంతమంది రాక్షసుల్ని మట్టుపెట్టావ్?... నా ఆనతినెప్పుడూ ధిక్కరించి ఎఱుగవే! పదివేల ఏనుగుల బలం కల నీకు నేడెట్టి దుఃస్థితి దాపురించింది తండ్రీ! నన్ను దిక్కులేనివాణ్ణిగా చేసిపోయావా?

ద్రౌపది : (తెలివినొంది) మహారాజా! ఏమౌతోందిప్పుడు?...

యుధి : వేఱే ఏముంది దేవీ!... తమ్ముడు భీమసేను డస్తమించాట్ట!...

ద్రౌపది : నాథా! భీమసేనా!... నా శిరోజాలు ముడువకుండానే వెళ్ళిపోయావా?... క్షత్రియునికి ప్రతిజ్ఞ పూర్తికావాలిగా... ఇదుగో నేనూవస్తున్నా... అంతవఱకు ఆగు!...

యుధి : భీమసేనా! నాపై నీకెంత భక్తి శ్రద్ధలూ, ప్రేమా!... అన్నీ విడిచి నీదారి నువ్వు చూసుకొన్నావా? మునీ! ఏమన్నారూ? ఆ భీమదుర్యోధనులు పెనుగదాయుద్ధంలో నిమగ్నులై ఉంటే వచ్చిన బలరాముడు చేసిన రహస్యసంజ్ఞతో దుర్యోధనుడు భీముని నేలకూల్చాడనా?... ఛీ...ఛీ... ఎంత దురదృష్టవంతులం! కృష్ణాగ్రజా! ఇది నీకేమైనా బాగుందా? బంధుత్వాన్ని కాని, రాజధర్మాన్ని కాని, స్నేహాన్ని కాని, లెక్కించేకుండా ఎంతపనిచేశావ్? (ద్రౌపదిని సమీపించి) పాంచాలీ!... లే!... మనిద్దఱి దుఃఖం సమానమే... తేఱుకో!

ద్రౌపది : (తేఱుకొని) నాథుడు దుర్యోధనుని రక్తంతో నా శిరోజాలను ముడుస్తానని ప్రతిజ్ఞ చేశారు! బుద్ధిమతికా! అప్పుడు నువ్వూ అక్కడేగా ఉన్నావు.. (కంచుకితో) ఆర్యా! శ్రీకృష్ణుడు నాకేమని సందేశం పంపాడు? సిగముడుచుకోమనా? అయితే నాకు పూలమాలను తీసుకురా! కృష్ణుడసత్యం పలకడుగా! నేనిప్పుడే నాభర్త ననుసరిస్తాను. (ధర్మజునితో) ఆర్యపుత్రా!.. నాకు చితినిపేర్చి నాభర్తను సంహరించిన దుర్యోధనునెదుర్కోండి... లేకపోతే మీకెలాతోస్తే అలా చేయండి!

యుధి : కంచుకీ!... పాంచాలి బాగా చెప్పింది... ఈ పతివ్రత చితి నారోహించి దుఃఖాన్ని వీడుతుంది... నాకు ధనుస్సును తీసుకొనిరా! అహఁ! వద్దులే...భ్రాతృభక్తితో అర్జునుడు తన గాండీవాన్ని విడిచి అన్నగారి రక్తాసిక్తమైన గదతో దుర్యోధను నెదుర్కొన్నట్లే నేనూ నా తమ్ముని గదతోనే వాణ్ణెదిరిస్తాను... విజయంతో నాకు పనిలేదు...

చార్వాక : మహారాజా! శత్రుజయంతో నీకు పనిలేనప్పుడెక్కడో అక్కడ ప్రాణత్యాగం చేసుకో.. అక్కడికి వెళ్ళటం వ్యర్థం!



కంచుకి : మునీ!.. ఛీ!.. మీది రాక్షస హృదయం!...

చార్వాక : (తనలో భయంతో) కొంపతీసి వీడు నన్ను పసిగట్టాడేవిఁటి? (పైకి) కంచుకీ! ఆ అర్జున దుర్యోధనుల యుద్ధాన్ని చూచాను, గదాయుద్ధంలో వారిద్దఱి పరాక్రమం తెలుసు కనుక ఇంకో దుర్వార్త వినటం ఎందుకని చెప్పానే కాని వేఱే ఏం కాదు!...

యుధి : మంచిది మహర్షీ! మీరుపదేశించింది నాహితాన్ని కోరే!...

కంచుకి : భగవత్సంకల్పులైన మీరే దుఃఖభారంతో సామాన్యునిలా క్షాత్రధర్మాన్ని విడిచిపెడితే ఎలా మహారాజా!...

యుధి : ఆర్యా!.. జయంధరా! మహావీరులు, ప్రియతమ సోదరులైన భీమార్జునులను వధించిన శత్రువును నేను చూడలేను... పాంచాలీ... నాదుర్నీతివల్లనే మీకీశోచనీయస్థితి కలిగింది... కనుక మనిద్దఱం కలిసి అగ్నికి ఆహుతై మనవాళ్ళని కలుసుకొందాం...

ద్రౌపది : అయ్యా! చితిని రగిలించేండి... (అంతటాచూసి) ప్రభువుల ఆజ్ఞను ఎవరూ పాటించేరేం?...

యుధి : మహర్షీ! మా ఆజ్ఞనెవరూ పాటించేటంలేదు... దయతో మీరే చితిని పేర్చి మమ్మనుగ్రహించేండి!...

చార్వాక : ఆ పని మునులమైన మావంటివారు చేయకూడదు... (తనలో) నా మనోరథం నెఱవేఱింది... ఎవరూ చూడకుండా అగ్నిని పేర్చుతాను (పైకి) రాజా! ఇక మేమిక్కడ ఉండకూడదు!... (నిష్క్రమిస్తాడు)

యుధి : ద్రౌపదీ! ఇక్కడెవరూ మనమాట వినటంలేదు...సరేకానీ.. నేనే స్వయంగా ఇంధనాలను పేర్చి చితిని రగిలిస్తాను!...

ద్రౌపది : త్వరత్వరగా కానీయండి!... (నేపథ్యంలో కలకలం... భయంగా విని)

మహారాజా! ఎవరిదో శంఖారావం భయంకరంగా వినిపిస్తోంది... ఇంకోదుర్వార్త కూడా వినాలని మన మొహాన రాసిపెట్టి ఉందేమో!?... అందుకే ఈ ఆలస్యం!...

యుధి : ఆలస్యం ఏమీలేదు...లే!... (అందఱూ అటూ ఇటూ తిరుగుతుంటారు) పాంచాలీ!... అమ్మకు, నీ సపత్నులకూ చెప్పాల్సిందేమైనా ఉంటే ఈ పరిజనులతోచెప్పి వారిని మళ్ళించు...

ద్రౌపది : అత్తగారికి ఎవరు అనేక రాక్షసుల బారినుంచి మనలనందర్నీ కాపాడారో ఆ మీ మధ్యమపుత్రులు దురదృష్టవంతురాలైన నాకోసం పరలోకం ప్రాప్తించారని చెప్పండి...

యుధి : బుద్ధిమతికా!... నామాటగా కూడా అమ్మకి తన పుత్రులలో అమిత బలశాలి, ప్రేమాస్పదుడైన భీమసేనుని మృతి అనే మహాపాపవార్తను కఠినహృదయుణ్ణైన నేను చెబుతున్నా" నని చెప్పు... ఆర్యా! జయంధరా!...

కంచుకి : ప్రభూ!...

యుధి : నువ్వు సహదేవుని వద్దకు వెళ్ళి నేను పరలోక ప్రస్థానం చేస్తూ ఇకపై మన తండ్రికి తిలోదకాలు, శ్రాద్ధాదిక కర్మలు నువ్వే నిర్వహించాలని మామాటగా చెప్పు!... నకులునితో కూడ ఈ విషయాలు చెప్పి నామీద భక్తితో నన్ననుసరించేక భవనంలో కానీ, అరణ్యంలోకాని నివసిస్తూ శరీరరక్షణ చేసుకొమ్మని చెప్పు... శీఘ్రమే వెళ్ళి నువ్వీపని చేయాలి సుమా!.. నామీద ఒట్టు!



ద్రౌపది : బుద్ధిమతికా!... నువ్వు సుభద్ర దగ్గఱకు వెళ్ళి గర్భవతి ఉత్తరకిప్పుడు నాలుగోనెల వచ్చింది. ఆమెను పుట్టింట్లో ఉంచి "జాగ్రత్త తీసుకో... పుట్టబోయే వంశోద్ధారకుడే పోయినవారికీ, రేపు మనకీ తర్పణాలనివ్వాలి కనుక వాడి రక్షణలో నువ్వే బాధ్యతవహించా"లని నా మాటగా చెప్పు...

యుధి : దగ్ధీభూతమైన ఈ వంశవృక్షంలో ఉత్తరాగర్భస్థమైన చిన్న మొలకపై ద్రౌపది ఆశ!... కంచుకీ!... నాపైఒట్టుపెట్టు కొన్నా నువ్వింకా కదలవేం?...

కంచుకి : (విలపిస్తూ) పాండురాజా!... నీపుత్రులు పంచపాండవులకు ఎంతటి దుర్దశ? భోజరాజు కుమార్తైన కుంతీమాతా! నీసోదరుడు, వసుదేవునికుమారుడు, శ్రీకృష్ణునికి అగ్రజుడు, గాండీవిబావమఱది, భీమునికి గురువూ అయిన బలరాముడు మదోన్మత్తుడై ఎవరి రక్షణలో ఈ భూమి చేల్లగా ఉందో ఆ వంశాన్నే సమూలంగా దగ్ధం చేశాడు కదా! (ఏడుస్తూ నిష్క్రమిస్తాడు)

యుధి : జయంధరా! జయంధరా!

కంచుకి : (తిరిగివచ్చి) ఆజ్ఞాపించేండి మహారాజా!...

యుధి : ఆఁ!... మాకంత అదృష్టం ఉండదనుకో, అయినా ఒకవేళ కిరీటి విజయుడైతే భీమసేనుని మరణానికి బలరాముడే కదా కారణం!... ఆయన శ్రీకృష్ణుని అన్నగారు కనుక ఆయనపై కోపించేవద్దని నా మాటగా చెప్పు... దయారహితమైన రాజపదవిని మాత్రం పొందక అరణ్యానికి వెళ్ళమని చెప్పు...

కంచుకి : ఆజ్ఞ!...

యుధి : (చితాగ్నిని చూసి సంతోషంతో) పాంచాలీ!అదిగో ఆ అగ్నిశిఖలు మనకి స్వాగతం పలుకుతున్నాయి... మనం ఇంధనమౌదాం!...

ద్రౌపది : మహారాజా! నా చివరి కోరికనొకదాన్ని మన్నించి అను గ్రహించేండి...నేనే ముందుగా అగ్నికి ఆహుతౌతాను...

యుధి : అలా అయితే మనిద్దఱం కలిసి ఒకేసారి అగ్నిప్రవేశం చేద్దాం...

చేటి : ఓ దిక్పాలకులారా! రక్షించేండి... ఈ మహాత్ముడు చంద్ర వంశరాజర్షి యుధిష్ఠిరుడు, ఈమె పవిత్ర రాజసూయ అవభృథస్నానంతో పవిత్ర అయిన యాజ్ఞసేని... వీరిద్దఱూ అగ్నికి ఆహుతైపోతున్నారు... రక్షించేండి... రక్షించేండి... ఏవింటీ!... వీరిని రక్షించేటానికి ఎవరూ రావటం లేదే!... (వారి ముందుపడి) అమ్మా! మీరేం చేస్తున్నారు?...

యుధి : ప్రియసోదరుని మృతికి తగినదే చేస్తున్నాం... లే... లేచి నీరు తీసుకురా! (చేటి నీరు తీసుకొస్తుంది) (కాళ్ళు కడుక్కొని, ఆచమించి) ఈ జలాంజలి ప్రపితామహుడైన శంతనమహారాజుకు... ఇది పితామహుడు విచిత్ర వీర్యునికి... (కన్నీటితో) ఇది తండ్రి పాండురాజుకు... తండ్రీ!... ఇక ఈ తర్పణలిక నానుండి అందుకోలేవు... కనుక దీనిని అమ్మ మాద్రితో కలిసి త్రాగు... ఇది భీమునికి... నాయనా!.. ఇది నీకూ, నాకూకూడ! దప్పికగొన్నా ఒక్కక్షణం ఆగు.. నేనూ వస్తున్నా!... ఇద్దఱం కలిసి త్రాగుదాం... తండ్రీ! భీమసేనా!... చిన్నప్పుడు తల్లి పాలను కలిసేత్రాగాం!... తరువాత నేను తిన్న తర్వాతే దేన్నైనా నువ్వా తినేవాడివి... యజ్ఞంలో సోమపానం



కూడా అలాగే జేరిగింది... మఱి ఈ తర్పణ మాత్రం నాకంటే ముందుగా ఎలా స్వీకరిస్తావు?... ద్రౌపదీ... నువ్వుకూడా తర్పణలివ్వు!...

ద్రౌపది : బుద్ధిమతికా! నాకూ నీరు తీసుకురా!... (నీరు తెస్తుంది) ఆర్యపుత్రా! ఈ తర్పణలెవరికి ఇమ్మంటారు?...

యుధి : ఎవని మరణంతో అమ్మ కుంతీదేవి పెద్దమ్మ గాంధారికి పుత్రశోకంలో సమానమైందో ఆ భీమసేనునికి!

ద్రౌపది : నాథా!.. భీమసేనా!... ఈ పరిచారిక తెచ్చిన నీరు స్వర్గానికి వెడుతున్న నీకు పాదోదకం అగుగాక!...

యుధి : ప్రతిజ్ఞ నెరవేర్చకుండా స్వర్గానికి చేరుతున్న నీకు జుట్టు ముడువకుండానే నీ ప్రియురాలు ద్రౌపది తర్పణ నిస్తోంది...

ద్రౌపది : మహారాజా!... లేవండి!... మీతమ్ముడు స్వర్లోక ప్రయాణంలో దూరంగా వెళ్ళిపోతారు.

యుధి : పాంచాలీ! ఇదేవిఁటి? కుడికన్నదురుతోంది!... దీని వల్ల భీముని చూస్తాననిపిస్తోంది.

ద్రౌపది : ఇది శుభశకునం కావాలి...

(నేపథ్యంలో కలకలం, కంగారుగా కంచుకి ప్రవేశం)

కంచుకి : మహారాజా! రక్షించేండి... రక్షించేండి... కౌరవాధముడు దుర్యోధనుడు ఒళ్ళంతా రక్తం పూసుకొని గదనెత్తి (ద్రౌపదీదేవిని వెతుక్కొంటూ ఇటే వస్తున్నాడు)

యుధి : హా!.. దుర్విధీ! నీ నిర్ణయమే నెఱవేఱింది.. గాండీవీ!... (మూర్ఛిల్లుతాడు)

ద్రౌపది : హా! ఆర్యపుత్రా! కిరీటీ!.. నువ్వూ నీఅన్ననే అనుసరించావు కానీ మహారాజునీ, నన్నూ మఱచిపోయావా? (మూర్ఛిల్లుతుంది)

యుధి : (తేఱుకొని) నాయనా!.. సవ్యసాచీ! ముక్కంటినే మురిపించిన మల్లయుద్ధ ప్రవీణుడవే!... నివాతకవచులను నిర్మూలించి స్వర్గాన్ని నిష్కంటకం చేశావే!...నర నారాయణుల్లో ప్రథముడివే!... ద్రోణాచార్య ప్రియ శిష్యుడివే! అస్త్రవిద్యలో గాంగేయునే ఆనందింపజేశావే!... మహావీరుడైన కర్ణునే మట్టికఱిపించావే!... అమ్మకి నమస్కరించే కుండానే నా అనుమతి తీసుకోకుండానే ప్రేయసితో చెప్పకుండానే వెళ్ళిపోయావా?...(మళ్ళీ మూర్ఛిల్లుతాడు)

కంచుకి : అయ్యో! ఎంతకష్టం! ఎంతకష్టం! దుర్మార్గుడు దుర్యోధనుడిటే వస్తున్నాడు... అగ్నిప్రవేశం ఇంకా ఆలస్యం కాకూడదు... ద్రౌపదీ దేవిని చితివద్దకు తీసికొనివెడతాను. నేనూ వారినే అనుసరిస్తా... (చెలికత్తెతో) అమ్మా!... నువ్వికధృష్టద్యుమ్నుణ్ణో కవలలనో ఆశ్రయించు!...

చేటి : అయ్యలారా! రక్షించేండి... రక్షించేండి...

(నేపథ్యంలో కలకలం – తరువాత)

భీముని కంఠం : శమంతపంచకంలో సంచరించే నష్టావశిష్టయోధులారా! నన్నుచూసి భయపడతారెందుకు? యాజ్ఞసేని ఎక్కడుందో చెప్పండి.

కంచుకి : మహారాజ్ఞీ!... యజ్ఞవేదికనుంచి ఆవిర్భవించిన ఓపుణ్యవతీ!... నేటికి నీకాదుర్మార్గుడు దుర్యోధనునిచేతిలో తిరిగి అవమానమా?...



యుధి : (లేచి, గర్వంతో) పాంచాలీ! భయపడకు... ఎవరక్కడ?... అమ్ములపొదితో నాధనుస్సును తీసుకురండి... దుర్మార్గుడా!... దుర్యోధనా!...రారా...నీగదాయుద్ధపాటవాన్ని, నీభుజబలదర్పాన్నీ నాబాణసారంతో భస్మీపటలం చేస్తాను... తొంభైతొమ్మిదిమంది తమ్ములు చేచ్చినా బ్రతికుండే నీవంటి తుచ్ఛుణ్ణి కాదు నేను!...

(గదను ధరించి రక్తంతో తడిసిన అంగాలతో భీముడు ప్రవేశిస్తాడు)

భీమ : ఓ శమంత పంచక సంచార సైనికులారా! ఎందుకంత భయం?... నేను రాక్షసుణ్ణీ కాను, దెయ్యాన్నీ కాను... నాశరీరం శత్రురక్తంతో తడిసింది అంతే... ప్రతిజ్ఞను పాలించిన క్షత్రియుణ్ణి... భయపడకండి!... పాంచాలి ఎక్కడుందో చెప్పండి...

ద్రౌపది : ఆర్యపుత్రా!... రక్షించేండి!... రక్షించేండి!...

కంచుకీ : దేవీ! లేవండి... ఇప్పుడు శీఘ్రంగా అగ్నిప్రవేశమే కర్తవ్యం!...

ద్రౌపది : (లేచి) ఏమిటీ? నేనింకా చితికి దూరంగానే ఉన్నానా?...

యుధి : ఎవరక్కడ? అమ్ములపొదితో ధనుస్సును తీసుకురండి... ఏమిటీ సేవకుడొక్కడూలేడే! కానీ.. ..బాహుబలంతోనే ఈ దుష్టుణ్ణి పట్టి అగ్నిలోకి తోస్తాను..

(ఉత్తరీయంతో నడుం బిగిస్తాడు)

భీమ : పాంచాలీ! నీకేశపాశాన్ని నేనే ముడుస్తాను... నిలు... నిలు... (ద్రౌపది భయంతో దూరంగా వెడుతుంది)

ఆగాగు!... ఇప్పుడెక్కడికి వెడుతున్నావ్?... (శిరోజాల్ని పట్టుకోబోతాడు)

యుధి : (తొందరగా బాహువులతో బంధించి) దుర్మార్గుడా!... భీమార్జునశత్రువైన నీచుడా! దుర్యోధనా... ఇప్పుడు నా చేతుల్లో చిక్కిన నువ్వు కదలల్లేవు...

భీమ : అరే! నేను సుయోధనుణ్ణనే అనుమానంతో కోపంతో అగ్రజుడు నన్ను గట్టిగా పట్టుకొన్నాడు!...

కంచుకి : (గుర్తించి, సంతోషంతో) మహారాజా! పొరపాటు పడుతున్నారు!... ఈ వచ్చింది చిరంజీవి భీమసేనుడు!... దుర్యోధనుని రక్తంతో వస్త్రాలు, సర్వాంగాలూ తడిసి, గుర్తుపట్టలేనట్లున్నారు...

చేటి : (ద్రౌపదిని కౌగిలించుకొని) దేవీ! ఆగాగు!... ప్రతిజ్ఞను పూర్తిచేసి మీ నాథులు భీమసేనులవారు మీ వేణీ సంహారానికై మిమ్మల్నే వెతుక్కుంటూ వచ్చారు.

ద్రౌపది : ఏవేఁ!... అబద్ధాలతో నన్నోదార్చాలని చూస్తున్నావా?...

యుధి : జయంధరా! ఏవంటున్నావ్? వీడు దుర్మార్గుడు దుర్యోధనుడు కాడూ?

భీమ : అగ్రజా!... అజాతశత్రూ!... ఇంకెక్కడి దుర్యోధనుడు?... నా గదాఘాతంతో ఆ నీచుడు నేలకూలాడు... వాడి రక్తాన్నే చందనంగా నాఒంటికంతా పులుముకొన్నాను. చతుస్సముద్రముద్రిత భూవలయమంతా నీ అధీనమైంది... కురువంశమంతా యుద్ధాగ్నిలో దగ్ధమైపోయింది. ..

(యుధిష్ఠిరుడు కన్నీరు తుడుచుకొని భీముని కౌగిలించుకొంటాడు)

(ధర్మజుని పాదాలపైబడి) ఆర్యునికి జయం!



యుధి : నాయనా! కన్నీటివల్ల నీముఖాన్ని సరిగ్గాచూడలేక పోతున్నా... చెప్పు... నువ్వూ కిరీటీ సజీవులై ఉన్నారు కదా!...

భీమ : సకలశత్రువినాశంతో నీవు మహారాజపీఠాన్నధిరోహించేబోతుంటే మాకేం కొదువ?

యుధి : (మళ్ళీ గాఢంగా కౌగిలించుకొని) శత్రువు నిర్మూలితుడైనాడా?... నువ్వు బకాసురహంత నాతమ్ముడు భీమసేనునివేనా?... మళ్ళీచెప్పు... నూఱు సార్లు చెప్పు!...

భీమ : అవునగ్రజా!... నేనే... ఒక్క క్షణం నన్ను విడిచిపెట్టు... ఇంకొంచెం చేయవలసి ఉంది...

యుధి : ఇంకేముంది?...

భీమ : ఆర్యా!... అసలైంది ఇంకా మిగిలే ఉంది... దుర్యోధన రక్తంతో తడిసిన ఈ చేతుల్తో దుశ్శాసనుడు పట్టి ఈడ్చిన ద్రౌపది కేశపాశాన్ని ముడుస్తాను...

యుధి : వెళ్ళు... ద్రౌపది వేణీసంహారమహోత్సవాన్ని జేరుపుకోవాలి...

భీమ : దేవీ!... పాంచాలరాజపుత్రీ!... అదృష్టవశాన సకల శత్రుక్షయంతో వర్ధిల్లుతున్నావు!

ద్రౌపది : నాథా!... జయం! జయం!...

భీమ : పాంచాలీ! నన్నిక భయంతో చూడనక్కర్లేదు. ఏ నరపశువు దుశ్శాసనుడు అంత మంది రాజులున్న కొలువులో నీ జుట్టుపట్టి ఈడ్చాడో, నేను త్రాగగా మిగిలిన వాడి రక్తం నా చేతులకు ఉంది... వాటిని తాకు ప్రియా!... ఏ దుర్యోధను డానాడు మదించి నిన్ను తన అంకసీమను

పొందమన్నాడో, ఆ నీచుని చితక్కొట్టి వాడి రక్తం నా శరీరమంతా పులుముకున్నాను... కనుక నన్ను పరిష్వ జించి నీ పరాభవానలాన్ని చేల్లార్చుకో... బుద్ధిమతికా! నాడు పాండవపత్ని పాంచాలిని పరిహసించిన భానుమతి ఎక్కడే? యాజ్ఞసేనీ!

ద్రౌపది : ప్రభూ!...

భీమ : ఆనాడేమన్నానో గుర్తుందా?... చండప్రచండమైన నా గదాఘాతంతో దుర్యోధనుని తొడలు తుత్తునియలు చేసి ఆ రక్తపు చేతులతో నీ వేణిని ముడిచే దినం శీఘ్రమే వస్తుందనలేదూ?... గుర్తుందా?...

ద్రౌపది : గుర్తుండటమే కాదు... మీఅనుగ్రహంతో ఆ ఆనందా న్ననుభవిస్తున్నా నీవేళ!...

భీమ : (ద్రౌపది శిరోజాలను దులిపి దూసి) ఇక చేక్కగా తల దువ్వుకో...

ద్రౌపది : నాథా! ఎన్నో ఏళ్ళుగా మఱచిపోయిన పని... మీ అనుగ్రహంతో మళ్ళీ నేర్చుకొంటాను. (భీముడు కేశపాశాన్ని ముడుస్తాడు)

ఒక కంఠం : (నేపథ్యంలో) ఈ మహాసమరంలో హతశేషులైన రాజకానికి స్వస్తి... ఏ పతివ్రతాశిరోమణి, రాజసూయావభృథ స్నాత అయిన యాజ్ఞసేని కేశపాశాన్ని లాగి ఈడ్వటంవల్ల అనుపమ బాహుబల సంపన్నులైన పాండవులచేత రాజాంతఃపుర స్త్రీలు ముక్తకేశ లైనారో, కౌరవుల పాలిట ధూమకేతువైన ఆ పాంచాలికి వేణీసంహార మహోత్సవమైంది... ఇక భువిపై శాంతి నెలకొనునుగాక! రాజులకు స్వస్తి కలుగుగాక!



యుధి : దేవీ!.. నీ ఈ వేణీసంహారాన్ని ఆకాశంలో ఉన్న సిద్ధజనం ప్రశంసిస్తున్నారు...

(కృష్ణార్జునులు ప్రవేశిస్తారు)

కృష్ణుడు : (యుధిష్ఠిరునితో) సకల శత్రువిజేత యుధిష్ఠిరునకు స్వస్తి...

అర్జున : అగ్రజునకు జయం!...

యుధి : అహో!... కృష్ణార్జునులు వచ్చారా?... భగవన్!... అభివాదయే! అర్జునా! రా!... నన్ను కౌగిలించుకో... (అర్జునుడు నమస్కరిస్తాడు) (శ్రీకృష్ణునితో) మహాత్మా! శ్రీమహావిష్ణువు స్వయంగా ఎవరికి శుభాల నాకాంక్షిస్తాడో వారికి అశుభాలెలా చేకూరుతాయి...? దేవా!... సృష్టి స్థితిలయాలకు హేతుభూతుడవై అవాఙ్మానస గోచరుడవైన నిన్ను స్మరిస్తేనే దుఃఖరహితుడౌతుంటే నిన్ను చూసిన వారికిక చెప్పేదేముంది?...

శ్రీకృష్ణుడు : వ్యాసవాల్మీకి పరశురామాది మునిజనం, నీ ఆజ్ఞాను సారులైన మగధమత్స్యయాదవ రాజులు, నకులసహదేవుల ఆధ్వర్యవంలో ధృష్టద్యుమ్నాదులు తీర్థోదకాలతో నీపట్టాభిషేకార్థం వచ్చారు... నువ్వు దురాత్ముడైన చార్వాకుని మోసానికి గురైనావని విని అర్జునునితో శీఘ్రమే బయలుదేరి వచ్చాను.

యుధి : మమ్మల్ని వంచించిన చార్వాకుడు రాక్షసుడా?

భీమ : (కోపంతో) అగ్రజునికి భ్రాంతి కలిగించి మోసగించిన ఆ దుర్యోధన సఖుడు చార్వాకుడెక్కడ?

కృష్ణ : (చిఱునవ్వుతో) ఆ రాక్షసాధముని నకులుడు సంహరించాడు లే... మహారాజా!... ఇక నేను చేయవలసిందేమిటో చెప్పు!...

యుధి : మా పట్ల నీ ప్రసన్నతకు మించి కోరదగిందేముంది?... అయినా ప్రజలు ఆయురారోగ్యాలు కలిగి పురుషోత్తముని వైన నీపట్ల అద్వైతభక్తినొందుదురుగాక! ప్రభువులు ప్రజారంజకులు, గుణగ్రహణ పారీణులై విద్వాంసుల నాదరింతురు గాక! పుణ్యాచరణ పారీణులగుదురుగాక!

కృష్ణ : తథాస్తు !

ఇతి శమ్

★★★